శ్రీ అరవిందయోగి

సావిత్రి

రెండవ పుస్తకము

[illegible]

తెలుగుసేత

శార్వరి

శ్రీ అరవిందయోగి

సావిత్రి

రెండవ పుస్తకం

అన్వేషణ

తెలుగుసేత

శార్వరి

SAVITRI – Book 2 : ANVESHANA
(Divine Mother-Birth & Quest)

Original
SRI AUROBINDO

Adoptation
SRI SARVARI

Title Design : CHANDRA

First Edition Oct. 81
Price : Rs 10-00



SARVARI PUBLICATIONS
Plot 55, P & T Colony,
GANDHINAGAR,
HYDERABAD-500 380.

Printed at :
AWARE PRINTING PRESS
2-2-1167/8/9, Tilaknagar,
HYDERABAD - 500 044.

సుహృల్లేఖ

S.V. Bhujangaraya Sarma
Head of the Dept. of Telugu

Jawahar Bharathi
Kavali

శ్రీ అరవిందుల సావిత్రి చదవండి.
లోలోపల కాదు, పైకి.
అలా వూరికే చదువుతూ పోండి.
ఎక్కడా ఆగి ఆలోచించకండి, వ్యర్థం.

ఆలోచించడమనేది పూర్తిగా మానేసి చదవండి.
సావిత్రి వేదఋక్కుల్లా వినబడుతుంది.

అలా వింటోంటే -
కాస్సేపటికి మురికి వదిలి
మనస్సు తేలిక పడుతుంది.

అంతరంగంలో -
తెలియని కొత్తవాకిళ్లేవో
మెత్తగా తెరుచుకుంటున్నట్టనిపిస్తుంది.

ఎన్నడూ సోకని కొత్తగాలులేవో
చుట్టూసుఖంగా పారాడుతున్నట్టనిపిస్తుంది.

అనుభవానికిరాని కొత్త సుగంధమేదో
ప్రియంగా ఆవరించుకున్నట్టనిపిస్తుంది.

వూదారంగు ఆవిరి, నీలిరంగు పొగమంచు,
నారింజరంగు శాంబరం మిమ్మల్ని చుట్టేసుకుని,
ఉక్కిరిబిక్కిరిచేసి, ఎక్కడికో ఎగరేసుకుపోయి,
మీకళ్ళముందరే సుడులు తిరుగుతూ
గోళాలు గోళాలుగా ముద్దకడుతున్నట్టనిపిస్తుంది,

మీదికి వారిగిపోతున్న చిలకపచ్చ మబ్బుల్లోంచి
కుండపోతగా బంగారువాన కురిసి
మీరు ముద్దైపోతారు.

మీరు చూస్తుండగానే ఆ మబ్బులు రంగులు మారుతాయి.
మృదుస్వర కాదంబినిగా మీ మీద వాలిపోతాయి.
అమృతపు మడుగులా మిమ్మల్ని ముంచెత్తుతాయి.

మీరు ఆనందంతో ఉద్దు గుడుచుకుంటారు.
పారవశ్యంతో గిలగిల్లాడిపోతారు.

మీ అల్పత్వం మీకు తెలిసివచ్చి,
మీ అహంకారం మాసిపోయి,
జిజ్ఞాస మొదలవుతుంది.

అక్కణ్నించి కొత్త బ్రతుకు.

అలా మొదలయిన కొత్తబ్రతుకు
పూర్ణయోగంగా యెలా మారుతుందోచిత్రించారు,
శ్రీ అరవిందులు సావిత్రిలో.

'అధిమానస' స్థాయిలో మహాయోగి పొందే
దర్శనానికి అనుభూతికీ
అతిలోకమైన కవితాభివ్యక్తి సావిత్రి.

దాన్ని తెలుగుచేయటం మాటలుకాదు.

సావిత్రిని శార్వరి తెలుగుచేస్తున్నాడని విన్నప్పుడు
అతడి సాహసానికి నివ్వెరపోయాను.

తెలుగు సావిత్రి మొదటి భాగం చదివినప్పుడు
అతడి ప్రతిభాపరిణతికి మళ్ళీ నివ్వెరపోయాను.

ఇప్పుడు - తెలుగు సావిత్రి
రెండోభాగాన్ని మూలంతో పోల్చిచదివి
అతడి 'భవ్యకవితావేశా' నికి
మరోసారి నివ్వెరపోతున్నాను.

ఇది అనువాదంకాదు
అనువాదంచిలకపలుకు.

ఇది 'వినిర్మితి'.
అంటే - విశిష్టమైన నవసృష్టి.
తెలుగులో తిక్కన్నగారు చేసినంత పని.

కాకుంటే -
ఇంత సరళ సుందరమైన ప్రావాహిక శైలిలో
తెలుగు సావిత్రి అవతరించి వుండేది కాదు.

నిజానికి - శ్రీ అరవిందులను
అర్థం చేసుకోవడమనేది,
అసలు, లేదు.
వారిని అనుభూతికి తెచ్చుకోవలసిందే.

వారు భాషకు లొంగరు,
మేధకు లొంగరు,
భావనకు లొంగరు.

వారిని అనుభూతికి తెచ్చుకోగల సహృదయత
అలవిమాలిన కవితాత్మగల
యోగికి మాత్రమే సహజం.

శార్వరి యోగి, కవి.
అతడికి నూరేళ్లు.

అతడి తెనుగుసేతకు
సావిత్రి బ్రతికినన్నేళ్లు.

కావలి
6-10-81

యస్వీ భుజంగరాయశర్మ

Dr. V. N. Sharma
The Children's Garden School,

Mylapore,
Madras-4

శ్రీ శార్వరి గారికి,

మీ రచనలను ముఖ్యంగా ఆధ్యాత్మిక లోకానికి సంబంధించిన వ్రాతలను "ప్రభ"లో పూర్వపు రోజుల్లో చదువుతూ, ఆనందిస్తున్న పాఠకులలో నేనూ ఒకడ్ని.

మీరు ఈమధ్య ప్రచురించిన "సావిత్రి" ఇప్పుడే, అదృష్టవశాత్తు నా చేతికి అందింది. మీ ఆంధ్రీకరణ అద్భుతమైంది. ఆ పనికి సి. వి. వి. వారి సాధన మీకు ఎంతో చేదోడుగా ఉన్నదన్న సంగతి సులభంగా గుర్తించవచ్చు. శ్రీ అరవిందుల అనువాదాలు ఎన్నో తెలుగులోకి వచ్చాయి. ఒక్క– శివరామశాస్త్రిగారి, వారి సోదరులు చంద్రశేఖరంగారి అనువాదాలు మినహాయించి, ఇతరుల తెలుగు అనుకరణ చదవటానికి బదులు మూలగ్రంథాలకేసి నడవడమే అన్నివిధాలా మంచిదని అనుకుంటూన్న నన్ను మీ రచన నా అభిప్రాయాన్ని మారుస్తూ ఎంతో ఉత్తేజపరిచింది. ఇందుకు మిమ్మల్ని అభినందించటంతో తృప్తిపడటం నాకు ఇష్టంలేదు. "సావిత్రి"ని మీరు పూర్తి చేయటం అవసరం. అది పూర్తిచేసిన తరువాత శ్రీ అరవిందుల ఇతర రచనలనికూడా తెలుగులోకి తీసుకువిరావాలి. ఇదే నా ఆశ మీవంటి రచయితల నుంచి—

—వి. ఎన్. శర్మ

జగన్మాత

సావిత్రి

మహోదయం

సావిత్రి - మహాకావ్యం
రెండవ పుస్తకం 'అన్వేషణ'
ప్రచురణ నిమిత్తం ఆర్థిక సహాయం
అందజేసిన
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి —
ముఖ్యమంత్రి
శ్రీ టి. అంజయ్యగారికి -
సాంస్కృతిక వ్యవహారాల మంత్రి
శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారికి
కృతజ్ఞతలు

సావిత్రి

(రెండవ భాగం)

జగన్మాత

అన్వేషణ

సృష్టి పరిణామంలో మానవుడు ఎంతో విజ్ఞానం సంపాదించుకున్నాడు. సంస్కృతిని, నాగరికతను తనవిగా చేసుకున్నాడు. ఎన్నో ఘన విజయాలు సాధించాడు. మరెన్నో సాధనలు చేశాడు. తపస్సు చేశాడు విజ్ఞాన మానవునికి ప్రతినిధి అశ్వపతి మానవ ప్రగతికి, వికాసానికి అతను ప్రతినిధి. అతనే మానవత—అతనే మానవుడు. యోగసాధనతో అశ్వపతి సంపూర్ణత్వం సాధించాడు. పరిణామాన్ని యోగదృష్టితో దర్శించాడు. ఇంకా పైకి, పైపైకి వెళ్ళడానికి ఉద్యమించాడు. అతను గతాన్ని గమనించాడు, గమించాడు. వర్తమానాన్ని చూచాడు. భవిష్యత్తును దర్శించాడు, త్రికాలజ్ఞుడైనాడు. అయి, కాలాన్ని దూరాన్ని జయించాడు. అటు ఊర్ధ్వలోకాలు అధోలోకాలు దర్శించాడు. అటు తేజోమండలాలలో, ఇటు అంధకార తమోమండలాలలో అనుభవాలు పండించుకున్నాడు. అతను తనది చేసుకున్న విజ్ఞానం అనంతం. అజ్ఞానాన్ని ఛేదించే అనంతశక్తిని యోగసాధనతో సంపాదించాడు చీకట్లను చీల్చి, ప్రజ్ఞను క్రాంతిచే స్వంతం చేసుకున్నాడు.

అయినా అతనికి తృప్తిలేదు. యోగసాధనవల్ల కలిగే ఫలితాలు సాధకునకే పరిమితాలు అతనిలో మాత్రం మార్పుకు దోహదం చేస్తాయి. కానీ ప్రపంచానికి ఏం లాభం? ప్రాపంచిక జీవనం యథాతథంగానే, కష్టసుఖాల సమ్మిశ్రమంగానే ఉంటున్నది అసమగ్రమూ, అసంపూర్ణము అయిన మానవుడిలో ఏమాత్రం మార్పు రావటంలేదు ఏదోదివ్యత్వం లోపించింది. సత్యం దూరంగా ఎక్కడో మిణుకు మిణుకు మంటున్నది. ఆశ కనిపిస్తున్నది. సాధకుడు సత్యానికి చేరువ కాగానే, ' అది దూరంగా తొలగిపోతున్నది - లేదా అంతర్ధానమైపోతున్నది.

అశ్వపతి ఓటమిని అంగీకరించదలచలేదు. సత్యాన్ని అందుకోవాలని, సుస్థిరం చేసుకోవాలని దృఢంగా సంకల్పించాడు. ఎప్పటికో సాధించగలమన్న ఆశ చాలదు. ఆ స్వరం, దివ్యత్వం భూమిననే అనుభవించగలగాలి. ఆ దివ్య

శక్తిని భూమిపైన అవతరింపచేయగలగాలి. పృథ్వి ప్రకృతిని దివ్య ప్రకృతిగా మార్చగలగాలి.

అశ్వపతి మూడవమారు యోగసాధన చేయసాగాడు. కొంతకాలం దారి, తెన్ను కనిపించలేదు. అంతా శూన్యం, నిరుత్సాహం. అవిరామంగా సాధన కొనసాగించాడు. ఈ లోకపు ఎల్లలు గడచిపోసాగాడు ప్రపంచాన్ని దాటిపోయాడు. అజ్ఞానాంధకారం ప్రదిలిపోయింది. కొత్తప్రపంచమేదో కట్టెదుట సాక్షాత్కరించింది. అతని పిలుపుకు స్పందన తోడైంది. రూపం, చలనం, ధ్యానం, మనస్సు, హృదయం, ఏకాగ్రత ఏవీ అవసరంలేని స్థితికి చేరుకున్నాడు. రూప ప్రపంచాన్ని దాటి అరూప ప్రపంచాన్ని చేరుకున్నాడు. అది దివ్యం – అది నిశ్శబ్దం– అది ప్రశాంతి—

ప్రపంచం ఇవ్వగలిగినదంతా అతిస్వల్పం
ప్రాపంచిక విజ్ఞానం, శక్తి – కాలబహూకృతులే
అవి పవిత్రమైన ఆధ్యాత్మిక తృష్ణను తీర్చలేవు
మహత్వ పూర్ణరూపాలన్నీ ఏకైక పరమాత్మ రూపాలైనా
పరమాత్మ అనుగ్రహానికే మన జీవితాలు కట్టుపడినా
చేరువైన ఆత్మకన్న అవి ఎక్కువ సన్నిహితాలైనా
మనం మనంగా మనగలిగే ఒక కఠోరసత్యం అది.
స్వయంకృతాలవల్ల అది అతిదూరం అనిపిస్తుంది.
ఇప్పుడది అగమ్యం, అగోచరం, నిర్గుణం, నిరామయం.

అన్నిటికి అందాన్ని పంచిన పరమాత్మసౌందర్యం కనిపించదు
మహత్తులు కోల్పోయిన తర్వాత నిర్జీవ చిహ్నాలవి.
ప్రియుడు నిర్గమించిన తర్వాత ప్రియురాలివలె
ప్రపంచం లక్ష్యం కోల్పోయి శూన్యంగా బ్రతుకుతుంది.

జ్ఞానార్జనకృషి వ్యర్థ మానసికశ్రమ అనిపిస్తుంది
యావత్ విజ్ఞానం అవ్యక్తంలో అంతమవుతుంది
ఏదో శాసించాలన్న ప్రయత్నం నిష్ఫల అహంకారం
కష్టించి సాధించుకున్నవాటిని కాలం త్రోసిపేస్తుంది

అన్నిశక్తులు ఈశ్వరీయతలో లీనమై పోతాయి.
ఒక అంధకారగుహ అనంత దివ్యతేజస్సును రక్షిస్తుంది.
అతని వేదనాహృదయంలో నిశ్శబ్దం నెలకొన్నది
ప్రాపంచిక వాంఛల రోదనలనుండి నిర్గమించి
అతను పరమాత్మపిలుపుకు సంసిద్ధుడైనాడు.
అనామకంగా, అతి సన్నిహితంగాఉన్న జీవుడు
తనలో సచ్చిదానందాన్ని, శాంతిని అప్రతిహతంగా
అనుభవించినా, ఇంకా పొందవలసింది ఉంది
పరలోకం సదా తనను ప్రలోభపెడుతూ,
అన్వేషణలో అందినట్లే అంది అంతర్ధానమవుతుంది.
అది కోరనప్పుడు చేరువై, కోరినప్పుడు దూరమవుతుంది
అది అందించే ఆనందంతప్ప మరేదీ తృప్తి కలిగించదు.
అది లేనపుడు మహా ఘనకార్యాలు నిర్జీవాలవుతాయి,
అది ఉన్నప్పుడు అల్పకార్యాలే దివ్యంగా భాసిస్తాయి.
అది ఉన్నంతకాలం శూన్యం హృదయం నిండుగా ఉంటుంది
ఉద్ధరించగల దివ్యత్వం మాయమైనప్పుడు
అస్తిత్వమే లక్ష్యంకోల్పోయి జడప్రాయమవుతుంది.

క్రమంగా ఏర్పడిన అనంత స్మృతిసీమలు
దివ్యతత్త్వం నింపుకున్న ప్రాపంచిక క్రియలు
అన్నీ అశాశ్వత నాటకానికి ఆధారాలవుతాయి
ఆ మహత్తు ఎవరిదో, ఏమిటో అతనికి తెలియదు
అది అతీంద్రియమై, అన్నిటా తానే నిండిపోయి
లక్షలోకాలను సృష్టిస్తుంది, అన్నింటినీ నిర్దేశిస్తుంది.
వేల రూపాలను, పేర్లను ధరిస్తుంది, వర్ధిస్తుంది.
అది ఆకాశమంతగా విస్తరించి అంబరం కాగలదు
ఆత్మలో అగుపించనంత సూక్ష్మంగా ఉండిపోగలదు
సుదూర ఔన్నత్యం బ్రహ్మాండాన్ని కనుపించనీయదు.
మార్మిక సాన్నిహిత్యం దాన్ని ఆత్మీయంగా లోపల దాచుకుంది

అది కొన్నిసార్లు కల్పనగా, కొన్నిసార్లు మాయగా తోస్తుంది
మరి కొన్నిసార్లు తానే మహత్తర ఛాయగా మిగులుతుంది.

అది పురోగమనంపై బ్రహ్మాండమైన అనుమానపు నీడ
అన్నిటికి ఆధారమైన మహాశూన్యానికి ఆవల-
ఆ శూన్యమే అమరమైన ఆత్మశక్తిగా నిలుస్తుంది
అదే అగోచర పరమాత్మవైపు జీవుని ఆకర్షిస్తుంది

కొన్ని రహస్యశక్తులు సహకరించగా, కొన్ని నిరోధించినా,
ఏకైక లక్ష్యంతో సగం మునుగుతూ, సగంలేస్తూ
అవిరామంగా, పట్టుదలతో పురోగమనం సాగించాడు :
అస్పష్టంగా, అగోచరంగానున్న దివ్యైక్యం సదా
ప్రసరిల్లుతూ, అగమ్యంగా, పిలుపుకు అందక
పరిమిత వస్తుచయాన్ని శూన్యంగా మార్చుతూ
అతనిని నిర్గుణ నిరాకార స్థితికి చేర్చింది.
ఆపైన ఆరోహణ నిరాటంకంగా కొనసాగింది.

సృష్టించ బడినదేదీ జీవించి ఉండని ఔన్నత్యం
అది ఆశలకు, అన్వేషణకు అంతిమరేఖ
ఆపైన దుర్భర కఠోర వాస్తవం చేరువైంది
నిరవధిక పరిణామం పూర్ణంతో సంపూర్ణమైంది
ఆ రేఖ చిగురున మాయ పొరలన్నీ మాయమై
మానవమేధ తేజోమండలాన్ని చేరుతుంది,
లేక, నగ్నసత్యాగ్నిలో శలభంలా కాలిపోతుంది.
అతడు ఏదో ఒకమార్గం ఎన్నుకోవలసిఉంది.
వస్తుతః తనకున్నది, తానుగా సంపాదించుకున్నది
ఇక్కడనే వదలివేయాలి, లేదా, నామరహితమైన
తదాత్మ పదార్థంగా రూపాంతరం చెందాలి.
అది స్పర్శాతీతశక్తితో ఒంటరిగా తలపడుతుంది
ఆలోచనకు కట్టుబడని అతని ఆత్మశక్తి
జడత్వంతో సాహసకార్యానికి దిగుతుంది.

రూపప్రపంచాలను వదలి అతను ముందంజ వేశాడు
విశ్వపరివ్యాప్త ప్రజ్ఞ అక్కడ తారసపడ్డది.
దూరంగా వలయాలుగా మారి దగ్గరకాగా
కర్త అయిన సంకల్పం నిరుపయోగమైంది

సంకేత సజీవ రూపాలేవీ ప్రయోజనకరం కాదు.
అజ్ఞానంతో నిర్మించుకున్న ఆశాసౌధాలన్నీ కూలిపోయాయి.
చివరకు ఈ లోకాన్ని నడిపిస్తున్న శక్తిసైతం
అసంపూర్ణమై తేజస్సులో కరిగిపోయింది.

నిర్మితమైన వస్తుచయం యావత్తు పీగిపోగా
అశాశ్వతమైన ఆధారాలన్నింటినీ అధిగమించి
చివరకు బ్రహ్మాండమైన 'ఆది'లో కలిసిపోయింది.
ప్రత్యేకంగావున్న ఆత్మ 'ఆది'లో లీనం కావాలి,
లేదా వాంఛలకు అతీతంగా 'సత్యం'లో జన్మించాలి.

పైకి కనిపించే ప్రాభవం, సామరస్యం, మధురిమ
అశాశ్వతాలైన ప్రమోదాలుగా తిరస్కరించబడి
ప్రశాంత ప్రవిమల జీవస్థితినుండి బహిష్కరించబడి
మహత్తర బ్రహ్మానందంలో, శూన్యంలో లయించిపోతాయి.
ఉపదేవతలు ధరించిన పేర్లు, రూపాలు నశించి,
వారు శ్రమించి నిర్మించుకున్న లోకాలన్నీ
ఒక్కటొక్కటిగా జీర్ణించి, గతించి పోతాయి.
ఈ లోకం కప్పుకున్న రంగుముసుగు తొలగిపోగా
సృష్టి వైచిత్రిలోని అనూహ్యమైన అంతంలో
యావత్సృష్టికి మూలమైన ఈశ్వరీయత గోచరిస్తుంది
అతని పాదాలు సుస్థిరమైన రెక్కల్ని ధరించాయి,
అతను విశ్వశక్తిని కేంద్రంగా చేసుకున్న ఋషిగా
అంతర్యంలోకి స్వచ్ఛంగా, స్పష్టంగా చూడసాగాడు
అగాధాల ఆకర్షణకు లోనై, అపరిష్కృతంగా

వున్న తరంగాలు తిరిగి నెమ్మది నెమ్మదిగా
అదృశ్య సాగర తలంపైకి చేరుకోసాగాయి.

అతని ప్రతిభావ్యుత్పత్తులన్నీ అక్కడ నిష్ప్రయోజనాలే
విశ్వమేధ గ్రహించ గలదేదీ అతనిలో మిగలలేదు.
శాశ్వతత్వం నిష్క్రమణకు సిద్ధమై, నిర్వేదమై
మహాశూన్యంపైన మరొక శూన్యంగా మారింది
ఆ మహాశూన్యం లోతులలో అంతరించే ముందు
రోదసి స్వప్నంవలె చలించ నారంభించింది.

మరణంలేని జీవాత్మ, పరమాత్మ–రెండూ
అవ్యక్త భూతాలవలె కనిపించసాగాయి
దానినుండే సర్వం సృష్టించబడి, దానిలోనే లయిస్తుంది.
కాని, అది ఏమిటో ఏభావానికి, దృష్టికి అందదు
రూపరహితమైన ఆత్మరూపం ఒక్కటే మిగిలింది
ఎన్నడో ఉన్నదాని సంబంధమైన సశేష ప్రేతం అది.

అగమ్య మహాసాగరంలో మునిగిపోకముందు
కరిగిపోయే తరంగపు చివరి అనుభవం అది,
అది నిశ్చల శూన్యసాగర తీరంపై సుస్థిరమైనట్లు
తాను వెడలివచ్చిన సాగరుని అనుభూతి పొందింది.

ఒకానొక రోదసినుండి దూరం వేరైనట్లు
ఒకానొక శాశ్వతత్వం నుండి కాలం వేరైన భావన
ఒక నిర్వికార సచ్చిదానంద ప్రశాంతి, తననుండి
విశ్వాన్ని, ఆత్మను నిశ్శబ్దంగా వేరుచేసింది.

నిస్సహాయంగానున్న కఠోర వాస్తవికత కడకు
ఆత్మ చిరంతరాన్వేషణలో సమాధానపడ్డది
నిరామయ, నిర్వికార, నిశ్చలత్వంలో లీనమై
ఎవరూ ఛేదించలేని రహస్యాన్ని దాచుకుని
అతి నిగూఢంగా, గంభీరంగా, ప్రశాంతంగా
అభేద్యంగా, అప్రతిహతంగా సంచరించింది.

దానికి ఈలోకంతో మైత్రీబంధాలు లేవు
దాని హృదయంలో స్పందనకు, కార్యాకతకు తావులేదు
నిశ్శబ్దంలో ఉదయించిన జీవనసమస్యా, పరమాత్మ
ఆమోదం లభించక, పెదవులపైనే లయించింది
విశ్వప్రయత్నాలన్నీ అజ్ఞానానికి లొంగిపోయాయి.

తెలుసుకోదగిన మేధస్సుకు అక్కడ పనిలేదు
అందరూ అనామకంగా నశించిపోవలసిందే
అక్కడ ఎవరికెవరు తోడు రారు, సహచరులు కారు.
దానికి అదే వాస్తవం – అదే అద్వితీయం.

భావన, ప్రేరణ లేని స్వేచ్ఛమైన అస్తిత్వం అది
అవిభాజ్య అమల బ్రహ్మానందం నిండిన చైతన్యం అది
అది అనంతత్వంలో తానుగానే ఉంటుంది
అది ఏకైకం, అద్వితీయం, నిర్గుణం, పరిపూర్ణం.

నిరాకారంగా, నిర్గుణంగా, నిశ్చలంగా వున్న జీవం
కాలాతీతమైన 'ఆత్మ' లో తనను గుర్తిస్తుంది
నిశ్చలమైన అంతరంలో అది సృజన రహితం
తాను సృజనాతీతం, సృజనాత్మకమని గుర్తిస్తుంది.

పరమాత్మ ఒక్కటే జీవదాత, అది ఎవరివల్ల జీవించదు
అపరిమితమైన అనంత తేజో రహస్యం
నిర్గుణ బ్రహ్మం కల్పించిన తెరలలో దాగివుంటుంది.
మారుతున్న ఈ జగన్నాటక రంగంపైన
పరమాత్మ అజేయంగా, అప్రమేయంగా నిలిచి ఉంటుంది.
ఆ నిశ్చల పరమార్థం అభేద్యం, అనవద్యం
అది అనంతం, అనశ్వరం, అనూహ్యం, ఏకం.

ఆరాధన

యోగసమాధిలోనున్న అశ్వపతి ఒక మహత్తర ముహూర్తంలో ప్రపంచాన్ని విస్మరించాడు. ప్రాపంచిక అవరోధాలు, పొరలు ప్రిదిలిపోయి-నేను వేరు అన్న భావం తొలగిపోయింది. తాను వేరుకాదు ఈ మహాసముద్రంలో తానొక జలకణం. అయితే అదేనా అంతం-లక్ష్యం? కాకపోవచ్చు. తన ఆత్మ విశ్వాత్మలో కలిసిపోయింది-అదేనా తాను ఆశించింది? ఆత్మ పరమాత్మలో లీనంకావడమే తన పరమలక్ష్యం కాదు. తాను ఒకవ్యక్తి - మానవతకు తాను ప్రతినిధి ప్రపంచంకోసం, మానవ వికసనానికై తాను సాధన చేశాడు. తాను సాధించిన ఫలితాలు తనవిమాత్రమే కారాదు. లోకానికి ఉపకరించాలి. భవిష్యత్తులో మానవాళికి సైతం ఉపయోగపడాలి. ఒక్కవ్యక్తి 'మోక్షం' పొందితే లోకం విముక్తమైనట్లు కాదు - మానవత ముందంజవేసినట్లు కాదు నిర్వాణ సుఖం ఒక్కటే పరమావధి కాదు అశ్వపతి నిర్వాణంతో తన ధర్మాన్ని విస్మరించలేదు. ఆ స్థితిని అధిగమించిపోయాడు. మరేదో సాధించాలని ప్రయత్నించాడు.

నిర్వాణస్థితిలో తన ఉనికిని విస్మరించకుండా సాధనచేయగా, దివ్యత్వం అతనిని సమీపించింది. కన్నతల్లిగా అతనిని తన ఒడిలోకి తీసుకున్నది. ఈ ప్రపంచాన్నే జగన్మాత తన గుండెలకు హత్తుకుంది అందరు దేవతలకు మూలమైన జగన్మాత, అన్నిశక్తులకు మూలమైన ఆదిశక్తి — ఆమె దివికి, భువికి మధ్య సంధాన కర్త్రి.

అశ్వపతి తననుండి తాను వేరై, మత్తు వదలి. కొత్తలోకాల తలుపులు తట్టాడు. అప్పుడు మొదటిసారిగా పరిపూర్ణత అనుభవానికి వచ్చింది. ప్రజ్ఞ అనుభూతికి అందింది. ఆ ప్రజ్ఞతో అతను ఉక్కిరిబిక్కిరైనాడు-తలమున్కలైనాడు. పరవశించి పోయాడు. పులకించి పోయాడు-జగన్మాతే సర్వం, సర్వస్వం అనుకున్నాడు. చివరికొసకు చేరుకుంటే తప్ప, అసలు 'అది' ఏదో అర్థం అయ్యేట్లు లేదు. అసలయిన ప్రారంభం అదే అవుతుంది. అందుకే జగ

న్మాతకు 'దాసోహం' అన్నాడు. 'అమ్మ'కు ఆత్మసమర్పణ చేసుకున్నాడు. అప్పుడే అతనిలోకి జగన్మాత ప్రసాదించిన శక్తులన్నీ వచ్చిచేరాయి.

శుద్ధ ఆత్మ పరిశోధనలో జీవునకు
నిగూఢ, నిర్గుణ, నిస్తబ్దత ఎదురవుతుంది,
నిస్తబ్దకుడ్యం, ఆత్మను బాహ్యప్రపంచం నుంచి
వేరుచేయగా, నిశ్శబ్ద అఘాతం వివేకాన్ని మ్రింగివేసి
మనస్సు గ్రహించగల మేరకు వాస్తవంగా మార్చి
ఇంద్రియాలు శ్రమించి ప్రోదిచేసుకున్నదంతా
అవాస్తవమని కాల్పనికమని నిరూపిస్తుంది.
ఆధ్యాత్మిక ప్రశాంతి సువిశాల ఆత్మసీమల్ని అతిక్రమించగా
అనూహ్యమైన దంతా వదలివేయబడి
కాలం, దూరంలేని ఈశ్వరీయత మిగులుతుంది.
జీవితావసరాలు దుర్భరాలై తొలగిపోతాయి.
ఆలోచన మనల్ని వదలిపోగా, సుఖదుఃఖాలనుంచి విముక్తి లభిస్తుంది.
అహంకారం నశించి అభిమానాలు, ఆత్మీయతలు తొలగిపోతాయి.

ఓ జీవుడా! అప్పుడే ఆనందించకు, ఇంకా వ్యవధివుంది.
నీవు అనంత ప్రశాంత ఆత్మసీమల్ని చేరుకున్నావు
నీవు పరమానందదాయకమైన దివ్య అఘాతాలలో దూకావు
కానీ, నీ స్వీయలక్ష్యాన్ని స్వశక్తిని ఎక్కడ వదిలావు?
ఆ దివ్యమార్గంలో, ఏ మృత్యుతీరంలో వదలినట్లు?
ఆత్మ, ప్రపంచం అయినది ఏదో నీలోనే ఉన్నది
ఈ కాంతి గోళాలమధ్య దానికొరకై నీవు ఏంచేశావు?
బాధ్యతలు విస్మరించడంవల్ల విజయం సిద్ధించదు,
పరలోకాలనుండి నీవు ఏదో పరమలక్ష్యంతో వచ్చావు
ఆ పని పూర్తికాలేదుగానీ, కాలం గడిచిపోతున్నది.
కారణం, భగవంతుని సృష్టి సగమే పూర్తికావడం!

అనంతంగా వస్తున్న 'లేదు' అన్నదే నిన్నుచేరి
నీ కళ్ళలోకి చూచి, నీ హృదయాన్ని చంపివేస్తున్నది,

ఏదీ ఆ ప్రేమమూర్తి 'అవును' అన్న సమాధానం
హృదయంలో రహస్యంగా వున్న అమరత్వం
సృష్టికి మూలమైన సవిత్రుని కీర్తించే పదం
ఓంకారనాదమే సర్వాంగీకార మహామంత్రం
సచ్చిదానందానికి, ప్రశాంతికి మధ్య వారధి
అదే కళ్యాణ సౌందర్యం, నవ వధూ ప్రణయం
బద్ధశత్రువుల్ని సైతం కలిపే మైత్రీమందిరం
విషయ స్వర్ణశిఖరం, రక్షించగల మందహాసం!
జీవన రహస్యంలోని సత్యంకూడ అదే
చీకటి తెర తొలగి పోయినప్పుడు, విశ్వపురుషుని
మహత్తరమైన నీడను మాత్రం మనం చూడగలం
కానీ వెలుగుతెరను తొలగించింది ఎవరు ?
ప్రభువు పూర్ణరూపాన్ని దర్శించింది ఎవరు ?
భగవానుని అవతార లీలలు ఎవరికీ అర్థంకావు
కడపటి అధ్యాయం ముగిసేవరకు అవి అభేద్యాలే
అసంపూర్ణ నాటకసమస్య అపరిష్కృతమే.
జగన్నాటక సూత్రధారి తెరచాటు నుండి నవ్వుతుంటాడు
ఆ దివ్యరూపాన్ని మానవుడు దర్శించ గలగటంలో
ఆ పావన మూర్తి హిరణ్యరూపావిష్కరణంలో
అపరిష్కృత దివ్యరహస్యం దాగివుంది

ఒక బృహత్తరమైన కాంతిరేఖ గమ్యంగా కనిపిస్తుంది
ఆపైన ఎక్కడో అదృశ్యంగా తేజోమండలాలు ఉంటాయి.
ఆదిగా, అంతంగా కనిపిస్తుంది ఒక సువిశాల ద్వారం
అదే దివ్యత్వ ప్రవేశానికి కడపటి ప్రస్థానం.
కాల రాహిత్యంపైన దృష్టి సోకినప్పుడు, పరమాత్మ
తాను ప్రసాదించిన రూపాలను వెనక్కి తీసుకుంటుంది
అంధకారం నుండి, వెలుగుసీమల నుండి నిష్క్రమించిన
సహస్ర కిరణాలు తిరిగి భాస్కరుని చేరుకుంటాయి.
అప్పుడు పరమాత్మ శూన్యస్థితి మిగులుతుంది

ప్రకృతి అనాచ్ఛాదియై, భగవంతుని సైతం కప్పివేయదు.
ఆ మహత్తర శూన్యస్థితిలో సర్వం ఉంటుంది
మనల్ని క్రమ్మిన బలమైన తెరలు చిరిగిపోయినపుడు
ఆత్మను క్రమ్మిన అజ్ఞానం నశిస్తుంది- ఆత్మ నశించదు
ఆ శూన్యస్థితి అమరత్వాన్ని సైతం దాచి ఉంచుతుంది
ఆ మహత్తర అంధకార శూన్యమే సర్వస్వం కాదు
సర్వ వినాశం భగవంతుని కడపటి లక్ష్యమూ కాదు
అది జీవిత పరమసత్యం, జీవుని చరమగమ్యం
ఈ విచిత్ర విశ్వానికి 'లయం' పరమార్థంకాదు.
నిర్వికార నిశ్శబ్దంలో నిర్గుణశక్తి నిద్రాణమై వుంది
అది జాగృతమై యోగనిద్రలో నున్న ఆత్మను మేల్కొల్పి
ఒక్క కిరణంతో మూలజ్యోతిని వెలిగిస్తుంది
అది ప్రపంచాన్నే ఆత్మశక్తికి ఆలంబనం చేయగలదు
అదే మంటిలో పరమాత్మ రూపాన్ని దిద్దగలదు
ఒక్క అడుగు ముందుకు వేస్తే 'ఆత్మ' స్వతంత్రమవుతుంది
ఇక్కడ భగవంతుని ఆశయం, ఆత్మసిద్ధి ఒక్కటే.
అతడు జీవన నగ్నతీరంపై నిలిచినప్పుడు
అతని ఆత్మాన్వేషణ, ఆరాటం అన్నీ
ఏదో నిరామయ శూన్యంలో లయించిపోగా
అతను అన్వేషిస్తున్న దివ్యత్వం సమీపించింది.
అది పరమ ప్రశాంత నిశ్శబ్దస్థితిని చీల్చుకుని
అద్భుతమైన అతీంద్రియ కేంద్రం నుండి
ఒకానొక నిరాకార, నిర్గుణ, సచ్చిదానందంగా
ఒక మహాద్భుత తేజశ్శరీరంగా రూపుదాల్చి
మధుర మంజులమైన మార్మిక రూపంగా
అది అయిన బ్రహ్మానందస్థితికి చేరుకున్నట్లు
అనంతం నుండి, నిర్గుణంవలె వెలువడ్డది.
మాతృమూర్తి బిడ్డను అక్కున చేర్చుకున్నట్లు
ప్రజ్ఞా ప్రాభవ పరమానంద దాయిని అయిన ఆమె

ప్రకృతిని, ప్రపంచాన్ని, ఆత్మను హృదయానికి హత్తుకుంది.
గంభీరంగా, నిర్మాల్యంగా వున్న శూన్యాన్ని రద్దు పరచి
నిశ్శబ్దంగా, నిరుపయోగంగా వున్న మౌనాన్ని ఛేదించి
నిరవధికంగా నున్న నిర్గుణంలోకి చొచ్చుకుని,
హృదయంలో లోతులకు స్వతంత్రంగా పోగా,
ఒకానొక సుందర తేజస్సు సాక్షాత్కరించింది
ఆ తేజస్సు ఓజస్సై, ఒక అద్భుత కిరణమై
అతనిలోని చిరకాల ఉద్దీపనల్ని రగిల్చి
అతని హృదయంలో బంగారు బాటలు పరచింది.
ఆ పూర్ణ సౌందర్యం వల్ల కలిగే మధుర క్షణాలు
సృష్టి చక్రంలో ఏర్పడే అహంకారాన్ని రద్దుచేశాయి.

హృదయం దివ్యపూర్ణమైనప్పుడు కలిగే ప్రకృతి స్పందన
జడప్రపంచంపై పల్లెడలా కనిపిస్తుంది.
అది ప్రాణాన్నే ఆనందమయ రహస్యంగా మార్చి
బాధలు, ఆనందాలు భరించే ప్రేమను అందిస్తుంది
బాధల్ని ఆనందంగా మార్చగలిగిన ప్రేమ
ప్రపంచంలోని విషాదాన్ని నిర్మూలించగలదు
భగవదనుగ్రహం ఎంతగోప్యంగా ఏర్పడినా
అనంతమైన కాలభారాన్ని ఆనందంగా భరించవచ్చు,
బ్రహ్మానందస్థితి జీవితంలో నిగూఢంగా నెలకొని
జీవుని అద్భుతమార్గంలో నడిపిస్తుంది
అనునిత్యం అమరమైన విలువల్ని అన్వయిస్తూ
గ్రహాల పరిశ్రమకు న్యాయం చేకూర్చుతుంది.

భగవంతుని వెనుక పరబ్రహ్మ ఉన్నాడు
జగన్మాత శక్తి విశ్వమంతా వ్యాపిస్తుంది
దేనిని కాదనక, ఉన్నదానినంతా ఆక్రమించి
సర్వత్ర చైతన్యం తన ప్రభావాన్ని చూపుతుంది
అనిత్యమైన మన జీవితాలపై, అనశ్వరమైన
బ్రహ్మానందాన్ని, అఖండశక్తిని పొందగలిగాడు.

సర్వజగత్తును సృష్టించి, లయింపచేసే
సమ్మోహన శక్తిగా అనంతసత్యం ఇక్కడ భాసిస్తుంది
అన్ని లౌకిక, పారలౌకిక శక్తులకు మూలమైన
జగన్మాత మధ్యవర్తిగా, భూమిని బ్రహ్మంతో కలుపుతుంది
మన అంధప్రవృత్తిని శాసించే చిక్కు విడిపోయి
అజ్ఞానపు పైపొర తొలగి, ప్రిదిలిపోతుంది
దురహంకారం వల్ల ఏర్పడిన మనోవైకల్యాలు
విషయలోలత్వంతో చేసే తప్పులు తొలగిపోతాయి

జగన్మాత సర్వదర్శన ప్రజ్ఞాప్రాభవాల వల్ల
జ్ఞానాజ్ఞానాలు ఏవీ స్థిరంగా ఉండవు.
విశ్వయంత్రంలోని విభిన్న ధృవాలు,
భయంకర ప్రతికూలశక్తులు, జగన్మాతకు
మనకు మధ్యన తమ రూపాల్ని వదలి,
రెండూ బలమైన తెరలనే భ్రమల్ని కల్పిస్తాయి.
స్వయంకృతాలలోనే దాగిన ప్రజ్ఞ చెరువైంది
ఈ అంధకారవిశ్వమే అది కప్పుకున్న ముసుగు.
సృష్టిలో ఏదీ లక్ష్యరహితం అనిపించదు
నశించిపోవడమన్నది ఏకైక విముక్తి కాదు.

చిరకాలంగా అన్వేషిస్తున్న గుప్తమార్గం కనుపించి
మన జీవుని జన్మరహస్యం బహిర్గతమైంది
భౌతికవిషయ విమూఢత్వంలో, అశాశ్వతము
అసమగ్రము అయిన శరీరంగా మనస్సుగా మారింది.
సువిశాల ప్రశాంతసీమలలో హృదయం స్పందించి
నిర్మల ఆధ్యాత్మిక సరోవరాల రగిలిన ప్రేమాగ్ని
అజ్ఞానంవల్ల కలిగే విషాదాన్ని తొలగించింది.
జగన్మాత అమల దరహాసంలో వేదన అంతరించింది.

దివ్యజీవనం ఇక్కడ మృత్యువును జయిస్తుంది
ఆ తర్వాత మనస్సు తప్పుచేయడం సాధారణంగా జరగదు

అంతా ప్రేమమయం, త్యాగపూర్ణం అయినప్పుడు తప్పు జరుగదు
రూపం, అరూపం రెండు జగన్మాతలో కలిసిపోతాయి
ఒక్క దివ్యవీక్షణంవల్ల బ్రహ్మానందం లభిస్తుంది
ఒక్క దివ్యదర్శనంవల్ల అమరత్వం చేతికందుతుంది.
అంధకార ప్రాపంచిక శక్తులు ఆకాంక్షించే ఆనందాలు
ఆమెలో ఆపాదమస్తకం అవిష్కృతమైనాయి.
ఆమె సుందర శరీరం బ్రహ్మానంద జ్యోత్స్నా సాగరం
ఆమె జన్మకు, విధికి, పరిశ్రమకు అతీతురాలు-
అవి కాలచక్రంలో తిరుగుతూ ఆమె కోరినప్పుడు నిలిచిపోతాయి.
కాల రక్కసిని ఆమె మాత్రమే సమూలంగా కబళించగలదు.

నిశీధం తనలోనే దాచుకున్న రహస్యం ఆమెది
జీవాత్మ ప్రదర్శించే తాంత్రికశక్తులన్నీ, ఆమెవే
తానే సువర్ణవారధి, తానే అద్భుతమైన అగ్ని
అగోచర తేజోపూర్ణ హృదయమే ఆమె
భగవానుని నిశ్శబ్ద అంతర్య శక్తి ఆమె
ఆ జగన్మాతే మహాశక్తి, జగన్మాతే శబ్దశక్తి
మన కఠోర పురోగమనానికి అత్యంత ఆకర్షణ ఆమె
మనలో చిరుదీపాలను వెలిగించే దివ్యజ్యోతి ఆమె
అదృశ్యలోకాల నుండి ప్రసరించే ఆనందకిరణం ఆమె.
ఆ మహాశక్తులేవీ మున్నెన్నడూ ఆవిష్కరించబడలేదు.

బ్రతుకు బాధల్ని ఆమె పాదస్పర్శతో తొలగించమని
మానవుని ఆత్మను బంధించిన కవాటాలను భేదించమని
మూతపడిన హృదయాలలో జ్యోతుల్ని వెలిగించమని
సర్వప్రకృతి ముక్తకంఠంతో ఆమెనే ప్రార్థిస్తుంది:
ఒకనాటికి లోకమంతా ఆమె దివ్యమందిరం కావాలి.
అన్ని వైరుధ్యాలు ఆమె అనురాగంలో కరిగిపోవాలి
మన మమతలు, ప్రజ్ఞలు ఆమెకే కైంకర్యం కావాలి.
ఆమె ఉజ్వల పారవశ్యంలోనే మనం జీవించాలి

ఆమె స్పర్శ మన వేదనల్ని ఆనందాలుగా మార్చాలి.
ఆమెవల్లనే మన ఆత్మలన్నీ ఏకం కావాలి—.

ఆమెలోని పరిణామం ఆమెలోనే సుస్థిరం కావాలి.
మన జీవితం ఆమె పూర్ణానుగ్రహానికి లోనుకావాలి
పైన, నిరవధిక సుప్రశాంత ఆనందమయ సీమలు
దిగువన, దివ్యసంస్పర్శనంవల్ల కలిగే పారవశ్యం.

భగవదనుగ్రహం ఒక మెరుపులా కలిగినపుడు
ఆపాదమస్తకం ఆనందపారవశ్యంతో నిండిపోతుంది.
ఇంద్రియాలు ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరవుతాయి.
అతని ఆత్మ జగన్మాత దుర్భరాగ్నిలో చిక్కుకుంది—.

ఒకసారి చూచిన హృదయం తర్వాత ఆమెనే వాంఛిస్తుంది.
అనంత బ్రహ్మానందతృష్ణ ఎంతకీ చల్లారదు
ఆమె దర్శనంతో అన్నివాంఛలు నశించి, ఆమెలో కనిపిస్తాయి
అతని ప్రయత్నాలన్నీ ఏకోన్ముఖమై, లక్ష్యాన్ని ఆశించాయి.

అలా, అనంతకాలంలో ఒక బీజం ఏర్పడ్డది
ఒక వెలుగు కనుపించింది, ఒక శబ్దం వినిపించింది
ఒక్క క్షణంలో యుగయుగాల పరిశ్రమ వ్యక్తమైంది.
కాలరాహిత్యంనుండి లోకాలు మెరపుల్లా వెలువడ్డాయి
ఒక్క స్థిరసంఘటనతో సంవత్సరాలు గడిచిపోయాయి.
అతను చేసిన పని, రంగాన్ని సిద్ధపరచడమే
ఆ స్వల్ప ఆరంభమే మహత్తర ఫలితాన్ని ఆశించింది.

ఆమె ఆనందం తనలో రూపు దిద్దుకొనడానికి
తన జీవన మందిరంలో ఆమె సౌందర్యం, ఔన్నత్యం
కొలువు తీరడానికి అతను తనను తాను పునర్నిర్మించుకోవాలి
ఇప్పుడు అతని జీవస్థితి ఆత్మకన్న విశాలం
అతని హృదయ వాంఛలు విపరీతంగా పెరిగాయి

అతనికి తన ఒక్కని స్వాతంత్ర్యంతో తృప్తిలేదు
ఆమె తేజస్సు, అనుగ్రహం, బ్రహ్మానందం, సమస్త
మానవాళికి, ప్రపంచానికి అందాలని అతని ఆకాంక్ష.

కానీ అజ్ఞానం, మృత్యువు అనే భౌతిక తెరల్ని
మానవ ప్రేమ, మానవశక్తి ఛేదించలేవు.
మనిషి సామర్థ్యం పసివాని పట్టుదల వంటిది
చాచిన చేతులకు అందనంత ఎత్తునవుంటుంది స్వర్గం.
ఆలోచనవల్ల, ఆవేదనవల్ల తేజస్సు చేతికందదు.
ప్రశాంత మనస్సు, అతీంద్రియస్థితి ఏర్పడినప్పుడు
హృదయం నిశ్శబ్దంలో అవ్యక్తనాదాన్ని వినగలుగుతుంది.
అందుకు సంపూర్ణ సమర్పణ ఒక్కటే ఏకైక మార్గం.

ఊర్ధ్వలోకాలలో వుండే ఒక దివ్యశక్తి కదలి
మూతపడివున్న జీవనప్రాంగణంలోకి దివ్యత్వాన్ని
తెచ్చి, అశాశ్వతమైన జీవితంలో అమృతం నింపాలి.
ప్రతిఘటించే శక్తులన్నింటినీ చీల్చి, నరికివేయాలి.
ఏ పరమప్రయోజనంకొరకు మన జీవితాలు ఏర్పడ్డవో
ఆ పరమాత్మకోసం ఇహ సుఖాలను మనం త్యాగం చేయాలి.

ఇప్పుడు అతని ఇతర వాంఛలన్నీ తొలగిపోయాయి
జగన్మాత శక్తిని, రూపాన్ని, తన హృదయంలో
మనస్సులో, ప్రాణంలో ప్రతిష్ఠించుకొన ప్రయత్నించాడు
ఆ జగన్మాతను దివినుండి భువికి రప్పించాలని,
ఆమె ప్రేమను, సత్యాన్ని, ఆనందాన్ని
అంధకార వేదనా జగతికి అందించాలని
ఆ దివ్య స్పర్శనంతో లోకాన్ని సముద్ధరించాలని ఆశించాడు
అతని ఆత్మవిముక్తమై, ఆమెకే అంకితమైంది.

జీవుని ఆవాసం - నవ్యసృష్టి

ఈ ప్రపంచం పూర్తిగా మారిపోవాలంటే నవ్యసృష్టి జరగాలి. అందుకై అశ్వపతి ఆత్మనిగ్రహంతో, నిశ్చలంగా తపస్సు చేయసాగాడు. ఎంత తీవ్రంగా తపస్సు చేసినా, అతను ప్రపంచ ప్రజ్ఞను కోల్పోవడం లేదు. ప్రాపంచిక సంబంధాలు తెగిపోవడంలేదు. అవిద్య, అజ్ఞానం తనను వదలడం లేదు. నిజానికి అజ్ఞానమూ అనంతమేగదా! దానిని గర్హించినా అధిగమించడం అసాధ్యం. కనుక దానినుండి తప్పించుకొనకుండా దానిని పూర్తిగా జయించాడు. స్వాధీనం చేసుకున్నాడు. దేనినీ కాదనకుండా, జీవితాన్ని సమన్వయ పరచుకోసాగాడు – అదే సుగమ మార్గం అనిపించింది. అదే తన గమ్యం అని తోచింది.

ఆత్మ విద్యతో విశ్వవిజ్ఞానం బోధపడసాగింది అప్పుడు అల్పం, అనంతంగా మారసాగింది. అతనిలో ఇప్పుడు విశ్వ కామనలు, విశ్వ యాతనలు గూడుకట్టుకున్నాయి. ఇప్పుడు తానే కర్త, తానే సాక్షి. సాధనవల్ల, సమాధి స్థితిని చేరుకొని, ఉన్నత గతుల్ని పొందగలిగాడు: అతనికి కొత్త శక్తి చేకూరింది. కొత్త ఉత్సాహం ఏర్పడ్డది. దివ్యదృష్టి ఏర్పడ్డది. త్రికాలజ్ఞత అలవడింది.

ఈ ప్రపంచం మారుతుందని జ్ఞానదృష్టితో తెలుసుకోగలిగాడు. మారే ప్రపంచాన్ని దివ్యదృష్టితో దర్శించాడు. అక్కడ ఎన్ని కాంతి మండలాలు! ఎన్ని క్రాంతి గోళాలు! అవి ఇతః పూర్వంలేనివి, కనిపించనివి. అది పూర్ణ విశ్వం. పదార్థం - ఆత్మ కలిసి పోయినప్పుడు, ఏకం అయినప్పుడు కలిగే పరిణామం అది.

ఎన్నెన్నో బాధల్ని భరించాడు. అవరోధాన్ని అతిక్రమించాడు. బాధా తప్త లోకాలను గమించాడు, ఇప్పుడు తనలోనే, తనవి అయిన రెండు రూపాలు, రెండు శరీరాలు– తానిప్పుడు సర్వ స్వతంత్రుడైన జీవుడు – మరొక విధంగా, అస్వతంత్రుడైన ప్రాపంచిక జీవి. ఊర్ధ్వలోకాల ఔన్నత్యాలకు తానే సాక్షి.

ఇహ లోకంలోని బాధలలో యాతనలలో భాగస్తుడు: ఎన్ని విరుద్ధ శక్తులు, ఎన్నెన్ని ప్రతిఘటనలు... అన్నింటినీ కాదని, అన్నింటిని దాటి, పరమాత్మను శరణుచొచ్చాడు. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనుకున్నాడు. అలా అనుకో గలిగినప్పుడే అడిగో, జగన్మాత అడుగుల సవ్వడి వినిపించ సాగింది. ఆమె పదనిక్వాణాలు వినగలిగాడు...

అతను చేసినదానికన్న చేయవలసినదే మహత్కార్యం!
అందుకు మిగతా జీవరాశిని వదలి తాను సిద్ధపడ్డాడు.
అవగాహనకు అందక, ఆలోచనవెనుక ఉండి
రహస్యంగా సత్యాన్ని తెలుసుకునే ఒక సంకేతం
తన విశ్వవీక్షణ చాతుర్యంతో లోకాన్ని రక్షిస్తుంది.

చొరవీలులేని ఆత్మ నిశ్చల స్థితిలో
మూర్తీభవించిన లక్ష్యంగా, ప్రశాంతంగా
పద్మాసన స్థితిలో, భగవద్ధ్యానంలో, సుస్థిరంగా
అతను ఏకాంతంగా, ఏకాగ్రంగా కూర్చున్నాడు.
అంతవరకు పృథ్విపై లేని శక్తిని అతను ఆశించాడు
మానవ ఇచ్ఛకు అతీతమైన దివ్య సహాయం అర్థించాడు
అప్పటికి సుదూరంగా కన్పించే సత్య వర్చస్సుకై
అన్నింటికీ ఆది అయిన మహాశక్తి ఆమోదం అర్థించాడు.

కాని మహోన్నత శిఖరాలనుండి అందుకు సమాధానం లేదు
మూతపడివున్న కాలం కనురెప్పలు తెరుచుకోలేదు
సంవత్సరాలు నిష్ప్రయోజనంగా గడచిపోసాగాయి
మన మానవతత్వం రూపొందిన పద్ధతిలోనే
బ్రహ్మాండమైన నిరోధం అతనికి మూగగా ఏర్పడ్డది.
మనకు కనిపించని అజ్ఞానం ఆధారంగా
జీవుని ఆంతర్యంలో అవరోధం ఏర్పడ్డది.
విషయాలకు మూలంలోనే వ్యతిరిక్తత ఏర్పడ్డది
చీకటిలో రహస్యంగా చేతులు కలపడం
అతని నైజంలోనే వున్నది కాని బహిర్గతం కాలేదు.

అప్పటికి అతని భౌతిక జీవనంలో కొంతమేర
జన్మస్థావరమైన అంధత్వంతో సంబంధం ఉంచుకుంది.
కరిగిపోయిన గతంలోని బికమత్యం పీడగా
ప్రాచీన ప్రపంచ నిర్మాణంలో భద్రంగా మిగిలింది.
అవి గోప్యంగా వివేకానికి, ప్రజ్ఞకు అందక
మనస్సు, ఆత్మ కోరినప్పుడు మాత్రం మందంగా,
మధుర జ్ఞాపకాలలో కలలవలె కదులుతుంటాయి.

చేజారిన గింజల్లా రాక్షస ప్రవృత్తులు విస్తరించి
చేరువవుతున్న సత్యాన్ని భయపెట్టి రాకుండా చేస్తాయి
సంప్రదాయాలు, ఆదర్శాలు, నిరర్థకంగా తిరుగుతూ
స్వర్గమేదో భూమిపైకి దిగివచ్చి, లోకంలోని
అసమగ్రతల్ని, మానవ నైజంలోని మధురమైన
బలహీనతల్ని పూరించి, సరిదిద్దాలని ఆశిస్తాయి.

ఇప్పుడు అతను పరమాత్మను కాదని, తనలో తానుగా
ఆ ప్రజ్ఞను ప్రతిష్ఠించుకోవాలని ప్రయత్నించాడు.
అందుకై ప్రకృతిలోని మూల మూలల్ని గాలించిశోధించి
వెలుగున ప్రకృతి రహస్యాలనన్నీ పరిశీలించగా
సర్వాన్ని శుద్ధి చేయగల పవిత్ర తేజస్సుకు
దూరంగా, చీకటి మందిరాలలో ఆశ్రయం పొందిన
ప్రతికూల శక్తులు, అరూప ప్రతిఘటనలు కనిపించాయి.
దివ్యం కాని దంతా నశించి పోయినట్లే కనిపించింది
కాని ప్రతికూల శక్తులలో ఏ కొద్దిగనో తప్పించుకోగా
అంధ శక్తులకు అది కేంద్ర బిందువు అయింది.
నిజానికి అజ్ఞానం సైతం అనంతమే !

దాని లోతుల్ని మరింతగా తరచి శోధించినకొద్దీ
అవి మరింతగా విస్తరించి, అనంతంగా సాగిపోతాయి.
మానవ వాంఛ సత్యాన్ని మలిన పరచకుండా,
అతను తన వాంఛల్ని సమూలంగా పెరికివేసి

శూన్య హృదయాన్ని దేవతలకు సమర్పించాడు,
అలా అతను పాప రహితుడైనాడు.
చివరిదైన మహత్తర పరిణామం ఏర్పడ్డది.

అతని ఆత్మ మహాసాగర తలం వలె నిండిపోయి
మనస్సును, శరీరాన్ని తరంగాలతో ముంచివేసింది.
సమస్త విశ్వాన్ని ఆక్రమించాలన్న లక్ష్యంతో ఆత్మ
విస్తరించి, ఇటు అంతరాన్ని, అటు బాహ్యాన్ని ఏకం చేసి
జీవితాన్ని విశ్వ ప్రేమతో నింపివేయాలని
సుస్థిర దివ్య సామ్రాజ్యంగా మార్చాలని యత్నించింది.

ఈ అద్భుతమైన విశ్వ జనీనతలో
అతని ఆత్మ స్వభావం, మానసిక నైజమేకాక
అతనికి చెందిన సర్వమేధ, సర్వాత్మ
చివరకు శరీరంలోని ప్రతి అణువు మారిపోయాయి.
జీవించి వున్న ప్రతి జీవి తానే కాగలిగింది
ఇతరుల ఆనందమే తన ఆనందంగా భావించి
ఇతరుల విషాదాలు తనవిగా అనుభవించాడు
సకల జీవుల కర్మఫలాన్ని పృధ్వి భరిస్తున్నట్లు
సాగరంవలె గంభీరంగా ఉంటూ, అతని
విశ్వ కారుణ్యం సృష్టి భారాన్ని వహించింది.

గుప్తంగా వున్న అతీంద్రియ సుఖశాంతులకు పరవశించాడు.
ఇకపైన అనంతంగా సాగే స్వ పర భేదం ఉండదు.
నిగూఢ ఆత్మ సంధానంలో జీవుడు ఏకమైనప్పుడు
స్వభావం, ఏకైక సచ్చిదానందమే అవుతుంది.
ఆత్మకు ఆత్మకు మధ్య భేద భావం ఉండదు
ప్రపంచానికి పరమాత్మకు మధ్య అవరోధం ఉండదు.
స్మృతుల్ని, రూపాల్ని పరిమితం చేసే రేఖల్ని దాటిపోగా
మానసిక నియమాలు కకావికలై పోతాయి
అవి అన్నీ కరిగిపోయిన తర్వాత ఏమీ మిగలదు

లోకాల్ని సృజించే ఏకైక చైతన్యం మిగులుతుంది
ఇప్పుడు అది అంతా విస్తృత తేజస్సు, అపారశక్తి.

మానసిక విస్మృతి తొలిసారిగా కలిగినప్పుడే
ఆత్మకు స్వార్థ పరత్వం నశించి పోతుంది
నేను వేరన్న ప్రత్యేకభావం కలగనే కలగదు
అది అంతర్ధానమై, తాను అన్నది ఏమీ మిగలక
ఆధ్యాత్మిక విశాల జగత్తులో లీనమై పోతుంది.

అతని స్వభావం సర్వజీవుల చలనంగా మారి
అంతా 'పరమాత్మ' అన్న గుర్తింపు కలిగింది
అతని ఆత్మ సర్వజీవులకు ప్రతినిధి అయి,
తననుండి వేరై పరమాత్మను చేరే ప్రయత్నం చేసింది.

మానవ లక్ష్యమే సంపూర్ణంగా మారిపోయింది
పరమాత్మను గుప్తంగా దాచుకున్న మానవ హృదయం
తనలోనే దైవశక్తి స్పందనను గమనించింది
సత్యాన్ని గుర్తించడంతో మానవమేధ పరిశోధన ఆగిపోయింది.

విశ్వజీవ ప్రవాహంలో అతని జీవం కలిసిపోయింది
అప్పుడు విశ్వ శిఖరాగ్రాన సంతృప్తిగా నిలిచి
ఈ లోకాన్ని దాటి పైకి పోవడానికై చూడసాగాడు
దివ్యత్వం దిగివచ్చి లోకాన్ని ఉద్ధరించాలని ఆశించాడు.

ఒక మహత్తు, ఒక సంకేతం భూమిని ఆక్రమించగా
శూన్య తలాలన్నీ మాధుర్య పూర్ణాలయినాయి
సుదూరాన ఉన్న వెలుగులు సన్నిహితాలైనాయి
కడు దూరం అనుకున్న దివ్యలోకాలు చేరువైనాయి.

ఆ మహాద్భుత తేజస్సుకు ఇంద్రియాలు పనిచేయవు
అతని చెవులకు ప్రాపంచిక శబ్దాలు వినిపించలేదు
ఏ దివ్యభావన నిరుపయోగంగా నశించిపోదు
భగవంతుడు అలసిపోయి మార్మిక జలాల కరిగిపోయాడు.

అతని జ్ఞానం శుద్ధ నిర్గుణ దృష్టికి అంకితమైంది
ప్రాపంచికమైన ఆలోచనలన్నీ నశించిపోసాగాయి

విధి ప్రభావం, ప్రకృతి నైజం నశించిపోయాయి
విశ్వ సమ్మోహనమైన ఆ నిశ్చల ప్రశాంతిలో
స్వ - ఇచ్ఛా సంకల్పాల వేడి నిట్టూర్పులు సమసిపోయాయి.

అతని ప్రతి అవయవం నిస్తబ్దమై, జడమై,
నగ్నంగా, నిరాటంకంగా, నిర్భయంగా
పరమాత్మను భరించి, స్వీకరించడానికి సిద్ధమైంది
చివరి చలనం సైతం ఆగి, ఒక్కసారిగా సర్వం స్తంభించింది.

అదృశ్యంగా నున్న పరమాత్మహస్తం బరువుగా
అతని అవయవాలపై ఆధ్యాత్మిక ముద్రవేసింది
దివ్యత్వమే అతనిని మహాసమాధిలోకి చేర్చింది

మార్మిక తీరాలను చేరడానికి ఉద్యమించిన నావికునివలె
పరమాత్మే ఊపిరిగా మహాసాగరాలను దాటుకుంటూ
క్రిందనున్న అనంత అగాధాలను, చుట్టూవున్న అగోచరాలను
పైనవున్న నక్షత్ర మండలాన్ని, రోదసిని అతని ఆత్మ దాటిపోయిండి.

ప్రాపంచిక పరిమితశక్తు లన్నింటికి అతీతంగా
నిగూఢమైన మూల శక్తులలోకి పరుగుతీసింది
మానసికోపరితలం నుండి ప్రశాంత వాతావరణానికి
లోలోపల నిశ్శబ్దంగా పరివ్యాప్తమైన నిద్రలోకి జారింది.

అసంపూర్ణ భావాలకు, శబ్దాలకు అతీతంగా
దృష్టి పథాన్ని, చివరిదైన ఆధార రూపాన్ని దాటి
మహత్తర తేజోమండలాలలో కలిసిపోతాడు.
లేక, నిర్గుణ నిశ్శబ్దమైన శూన్యంలో పయనిస్తూ
పథరహితమైన శుద్ధ చైతన్యంలో ఒంటరి అవుతాడు.
లేక, ఆత్మ, అనాత్మ, ఆత్మ రహిత స్థితుల్ని అధిగమించి
మానసిక చైతన్య స్వప్న తీరాలను సైతం దాటి
ఆద్యంత రహితమైన మూలస్థితిని చేరుకుంటాడు.

ఆ నిరాకార శిఖరాలపై శబ్ద అవరోధం ఉండదు
భౌతిక ప్రపంచానికి దూరంగా, అతి నిర్మలంగా

ఆధ్యాత్మిక వాతావరణం ప్రశాంతంగా నెలకొన్నది.
అక్కడ దేనికీ ఆదిలేదు, దేనికీ అంతం ఉండదు,
చలనమున్న ప్రతి వస్తువుకు నికరమైన శక్తి ఉంటుంది
సృష్టికి మూలమైన కృఋవు అచలంగా ఉంటుంది.
అక్కడి శూన్యంలో సృష్టికి మూలమేదో తెలియదు
సృష్టి మహాయంత్రాన్ని ఆత్మ గమనించదు.
విధి నడిపించే యాంత్రిక ఘోషలు అక్కడ వినిపించవు
ఒకే గుండెలో మంచిచెడులు కలసి కాపురముంటాయి.
ప్రేమానుబంధంలోనే ప్రతికూల ఘర్షణ
జీవితం జరిపే ప్రయోగాలలో భయంకర వేదన
అందివచ్చే అవకాశాలవల్ల మారే విలువలు
మానసిక ప్రలోభంలో మన జీవితాలను
వివిధ దేవతలకు పణంగా సమర్పిస్తాం.
ఆలోచనలు చీకటివెలుగులవలె మారుతూ
బాహ్యచైతన్యం పైన ముసురు తుంటాయి
నిశ్చలంగా వున్న స్వాప్నికస్థితిలో ఆత్మకు
లోకం సగమే కనిపిస్తున్న భ్రాంతి ఏర్పడుతుంది.

అక్కడ అజ్ఞానం సాధించేదంతా వివేకమే
జీవితంలో సాధించేవన్నీ నిష్ప్రయోజనాలే
అప్రయత్నంగా, అనూహ్యంగా జరిగే విధానంలో
అనిశ్చల, నిశ్చైతన్య సీమలలో వాటికి
ప్రవేశం ఉండదు, లక్ష్యంఉండదు, జీవించే హక్కుఉండదు
నిశ్చలమైన ఆత్మశక్తి మాత్రమే అక్కడ విస్తరించి
అనంత నిశ్శబ్దంలో ఒంటరిగా విహరిస్తుంది.
అదే సర్వ వ్యాపక, సర్వశక్తిమయ ప్రశాంతి.

ఆలోచన ఆలోచనతో, సత్యం సత్యంతో కలహించవు
ఒక న్యాయం మరొకన్యాయంతో యుద్ధానికి దిగదు.

ఒక అవకాశం వదలి మరొక అవకాశం కొరకు
అంగలార్చే అరకొర జీవులకు అచ్చట స్థానంలేదు
జడంగా, తేజో రహితంగా వున్న శరీరాలలో
హృదయస్పందనలు బలాత్కారంగా ఏర్పడవు

నిరంతరం రగిలే యోగాగ్నుల సహాయంతో
ఆ జగన్మాత మహత్తర మందిరంలో
చిరంతనమైన సత్యమే నిత్యమైన వేదికగా
పరమాత్మ ధర్మాన్ని రక్షిస్తున్న వారున్నారు.

ప్రకృతి తన మూగ ఆధ్యాత్మికతపై ఆధారపడి
తన పరిణామ శీలతను గుర్తిస్తూనే ఉంటుంది
అసంఖ్యాక లోకాలలో కలిగే సంచలనానికి
నిర్వికారంగా, ప్రశాంతంగా తన ఆమోదాన్ని అందిస్తుంది.
సర్వము తానై, సర్వసృష్టికి తానై, సృష్టికి తాను అతీతమై
పరమాత్మ సర్వం, నిశ్చలంగా గమనిస్తూ ఉంటాడు.
ఒకే ఒక్క జ్ఞాననేత్రం సర్వసృష్టిని పరిశీలిస్తుంది.

ఈ సృష్టి కలరవానికి అతీతమైన నిశ్శబ్దంలో
అతను అనంత ప్రశాంతిలో లీనమై పోయాడు
అంతు దరి లేని ఆత్మ అతనికి ఆవాసమైంది
అతని పరిపూర్ణ ప్రజ్ఞ ఒక్కటే అతనికి సహాయం.

ఆలోచనకు కట్టుపడని ఒక మహామేధ
శూన్యంలో విహరించడానికి ఆటంకంలేని జీవం
కాలానికి లోబడి, కట్టుపడని నిరవధిక ఆత్మ
చిరకాల విశ్వయాతన సమసిపోవడం గుర్తించాడు
తానే జనన మరణాలకు అతీతమైన ఆత్మగా మారాడు
పరమాత్మ సామ్రాజ్యంలో తాను ఒక్కడైనాడు.

ప్రశాంత రోదసిలో ప్రాయికమైన ఒంటరితనం ఆవరించింది
కాలానికి కట్టుపడివున్న వాటితో దానికి సంబంధంలేదు

ప్రకృతిలో విశాల విశ్వం యావత్తు శూన్యమే అయింది.
సమస్త వస్తుజాలం తొలి అరూప స్థితికి చేరుకుంది.

ఒక కాలచక్ర పరిభ్రమణంలో లోకం నిశ్శబ్దమైంది
తాను కలుషితమైన ప్రకృతిని దాటి పోయినా
ప్రకృతి ముద్రలు అతనిలో అనేకం మిగిలే ఉన్నాయి.
నిర్జీవ స్వప్నం క్రమక్రమంగా కరిగిపోయినట్లు
బృహత్తరమైన ప్రాకృతిక కార్యం క్రమంగా అంతరించింది.

ఆ మహా శూన్యాలనుండి స్వనాలు వినిపించవు
ప్రకృతి నిర్జన సీమలు సమాధానాలు పలకవు
ఎటు చూచినా నిశ్శబ్దమే విస్తరిస్తుంది ఎటు చూచినా
దేవతల ఆవిర్భావానికి ముందరి దివ్యత్వమే.
గుప్తంగా వున్న పరమాత్మ ఆదేశానికై
విశ్వశక్తి నిశ్చలంగా ఎదురు చూడసాగింది.

సాగరం తన లోతుల్ని తనే అన్వేషించ పూనినట్లు
అకస్మాత్తుగా దృష్టి అంతర్గతం కాసాగింది.
చైతన్య పూర్ణమైన దివ్యత్వం కేంద్రీకృతమై
అసంఖ్యాకమైన మహత్తులతో అతనిని చేరింది.

తన్మయత, తేజస్సు, ఓజస్సు, ప్రణయజ్వాల
అన్నీ ఒకే ఒక బ్రహ్మానందంలో ఏకం కాసాగాయి.
దివ్యత్వం నిండిన హృదయానికి స్థితి ఆస్తిత్వం తెలిసింది.
ప్రతి ఒక్కటి ఆత్మగా, పరమాత్మను ఆశ్రయించింది

మహత్తర విశ్వలీలలన్నీ పరమాత్మ హృదయ స్పందనలే
వాటిని గ్రహించడం పరమాత్మజ్యోతిని గ్రహించడమే
మేధస్సు అనేక తీగల జంత్రవాద్య ప్రక్రియ
ప్రతి జీవితం అనేక జీవితాల సంగమగీతం.

లోకాలు అనేకాలైనా, అన్నింటి ఆత్మ ఒక్కటే
ఇప్పుడీ విజ్ఞానం రోదసికి బీజప్రాయమైంది

ఆ బీజం తేజస్సులో భద్రంగా దాచబడ్డది
దానికి అజ్ఞానపు ఆచ్ఛాదన అవసరం లేదు.

అప్పుడు అత్యద్భుతమైన సమాధి స్థితినుండి
ఏకైక హృదయంలోని తీవ్ర స్పందనల నుండి
అమలిన ఆధ్యాత్మిక విజయాలనుండి
వినూత్నమైన అద్భుత సృష్టి ఆవిర్భవించింది.

అసంఖ్యాకంగా ప్రవహించే దివ్యత్వాలు
అపరిమిత ఆనందాలు ఏకమై పోయాయి
జీవం అపరిమితంగా, విస్తృతంగా ఉన్న లోకాలలో
అహంకారం లేని ఆత్మ అనూహ్యంగా రూపుదాల్చింది.

బ్రహ్మానంద ఉద్దీపక శక్తులు కాలాన్ని
కాలాతీతంగా మార్చి పారవశ్యం కలిగిస్తాయి
సర్వం సర్వంతో కలిసినప్పుడు అంతా ధావళ్యమే
అక్కడ వైరుధ్యాలకు, భిన్నత్వాలకు తావులేదు.

ఆధ్యాత్మిక బంధాలు అన్నింటినీ అన్నింటితో కలిపి
చివరకు అక్షరమూర్తితో అక్షయంగా బంధించాయి.
దేనికదే ప్రత్యేకమైనా, అన్నింటినీ సమంగా స్వీకరించి
ఈ అనంత సంగతులను అనుసరించి పోయి
తనలోనే సమస్త విశ్వాన్ని దర్శించ గలిగాడు.

ఈ అనంత సృష్టివలయం యొక్క అద్భుతకేంద్రం
చివరివరకు, శిఖరాగ్రం వరకు విస్తరించి
ఆత్మానందంలోనే దివ్యానందాల్ని అనుభవించింది
అసంఖ్యాకంగా నున్న ఇతర ఆత్మలలోను అనుభవించింది

అది అవ్యక్త స్థితిలో నున్న రూపాలను, వ్యక్తులను
నిరంతరాయంగా తన పరిధిలోకి గ్రహించింది.
అసంఖ్యాకంగా, దివ్యసీమలలో సాగిపోయినట్లు
దివ్యత్వం అంతకు పదింతలుగా ప్రజ్వరిల్లింది.

ఎవరూ దూరంకాదు, ఎవరూ తనకై ఒంటరిగా జీవించరు
ప్రతి ఒక్కరు, తనలోని, సర్వజీవులలోని
పరమాత్మ కొరకే జీవిస్తున్నారు, ప్రతి ఒక్కరిలో
సర్వము అవ్యక్తంగా వ్యక్తం అవుతూవుంది.

అక్కడి ఏకాంతం ఒంటరి తనంతో ముడివడి లేదు
అది వేయి రూపాలలో ప్రత్యక్ష మవుతూవుంది.
తేజోపూర్ణమైన దాని సుస్థిర రూపం
సురక్షితంగా, పరిణామ రహితంగా ఉంటుంది.

సదా పరిణామం చెందే అసంఖ్యాకమైన రూపాలు
అప్రయత్నంగా దాన్యప్రవృత్తిని ప్రోత్సహిస్తాయి
విశృంఖలంగా కనిపించే సూక్ష్మనర్తన పథంలో
విశ్వశక్తులు నిర్దుష్టంగా, అద్భుతంగా పనిచేస్తాయి

బాహ్యరూపం తనలోని సత్యస్వరూపాన్ని వెతుకుతుంది
ఏకత్వం ఆడిస్తున్న నాటకంలో తేడా గ్రహిస్తుంది.
అది మానవులందరినీ పరమాత్మ అంశాలుగా మార్చినా
అన్నీ తిరిగి పరమాత్మలోని రహస్య అంతర్భాగాలే.

తన్మయస్థితి పరిపూర్ణంగా ఏర్పడినప్పుడు
సర్వవేదనలు మధురప్రేమ వేదనలవుతాయి.
అద్వైత స్థితివల్ల లభించే నిర్మలానందం
వైరుధ్యాలకు అతీతమైన రక్షణను కల్పిస్తుంది.

భయానకమైన వైరుధ్యాలు కలిసే సంగమరేఖపై
మహానాటకం అర్థాంతరంగా ముగిసినప్పుడు
ఆత్మదర్శనం ఫలితంగా కొంత దివ్యత్వం తగ్గినా
యోగ పరమైన సచ్చిదానందం లభిస్తుంది.

ఆ అఖండ బ్రహ్మానంద మాధుర్యంలో
నిర్గుణ పరబ్రహ్మ సహానుభూతి లభిస్తుంది.

అక్కడ వేదనల నిట్టూర్పులకు తావులేదు
ఒక ఆనందం నుండి మరొక ఆనందానికి అనుభవం పరుగులు–

అన్నింటిలోనూ అనశ్వరంగా వున్నది సచ్చిదానందమే
సర్వప్రకృతి భగవంతుని చైతన్య రూపమే.
అన్నింటిలో ప్రజ్ఞ ఆత్మగా, ఆత్మీయంగా చరిస్తుంది
అన్నింటిలో తేజస్సు అపరిమితంగా నిండి వుంటుంది.
అన్నింటిలో సత్యం జ్ఞానంవలె ప్రకాశిస్తుంది.
అన్నింటిలో సృజనశక్తి ప్రసరిల్లి వుంటుంది.
అనంతం నుండి శక్తి అవిచ్ఛిన్నంగా పరుగులిడి
క్షణికమైన భావనను కార్యోన్ముఖం చేస్తుంది.
నిశ్శబ్దం నుండి ఒక శబ్దం పైకివస్తుంది
ఒక సౌందర్యం నిశ్చల శూన్యం నుండి వెలువడుతుంది
కాలం గుండెనుండి విజ్ఞానం పెల్లుబుకుతుంది.
వ్యామోహ రహితంగా ఏది ఏమైనా కాగలదు.

దివ్యతేజస్సుతో పునీతమైన హృదయంలో
నిరాటంకంగా తన్మయస్థితి కలుగుతుంది
సర్వం పవిత్రప్రేమలో తాదాత్మ్యం చెందుతుంది.
సార్వజనీన దృష్టి అన్నింటినీ ఏకం చేస్తుంది.
ప్రతి హృదయం మరొక హృదయాన్ని స్పందింప చేస్తుంది.
ఆలోచనలు అంతర్గత శబ్దాలను వింటూ
హృదయ స్పందనల్ని అనుభూతిగా మార్చుతాయి
దానిని అందుకొనడానికి చేతులు అవసరంలేదు
చైతన్యానికి మూలమైన ప్రక్రియ లున్నాయి
అదే ఆత్మకు ఆత్మకు మధ్య ఆత్మీయతను పెంచుతుంది.
ఆధ్యాత్మిక శక్తుల అద్భుత స్వర సమ్మేళనం
అతీంద్రియస్థితిలో ఆత్మల పరివర్తన
మమేక స్థితిలో సంపూర్ణంగా ఏర్పడుతుంది.
అలా ప్రసరిల్లిన నూతన లోకాలలో

అతను విశ్వదర్శనం చేయగలిగాడు.
విశ్వవ్యాప్తమైన వెలుగుకు ఆకరం కాగలిగాడు
శాంతి మహాసాగరంపై ఏకైక తరంగమైనాడు.
అతని మేధ, అసంఖ్యాక మేధలకు సమాధానం చెప్పింది.
రోదసి సంభాషణకు అతని పలుకులు సంకేతాలు
విశాల సృష్టి స్పందనకు అతని జీవితమే భూమిక.

ఒకే లక్ష్యంతో, ఒకే గమ్యం వైపు పయనించే
కోట్ల అభిమతాల పద సవ్వడులు వినిపించాయి.
ఆ ప్రవాహం సదా నిత్యనూతనం – అది అమరం
ఆ ప్రవాహపు వేనవేల తరంగాల ఉధృతికి
దివ్య మాధుర్యాలు సైతం కలవరం చెందాయి
అతను తన ప్రత్యణువులో ఆ మాధుర్యాలను
నిశ్చల స్పందనలుగా, అఖండ సచ్చిదానందంగా
కోటి కోట్ల ఆనందాలను ఒక్కటిగా అనుభవించాడు.

అపార నిర్మల, భవ్య సామ్రాజ్యంలోని చరాచర
వస్తుచయంపైన ఈశ్వరీయత ఉంటుంది.
పరమోత్కృష్టమైన ఈశ్వర సామ్రాజ్యానికి చేర్చే
క్రమానుగతమైన కాంతి మండలాలు అతనికి కనిపించాయి.

ప్రతి మండలం పరమ సత్యానికే అనుబంధమైనా
ప్రతి మండలం స్వతంత్రమైన బ్రహ్మానంద నిలయమే
దేని సౌందర్యం దానిదే, దేని నైర్మల్యం దానిదే
అన్నీ ఒకే ఒక్క పరమ సత్యానికి ప్రతీకలు
అవి వాటి అంతరాలలోనే ఐకమత్యంగా ఉంటాయి.

ప్రతి ఒక్కటి పరిసర మండలాలకి తన శక్తి నిస్తుంది
కానీదాన క్రియవల్ల తన శక్తిని ఏమాత్రం కోల్పోదు
నిగూఢంగా, పరస్పరం సహాయం పొందే మండలాలు
సహాయం చేసినవి, పొందినవి అభివృద్ధి చెందుతాయి.
మిగిలినవన్నీ, అవి తమకే చెందినట్లు భావించి

శక్తిని, ఆనందాన్ని అన్నింటితో సమంగా అనుభవిస్తాయి.
ఆ సమస్థితిలో ప్రత్యేక ఆత్మలలోని ఆనందాన్ని
ప్రత్యేకంగా అనుభవించడం కోసం ఏకాంతం అవసరం.
ఒంటరితనంలోని ఏకత్వం సర్వత్వాన్ని ఆశిస్తుంది
అనేకంగా వున్న వన్నీ తిరిగి ఏకత్వాన్ని ఆశ్రయిస్తాయి.
సర్వజ్ఞతకు, సర్వ సృష్టికి మూలమైన బ్రహ్మానందం
దివ్య సత్యావిష్కరణకై రూపాలను వెతుక్కుంటుంది.
అగోచర పరమాత్మకు సంకేతాలైనమెరుపులు
మహత్తర సృష్టిపై చిత్రికి అనుకూలంగా
ఆత్మ దర్శించే స్వచ్ఛమైన, ధవళ మండలంలో

వర్ణ రహిత గగనంలో చిత్ర వర్ణాలుగా భాసిస్తాయి.
ఆ రంగులన్నీ పరమాత్మనుండ ప్రసరించేవే,
సృష్టికి హేతువులైన ఆనందం, సౌందర్యం, శక్తి – అవి.

ఒక విశాల సత్య చైతన్యం ఆ సంకేతాలను
దివ్యత్వాన్ని నింపుకున్న హృదయానికి అందిస్తుంది
ఆ హృదయం. సంకేతాలను ఆనందంగా స్వీకరించి
అవి ప్రసాదించే అతీంద్రియ దృశ్యాలతో తృప్తిపడి
వాటిని నిత్యాలుగా, సత్యాలుగా గ్రహిస్తుంది.
జీవుని నిష్పక్షపాత దృష్టి అద్భుతాలకు
మహత్తులకు నెలవవుతుంది కాల నిబంధనలేని
రహస్య శక్తులకు అది సంగమ కేంద్రమవుతుంది.

అద రోదసినే పరమాత్మకు మాయా మందిరం చేసి
కాల క్రమేణ అద్భుత శక్తుల్ని క్రుమ్మరిస్తుంది
ప్రేమ సౌందర్యాన్ని, అద్భుత మహత్త్యాలను
సచ్చిదానంద స్థితిలో ప్రదర్శిస్తుంది.
తల్లి బిడ్డతో ఆడుకున్నట్లు. పరమాత్మతో ఆడుతూ
జగన్మాత తన విశ్వమందిరంలో సంచరించసాగింది.

అతనికి విశ్వమే ఆమె ప్రేమహృదయం
అనంత సత్యాలే అతనికి ఆటవస్తువులు.
ఇక్కడ ఆత్మ కోల్పోయినవన్నీ అక్కడ దివ్యస్థానం పొందాయి
పొరపాట్ల వల్ల మనహృదయాలు పొందలేని శక్తులు
అక్కడ పరమసత్యాలుగా, నిర్మలానందాలుగా భాసిస్తాయి.
నిరంతర సృష్టి ప్రవాహంలో మహాత్ములైనవారు
తమ తమ ఆత్మ ఔన్నత్యాలను అందుకుంటారు.
వారి మేధస్సు దివ్యజ్ఞాన కిరణాలకు ఆకరమై
మహత్వ భావనా బలంతో రూపుదిద్దుకుని
సుందర స్వప్న లహరులలో విహరించగలదు

ఆలోచన మహత్తరమైన మంత్రదండం వలె
అగోచరాన్ని ఆహ్వానించి ప్రతిష్ఠించుకోగలదు
సత్యం చిత్రవర్ణ భావపక్షాలను విప్పి
సువర్ణమయ గగనంలో విహరించగలదు.
పరమాత్మను సన్నిహితంచేసే స్వప్నగీతాలను
దివ్యహృదయం పరవశించేటట్లు పాడగలదు.
అగోచర మూర్తిని సన్నిహితం, వాస్తవం చేసే శక్తి
భావమందిరంలో పరబ్రహ్మను సుప్రతిష్ఠించింది

అది మనస్సును, వివేకాన్ని, భావనను పరమాత్మ
అద్భుత లీలలతో వైభవంతో నింపివేసింది.
అద్వితీయ పరబ్రహ్మమే అనేక మూర్తులై
ప్రతిపదంలోనూ పరమేశ్వరనాదం వింటూ
ప్రతి వెలుగులో పరంజ్యోతినే దర్శిస్తూ
ప్రతి రూపంలో దివ్యమంగళ రూపాన్నే చూస్తూ
ప్రతి మంత్రంలోనూ దివ్యానుభూతిని పొందుతుంది.
ఆలోచనలన్నీ అనంత మూర్తితో నిండి పోతాయి–

భావనకు వాస్తవానికి మధ్య అఖాతాలు లేవు
ఒక బాలకం, మరొక బాలకాన్ని సంభావించినట్లే,

ఆచరణ సంకల్పానికి, సంకల్పం ఆలోచనకు విధేయం
ఆత్మకు ఆత్మకు మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది
ఈశ్వరత్వం తోడి అనుబంధం కాలాన్ని పునీతం చేసింది
ఆమె ఆడించే ఆటలలో జీవుడు అలసి పోడు
ఆమె హృదయంలో ఆనందం, పెదవులపై హాసం
పరమాత్మ ఆడించే నాటకంలో అది ఒక సాహస దృశ్యం

ఆమె పరిణత ప్రజ్ఞా వైభవచాపల్యంతో
ఆమె కాలంపైన ముద్రించే రమణీయ చిత్రాలు
చిత్ర విచిత్ర మానసిక విభ్రమాలు కలిగించి
ప్రతి మలుపులోను కొత్త పరిణామాలు చూపిస్తూ
ఆత్మ పరిశోధనలో అంతం లేకుండా చేస్తుంది.

ఆమె సంకల్పం అభేద్య కఠోర నియమాలు సృష్టించి
ఆలోచనలకు అందని నక్షత్రాలను సృష్టించి
హృదయాన్ని సాహస కార్యాలకు సన్నద్ధ పరుస్తుంది
అప్పుడు సత్యం అనూహ్య రూపాలలో దర్శనమిస్తుంది
లేదా, రమణీయ రసగీతిని మరల వినిపించినట్లు
లోగడ అనుభవించిన ఆనందాలే పునరుక్తమవుతాయి.
ఆ వేదమాత హృదయంపై దాగుడుమూతలాడుతూ
కళాపిపాసి వలె ఆమె సృష్టిని గురించి ఆలోచిస్తాడు.
ఆ ఆలోచనలు ఎన్నటికీ అంతం కావు
ఆలోచనా రూపాలలోకి సాహసంతో చొరబడి
సరికొత్త సజీవ స్వప్నాలతో మురిసి పోతాడు

అభేదత్వంతో అలసిపోక, పరిణామంతో విసిగిపోక
అనంతంగా ఆమె సృష్టి కార్యాన్ని సాగిస్తూనే వుంది—.
దివ్యానందదాయకమై విచిత్ర ప్రక్రియగా
విశ్వవివశత్వం కలిగించే ఒక సజీవ గీతంగా
విశిష్ట రూపాల చలనచిత్ర చరానికగా
ప్రగతిశీల సన్నివేశాల ప్రదర్శన వేదికగా

హృదయావిష్కృత చిత్రాలకు కాదంబినిగా
ఒక ఆత్మ కోసం మరొక ఆత్మపడే ఆవేదనగా
దేవతామూర్తులలో ఆరాటం అభివ్యక్తమైంది
అక్కడ పదార్థం జీవధాతువు యొక్క సాంద్రస్థితి
అది ఆత్మానంద స్థితికి బాహ్య కళారూపం
అనంత భావ చిత్రాలున్న భద్ర మందిరం
అక్కడ వివేకం ప్రతిమలానందలోకాన్ని నిర్మించుకుంటుంది.
అది అఖండ సచ్చిదానంద నిలయం
ఆ మందిరంలో ఘడియలు క్షణాల్లా గడుస్తాయి.
అక్కడ ఇంద్రియాలు ఆత్మకు నిర్గమ మార్గాలు
మనస్సులోని ప్రతి చిన్న, పసి ఆలోచనకు
ఏదో కొంత దివ్యత్వం తోడై ఉంటుంది.
అక్కడి సర్వం ఆత్మ వేణునాద నినాదమే!
అది జీవాత్మనుండి వెలువడే మెరుపులవల
వినిర్మల ప్రేమకు అది మహత్తరమైన ఆకర్షణ
ఆ ఆరాటం, ఆరాధన పరమాత్మ రాకను
సన్నిహితం, మధురంచేసి అద్భుతంగా మారుస్తాయి.
దాని సుస్థిరతకు అమరత్వమే ఉపాదేయం
దాని సుస్థిరత్వం, మాధుర్యం, ఆకర్షణ, శాశ్వతత్వం
అన్నీ బ్రహ్మానందానికి కాంతిమయ సోపానాలే.
దివ్య ప్రజ్ఞతో, ప్రాభవంతో నిర్మితాలైన దేహాలు
ఆత్మను ఆత్మలతో సన్నిహితం చేయ వేగిరపడతాయి
బాహ్యదృష్టికి, స్పర్శకు ప్రబుద్ధమైన ప్రతిచర్య
హృదయానందానుభూతిని ప్రతిబింబిస్తుంది.
మహత్తరమైన ఆలోచనలు ఆత్మానందం కలిగిస్తాయి
జీవుడు పొందే బ్రహ్మానందంలోని వాడి, వేడి శాశ్వతం.
ఇక్కడ గతించేదంతా, అక్కడి అనంత సౌందర్యంలో
ప్రవిమల ప్రేమలో, ఆత్మ తేజస్సులో శాశ్వత మవుతుంది.
పరిమితకాలం దివ్యశాసనాన్ని ఔదలదాల్చి

దివ్యదృష్టి అమరరూపాలను ఆశ్రయిస్తుంది
కాలం అన్నది పరమాత్మ కప్పుకున్న ముసుగు
ఆత్మలోని సజీవ శిలనుండి శిల్పరూపం దిద్ది
అనంత సాగర తీరాలపైన రమణీయంగా
కమనీయ వాస్తవానికి వేసవి విడిది నిర్మించాడు.

ఆధ్యాత్మిక మండలాల్లోని వైభవానికి భిన్నంగా
తత్సమాన శక్తులు, తద్విరుద్ధ శక్తులు ప్రజ్వరిల్లి
ఆ వైభవంపైన నీలినీడలు పరచి, అది అంతా
అనుమానాల మయమైనట్లు రాణించకుండా చేస్తాయి.
ఆ ప్రత్యేక పథకంలో రెండు విరోధ శక్తులున్నాయి
తనలోనే వున్న ఆత్మను తెలుసుకోలేని ప్రపంచం
అస్తిత్వానికి, మనుగడకు కారణాలు అన్వేషిస్తుంది.

తాను తయారుచేసిన లోకం గురించి తెలియని ఆత్మ
భౌతిక పదార్థం ముసుగులో జీవ రహితంగా ఉంటూ
స్వతంత్రించి, బయటపడి ఆధిపత్యం వహించాలను కుంటుంది
ఇవి అన్నీ ఒకే వైవిధ్యానికి గట్టిగా ముడిపడ్డవి
అయినా ఆ విభిన్న రేఖలు ఎన్నటికీ కలుసుకోవు.
మూడు శక్తులు దాని వక్ర గమనాన్ని శాసిస్తుంటాయి.
మొదటిది అజ్ఞాతంగా వుండే ఒకానొక ప్రబలశక్తి
మధ్యన ఉన్నది రూపుదాల్చిన ఆత్మవేదన
చివరిది జీవితాన్ని అలక్ష్యంచేసే నిశ్చలత

మమత, అనురాగం లేని ఒక నిస్తేజగాథ
సందేహాస్పదంగా నున్న మనస్సుకు సత్యాన్ని అందిస్తుంది
అవివేకం మహాశక్తిగా, తనపాత్ర తాను ధరించి
ముగింపులేని ఆమె కథను నమోదు చేస్తుంది.
అవసరం, అవకాశం చేయి చేయి కలిపినప్పుడు
అంధకారం నుండి జన్మించిన విచిత్ర జీవికి
జగన్మాత పథకంలోని మార్మికత అభివ్యక్తమైంది.

ఆ అజ్ఞానమే మన పరమ గమ్యాన్ని మరుగు పరుస్తుంది,
ప్రాపంచిక శృంఖలాల నుండి తప్పించుకొనకుండా
ఒక మహాద్భుత పరమ సత్యం యొక్క మహత్తుల్ని
అది ఆదిలోనే త్రుంచి వేస్తుంది—
అరూప శూన్యంలో తన సౌందర్యాన్ని వృథాపరచి
అగోచరమైన రహస్యంలో దాన్ని లయించి
ప్రపంచవిధి నెరవేరకుండా వదలివేస్తుంది.

అయినా, ఒక భావం జీవుని మహత్తర స్వప్నమై
పరిభ్రమించే మానవ మేధలో ఒక నీరవ చిత్రణమై
పాత సృష్టి నుండి కొత్త సృష్టి తల ఎత్తుతుంది
నిశ్చలంగా నున్న విజ్ఞానం బహిర్గత మవుతుంది
అణగి మణగి వున్న సౌందర్యం స్వర్గంగా భాసిస్తుంది
సుఖదుఃఖాలు రెండూ సచ్చిదానందంలో లయిస్తాయి
కడకు అశరీరవాణి వినిపిస్తుంది
పృథ్వీపైన పరమాత్మ ప్రజ్ఞ ప్రభవిస్తుంది
ఈశ్వరలీలలు కాలానుగుణంగా నర్తిస్తాయి.

అది అంతా ఒక మహాశక్తి కల్పించిన భ్రమ
అది భ్రమలవల్ల ఏర్పడే అనవసర ఆర్భాటం
చూడడానికి నిశ్చలంగా, ఆత్మలో ఏకమైనట్లు తోస్తుంది
తాను గమనిస్తున్న నిరర్థక నాటకం పట్ల అనాసక్తత
సాగిపోతున్న జన ప్రవాహాన్ని, అనూహ్యంగా
అంతం చూడాలన్న నిరీక్షణ కనిపిస్తుంది.
అతను రేపటి ప్రపంచం బదులు తానున్న లోకాన్నే చూచాడు
అక్కడ చూచి, అనుభవించిన దానికన్న దివ్యత్వం అనుభవించాడు.
ఎక్కడో చైతన్యానికి దూరంగా కడపటి అంచుపై
ఈ భూగోళం అస్థిరంగా, అత్యల్పంగా కనుపించింది
గతించిన స్వప్నం తాలూకు ముద్ర దానిపైన
ఆత్మ ధరించిన రూపం తాలూకు దుర్బల ముద్ర అది.

అతని శరీరం మార్మిక స్వప్నాల్లోకి జారిపోయింది
తనకే అది కొత్తగా, క్రీనీడగా కనుపించసాగింది
ప్రపంచం కడు దూరంగా, కళావిహీనంగా, మసక కానట్లు తోస్తుంది.
ఆత్మ పరమాత్మలు మాత్రమే వాస్తవాలు అనిపిస్తాయి.
ఒకప్పుడు ప్రేమించి, అనుభవించిన విషయ సుఖాలు
వేదనామందిరాలుదాటి స్మృతులుగా అతనిని చేరాయి.
ఒకప్పుడు తనదే అనిపించిన ఆ పిలుపుకు
ఒకానొక పరబ్రహ్మాంశ నిగూఢంగా సమాధాన మిచ్చింది.
అక్కడ శాశ్వతమైన అనంత ఏకత్వమే వుంది
అది తన దృష్టికి అగోచరమైన విధంగా
అంతరంగ సాగరాలలో మునిగి వుంటుంది,
నిస్తేజమైన భౌతిక లాలసలో దాగి, ఈ
ప్రాపంచిక అజ్ఞానాన్ని సుస్థిరంగా కాపాడుతుంది.

తన శక్తిలోని విశ్వవ్యాపకత్వాన్ని మథ్యపరచి
తన ఆత్మదైన విశ్వజ్ఞత్వాన్ని పదిల పరచి
ఆత్మ బీజాన్ని అనిశ్చితత్వంలో ప్రతిష్టించి
తనదైన దివ్యత్వాన్ని, వైదుష్యాన్ని కోల్పోతుంది.
సర్వోత్కృష్టమైన సంకల్పానికి తానే ప్రతినిధి
అదే విజ్ఞానాన్ని అజ్ఞానంతో కరిగించి వేస్తుంది.
తప్పిదాల్ని, విచారాన్ని, బాధల్ని, మృత్యువును ఆమోదించి
అజ్ఞానాంధకారానికి తగిన పరిహారం చెల్లించి
ప్రకృతి పతనంతో భౌతికంగా విముక్త మవుతుంది.
భౌతిక పరమైన కఠోర అంధత్వంలోకి
తన ఆత్మ ఎందుకు పయనించిందో అతనికి తెలుసు.
వక్రమార్గంలో పయనించే దివ్యశక్తులలో భాగం పంచుకుని
తానుగా పరమాత్మను చేరుకోవాలని ఆశించాడు.
ఇప్పుడు అతనివి రెండు దేహాలు, ఒకటి విశాలం, సర్వ స్వతంత్రం
రెండవది, ఇక్కడి బాధలు యాతనలు అనుభవించేది

ఆ రెండు ప్రపంచాలను ఒక బంధం ముడి వేస్తుంది
కానీ దానికి అనుకూలత లభించదు, అది నిష్ఫల శ్రమ
అనంతమైన నిశ్శబ్దంలో సర్వం లయించిపోను
అతని హృదయం ఎక్కడో ఒంటరిగా చైతన్యవంతమై
అట్టడుగున నిశీథిలో వెలిగే దీపంవలె ఉంటుంది
బహిష్కరించబడినట్లు, ఏకాకిగా, అనశ్వరంగా
అధిక ఆత్మసంయమనంతో నిశ్చలంగా ఉంటుంది.
అతని హృదయం త్యాగమయమై, హృదయం నివేదనగా
ప్రగాఢమైన మార్మికారాధనతో నిండిపోయి
దూరంగా కనిపించే ప్రేమవైపు, వెలుగువైపు మొగ్గుతుంది.
తన మూగ వేదనా ఫలితంగా లభించిన నిర్మల తేజస్సులో
తాను చూడలేని దివ్యశిఖరాలకై వెదుకుతుంది.
తాను వదలి రాలేని అగాథాలనుండి తపన చెందుతుంది.

అదృష్టవశాత్తు ఏర్పడిన నిశ్చల సమాధి స్థితిలో
స్వతంత్రస్థితికి, పతనస్థితికి మధ్యన ఎక్కడో
ఈశ్వర తేజస్సుకు, ప్రాపంచిక తమస్సుకు నడుమ
ఆరాధన ఒక్కటే తన ఏకైక పరమార్థంగా
సచ్చిదానంద స్థితి ఒక్కటే పరమగమ్యంగా
ఎవరూ భాగం పంచుకొనని, ఆనందాన్ని కాదని
ప్రశాంతి కొరకే ప్రశాంత జీవనం అన్న సూత్రాన్ని త్యజించి
హృదయ పూర్వకంగా జగన్మాత వైపు తిరుగుతుంది.
ఆ ఏకాంత, స్వాప్నిక మాధుర్య స్థితి
ద్వారాలు మూసిన ధ్యాన మందిరం వలె ఉంటుంది
అక్కడ ఎటు చూచినా, నిర్మల ధవళ రజతచ్ఛాయలే
ఒకే ఒక్క నిశ్చల, నిర్మల కిరణ తేజస్సు కనిపిస్తుంది.
అది అగోచర పరబ్రహ్మకై నిర్గుణోపాసన
హృదయాంతరాల శాంతి సుస్థిరమైనప్పుడు
ఇతర ప్రపంచం నిశ్శబ్దంగా, శూన్యంగా మారిపోతుంది.

అప్పుడు పరంలోని సత్యం అవగత మవుతుంది.
యోగ నిద్రలో శరీర భాగాలన్నీ జడమై పోతాయి
ఒక మహాశక్తి క్రమక్రమంగా శరీరంలో ప్రవేశిస్తుంది.
అది ప్రాపంచిక నేరాలను, విషాదాలను భరించగలదు.
సృష్టిలోనే దీర్ఘకాలంగా జరుగుతున్న జాప్యాన్ని సహించి
జగన్మాత రాకకై అనేక సంవత్సరాలు నిరీక్షించి
చివరకు ప్రపంచానికి, మానవజాతికి అంకితమైన,
స్థితిలో ఇప్పుడు జగన్మాతను ఆహ్వానించడం జరిగింది.

అంతర్హితం కావడం వల్ల జ్వలితాగ్ని చల్లారదు
లో సృష్టి మనస్సులోని శూన్యాన్ని, సంకల్పాన్ని భర్తీ చేస్తుంది,
ఆలోచన నశించినప్పుడు మహాశక్తి ప్రవర్ధ మవుతుంది.
ప్రపంచంలోని ప్రతికూల శక్తుల మధ్యన, నిర్మల
బ్రహ్మానంద కీలకమైన సచ్చిదానందం ఏర్పడుతుంది.
అదే జీవితంలో ఏర్పడిన జాగాలను భర్తీచేస్తుంది

అదే ప్రశాంత ప్రార్థన పరమాత్మను చేరుతుంది.
ఆ మహానిశ్శబ్ద శూన్యాలను దాటి, తన ఆశల
అడుగుల సవ్వడి వినిపిస్తుందేమోనని చూస్తుంది-
ఆత్మ నిశ్చలమైనపుడు, పరబ్రహ్మ సందేశం
ఒక ఆజ్ఞగా తనను చేరుతుందని ఎదురుచూస్తుంది.

పర ప్రసాదం

ఇప్పుడు యోగికి తన హృదయమే రంగస్థలం- హృదయ మందిరం లోని జాగాలన్నీ జ్యోతిర్మండలాలే - వెలుగు మయాలే. అశ్వపతి తన లోకి చూడసాగాడు. ఓహ్, ఎంత పవిత్ర స్పందన! ఎంతటి దివ్యానుభూతి అది! మనస్సు, శరీరం, జీవం - అన్నీ బ్రహ్మానంద స్థితిలో ఒక్కటైనాయి. ఇప్పుడతను మామూలు మనిషికాడు, మరో తేజోరూపంతో, తేజశ్శరీరంతో, ఈ ప్రపంచాన్ని, భౌతికతను అధిగమించి పైకి పోసాగాడు.

భూమిపైన మృత్యువు నీడ పడుతూనే వుంది. భూమి మృత్యువును జయించవలసి వుంది. మనిషికి బాధలు, యాతనలు తప్పడం లేదు. మనిషి చైతన్యవంతుడవుతున్నాడు, నిజం. కాని, మృత్యువును జయించడం లేదు. విధిని మార్చడం లేదు: మనిషి అటు పరమాత్మకు ఇటు పశు స్థితికి మధ్యగా ఉండి పోతున్నాడు. చీకటి వెలుగుల మధ్య తచ్చాడు తున్నాడు. ఈ అనంత నాటకంలో తన పాత్ర ధరించి, విక్రమిస్తున్నాడు. 'పరిణామం' ఎంత వరకు సాగుతున్నది? పరిణామంలో తనపాత్ర ఎంతవరకు నిర్వహిస్తున్నాడు? అందుకే జగన్మాతకు తన హృదయాన్ని నివేదించుకున్నాడు. చేసిన పనులే మళ్లీ మళ్లీ చేస్తూ ఎంతకాలం జీవించడం!

అశ్వపతి ఉషస్సుకోసం ఎదురుచూడసాగాడు. జగన్మాతను పృథ్విపై అవతరించమని, జగత్తును, మానవాళిని ఉద్ధరించమని విన్నవించు కున్నాడు. ఈ చీకట్లను చీల్చి, లోకాన్ని వెలుగుతో నింపడానికి జగన్మాత అవతరించక తప్పదు.

అతనికి అమ్మ మాట ఇచ్చింది. ఆమోదం అందించింది. జగన్మాత యిచ్చిన హామీతో ఈ లోకానికి తిరిగివచ్చాడు, ప్రపంచ నైజంలోకి, ప్రవృత్తిలోకి వచ్చిచేరాడు. కాని ఏం జరిగింది? మళ్ళీ కథ మామూలే! ఆ దివ్యదర్శనం స్మృతిమాత్రంగా తనలో మిగిలింది. ధ్యానంలో అన్ని

బ్రహ్మంగారి జీవితచరిత్ర రాస్తున్నాడు. ఆయన దానిని తెచ్చి మా మేనమామగారిచేత దిద్దించుకునేవాడు. నేను సెలవులకు వెళ్లినపుడు ఆ పని నా కప్పగించారు. అప్పటికే కథలు, నవలలు రాస్తున్నవాడిని కావటాన నాపేరు ప్రసిద్ధమైంది. ఆయన నన్ను పట్టుకున్నాడు. 'బ్రహ్మంగారి జీవిత చరిత్ర' రచనలో కొన్నిరోజులు సహకరించాను. దాంతో నాకు యోగసిద్ధులపట్ల ఆసక్తి కలిగింది. ఆసనాలు, ప్రాణాయామం నేర్చాను. ఇంట్లో, ఎంతగా దెబ్బలాడుకున్నా మా తల్లిదండ్రు లిద్దరూ అలా ధ్యానంలో కూర్చునేవారు. ఫలితం నాకు తెలియదు. వారిగురువు హనుమయ్యగారు వచ్చినపుడు అనేకమంది శిష్యులు వస్తుండేవారు. అదేదో పంచాక్షరీ మంత్రం అని, తారకం అని చెప్పుకునేవారు. 'ఓం నమః శివాయ' అనేదే పంచాక్షరీ మంత్రం అని బ్రహ్మంగారి జీవిత చరిత్ర వల్ల తెలిసింది. ఆ పుస్తకం రాసిన నాగభూషణంగారు యోగి కాదు, తాపసి కాదు. ఉత్త భక్తుడు మాత్రమే. మా నాయనగారి గురువు హనుమయ్యగారు బ్రహ్మంగారి మఠం ట్రస్టీలలో ఒకరు. నాకు రవ్వంత ఆసక్తి కలిగిందిగానీ ఎవరినీ అడగలేదు. ఏవో చదివిన పుస్తకాలలో గ్రహించిందే. అర్ధరాత్రిపూట శ్మశానంలో కూర్చుని తపస్సుచేస్తే భేతాళుడు ప్రత్యక్షమై సిద్ధులు కటాక్షిస్తాడని. అలా ట్రయ్ చేద్దామనుకున్నాను. శ్మశానంలో రాత్రివేళ దయ్యాలు తిరుగుతుంటాయని అవి చంపేస్తాయని మిత్రులు భయపెట్టారు. చావంటే భయం ఏనాడో పోయింది. మానాన్నగారు భూతవైద్యుడు. ఆయనకు దయ్యాల్ని వదలించడం తెలుసు. ఆయన కొడుకుని కనుక దయ్యాలు నాజోలికి రావని, మానాన్నగారిని తలచుకుంటే అవి భయంతో పారిపోతాయని నావిశ్వాసం. మా ఇంటికి దగ్గరే రుద్రభూమి. రాత్రిపూట శవాలు కాలడం కనిపిస్తుంది. చూచి ఏనాడూ భయపడలేదు. కొన్నిరోజులు చీకటిపడ్డాక అలా శ్మశానంవేపు వెళ్లడం, లోపలకు వెళ్లడం, కాలే చితుల్ని గమనించడం అలవాటు చేసుకున్నాను. ఒక అమావాస్య రోజున అర్ధరాత్రి ముహూర్తం పెట్టుకుని శ్మశానానికి వెళ్లాను. అప్పటికింకా నాలుగు శవాల తాలూకు చితులు మండుతూనే వున్నాయి. ఆ నాలుగు చితుల మధ్యకు వెళ్లి పద్మాసనం వేసుకుని కూర్చుని, కళ్లు మూసుకున్నాను. గంట, రెండు గంటలు గడిచినా భేతాళుడు రాలేదు. అతని అసిస్టెంట్లు రాలేదు. దయ్యాలు కనిపించలేదు. కాటికాపరి ఓ నిద్రలేచినట్టున్నాడు అరుస్తూ వచ్చి, నన్ను తట్టి లేపాడు. సంగతి చెప్పాను.

"ఓరి పిచ్చిపంతులూ! అంత తేలిగ్గా సిద్ధులు వస్తే, రోజూ శ్మశానంలో వుండే నాకు ఎన్ని వచ్చివుండేవి. పో...పో.. ఇంటికి పోయి పడుకో"అన్నాడు. తర్వాత అటుగా వెళ్లినప్పుడల్లా నన్ను చూచి పలకరింపుగా నవ్వేవాడు. "ఏంపంతులుగారూ, భేతాళుడు ఏమైనా అగ్రసిచ్చాడా?" అని.

లోకాలు దర్శించగలిగి, జగన్మాత సాక్షాత్కారం పొందగలిగి తాను సాధించిందేమిటి? బయలుదేరిన చోటికే వచ్చిచేరటమా తపఃప్రయోజనం? భూమి గుండ్రంగానే వుంది! గుండ్రంగా తిరుగుతూనేవుంది.

అప్పుడు అకస్మాత్తుగా ఒక దివ్యస్పందన కలిగింది.
మహాశూన్యంలోని నిర్జీవ నిశ్శబ్దం నడుమ
అతి గంభీరమైన ఏకాంతంలో పరిచితమైన
అడుగుల సవ్వడివంటి శబ్దం కదలాడి
ఆత్మ అంతరంగాలలో వినిపించింది.

ఆ స్పర్శకు అతని ప్రత్యణువు ఆనందంతో పులకించింది
దాని ప్రభావం భౌతిక పరిధిని సమీపించగా
అతని హృదయం భవ్యహృదయానికి చేరువైంది
ఒక మాతృకరూపం అతని భౌతికస్వరూపాన్ని కప్పివేసింది.
ఆ సంస్పందన స్పర్శ నిశ్శబ్దాన్ని ఛేదించింది
ఆ అనుభూతిలో శరీరం, ఆత్మ ఏకమై
అవ్యక్త పరమానందంలో లీనమైనాయి
మనస్సు, శరీరం, జీవం తన్మయతలో కలిసిపోయాయి.
అమృత ధారలతో మత్తెక్కి మైమరచిన ప్రకృతి
మమతాను రాగాల మధురిమ ఆమెను చేరుకున్నాయి
మెరుపులై, వెలుగులై, అమృత వర్షంలో పునీతమై
అంతా చంద్రుని చేరాలని ఆరాటపడే అనంత సాగరమే.
అతని నరనరాన దివ్య నీరాలు నిండిపోయాయి
శరీరంలోని ప్రత్యణువు చైతన్యంతో మేల్కొన్నది
నరనరం ఆనంద జ్వాలలా మండిపోసాగింది
రక్త మాంసాలు సైతం మాధుర్యాన్ని నింపుకున్నాయి.
శూన్యాలైన హృదయకుహరాలు ఆనంద నిష్యందాలై
జగన్మాత పదసవ్వడికే పులకించ సాగాయి.
ఆనంద పారవశ్యంలో స్తుతి గీతాలు ఆలపించాయి
మగతగా, మత్తుగా, నిశ్చలంగా శరీరం మారినా

ఏవో సిద్ధులుంటాయి, వాటిని సాధించవచ్చు అని ఓ నమ్మకం నాకు. ఒకరోజు పొద్దున్నే కాలవకు స్నానానికి వెళ్లాను. శని ఆదివారాలలో అలా కాలవ స్నానానికి వెళ్లే అలవాటు చిన్నతనం నుండి వుంది. కోపల్లెలోను పెద్దకాలువ లున్నాయి. ఈత వచ్చు. ఆరోజున కాలవ ఎగువకు వెళ్లేసరికి, కాలవలో ఒక గడ్డపాయన శవాసనంలో తేలుతున్నాడు. వినయంగా నమస్కరించాను.

"నీ పేరేమిటి?"

చెప్పాను.

"ఆ పేరు మార్చుకో. రామకృష్ణ కాంబినేషన్ బాగలేదు. నీకు మంచిది కాదు. నీవు ఏమైనా రాస్తుంటావా?"

అవునన్నాను.

"ఏదైనా చిన్నదిగా పెన్‌నేమ్ పెట్టుకో. పైకొస్తావు."

"మీరు నీళ్లమీద అట్లా ఎలా ఉండగలిగారు?"

" అది శవాసనం. ప్రయత్నిస్తే నీవూ వేయగలవు. అది ఒక యోగాసనం. అలాగా నీళ్లపైనే కాదు ... నీళ్లలోపలా ఉండవచ్చు. అదీ యోగమే. అలవాటు చేసుకో. మంచి జరుగుతుంది." అన్నాడు.

ఆరోజు నుండి నీళ్లపైన శవాసనం వేయడం వచ్చింది. అలా ప్రవాహంలో తేలివెళ్లేవాడిని రెండు మూడు ఫర్లాంగులు. గమ్మత్తు ... మునిగిపోలేదు. శరీరం సగం నీటిలో వుండేది. సగం పైకి తేలేది. శ్వాస బంధించేవాడిని. శ్వాసక్రియ సన్నబడినప్పుడు శరీరం బరువును కోల్పోయి నీటిపైకి తేలుతుంది. అలా గాలిలోకి తేలిపోవచ్చు కదా!

మా అమ్మ కుంభకం చేస్తుంది. ధ్యానంలో వున్న మనిషి గాలిలోకి లేస్తుంది. అలా పైకి వెడుతుంటే చూచేవారికి భయం వేస్తుంది. వారికి తెలీదు. సూక్ష్మశరీరం ఎక్కడికో పోతున్నట్టు అనిపిస్తుందిట.

నీళ్లపైన శవాసనం, పద్మాసనం వేసి, కాలం గడపడం అలవాటైంది. శ్వాస బంధించి, శరీరం బరువును పెంచి, నీటిలోపల చాలాసేపు ఉండగలిగేవాడిని. అవి పిల్లచేష్టలు, కుర్రతనపు సరదాలు.

అంతకుముందున్న ఆత్మహత్య ఆలోచనలు తగ్గిపోసాగాయి. ప్రపంచంలో పుట్టింది అనుభవించడానికి. మనిషి పుట్టుకకు ఒక ప్రయోజనం వుంటుంది. అది మనకు తెలియకపోవచ్చు. తెలుసుకోడానికి ప్రయత్నించం. తనని తాను తెలుసుకున్నవాడే మనిషి. తన ఆత్మను అంతర్దృష్టితో దర్శించ గలిగినవాడు మనీషి. ఏమో నాలాంటి సామాన్యుడు మనిషిగా బ్రతికితే చాలు.

అప్పట్లో సినిమాలు చాల తక్కువగా వచ్చేవి. హిందీ సినిమాలు వస్తుండేవి. సినిమాతారలంటే జనానికి అభిమానం ఏర్పడసాగింది. అంతవరకు సినీమాల్లో చేరడం అంటే చెడిపోయినట్లే. నాటకాలలో వేషాలు వేయడాన్ని సభ్యకుటుంబాలు అంగీకరించేవి కావు. ఆడపిల్లల్ని అసలు అటు చూడనిచ్చేవారు కారు. కొత్త నటీనటుల కోసం దర్శకులు, నిర్మాతలు అన్వేషించేవారు. మావూళ్లో ఆంధ్రనాటక కళాపరిషత్ వారు నాటకపోటీలు పెట్టారు. తెనాలి అంటే పౌరాణిక, చారిత్రక నాటకాలకు ప్రసిద్ధి. వృత్తి కళాకారులు ఎక్కువ. ఔత్సాహిక నాటకాలకు ప్రోత్సాహం, ఆదరణ తక్కువ. వృత్తి కళాకారులైన నటీనటులు సినిమాలకు పనికిరావడం లేదు. పులిపాటి, దొమ్మేటిలాంటి వారు వెనుతిరిగి వచ్చారు. మా ఊళ్లో సినిమా నటీనటులు ఎక్కువ. 'బాలనాగమ్మ' సినిమాలో మాయాఫకీరు వేసిన డాక్టరు గోవిందరాజుల సుబ్బారావు, కాంచనమాల బాగా ప్రసిద్ధులు. లక్ష్మీరాజ్యం ఆ ఊరి ఆవిడ. ముదిగొండ లింగమూర్తి, వంగర, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, కస్తూరి శివరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జగ్గయ్య తెనాలిలోనే నాకు పరిచయమైన కళాకారులు.

నాటక పోటీలకు సినిమా దర్శకులు బి.ఎన్.రెడ్డిగారు, పి.పుల్లయ్యగారు, ఇంకెవరో వచ్చారు. ఆ సందర్భంలోనే సావిత్రి నాట్యప్రదర్శన యిచ్చింది. చాలామందిని వారు ఎన్నిక చేసుకున్నారు. ఒక విద్యార్థిగా కాక, రచయితగా నాకు గుర్తింపు ఉండేది. స్టూడెంట్స్‌లో స్టూడెంట్‌ను. నాలో విద్యార్థి అణగిపోయి, రచయిత బైట నిలిచేవాడు. కాలేజీలో ఆటల్లో, స్పోర్ట్సులో చాలా తక్కువగా పాల్గొనేవాడిని. కాలేజీ టైం అవగానే లెక్చరర్స్ అయిన రచయితలతో, కవులతో తిరుగుతుండేవాడిని. వారు నన్ను ఒక స్టూడెంట్‌గా చూచేవారు కాదు. క్లాసులో కూర్చుని వున్నంతవరకే విద్యార్థిననే భావన ఉండేది. ఆనాడు తెనాలిలో పుట్టి పెరిగినందుకు గర్వంగా వుండేది. "అచట పుట్టిన చిగురు కొమ్మయిన చేవ" అనిపించేది.

డిగ్రీ చదువులకు వచ్చేసరికి పిల్లలు యవ్వనంలో ప్రవేశిస్తుంటారు. కోరికలు కొత్త చివుళ్లు తొడుగుతుంటాయి. చూపులో ప్రేమ, నడకలో ఆకర్షణ, ప్రవర్తనలో మార్పు కనిపిస్తాయి. యువతీయువకులు ఒకరినొకరు ఆకర్షించాలని, అనుభూతులు పంచుకోవాలని, సుందరమైన అనుభవాలు కావాలని ఆరాటపడతారు. కో-ఎడ్ కాలేజీల్లో అందుకు అవకాశాలుంటాయి. హిందూ కాలేజీలో ఆడవాసన ఉండదు. లేడిహోప్‌లో మగగాలి వీచదు. ఆడ, మగల అనురాగానికి ఎ.సి. కాలేజీ వంటి కో-ఎడ్ కాలేజీలు నందనవనాలు. అక్కడ మెయిన్‌గేటు దాటితే లోపల ప్రపంచమే వేరు. అదొక రంగుల హరివిల్లు. రతీమన్మథులు చెట్లచాటున దాగి తొంగిచూస్తున్నట్లుండేది. ఎంత అస్ఖలిత

బ్రహ్మచారి అయినా అక్కడ కాస్త చలించకపోడు. వ్రతభంగం కాకతప్పదు. డిగ్రీ క్లాసుల్లో పిలకలు పెట్టుకుని వచ్చేవారుండేవారు. పరమచాదస్తులు. అమ్మాయిల దృష్టి ముందుగా వాళ్ల గుళ్లపైన పడేది. పిలకలు పట్టుకుని ఆడించేవారు. వీరేమో అసలు 'కిరస్తానీ' అమ్మాయిలవైపు చూస్తేనే పాపం తగిలినట్లు ప్రవర్తించేవారు. ఎన్నిరోజులు మడికట్టుకుంటారు. రెండు సంవత్సరాల చదువాయె! వ్రతభంగం కాకతప్పదు. ఎందరో మేనకలు, కొందరే విశ్వామిత్రులు. తపోభంగం చెంది ప్రేమలో పడకతప్పదు. అనకూడదుగానీ, ఆ కాలేజీలో ప్రేమవ్యవహారాలు బాగానే సాగేవి. లెక్చరర్లే గరల్స్‌స్టూడెంట్స్‌ను ప్రేమించేవారు, కథలు నడిపేవారు. విద్యార్థుల్లోను అసూయ తక్కువే. ఎవరి అదృష్టం వారిది. చొరవ, చనువు తీసుకుని ప్రోగ్రెస్ అయినవాడి పంట పండినట్లే. కాలేజీ కాంపస్‌లోకి చూస్తే రంగురంగుల చీరలు. పూలు పొదిగిన కురులు, పూలతోట అనిపిస్తుంది. తెగిన దండలోంచి పూలు రాలి చిందరవందరగా పడ్డట్లు, కాంపస్ నిండా రంగులే. ఏ చెట్టు చాటున చూచినా జంటలు, కిలకిలలు, పకపకలు.

మాకు బైబిల్‌క్లాసు తప్పనిసరిగా వుండేది. ఒకసారి బైబిల్‌పై పోటీలో నాకు ఫస్టు ప్రయిజ వచ్చింది. ఇంగ్లీషు లెక్చరర్లు వాళ్ల చర్చికి ఆహ్వానించారు. ఆ చర్చి కేవలం ఫారినర్స్‌కే పరిమితంగా వుండేది. అమెరికన్, ఇంగ్లీషు కుటుంబాలు అక్కడ చాలా ఉండేవి. వారికోసం కట్టించుకున్న చర్చి. ఆదివారం చర్చిలో ప్రార్థనలకు వెళ్లడం ఒకవిధంగా క్రెడిట్, మరొకవిధంగా డిస్‌క్రెడిట్. అప్పుడపుడు ఫ్రెండ్స్‌తో కలిసి, హాస్టల్లో భోజనం చేసేవాడిని. ఇవన్నీ నేను భ్రష్టమైపోవడానికి, అయినవారికి దొరికిన కారణాలు. ఒక ముస్లిం మిత్రుడుండేవాడు. ఎస్.ఎస్.లాల్ అని సినీమాల్లో పెద్ద కెమెరామన్ అయినాడు తర్వాత. మాబాచ్‌లో పైలాపచ్చీసుగా, కాస్త విప్లవభావాలతో ఉండేవాడు సి.వి.యన్.ధన్ (పూర్వనామం విశ్వనాథం).

ఆ బృందావనంలో కృష్ణావతారం తాల్చకుండా ఉన్నది నలుగురం. అయినా నాకు చాలామంది అమ్మాయిలతో స్నేహం వుండేది. అసోసియేషన్ సెక్రటరీని కదా! మీటింగులు, డిబేట్లు ఏర్పాటు చేయాలి. సాంస్కృతిక వ్యవహారాలు చూడాలి - రచయితను కావడం వల్లనేమో అమ్మాయిలు నేనంటే యిష్టపడేవారు. ఎలాగో కల్పించుకుని పలకరించి, స్నేహం చేసుకోవాలనుకునేవారు. ప్రేమలో పడేంత ధైర్యం, ఆర్థికస్తోమత నాకు లేవు.

జీవితానికి ఒక ప్లాను వేసుకోవడం, లేదా ప్లాను ప్రకారం జీవితాన్ని నడుపుకోవడం నాకు తెలీదు. అందుకోసం ఎన్నడూ ప్రయత్నించలేదు. ఎప్పుడు ఏది జరిగితే దానిని

ఆమోదించడం అలవాటైంది. కొందరికి అన్నీ అమరివస్తాయి. అనుకున్నట్లు జరుగుతాయి. కోరినవన్నీ సమకూరుతాయి. వారు అదృష్టవంతులు. నాలాంటి వాడికి ఏదీ అనుకున్నట్లు జరగదు. ఏ కోరికా కలగకుండా జాగ్రత్త పడటమే జరుగుతుంది. ఎంతో కష్టపడితే తప్ప, నష్టాలు భరిస్తేతప్ప రవంతఫలితం, సుఖం కనిపించవు. ఇవి దురదృష్టవంతుల లక్షణాలు. నాది ఖచ్చితంగా రెండవజాబితాలోకి వచ్చేజీవితం. అందుకే ఎప్పుడూ అత్యాశలకు పోలేదు. అవకాశాలకోసం అర్రులు చాచలేదు. అదృష్టాన్ని వెతుక్కుంటూ పోలేదు. ఉన్నంతలో తృప్తిపడదాం అనిపించినా తృప్తిపడలేం. ఎంచేతంటే ఆ లభించింది కనీసావసరాలకు సరిపోదుకనక. కనుక ఎప్పుడూ కాస్తలోపం, కాస్త అసంతృప్తే మిగిలింది.

తెలుగుసాహిత్యం చదవకుండా ఇంగ్లీషు లిటరేచర్ చదవటం నా అదృష్టం. మంచి తెలుగుకథకులంతా ఇంగ్లీషు చదువుకున్నవారే. అమరేంద్ర, బుచ్చిబాబు, కొడవటిగంటి, గుడిపాటి వెంకటచలం, ధనికొండ - వీరు నాకు అభిమాన రచయితలు అప్పట్లో. బుచ్చిబాబు, అమరేంద్రలతో వ్యక్తిగతంగానూ పరిచయం వుంది. సోమర్‌సెట్‌మాం లాంటి ఇంగ్లీషు నవలాకారుల్ని నాకు రుచిచూపించింది బుచ్చిబాబుగారు. అప్పుడు నా ఒరవడి మారింది. కథపై నాసంతకం మారింది. తెలిసిన మనుషుల్లోంచి పాత్రలు పుట్టుకొచ్చాయి. చూచిన సంఘటనలు మలుపు తిరిగి కథలైనాయి. కేవలం ఊహించి, కల్పించిన కథలు రాయడం నాకు చేతకాలేదు. యదార్థతలోంచి పుట్టినవే కథలు, పాత్రలు.

బి.ఏ.లో మాకు అరవిందయోగి 'విక్రమోర్వశీయం' నాటకం పాఠ్యగ్రంథం. అప్పుడే అరవిందుని భావంతో పరిచయం ఏర్పడ్డది. లైబ్రరీలో దొరికినన్ని అరవింద గ్రంథాలు చదివాను. రవీంద్రుని 'గీతాంజలి', ఇతర గీతాలు, నాటకాలు చదివాను. మొత్తంపైన నా అభిరుచి రొమాంటిక్ రచనలపైగాక, మిస్టిక్ రచనపైకి మళ్లింది. అందుకే రవీంద్రుడు, అరవిందుడు, థామస్‌గ్రే, మిల్టన్ లాంటివారిని బాగా అధ్యయనం చేశాను. అరవిందుని జీవితం నన్ను ఆకట్టుకుంది. నాలో కొత్త ఆలోచనల్ని రేపింది. ఆయన ప్రతిపాదించిన 'సూప్రామైండ్'ను సాధించడం అన్నది ఒక కల అయింది.

మనకంటూ జిజ్ఞాస ఉండాలే కానీ, దాన్ని తీర్చిదిద్ది ఓ చక్కనిమార్గంలో పెట్టే అవకాశాలు జీవితంలో చాలా వస్తుంటాయి. అదృష్టం ఒక్కసారే తలుపుతడుతుందని రవీంద్రుడు చెప్పినది నమ్మలేదు. అనేక అవకాశాలు వస్తాయి. జీవితం అనేక మలుపులు తిరగాలి. స్తబ్ధంగా సాగకూడదు. ఎత్తుపల్లాలు, ఎగుడుదిగుళ్లు, అనుకోని మలుపులు ఉంటేగాని జాగ్రత్తపడం. ఆ జాగ్రత్తే 'జాగృతి' అవుతుంది... సద్వినియోగపరచుకుంటే.

ఇక్కడ మా తండ్రిగారి తాత్వికత నాకు కాస్త మార్గదర్శకమైంది. ఆయనకు జీవితంపై వుండే నిరాసక్తత నాకు లేదు. వైరాగ్యదృష్టి నాలో అసలు లేదు. ఇదివరలో నైరాశ్యం ఉండేది. చచ్చిపోవాలన్న కోరిక ఉండేది. ఇప్పుడు అవి పోయాయి. ఏదో సాధించాలని కాకపోయినా జీవితానికి ఒక ప్రయోజనం వుంది. దాన్ని తెలుసుకుని నెరవేర్చాలి. చాలాకాలంగా పనీపాటు లేకుండా వున్న మానాన్నగారికి సంపాదనపై దృష్టి మళ్లింది. మళ్లీ పనీపాటు మొదలుపెట్టారు. సంసారం కోసం సంపాదించాలన్న బాధ్యత తెలిసింది.

నాపేరు 'శార్వరి'గా అప్పటికే స్థిరపడిపోయింది. కాలేజీలో లెక్చరర్లు ఆపేరుతోనే పిలిచేవారు. రిజిస్టరులో మాత్రం అసలు పేరు వుండేది. ఒకసారి జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని హోదాలో గుంటూరు వచ్చారు. జిల్లా కలెక్టరు కార్యాలయం ప్రాంతంలో పెద్ద బహిరంగసభ జరిగింది. నేను, మిత్రుడు ఎస్.వి.ఎల్. నరసింహారావు (ఇప్పుడు తను ఎంఎల్‌ఏ) వెళ్లిచూచాం. ఈ ఎస్‌విఎల్‌కు నాకు గత నలభై సంవత్సరాలుగా మైత్రి కొనసాగుతూ వుంది.

మానాన్నగారి వద్ద ఒక పులిచర్మం, దండకమండలాలు, పెద్ద రుద్రాక్షమాల ఉండేవి. ఆయన ఆమధ్యన మహాకాళీ ఉపాసన ప్రారంభించారు. అది గురువు నుండి వచ్చింది కాదు. స్వంతం. పెద్ద కుంకుమబొట్టు, ఒంటినిండా విభూతి - సాక్షాత్తు రుద్రుడివలె, ఒక్కోసారి భేతాళ మాంత్రికునివలె ఉండేవారు. నవరాత్రులలో ఉపవాసాలు చేసి, కాళీపూజలు భయంకరంగా నిర్వహించేవారు. అయన దగ్గరకు వెళ్లడానికే వణుకుపుట్టేది. అంతటి మహాభక్తుడు,ఉపాసకుడు, డబ్బును లెక్కచేసేవాడు కాదు. మరీ దరిద్రం లేకపోయినా కలవారి క్రింద లెక్క కాదు. ఆధ్యాత్మికసంపద లున్నచోట ధనసంపదలు చేరవేమో!

అప్పుడే ఒక గొప్ప వ్యక్తితో పరిచయం అయింది. బి.ఎ. ఆనర్సు పూర్తి చేసి వచ్చాడు. మా బంధువు శ్రీరాం భుజంగరాయశర్మ. ఎంతో మితభాషి. ఆచితూచి మాట్లాడేవాడు. ఆరడుగులపైమాట. మంచి విగ్రహం, స్ఫురద్రూపం. నన్ను కలుసుకోడానికి మా ఇంటికి వచ్చాడు. నేను పద్యాలు బాగా రాస్తానని ఆయనకు చెప్పారుట .. నన్ను అభినందించడానికి వచ్చాడు. నా పద్యాలు విన్నాడు. మెచ్చుకుని, బుజం తట్టి "ఆంగ్లసాహిత్యం బాగా చదువు, అది అపార పారావారం. అందులోని నిధినిక్షేపాలను సొంతం చేసుకో. వచనం మంచిగా రాయి" అన్నాడు.

శ్రీరాం భుజంగరాయశర్మ తర్వాత జీవితంలో ఎన్నో మెట్లు ఎక్కారు. అనేక నృత్యనాటకాలు సృష్టించి, కూచిపూడి నృత్యానికి శ్రీ వెంపటి చినసత్యంగారికి తోడై

అపూర్వసోదరులైనారు. వారితో స్నేహం మొన్నమొన్న వారు కాలం చేసేవరకు కొనసాగుతూనే వుంది. ఒక సాహితీమూర్తి ఎలా జీవించాలో, ఎంత నిరాడంబరంగా ఉండాలో, సాహితీవిలువల్ని, జీవిత విలువల్ని ఎలా కాపాడుకోవాలో వారిని చూచి తెలుసుకోవచ్చు. అచ్చు రవీంద్రనాథ్‌టాగూర్ వలె ఉండేవారు. సభలకు, సన్మానాలకు, సత్కారాలకు కడుదూరం. తృప్తికరమైన జీవితం. కీర్తిప్రతిష్టలకోసం ప్రాకులాడకపోవడం, అయినా గొప్ప సాహితీవేత్తగా, ఆదర్శజీవిగా మన్ననలు పొందాడు. మా మేనమామ కొండూరు వీరరాఘవాచార్యులుగారిని ఈ భుజంగరాయశర్మగారిని పోల్చుకుంటే ఉత్తర దక్షిణ ధృవాలంత దూరం కనిపించేది. "నీవు సొంతంగా రాయి. ఏకొంచెం రాసినా చాలు. ఆ రాసింది గొప్పగా వుండాలి. నీవు రాసిన 'రచన'లో నీవే కనిపించాలి. ఇతరుల ముఖాలు, ఇతరుల ప్రతిభ, ఇతరుల గొంతు నీలో కనిపించకూడదు" అని శ్రీరాం భుజంగరాయశర్మగారు యాభైఏళ్ల క్రితం నాలోని చిన్ని రచయితకు యిచ్చిన సందేశం, అందించిన చైతన్యం. ఇలా ఎందరో ఆనాడే నాతొలి జీవన సంధ్యలో మంచిమాటలు నేర్పారు. మంచిబుద్ధులు నేర్పారు. నడవడిక నేర్పారు. వారందరికీ కృతజ్ఞతలు. ఎందరెందరో అజ్ఞాత మహాత్ములు. అందరికీ సుమనస్సులు!

అధ్యాపకత్వంలో ఆరేళ్లు

అప్పటికే నా వయస్సు ఇరవైరెండు.

మధ్యలో రెండేళ్లు డుమ్మాకొట్టడంవల్ల ఇరవై యేళ్లకు డిగ్రీ పూర్తి చేయలేక పోయాను. ఇప్పుడున్న పోటాపోటీ అప్పట్లో ఏరంగంలోనూ ఉండేది కాదు. సాదాసీదాగా జీవితాలు గడిచిపోయేవి. ఎవరిలోనూ టెన్షన్ కనిపించేది కాదు. దేశానికి స్వతంత్రం వచ్చిన ఫలితం అది. నేను ఎప్పుడు పుట్టానో తెలియదు. నా జాతకం నాకు తెలీదు. అసలు జాతకాలంటే ఏమిటో తెలియదు. పుట్టినే తేదీ తెలియనివాడికి వారఫలాలు చూచుకునే అవకాశం ఉండదు. జాతకం తెలుసుకోవాలన్న ధ్యాస లేదు. కాస్త కమ్యూనిజం వాసన మిగిలి వుంది. ఇంగువ కట్టిన గుడ్డ. అసలు ఏఒక్కటీ మనల్ని విడిచిపోదేమో! ఒకప్పుడు బలంగా నాటుకున్న భావాలు, అభిప్రాయాలు అంతవేగం చెరిగిపోవనుకుంటాను. ముందు చెప్పిన నాలుగు ఇజాలు ... గాంధీజం, కమ్యూనిజం, సోషలిజం, రాయిజంలలో వేటికీ నేను కట్టుబడలేదు. కానీ అన్నీ నన్ను కట్టివేశాయి. ఆ రోజుల్లో పుట్టినరోజు పండుగలు అలవాటులేదు. ఎవరిళ్లలో పిల్లలకు పుట్టినరోజు వేడుక చేయగా వినలేదు, కనలేదు. హైస్కూల్‌లో చేరే సమయంలో ఉజ్జాయింపుగా, ఎస్సెస్సెల్సీ అయ్యేసరికి పదహారు సంవత్సరాలు పూర్తి కావాలన్న రూల్ ప్రకారం ఏదో తారీఖు వేసేరు. చాలామంది పిల్లల డేట్ ఆఫ్ బర్త్‌లు ఆరోజుల్లో ఒక్కటీ ఖచ్చితంగా ఉండేవి కాదు. ఎ.సి.కాలేజీలో చదువుతున్న రోజు ఓ ఫ్రెండ్ బర్త్‌డే పార్టీకి వెళ్లాను. క్రిస్టియన్స్ ఇలాంటి ఫార్మలిటీస్ పాటిస్తారు, హిందువుల్లో తక్కువ.

డిగ్రీ అయింది. పాంటులోపల చొక్కా వేసుకుని టక్ చేసుకుని బజారున నడవాలంటే సిగ్గువేసింది. భయం వేసింది. చదువుకున్న ఊరు. అందరూ తెలిసిన వాళ్లే. అంతకుముందు చేసినవి చిల్లరమల్లర ఉద్యోగాలు.

అప్పట్లో పత్రికల్లో పనిచేయడం అంటే, సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టరు పదవి

లాంటిది. కుర్చీలు వేయడం, కాఫీలు అందించడం, చేతులు కట్టుకుని నిలబడటం.., చిన్నపత్రికల్లో ఉద్యోగాలు అలాగే ఉండేవి. ఎవరైనా వచ్చినప్పుడు కుర్చీలో కూర్చుని, ఫాన్ వేసుకుని, ఫోజులివ్వడం, వారు పోగానే ప్రెస్‌లో పత్రికలు కట్టలు కట్టడం, ప్రూఫులు దిద్దటం - ఎవరో అన్నారు "తెనాలిలో కాలేజీ పెడుతున్నారు కదా! నీది ఇంగ్లీషు లిటరేచర్. ప్రయత్నించు." అని. నా కెవరిస్తారు? నలందాప్రెస్‌కు వెళ్లినప్పుడు కోగంటి రాధాకృష్ణ మూర్తిగారు అడిగారు "ఎం.ఎ. చదువుతావా? ఉద్యోగం చేస్తావా?" అని. "ఎం.ఎ. చదివే ఆర్థికస్తోమతు లేదండి" అన్నాను. 'మన ఊళ్లో కాలేజీ పెడుతున్నారుట.'

"కాలేజీలో చేస్తావా? ఓ అప్లికేషన్ పెట్టు" అన్నారు. ఆయన కమిటీ మెంబరని నాకు తెలియదు. క్లబ్బుకు వెడతాడని తెలుసు. చాలామంది క్లబ్బుమెంబర్లే కాలేజీ కమిటీలో వున్నారు.

టి.సి., కాండక్టు సర్టిఫికెట్ తెచ్చుకుందామని గుంటూరు వెళ్లాను. ఎ.సి. కాలేజీ ప్రిన్సిపాల్ అడిగారు - మా కాలేజీలో ఉద్యోగం యిస్తాం ... అప్లికేషన్ ఇమ్మని. హిందూకాలేజీలో పోస్టులున్నాయి. నామనస్సు తెనాలిలో వుంది. ఉన్న ఊరు, రైలు ప్రయాణం ఉండదు. తెనాలి కాలేజీలో రాకపోతే గుంటూరు ఎ.సి. కాలేజీలో ఉద్యోగం గ్యారంటీ. సాయంత్రం రైలుకు తెనాలి చేరాను. స్టేషన్‌లో రేపల్లె వెళ్లే రైలులో ఒకాయన కూర్చుని నన్ను గమనిస్తున్నాడు. కాషాయబట్టలు వేసుకున్న ఒక స్వామీజీ చెయ్యి ఊపి దగ్గరకు పిలిచారు. వెళ్లి నమస్కరించాను.

"నీవు కృష్ణుడివి కదూ" అడిగారు.

జ్ఞాపకాలలోకి వెళ్లిపోయాను. ఈయన తత్వానందస్వామి అయివుంటారన్న నమ్మకం కలిగింది.

"అవును స్వామీజీ" వినయంగా అన్నాను.

"ఏం చదువుకున్నావు ... ఏం చేస్తున్నావు"

చెప్పాను.

"కాలేజీలో పోస్టులున్నాయట ... ప్రయత్నిస్తాను."

ఆయన నవ్వి, వెంటనే ఒక ఉత్తరం రాసి యిచ్చారు. "కాలేజీ ప్రెసిడెంటు గోగినేని రంగనాయకులు. ఈ ఉత్తరం ఆయన కివ్వు." అన్నారు.

మర్నాడు ఉదయం వారిని కలిసి స్వామీజీ ఉత్తరం యిచ్చాను. చదివి "అప్లికేషన్ యివ్వు" అన్నారు.

అంతే, ఏమీ శ్రమ లేకుండా నాకు ఉద్యోగం వచ్చింది. కొత్తగా పెట్టిన కాలేజీ

ఊరి మధ్యలో వున్న గరల్స్ స్కూలును కాలేజీగా మార్చారు. అంతా కుర్ర లెక్చరర్లు. టీచింగ్ స్టాఫులో ఆ ఊరి వాడిని నేనొక్కడినే. మిగత లెక్చరర్లు, ట్యూటర్లు బయటి ఊళ్లవారే. ప్రిన్సిపాల్ మళయాళీవాడు.. రాగ్‌లాండ్. చాలా క్రమశిక్షణ పాటించే మనిషి. ఆంధ్ర యూనివర్సిటి వైస్‌చాన్సలర్ వి.ఎస్.కృష్ణగారి క్లాస్‌మెట్. ఆయనకు తెలుగురాదు. హిస్టరీగ్రూపులో ఒక సెక్షను, కామర్సు గ్రూపులో ఒక సెక్షను ఉండేవి. మొత్తం 200 మంది పైగా విద్యార్థులు. ప్రిన్సిపాలు, గంటి శ్రీరామమూర్తి అని ఆనర్స్ పాసై వచ్చినవాడు .. ఆయన ఇంగ్లీషు చెప్పేవారు. నేను ట్యూటర్‌ని. అయినా నాన్‌డీటైల్డ్, గ్రామరు, కాంపొజిషన్ పీరియడ్స్ నాకు కేటాయించారు. 120 మంది విద్యార్థుల క్లాసులో పాఠం చెప్పడం కష్టంగా వుండేది. క్లాసులో తెలుగు మాట్లాడకూడదు. అది ప్రిన్సిపాల్ ఆర్డరు. హిస్టరీ లెక్చరర్స్ ... అంకినీడు ప్రసాద్ - ఇంటర్‌లో, హైస్కూలులో నా క్లాస్‌మెట్. మాధవరెడ్డి (తర్వాత వెంకటేశ్వర యూనివర్సిటీలో హిస్టరీ ప్రొఫెసర్ అయినాడు) శంకరరెడ్డి కామర్స్ లెక్చరర్. ఆయన రాయలసీమలో పార్లమెంటు సభ్యుడుగా పోటీచేసి, ఓడిపోయి, బ్రహ్మయ్య అండ్ కంపెనీలో ఆడిటర్ అయినాడు. హిందీ లెక్చరర్ దోనేపూడి రాజారావు, తెలుగు పండితుడు కొండూరు వీరరాఘవాచార్య. లెక్చరర్ ఏంజిలా చార్లెస్ ఎ.సి. కాలేజీలో మాకు లెక్చరర్.

స్టాఫ్‌లో సగంమంది బ్రహ్మచారులే. స్టాఫ్‌రూంల్లో సరదాగా వుండేది. అందరూ ఒక కుటుంబ సభ్యుల్లా వుండేవారు. కాలేజీ ప్రారంభం రోజున స్టాఫ్ రూంలో నన్ను చూచి మా మేనమామ ఆశ్చర్యపోయారు. "ఏమిటీ, నువ్వా?" అన్నారు. వారికి మాకు రాకపోకలు బంద్ అయి చాలాకాలమైంది. చాలారోజులు ఆయన నా మేనమామ అని. నేను ఎవరికీ చెప్పలేదు. నేను తన మేనల్లుడినని తనూ చెప్పలేదు. ఆయన తెలుగు, నేను ఇంగ్లీషు. సంబంధం లేదు. చిన్నవాడిని కావడం వల్ల ప్రిన్స్‌పాల్ చాలా అభిమానంగా వుండేవారు. అడ్మిషన్స్ వ్యవహారాలలో పక్కన కూర్చోపెట్టుకునేవారు. తను బిజీగా వుండి, తన పీరియడ్స్‌కు నన్ను వెళ్లమని పంపేవారు. కొత్తకాలేజీ కావటాన లైబ్రరీ ఏర్పరచే బాధ్యత నాకు అప్పగించారు. కొత్తగాపెట్టిన కాలేజీ, అందునా సైన్సులేదు. నాలుగైదుసార్లు ఎస్సెస్సీ తప్పినవారినీ చేర్చుకునేవారు. విద్యార్థులు సగంమంది వయస్సులో నాకంటె పెద్దగా వుండేవారు. మొదటిసంవత్సరంలో చదువులు మరచిపోయినవారు, ఊళ్లో కాలేజీ కనుక చేరినవాళ్లు కొంతమంది. మొత్తం ఆడపిల్లలు అయిదారుగురుండేవారు. అందులో ఒకమ్మాయి ధ్వన్యనుకరణ సామ్రాట్ నేరెళ్ల వేణుమాధవ్‌గారి సతీమణి అయింది.

1952లో ప్రారంభమైన జీవనయానాన్ని 1998తో పోల్చుకుంటే భయంవేస్తుంది. ఆశ్చర్యం అవుతుంది. అప్పుడు నా జీతం నెలకు నూరు రూపాయలు. లెక్చరరు జీతం 150 రూపాయలు. ఎలా బ్రతికేవాళ్లమని ఇప్పటివాళ్లు ప్రశ్నించవచ్చు. అప్పుడు ఎల్.డి.సి. జీతం 64 రూపాయలు, కరువుభత్యం కలిపి. యుద్ధం వచ్చి, కరువు ఏర్పడకపోతే జీతనాతాలు మరీతక్కువ. ఈనాడు కూలీవాడు రోజుకు నూరురూపాయలు సంపాదిస్తున్నాడు. అప్పుడు తహసీల్దారు జీతమే 150 రూపాయలు వుండేది. నూరు రూపాయల జీతంలో పాతిక రూపాయలు సొంతఖర్చులకు పోతే, ఎనభై రూపాయలు ఇంటిక్రింద ఖర్చయ్యేది. ఆఫ్‌కోర్స్, ట్యూషన్లు చెప్పడం వల్ల 150 రూపాయల వరకు వచ్చేది. పత్రికల రెమ్యూనరేషన్స్, రేడియో ప్రోగ్రాముల వల్ల మరికొంత వచ్చేది. జీవితం సుఖంగా, సజావుగా సాగినట్లే. అలా జీవితం సాగితే చాలనుకున్నాను. లెక్చరర్లు, టీచర్లు అలా ఎదుగుబొదుగులేని జీవితాలే గడుపుతుంటారు. చివరికి జన్మస్థలిలోనే అంత్యక్రియలు జరుపుకుంటారు. అదొక సెంటిమెంట్. విదేశాలలో చచ్చినవాడినైనా, స్వగ్రామానికి చేర్చి, అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తారు. బయటి ప్రపంచం బొత్తిగా తెలియక, జీవితాంతం బ్రతికే మనుషులే ఎక్కువ. రెండు మూడు సంవత్సరాలు గడిచేసరికి బోరుకొట్టింది. ఎన్నో పత్రికలకు రాస్తున్నాను కనుక పేరుప్రఖ్యాతులకు కొదవలేదు. ఇంకా ప్రపంచం వుంది. పత్రికలలో వార్తలు చదువుతాం. ఆ దేశాలు, ఆ మనుషులు, నగరాలు మనకు తెలియవు. అప్పట్లో కవులకు మాత్రమే సన్మానాలు జరిగేవి. శాలువాలు కప్పేవారు. ఎంత గొప్పకథకునికైనా, నవలాకారునికైనా పండిత సన్మానం జరగదు. కవిత్వం రాక కథలు రాస్తున్నట్లు భావించేవారు. వారపత్రికలు వచ్చాయి. 'తెలుగుస్వతంత్ర' సగంపేజీలు కథలకు కేటాయించేది. నేను తెలుగు స్వతంత్ర వారపత్రికకు రెగ్యులర్‌గా రాసేవాడిని. వర్ధమాన కవులంతా రాస్తుండేవారు. ఆరుద్ర, సోమసుందర్, తిలక్, దాశరథి, సి.నారాయణ రెడ్డి - ఇలా ఎందరి కవితలో తెలుగుస్వతంత్రలో తొలిప్రచురణ అయ్యేవి. వారితో సమంగా నా కవితలు అచ్చుకావడం అదృష్టం. నా కవితలకన్నా కథలకు మంచిరెస్పాన్స్ వుండేది. నా కలం కవితల్ని సృష్టించడం తగ్గించి, కథల పంటలు పండించసాగింది. కాలమే మనల్ని తీర్చిదిద్దుతుంది. కాలానికి అనుగుణంగా మారడమే మనపని.

మొదటిసంవత్సరంలో ఉద్యోగం కాస్త బెరుకు బెరుకుగా వున్నా రెండవ సంవత్సరానికి పాతకాపులమైనాం. సీనియారిటీతోపాటు ధైర్యం వచ్చింది. రెండవ సంవత్సరంలో హితశ్రీగారు కామర్సు లెక్చరరుగా చేరారు. హితశ్రీ మంచి కథకుడు.

ఆదర్శంగా వుండేవారు. ప్రపంచ కథల పోటీలలో పాలగుమ్మి పద్మరాజు, పురాణం సుబ్రహ్మణ్యశర్మలతో పాటు హితశ్రీగారి కథ ఎన్నికైంది. అది ఒక గర్వకారణం, కాగా ఆయన మా కాలేజీ లెక్చరర్ కావడం మరొకవిధంగా ఆనందం. చాలా మంచివ్యక్తి. ఏమాత్రం ఆడంబరం, భేషజం లేనివారు. ప్రిన్సిపాల్ పదవిలోకి వచ్చినా అంతే. నిరాడంబరంగా జీవించేవారు. నలభై సంవత్సరాలుగా మా మధ్య ఆత్మీయత, స్నేహం చెక్కుచెదరలేదు. తెనాలి వెళ్లితే వారిని చూడకుండా రాను. ఇటీవల హితశ్రీ, వారి సతీమణిలోను నా యోగంపట్ల ఆసక్తి కలిగింది! సంతోషం. క్రమంగా తెనాలి కొత్త కలాలకు ప్రముఖ కేంద్రమైంది. కవిరావు, అలపర్తి సుబ్బారావు, వేజెండ్ల సాంబశివరావులు బాలసాహిత్యం, బాలగేయాలు రాసేవారు. ఆలూరు భుజంగరావు హిందీ సాహిత్యం తర్జుమా చేసేవాడు, ప్రేమ్‌చంద్ భక్తుడు. భరద్వాజ, శారద, నేను, జి.వి. కృష్ణారావు, రామకృష్ణ, తాళ్లూరి నాగేశ్వరరావు, కొలకలూరి ఈనాక్ కథకులం. నన్ను చూచి శారద అని, అతనిని శార్వరి అని భ్రమించేవారు జనం. శారద మంచి - చెడు, అపస్వరాలు నవలలను ఆంధ్రపత్రిక ప్రచురించింది. తెలుగునవల పట్ల పాఠకుల అభిరుచిని పెంపొందించింది. జి.వి. కృష్ణారావు గారి 'కీలుబొమ్మలు' తెలుగుస్వతంత్రలో సీరియల్‌గా వచ్చిన గొప్పనవల. 50-60 మధ్యకాలంలో ఆంధ్రదేశంలో తెలుగుకథ, నవల కొత్తజీవం పొంది, కొత్తచివుళ్లు వేశాయి. ఆ ఉత్సాహంతోనే 'కళావాణి' అనే ప్రచురణసంస్థ ప్రారంభించి, రావూరి భరద్వాజ 'రాగిణి', 'కొత్త చిగుళ్లు', నా 'స్వర్గసీమ' కథాసంపుటాలు ప్రచురించాను. నా 'రోదసి' కావ్యం కూడా అప్పుడే వెలువడింది. విజయవాడలోని 'ఆదర్శ గ్రంథమండలి' వారు 'ఎర్రభూతం' అనే నా కథలసంపుటి ప్రచురించారు. మూడు పుస్తకాలతో కథకుడిగా, అభ్యుదయ కవిగా, సాహిత్యరంగంలో కాస్త నిలబడిగలిగాను. పత్రికలలో ఎన్ని రాసినా, ఎంతకాలం రాసినా, ఒక్కపుస్తకమైనా అచ్చుపడకపోతే రచయితగా, కవిగా నిలదొక్కుకోవడం కష్టం. కరుణశ్రీగారి ఉదయశ్రీ, విజయశ్రీలు అప్పుడే వెలువడ్డాయి. పాపయ్యశాస్త్రిగారు గొప్ప కళాహృదయంతో వాటిని అచ్చువేసేవారు. ఎంతో శ్రద్ధగా, అందంగా, ప్రేమగా పుస్తకాల్ని తీర్చిదిద్దడం వారినుండే నేర్చుకోవాలి. చాలామంది పుస్తకాలు అచ్చువేస్తారుగానీ అందం చూడరు. ఆ పద్ధతిలో జి.వి. కృష్ణారావుగారి ప్లేటో, అరిస్టాటిల్, కాంట్ పుస్తకాలు గొప్ప అందమైన పుస్తకాలు. ఇలాంటి మంచి, గొప్ప అందమైన పుస్తకాలు నలందాప్రెస్‌లో అచ్చయ్యేవి. నాకు నలందాప్రెస్‌కు అనుబంధం ఎక్కువ. అక్కడ భరద్వాజ పనిచేసేవాడు. ప్రెస్ పని అయిపోయిన తర్వాత అదే సాహిత్యకేంద్రం. కవులు, రచయితలు అక్కడే చేరేవారం.

ఏదైనా గవర్నమెంటు ఉద్యోగం వస్తే బాగుండుననుకున్నాను. కానీ నాపైన సి.ఐ.డి. నిఘా వున్నదని తెలిసింది. కమ్యూనిస్టు అభిమానికి ప్రభుత్వోద్యోగం లభించడం అప్పట్లో అసంభవం. సి.ఐ.డి. రికార్డులోకి నా పేరెలా వచ్చింది?! ఒక సి.ఐ.డి. ఆఫీసరు 'బలరాం' ఆ విషయం చెప్పాడు. ఏడాదిగా నన్ను గమనిస్తున్నాడతను. 'బ్లిట్జ్' పత్రికలో జవహర్‌లాల్‌ని విమర్శిస్తూ ఒక వ్యాసం రాశానుట. అందుకే కేంద్రప్రభుత్వంలోని హోం డిపార్టుమెంట్ నాపైన కన్నువేసింది. వారి కన్నుకప్పడం మనవల్ల కాదు. నా చర్యలు గమనిస్తూ వచ్చిన ఆఫీసర్ 'బలరాం' రెండేళ్ల తర్వాత ఆ ఫైల్ మూసివేశారు. అతని మేనల్లుడు నా స్టూడెంట్. నాకు ఇష్టమైన వ్యక్తి. ప్రభుత్వోద్యోగం పైన ఆశలు పోయాయి. కమ్యూనిజం పట్ల ఎప్పుడో ఏర్పడిన కాస్తంత అభిమానం అలా కాటువేసింది. అభ్యుదయ కవిని అయివుండి సెక్సు కథలు రాస్తున్నానని 'అభ్యుదయ రచయితల సంఘం' గుడివాడ సమావేశంలో నన్ను అభిశంసిస్తూ తీర్మానించిందిట. అసలు ఎప్పుడూ నేను అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యుడినే కాదు. వారెలా అనుకున్నారో మరి!

కాలేజీలో తప్పక ఒకరినొకరు పలకరించుకోవలసి మా మేనమామగారు నా పట్ల ప్రసన్నులైనారు. ఆయన ఎంత గర్హించినా, నా రచనలు పత్రికల్లో అచ్చవుతున్నాయి. 'శార్వరి'గా గుర్తింపు వస్తోంది. నాపైన ప్రేమను నిరూపించుకునేందుకు ఒకటి రెండు సంబంధాలు తెచ్చారు. ఆయన చెప్పిన సంబంధాలు మా నాన్నగారు బేషరతుగా తిరస్కరించారు. వాళ్ల పట్టుదల వారిది. మేనమామే గానీ, ఆయనది కపట స్వభావం. ప్రతీపనిలోనూ స్వార్థం, స్వలాభం వుండేవి. ఇతరులకు అవి స్ఫుటంగా కనిపించేవి. పండితుడు, పెద్దవాడు, మేనమామ అని సరిపెట్టుకునేవాడిని. ఆయన మాత్రం చెడు ప్రచారం చేసేవాడు. కుర్రాడు మంచివాడేగానీ తల్లిదండ్రులతో వేగడం కష్టం అనేవాడు. తన కూతుర్ని చేసుకో నిరాకరించినందుకు ఆయనగారికి కసి, మెత్తని పగ, కనిపించని శత్రుత్వం.

నాకు పెళ్లిమీద మనస్సులేదు. అసలు సీరియస్‌గా ఆలోచించిందీ లేదు. పెళ్లి జీవితానికి అవసరమా? కాదేమో! పెళ్లి కాకుండా సన్యాసుల్లో కలిసిపోయిన వారున్నారు. వారిని సంఘం గౌరవిస్తోంది. పెళ్లయి సంసారాలు ఈదలేక, సన్యాసుల్లో కలిసిపోతున్న వారున్నారు. వారు గౌరవింపబడుతున్నారు. సంసారులకన్న సన్యాసులకే గౌరవం ఎక్కువ. సన్యసించడానికి కారణం సంసారం! పెళ్లి కాకుండా బ్రహ్మచారులుగా మిగిలిపోయిన వారున్నారు. పిల్లల్ని తెగకని, మురిసిపోతున్నవారున్నారు. నరకం అనుభవిస్తున్న వారున్నారు. అయితే పెళ్లి విలువ ఏమిటి?

పెళ్లి మీద ఇష్టత లేదు, అయిష్టత లేదు. నాకు తెలిసిన కుటుంబాలలో భార్యభర్తలు నిత్యం కలహిస్తూ, కొట్టుకోవడం ఎక్కువ. పుస్తకాలలో చూచే ఆదర్శ దాంపత్య ఏ వొక్క కుటుంబంలోనూ కనిపించేది కాదు. ప్రేమగా వుండవలసిన దంపతులు కొట్టుకోవడం ఎందుకు? అప్పటి సమాజమే అంత! అప్పటి దాంపత్య జీవితాలు అంతే! దానిని మార్చడం సాధ్యం కాదు. భార్యాభర్తలు చదువుకున్నవారైతే బావుంటుంది. అన్ని అపార్థాలుండవు. చదువుకున్న అమ్మాయి దొరికితే చేసుకుందామనుకున్నాను. కాని అంతగా చదువుకున్న అమ్మాయిలు ఏరీ! అప్పుడు ఇంగ్లీషు చదువులు మధ్యతరగతి ఆడపిల్లల వరకు చేరలేదు. కాస్త, ప్రతి ఇంటా ఆడపిల్లల్ని సైతం చదివించాలన్న తపన కనిపిస్తోంది. వివేకానందుని బోధలు బాగా తలకెక్కాయి. రాజారామమోహన్‌రాయ్, కందుకూరి వీరేశలింగం సంస్కరణల్ని జనం అర్థం చేసుకోగలిగారు.

కాలేజీలో పనిచేస్తున్నా నాకు ఆడపిల్లలంటే తగనిభయం. అందాన్ని ఆరాధించడం వరకే తెలుసు. దానిని అనుభవించాలన్న తపన, తహతహ నాకు లేవు. నా రచయిత మిత్రులు కొంతమంది వ్యభిచారం చేసేవాళ్లు. అదొక వ్యసనం వారికి. సెక్సు జీవితానికి ప్రధాన అవసరం అనేవారు. వ్యభిచారం అప్పుడు బహిరంగంగా జరిగేది. లాడ్జీలు వుండేవి. ఇష్టమైనవాళ్లు నిర్భయంగా వెళ్లేవారు. నాకు అలాంటి జీవితం చాలా అసహ్యం అనిపించేది. అలాంటి రచయితలైన మిత్రులతో కలసిమెలసి తిరిగినా, లోపల అసహ్యించుకునేవాడిని. వారించినా వారు వినరు. నా కంటే వయస్సులో పెద్దవారు. రచనలో సీనియర్స్. రచయితలే కాదు, చాలామంది కళాకారులు అవినీతిమంతులని గ్రహించాను. వారిలో ప్రతిభ వుంది. దానిని గౌరవించక తప్పదు. వ్యక్తిగతమైన బలహీనతలను అభిమానులు పట్టించుకోరాదు.

పెళ్లిపట్ల, భార్యపట్ల, సంసారంపట్ల నాకు కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి. అవి పెద్ద ఆదర్శాలని చెప్పలేను కాని, అనుకూలవతి అయిన అమ్మాయి ఇల్లాలు కావాలి. తిట్టుకోవటాలు, కొట్టుకోవడాలు వుండకూడదు. ఆ మేరకు సహకరిస్తే చాలును. నిజమే! ముందుగా ఏ అమ్మాయినైనా ఒక క్షణం పాటు చూచి ఈ సౌశీల్యతను తెలుసుకోగలమా? చదువు చాలదు, సంస్కారం చాలదు. ఈ పరీక్షకు మరేదో ప్రజ్ఞ అవసరం. ఒక్కసారి కళ్లలోకి చూచి ఆంతర్యాన్ని గ్రహించగలగాలి. అలాంటి కథలు రాయగలం! అనుభవంలో పప్పులో కాలువేస్తాం. అక్కడే విధి, అదృష్టం పైకొస్తాయి! అదృష్టం వుంటే అనుకూలవతి లభిస్తుంది. అంతే! పెళ్లికి ముందు ప్రతిఒక్కరూ

అనుకుంటారు, అనుమానిస్తారు... వచ్చే అమ్మాయి తనని అర్థం చేసుకుంటుందా అని. అలాగే అమ్మాయిలు ఆలోచిస్తారు! అదొక విచిత్ర వలయం! గిరగిర తిరిగే ఆ వలయంలో రెండు కొనలు కలవాలి!

మార్చి నెలలో ఒకరోజు ఉదయం లాస్ట్ పీరియడ్ అవగానే, స్టాఫ్ రూంకు వెళ్లగానే, మా మేనమామగారు దగ్గరగా వచ్చి "నీకో సంబంధం వచ్చిందోయ్" అన్నారు. స్టాఫ్ రూంకి వెళ్లగానే సిగరెట్ వెలిగించటం నా అలవాటు. పెద్దాయన కదా! ఆయన ముందు మాత్రం సిగరెట్ కాల్చను. ఈయన భోజనానికి వెళ్లకుండా అక్కడే వున్న కారణం ఇదా అనుకున్నాను. అంతలో ఒక పెద్దాయన లోపలికి వచ్చాడు.

"వీరే నీకు కాబోయే మామగారు" అని పరిచయం చేశాడు. 'కాబోయే' ఏమిటి? నా మొహంలా వుంది ఈయన ఉపోద్ఘాతం అనుకున్నాను. పెళ్లిచూపులు, మాటలు, నిర్ణయాలు ఏవీ లేకుండానే 'కాబోయే మామగారు, కాబోయే పెళ్లాం' అంటే ఎవరైనా తన్నగలరు.

వారిది నిడదవోలు. కాకరపర్తి సర్వేశ్వరరావు పేరు. డ్రాయింగ్ టీచరుగానో, డ్రిల్ మాస్టారుగానో చేసి రిటైర్ అయ్యారు. ఆయన ఏమీ అడగలేదు. "సాయంత్రం ఇంటికి వస్తాం, మీ నాన్నగారికి, అమ్మగారికి చెప్పు" అని వెళ్లిపోయారు. అప్పటికి నాకు బెజవాడ మాత్రమే తెలుసు. ఆతర్వాత ఊళ్లసంగతి తెలీదు. తెనాలి, గుంటూరు, బెజవాడ ఈ మూడు నాకు తెలిసిన పట్టణాలు. సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ అప్పుడప్పుడు వెళ్లేవాడిని.

మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లినపుడు చెప్పాను. మా నాన్నగారన్నారు "గోదావరిజిల్లా వారికీ, గుంటూరుజిల్లా వారికీ సంబంధాలు లేవు" అని.

నిజమే. అసలు పక్కనే వున్న కృష్ణాజిల్లాతోనే సంబంధాలు తక్కువ. ఆ రోజుల్లో ప్రయాణసౌకర్యాల లేమి వల్ల దగ్గర ఊళ్ల సంబంధాలే చేసేవారు. ఒక జిల్లా దాటి మరొక జిల్లాకు వెళ్లడమంటే విదేశాలకు వెళ్లినట్లే. ఆచారాలు, వ్యవహారాలు ఏవీ పొసగవని భయం. కంచందగ్గర, మంచందగ్గర సఖ్యతకు దగ్గిర వారైతేనే సుఖం అని నమ్మకం.

మా అమ్మగారు చెప్పారు "వాళ్లు వస్తామన్నారుగా, మామయ్యను రమ్మను" అని. చెప్పాను, కానీ ఆయన రాలేదు. రాడని మాకు తెలుసు. ఆయన బుద్ధి అలాంటిది. ఆ సాయంత్రం సర్వేశ్వరరావుగారు, ఆ ఊళ్లో ఒక పెద్దమనిషి రాచకుళ్ల చెంచయ్యగారిని వెంటబెట్టుకుని వచ్చారు. చెంచయ్యగారు కాంగ్రెస్ నాయకుడు. మహాత్మాగాంధీతో తిరిగిన వాడు. ఆయనంటే ఊళ్లో గౌరవం వుంది. మా నాయనగారు కాంగ్రెసు

నాయకుడే. వారిద్దరికీ రాజకీయ మైత్రి వుంది. వారిని సగౌరవంగా ఆహ్వానించారు. మర్యాద చేశారు.

ఆ పెద్దాయన ముందుగానే మా ఇంటి విషయాలన్నీ తెలుసుకుని మరీ వచ్చారు. కోలవెన్ను పరబ్రహ్మంగారు, తోడు వచ్చిన చెంచయ్యగారు నా గురించి చెప్పిన మాటలు నచ్చాయి. చిలువూరులో వారి రెండవ అమ్మాయిని యిచ్చారు. అక్కడివారే నా గురించి మొదట చెప్పారుట. ఆయన మా ఆస్తిపాస్తుల్ని గురించి అడగలేదు. ఏమీ లేవని ముందే తెలుసుకుని వుంటారు. వంశాన్ని గురించి ఆరా తీయలేదు. ఆయనకు కుర్రవాడు నచ్చాలి. గ్రాడ్యుయేట్ అయివుండాలి. ఉద్యోగం చేస్తున్నవాడై వుండాలి. సంపాదన ఎంత అన్న ప్రశ్నలేదు. మనిషిని చూచి తానే అంచనా వేసుకోగలడు.

సింపుల్‌గా అమ్మాయిని చూడ్డానికి రండని ఆహ్వానించాడు. మా అమ్మ, నాన్న ససేమి పిల్లను చూడడానికి వెళ్లమని భీష్మించారు. కారణం చెప్పరు. నేను వత్తిడి చేయలేదు. మా పెద్దమ్మగారు నాగేంద్రమ్మ వచ్చి దులిపేశారు. 'పెద్ద శ్రీరామచంద్రుడు, పితృవాక్య పరిపాలన'. అని ఎద్దేవా చేసి, "నిక్షేపంలాంటి సంబంధం, ఇంటికి వచ్చి, పిల్లను యిస్తామంటే వెళ్లకపోవడం అమర్యాద. పిల్ల నచ్చకపోతే వేరే విషయం." అన్నది. ఆమె మాటలు నిజమే అనిపించాయి.

'నీవు వెళ్లి చూసిరా అమ్మా, అమ్మ, నాన్న వెళ్లమంటే వెళ్లమని భీష్మించుకున్నారు' అన్నాను.

'ఏం పోయేకాలం! ఇలా అయితే నీకీ జన్మలో పెళ్లి కాదు. వీళ్లను చూచి నీకెవరూ పిల్లనిస్తామని రారు. వీళ్ల కడుపున పుట్టినందుకు నీకిదొక శాపం, దౌర్భాగ్యాలు' అని తిట్టిపోసింది.

"నీవు వెళ్లు!"

"నేనా! తగుదునమ్మా అని పెళ్లికూతురిని చూడ్డానికి వెధవముండను నేను వెడితే మొహాన ఉమ్మివేస్తారు."

"అమ్మా! నిన్ను గౌరవించే సంస్కారమే వాళ్లకు లేకపోతే... ఆ సంబంధం మనకు వద్దు. అమ్మానాన్నలకు పట్టదు. అమ్మకన్న మిన్నగా ప్రేమించే పెద్దమ్మ నీవు."

"చూడవలసింది నీవు. నచ్చవలసింది నీకు"

"అమ్మా! ఒక్కమాట చెబుతాను విను, నువ్వు వెళ్లిరా. ఆ అమ్మాయి నీకు నచ్చిందే అనుకో... తాంబూలాలు పుచ్చుకోవద్దు. కానీ అబ్బాయికి నచ్చినట్లే, ముహూర్తాలు పెట్టుకోడానికి రండి అని చెప్పిరా? చాలు" అన్నాను.

మా పెద్దమ్మ ఒక్కరే వెళ్లారు పెళ్లికూతురి చూపులకు. ఆమె మంచి వ్యవహారవేత్త. లోకజ్ఞానం బాగావున్న వ్యక్తి. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలుసు. ఆమె వెతుక్కుంటూ సమిశ్రగూడెం వెళ్లారుట మాస్టారింటికి. సన్నగా, బక్కపలచగా, రివటలా, ఎర్రగా వున్న ఓ పిల్ల ... పరికిణీ, వోణీ వేసుకుని ఓ తెలుగు ఇంటిఆడపిల్లగా, పల్లెసంస్కృతికి ప్రతిబింబంగా వచ్చి, 'రండి' అని తీయగా ఆహ్వానించింది.

"అమ్మగారు లేరా?"

"కాలవకు వెళ్లారు, వస్తారు కూర్చోండి"

తను ఫలానా అని, ఫలానా పనిమీద వచ్చానని ఈమె చెప్పలేదు. ఇంట్లో పెద్దవాళ్లు సమయానికి లేరు. ఆ అమ్మాయే అన్ని మర్యాదలు చేసి, ఇంటిగౌరవం నిలబెట్టింది. ఆ పిల్లే పెళ్లికూతురు అయి వుంటుందని ఈమె గ్రహించింది. అక్క చెల్లెళ్ల వివరాలు అవీ అడిగి తెలుసుకుంది. కాస్సేపటికి ఆ పిల్ల తల్లిగారు తడిబట్టలతో, మడినీళ్లతో కాలవ నుండి వచ్చారు. మా అమ్మకు అలాంటి సీన్లు నచ్చుతాయి. కోపల్లెలో మా ఇంట అదే దృశ్యం వుండేది. కాలవనుండి స్నానం చేసి మంచినీళ్లు తెచ్చుకోవడం. అది సంప్రదాయం, మడి, ఆచారం, కుటుంబగౌరవం, సంస్కారం.

తిరిగివచ్చి "అమ్మాయి బాగుంది కృష్ణా. రుక్మిణీదేవి అచ్చం" అని కాంప్లిమెంట్ యిచ్చింది. ఆమెకు భారత, భాగవతాల పరిజ్ఞానం ఎక్కువ.

"అంటే మీ నాన్న, అమ్మ ఇష్టంలేకపోయినా, వద్దన్నా ఆ రుక్మిణిని, కృష్ణుడిలా తెచ్చుకో. నీదాన్ని చేసుకో" అన్నది. "ఆ పిల్లవచ్చిన వేళావిశేషం వల్లనైనా మీ ఇల్లు బాగుపడుతుందేమో చూద్దాం" అన్నది.

జటిలసమస్య అయింది. అమ్మానాన్నలకు ఇష్టమో, అయిష్టమో తెలియడం లేదు. 'నీ ఇష్టం' అని ఆ ప్రస్తావన మానివేశారు. నలందాప్రెస్‌లో సాయంత్రం భరద్వాజతో ముచ్చటిస్తుండగా అక్కడేవున్న ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రి అయ్యవారు కల్పించుకుని 'వెళ్లు శార్వరీ! ఇదే ఖాయం అవుతుంది. మూడునెలల్లో నీ వివాహం అయి తీరుతుంది' అన్నాడు. జ్వాలాపతి లింగశాస్త్రి అయ్యవారు ప్రెస్‌లో పరిచయం. అంధుడు, మహాపండితుడు, పరమ శివార్చకుడు, సంస్కృతాంధ్రాలలో కవి. ఆయనకు చూపులేదు. దివ్యదృష్టి వుంది. నేను ప్రెస్‌కు వెళ్లబోయేలోగానే పది నిమిషాల్లో శార్వరి వస్తున్నాడు. ఇప్పుడే హోటల్లోకి వెడుతున్నాడు అని దివ్యదృష్టితో చెప్పేవారు. ఆయనకు నేనంటే చాలా ప్రేమ.

"అమ్మాయి ఎలా వుంటుంది అయ్యవారూ" అని అడిగాను.

"రూపవతి! గుణవతి! నీకు అన్నివిధాలా సరితూగగలది"

ఆ రాత్రికి ఇంటికి వెళ్లేసరికి దీవి వీరభద్రరావుగారు వచ్చారు. ఈయన సర్వేశ్వరరావుగారి పెద్దల్లుడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టరు. తెల్లవారుఝాము రైలుకు బయలు దేరాం. చేబ్రోలు స్టేషన్‌లో దిగి, బస్సుమీద గణపవరం చేరాం. డాక్టర్ బాపన్నగారింట పెళ్లిచూపులు. అమ్మాయిని చూచాను. నచ్చడం, నచ్చకపోవడం ఆలోచన లేదు. వారికి నేను నచ్చుతానా లేదా అన్నది సమస్య. నా పర్సనాలిటి అలాంటిది.

మా ఇంటి విషయాలు, మా వాళ్ల స్వభావాలు, ప్రవర్తన దాచుకోకుండా చెప్పాను.

కాబోయే మామగారు నవ్వి "నాకు తెలుసు శర్మా" అన్నారు.

పెళ్లిఖర్చులకు డబ్బుకావాలి. ఆయన ఇస్తారో లేదో మరి. వేయి రూపాయల కట్నం!! అప్పట్లో అదే గొప్ప. వేయిలో సగం పెళ్లికూతురు బంగారానికి, పట్టుచీరలకుపోగా, అయిదువందలు మాకు రానుపోను పెళ్లిఖర్చు. మా నాన్నగారు ఒక్క రూపాయి సొంతం ఖర్చు పెట్టలేదు. నేను అడగనూ లేదు. అలా ఓ అమ్మాయి నా జీవితంలో అడుగుపెట్టింది. ఆ బంగారుతీగ పేరు పాపాయమ్మ ... ఉరఫ్ యామినీదేవి. నిజమే. ఆమె బంగారుతీగ. మా ఇంటికి వచ్చాక, బంధువులంతా వచ్చారు. చూచి మెచ్చుకున్నారు. 'బంగారుదీపం' అన్నారు. నా అదృష్టం వల్లనే అంతచక్కని పిల్ల భార్యగా దొరికింది అన్నారు. నిజమే, నేను తనకు లభించడం కూడా అదృష్టమేనని ఆ అమ్మాయి అనుకోవాలి కదా! ఆ స్థాయికి నన్ను నేను మలచుకోవాలి గదా! పెళ్లిఅయిన తొలినాళ్లలో నవవధూవరులు 'నీవే నాసర్వస్వం' అనుకుంటారు. తొలినాళ్ల బాసలు జీవితాంతం కొనసాగించగలగాలి. ఆమెకు కొద్దిపాటి తెలుగు, హిందీ మాత్రం వచ్చు. ఇంగ్లీషు అసలు రాదు. అయ్యవారు చెప్పినట్లు రూపవతి గుణవతి అయితే చాలు. 'రూపం' అనేది భర్తకి అనురక్తి కలిగించేది, గుణం అనేది సమాజం మెచ్చేది అయివుంటుంది.

మా ఇల్లు చిన్నది. అందులోనే ఒక మూల మా బెడ్‌రూం. ఇల్లు ఇరుకైనా ఇల్లాలి బుద్ధి మర్కటబుద్ధి కాకుంటే మగాడు సుఖపడతాడు. యామినీదేవిలో వున్న సుగుణం తనకు ఫలానా కావాలని కోరకపోవడం. బహుశా వారి తండ్రిగారి సంస్కారం వారసత్వమేమో! ఆడవాళ్లకు చీరలు, నగలు, అలంకారంపై మోజు ఎక్కువంటారు. ఆమెకు వాటిమీద మోజులేదు. ఉన్నా సమకూర్చి పెట్టే శక్తి నాకూ లేదు.

ఒక ఆదివారంనాడు నేను సెంటర్ వెళ్లివస్తుండగా జట్కాబండిలో పోతున్న ఓ అమ్మాయిని చూచాను. కళ్లు చెదిరిపోయే అందం. తెల్లగా వుంది. చెవులకు లోలకులు

మెరిసిపోతున్నాయి. 'అబ్బ! ఎంత బాగుందీ' అనుకున్నాను. ఎన్నడూ లేనిదీ, మనస్సు విచలితమైంది. ఇంటికి వచ్చాను, ఆ పిల్లే కళ్లలో మెదులుతోంది. అమ్మ కోడల్ని తీసుకుని మామయ్య గారింటికి వెళ్లిందన్నారు. అయితే ఆ జట్కాలో... మా ఇంటిదగ్గర జట్కాబండే, సాయిబు జట్కాలో నేను చూచింది అప్సరసను కాదు.

అప్పటికి వున్న కోరిక ఒక్కటే. ఎం.ఎ. పాసై లెక్చరర్‌గా స్థిరపడటం. ఉన్న వూళ్లో ఉద్యోగం స్థిమితంగా వుంటుంది. ఎం.ఎ. చదివే స్తోమత లేదు. ఆంధ్ర యూనివర్శిటీలో ఆనర్సు వుంది. ప్రైవేటుగా చదవనివ్వరు. నాగపూరు యూనివర్సిటీకి ఎం.ఎ.కు కట్టి ప్రైవేటుగా చదివాను. మూడు సంవత్సరాలు ట్యూటర్‌గా చేస్తే ప్రయివేట్‌గా ఎం.ఎ. రాయవచ్చు. ఇంటర్ విద్యార్థులకు ట్యూషన్లు చెప్పడం, ఎం.ఎ.కు చదవడం. ఒక్క అరమార్కులో ఎం.ఎ. పోయింది. రెండవసారి బనారస్ యూనివర్శిటీకి డబ్బుకట్టాను.

1955లో నా వివాహం అయింది. 1956 జులైలో అబ్బాయి పుట్టాడు. ఆమె పురిటికి పుట్టింటికి వెళ్లింది. ఒక విచిత్రమైన అనుభవం కలిగింది. మా నాన్నగారి గురువుగారు వచ్చారు తెనాలి. ఒకరోజు రాత్రి నిద్రపోతుండగా, నా చుట్టు విద్యుత్ వలయాలుగా ప్రవహించసాగింది. లేచి గిరగిరా బొంగరంలా తిరిగాను. నాన్న, అమ్మ, గురువుగారు అంతా బయటనే పడుకుని వున్నారు. నాకు ముచ్చెమటలు పోశాయి. స్పృహ తప్పి పడిపోయాను. అందరూ వచ్చి పట్టుకున్నారు. సేదతీర్చారు. గుర్తువుగారు చెప్పారు. "ఏదో ఒక మహాయోగశక్తి కృష్ణుడిలో ప్రవేశించింది. వీడు ఎప్పటికైనా మహాయోగి అవుతాడు" అని ఆశీర్వదించారు. అప్పుడు మా మొదటి సంతానం వసంతకుమార్ కలిగాడు. ఆ అనుభవానికి యోగానికి సంబంధం వుందో లేదో నాకు తెలియదు. నాలో మాత్రం మార్పు రాసాగింది. ఎం.ఎ.పై ఆశ చావలేదు. మరలా చదువు సాగించాను. డిగ్రీ వుంటేనే చదువుకు విలువ. మనిషికి గౌరవం. ఎం.ఎ. పాసై వుంటే కాలేజి ప్రిన్సిపాల్‌గా రిటైర్ కావచ్చు.

అప్పుడు ఒక విచిత్ర సంఘటన జరిగింది. పెదరావూరులో నా క్లాస్‌మేట్ పరమేశ్వర శాస్త్రి. తను నేను చిన్నతనం నుండి సహాధ్యాయులం. తను టీచర్ అయి, నాటక కంపెనీ పెట్టాడు. కాస్త అభ్యుదయ భావాలు కలవాడు. నాకో కాంపౌండర్ మిత్రుడుండేవాడు. అతని తమ్ముడు, బావమరదులు నా స్టూడెంట్స్. వయస్సులో నా కంటే పెద్దవారు. ఒకరోజున కాంపౌండర్ మిత్రుడు వచ్చి "కాలవలో ఒక విగ్రహం దొరికింది చూద్దాం రండి" అని తీసుకువెళ్లాడు. కాలవలో ఇసుకలో కూరుకుపోయిన విగ్రహం తీసి, పక్కపొలంలో వుంచి, ఒక పందిరివేశాం. ఊళ్లో ప్రచారం చేశాం.

వేంకటేశ్వర స్వామి వెలిశాడని జనం రాసాగారు. సాక్షాత్తు వేంకటేశ్వర స్వామి... ఆ విగ్రహానికి చిన్నగుడి ఏర్పడ్డది. తర్వాత అది వైకుంఠపురం అయింది. ఇప్పుడు దానికి పెద్ద ఆకర్షణ.

పరమేశ్వర శర్మ ట్రూపు వేస్తున్న నాటకాలు చూచి, నాకు నాటకాలు రాయాలని బుద్ధిపుట్టింది. అమెచూర్ నాటక సమాజాలతో స్నేహం ఏర్పడ్డది. 'నిజానిజాలు' అనే నాటకం రాశాను. దుగ్గిరాలవారు దానిని ప్రదర్శించారు. ఒక నూరు ప్రదర్శనలిచ్చారు. అప్పుడు కౌతా రామమోహనరావు, మున్సిపల్ ఆఫీసులో పనిచేసేవాడు. ఒమర్‌ఖయ్యాం నాటకం ప్రాక్టీసుకు తీసుకున్నాడు. చిల్లర భావనారాయణ రాసింది అది. ఆ నాటకానికి పాటలన్నీ నేను రాశాను. రేవతి అనే అమ్మాయి, సూరిబాబు కూతురు, సాకీ వేసింది. రామ్మోహనరావు ఒమర్‌ఖయ్యాం వేశాడు. నా పాటలకు మంచి గుర్తింపు వచ్చింది. మిత్రులంతా సినిమాలకు రాయమని ప్రోత్సహించారు.

కొన్నాళ్లు నాటకాలపిచ్చి పట్టింది. గౌతమబుద్ధ అనే నాటకంలో వేశాను. మా కాలేజీలో ఇంగ్లీషు నాటకాల్లో వేశాను. డైరెక్షన్ చేశాను. డియర్ డిపార్టెట్ నాటికలో లేడీ కారెక్టరు వేసినప్పుడు మీసాలు తీసేయవలసి వచ్చింది. తెలుగునాటకంలో పోర్షను మరచిపోయి అక్షింతలు వేయించుకున్నాను.

1958... నా తెనాలి జీవితానికి చరమాంకం అది. ఊహించని మలుపులు తిరిగాయి. ఇంటర్ స్థానంలో ప్రీయూనివర్సిటీ మొదలుపెట్టారు. కాలేజీ కమిటి స్టాఫ్ మెంబర్లందరికీ నోటీసులు పంపింది... ఉద్యోగాలు టెర్మినేట్ చేస్తూ. కమిటీవారు అందరికీ హామీ యిచ్చారు. అందరికీ తప్పకుండా ఉద్యోగాలు యిస్తామని. వాస్తవానికి తెలుగు, హిందీ లెక్చరర్లందరినీ పంపించారు. కమిటీ సభ్యుల బంధువులు, స్వకులం వారికే ఎక్కువ పోస్టులు లభించాయి. శ్రీమతి రెండవసారి పురిటికని పుట్టింటికి వెళ్లింది. ఆగస్టు 4న మా రెండవ అబ్బాయి శ్యాంసుందర్ జన్మించాడు.

మధ్యలో రెండు ఉద్యోగాలు వచ్చినట్లేవచ్చి చేజారిపోయాయి. కేంద్ర ప్రభుత్వపు సమాచార శాఖలో ఒక ఉద్యోగం, మద్రాసులో వ్రాతపరీక్ష, ఇంటర్వ్యూ. ట్రాన్స్‌లేటర్ పోస్టు. వేమరాజు భానుమూర్తిగారింట్లో దిగాను. ఆయన దానిలోనే ఆఫీసరు. ఆయనే నన్ను పిలిపించారు. ఆ ఉద్యోగం నాకు గ్యారంటీ. మా మేనమామ తన అల్లుడిని పోటీగా పంపి, రికమెండ్ చేశాడు. అది అలా పోయింది. సొంత మేనమామ రాసిన ఆ ఉత్తరం నాకు చూపించారు భానుమూర్తిగారు.

మరొకసారి హైదరాబాదు రేడియోలో న్యూస్‌రీడర్‌పోస్టుకు వచ్చాను. అదీ

రాతపరీక్ష, ఇంటర్వ్యూ అయింది. ప్యానెల్‌లో నా పేరే మొదటగా వుంది. నన్నే రికమెండ్ చేసినట్టు మునిమాణిక్యం నరసింహారావు చెప్పారు. అప్పటికి భరద్వాజ రేడియోలో శ్రీ త్రిపురనేని గోపీచంద్ గారి అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గోపీచంద్‌గారు వాళ్ల ఇంటికి తీసుకువెళ్లారు. చివరకు ఆ ఉద్యోగం రాలేదు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తురగా కృష్ణమోహన్‌ని తీసుకోమని బెజవాడ గోపాలరెడ్డిగారికి ఫోన్‌చేసి మరీ చెప్పారు. దాంతో ఈ పెద్దలంటే వున్నగౌరవం పోయింది నాకు.

ఉద్యోగం లేకపోవడంతో ఇంట్లో నిరాదరణ ఎక్కువైంది. అప్పటివరకు నాకు జాతకాల మీద నమ్మకం లేదు. అయినవారే శత్రువులుగా ప్రవర్తించడం దుర్భరం. ఎవరితో మనసులోని బాధ చెప్పుకోవాలన్నా వీలుకాని పరిస్థితి. అప్పటికి ఉడుకు రక్తం చల్లబడ్డది. ఆదర్శాలు అడుగంటాయి. బ్రతుకుతెరవు ఒక్కటే సమస్య. నెలకి ఓ వంద రూపాయలు సంపాదించడం ముఖ్యం. కాలేజీకి వెళ్లే త్రోవలో కాలువ ఒడ్డున కుటుంబరావు గారని ఒక తెలుగు మాస్టర్ వుండేవాడు. ఆయన నాటకాలరాయుడు. అలా పరిచయం. తనకు సినిమాలలో నటించాలని కోరిక. ఒకరోజున ఆయన చెప్పాడు "మారిస్‌పేటలో సత్రంలో ఒక సాధువు వున్నాడు. ఒకరిద్దరికి మాత్రమే జ్యోతిషం చెబుతాడు. బాగా చెబుతాడు"అని. ఆయన గురించి కాలేజీ మిత్రులు చెప్పగా విన్నాను. ఒకరోజు సాయంత్రం కుటుంబరావుగారు, ఆ సాధువు మాట్లాడుకుంటూ వుండగా నేనే వెళ్లడం జరిగింది. ఆయన నా చేయి చూచి జ్యోతిషం చెప్పాడు. "ఉద్యోగం పోయినట్లే. ఈ సంవత్సరం తిరిగేలోగా మంచిఉద్యోగం వస్తుంది. లైను మారుతుంది. కాలేజీ ఉద్యోగం కాదు. రాహు మహర్దశ నడుస్తోంది. ఏలిననాటిశని. కష్టాలు తప్పవు."

ఆయనపేరు రామారావు. మిలటరీలో పనిచేసి వచ్చాడు. కన్నడంవాడు. తెలుగు సరిగారాదు. గడ్డం తెగ పెరగడం వల్ల సాధువు అంటారు. ఆయనకు, నాకు స్నేహం కుదిరింది. స్టేషన్‌రోడ్డులో కూర్చుని చేతులు చూచి జ్యోతిషం చెప్పేవాడు. ఆయన వద్దనే హస్తసాముద్రికం నేర్చుకున్నాను. నా ఖర్చులు చాలావరకు తనే భరించేవాడు. కొత్త ఉద్యోగం మాట ఎలా వున్నా పామిస్ట్రీ అలవడింది.

ఉద్యోగం లేదు. సంపాదన లేదు. సంపాదించినంత కాలం ప్రేమ ఒలకబోసినవారే చీత్కరిస్తున్నారు. శ్రీమతి పిల్లల్ని తీసుకుని వచ్చింది. నా శని ఆమెకు పట్టినట్లుంది. ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నది. ఫిట్స్ రాసాగాయి. మా చెల్లెలు ఒకామెకు ఆ రోగం వుంది. అది అంటుజాడ్యం కాదు. మానసికంగా క్రుంగిపోతే వస్తుంది. నా ఆర్థికస్థితి ఆమెను క్రుంగదీసి వుంటుంది. దానికి తోడు అమ్మ ప్రవర్తన. అనాగరికంగా ప్రవర్తించేది.

నేను ఇంట్లో వున్నప్పుడు ముభావంగా వుండేవారు. నేను బయటకు పోగానే సాధింపులు మొదలుపెట్టేవారు. సాధించడంలో మా అమ్మ మహానేర్పరి. 'అమ్మ' కనుక అనకూడదుగాని, ఆమె మాటల్లో విషం, చూపుల్లో విషం కక్కేది. ఒకరోజున రాత్రి ఇంటికి వచ్చేసరికి యామినీదేవి దైన్యంగా వుంది. మాట పలుకు లేదు.

'ఏమైంది?' అని అడిగాను. 'మనకి అన్నం లేదు' అన్నది. విషయం అర్థమైంది. మర్నాడు ఆమెను పిల్లల్ని తీసుకుని నిడదవోలు వెళ్లి దిగబెట్టి వచ్చాను. ఉద్యోగం వచ్చేవరకు పుట్టింట వుండకతప్పదు. ఆమెకు అభిమానం జాస్తి. పుట్టింట్లో వుండడం యిష్టం లేదు. ఒక్కడినే తెనాలి వచ్చాను. రామారావుగారితో జ్యోతిషం చర్చలు. ఓ రోజు సాయంత్రం కాలవపక్క ఇసుక గుట్టలపై కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుండగా "రేపు నీకు ఉద్యోగం వస్తుంది. ఈరోజునే పోస్టు చేశారు" అన్నారు. "ఈరోజు ఆదివారం. పోస్టు చేయడం ఏమిటి?" "ఏమో ఈరోజే పోస్టు చేసారు. రేపు అందుతుంది."

మర్నాడు పోస్టులో ఓ ఉత్తరం వచ్చింది. మద్రాసు నుండి విద్వాన్ విశ్వంగారు రాశారు. 'ఆంధ్రప్రభలో సబ్ ఎడిటర్ పోస్టుకు. శ్రీ నార్లవారు ఉత్తరం రాయమన్నారు. రా' అని, మూడే ముక్కలు రాశారు. ఆశ్చర్యం. ఆ ఉత్తరం ఆదివారం నాడే పోస్టయింది. వెంటనే వెళ్లి రామారావుగారికి కృతజ్ఞతలు చెప్పి, ప్రయాణానికి రెడీ అయినాను. రెడీ అంటే ఉన్న నాలుగు బట్టలు సంచిలో పెట్టుకోవడం, వెంట తీసుకువెళ్లవలసినవి ఏవీ లేవు. ప్రయాణానికే డబ్బులేదు. అయితానగర్‌లో ఈదర లక్ష్మీనారాయణగారని ఒకాయన వున్నారు. వారికి నేనంటే అభిమానం. వారిని కలిసి చెప్పాను. చాలా సంతోషించి, ఓపదిరూపాయలు పెట్టెలోంచి తీసి యిచ్చారు. "టికెట్‌కి సరిపోతుంది వుంచు. అక్కడ నీకు డబ్బు అవసరమైతే చందమామ ఆఫీసుకు వెళ్లి రామారావుగారని వుంటారు. వారిని కలువు. నీ ఖర్చులకు డబ్బు యిస్తారు. నేను ఫోన్ చేసి చెబుతాను." అని సలహా యిచ్చారు.

ఆయన విజయా చక్రపాణిగారికి మిత్రుడు, బంధువు. మద్రాసులో లక్ష్మీనారాయణగారు చెబితే చందమామలో ఉద్యోగం వస్తుంది. పిల్లల కథలు రాయడం నాకు చేతకాదు. రికమెండ్ చెయ్యండని అడిగితే ఒకసారి 'కష్టం' అని తప్పించుకున్నాడు. ఉద్యోగం వచ్చాక ఆదరణ చూపాడు. మా మేనమామ తెనాలిలోనే వున్నారు. ఆయనకు చెప్పదలచలేదు. ఇంట్లో కూడా నిడదవోలు వెడుతున్నానని చెప్పి బయలుదేరాను. అప్పుడు తెనాలి నుండి మద్రాసుకు టికెట్టు పదిరూపాయలే. రామారావుగారు, భరద్వాజ, అయిదారుగురు రచయితలు వీడ్కోలు చెప్పడానికి స్టేషన్‌కు వచ్చారు. నాకళ్లలో నీళ్లు.

ఏడుపు వచ్చింది. బహుశా తెనాలికి నాకు ఋణం తీరిపోయిందేమో! గుండె బిగపట్టింది. ఊపిరి ఆగిపోయినట్లయింది. 18 సంవత్సరాల అనుబంధం ... చదివింది. ఉద్యోగం చేసింది అక్కడ. మళ్లీ అక్కడినుండే ఒంటరిగా ప్రయాణం. వెలుగులోంచి చీకట్లోకి రైలు పయనిస్తోంది. చీకటిజీవితంలోంచి వెలుగుబాటల్లోకి నేను పయనించబోతున్నాను. కొన్ని నిమిషాల్లో తెనాలి జ్ఞాపకాలస్థానే మద్రాసు కలలు.

జర్నలిజంలో ప్రవేశం

ఒక కళాకారుడి స్వప్నం సినిమాలోకం.
ఒక రచయిత స్వప్నం పత్రికా ప్రపంచం.

సినిమాలు, పత్రికలు వున్న నగరం మద్రాసు.

మద్రాసులో కాకుమాను నాగేశ్వరరావు అని మా బంధువులే. సినిమా ఆర్ట్ డైరెక్టరు. డైరెక్ట్‌గా వారింటికి వెళ్లాను. ఆయన 'నాగ్' పేరుతో సినిమాలకు పబ్లిసిటీ చేస్తారు. ఆర్టు డైరెక్షన్ చేస్తారు. లాయడ్స్ రోడ్డులో వారి మేడ వెతుక్కుంటూ వెళ్లాను. పరిచయం చేసుకున్నాను. బందరువాడు. చాలా బిజీ. ఎం.జి.రామచంద్రన్ ఇల్లు, వీరి ఇల్లు ఎదురుబొదురుగా వుండేవి. ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు కార్లలో వచ్చి పోతుండేవారు. తాను ఆర్ట్ డైరెక్షనుకు వెళ్లేవాడు. మద్రాసు కొత్త నాకు. ఆయన అంతస్తు నాకు అందనిది. ఉద్యోగంలో చేరగానే రూం వెతుక్కోవాలి. అంత సంపన్నుల ఇంట నావంటి పేద వుండలేడు. ఒక్కరోజు వారింట భోజనం పెట్టారు. మెట్ల దగ్గర చోటు చూపించి ఒక చాప యిచ్చారు. పేదవాడంటే ఎంత అలుసు. నా డిగ్రీ చదువు. నా ఉద్యోగం కూడా వారి తాహతుకు తగినట్టు లేదు. స్నానం చేసి బయలుదేరాను. ముందు విద్వాన్ విశ్వంగారిని చూడాలి. కాలినడకనే బయలుదేరాను. పైక్రాఫ్ట్ రోడ్డులో వెడుతుండగా తిరుమల రామచంద్ర కనిపించారు. వారు ప్రభలో పనిచేస్తున్నారని తెలుసు. నమస్కారం చేసి, విశ్వంగారి ఇంటి అడ్రస్ అడిగాను. నేను ఉద్యోగార్థం వచ్చానని తెలిసి, నా వెంట వచ్చి విశ్వంగారి ఇల్లు చూపించి వెళ్లారు.

విశ్వంగారింట్లోకి వెళ్లాను. వారు ఏదో రాసుకుంటున్నారు. "నీవు శార్వరి!" అన్నారు. అవునన్నాను. వారి శ్రీమతి కాఫీ తెచ్చి పెట్టింది. "ఉద్యోగంలో చేరడానికి వచ్చారా, సంతోషం" అన్నది. "నార్లగారిని వెళ్లి చూడు" అన్నారు విశ్వంగారు. ఎంతసేపు కూర్చున్నా ఆయన ఎక్కువ మాట్లాడరు. అది ఆయన నైజం.

వారింటికి అసింట అదే సందులో వుంది నార్లగారి ఇల్లు. నార్లగారిని కలవడానికి కాళ్లు వణికేయి. ఆయన జర్నలిజంలో హిమగిరి శిఖరం వంటివారు. నేను అర్భకుణ్ణి. తన పత్రికలో పనిచేయడానికి తానై ఆహ్వానం ... మహాప్రసాదం వంటిది.

నార్లవారి శ్రీమతి పలకరించారు. నిండుకుండ. గొప్ప ఇల్లాలు. గొప్పవారి భార్యలంతా అలాగే ప్రేమగా, ఆదరంగా వుంటారేమో! "పైన వున్నారు వెళ్లండి" అన్నది. పైకి వెళ్లాను. టేబుల్ లైటు వేసుకుని సిగరెట్ కాలుస్తూ నాలుగుపుస్తకాలు మంచంమీద పరచుకుని ఒక పుస్తకం చదువుతున్నారు.

"నమస్కారం సార్. నాపేరు శార్వరి."

"ఓ నువ్వా!... కూర్చో..."

అంతలో కాఫీ వచ్చింది. అయిదు నిమిషాల తర్వాత 'సంజీవదేవ్ తెలుసునా?' అని అడిగారు.

'తెలుసునండి. ఈ మధ్యనే తుమ్మపూడి వెళ్లి వారితో ఓ రోజు గడిపాను.'

మరో అయిదు నిమిషాలు గడిచాయి.

"పది గంటలకు ఆఫీసుకురా" అన్నారు.

వెళ్లి విశ్వంగారికి చెప్పి వచ్చేశాను.

మౌంట్‌రోడ్డులో విక్టోరియా మెమోరియల్, స్పెన్సర్, ఆర్ట్స్ కాలేజీ దగ్గర ప్రభ ఆఫీసు. మద్రాసు మౌంట్‌రోడ్, మెరీనాబీచ్ గొప్ప ప్రసిద్ధప్రాంతాలు. ఎక్స్‌ప్రెస్‌కు ముందరి బిల్డింగ్‌లో ఆంధ్ర రెవెన్యూ ఆఫీసు లుండేవి. ఎక్స్‌ప్రెస్ కాంపౌండ్ లోపల ఆంధ్ర పి.ఎం.జి. ఆఫీసు వుండేది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడినా, ఇంకా కొన్ని ప్రధాన కార్యాలయాలు, మద్రాసు నుండి పనిచేస్తుండేవి. రెవెన్యూ బోర్డు ఆఫీసులో కొండూరు ఓంకారంగారు, మా బంధువు, పెద్ద ఉద్యోగి. ఇంటర్వెల్‌లో వారిని కలిశాను. ఒకరోజు వారింటికి తీసుకువెళ్లారు. అలాగే కందుకూరి విశ్వనాథం గారింటికి ఒకసారి వెళ్లాను. ధూళిపూడి ఆంజనేయులుగారిని కలిశాను. అప్పట్లో 'వాణి' రేడియో పత్రిక ఎడిటర్‌గా వుండేవారు. మరోసారి రావూరి భరద్వాజ గారిని కలిశాను. చందమామ ఆఫీసుకు వెళ్లి దాసరి సుబ్రహ్మణ్యం, కొడవటిగంటి కుటుంబరావు, ధనికొండ హనుమంతరావు, చందమామ రామారావుగార్లను కలిశాను. అప్పుడే ముద్దా విశ్వనాథం, వడ్డాది పాపయ్యగారలతో పరిచయం.

ఆంధ్రప్రభలో ఉద్యోగం ఉద్వేగభరితంగా వుంది. నాకు అపాయింట్‌మెంట్ వీక్లీలో. ఎడిటర్ నార్లగారే అయినా అన్ని బాధ్యతలు విద్వాన్ విశ్వంగారివే. కె. సభా

వున్నారు. ఎం.ఎస్.మూర్తి, డిగార్ యిద్దరు ఆర్టిస్టులు. డెయిలీలో వాసు అనే కార్టూనిస్టు వుండేవారు. నార్లవారి సంపాదకీయానికి పోటీగా వుండేవి ఆయన కార్టూన్లు. అతనికి అసిస్టెంటు ఎడిటర్ హోదా వుండేది. నీలంరాజు వెంకటశేషయ్యగారు లీడర్ రైటర్, అంటే సంపాదకీయాలు రాయాలి. నార్లగారు రాయని రోజున వీరు రాసేవారు. మట్టా శాస్త్రి (స్క్రిప్ట్‌ఆర్ట్), న్యూస్ ఎడిటర్, సబ్-ఎడిటర్స్... నాతోపాటు సబ్స్‌గా చేరారు పుత్తూరి పుల్లయ్య, జాస్తి జగన్నాథం , వేటూరి సుందరరామమూర్తి... వారు ముగ్గురు డెయిలీలో వుండేవారు. నేను వీక్లీ. జగన్నాథం తెనాలి కాలేజీలో నాతో పనిచేశారు తెలుగు ట్యూటర్‌గా. గోల్డ్‌మెడలిస్ట్. నాతోపాటే అతని ఉద్యోగమూ ఊడింది కాలేజీలో. మంచివాడు. ఒక్కసారి భగవాన్‌దాస్‌గారిని (బి.డి. గోయెంక) కలిసి వచ్చాను. అది ఇంటర్వ్యూ. ఆయన అడిగింది లేదు. 'గో అండ్ జాయిన్' అన్నారంతే. 1958 నవంబరులో అలా జర్నలిజంలోకి, కొత్త ప్రపంచంలోకి, వార్తాప్రపంచంలోకి అడుగుపెట్టాను.

'నాగ్' గారింటినుండి మర్నాడే మారాను. అక్కడ మెట్ల క్రింద పడుకోవడం అవమానంగా భావించాను. వారింట భోజనం చేయబుద్ధి కాలేదు. లక్షలు డబ్బు వున్నదని గర్వం. ఆయన పిల్లలు అంతే. పెద్దగర్వం. మా బంధువులని వెళ్తే కె. విశ్వనాథం గారింట అంతే అమర్యాద. వాళ్లందరికి కార్లు, మేడలు వున్నాయి. మా ఆర్టిస్టు మూర్తిగారి రూంకు మారాను. ఆయన అవివాహితుడు. అప్పుడప్పుడు బ్రాందీ తాగేవాడు. నాకు ఆ వాసన గిట్టేది కాదు. తాగేవారంటే తగని భయం. ఇద్దరం కలిసి ఇల్లు చూచాం. 'ఎడ్వర్డ్ ఇలియడ్ రోడ్డులో చిల్డ్రన్స్ గార్డెన్ స్కూలు పక్కన ఒక పెద్ద కాంపౌండ్‌లో చిన్న చిన్న ఔట్‌హవుస్ లాంటి ఇల్లు. యాస్‌బెస్టాస్ షెడ్లు. ఒకే గది, ముందు చిన్నవరండా. పాతిక రూపాయలు అద్దె. పది వరకు నాలాంటి చిన్న ఆదాయాల వారు అద్దెకున్నారు. ఆంధ్రప్రభ ప్రూఫ్ రీడరు రాధాకృష్ణ అని ఒకాయన దినమణి ప్రూఫ్‌రీడర్ నీలమణి అని మరొకరు ఆ పక్కపోర్షన్లలో ఉన్నారు ... కాస్త తెలిసినవారు.

ధనికొండతో ఏదోమాట పట్టింపువచ్చి రావూరి భరద్వాజ.ఓ కలాల కంపెనీలో చేరాడు. అతని జీతం 60 రూపాయలు. ఆంధ్రప్రభలో నా జీతం నూరు రూపాయలు. అతనికి పై సంపాదన బాగానే వుండేది. పత్రికలకు రాస్తుండేవాడు. పాకెట్ నవలలు రాసేవాడు. తన పుస్తకాలు పబ్లిషర్స్‌కు అమ్ముకునేవాడు. మొత్తంమీద రచయితగా బ్రతకనేర్చినవాడు. పైకొచ్చినవాడు. స్వయంకృషితో 'రచయిత'గా సంపాదించడం తెలిసినవాడు. లౌక్యం తెలిసినవాడు. పరిచయాల్ని స్నేహాల్ని బాగా ఎక్స్‌ప్లాయిట్ చేయడం చేతనైనవాడు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగల నేర్పరి. సాటి వారికి రూపాయి సహాయం చేసి, తను పది రూపాయలు లబ్ధి పొందుతాడు.

ఒకరోజు సాయంత్రం, భరద్వాజ ఒక వ్యక్తిని వెంటబెట్టుకుని వచ్చాడు నారూంకు. ఇంకా యామినీదేవి, పిల్లలు రాలేదు గనుక అది గదే.

"వీరు తెలుసుగదా" అన్నారు.

"తెలుసు. జాషువాగారు."

గొప్పకవి జాషువా... వారి పద్యాలు ఎన్నో నాకు కంఠతా వచ్చు. మద్రాసు రేడియోలో పనిచేస్తున్నారు అప్పుడు. ఒక చాప తప్ప ఇంట్లో ఏం లేవు.

"ఇదేమిటి భరద్వాజా. చెప్పా పెట్టకుండా వీరిని తీసుకువచ్చావు."

జాషువాగారు గుమ్మం గడపపై కూర్చుని "శార్వరీ! మనం నేల తరగతివాళ్లమే ఎప్పటికీ. బాధపడకు. మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగినవాళ్లం. 'గడప' దాటి అవతలకు పోలేం. 'గడప' ఇవతలనే వుండలేం." అన్నారు. గొప్ప సందేశం అది. జీవితంలో నాలాంటి వాళ్లు మరువరానిది.

ధూళిపూడి ఆంజనేయులుగారు 'వాణి' ఎడిటర్. అప్పుడే రష్యాలో పర్యటించి వచ్చారు. వారి శ్రీమతి ఆదిలక్ష్మి లెనిన్‌గ్రాడ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్. ఆయన రష్యాని గురించి రాసిన ఇంగ్లీషు వ్యాసాలను తెలుగులోకి అనువదించమని కోరారు. ఏడు వ్యాసాలు వారంరోజుల్లో తెలుగుచేసి యిచ్చాను. అవి ఆంధ్రపత్రికలో ప్రచురితమైనాయి. అప్పటినుండి డి. ఆంజనేయులు గారితో స్నేహం. అనేక సందర్భాలలో వారు నాకు సహాయం అందించారు. ముఖ్యంగా వారికీ నార్ల వెంకటేశ్వరరావుగారికీ వున్న స్నేహం, నార్లగారికి నాపైన ప్రత్యేకమైన అభిమానం కలగడానికి దోహదం చేసింది. అప్పట్లో జర్నలిజంలో అవకాశం రావడం చాలా కష్టం. ఎడిటర్లకు ఇష్టమైతేనే ఉద్యోగం. అభ్యర్థికున్న సాహితీవిలువలు, రచనా సామర్థ్యమే అర్హతలు.

కష్టపడి పనిచేసి ఉద్యోగం నిలుపుకోవాలి. ఇది తప్ప మరోగతి లేదు. జర్నలిజంలో పైకి రావాలి. రచయితగా పేరు సంపాదించాలి. విశ్వంగారికి నేనంటే అభిమానమే కానీ మితభాషి. వారికి రాజకీయ జీవితం వుంది. జైలుకు కూడా వెళ్లారు. నీలం సంజీవరెడ్డి, తరిమెల్ల నాగిరెడ్డి ఆయన బాల్యమిత్రులు. ఆయనకు ఉద్యోగాలు రావడంలో సంజీవరెడ్డిగారి ప్రమేయం వుండేది. కథలు, నవలలు చదవడం, మంచివి సెలెక్టు చేయడం, సెలెక్టు చేసిన వాటిని ప్రచురణ యోగ్యంగా తప్పులు దిద్దడం నేర్పారు. భాషా దోషాలు పరిహరించాలి. అనవసరమైన భాగాలు తీసేయాలి.

అప్పటికి సినిమా ఎడిటర్‌గా వున్న సుదర్శనాచారి స్థానంలో నన్ను వేయడం వల్ల, చేరినవారంలోనే సినిమా ప్రివ్యూకు పోవలసి వచ్చింది. థియేటర్‌లో సినిమాలు

చూడడం వేరు ప్రివ్యూలో చూడడం వేరు. పత్రికలవారికోసం, ఆర్టిస్టులకోసం ప్రివ్యూలు వేసేవారు. ఓ వారంలో పిక్చర్ రిలీజ్ చేస్తారనగా ఈ ప్రివ్యూలు వుండేవి. పిక్చర్ రిలీజ్ నాటికి పత్రికలలో ఆ చిత్రం గురించిన సమీక్షలు రావాలి. ఎన్ని వారాలు ఆడితే అన్ని వారాలు అడ్వర్‌టైజ్‌మెంట్లు యిచ్చేవారు. మంచిరివ్యూతో పత్రికల ఆదాయం ముడిపడి వుండేది. చిత్రాన్ని విమర్శిస్తే ప్రకటనలివ్వడం నిలిపివేసేవారు. అదొక వలయం. చిన్న పత్రికల ఎడిటర్లకు, సినిమా పత్రికల ఎడిటర్లకు అడ్వర్‌టైజ్‌మెంట్స్ యిచ్చి, వంద రెండువందలు డబ్బులిచ్చి ఆకట్టుకునేవారు. దినపత్రికలు, వారపత్రికలు-ప్రభ, పత్రిక... ఆంధ్ర దేశానికి ఈరెండు దినపత్రికలు, రెండు వారపత్రికలే ప్రధానమైన పత్రికలు. అప్పటికి 'తెలుగుస్వతంత' హైదరాబాదు మారి 'స్వతంత్ర' అయింది. గోరాశాస్త్రిగారి సొంతపత్రిక అది.

ఎ.వి.ఎం. స్టూడియోలో ఒక తెలుగుపిక్చర్ ప్రివ్యూకి వెళ్లాను అక్కడ ముళ్లపూడి వెంకటరమణ, నండూరి రామమోహనరావు కలిశారు. ఇద్దరు ఆంధ్రపత్రిక ప్రతినిధులు. అప్పటినుండి వారిద్దరితో మైత్రి. ముళ్లపూడి వెంకటరమణ కొద్దిరోజుల్లో సినిమాలకు కథలు, మాటలు రాసే పనిబడి ఆంధ్రపత్రిక నుండి విరమించుకున్నారు. రామ్మోహన రావుగారు విజయవాడ ఆంధ్రజ్యోతికి వెళ్లిపోయారు. నా ఆంధ్రప్రభ ఉద్యోగం ఆరునెలలు సాగింది. అంతలో ఆంధ్రప్రభను విజయవాడకు తరలించాలని యాజమాన్యం ప్రయత్నించడం, దానిని వర్కర్లయూనియన్ ప్రతిఘటించడంతో సమ్మె వరకు సాగింది. సమ్మె సాకుగా తీసుకుని యాజమాన్యంవారు క్లోజర్ ప్రకటించారు. పాతపనివాళ్లను, పాతుకుపోయినవాళ్లను వదలించుకోడానికి యాజమాన్యానికి అదొకసాకు. సమ్మె చేయడం వర్కర్ల హక్కు, మూసివేస్తామనడం యజమానుల హక్కు. వర్కర్లకు, ఉద్యోగులకు, ఎడిటోరియల్‌స్టాఫ్‌కు చెక్కులందాయి. మూడునెలల నోటీసు బదులు జీతాలు గ్రాట్యుటీ చెక్కులు. నాలాంటి కొత్తవాడికి ఏమీరాదు. వెళ్లి విజయవాడ ఆఫీసులో చేరమని కబురు అందింది. ఇల్లు ఖాళీచేసి, శ్రీమతిని పిల్లల్ని నిడదవోలులో వుంచి విజయవాడ చేరాను. అక్కడ ధర్నాలు, సమ్మెలు... 'విశాలాంధ్ర' వర్కర్లు, ఆంధ్రప్రభ ముందు బైఠాయించేవారు. మరొకపక్క నార్ల వెంకటేశ్వరరావుగారు ఆంధ్రజ్యోతి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభను వదలిపెట్టారు. నార్లలేని 'ప్రభ'ని జనం ఊహించలేరు. కోర్టులో ఏవో అభ్యంతరాలు. ప్రభ దినపత్రిక ప్రారంభమైంది. 'టాబ్లాయిడ్'లో వేరే ప్రెస్‌లో ప్రింట్‌చేసి విడుదల చేస్తుండేవారు. వి.డి. ప్రసాదరావు యాక్టింగ్ ఎడిటర్. వారికి పత్రికలో పనిచేసిన అనుభవం వుంది. మద్రాసు 'ప్రభ' నుండి ఎందరు వచ్చి చేరతారో యాజమాన్యం

ఊహించలేదు. వర్కర్లు రారని గట్టి నమ్మకం. సబ్స్ కూడా మద్రాసు వదలి రాకపోవచ్చు విద్వాన్ విశ్వంగారు ఆంధ్రపత్రికలో చేరిపోయారు ... తనవరకు ఆయన జాగ్రత్తపడేవారు. మిగిలినవారి కష్టనష్టాలు పట్టించుకునే స్వభావం లేదు.

వీక్లీనుండి వచ్చింది నేను ఒక్కడినే. తర్వాత ఆర్టిస్టు మూర్తి వచ్చాడు. మా ఇద్దరితోనే ప్రభ వీక్లీ విజయవాడనుండి ప్రారంభమైంది. మూర్తిగారు బొమ్మలు వేయడం, టైటిల్ బొమ్మ రెడీచేయడం. పత్రికకు కథలు, సీరియల్స్ అవీ ఇవీ, అన్నీ సిద్ధం చేయడం నా వంతు. నీలంరాజు వెంకట శేషయ్యగారిని ఎడిటర్‌గా వేశారు. "మీకు వీక్లీ అనుభవం వుంది. పాతవారు ఎవరు రాలేదు. ప్రభ సంప్రదాయం తెలిసినవారు మీరొక్కరే. అక్కడ వీక్లీలోనే కంటిన్యూ చేయండి" అని నాకు సలహాయిచ్చారు.

శేషాద్రిగారని ఎక్స్‌ప్రెస్ ఇన్‌చార్జిగా వున్నారు. ఆయన్ని 'మాస్టర్' అనేవారు. బి.డి. గోయెంకాకు మంచి మిత్రుడు. నన్ను ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు రమ్మన్నాడు. శేషయ్యగారు అడ్డుపుల్ల వేసి ఆపివేశారు. అప్పట్లో ప్రభ వీక్లీ నా ఒక్కచేతిమీదగా నడిచింది. రోజూ మేనేజర్ స్వామిగారు వచ్చి సర్క్యులేషన్ పెంచాలి అని హెచ్చరిస్తూ ఉండేవారు. సమ్మె లాకప్ కారణంగా మద్రాసు నుండి ఒక్క ఫైలు విజయవాడ చేరలేదు. ముప్పాళ రంగనాయకమ్మ గారి నవల ఒకటి ఎడిట్ చేసి పెట్టుకున్నాను వెయ్యాలని. ఏ రచయితల అడ్రసులు జ్ఞాపకం లేవు. రంగనాయకమ్మగారు తన నవల ఏమైందని ఉత్తరం రాశారు. వెంటనే 'అమ్మా! మీ నవల వేద్దామనుకున్నాం. ఇంతలో ఈ ఉపద్రవం జరిగింది. మీ వద్ద రఫ్ కాపీ వుండేవుంటుంది. దయచేసి మరోకాపీ తయారుచేసి పంపండి' అని ఉత్తరం రాశాను. ఆమె వెంటనే పంపారు. 'బలిపీఠం' అది. ఆ నవల సీరియల్‌గా వేస్తూ నాకు తెలిసిన రచయిత లందరినుండి రచనలు తెప్పించేవాడిని. విజయవాడలోనే లతగారి 'ఊహాగానం' ప్రారంభించాను. కొమ్మూరి వేణుగోపాలరావు, వీరాజీ, మంజుశ్రీ, కాటూరి... ఇలా ఎందరో ఆనాటి యువరచయితల సహకారంతో ప్రభ వీక్లీ పుంజుకుంది. సర్క్యులేషన్ 70 వేల వరకు పెరిగింది. మద్రాసు నుండి నార్ల, విశ్వంగార్ల ఆధ్వర్యంలో వెలువడినపుడు అంత సర్క్యులేషన్ లేదు. రచయిత్రుల నవలలు పాఠకులు ఆదరించడం అప్పుడే మొదలైంది.

నాకు జీవితంలో సన్మానాలు జరగలేదు కానీ అవమానాలు మాత్రం అతిఘోరంగా జరుగుతూ వచ్చాయి. అది నాజాతకం. రవి నీచ...నీచభంగ రాజయోగం. రాజయోగం పడుతుందో లేదోగానీ నీచులవల్ల భంగపడక తప్పడం లేదు. తెలుసు గనక సహించగలిగాను. సత్యనారాయణపురంలో ఒక ఇల్లు చూచాను. అడ్వాన్సు యిచ్చి,

భార్యాబిడ్డల్ని పిలిపించాను. తెనాలినుండి కొంచెం సామాను తెచ్చుకున్నాం. ఇంట్లో చేరిన గంటలో ఇంటావిడవచ్చి "మీరు బ్రాహ్మలు కారటగా" అని అడిగింది.

"అద్దెకు మాట్లాడినపుడు మీరు అడ్వాన్సు అడిగారు. యిచ్చాను. మీరెవరని అడగలేదు, నే చెప్పలేదు."

"చదువుకున్నవారు, ఉద్యోగంచేస్తున్నారు అంటే బ్రాహ్మలే అనుకున్నాను."

"బ్రాహ్మలు కానివారుచదువుకోకూడదా. ఉద్యోగాలు చేయకూడదా?"

"వెంటనే ఇల్లు ఖాళీ చేయండి బాబూ, మీకు ఇవ్వడం లేదు."

పేచీ పెట్టుకోవచ్చు. మొండికేసి ఖాళీ చేయకుండా ఏడిపించనూవచ్చు. నిత్యం పోట్లాటలు, దెబ్బలాటలు వుంటాయి. నా శ్రీమతికి దెబ్బలాడటం చేతకాదు. తనకు అసలేభయం. అయినా అంత కులద్వేషం వున్నచోట నేనుండదలచలేదు.

సాయంత్రానికి వేరే ఇల్లు దొరికింది. ఆ పూటనే మారిపోయాం. ఆ ఇంట్లోనే సెంట్రల్ ఎక్సైజ్‌లో పనిచేస్తున్న జి. నారాయణ రావుగారితో పరిచయం. ఇప్పటికీ వారితో మైత్రి కొనసాగుతోంది. వారిప్పుడు నా యోగమిత్రులు. హితవరి... నా అభ్యుదయాన్ని అభిమానిస్తూ, నా ప్రగతిని కాంక్షిస్తున్న మంచిమనిషి జి.నారాయణరావు. ఇటీవలే సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరుగా రిటైర్ అయి, హైదరాబాద్‌లోనే వుంటున్నారు. ఆనాడు అవమానం చేసి, ఇల్లు ఖాళీ చేయించిన ఇల్లాలు 35 సంవత్సరాల తర్వాత వచ్చి నా యోగంలో చేరి శిష్యురాలైంది. అది తర్వాత మరోచోట రాస్తాను.

నార్లవారి హయాంలో సబ్ ఎడిటర్ల సెలెక్షన్‌కి అర్హత వారివారి ప్రతిభ. ఇప్పుడు కులం ప్రధానమైన అర్హతగా మారింది. రావూరి సత్యనారాయణగారిని వీక్లీలోకి తెచ్చిపెట్టారు. ఆయన కృష్ణాపత్రికలో 'ఆషామాషీ' రాసేవారు. కొంతకాలం సినిమా రచయితగా మహానటి భానుమతిగారి దగ్గర పనిచేశారు. తానుగొప్ప హ్యూమర్ రాస్తానని అనుకునేవాడు. ఉత్త సొల్లుకబుర్లు చెప్పి కాలక్షేపం చేస్తుండేవారు. పని తెలియదు. అసలు ఏ పనిచేయడానికీ బద్ధకం, సోమరితనం. అయితే ఎడిటర్‌గారు కోరితెచ్చి పెట్టినవాడు. నీలంరాజు వెంకటశేషయ్యగారు భద్రాచల రామభక్తుడు... పత్రికలనిండా ఎడాపెడా రామభజన వ్యాసాలు, ఫొటోలు ఎక్కువైనాయి. ఇష్టం లేకపోయినా ఎడిటర్ ఆర్డరు ప్రకారం చేసేవాడిని.

నార్లవారి సంపాదకత్వంలో వుండే 'ప్రభ' పేరు పోయింది. పాఠకులు తగ్గారు. పాఠకుల అభిమానం తగ్గిపోసాగింది. అవతల నార్లవారి కొత్తపత్రిక 'ఆంధ్రజ్యోతి' సర్కారు జిల్లాలలో బాగా అమ్ముడుపోసాగింది. ప్రభలో స్వాముల, మఠాధిపతుల, మఠాధిపతుల

ప్రచారం ఎక్కువ కావడంతో గాలిమారింది. విద్వాన్ విశ్వంగారు వచ్చి ఆంధ్రజ్యోతి డెయిలీలో చేరారు. నండూరి రామ్మోహనరావు, విద్వాన్ విశ్వం నార్లవారికి రెండు చేతుల్లా పనిచేశారు.

నీలంరాజు వారిని చూస్తేనే మడికట్టుకున్నట్లు కనిపిస్తుంది. నుదుట ఎర్ర బొట్టు, ధోవతి, ఎప్పుడూ నవ్వుతుండేవారు. కాని ఆయనకు వల్లమాలిన బ్రాహ్మణ అభిమానం. నేను ఆంధ్రజ్యోతికి పోదామనుకుని నార్లవారిని కలిశాను.

"ప్రస్తుతానికి అక్కడ వీక్లీలోనే వుండు శార్వరీ! ఆంధ్రజ్యోతి వీక్లీ ప్రారంభిద్దామనుకుంటున్నాం. అప్పుడు రావచ్చు. అక్కడి వీక్లీ అనుభవం ఇక్కడ పనికొస్తుంది."

మళ్లా విద్వాన్ విశ్వంగారితో కలిసి ఆంధ్రజ్యోతి వీక్లీలో పనిచేసే అవకాశం వస్తుందనీ నార్లవారి పత్రికలో పనిచేయవచ్చుననీ ఆశించాను. రావూరి సత్యనారాయణరావు గారు వచ్చి చేరిందే తడవు నన్ను ఉద్యోగం నుండి తొలిగించి తనవాళ్లని పెట్టుకోవాలని ప్రయత్నించాడు. ఎడిటర్ నీలంరాజుగారితో వీలైనన్ని కల్పించి చెప్పేవాడు. ప్రొప్రయిటర్ నన్ను మార్చడానికి వీల్లేదని ఖచ్చితంగా చెప్పడంతో ఇద్దరూ నోరు మూసుకున్నారు. అలా వీక్లీలో ఉద్యోగం నిత్యం ఒక ప్రమాదంగానే సాగినా యువ రచయితలు నేనంటే అభిమానంగా ఉండేవారు. ఎందరినో ప్రభ ద్వారా పరిచయం చేస్తుండేవాడిని.

కొంతమంది ఆంధ్రజ్యోతికి వెళ్లిపోవడం వల్ల కొత్తవారికి అవకాశం వచ్చింది. అప్పుడు చేరినవారు గొల్లపూడి మారుతీరావు, నండూరి పార్థసారథి... మారుతీరావు అప్పటికే నాటకరచయితగా ప్రసిద్ధుడు. 'రాగరాగిణి' లాంటి నాటకాలు ప్రదర్శింప బడుతుండేవి. సారథి నండూరి రామ్మోహనరావుగారి తమ్ముడు. తను ఆంధ్రజ్యోతిలో కాకుండా ప్రభకు ఎందుకు వచ్చాడో అర్థం కాలేదు. అడిగితే "అన్నగారిదగ్గర పనిచేయడంకన్న ఇండివిడ్యుయల్‌గా పైకిరావడం నాకిష్టం" అన్నాడు. ఇద్దరూ సరదా అయినవారు. పార్థసారథి మంచి హ్యూమర్ రాస్తాడు. మారుతీరావు సీరియస్ రైటర్. బెల్లంకొండ రామదాసు, అవసరాల సూర్యారావు, రెంటాల గోపాలకృష్ణ, జొన్నలగడ్డ రాధాకృష్ణ వంటి ప్రసిద్ధరచయితలు డెయిలీలో వుండేవారు.

అప్పట్లో అన్ని పత్రికలలో ప్రసిద్ధ రచయితలు సబ్స్‌గా వుండేవారు. రచనా ప్రతిభ జర్నలిజంలో ప్రవేశానికి మొదటి అర్హత. ఆంధ్రపత్రికలోనూ తిరుమల రామచంద్ర, తెన్నేటి సూరి, పిలకా గణపతిశాస్త్రి వంటి మహారచయిత లుండేవారు. కొడవటిగంటి కుటుంబరావుగారు ఆంధ్రపత్రిక వీక్లీలో పనిచేస్తుండేవారు. సబ్స్‌గా వున్న కారణంగా

ఎడిటర్లను భరించేవారు. నీలంరాజుగారంటే సంపాదకవర్గంలో అంత ఇష్టం వుండేది కాదు. అయినా ఆయన ఎడిటర్. లోగడ 'నవోదయ' పత్రిక నడిపినవాడు. ఏదో ఒక పాతకాలపు సినిమాలో హీరోగా వేశాడట. అదీ ఆయన గ్లామర్. అప్పుడు ఎ.బి.కె.ప్రసాద్ స్వంతంగా ఒక రాజకీయ వారపత్రిక నడుపుతుండేవారు. ఆ పత్రిక ప్రారంభోత్సవానికి వెళ్లాను. ఎ.బి.కె. మాలాంటి యువకులలో యువకుడు. స్వతంత్రభావాలు కలవాడు. ఒకరిక్రింద పనిచేయడం వారికిష్టం వుండేది కాదు. తన అభిప్రాయాలు నిష్కర్షగా రాయాలంటే స్వంతపత్రిక వుంటేనే సాధ్యం అనేవాడు. చూడగానే ఆదర్శ కమ్యూనిస్టు రచయిత అనిపించేవాడు. చాలామంది కమ్యూనిస్టు రచయితలకు లాల్చీ పైజామా, దళసరికళ్లద్దాలు అలవాటు. ఎంచేతనో మరి!

1960 నవంబరులో మా మూడవ అబ్బాయి పుట్టాడు. పేరు వెంకటరమణ. అప్పటికి నాకు, నా శ్రీమతికి దైవభక్తి మెండుగానే వుండేది. నిత్యం వెంకటేశ్వర సుప్రభాతం చదివేవాడిని. పూజలు గట్రా ఎక్కువే. మడి, ఆచారాలు మాత్రం మామూలే. ఎప్పుడో యజ్ఞోపవీతం వదలిపెట్టాను. పెళ్లి సమయంలో వేసుకున్నా పదహారు రోజులకే తీసివేశాను. నేనేమీ యజ్ఞాలు చేయడం లేదు. యజ్ఞం చేసేవారు వేసుకోవాలి ఉపవీతం నాకెందుకు. జంధ్యం వీపు గోక్కోడానికి కారాదు. జంధ్యం వేసుకోకపోవడమే గొప్ప విప్లవం అనుకునేవారు.

యామినీదేవి ఆరోగ్యం చక్కబడలేదు. ఫిట్సు వస్తూనే వున్నాయి. ఆపరేషన్ చేయించుకుందామనుకున్నాను. ఆమెకు ఆడపిల్లకావాలని కోరిక మిగిలి వుంది. ముగ్గురూ మగపిల్లలే. ఇంట ఆడపిల్ల పారాడకపోతే లక్ష్మిరాదట! ఏమిటో నమ్మకాలు. మా పెద్దవాళ్ల సహకారం చాలా తక్కువ. ఎప్పుడైనా వచ్చి చూచి పోవడం తప్ప పదిరోజులు మా వద్ద ఉన్నది లేదు. పత్రికల జీతం చాలదు. ఆదర్శాలు భోంచేస్తూ దేశాన్ని సమాజాన్ని ఏదో తమ రచనల ద్వారా ఉద్ధరిస్తున్నామన్న భ్రమ జర్నలిస్టులకు, రచయితలకు సహజం. ఆమాత్రం ఆత్మతృప్తి లేకపోతే ఎవరూ రచనలు చేయరు. రచనలు సమాజాన్ని మార్చ గలవు. అలాంటి సత్‌రచనలు చేసేవారెందరు?

ఒక పత్రికలో పనిచేసేవారు ఇతర పత్రికలకు రాయకూడదు. అది అలిఖిత శాసనం. ఎన్ని పత్రికలు వచ్చినా మా రచనలకు ఆంక్షలు ఏర్పడ్డాయి. రేడియోకు మాత్రం రాసుకోవచ్చన్నారు. అప్పుడప్పుడు రేడియోకు నాటికలు, కథలు, వ్యాసాలు రాసేవాడిని. రేడియో నాటికలలో పాత్రపోషణ చాలాకాలంగా వున్నదే. రేడియోస్టేషన్‌లో లత, శ్రీరంగం గోపాలరత్నం, బాల మురళీకృష్ణ, బుచ్చిబాబు, ఆమంచర్ల గోపాలరావు, బందా,

వింజమూరి శివరామారావు నాకు సన్నిహితులు. పత్రికల ప్రాపకం కోసం విజయవాడకు రచయితలు, రచయిత్రులు వస్తుండేవారు. పత్రికలతో ప్రత్యక్ష సంబంధాలు వారికీ మేలు. ఇటు పత్రికలకూ మేలు చేశాయి. పత్రికలు మద్రాసులో ఉన్నంతకాలం రచయితలు అంతదూరం వచ్చేవారుకాదు. అసలు పత్రికలవారు రిజర్వ్‌డ్‌గా వుండేవారు. విజయవాడ రాకతో పత్రికలు ప్రజల మధ్యకు, పాఠకుల మధ్యకు వచ్చాయి.

కథ, నవల కొత్తగా వోణీలు వేసుకోగాయి. వయసొచ్చిన ఆడపిల్లలా వయ్యారాలు సంతరించుకోసాగాయి. యువ రచయితలు కొత్తపోకడలు అలవరచుకున్నారు. వారపత్రికలు మంచి కథలు, నవలలు, సమాజశ్రేయస్సుకోసం ప్రచురించసాగాయి. సాహిత్య విలువలకన్నా, ఫిక్షన్‌లో సామాజిక స్పందన ఎక్కువైంది. రంగనాయకమ్మగారి నవలా విజయం తర్వాత కోడూరి కౌసల్యాదేవి, యద్దనపూడి సులోచనారాణి రంగప్రవేశం చేశారు. అలా క్రమక్రమంగా పత్రికలలో మగవారి జోరుతగ్గి ఆడవారి జోరు హెచ్చింది. అది అవమానంగా భావించి కొందరు మగరచయితలు 'ఆడపేర్ల'తో రాయడం జరిగింది. అది ఒకరంగా ఆత్మవంచన అయినా అప్పట్లో తెలిసీ ఆపద్ధతిని ఆపలేకపోయాం.

విజయవాడలో వున్న కొద్దిరోజుల్లో కొంతమంది పెద్దల పరిచయం కలిగింది. దేవరపల్లి చిన్నకృష్ణశర్మ అనే తెలుగుపండితుడు పిల్లల కథలు రాసేవాడు. ఆయన ఆఫీసుకు వచ్చి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి గురించి, వారి యోగచికిత్సల గురించి చెప్పాడు. మా శ్రీమతి ఆరోగ్యమే అప్పటి బెంగ. తిరుపతి తీసుకువెళ్లి శ్రీశాస్త్రిగారికి చూపిస్తే యోగచికిత్స చేస్తారని సలహా చెప్పాడు. అప్పటికే ప్రభాకరశాస్త్రిగారు పరమపదించారని ఆయనకు తెలియదేమో!

మా మేనమామగారికోసం ఆయన వెంట విశ్వనాథ సత్యనారాయణ గారింటికి ఒకసారి వెళ్లాను. నేను ఫలానా అని పరిచయం చేసుకున్నాను. "ఇంకా కవిత్వం రాస్తున్నావా, కట్టిపెట్టేసావా?" అని అడిగారు. 'ప్రభలో సబ్ ఎడిటర్‌ని' అని చెప్పాను. "మంచిబాట. కవిత్వంతో కడుపు నిండదులే. పత్రికలు మంచివే. సాహిత్యం రాయడమే కాదు. దాన్ని పోషించుకోవాలి" అన్నారు విశ్వనాథ.

మరొకసారి... చుట్టకాల్చుకుంటూ కాటూరి మాస్టారు ఆఫీసులోకి వచ్చారు.

"ఎవరూ శార్వరి అంటే?"

మా ఎడిటర్‌గారే తీసుకువచ్చి పరిచయం చేశారు. 'కాటూరి-పింగళి' సౌందరనందం చదివాను. వారంటే గౌరవం నాకు. ఎందుకో బుజం తట్టి, ఆశీర్వదించి, అభినందించి వెళ్లారు. మరొకసారి స్వామి శివశంకరులు అలాగే వచ్చారు. వారు సన్యాసం

స్వీకరించారనుకుంటా. కాషాయబట్టలు ధరించారు. వారు పనికట్టుకుని వచ్చి ఆశీర్వదించారు. అప్పుడే గుడివాడలో బోయిభీమన్నగారికి గండపెండేరం తొడిగి, కనకాభిషేకం జరిపారు. ఆయన విజయవాడ మా ఆఫీసుకు వచ్చి నన్ను పరిచయం చేసుకున్నారు.

అవసరాల సూర్యారావు, బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాలకృష్ణ నా కొలీగ్స్ ... మంచి రచయితలు. ముగ్గురు కమ్యూనిస్టు అభిమానులే. సూర్యారావుగారు గురజాడ అప్పారావుగారి గ్రంథాలు ఎడిట్‌చేసి పెట్టారు. విశాలాంధ్రవారు ప్రచురించారు. వారి పరిశోధన పింగళి లక్ష్మీకాంతంగారికి నచ్చింది. ఆయన అప్పటికే ఆంధ్ర విశ్వవిద్యాలయం వదలి, రేడియోలో పనిచేస్తున్నారు. పల్నాటి వీరచరిత్ర ద్విపదకావ్యం పరిష్కరిస్తున్నారు. అవసరాల సూర్యారావు, నేనూ వెళ్లి వారికి సహాయం చేస్తుండేవాళ్లం. అలా 'పింగళి' వారికి ...యూనివర్శిటీలో శిష్యుడిని కాలేకపోయినా వారితో చేయి కలిపే అవకాశాన్ని అదృష్టంగా భావించాను.

వి... యవాడలో మాసెక్షనులో శివలెంక ప్రసాద్ పనిచేస్తుండేవారు. వాళ్ల ఇంటికి ఒక ...య్యం చుట్టంగా వచ్చింది. క్రింద వున్న గిన్నెలు అమాంతంగా పైకి లేచేవి. అటక ఎక్కికూర్చునేవి. ఇక్కడ వున్న మంచాలు ఎగిరి ఎక్కడికో పోయేవి. ఒకవారం తర్వాత ప్రసాద్ నన్ను తీసుకువెళ్లాడు చూపించడానికి. మా నాన్నగారు దెయ్యాలు బాగుచేసేవారు కనుక, నాకు దయ్యాలంటే భయంలేదు. వెళ్లి చూచాను. వీలైతే మా నాన్నగారిని పిలిపించి దయ్యాన్ని వదలించమని ప్రసాద్ అడి...ు. నేను వెళ్లి చూచాను. నా ముందర ఏవీ దెయ్యం చేష్టలు కనిపించలేదు. ఆ రోజు నుండి దయ్యం ఏ వికార చేష్టలు చేయలేదు. పారిపోయింది. బహుశా నా మనస్సులో నాన్నగారిని స్మరించడం వల్ల ఆ దయ్యం పారిపోయి వుండాలి. నాకే ఆశ్చర్యం వేసింది. అందరూ నేనే దయ్యాన్ని తరిమివేశానని అనుకున్నారు. అప్పుడు 'శివం'గారితో పరిచయం. శివం గుడిపాటి వెంకటచలంగారి భక్తుడు, శిష్యుడు. అతనికి, రావూరి భరద్వాజకు చలం స్నేహం.

chapter.[1] The text is uniform in these mss., and is derived from a common source. Ga (Lahore, Panjab University Library, No. 1427) concludes with the Jyotiṣṭoma. Gbc were supplied through the good offices of Pt. G. Harihara Śāstrī of Trivandrum. Of these Gb stops with 12. 18 of our text, while Gc has only nine complete chapters. At the end of the Sūtra Gb appends a big fragment of the Bhāradvāja-Darśa-Pūrṇamāsa-Prayoga. Still another Grantha manuscript (Lahore, D. A.-V. College, No. 5980) was examined and even collated. It has, however, not been included in our critical

---

1 In the year 1926 I had compared the Berlin (Weber's Catalogue, No. 1448) and Munich (Aufrecht's Cat., No. 118) manuscripts with our Da, and was greatly disappointed to discover that they were recent transcripts made from the same source as our Da.

The Munich ms., however, has a Supplement, the Bhāradvāja Pariśeṣa-sūtra, which is of exceptional interest. After the customary salutations to Gaṇeśa, Sarasvatī and the Gurus the Supplement begins:

अथात: सूत्रपरिशेषान् व्याख्यास्यामः ॥ बाहुमात्राः परिधय: स्फ्यं शम्या च । प्रादेशमात्राण्यरत्निमात्राणि वेध्मकाष्ठानि शुष्काण्यार्द्राणि वा । सवल्कलानि ॥

It is a small work, not exceeding 200 granthas; but its contents are most varied, We give a few short extracts below:

अथ नक्षत्रेष्टीनां याज्यानुवाक्या यथा समाम्नाता उपहोमाश्च भवन्ति प्राकृतावाज्यभागौ आम्नातै संयाज्ये यथाश्रद्धं दक्षिणा भवन्ति ॥

अत ऊर्ध्वं याजमानं यथासमाम्नातं वाजपेयं साग्निमेके समामनन्ति ॥

यो ब्रह्मचारी स्त्रियमुपेयात् स गर्दभं पशुमालभेत आहिताग्निरित्येकमनाहिताग्निरित्यपरम् ॥

हविर्दोषान् व्याख्यास्यामः॥ अथातोऽग्नीनामुद्वातानां खंडद्वयं **बौधायनवत्**...यद्याहिताग्निः पुनर्दारान् कुर्वीत अग्नीन् नोत्सृजेयुर्लौकिकाः संपद्येरन् । तस्य पुनरग्न्याधेयं विद्यत **इत्याश्मरथ्यः** ॥ पुनराधेयमित्या**लेखनः** पुनरग्न्याधेयमित्**यौडुलोमिः** ॥ ॥

अथातोऽनुग्रहान् व्याख्यास्यामः समस्तहोमो **बौधायनवत्** ॥ ॥

Vijñāyate-passages are scattered all over the text. It ends:

आज्यालाभे आजमाविकमाहिषं वा घृतमाज्यार्थे इत्यादि ॥ ॥ इति भारद्वाजीयपरिशेषसूत्रं संपूर्णं श्री रामार्पणमस्तु ॥ श्री सांबसदाशिवप्रसन्न ॥ श्री वासुदेवप्रसन्न ॥ श्री गोविन्दाय ॥

I also possess a Bhāradvāja-Pravarasūtra in Grantha characters.

వుండేది. అందులో చిత్తూరు చేరవచ్చు. లేదా తిరుపతి నుండి బస్సులో వెళ్లాలి. తిరుపతిలో ఒకపూట ఆగి అక్కడ మా తోడల్లుడు గాయత్రీ ప్రసాద్‌గారిని కలిశాను. పెళ్లి అయింది కాని ఇంకా సంసారం పెట్టలేదు. రూంలో వుంటున్నారు. ఆయనప్పుడు పాలిటెక్నిక్ కాలేజీలో డిమాన్‌స్ట్రేటర్. బస్సులో చిత్తూరు చేరాను. జట్కాబండి కట్టించుకుని ఆఫీసుకు వెళ్లాను. చిత్తూరులో దానిని పేపరుమిల్లు అనేవారు, పేపరాఫీసు అనికాదు. ఊరికి రెండు కిలోమీటర్ల దూరం. కలెక్టరు బంగళాదగ్గర. సర్ సి.ఆర్. రెడ్డిగారి బంగళా. క్రింద ఆఫీసు కాంటీను. మేడపైన స్టాఫ్‌కు విడిది. జిల్లాకేంద్రమే అయినా ఒక పెద్దపల్లె చిత్తూరు. ఓ అడివిలో ఆఫీసు. చీకటిపడితే పాముల సంచారం ఎక్కువ.

జి.కృష్ణగారు న్యూస్‌ఎడిటర్. వి.డి. ప్రసాదరావు అసిస్టెంట్ ఎడిటర్. బాధ్యతలన్నీ కృష్ణగారివి. ఇద్దరూ ఆంధ్రపత్రిక నుండి వచ్చినవారే. నీలంరాజు వెంకట శేషయ్యగారంటే ఇద్దరికీ చిన్నచూపు. కృష్ణగారు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం ఎడిటర్‌కు నచ్చేది కాదు. బాస్‌లు: ఎడిటర్‌కు తెలియకుండా అసిస్టెంట్లను నియమించి 'మిత్రభేదం' కల్పించేవారు. అదొక వేడుక. అది పత్రికారాజకీయం. తిరుమల రామచంద్ర డెయిలీలో చేరారు. వీక్లీకి బి.సి. కామరాజును నియమించారు. పేరుకు రావూరికి అసిస్టెంటు కానీ పెత్తనం అంతా అతనిదే. ఆయన రావూరి సత్యనారాయణను పూచికపుల్లలాగా చూచేవాడు. ఏమాత్రం గౌరవం ఇచ్చేవాడు కాదు. రావూరి నన్ను మంచి చేసుకుకోవాలని దువ్వసాగాడు. కామరాజు నన్ను తనవైపు త్రిప్పుకోవాలని ప్రయత్నం. ఎవరిమాట వినాల్నో నాకు అర్థం అయ్యేది కాదు.

గొల్లపూడి మారుతీరావు బాగా కబుర్లు చెప్పి, మనుషుల్ని మెస్మరైజ్ చేయగలడు. తాను జీనియస్ ననిపించుకుంటాడు. కామరాజు అతనిమాయలో పడ్డాడు. మారుతీరావు లాంటి జీనియస్ వీక్లీకి ఉండడం మేలని భావించి పైవారికి రాశాడు. అతని స్థానంలోకి నన్ను, నా స్థానంలోకి మారుతీరావు బదిలీ జరిగింది. నాకు గొప్ప రిలీఫ్. కామరాజు, రావూరిల బాధతప్పింది. బి.సి.కామరాజు 'తూలికాభూషణ్' పేరుతో మంచికథలే రాశాడు. మంచి ఎడిటర్. కష్టపడి పనిచేసేవాడు. మనుషుల్ని తన చుట్టు తిప్పుకోవాలని కోరిక. రాత్రి పన్నెండు అయినా ఇంటికి పోనీయడు. నేను అయిదుగంటల తర్వాత పనిచేయను. అతను మధ్యాహ్నం ఒంటిగంటకు వచ్చి సాయంత్రం నాలుగు గంటలకు పని ప్రారంభించి, అర్ధరాత్రి వరకు చేసేవాడు. నాకు పది నుండి అయిదుగంటల వరకు చేయడమే యిష్టం. అసలు ఆఫీసు టైమింగ్స్ అవే. ఎప్పటికైనా ఎడిటర్ కావాలని రావూరి ఆశ. ఛస్తే అతనని ప్రభలో వుండనివ్వనని కామరాజు శపథం.

చిత్తూరు చిన్నదైనా మంచిరచయితలు కొద్దిమంది వున్నారు. ముంగర శంకరరాజు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య హైస్కూలులో పనిచేస్తుండేవారు. మధురాంతకం రాజారాం దామల్‌చెరువులో టీచర్. సి.వేణు బొమ్మసముద్రం. వీరంతా మాకు ఆప్తులు. మున్సిపల్ కమీషనర్‌గా గుంటూరు శేషేంద్రశర్మగారు. ఆయన ఆఫీసులోనే ముత్తరాజు సుబ్బారావు వుండేవారు. ఇదీ చిత్తూరు సాహితీచిత్రణ. ఆదివారాలు మా ఇంటికి వస్తుండేవారు. అప్పుడే చిత్తూరులో కాలేజీ పెట్టారు. కొలకలూరి ఇనాక్ తెలుగు లెక్చరర్. అతను తెనాలిలోనే నాకు తెలుసు. అతనిది నాది స్వగ్రామం వేజెండ్ల.

విజయవాడ వెళ్లి భార్యాబిడ్డలన్నీ తీసుకువచ్చాను. తిరుపతిలో వేంకటేశ్వర స్వామిని దర్శించాలని శ్రీమతి కోరింది. అప్పటికి నేను గుళ్లకు వెళ్లింది తక్కువ. ఒకసారి విజయవాడ కనకదుర్గ దేవాలయానికి వెళ్లాం. అదీ శ్రీమతి కోరికమేరకు. ఆమెకు గుడులు, గోపురాలు దర్శించాలన్న కోరిక ఎక్కువ. నాకు అసలులేని కోరిక. ఆమె అనారోగ్యం కొంత కారణం భక్తి పెరగడానికి. ముగ్గురు పిల్లలతో కొండపైకి బస్సు ప్రయాణం. మూడుగంటలు క్యూలో వుంటే గానీ బస్సు దొరకలేదు. కొండపైకి బస్సు ప్రయాణిస్తుండగా, నాకు కళ్లు తిరిగి స్పృహపోయింది. మెలికలు తిరడం వల్లనేమో కళ్లు తిరిగాయి. కొండపైకి వెళ్లేసరికి నా పరిస్థితి అయోమయంగా మారింది. సత్రంలో గది ప్రయత్నించే స్థితికాదు. ఫుట్‌పాత్‌పైన ఒకచోట ఆగిపోయాం. నేను గాఢమైన మైకంలో వున్నాను. ఎదురుగా ఆస్పత్రి వుందిగానిఎవరూ లేరు. తను పిల్లలకు ఏం పెట్టిందో ఏమో నాకు స్పృహ తెలిసేసరికి వాళ్లు నిద్రపోతున్నారు. తను నాకు, పిల్లలకు కాపలాగా కూర్చున్నది. కళ్లు విప్పిచూస్తే, ఎదురుగా ధగధగా మెరుస్తోంది బంగారు శిఖరం. జనం పలచగా తిరుగుతున్నారు. కొండమీద ఎప్పుడూ కోలాహలమే. జనం తిరుగుతూనే వుంటారు. షాపులు తెరిచేవుంటాయి. ఎప్పుడూ పెళ్లిఇల్లులా కళకళలాడుతుంది. అప్పుడు అది కలియుగ వైకుంఠమే అనిపించింది. నేను భోజనం చేయలేకపోయాను. వెళ్లి కాఫీ తాగి వచ్చాను. సుప్రభాతసేవలో పాల్గొనాలని శ్రీమతి కోరిక. రాత్రి నాకు నిద్రపట్టలేదు. వేకువన నాలుగుగంటలకు సుప్రభాతం గంటలు కొట్టారు. మొహాలు కడుక్కుని వెళ్లాం. అప్పట్లో క్యూలేదు. ఓ నలభైమంది వచ్చారు. అరగంటసేపు స్వామి ఎదురుగా మండపంలో కూర్చునే వీలున్నది. దర్శనం, కర్పూర నీరాజనం, నామార్చన అన్నీ ఫ్రీయే. దేనికీ చార్జీ లేదు. క్యూ లేదు. ఉదయం పిల్లల నీలాలు సమర్పించి, స్నానాలు ముగించి, మరోమారు స్వామి వారి దర్శనం చేసుకున్నాం. ఆనాడు స్వామి జాజ్వల్యమానంగా భాసించారు. మనస్సు పరవశించింది. కళ్లు ఆనందనిలయాలైనాయి.

అప్పుడు దైవభక్తి ఎక్కువైంది. రూపాయిన్నర పెట్టికొన్న స్వామివారి, పద్మావతి ఆరాధనామూర్తులు యోగంలో చేరేవరకు నా అర్చనామూర్తులే. యోగంలోకి వచ్చిన తర్వాత వాటి అవసరం లేక ఎవరికో యిచ్చివేశాను.

సరాసరి చిత్తూరు వెళ్లాం. కొన్ని రోజులు బందేఖాన్ వీధిలో ఇంట్లో వున్నాం. అంతలో మా నాన్నగారు వచ్చారు. బజారువెడుతుండగా వారి కజిన్ కనిపించాడట, ఇద్దరు కలిసి వచ్చారు. వారి అబ్బాయి వాసిలి నాగేశ్వరరావు చిత్తూరు కలెక్టరాఫీసులో ఉద్యోగం. వారుండేది గ్రిమ్స్‌పేట. అయినవారు సహాయంగా వుంటారని, నేను గ్రిమ్స్‌పేటలో నాగేశ్వరరావు వున్న ఇంటి దగ్గరగా ఒక ఇల్లు తీసుకున్నాను. పెద్దబ్బాయి వసంతకుమార్‌కు అక్షరాభ్యాసం రావూరి సత్యనారాయణరావు చేశారు. గ్రిమ్స్‌పేట స్కూలులో వేశాం.

యామినీదేవి అనారోగ్యం అలానే కొనసాగుతోంది. తన చెల్లెలు లీలావతి, కాపురానికి వచ్చింది. గాయత్రీప్రసాద్ ఉద్యోగం తిరుపతిలో. తను ఏదో పసరు వైద్యం కోసం తరచు తిరుపతి వెళ్లి వస్తుండేది. కొన్ని రోజులపాటు చెల్లెలి గారింట వుంది. నేను చిత్తూరులో వుండేవాడిని. అది జీవితంలో ఒక చీకటి అధ్యాయం. చీకటిలోనూ చీలికల్ని చూడగల దృష్టి మనిషికి ఏర్పడుతుంది. ఆ చీలికల లోంచి వెలుగులు ప్రసరిస్తాయి. వాటిని దర్శించే అంతర్దృష్టి, దిదృక్ష అలవరచుకోవాలి. కాలం ఒక్కటే మనసు చేసే గాయాల్ని మాన్పగలదు!

నా జాతక ప్రభావం ఎలాంటిదో గాని జీవితంలో సుఖం తక్కువ మనశ్శాంతి తక్కువ. ఎప్పుడూ ఏవో సమస్యలు, ఈతిబాధలు. ఆర్థికంగా ఎప్పుడూ స్థిమితంగా వున్నది లేదు. స్థిరంగా ఒకచోట వున్నదీ లేదు. ఉద్యోగం దినదినగండంలా వుండేది. పైవాళ్లకు నేనంటే అసూయ. సాటిరచయితలు అంతే. పంకిలంలోంచి పద్మం వికసించినట్లు నీచుల్ని దాటుకుంటూ పైకిఎదగడం. నాకు ఏమీ లేకపోయినా ఇతరులకు ఎందుకో అసూయ. బంధువులకూ అసూయే.

ఒకసారి కొత్తగా పెళ్లయిన మా మరదలు బేబీ, ఆమె భర్త వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చారు పదహారు రోజుల పండుగ లోపే. తిరుపతిలో ఒక అక్కగారుంది. చిత్తూరులో మరొక అక్క నా శ్రీమతి. అందరం కలిసి కొండపైకి వెళ్లాం. కాటేజీ తీసుకుని రాత్రికి మకాం చేసి, ఉదయాన దర్శనానికి వెళ్లాం. చెప్పానుగా అప్పట్లో క్యూలు తక్కువ. క్యూ కాంప్లెక్స్ లేదు. మహావుంటే గాలిగోపురం నుండి క్యూ వుండేది. ఎంతయినా అరగంటలో దర్శనం అయ్యేది. ఈ తొక్కిసలాట లేదు. తృప్తిగా దర్శనం అయ్యేది.

ప్రతివారికి, ఒక రూపాయి యిస్తే చాలు. అర్చన చేసేవారు. బంగారుద్వారం దాటి మూలవిరాట్ దర్శనానికి వెడుతుండగా బేబి కళ్లు తిరిగి పడిపోయింది.అక్కలిద్దరు గాభరా పడ్డారు. పరిస్థితి ఎవరికీ అర్థం కాలేదు. జనం ఎక్కడివారక్కడ నిలబడిపోయారు. అర్చకస్వామి 'అమ్మాయిని ఇలా తీసుకురండి' అని పిలిచి, కర్పూరం వెలిగించి, అమ్మాయికి చూపించి స్వామివారి విభూతి తెచ్చి నుదుట పెట్టి, తీర్థం యిచ్చారు. ఒక నిమిషంలో ఆమెకు స్పృహ వచ్చింది.

నాకు ఆశ్చర్యం కలిగింది. అది ఎలా సాధ్యం! అలాంటి సమయంలో డాక్టరు దగ్గరకు పరుగెత్తుతాం. అర్చకుడు తాపీగా, ప్రేమగా పిలిచి, తీర్థం యిచ్చి విభూతి పెట్టాడు. అది స్వామి మహిమా? లేక అర్చకస్వామి ప్రేమవల్లనా? అతనిలో వున్నది దైవశక్తా, ఆత్మశక్తా, యోగశక్తా? ఏది?!! దైవశక్తి అయితే ఎవరైనా దైవాన్ని స్మరిస్తే పని కావాలి. అలాకాదు కనుక అది ఆత్మశక్తి అయివుండాలి. అతను పూజారి, అర్చకుడు మాత్రమే. తపస్సు, ధ్యానం చేసి ఆత్మశక్తి పెంపొందించుకున్నవాడు కాదు. అది యోగశక్తికాదు. కేవలం ప్రేమతో, సానుభూతితో చేసినపని!. ఆయన పవిత్రప్రవర్తన, నిర్మలసంకల్పం అతనికి సహకరించి వుండాలి. అలాంటివి యోగసిద్ధులు కానవసరం లేదు. హృదయం నిర్మలంగా వుంటే చాలు. పరిశుద్ధమైన మనస్సు, ఆలోచన, సంకల్పం వుంటే చాలు. దైవం అనుకూలిస్తుంది.

తిరుమల ఏడుకొండలు నాకు ఎందుకోగాని మానవయాత్రకు ఒక సింబల్ అనిపిస్తుంది. ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక పురోగమనంలో ఏడుకొండలు ఎక్కవలసివుంది. ఏడుభూమికల్ని దాటిపోవాలి. అక్కడ సహస్రారంలాంటి విష్ణుపథం, శ్రీ నిలయం దర్శనమవుతుంది. అది మహాయాత్ర ప్రతివారికీ. ఉన్నచోటనే వుండి, చనిపోతే ఏం సాధించినట్లు. ఒక్కసారైనా తిరుపతి దర్శిస్తే, మనిషికి తన జీవితగమ్యం స్ఫురణకు వస్తుంది. అంతమాత్రాన స్వర్గం వస్తుందనీ, వైకుంఠం చేరతామనీ కాదు. ప్రాపంచిక సుఖభోగాలకు దూరమై కైవల్యపథం చేరడానికి అదొక ప్రయత్నం. ఆ తర్వాతనైనా మనిషి తన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ధర్మపథంలో నడుస్తూ, పరమపథాన్ని చేరగలగాలి.. జీవితం మహాసాగరం వంటిది. తీరంలో అలల తాకిడి కల్లోలంగానే వుంటుంది. సముద్రగర్భంలోకి వెళితే ఎంత నిశ్చలత, ఎంత ప్రశాంతి. భగవద్భక్తి అనే మహాసాగరంలో మునిగి ప్రశాంతి సాధించాలి.

ఒకరోజున అకస్మాత్తుగా ప్రభ, ఎక్స్‌ప్రెస్, వీక్లీలను మద్రాసుకు మార్చుతున్నట్లు, ఒక్కరోజుకూడా పబ్లికేషన్ నిలిపివేయకుండా మర్నాడు ఉదయానికల్లా మద్రాసు ఆఫీసులో

పనిచేయాలని చెప్పారు. సాయంత్రం చిత్తూరులో ఎడిషన్ పూర్తిచేసి, ఇళ్లకువెళ్లి, పెట్టె, బెడ్డింగ్ తెచ్చి రాత్రి పదిగంటలకు అందరూ వ్యాన్‌లలో బయలుదేరాం. మేఘంలేని ఉరుములాంటి వార్త. ప్రభ మద్రాసు నుండి వెలువడుతున్నట్లు పబ్లిక్‌కు తెలియకూడదు. ఏవో కోర్టు గొడవలున్నాయి యాజమాన్యానికి, ఇదేదో లేపుకుపోయి గుళ్లో దండలు మార్చుకుని పెళ్లి అయిందని మురిసిపోయినట్లు.

విజయవాడ, చిత్తూరు తర్వాత మరల మద్రాసు బదిలీ అవుతుందని ఎవరూ ఊహించలేదు. కాస్త స్థిమితపడేలోగా బదిలీ. గవర్నమెంటు ఉద్యోగంకంటే కనాకష్టంగా మారింది మా పరిస్థితి. ఎదురుతిరిగేవారు లేరు. పత్రికల్లో పనిచేసేవారంతా ఇతర ఉద్యోగాలకు పనికిరానివారు లేదా సాహిత్యంపట్ల మక్కువ ఎక్కువై ఆదర్శంగా జీవించాలనే రచయితలు. లోగడ రాయపేటలో కొన్నాళ్లు వున్నాను. ఈసారి టి.నగర్ ప్రాంతంలో ఇల్లు తీసుకోవాలనుకున్నాను. త్యాగరాయనగర్, పాండీబజారులో బ్రోకర్ను వుంటారు. సగంనెలఅద్దె కమీషన్‌గా తీసుకొని ఇళ్లు చూపిస్తారు. ఒక బ్రోకరును పట్టుకుని ఇళ్ల వేట ప్రారంభించాను. నేనివ్వగలిగిన అద్దెకు మహాభవనాలు దొరకవని నాకు తెలుసు. పాతిక రూపాయలకంటే ఇవ్వలేని పరిస్థితి నాది. డైరెక్టరు వేదాంతం రాఘవయ్యగారింటి అవుట్‌హవుస్ దొరికింది. చవక అని కాదుగానీ నా శక్తికి అందుబాటులో. పాండీబజారుకు దగ్గర. వెంటనే చిత్తూరు నుండి భార్యబిడ్డల్ని తీసుకువచ్చాను.

నా చేతిలో అయిదువరకు అదృష్టరేఖలున్నాయి. అందులో ఒకటి చంద్ర మండలం నుండి బయలుదేరి సరాసరి శనిస్థానం వరకు వెళ్లింది. అది ప్రధానమైన అదృష్ట రేఖ.ఉద్యోగానికి సంబంధించింది. అంటే రిటైర్ అయ్యేవరకు ఉద్యోగం వుంటుంది. అయితే మధ్యమధ్య చీలికల వల్ల కష్టాలు, అవాంతరాలు, బదిలీలు తప్పవు. జీవితరేఖనుండి బయలుదేరిన అదృష్టరేఖలు నాలుగున్నాయి. అవి శనిమండలంలోకి వెడుతున్నాయి. వాటికి తోడు రవిరేఖలు వున్నాయి. అంటే ఉద్యోగంతో సరిపోదు. ఇంకేవేవో చేయాలి. అదృష్టం వెతుక్కోవాలి. పుస్తక రచన ఒకటి ఉండనే వుంది.

టి.నగర్‌లో మకాంపెట్టడంతో కాస్త సినిమావారి పరిచయం ఏర్పడ్డది. కాగడాశర్మగా ప్రసిద్ధుడైన కొక్కొరగడ్డ కామేశ్వరశర్మ నాకు పాతమిత్రుడు. అతను రాజమండ్రి నుండి పత్రిక నడిపినపుడు నాచేత కవితలు రాయించుకున్నాడు. తెనాలిలో పత్రికల్లో పనిచేసిన మాగాపు రామన్, కొలను బ్రహ్మానందరావులు బాగా తెలిసినవారు. వారి ద్వారా సినిమారంగం ఎడిటర్ జి.వి.జి.తో పరిచయం, టెంపోరావుతో పరిచయం ఏర్పడ్డది. ప్రివ్యూలకు వెళ్లడం అలవాటైంది. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి అబ్బాయి

'బుజ్జాయి'తో స్నేహం కుదిరింది. అప్పుడు కృష్ణశాస్త్రిగారు అక్కడే వుండేవారు. బుజ్జాయితో కలిసి వారింటికి వెళ్లే అలవాటు. ఆరుద్ర, రామలక్ష్మి, సముద్రాల ముద్దుకృష్ణలాంటి పెద్దలతో పరిచయం కలిగింది. అప్పట్లోనే బి.ఎన్.రెడ్డిగారు, కమలాకర కామేశ్వరరావుగార్లు నేనంటే ప్రేమగా, అభిమానంగా వుండేవారు. కామేశ్వరరావుగారు పౌరాణిక సినిమాల డైరెక్టరుగా ప్రసిద్ధులు. మా పక్కవీధిలో వింజమూరి సీత, అనసూయ లుండేవారు. వారితోను పరిచయం ఏర్పడ్డది.

వేదాంతం రాఘవయ్యగారు నాతో ఎప్పుడూ మాట్లాడలేదు. ఆయనపెళ్లాం సూర్యప్రభ. బోలెడుమంది పిల్లలు వారికి. చావగొట్టి చెవులు మూసేవాడు. సలసలకాగే నీటిలో ముంచి తేల్చేవాడు పిల్లల్ని. అతనిదో రాక్షసానందం. ఆయనకోసం అప్పుడప్పుడు అంజలీదేవి వచ్చేది. అంజలీపిక్చర్స్ సువర్ణసుందరి తీస్తున్నరోజులు అవి. సూర్యప్రభ అంటే పుష్పవల్లి చెల్లెలు. 'రేఖ' అప్పటికి సినిమానటి కాలేదు. పిన్నమ్మగారింటికి వస్తుండేది. సూర్యప్రభ కూతురు శోభ పెద్దయి సినిమానటి అయింది. అప్పుడు చిన్నపిల్ల. అప్పుడే ఒక పిక్చర్‌కు కథ - మాటలు రాసే అవకాశం వచ్చింది. సులోచన అని ఒకనాటి హీరోయిన్ అక్కినేని నాగేశ్వరరావుగారితో కూడా వేసిందట. నేను చూడలేదు ఆ పిక్చర్. ఆమె తన కూతుర్ని హీరోయిన్ చేయాలని ఒక సినిమా ప్రారంభించింది. ఆ సిన్మాకి నేను రచయితను. సినిమాపేరు భక్తతుకారాం. శ్రీ అక్కినేనినాగేశ్వరరావు, జగ్గయ్య ఇంకెవరెవరో నటవర్గం. డైలాగ్పు రాయడమే నా పని. సీనులు చెపితే డైలాగులు రాసేవాడిని. కొన్నిసీనులు షూటింగ్ జరిగింది. ఆపైన మూలపడింది.

సినిమా పరిశ్రమతో నాకు అప్పటికి పరిచయం తక్కువ. గ్లామర్ ఒక్కటే తెలుసు. గ్లామర్‌వెనుకగల చీకటి తెరలు తెలియవు. సినిమా రచయితను అయిపోతానని భ్రమించాను. సినిమాలు తీస్తామనేవారు వందమంది, తీసేవారు పదిమంది. చాలామంది కంపెనీలు పెడతారు. ఏవో కథలు వండుతారు. నాలాంటి వాడిచేత డైలాగులు రాయిస్తారు. ఆర్టిస్టులకు అడ్వాన్సులిచ్చి కొంత షూటింగ్ చేస్తారు. అది చూచి డిస్ట్రిబ్యూటర్ లక్షలు యిస్తాడని ఆశ. సొంతడబ్బు ఖర్చయిపోయి డిస్ట్రిబ్యూటర్ కుదరక అక్కడే చతికిలబడిపోయే పిక్చర్లు వందలు. పెద్దసంస్థలు మాత్రమే సక్రమంగా చిత్రాలు నిర్మించగలిగేవి.

మేం వున్న వేదాంతం రాఘవయ్యగారి అవుట్‌హవుస్ ఒక దయ్యాల కొంప. ఆ కొంపలో ఎవరూ పట్టుమని పదిరోజులు కాపురం చేసింది లేదట. తర్వాత తెలిసింది. ఆ ఇంట్లో దయ్యం తిరిగేదిట. గిన్నెలు చెంబులు డాన్సు చేసేవి. క్రిందవున్న సామాను

మాయమయ్యేది. మేం చేరాక అలాంటిదేం జరగలేదుగానీ, మా పెద్దబ్బాయి వసంత కుమార్‌కు జబ్బు చేసింది. దగ్గరలో వున్న డాక్టర్ శివరామకృష్ణయ్య (ఈయన సినిమా నటుడు) దగ్గరకు తీసుకువెళ్లాం. ఆయన ఏవో మందులిచ్చి, ముందు వెంటనే ఆ ఇల్లు వెకేట్ చేయమని చెప్పాడు. వెంటనే పానగల్ పార్కు దగ్గర దొరైస్వామి వీధి సందులోకి మారాం. అదీ ఒక్కగది ఇల్లే. బక్క సంసారులకు ఒక్క గదికంటే దొరకదు. ఆ ఇంటికి ఎదురుగా మహానటుడు చిత్తూరు నాగయ్యగారిల్లు. పక్కన కొవ్వలి లక్ష్మీనరసింహారావుగారిల్లు. వారితో పరిచయం ఏర్పడ్డది. జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రిగారితో అప్పుడే స్నేహం అయింది. ఉస్మాన్‌రోడ్డులో జి.మునిరత్నంనాయుడు (ఇప్పుడు రాయలసీమ సేవాసమితి కార్యదర్శి, తిరుపతి) ఓ చిన్నప్రెస్ నడుపుతుండేవారు. శ్రీకళాప్రింటర్స్. ఆయన నాలా యువకుడు. ఆదర్శాలు కలవాడు. 'బాలప్రభ' అని ఓ పిల్లల పత్రికను ప్రారంభించాడు. ఆ పత్రికకు నాచే రాయించుకునేవాడు. అప్పట్లో నేను బాలసాహిత్యం రాసేవాడిని. 'నాగార్జున' అనే చిన్న నవలను నాన్‌డిటైల్డ్ టెక్స్ట్‌గా పెట్టారు. అలా మునిరత్నంగారితో పరిచయం స్నేహంగా మారింది. కొద్దిరోజుల్లోనే మకాం పాతమాంబళానికి మారింది. కోదండరామ కోవెలవీధిలో ఒకటి రెండు నెలలుండి, శివాలయం వెనక సుబ్బారెడ్డి వీధికి మారాం. అప్పటికి ఓ సంవత్సరంలో మూడు ఇళ్లు మారినట్టయింది. సుబ్బారెడ్డివీధిలో ఒక మేడమీద సంసారం. చాలాకాలం అక్కడే వున్నాం.

మా అమ్మాయి పద్మప్రియ 1963 జనవరిలో జన్మించింది తెనాలిలో. నెలలోపున యామిని పిల్లలతో మద్రాసు వచ్చింది. కాస్త స్థిరపడుతోంది సంసారం. ఆర్థికమైన ఒడిదుడుకులు మామూలే. వసంతకుమార్, శ్యాంసుందర్‌లను దగ్గరలో వున్న శారదా మిడిల్ స్కూలులో చేర్పించాం. తెలుగు స్కూలు, నడిచివెళ్లే దూరం. పెద్దకాన్వెంట్సులో చేర్పించే శక్తిలేదు. అలాంటి కోరికలు లేవు మాకు. జీవితంపైన ఎన్నడూ పెద్ద ఆశలు పెంచుకోలేదు నేను, యామినీదేవి కూడా. మా బ్రతుకు మేం బ్రతికితే చాలు. ఒకరిని అర్థించకుండా యాచించకుండా బ్రతకాలి. ఆమెకు ఆత్మాభిమానం జాస్తి. నాకు లేదని కాదు. కాని బయట ప్రపంచంలో తిరిగేటప్పుడు కొన్ని ప్రభావాలకు లోనుకాక తప్పదు.

ప్రభలో మొదట సినిమా సెక్షన్ చూడవలసి వచ్చింది. వేరే సినిమా ఎడిటర్ లేడు. ప్రివ్యూలకు వెళ్లడం వరకు బాగానేవుండేది. స్టూడియో సంచారం ఫరవాలేదు. సినిమా తారల్ని ఇళ్లకు వెళ్లి కలుసుకోవడం న్యూసెన్సు. నటులైతే కొంతమర్యాదగా వుండేవారు. ఈరోజు కాకపోతే రేపైనా ఇంటర్వ్యూలు యిచ్చేవారు. ఆడవారితోనే బాధ.

వాళ్ల ఇళ్లకు వెళ్లడం నాకు అసహ్యం వేసేది. సినిమాపత్రికలు నడిపే మిత్రులున్నారు. వారికి అదే యావ. అదే ధ్యాస. వారిళ్లకు వెళ్లి, పొగిడి, తిట్టి డబ్బు సంపాదించేవారు. బ్లాక్‌మెయిల్ లాంటి జర్నలిజం. అలాగా తారల దగ్గర డబ్బు పిండగలవారే అప్పటి సినిమా జర్నలిస్టులు. వారిపై అవాకులు, చవాకులు రాసేవారు. అది నాకు నచ్చలేదు. నటులు, నిర్మాతలు, అదో తరహా. మందుమీదగాని మాట వినరు. అసలు సినిమా ప్రపంచమే సెక్సు, మందు చుట్టూ తిరుగుతుంది. ఈ రెండు నాకు సరిపడని అంశాలు. వేరే సినిమా ఎడిటర్ వచ్చేవరకు కాలక్షేపం చేశాను. చేరినకొత్తల్లో 'జయభేరి' చిత్రంపైన రివ్యూ సినిమావారిని బాగా ఆకర్షించింది. బి.ఎన్. రెడ్డిగారి ఒక సినిమాను ఘాటుగా విమర్శించి రాశాను. ఆయన మర్నాడే ఆఫీసుకు వచ్చి, ఆయనా విద్వాన్ విశ్వంగారి మిత్రుడే నన్ను పరిచయం చేసుకుని, అభినందించి వెళ్లారు. అప్పటి నుండి బి.ఎన్.రెడ్డిగారితో స్నేహం ఏర్పడ్డది. సినిమా సెక్షన్ చూస్తున్న తొలినాళ్లలోనే ఒకసారి ఎన్.టి. రామారావుగారు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టారు. శ్రీధర్, లక్ష్మీరాజ్యం ఏర్పాటు చేశారు. బజుల్లా రోడ్డులో ఎన్.టి. రామారావుగారి ఆఫీసులో. రాయలసీమ కరువుబాధితుల కోసం చందాలు వసూలు చేసే కార్యక్రమం. ఎన్.టి. ఆర్. ఉపోద్ఘాతం చెప్పి,ఈ మహత్కార్యానికి మీ పత్రికల్లో బాగా ప్రచారం చేయాలని కోరారు. నేను కొత్తగా వచ్చినవాడిని. సినిమా రాజకీయాలు, మహానటుల మనస్తత్వాలు తెలియనివాడిని. రామారావుగారిని అడిగాను. "అయ్యా ఎన్.టి. రామారావుగారూ, మీ ఆశయం గొప్పది. ప్రయత్నమూ గొప్పది. లక్షలు వసూలు చేసి రాయలసీమ కరువు బాధితులకి సాయపడడం గొప్ప విషయమే. ముందు మీ విరాళం ప్రకటిస్తే దాంతో పత్రికల్లో ప్రచారం ప్రారంభిస్తాం" అన్నాను.

ఎన్.టి.ఆర్. గారికి బుస్సున కోపం వచ్చి నాపైన ఇంతెత్తున లేచారు. చొక్కా చేతులు పైకిలాగి కొట్టడానికి ఉద్యమించారు. అటు శ్రీధర్, పుండరీకాక్షయ్య ఆయన్ని పట్టుకుని ఊరడించారు. బొమ్మకంటి సుబ్బారావు, కాగడాశర్మలాంటివారు నన్ను శాంతపరిచారు. అంత ఉద్రేకం చెందిన వ్యక్తి, ఆయనగారు చందా ఇవ్వనే లేదు. తర్వాత ప్రెస్‌వారిని స్టూడియోలలో జరిగే షూటింగులకు రానీయకుండా కట్టడి చేశారు. కొద్దిరోజులకే సినిమా సెక్షనుకు వేరే అతను వచ్చాడు. నా పని ఆఫీసుకు పరిమితం అయింది.

60-70 మధ్యకాలం - జనంలో పఠనాసక్తి పెరిగింది. పత్రికల అమ్మకాలు పెరిగాయి. వారపత్రికలకు ఆదరణ పెరిగింది. కొత్త రచయితలు వస్తున్నారు. బాగా రాస్తున్నారు. జనంలో సాహిత్యస్పందన ఎక్కువకావడం వల్ల మద్రాసునుండి డిటెక్టివ్,

సెక్సు పత్రికలు తయారయ్యేవి. పది పదిహేను పత్రికలు అలాంటివి వచ్చాయి. మన్మథ, మదన, రతీమన్మథ, డిటెక్టివ్, అపరాధ పరిశోధన. పబ్లిషర్స్ ఎక్కువైనారు. ఇంగ్లీషు పాకెట్ నవలలు అనుసరించి రాయడం, అలాంటి గెటప్‌తో పుస్తకాలు వేయడం, ఒక్కొక్క పబ్లిషర్ నెలకు నాలుగు నవలలు ప్రచురించేవాడు. అలాంటివారు పదిమంది వుండేవారు. డిటెక్టివ్ సెక్సు నవలలు కొందరు, మిస్టరీ నవలలు కొందరు, భేతాళ మాంత్రిక నవలలు కొందరు ... ఇలా ఎన్నో రకాలు. ఒక్క పుస్తకం వెల ఒక రూపాయి. వాటికి తోడు సినిమాస్క్రిప్టులు నవలలుగా వచ్చేవి. అదొక విప్లవం. రచయితలు యధాశక్తి ఈ పుస్తకాలు రాసేవారు. మద్రాసులో వున్నవారికి ఇదొక హాబీ అయింది. ఆరుద్రగారు కూడా డిటెక్టివ్‌ల మోజులో పడ్డారు. ఇరవైవేల వరకు పుస్తకం అమ్ముడయ్యేది.

నేనూ రాశాను. మోజు కొద్దీకాదు, డబ్బుకోసం. నూరు, నూటయాభై రూపాయల కోసం ఒక నవల రాయడం. వారానికి ఒక నవల రాసేవాళ్లం. పై సంపాదన కావాలి. ఏదో రాయక తప్పదు. విశ్వప్రసాద్, లీలాకుమారి లాంటి వారు అలా ప్రసిద్ధులైనవారే. నాకు ఆఫీసులో చదరంగం ఆటలా వుండేది. కామరాజుగారు ఎత్తులు వేస్తుండేవారు. ప్రతి ఎత్తుకు'చెక్' అనేవాడు. ఎలాగైనా నన్ను ఓడించాలి. నా ఉద్యోగం తీసివేయాలి. ఉద్యోగాలు తీసివేయించడంలో అతను గ్రాండ్‌మాస్టర్. అతని యిష్టాలకి, అయిష్టాలకీ కారణాలు వుండేవి కావు.

అతనికి మొండిగా ఎదురు తిరిగాను. నా జాగ్రత్తలో నేనున్నాను. బయట పత్రికలకు రాసుకునేవాణ్ణి. ఏవో పేర్లతో, పేర్లు లేకుండాను. డిటెక్టివ్, సినిమా వ్యాసంగం బాగానేవుంది. ప్రభలో ఉద్యోగం పోయిన మద్రాసులో బ్రతకడానికి వీలైనన్ని వనరు లున్నాయి. 'నెలవంక' అని ఒక కథల మాసపత్రిక ప్రారంభించాను. ప్రభ ఆఫీసు నుండే న్యూస్‌ప్రింట్ కొనేవాడిని. పత్రిక వెల అర్ధరూపాయి. నూరు పేజీలు. మంచికథలు వేసేవాడిని కనుక సర్క్యులేషన్ అయిదారు వేల వరకు పెరిగింది. ఎప్పుడూ జేబులో డబ్బులుండేవి. అడిగినప్పుడల్లా బి.సి.కామరాజుకు అప్పులిచ్చి మచ్చిక చేసుకున్నాను. గంగాధర్, ఎ.ఎస్.మూర్తి లాంటి ఆర్టిస్టులు సహకరించేవారు. విజయబాపినీడుగారి ప్రెస్‌లో అచ్చువేసేవాడిని. అతని పత్రికలు విజయ, బొమ్మరిల్లు అచ్చవుతుండేవి. అయిదారు సంవత్సరాలు గడిచింది. సినిమా వారి పరిచయాలున్నాయి. 'లేతమనసులు' సినిమాకోసం ఎన్నికైన కె.వి.చలం మా 'నెలవంక' అసిస్టెంటు ఎడిటర్. అతనే నన్ను నటీనటులకు పరిచయం చేసేవాడు. 'వర్ధమానతారల'ను పరిచయం చేస్తూ ఒక పుస్తకం రాశాను. అందులో శారద, వాణిశ్రీ, గీతాంజలి, ఎల్. విజయలక్ష్మి ... ఇలా ఎందరో నేటి

నటీమణుల్ని తొలిసారిగా పరిచయం చేశాను. అప్పుడు నెల్లూరు నుండి వెలువడే 'జమీన్‌రైతు' వారపత్రికకు మద్రాసు సినిమా ప్రతినిధిగా వుండేవాడిని. వారు నెలకు నూరు రూపాయలు యిచ్చేవారు. వేణ్నీళ్లకు చన్నీళ్లు తోడు అన్నట్లు అటు ప్రభలో ఉద్యోగం, బయట 'నెలవంక' పత్రిక, నా రచనలు, నవలలు సంపాదన కుటుంబానికి సరిపోయేది.

కాలం ఎప్పుడూ ఒకేలాగ సాగదు. కనిపించని కాలానికి ఎగుడుదిగుళ్లు ఎక్కువే. కాల ప్రవాహానికి ఆటుపోటులు జాస్తి. ఆంధ్రప్రభ బెంగుళూరులో పెట్టారు. నన్ను బెంగుళూరు ఆఫీసుకు బదిలీ చేశారు. ఎ.ఐ.సి.సి. సమావేశాలు బెంగుళూరులో జరగనున్నాయి. స్టాఫ్ అవసరం అని టెంపరరీ అని చెప్పి పంపారు. డిప్యుటేషన్ మీద పంపినట్లే పంపి తర్వాత ట్రాన్స్‌ఫర్ ఆర్డరు యిచ్చారు. ఆ మహత్కార్యం వెనుక బి.సి. కామరాజు హస్తం వుందని నాకు తెలుసు. నాకు బదిలీ ఆర్డరు వేయించి, తిరుపతి వెళ్లి మొక్కు తీర్చుకువచ్చాడని తెలిసింది. ఎవరికి అపకారం తలపెట్టినా వేంకటేశ్వర స్వామికి మొక్కుకునేవాడు.

బెంగుళూరులో ఒక్క ఏడాది వున్నాను. అప్పుడు విద్వాన్ విశ్వంగారు వచ్చి మాతో డెయిలీలో చేరారు. అప్పటికే కన్నడ పత్రికల్లో నాకథలు, నవలలు వస్తుండేవి. కన్నడ పత్రికా పాఠకులకు 'శార్వరి' పేరు బాగా పరిచయం. కుటుంబాన్ని బెంగుళూరుకు మార్చే ఆలోచన లేదు. అక్కడ ఖర్చు చాలా ఎక్కువ. నా వల్ల కాదు. బెంగుళూరులో తెలుగుచదువులు లేవు. తిరిగి మద్రాసు వెళ్లిపోవాలని కోరిక. జీతం రెండువందలయాభై. ఆ మొత్తం జీతం అందిన రోజు మద్రాసు వెళ్లి ఇంటి ఖర్చులకు యిచ్చివేసేవాడిని. నా ఖర్చులకు 'జమీన్‌రైతు' వారిచ్చే నూటపాతిక రూపాయలు. పగలు మాత్రం భోజనం చేసేవాడిని. రాత్రిళ్లు బ్రెడ్, కాఫీ. ఒక బ్రెడ్ ఇద్దరం పంచుకునేవాళ్లం. చాలామంది నా లాంటి అర్ధాకలి బ్రతుకులవారే. ఆ వాతావరణం పడలేదు. ఆ భోజనం పడలేదు. ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. గ్యాస్ట్రిక్ అల్సర్ ఎక్కువైంది. కడుపులో మంటతో విలవిల్లాడిపోయేవాడిని.

బెంగుళూరు ప్రభలో నేను వెళ్లేసరికి బుద్ధవరపు నాగరాజు న్యూస్ ఎడిటర్‌గా వుండేవారు. అంతలో విద్వాన్ విశ్వంగారు ఆంధ్రజ్యోతి నుండి వచ్చి చేరారు. కొద్దిరోజుల్లో పండితారాధ్యుల నాగేశ్వరరావుగారు ఆంధ్రపత్రికనుండి వచ్చి చేరారు. ఆయన హోదా రెసిడెంట్ ఎడిటర్. ఉదయం 8 నుండి రాత్రి 11 గంటల వరకు కదలకుండా పనిచేసేవారు. నార్లగారి తర్వాత నాకు నచ్చిన ఎడిటర్ ఆయన. మితభాషి. ఎవరితో

ఎక్కువ మాట్లాడడు. ఆయనకు నేనంటే, గండికోట వెంకటేశ్వర్లుగారంటే అభిమానం. ఒక్కొక్కసారి పనిచేసేందుకు ఇద్దరమే వుండేవారం. నాగరాజు ఒకగ్రూపును తయారుచేసి, నాగేశ్వరరావుగారికి వ్యతిరేకంగా వుండేవారు. ఇబ్బంది పెట్టాలని ఆయన ప్లాన్. పండితారాధ్యుల నాగేశ్వరరావు నేను ఇద్దరం కలిసి మొత్తం పత్రిక నింపేవాళ్లం. "గండికోట వెంకటేశ్వర్లు, శార్వరి వుంటే చాలు పత్రిక వస్తుంది" అనేవారు. ఈయన కాబోయే ఎడిటర్ అని మాకు తెలుసు. తర్వాత కొంతకాలానికి కూచిమంచి సత్య సుబ్రహ్మణ్యంగారు వచ్చారు. ఆయనకు దినపత్రికల్లో పనిచేసిన అనుభవం లేదు. గవర్నమెంటువారి 'పంచాయతీరాజ్'లో పనిచేశారుట.

నేను మెడికల్ గ్రౌండ్స్‌పైన ట్రాన్స్‌ఫర్ కోరాను. మద్రాసు ఆఫీసువారు అంగీకరించలేదు. రిజైన్‌చేసి మద్రాసు వెళ్లిపోయాను. ధూళిపూడి అంజనేయులు గారు మద్రాసులోనే వున్నారు. వారికి నార్ల వెంకటేశ్వరరావుగారికి మంచిస్నేహం. వారు రికమెండ్ చేస్తే ఆంధ్రజ్యోతిలో ఉద్యోగం వస్తుంది. వెళ్లి సంగతి చెప్పాను. వారు ఉత్తరమే రాశారో, ఫోన్లో మాట్లాడేరో తెలీదుగానీ మూడవరోజుకు 'ఆంధ్రజ్యోతి'లో చేరమని పిలుపు వచ్చింది. మళ్లీ నార్లవారి దగ్గర పనిచేసే అవకాశం వచ్చింది.

విజయవాడ వెళ్లి నార్లవారిని కలిశాను. వీక్లీలో పనిచేయమన్నారు. 1967..... అప్పటికి ఆంధ్రజ్యోతి వీక్లీ ప్రారంభించి మూడునెలలైంది. పురాణం సుబ్రహ్మణ్య శర్మ ఒక్కరే చూస్తున్నారు. ఆయనకు సహాయకుడిగా, చేరాను. నా జీతం 250. ఆయన జీతమూ దాదాపు అంతే! ఇద్దరిలో జర్నలిజం అనుభవం నాకు ఎక్కువ. ముందుగా చేరింది తను. రైల్వే ఉద్యోగానికి సెలవుపెట్టి వచ్చారు. నార్ల అన్నారు "పురాణం సెలవుపై వచ్చారు. ఈ ఉద్యోగం నచ్చకపోతే వెళ్లిపోతారు. మీరే వీక్లీ చూడాలి."

కాని పురాణంగారికి తిరిగి వెళ్లే ఆలోచన లేదు. నాతో స్పష్టంగా చెప్పారు. అయినా ఫరవాలేదు వారితో కలిసి పనిచేయడం. మంచివాడు. అప్పుడే 'ఇల్లాలిముచ్చట్లు' ప్రారంభించారు. నన్ను ఒక ఫీచర్ రాయమన్నారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, రంగనాయకమ్మ, నేను కలిసి ఒక గొలుసునవల ప్రారంభించాలని పథకం వేశాం. నేను 'వింతలు విడ్డూరాలు' ఫీచర్ ప్రారంభించింది ఆంధ్రజ్యోతి లోనే. ఒక నెల గడిచింది.

మురళీధర్ గవర్నర్‌పేట సెంటర్‌లో కన్పించి పలకరించాడు. మురళి నీలంరాజువెంకట శేషయ్యగారి అబ్బాయి. అతను ఫొటోగ్రాఫర్ అప్పుడు. బోళా మనిషి. నెలరోజులు నేను గాంధీనగర్ వైపు వెళ్లలేదు ప్రభ మిత్రులు కనిపించకుండా వుండాలని.

తను వెళ్లి వారి నాన్నగారికి చెప్పాడు. ఆయన మద్రాసు గోయెంకాకు ఫోన్ చేశాడు. మర్నాడు నేను ఆఫీసుకు వెళ్లేసరికి నార్ల పిలిపించి, "నిన్ను బి.డి.తనకు కావాలంటున్నాడు. పోనీవెళ్లు ప్రభలోనే పనిచెయ్" అన్నారు. వెళ్లి ప్రభ ఎడిటర్‌ని కలిశాను. "మిమ్మల్ని మద్రాసుకు బదిలీ చేశారు. వెళ్లి వీక్లీలో చేరండి" అన్నాడు.

"కామరాజువద్ద పనిచేయను" అన్నాను.

"మీ ఉద్యోగానికి ఏం ప్రమాదం వుండదు. అతను మిమ్మల్ని ఏమీ చేయడు. బి.డి. మిమ్మల్ని బాగా యిష్టపడుతున్నాడు. పెద్దవాణ్ణి నేను చెబుతున్నాను. వెళ్లి చేరండి. మీకు మంచి జరుగుతుంది" అన్నారు.

ఆయన రామభక్తుడు. పూజనీయుడు. ఆయనమాట మన్నించి మద్రాసు వెళ్లి వీక్లీలో తిరిగి చేరాను.

నా బదిలీల వల్ల, అభద్రత వల్ల మా పత్రిక నెలవంక ఆగిపోయింది. బెంగుళూరులో వున్న కాలంలో కొన్ని నెలలపాటు యామిజాల పద్మనాభస్వామిగారు చూచిపెట్టారు. ఆయన పండితుడు, కవి. పత్రికానిర్వహణ తెలియదు. లాభనష్టాలు ఎలా వున్నా, సరైన వ్యక్తి లేనిదే పత్రిక నడవదు. పుస్తక ప్రచురణలూ అంతే. అదొక ఆర్టు. ఆర్టుతో కలిసిన వ్యాపారం. పుస్తక వ్యాపారంలో అందరూ రాణించరు. పత్రికలూ అంతే! రచయిత అయిన ప్రతివ్యక్తి జర్నలిస్టు కాలేడు. పత్రికలు నడపలేడు. సినిమారచనా అంతే. పెద్దసాహిత్యవేత్తలైనవారు సినిమా రచనకు పనికిరారు. పుస్తకాలు రాయకపోయినా సినిమా రచయితలు కావచ్చు. నాటక రచయితలు, నటులు త్వరగా సినిమారచనకు అలవాటు పడతారు. నేను సినిమారచయితను కావాలనుకున్నాను. కాలేదు. అంటే అర్హత లేక కాదు. తిరుగుళ్లు, కాకాలు చేతకాక, డైరెక్టర్లను ప్రొడ్యూసర్లను వెన్నంటి తిరగాలి. వారి అడుగులకు మడుగులొత్తాలి. వాళ్లు చెప్పిన పనులు చెప్పని పనులు అవసరాల్ని గుర్తించి చేస్తుండాలి.

అంతగా ఆత్మాభిమానం చంపుకుని సినిమా రచయిత అయి బావుకునేదేమిటి. రచయితగా ఇంతో అంతో పేరు వచ్చింది చాలు. సినీనటీనటులకున్న గ్లామర్ రచయితలకుండదు. అనేకమంది సినిమా రచయితలతో పరిచయం అయిన తర్వాత ఆ కోరికను పక్కకు తోశాను... దూరపు కొండలు నునుపు.

మహాయాత్రలో తొలిమలుపు

సృష్టించబడే ప్రతిదానికి పురిటినొప్పులు తప్పదు. ప్రతి పరిణామానికి నొప్పులు తప్పవు. మనిషి జీవితంలో వచ్చే ప్రతి పెద్దమార్పు పరిణామగతికం అయి నపుడు, దానికి పురిటి నొప్పులు తప్పదు.యోగానికి పురిటినొప్పులు ప్రారంభమైనాయి. అది విచిత్రం - అది అనూహ్యం - అది దైవికం- ఇటు లౌకికజీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి ఒక వారధి లాంటిది యోగం. అయినపుడు ఆ వారధి నిర్మాణం అంత తేలిక కాదు. జీవనప్రవాహానికి లౌకిక జగత్తు ఇవతలి ఒడ్డు, అలౌకికజగత్తు అవతలి ఒడ్డు, ఈ రెంటినీ కలిపేది కలపగలిగేది యోగం. అది వారధి.

జీవితం కొందరికే వడ్డించిన విస్తరి. ఏ గౌతమబుద్ధునిలాంటి ఒకరిద్దరో రాజభోగాలతో జీవించారుతప్ప, ఆధ్యాత్మిక శిఖరాలనందుకున్న మహాత్ములంతా అనేక కష్టాలు, బాధలు పడ్డవారే. ప్రతిమనిషి జీవితం ఏడు మలుపులు తిరుగుతుంది. ఏడు దశలు గడుస్తుంది. మనం గమనించంగానీ, ప్రతి పది సంవత్సరాలకు మన రూపం మారి పోతూ వుంటుంది. అందుకే చిన్నప్పటి ఫొటోలు, బాల్యంలో ఫొటోలు, యవ్వనకాలం నాటి ఫొటోలు పోల్చితే పోలికే కనిపించదు. ఎక్కువ కాలం జరిగితే మనకు తెలిసినవారినే గుర్తుపట్టలేకపోవడానికి ఈ మార్పు కారణం. లౌకికజీవితంలో మనల్ని ముంచి తేల్చే పరిణామాలు అలాగే వుంటాయి. ఒకదాని కొకటి పోలికే వుండదు ఒక్కోసారి .

ఆంధ్రజ్యోతిలో పనిచేసిన ఒక్క నెలకు జీతం కూడా తీసుకోలేదు. ప్రభ ఆఫీసువారే అడ్వాన్సు యిచ్చి మద్రాసు పంపారు.అప్పట్లో దినపత్రికలలో అపాయింట్మెంట్ ఆర్డరు నామమాత్రమే. ఎడిటర్ మాట శాసనం. అదే ఆర్డరు. బి.సి. కామరాజు లోపల అయిష్టం అయినా పైకి అభినందనపూర్వకంగా స్వాగతించాడు. మనుషుల్ని అర్థం చేసుకోవడం నేనూ నేర్చుకున్నాను. ఏరోటి దగ్గర ఆ పాట పాడాలి. నాగరిక ప్రపంచంలో బ్రతకాలంటే 'సినిమా' పాటకు పల్లవి అదే. కామరాజు ధోరణి కొంతమారినట్లు కనిపించింది.

వెనకటంత హరాస్‌మెంటు లేదు. తప్పనితద్దినం అనుకున్నాడేమో! తన కుట్రలు, కుతంత్రాలు నా పైన పనిచేయవని, యాజమాన్యానికి నాపై ప్రత్యేక అభిమానమని గ్రహించాడు. నేనూ అతని అవసరాలు గ్రహించి మసలుకోసాగాను. అతను చేసే వెధవపనులకు నేను అడ్డురానని నా బయటపనులు తాను నిరోధించరాదని ఒప్పందం చేసుకున్నాం. 'వెధవ' పనులు అని అనడానికి బలమైన కారణం వుంది. అతను ఎంత సమర్థుడైన ఎడిటరైనా, ఎంత కష్టపడి పనిచేసినా, పరమదరిద్రుడే. జీతం చాలేది కాదు. కథలు, నవలలు రాసేవారితో రహస్యమంతనాలు జరిపి కాస్తకు కక్కుర్తిపడి వారి రచనలు వేసేవాడు. అవి చెత్త అని తెలిసీ, నోరు మెదిపేవాళ్లం కాదు. అతనికి కావలసింది అదే. వారపత్రికల్లో డబ్బు అక్రమంగా సంపాదించడం అతనితోనే ఆరంభమైంది. ఆ తర్వాత ఆ జబ్బు క్రమంగా ఇతర వారపత్రికలకూ సోకింది. తెలిసీ నిరోధించలేని అశక్తత నాది. అప్పుడే పత్రిక సర్క్యులేషన్ పెరగడంకోసం కథలపోటీలు, నవలలపోటీలు ప్రారంభించాం. అక్కడ అతని సంపాదన లావైంది. తనకు సహాయం చేసినవారి రచనలు బహుమతులు పొందేవి. బహుమతులు పొందిన రచయితలు, రచయిత్రులు అందరూ అలా చేశారని అనను. కొందరు ఘంటాపథంగా తమ రచనకు బహుమతి వస్తుందని, ఆ ఏర్పాట్లు ముందే చేసుకున్నామని చెప్పి మరీ బహుమతులు సంపాదించేవారు. అది కామరాజుపథకం! నాలాంటి వాడు నోరు విప్పలేని అశక్తత.

తిరుపతి వెళ్లివచ్చినప్పటినుండి నాలో దైవభక్తి ఎక్కువైంది. నిత్యం సుప్రభాత పారాయణం, లలితా సహస్రనామాలు చదవడం అలవాటైంది. శనివారాలు ఏకభుక్తం. ఎంత భక్తి అలవడినా ఆఫీసులో ఆలజడి కొనసాగుతూనే వుంది. మా బాస్ కామరాజు వేంకటేశ్వరస్వామి భక్తుడే. ఒక భక్తుడు మరొక భక్తుడికి అపకారం తలపెట్టి, అవమానం చేస్తూ, నానాబాధలకు గురిచేస్తుంటే ఆ శ్రీనివాసుడు ఎందుకు ఉపేక్షించాలి? అతనికి మాత్రం అనుకూలంగా ప్రవర్తించే పక్షపాతం ఆ దేవుడికి ఎందుకు? కష్టాలు ఎక్కువైనపుడే దేవుడిపైన భక్తి ఎలా పెరుగుతుందో ఆ కష్టాలు ఎంతకీ తీరనప్పుడు, ఆ దేవుడిపైన విరక్తి కలుగుతుంది. కొందరి కోర్కెలు తీర్చి, మరికొందరి కోర్కెలు తిరస్కరించడం దేవుడికి న్యాయమా? సబబా? భగవంతునిపై విశ్వాసం సన్నగిలసాగింది. మన బాధలు, మనం అనుభవించి తీరాలన్నప్పుడు దేవుడితో పనేమిటి? ఆ దేవుడు మనకేమీ ఒరగబెట్టనప్పుడు, అతనికోసం పూజలు అవీ చేసి టైం వృధా చేసుకోవడం ఎందుకు? మన కర్మ మనం అనుభవించాలి! అయితే దేవుడితో పనేలేదు.

నా మొండితనానికి పరీక్ష భగవంతుడు పెట్టాడని అనటం లేదు... మా నాన్నగారు గురుపరంపరలోనివారు. ఆయనకు చాలామంది శిష్యులున్నారు. ఆయన

గురువుగా చలామణి అవుతున్నారు. కాళీ ఉపాసకుడు. పిలిస్తే చాలు 'కాళీ' ప్రత్యక్షం అవుతుంది. నవరాత్రులు చాలాదీక్షగా చేస్తారు. యామినీదేవికి బాగా జబ్బు చేసింది. డా॥బాలసుందరరావుగారు మా ఫామిలీ డాక్టర్. మద్రాసులో పత్రికలవారికి, రచయితలకు, సినిమావాళ్లలో కొందరికి ఆయన డాక్టరు. జర్నలిస్టుల దగ్గర ఆయన ఫీజు తీసుకునేవాడు కాదు. అసలు ఏ పేషెంట్‌ను ఆయన డిమాండ్ చేయడు. ఇస్తే పుచ్చుకునేవాడు. అదొక పద్ధతి. గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, శివలెంక శంభుప్రసాద్, బి.ఎన్.రెడ్డి ... ఇలా కొందరుపెద్దలు నెలకు ఇంతని యిచ్చేవారు. వారిని తీసుకువెళ్లి నాశ్రీమతిని చూపించాను. ఆయన తన కారులో నన్ను క్లినిక్‌కు తీసుకువెళ్లి చెప్పాడు. "సారీ శార్వరీ, ఇంత చిన్న వయస్సులో నీకు రాకూడని కష్టం వస్తుంది. ఆ అమ్మాయి బ్రతకదు. పెద్దవాళ్లను పిలిపించు. ఆ అమ్మాయి పేరెంట్స్‌కు కబురుచెయ్, చివరిసారిగా చూచి వెడతారు" చాలా స్పష్టంగాచెప్పారు. కళ్లనీరు తిరిగింది. ఏం చేయడం.

"మీరు వైద్యం చేస్తే తగ్గుతుందని విశ్వంగారు చెప్పారు" అన్నాను

"నీకు అబద్ధం చెప్పను. నేను డబ్బుమనిషిని కాను. మాస్టర్‌పై ప్రమాణం చేసి చెబుతున్నాను. మెడిసిన్స్ ఆమెను రక్షించలేవు. ఏదైనా ఒక మిరకిల్ జరిగి ఆమె బ్రతికితే సంతోషమే" అన్నారు.

మా నాన్నగారు వచ్చారు, అమ్మ రాలేదు. రాదని తెలుసు. పదిరోజులున్నారు. "నేను వుండి చేయగలిగింది లేదు, వెళతాను" అని తెనాలి వెళ్లిపోయారు.

మామగారికి తెలియపరచలేదు. వారు పెద్దవారు. రాలేరు.

ఆఫీసుకు వెళుతున్నాను వస్తున్నాను. కాని మనస్సులో దిగులు.

భవిష్యత్తు భయంకరంగా కనిపిస్తోంది. పిల్లల్ని 'తల్లిలేని పిల్లలు' గా ఊహించలేక ఏడ్చేవాడిని.

ఆఫీసులో దిగులుగా కూర్చుని వుండగా, పక్కగదిలో 'దినమణి'పత్రికలో పని చేస్తున్న ఒకతను వచ్చి, 'వణక్కం' అని పలకరించాడు.

"ఎన్న విషయం?" అడిగాను.

జేబులోంచి ఒక వార్త తీసి యిచ్చాడు. ఒక ఫోటో చూపించి, "ఈయన నారాయణ బాబా? షిరిడీబాబా శిష్యుడు. వెరీ పవర్‌ఫుల్. మైలాపూర్, పొట్టిశ్రీరాములు మందిరంలో వున్నారు. ఆయన ఎలాంటి జబ్బులనైనా నయంచేస్తాడుట. షిరిడీబాబా వృద్ధాప్యంలో ఈయన షిరిడీబాబా దగ్గర వున్నారుట.

వెంటనే మాటర్ రాసి కంపోజ్‌కి పంపాను. జి.కృష్ణ అప్పుడు డెయిలీ ఇన్‌చార్జి.

ఆ వార్త వేసిన రోజునే కృష్ణగారు బాబా దర్శనానికి వెళ్లారు. ఆయన గాలిలోంచి ఒక చిన్న కృష్ణుని విగ్రహం సృష్టించి ఆయనకు బహూకరించారుట. వెళ్లి కృష్ణగారిని అడిగాను.

"ఆ బాబా మహత్తు కలవాడేనా! మీరు వెళ్లారుట"

"మహత్తు వుందో లేదో వెళ్లివచ్చాను, ఆ విగ్రహం వుండదు. మాయమై పోతుంది!"

"ఎలా?"

"ఎలానా? ఎక్కడ నుండి వచ్చిందో, అక్కడికి అలాగే వెళ్లిపోతుంది."

దినమణి మిత్రుడికి నా విషయం చెప్పి, అడగమన్నాను.

అతను పర్మిషన్ తీసుకుని వచ్చి, చెప్పాడు.

మర్నాడు శ్రీమతి యామినీదేవిని తీసుకుని వెళ్లాను. ఆమె బాగా నీరసించివుంది. టాక్సీలో వెళ్లాం.

మేము వెళ్లేసరికి ఎవరూ భక్తులు లేరు.

బాబా లోపలికి పిలిపించారు.

వెళ్లి నమస్కారం చేసి కూర్చున్నాం.

"ఆలస్యంగా వచ్చారు. ఈరోజు పూజ అయిపోయింది" అన్నారు.

నాకు నిరాశ కలిగింది.

భగవంతుడు బాబా రూపంలోనైనా కరుణిస్తాడని ఆశించాను. అదీ కుదరదా!

"ఉదయం ఆరుగంటలకే రావాలని మణియన్ చెప్పలేదు" అన్నాను దిగులుగా!

"నీవు తెలుగువాడివా?" అవునన్నాను తలూపి.

"స్వగ్రామం"

"తెనాలి"

"ఎక్కడ ఇల్లు?" చెప్పాను.

"పార్వతీశంగారు తెలుసా?" అడిగారాయన.

"వారు మా నాన్నగారు."

ఆయన ప్రసన్నంగా నా భార్యవైపు చూచారు. పక్కనే పళ్లెంలో వున్న విభూతి చేతిలోకి తీసుకుని ఆమెకు బొట్టు పెట్టారు. రెండు విభూతి పొట్లాలు యిచ్చి,

"తగ్గిపోతుంది... ఫరవాలేదు, ప్రమాదం లేదు" అన్నారు.

నూటపదహార్లు దక్షిణ యిమ్మని మణియన్ అడిగాడు. నా దగ్గర డబ్బులేదు. బాబాగారికి చెప్పాను.

"ఫరవాలేదు. వెళ్లిరండి. నాన్నగారిని నేను అడిగానని చెప్పు" అని ఆశీర్వదించారు మమ్మల్ని.

ఆఫీసులో మణియన్ కలిసి "బాబాగారు కరుణించారు మిమ్మల్ని డబ్బు యివ్వనవసరం లేదని, వీక్లీలో ఒక ఆర్టికల్ రాయమని చెప్పారు" అన్నాడు.

నారాయణబాబా ఫొటోతో ఒక వ్యాసం రాసి ప్రచురించాను.

సాయి విభూతి అద్భుతంగా పనిచేసింది. శ్రీమతి ఆరోగ్యం క్రమంగా మెరుగైంది. ఫిట్స్ ఆగిపోయాయి. ఆమెలో కొత్తకళ, కొత్తజీవం రాసాగాయి. మృత్యువు నీడ తొలగిపోయింది. బాబాపై మాకు భక్తి కుదురుకున్నది. క్రమంగా సుప్రభాతం, లలితా సహస్రనామాలు దూరమైనాయి. ఆ పరిణామం అప్రయత్నంగా, విచిత్రంగా జరిగింది. నాలో కాస్త హుషారు గుర్తించి, డాక్టరుగారు అడిగారు, "నీ శ్రీమతికి ఎలావుంది?" అని.

"బెటర్! డాక్టరుగారూ" అని జరిగింది చెప్పాను.

"నీకు బాబాలపైన, మహత్ములపైన నమ్మకం వుందా?"

"ఇదివరకు లేదు. ఇప్పుడు ఏర్పడింది. ప్రత్యక్ష నిదర్శనం ఆ బాబా... ఇటు నాభార్యకు డాక్టర్లు చేయలేని పని బాబా చేశారు. మందులు చేయని ఉపకారం ఆయన విబూది చేసింది.

అంతలో శ్రీమతి నెలతప్పింది. అప్పటికే మాకు నలుగురు పిల్లలు, వసంతకుమార్, శ్యాంసుందర్, వెంకట రమణ, పద్మప్రియ. ఇంక పిల్లలు కావాలని, కలగాలని మేం కోరలేదు. అప్పట్లో పిల్లలు కలగడం అంటే భగవంతుని ప్రసాదమే. దాన్ని నిరోధించడం పాపం! అప్పటికి ఫామిలీప్లానింగ్ అంతగా లేదు. వేసక్టమి, ట్యూబెక్టమీలు సామాన్యజనానికి అందుబాటులో లేవు. అబార్షన్ కూడా నేరమే. ఇందిరాగాంధీ ప్రధాని అయిన తర్వాత వీటికి చట్టం వచ్చింది. అప్పుడు లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని.

డాక్టర్ బాలసుందర రావు గారికి చెప్పాను, నా శ్రీమతి కారీయింగ్ అని.

"ఆ అమ్మాయికి మళ్లీ కడుపా! నీకు బుద్ధివుందా? ఆమె ఆరోగ్యమే అంతంత మాత్రంగా వుంది. మళ్లీ ప్రసవాన్ని తట్టుకోలేదు శార్వరీ" అని చీవాట్లు పెట్టారు.

"ఒకసారి ఇంటికి వెళదాం రండి" అని పిలిచాను. ఆయన వచ్చారు. ఆమెను చూచి ఆశ్చర్యపోయారు. ఎంత మార్పు.

"వండర్‌ఫుల్... నీ పిల్లలు అదృష్టవంతులు శర్మా! ఆమెకు గండం గడిచింది. ఇంక ఫరవాలేదు, ఏదో ఆధ్యాత్మిక శక్తి ఆమెకు ప్రాణదానం చేసిందయ్యా!" అని తృప్తిపడ్డారు. బలానికి ఏవో టానిక్కులు యిచ్చారు. ప్రిస్క్రిప్షన్ రాయడం లేదు. తన

దగ్గర వున్న టానిక్‌లే యిచ్చేవారు. షాపులో నేనెప్పుడూ మందులు కొనలేదు. ఆయనే యిచ్చేవారు. షాపులో కొనవలసి వచ్చినా తనే డబ్బులిచ్చి తెప్పించి మరీ యిచ్చేవారు. బాలసుందరరావుగారు తనకిష్టమైనవారికి ప్రాణం పెట్టే వ్యక్తి. నేనంటే ప్రత్యేకమైన అభిమానానికి కారణం... తెన్నేటి హేమలత, ఆయన కజిన్.

లత ప్రభకు 'ఊహాగానం' రాసేవారు. అలా మా పరిచయం విజయవాడలో మొదలైంది. సినిమాలకు స్క్రిప్టు రాసే పనిబడి మద్రాసు వచ్చినప్పుడు డాక్టర్ గారింట దిగేవారు. ఆమెతో వున్న పరిచయం డాక్టర్‌గారికి దగ్గర చేసింది. డాక్టర్‌గారికి ఒకే ఒక్క కూతురు జిజ్జీ. అసలు పేరు జలంధర. ఆ అమ్మాయి ప్రేమగా నన్ను 'అన్నయ్యగారూ' అని పిలిచేది. అలాగా ఆ ఇంట అనురాగాన్ని, ఆత్మీయతను పంచుకున్నాను. సాయంత్రంవేళల్లో వెళ్లి కూర్చుని డాక్టర్‌గారితో బాతాఖానీ వేయడం అలవాటైంది.

సినిమా వాళ్లు వస్తుండేవారు. డైరెక్టరు బి.ఎన్. రెడ్డిగారితో పరిచయం చాలా ఆత్మీయంగా మారింది. కమలాకర కామేశ్వరరావు, ముదిగొండ లింగమూర్తి లాంటి పెద్దలతో స్నేహం అయింది. మల్లాది రామకృష్ణశాస్త్రిగారితో నా సాన్నిహిత్యం మరీ ఎక్కువ. 'నెలవంక' పత్రికకు చాలా కథలు, 'కృష్ణాతీరం' నవల రాసిచ్చారు. అలాగే 'ప్రభ' లో వారి కథలకోసం వారింటికి వెళుతుండేవాడిని. అప్పుడు వేరే వ్యాపకం లేదు. కొడవటిగంటి కుటుంబరావు, ధనికొండ సాయంత్రం వేళల్లో అక్కడకు వచ్చేవారు. పానగల్ పార్కు రచయితలకు, సినీ కళాకారులకు సెంటర్. మద్రాసులో పాండీబజారుతో పానగల్‌పార్క్‌తో అనుబంధం లేని రచయితలు, కళాకారులు వుండరంటే అతిశయోక్తికాదు. సినిమానిర్మాణ సంస్థలు చాలావరకు టి.నగర్‌లోనే వుండేవి. పెద్దవాళ్లంతా టి.నగర్‌లో వుండేవారు. చిన్నాచితక ఆర్టిస్టులు, టెక్నీషియన్లు పాతమాంబళంలో, కోడంబాకంలో వుండేవారు. దీనికి, దానికి రైలుపట్టాలే హద్దులు. పెద్ద, చిన్న తేడాలకు ఆ రైలుపట్టాలే సాక్ష్యం. నేను ఉండేది పాతమాంబళం. తిరిగేది టి.నగర్. ఉద్యోగం మౌంట్‌రోడ్‌లో.

మన యాక్టివిటీస్ గమ్మత్తుగా మారిపోతుంటాయి. బదిలీలవల్ల, ఉద్యోగంలోని ఒడుదుడుకులవల్ల మా 'నెలవంక' పత్రిక ఎప్పుడో ఆగిపోయింది. ఈసారి ఏదైనా రాయాలనిపించింది. ఆమంచర్ల శేషగిరిరావు, సినిమా డైరెక్టరుతో స్నేహం ఏర్పడ్డది. ఆయన అవకాశాలకోసం ఎదురుచూస్తున్నారు. పి.పుల్లయ్యగారి దగ్గర పనిచేసినవాడు. ఎన్.టి.ఆర్‌తో ఒక పిక్చర్ చేశారు. అయినా అవకాశాలు రావడం లేదు. వారున్న ఇంటి పక్కపోర్షన్‌లో హీరో కాంతారావు వుండేవారు. పక్కనే మరో ఇంటిలో బాలయ్య వుండేవారు. వీరు ముగ్గురు నాకు మంచి స్నేహితులు. స్వతః మంచివారు.

వీరంతా సంసారపక్షంగా వుండేవారు. కాంతారావు జానపద సినిమాల హీరో కదా! నటి కాంచన సొంతంగా సినిమా తీయాలని ప్లాన్ చేసింది. ఆమంచర్ల దర్శకుడు. వారికి నేను కథరాసి పెట్టాలి. అలాగే కత్తుల గోపాలకృష్ణ మరొక ప్రొడ్యూసరు, నటుడు కూడా. అతనికోసం ఒక కథ, డైలాగులు రాశాను. కె.ఎల్.చౌదరి అనే మరొక ప్రొడ్యూసర్. అతనికి స్క్రిప్టు రాశాను. కొంత షూటింగు చేశారు. కె.వి.ఆర్ చౌదరి అని మరొక ప్రొడ్యూసర్. నలుగురు ప్రొడ్యూసర్లకు కథలు, మాటలు రాసిపెట్టినా ఒక్కటీ పూర్తికాకపోవడం దురదృష్టం. ఆమంచర్ల గారికి కన్నడ సినిమాలు దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. తరచు బెంగుళూరువెళ్లి వస్తుండేవారు. ఆయనకోసం వచ్చే కన్నడ నిర్మాతలతో, నటీనటులతో పరిచయం ఏర్పడ్డది. తక్కువడబ్బు యిస్తారు కన్నడంలో. నేను కథలు రాసియిచ్చాను.. కన్నడ సినిమాలకు రాస్తే తెలుగులో గుర్తింపు ఎలా వస్తుంది. రాదు. తర్వాత పి.పుల్లయ్యగారు వచ్చి ఒక సినిమాకు కథ రాయమని అడిగారు. రోజూ అయిదుగంటలకు ఆఫీసుకు కారువచ్చేది. ఓ నెల రోజులు వారికి ఓ కథరాసి పెట్టాను. అది మాత్రం వెంటనే పిక్చర్‌గా వచ్చింది.

. శ్రీబి.ఎన్.రెడ్డి, ఎం.ఎస్.రెడ్డిగార్లతో బాగా పరిచయం. విజయనిర్మలకు కొన్ని కథలు వినిపించడం జరిగింది. అప్పుడే హీరో కృష్ణతో పరిచయం. నా కథలు ఆమెకు నచ్చలేదు. సినిమావాళ్లతో ఒక బాధ వుండేది. మనం కష్టపడి కథలను తయారు చేసియిస్తే వారు వినేవారు. చదివేపాటి ఓపిక వుండదు. కొందరు చదివేవారు. చదివి, వినీ పెదవి విరిచేవారు. అలా ప్రతినిర్మాత, దర్శకుడు అనేక కథలు విని, రచయితను పంపిస్తారు. తర్వాత అదేకథ చిన్న చిన్న మార్పులతో సినిమాగా వస్తుంది. ఆ ప్రొడ్యూసర్‌గారి పెళ్లాం పేరుతోనో, కూతురి పేరుతోనే 'కథ' తెర కెక్కుతుంది. ఎంత విసిగిపోయినా సినిమా రచన చేయాలన్న కుతి తీరింది కాదు. భగవంతుడు జీవితాల్ని ఎలా మలుపు తిప్పుతాడో చెప్పలేం. సినిమారచయిత కాదగ్గలక్షణాలు నా దగ్గర బొత్తిగా లేవని తెలుసుకున్నాను. అదృష్టం లేదు.

ఆంధ్రప్రభ ఆఫీసులో కొన్ని మార్పులు వచ్చాయి. లోగడ ఇద్దరు ముగ్గురితో నడిచే పత్రికలో అయిదారుగురు పనిచేస్తున్నారు. ఎడిటర్‌గా విద్వాన్ విశ్వంగారు వచ్చారు. బి.సి.కామరాజు, నేను, మధుమూర్తి, పిలకాగణపతిశాస్త్రి, వెంకట్ ... పని తక్కువ, మనుషులు ఎక్కువ.

1968లో మాకొక పాప కలిగింది. యామినీదేవి ఆరోగ్యం బాగైంది. బాబాగారి విభూది మహిమవల్ల. ఆ పాపపేరు భానుప్రియ. మా పద్మప్రియకన్న నాలుగు సంత్సరాలు

చిన్న. చాలా అందమైన పిల్ల. భగవంతుని లీలలు మనిషికి అర్థంకావు. పిల్లా పాపలతో సంతోషంగా జీవితం సాగుతున్న సమయంలో ఒక అపశృతి... వీణలో కడ తీగ టప్పున తెగింది.

మా ఆఫీసులో పిలకా గణపతి శాస్త్రిగారు చేరారు. మంచికవి, కథకుడు, నవలాకారుడు. ఆయన రాసిన 'విశాలనేత్రాలు' ఆదుర్తి సుబ్బారావు సినిమాగా తీయాలని ప్రయత్నిస్తున్న రోజులు. ఈయన సినిమాలకు పాటలు రాశారు. ఆయనకు నాకు మంచిస్నేహం. ఇద్దరం రచయితలమే. ఆయనకు శ్రీ అరవిందయోగి అంటే అభిమానం. ఆయన ఆగస్టు 15న అరవిందాశ్రమం వెళ్లి, శ్రీ అరవిందుల సమాధి దర్శించి ప్రార్థనల్లో పాల్గొంటారు.

నన్ను తనతో, తనకు తోడుగా రమ్మని ఆహ్వానించాడు. ఇద్దరం ఆఫీసు అయిన తర్వాత పారిస్‌కార్నరుకు వెళ్లాం. బస్ టికెట్లు రిజర్వ్ చేసుకోడానికి. తీరా వెళ్లితే ఒక్క టికెట్టే దొరికింది. బ్యాడ్‌లక్. వారిని ఆ టికెట్ తీసుకోమని, మరోసారి కలిసి వెడదామని అన్నాను. విధివిలాసం. అలా ఆటంకం ఎందుకు ఏర్పడాలి?! అది ఆగస్టు 14, 1969. చీకటిపడేవేళకు ఇంటికి చేరాను. మనస్సులో ఏదో దిగులు. ఎందుకో అర్థంకాదు. మేమున్న మేడ ముందర త్రివర్ణ పతాకలు, తోరణాలు కడుతున్నారు. పిల్లలు బాల్కనీలో నిలబడి ఆనందంగా చూస్తున్నారు. నేను, శ్రీమతి భోజనం చేస్తున్నాం... భానుప్రియ పిట్టగోడపై వంగి క్రిందికి చూస్తూ ముందుకు పడిపోయింది. పిల్లలు గగ్గోలుగా అరిచారు... భాను క్రిందపడిపోయిందని. మేం లేచి క్రిందికి పరుగెత్తాం. అప్పటికే పాప రక్తపు మడుగులో స్పృహ తప్పి పడి వుంది. జనం పోగైనారు. క్రింద మరొక పిట్టగోడ లాంటిది వుంది. దానిపైన పొట్ట తగిలినట్లుంది. రక్తం కక్కుతోంది. శివాలయం దగ్గర వున్న ఒక క్లినిక్‌కు తీసుకు వెళ్లాం. డాక్టరుచూచి రక్తం ఆగడానికి ఇంజక్షన్ యిచ్చి, జనరల్ హాస్పటల్‌కి తీసుకుపొండి, యాక్సిడెంట్ కేసు, మేం చేయకూడదు అన్నాడు.

మద్రాసులో మేం వున్న ఇంటికి ఎదురుగానే మా తిరుపతి తోడల్లుడు గాయత్రీప్రసాద్‌గారి కుటుంబం వుంటోంది. ఆయన బి.ఇ. చదవడంకోసం వచ్చారు. తను క్లినిక్‌కు వచ్చాడు. అందరం కలిసి సెంట్రల్‌స్టేషన్ ఎదురుగా వున్న జనరల్ ఆస్పత్రికి టాక్సీలో తీసుకువెళ్లాం. రాత్రి పది అయింది. యాక్సిడెంట్‌కేసు, యమర్జెన్సీ. అయినా డాక్టర్లు పట్టించుకోలేదు. ఎలాగో అడ్మిట్ చేయగలిగాం. రాత్రి పన్నెండు గంటలకు ఒక చీటి యిచ్చి 'ఈ మందులు అర్జంటుగా కావాలి. ఆస్పత్రిలో స్టాకు లేదు' అన్నారు. జనరల్ ఆస్పత్రిలో లైఫ్‌సేవింగ్ డ్రగ్స్ లేవట. టాక్సీ చేసుకుని మౌంట్‌రోడ్‌కు వెళ్లాను. అక్కడ

దొరకలేదు. పూనమిల్లీ హైరోడ్‌లో దొరకవచ్చునంటే అక్కడకు వెళ్లి లేవనిపించుకుని వచ్చాం. ఉదయం సూర్యోదయవేళకు ముందే పాప అస్తమించింది. నేను, గాయత్రీ ప్రసాద్‌గారు తెల్లవారుఝామున ఇంటికి వెళ్లి, తిరిగి వచ్చేలోగా పాప శవమైంది. శ్రీమతి, మరదలు ఏడుస్తూ కూర్చున్నారు. ఆ శవాన్ని విడిపించి తేవడానికి అయిదుగంటలు పట్టింది. మా ఏరియా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు సంతకం కావాలన్నారు. ఆగస్టు 15 పోలీసు స్టేషనులో ఎవరూ దొరకలేదు. చివరకు12గంటల ప్రాంతంలో శవాన్నియిచ్చారు. అంబ్యులెన్స్‌లో ఇంటికి తీసుకు వచ్చాం. శ్రీమతి ఏడుపు పట్టపగ్గా ల్లేకుండా వుంది. ఆమె జీవితంలో అంతగా రోదించడం అదే. అసలామె కంట కన్నీరొలకదు. చాలా గంభీరంగా వుండగలదు. ఈ సంఘటన వేరు, కడుపు శోకం. తన రక్తం పంచుకు పుట్టిన బిడ్డ, తన ప్రేగు తెంచుకుపుట్టిన శిశువు. ప్రాణంలో ప్రాణం, నవమాసాలు మోసిన ప్రేమ... అల్లారుముద్దుగా పెంచుకున్నది. తన కళ్లముందే చనిపోతే, తన చేతుల్లో శవమై మిగిలితే! ఎవరిదీ పాపం! ఎవరిదా శాపం! కన్న తల్లిదండ్రులదా, కరుణించి ప్రసాదించిన భగవంతుడే కాటు వేయడమా?

పాప శవాన్ని నా చేతులతో ఎత్తుకుని మేడపైకి వెళ్లాను. వెంట శోక సముద్రం ఉప్పొంగినట్లు తను. పాప శవాన్ని అక్కడ నేలమీదపెట్టిన మరుక్షణంలో నేను స్పృహ తప్పి పడిపోయాను. సావిత్రి మృత్యువును వెన్నంటి వెళ్లినట్లు, నేను మృత్యువును తరిమి వేయడానికి ప్రయత్నించాను. పోరాడాను. ఓడిపోయాను. నాలుగు గంటలసేపు మా పోరాటం సాగింది. సాయంత్రం నాలుగు గంటలకు నాకు స్పృహ వచ్చింది. కళ్లు విప్పాను. ఇంటినిండా జనం. ఒక వందమంది వరకు చేరారు. కర్తవ్యం ముందున్నది.

గాయత్రీప్రసాద్, క్రిందివాటాలో వున్న పెంచలయ్య రుద్రభూమికి వెళ్లి ఏర్పాట్లు చేసి వచ్చారు. చీకటి పడేముందే అంతిమయాత్ర సాగింది. నా చేతుల్లో పాప శవం. కాళ్లలో నిస్సత్తువ. నడవలేని స్థితి. ఎవరడిగినా శవాన్ని యివ్వలేదు. నేనే మోసుకువెళ్లాను. గంభీరంగా మాతోపాటు నూరు, నూటయాభైమంది శ్మశానం వరకు వచ్చారు. అక్కడే ఒకచిత్రం. అంత దెబ్బతగిలి, అంత రక్తంపోయిన పాప, ప్రాణం పోయిన తర్వాత ఒక్కసారి బంగారురంగులోకి మారింది. శరీరంపైన ఒక్క గాయంగాని, మరక గాని లేవు. ఒక తేజస్వినిలా మెరిసిపోయింది.

అరవిందాశ్రమానికి వెళ్లకుండా విధిఆపింది. భగవంతుడు ముందు హెచ్చరిక గానే నాకు టికెట్ యివ్వలేదు. ఎందరు దేవుళ్లకో మ్రొక్కాను. ఎందరు స్వాముల్నో అర్థించాను. ఎవరూ నా మొర ఆలకించలేదు. మా ఇంట వెలిగిన ఒక దీపం ఆరిపోయింది.

అది మృత్యువుతో నా రెండవ సమాగమం. ఒకసారి మృత్యువును దర్శించినవారికి మృత్యుభయం ఉండదు. ఆనాడు నాలుగు గంటలు మృత్యుపోరాటంలో అలసిపోయాను. మనస్సు శూన్యమైంది. కళ్లనీరు ఎండిపోయింది.

పట్టణాలలో కొంత సానుభూతి వుంటుంది కాని నగరాలలో ఎవరు ఎవరినీ పట్టించుకోరు. పక్క ఇంట ఎవరైనా చచ్చినా తొంగిచూడరు. అలాంటిది ఆ పాప పోయినప్పుడు అన్ని వందలమంది వెంటరావడం ఆశ్చర్యం. వీరంతా ఎలా ఆత్మీయులు, ఎవరి ఆత్మీయులు. ఒక మహాగురువు నిర్వాణానికి తరలి వచ్చిన శిష్యగణం అనిపించింది. ఇంటికి తిరిగివచ్చాం. అది ఇల్లులా అనిపించలేదు. ఒక దేవత అంతర్ధానమైనపుడు దిగులుగా వున్న శూన్య దేవాలయం అనిపించింది. గాలిసైతం భోరున విలపించింది ఆత్మీయుల గుండెల్లో 'ప్రాణం' కొట్టాడింది.

అటువంటి సమయంలోనే భగవంతుని అస్తిత్వం ఒక ప్రశ్నార్థకం అవుతుంది. అసలు దేవుడనే వాడు వున్నాడా అనే అనుమానం కలుగుతుంది. ఉంటే, మన మొరెందుకు ఆలకించడు? మనం చేసిన పూజలు అన్నీ వృథా అయినాయా? బాబాలు, భగవాన్లు ఎందుకు సాయపడరు? మన కర్మ మనం అనుభవించేట్లయితే వీరిని సేవించడం ఎందుకు? ఇంతకాలం మహాత్ములనీ, అవతార పురుషులనీ నమ్మిన వారిపై మనస్సు తిరగబడసాగింది. దేవాలయాలంటే విరక్తి కలిగింది. వాటిల్లో దేవుళ్లే లేరు. ఉన్నవి రాతి విగ్రహాలు. దేవుడు, దైవభక్తి అన్నవి లేనేలేవు. అలా మొండితనం ప్రబలింది. పూజలు, సుప్రభాతాలు బంద్, ఇంట్లో వున్న దేవుడి పటాలను తీసివేశాను.

ఈ సంఘటన ఒక్కటే నా జీవితాన్ని మలుపు తిప్పింది. మా కుటుంబానికి మార్గజ్యోతి అయింది. దాని పూర్వాపరాలు కొంచెం చెప్పుకుందాం!

ఒక చిన్న పాప, భానుప్రియ భౌతికం విశ్రమించింది. ఒక చిన్న వెలుగు భానోదయంతో ప్రభవించింది. ఆ పాప చనిపోయిందని, మృతి చెందిందని ఇప్పటికీ నేను అంగీకరించను. అది నిర్వాణం, భానుప్రియ చిరంజీవి. ఆమె పూర్వజన్మలో ఒక మహర్షి... నాకు గురువు... ఆ కథ చెబుతాను. అంతకు ముందుగా చెప్పుకోవలసిన సంఘటన ఒకటి వుంది.

మాంబళంలో మా ఇంటికి సమీపంలోనే శివాలయం వుంది. శంకరమఠం వుంది. శివాలయానికి భక్తులు రోజూ వస్తుంటారు. తమిళనాడులో దేవాలయాలు ప్రసిద్ధాలు. గుడిచుట్టూ విశాలమైన ఆవరణలుంటాయి. పిల్లలు ఆడుకోడానికి అనువుగా వుంటుంది. పెద్దలు ఉదయం, సాయంత్రం వచ్చి విశ్రాంతి తీసుకోవచ్చు. అక్కడి శివాలయం కూడా అలాంటిదే. దాని ప్రత్యేకత, శివాలయానికి అనుబంధంగా పార్వతీ

దేవి ఆలయం వుంటుంది. నా శ్రీమతికి గుడికి వెళ్లడం అలవాటు. త్యాగరాయనగర్‌లోని అగస్త్యేశ్వరాలయం, శివ, విష్ణు ఆలయం మైలాపూర్‌లోని కపాలీశ్వరాలయం బాగా ప్రసిద్ధాలు. దేవాలయ దర్శనం వల్ల పుణ్యం మాట ఎలా వున్నా మనస్సు ప్రశాంతమవుతుంది. రెండురోజుల క్రితం అలవాటుగా యామిని ఇద్దరు పిల్లల్ని తీసుకుని గుడికి వెళ్లింది. ఒకరు మా పాప భానుప్రియ, రెండవవాడు మా పక్కింటి వారి అబ్బాయి. వాళ్ల బాబును చంకనెత్తుకుని తన పాపను నడిపిస్తూ వెళ్లింది. శివదర్శనం చేసుకుని అమ్మవారి గుడికి వెళ్లింది. గర్భగుడిలో నుండి పూజారి వచ్చి అమ్మవారి కుంకుమ యిచ్చి, తీర్థం యిచ్చాడు. లోపలికి తొంగిచూడగా, ఎప్పటిలాకాక, అమ్మవారి విగ్రహం తళతళ ధగధగ మెరిసిపోతూ, సజీవంగా వున్నట్లు తోచింది. దేవి ప్రత్యక్షమైన అనుభూతి కలిగి ఒడలు పులకరించింది. పూజారి తీర్థం యిస్తూ, "మీ పాపా?" అని అడిగాడు.

"ఈ పాప మా పాప. ఈ బాబు పక్కింటి వారబ్బాయి."

"మీ పాపా" అని పూజారి నవ్వుతూ తల నిమిరాడు. అంతలో లోపల అమ్మవారి విగ్రహంలో నుండి ఇలాంటి పాప నడచి వచ్చింది. తన దగ్గరగా వచ్చి నిలబడింది. ఆ పాప తిరిగి పార్వతీ దేవి రూపం దాల్చింది. ఈమె భక్తితో నమస్కరించింది.

"నేనొకటి అడుగుతాను యిస్తావా!" అన్నది పార్వతీదేవి.

దేవి తనను అడగడ మేమిటి? తాను అమ్మవారికి ఇవ్వడం ఏమిటి? దేవతలు మనను అనుగ్రహిస్తారు. అమ్మవారు అడగడంతో ముచ్చెమట్లు పోశాయి, నోటమాట రాలేదు.

"నీ పాపను నాకిస్తావా? నాకు కావాలి"

అంటూ పాపవైపు లాలనగా చూచింది పార్వతీదేవి.

తల్లి గుండె గుబగుబ మన్నది.

"పోనీ నీ పాపను ఇవ్వద్దులే. నీ దగ్గరే వుండనీ, నీ భర్తను నాకివ్వు"

ఏమిటీ విపరీతం!... పాప లేక భర్తా?

"నీ పాపనైనా యివ్వు, నీ భర్తనైనా యివ్వు, ఎవరో ఒకరు కావాలి నాకు, ఎవరిని యిస్తావో నీ యిష్టం."

అది దేవి కోరిక కాదు... ఆజ్ఞ! ఏ ఇల్లాలైనా ఏం సమాధానం చెప్పగలదు? ఆమె మాట్లాడలేదు. అలాగే స్థాణువులా నిలబడిపోయింది. కొన్ని క్షణాలకు దేవి వెనక్కుపోయి విగ్రహంలో లీనమైంది. శ్రీమతి బిక్కుబిక్కుమంటూ, భయంభయంగా ఇంటికి చేరింది. ఆ జరిగింది నాకు చెప్పలేదు. తను మరచిపోలేదు. రెండు రోజుల తర్వాత ఈ సంఘటన జరిగింది.

ఎంత అందమైన ఊహ! ఎన్ని రంగులు... ఎన్ని హంగులు, ఎన్ని కలలు... కలపోతలు... తలపోతలు... చీకట్లను చీల్చివేయగల కనిపించని వెలుగు, చలికి వణికే కిరణాలు వెచ్చవెచ్చని ఉదయం. ఎంతసేపు? కొంతసేపే. తర్వాత ఎండ మాడ్చివేస్తుంది. రంగులు కరిగి వెలుతురవుతుంది. తాపానికి ఆపసోపాలు తప్పవు. రంగులు కరిగిపోయినట్లే, కలలు కరిగిపోయి, భ్రమలు వీగిపోతాయి. జీవనసంధ్యలో వాడి, వేడి తగ్గుతుంది. గతకాలపు ఆనందాలు, సుఖాలు వెలిసిపోతాయి. జ్ఞాపకాలలో మిగిలిపోతాయి.

నా ఆలోచన మారింది. నేనుగా ప్రాణత్యాగం చేయతలపెట్టిన రోజుల మనస్థితి వేరు. ఇప్పుడు వేరు. దానికి దీనికి ఇరవై సంవత్సరాల దూరం. అది చాపల్యం. ఇది చేదు అనుభవాల సంపుటీకరణ. చావును గురించి, మృత్యువు గురించి తీవ్రంగా ఆలోచించినప్పుడే జిజ్ఞాస మొదలవుతుంది మనిషికి. ఇది అనంత జిజ్ఞాస. కొనలు చేతికందవు. ఆలోచన ఒక దరికి రాదు. తృప్తి ఉండదు. ఎప్పుడూ నిరాశ, ఎప్పుడూ అసంతృప్తి. జీవితం పట్ల విముఖత. అదీ నా జిజ్ఞాస. ఇంకా 'అన్వేషణ' ప్రారంభం కాలేదు. పుట్టిన తర్వాత చావు తప్పదని, పుట్టిన ప్రతివ్యక్తి, ప్రాణి చనిపోతుందన్నది యదార్థమే. అలా చెప్పడం శుష్కవేదాంతం. చెత్త ఊరడింపు, అసలు పుట్టడం ఎందుకు? చావడానికే అయితే పుట్టనవసరం లేదు. సృష్టింపబడిన ప్రతిదీ నశిస్తుందన్నది తాత్వికత. అది మాత్రం ఎందుకు జరగాలి? పుట్టించేదెవరు? సృష్టించేదెవరు? సృష్టి అనేది యాబ్‌స్ట్రాక్ట్. సృష్టించబడేదంతా మెటీరియల్. యాబ్‌స్ట్రాక్ట్ నుండి మెటీరియల్ ఏర్పడుతోంది... ఎలా?!... ఆరిజిన్ ఏది?!... అది రూపమా, అరూపమా? గుణమా, నిర్గుణమా? భావమా, అభావమా? మృత్యువు తర్వాత ఏమిటి? జీవి ఉంటుందా? జీవితం ఉంటుందా? ఉంటే ఎలాంటిది. భౌతిక శరీరాన్ని ఆశ్రయించకుండా భౌతిక ప్రపంచంతో సంబంధం లేకుండా జీవితం ఎలా సాగుతుంది? దానివల్ల ప్రయోజనం ఎవరికి??? ఎలా?!...

ఒక పసిపాప మరణం నాలో అనంత జిజ్ఞాసను రేపింది. మనస్సును మేల్కొల్పింది. అంతదాకా సీదా సాదాగా, కష్టసుఖాల కలగూరగంపగా సాగుతున్న జీవితంపై ఈ జిజ్ఞాసపొర కమ్మింది. మహర్షులు సైతం ఈ విచికిత్సకులోనై, ఆత్మదర్శనం కోసం అహర్నిశలు పరిశ్రమించి వుంటారని, సత్యాన్వేషణ జరిపి వుంటారని అనిపిస్తుంది. మరణం గురించే ఇరవై నాలుగు గంటలు యోచన. మద్రాసులో అడయార్‌లో దివ్యజ్ఞాన సమాజం వుంది. థియోసాఫికల్ సొసైటీ వారి పుస్తకాలు లోగడ చాలా చదివి వున్నాను. దాన్ని గురించి కొంత అవగాహన వుంది. మా కజిన్ ఒకాయన ... పేరు శరభాచార్య, ఆయన భార్య చనిపోతే అక్కడికి వెళ్లి వారి సాయంతో ఆమె ఆత్మతో

మాట్లాడి ఆ సంభాషణ అంతా ఒకపుస్తకంగా ప్రచురించాడు. ఆత్మలు మాట్లాడతాయా?... ప్రయత్నించి చూడాలి!

నేను, మా తోడల్లుడు గాయత్రీప్రసాద్ కలిసివెళ్లాం. థియొసాఫికల్ సొసైటి ప్రెసిడెంటు ఒక్కడికే ఆ శక్తి వుందని ఆయన ఒక నెలరోజుల క్రితమే ఐర్లాండ్ వెళ్లిపోయాడని తిరిగి రాకపోవచ్చునని చెప్పారు.అడయార్‌లో మఱ్ఱిచెట్టు, ధ్యానమందిరం చూచాను అప్పుడు. నాలుగైదువేల సంవత్సరాల నాటి మఱ్ఱిచెట్టు, ఓ నూరుసంవత్సరాలుగా దివ్యజ్ఞాన సమాజం వారికి నీడనిస్తోంది. ఊడలు మానులైనాయి. శిథిలమవుతున్న ఛాయలు కన్పించాయి. మాడం బ్లవట్స్కీ, లెడ్‌బీటర్, సిన్నెట్ లాంటి మహాత్ములు అక్కడ ప్రార్థనలు చేశారు, తపస్సు చేశారు. ఆత్మలపై ప్రయోగాలు చేశారు. ఆయన ఓ ఏడాది తర్వాత రావచ్చునని చెప్పారు. అయితే చనిపోయినవారి ఆత్మలు ఆరు నెలలు దాటిన తర్వాత మనం పిలిచినా రావట! ఈ ఆత్మల వ్యవహారం స్వయంగా పరిశోధించి తెలుసుకోవాలన్న పట్టుదల కలిగింది. అడయారు మఱ్ఱి పచ్చగా వుండి, నీడనిచ్చినంతకాలం దివ్యజ్ఞాన సమాజం బావుంది. తర్వాత దాని ప్రభావం కాస్త తగ్గినట్టు అనిపించింది. మహాతాత్త్వికుడైన జిడ్డు కృష్ణమూర్తి నడయాడిన బాటలో నేనూ అప్పుడు నడిచాను. అదొక తృప్తి. ఆ ధ్యానమందిరంలో నేనూ కాసేపు ధ్యానం చేసి వచ్చాను. అప్పటికి నాకు ధ్యానం, యోగం అన్నవి లేవు. మనస్సు వికలంగా వుంది. ఆ వాతావరణం బాగున్నది. కళ్లు మూసుకుని కూర్చున్నాను. అంతే. పుస్తకాలలో చదివాను. పుస్తకాల చదువు అసలు యోగానికి పనికి రాదనిపించింది. ధ్యానం చేసుకోవాలన్న మనస్థితిని కలిగించడానికి మాత్రమే చదువులు పనికొస్తాయి. ధ్యానానికి కూర్చున్న మరుక్షణంలో ఆ సంపాదిత విజ్ఞానం నిరుపయోగం. ఏదీ జ్ఞాపకం ఉండదు. మనం అనుకున్నట్లు ధ్యానం వుండదు. ధ్యానమే మనల్ని నడిపిస్తుంది. అలా మనల్ని నడిపిస్తేనే అది ధ్యానయోగం.

భగవంతుడు ఉన్నాడా, లేడా అని ఆలోచించడం అవివేకం. దండుగమారి పని. అసలు భగవంతుడే పెద్ద రాజకీయం. మనిషిలో అరాచకాన్ని, అలజడిని, అస్థిరతను కల్పించేది ఏదైనా రాజకీయమే. దేవుళ్లందరు రాజకీయనాయకుల్లాంటివారే. వీరు ప్రజాప్రతినిధులమని, ప్రజల్ని ఉద్ధరించడానికే తాము జన్మించామని, ప్రజాసేవే తమ జీవితలక్ష్యం అని చెప్పుకుంటూ, ప్రజల్ని దోచుకుంటున్నట్లే, మనల్ని ఉద్ధరిస్తున్నారనే భ్రమలో దేవుళ్లు దోచుకునే అవకాశం మనమే కల్పిస్తున్నాం. మనం నమ్మిన దేవుడు ఒక ముఖ్యమంత్రి, ప్రధాని కావాలి, మన అవసరాలన్నీ అడిగినవెంటనే తీర్చాలనీ ఆశిస్తాం . అవే వరాలు, అవే పర్మిట్లు. దేశప్రజలందరి క్షేమం నాయకులు ఎలా కోరరో, దేవుళ్లు

సైతం మన క్షేమం కోరరు. వారు మానవజాతిని ఉద్ధరించే ఒక వర్గంగా మనమే ప్రచారం చేసి, పదవు లిచ్చి, పోర్టుఫోలియోలు కల్పించి మనల్ని పాలించమని మనమే అణగి వుంటున్నాం. ఇది ఫక్తు రాజకీయం. ప్రజాస్వామ్యంలాంటిదే. మనం ఎన్నుకున్నవారే అధికారంలోకి వచ్చి, నియంతలుగా మారినట్లు దేవుళ్లు నియంతలై మనల్ని అణగ త్రొక్కుతారు. నాకు రాజకీయాలు పడవు. దేవుళ్లు పడరు. నాకు ఏ పార్టీపైన అభిమానం లేనట్లే, ఏ దేవుడిపైన అభిమానం లేదు. నా ఓటు ఏ దేవుడికీ వెయ్యను. నా బ్రతుకు నేను బ్రతికితే చాలు. స్వతంత్రంగా బ్రతకటం నాకిష్టం. యోగంలోనూ అంతే. ఉద్యోగంలోనూ అంతే. ఎవరి అథారిటీ నేను సహించను. స్నేహంగా మసలుకుంటాను. వాళ్లని పిలిచి, మర్యాదలు చేసి, పూజలు చేసి, కష్టాలు తెచ్చుకోవడం ఎందుకు? దేవుడు ఉన్నాడా, లేడా అన్న ఆలోచన అనవసరం. మనం నమ్మితే వుంటాడు నమ్మకపోతే లేనట్లే. మన ఊహ. మన అవసరం, మన కల్పన, మన నమ్మకం, మనకు కావలసిన దేవుడిని సృష్టిస్తుంది.

ఊహ తెలిసిన తర్వాత నాకు చాలాకాలం వరకు దేవుడి గురించిన ఆలోచన లేదు. చిన్నతనంనుండి పెద్దవాళ్ల అలవాట్ల అడుగుజాడలలో నడుస్తాం కనుక, అది మన నమ్మకం కాదు. "భగవంతుడు ఏడి?" అనే సంశయం వచ్చినప్పుడే మన సొంత ఆలోచన ఏర్పడినట్లు! "ఉంటే కనిపించడేం?" అనే సందేహం కలిగి, ప్రశ్నగా నిలిచినపుడు ఆలోచిస్తాం. అదే ఆరంభం వ్యక్తిత్వవికాసానికి. మన వ్యక్తిత్వాన్ని సమాధి చేయడానికి ప్రయత్నిస్తారు పెద్దలైనవారు. మనం ఇమిటేషన్‌గా, కార్బన్‌కాపీలాగా బ్రతకాలని అప్పుడు కుటుంబగౌరవం నిలుస్తుందని పెద్దల అభిప్రాయం. ఎక్కడో నాలాంటివాడు తిరగబడ తాడు. ఎదురునిలుస్తాడు. అందరూ గానుగెద్దుల్లా, కళ్లకు గంతలు తగిలించుకుని లోకాన్ని చూచి తాళ్లు తెంచుకుని పారిపోవడానికి యత్నిస్తారు.చిన్నప్పటి నుండి మనకు భక్తి అనేది ఒక అంటురోగంగా పట్టుకుంది. విప్లవ సాహిత్యం చదివి జందెం తీసివేశాను. అది 'పాపం' అన్నారు. నేను వినిపించుకోలేదు. "పాపం నాకు కదా! మీకేం బాధ" అని ఎదురు ప్రశ్నించాను. 'తప్పు!' అన్నారు. తప్పు ఎలా అవుతుంది? జందెం వేసుకోని వారంతా మనుషులు కారా? వారంతా బ్రతకటం లేదా, చదవడం లేదా, ఉద్యోగాలు చేయడం లేదా, ఏ విధంగా మీ జందెం ప్లస్‌పాయింటో చెప్పమని నిగ్గతీస్తే చప్పబడ్డారు పెద్దలనేబడేవారు. అందుకే పెద్దలమని ముద్రలు వేసుకున్న వారిపై గౌరవం పోయింది. నన్ను శాసించి, కట్టడిచేయడం వల్ల వచ్చిన పెద్దరికమా? పెద్దమనసు లేనివారు పెద్దలెలా అవుతారు?! మన స్వేచ్ఛను, స్వతంత్రాన్ని హరించడం పెద్దరికం లక్షణమా? నిత్యం గాయత్రి, సంధ్యావందనం చేయనివాడికి, వేదం చదవనివాడికి జందెం వేసుకునే అర్హత లేదు. అనవసరం కూడ.

మనిషికి రకరకాల అహంకారాలున్నాయి. మొదటి ఈగో కులం వల్ల సంక్రమిస్తోంది. ఉన్నతకులంలో పుట్టానన్న అహం, మిగిలినవారికన్న తాను అధికుడననే ఆధిక్యతా భావం వల్ల ఇతరులపట్ల చిన్నచూపు ఏర్పడుతుంది. పుట్టినప్పుడు ఎవడికీ కులం లేదు. అందరూ ఒక్కటే. అందరూ మనుషులే. ఉన్న తేడా ఆడ, మగ. అదీ శారీరకమే. మనిషి సంస్కారం ముఖ్యం. కులం కాదు. మన సమాజం వేల సంవత్సరాల నుండి కులాల చుట్టు ప్రదక్షిణ చేస్తోంది. మతం ముసుగులో దాగి వుంది. కొంపలో వున్నా కులమే. బయట కాలుపెట్టినా కులమే. వాడు గొప్ప, వీడు తక్కువ. వాడు ఉన్నత కులస్తుడు, వీడు తక్కువ కులస్తుడు. సంస్కారం బొత్తిగా లేని సమాజం. కాశ్మీర్ శాలువ కప్పుకుంటే పండితుడు. గడ్డం, మీసాలు పెంచుకుని కాషాయబట్టలు కడితే స్వామి. నా మనస్సు కుతకుతలాడసాగింది. మనశ్శాంతి లేదు.

'నీదేకులం' అని ఎవరైనా అడిగితే 'తెలియదు' అనేంత మొండితనం. మరీ రెట్టించి అడిగితే తన్ని తరిమి వేయాలన్నంత కోపం వచ్చేది. నాటి నుండి నేను ఎవరినీ ఏ కులం అని తెలుసుకో ప్రయత్నించలేదు. కులం అంటే అసహ్యం కలిగింది. మనం హిందువులం, భారతీయులం అని గర్వంగా చెప్పుకోవాలట. ఎందుకు!? హిందువులకు ఏది ప్రామాణికం ... వేదాలా? ఉపనిషత్తులా? భగవద్గీతా? మనుధర్మశాస్త్రమా? ఏది? హిందువునని చెప్పుకునే వాడు, జంధ్యాలు గట్టిగా పట్టుకునేవారు, జీవితంలో ఒక్కసారైనా వేదాలు చదివారా? ఉపనిషత్తులు చదివారా? గీతను పట్టుకు వేలాడతారు. హిందువులమని చెప్పుకునే అర్హత ఎంతమందికున్నది? క్రిస్టియన్ వారానికి ఒక్కసారైనా బైబిల్ పట్టుకుంటాడు. చర్చికి వెడతాడు. ప్రార్థన చేస్తాడు. హిందువుల్లో ఒక్క పవిత్ర గ్రంథం చదివిన వారెందరు? నెలకు ఒక్కసారైనా గుడికి వెళతారా? ఎందుకీ నటన, ఎందుకీ మోసం, ఆత్మద్రోహం?

స్నేహానికి కులాలు అడ్డుకావడం లేదు. ప్రేమకు 'కులం' అడ్డు తొలగిపోయింది. జ్ఞానానికి, సంస్కారానికి కులాలు అడ్డు ఎందుకు కావాలి! ఆర్థిక అసమానత తప్ప సమాజంలో మనిషికీ మనిషికీ మధ్య మరొక అసమానత వుండరాదు. ఆలోచనలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నిలవరించుకోలేకపోతున్నాను. ఎవరినో సంస్కరించాలన్న తపన కాదు. నన్ను నేను క్షాళనం చేసుకోవాలి. సంస్కరించుకోవాలి. నేను నా లక్ష్యాన్ని సాధించాలంటే గమ్యం చేరాలంటే ఏం చేయాలి? దరిద్రం ఒక ఆటంకం. సంసారం మరొక ఆటంకం. పాతికేళ్ళ వయస్సులో ఒక యువతి జీవితంలో ప్రవేశించి భాగస్వామి కావడంతోనే మగాడు సగం కోల్పోతున్నాడు. అర్థనారీశ్వరత్వం వస్తోంది. పౌరుషం సగం

చచ్చి, దాని స్థానంలో స్త్రీ సహజమైన గుణాలు, అణకువ, ఓర్మి లాంటివి ప్రవేశిస్తున్నాయి. అదే అర్థనారీత్వం. పెళ్లయిన తర్వాత స్వేచ్ఛపోతుంది. మనకు ఇష్టం లేకపోయినా కొన్ని పనులు చేయవలసిన దుస్థితి. ఇష్టం వున్నవీ మానుకోవలసిన దుస్థితి. ఈ ఓటమినే జీవితం... సహధర్మం అంటున్నాం. ఎంత వంచన? ఓటమినే విజయంగా భావిస్తూ మురిసిపోవడం సంసార లక్షణం.

కొంతకాలం నన్ను నేను ఎడ్యుకేట్ చేసుకోవాలనుకున్నాను. లైబ్రరీ పుస్తకాలు విపరీతంగా చదివాను. మా ఆఫీసు లైబ్రరీలో కొన్ని వేల ఇంగ్లీషు పుస్తకాలున్నాయి. అందులో ఫిలాసఫీ పుస్తకాలు ఎవరూ తాకిన పాపాన పోలేదు. థియొసాఫికల్ గ్రంథాలు, అరవిందుడు, రమణమహర్షి, రామకృష్ణ, మహేష్‌యోగి... ఇలా ఇంగ్లీషులో వున్న ఫిలాసఫీ పుస్తకాలన్నీ దుమ్ముదులిపి చదివాను. ఇంట్లో నైరాశ్యం. యామినీదేవిని వీడని పాప నీడలు. చెరగని జ్ఞాపకాలు.

భాను పోయిన సందర్భంగా మా అమ్మ, నాన్న వచ్చి ఓదార్చి వెళ్లారు. మామగారు, అత్తగారు రాలేదు. ఆయన పెద్దవాడైనాడు. ఎవరు వచ్చి చేసేదేమీ లేకపోయినా ఆ పలకరింపు ఒక ఊరడింపు, ఆత్మీయతలకు సూచిక. కాలం ఎంతటి విషాదాన్నైనా మింగివేస్తుంది. రోజులు గడుస్తున్నాయి. మామూలు స్థితికి వస్తున్న సూచనలు. రోజూ సాయంత్రం ఆఫీసు నుండి వస్తూ పాండిబజారులో దిగి డాక్టరు గారి దగ్గరకు వెళ్లడం, ఏవో మంచి విషయాలు వినడం ఒక అలవాటైంది. ఆయన నాకోసం ఎదురుచూస్తుండేవారు. నా స్థితిగతులు తెలిసినవాడు. సహృదయుడు. ఆయన మాటలు పన్నీటి జల్లులు. పదిమందితో కలవడం వల్ల, మన బాధల్ని మరచిపోతాం.

ఒకరోజు అరవిందుల 'సావిత్రి' ఇంటికి తెస్తున్నాను. అంతలావు పుస్తకం పైన ఆయన చూపు పడ్డది. తీసుకుని చూచి "నీవు చదివాక నాకొకసారి యివ్వు" అన్నారు. నాలో నిగూఢంగా వున్న తాత్వికతను ఆయన గ్రహించారు. ఆ తర్వాత మా మధ్య చర్చలు, లోతుగా సాగేవి.

"నీకు యోగం అంటే ఆసక్తి వుందా?" అని అడిగారు.

"ఆసక్తి అంటే చాలా పుస్తకాలు లోతుగానే చదివాను." అప్పటికి నా పరిజ్ఞానం అంతవరకే. అబద్ధం చెప్పలేదు.

నా పుట్టినతేదీ, జాతకచక్రం అడిగి తీసుకున్నారు.

నటరాజ శర్మ అనే భృగునాడి చదివే ఆయన డాక్టరుగారికి తెలుసు. ఒకసారి ఎప్పుడో నేనూ వెళ్లాను ఆయనవద్దకు. ఆయన నన్ను గుర్తించలేదు. ఆదివారం ఆయనను

పిలిపించారు. నా జాతకం చదివించారు. అందులో నా గురించి, నేను ఏ పరిస్థితిలో యోగంలో చేరేది వచ్చింది. తాను, నేను కలిసి యోగప్రచారం చేస్తామని వచ్చింది.

కానీ డాక్టరుగారికి నా పట్ల విశ్వాసం లేదు. బ్రాహ్మలే యోగానికి అర్హులని ఆయనకో గుడ్డినమ్మకం. అయినా నన్ను వదలుకోవడం యిష్టం లేదు. రోజులు గడుస్తున్నాయి. నేను అడగలేదు. తాను ఆలోచిస్తూనే వున్నారు. ఒకరోజు సాయంత్రం ప్రేమగా అన్నారు -

"శార్వరీ, రోజూ ప్రేయర్ చేసుకో, బావుంటుంది"

ప్రేయర్ అనే మాటకు నాకు తెలిసిన అర్థం వేరు. డాక్టరుగారి భావం వేరు. అయన యోగసాధన చేసే పద్ధతినే ప్రేయర్‌గా వ్యహరిస్తారు. ఆ తేడా నాకు తెలియదు. ఒకరోజు సాయంత్రం ఆరుగంటలకు తనతో తనగదిలోకి రమ్మన్నారు. వెళ్లాను. తలుపు మూశాం. ఆయన చెక్కమంచంపైన కూర్చుని ప్రేయర్ చేసుకున్నారు. నేను ఆయన్ని చూస్తూ కూర్చున్నాను.

తిరిగి హాలులోకి వచ్చాక అడిగాను

"అదేనా ప్రేయర్! మంత్రం వుండదా?"

"ఇది వేరు... నీ తలపైన చూడు" అన్నారు.

తల ఎత్తి చూచాను. అక్కడ మాస్టర్‌గారి ఫోటో వున్నది. చాలాకాలంగా అది అక్కడే వుంటోంది. అది ఏమిటో ఎవరిదో అడగలేదు. ఆ అవసరం కలగలేదు: దానిపై 'మాస్టర్ సి.వి.వి. నమస్కారమ్' అనిఇంగ్లీషులో రాసి వుంది.

"ఆ మాటలు అనుకుని ధ్యానం చేయాలి, అంతే"

"మాస్టరుగారు మీ గురువుగారా?"

"ఈ యోగంలో గురువు అవసరం లేదు. యోగం చేసే వారందరికీ ఆయనే మాస్టరు... ఇంక ఏమీ అడగకు... ప్రేయర్ చేస్తున్న కొద్దీ అన్ని విషయాలు నీకే తెలుస్తాయి."

"నాకు దేవుడి పైన నమ్మకం లేదు" అన్నాను.

"నాకూ లేదు. నేను పూజలు, గట్రా చేయను. అది ఒకఅర్హత యోగానికి."

"అంటే నేను యోగానికి పనికొస్తానా?"

"అందరూ పనికొస్తారు. మనస్సుపెట్టి సాధన చేస్తే చాలు. మిగిలినవన్నీ వదులుకోవాలి."

ఆయన మాటలు నాకు అన్వయించుకోసాగాను. యోగానికి కావలసిన అర్హత, యోగ్యత నాకు వుందనిపించింది.

"యోగం చేయటం వల్ల ప్రయోజనం ఏమిటి?"

"అన్నివిధాల అభివృద్ధి వుంటుంది. భౌతికంగా చూస్తే, శరీరం ఆరోగ్యం అవుతుంది. కర్మశేషం వల్ల కొన్ని జబ్బులు కలిగినా ప్రమాదకరం కావు. యోగశక్తి వల్లనే అవి చక్కబడతాయి. యోగం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. కనుక యోగం చేసేవారు జబ్బు పడడం సాధారణంగా జరగదు. రెండవది మానసిక శక్తి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. తీక్షణంగా, సూక్ష్మంగా ఆలోచించడం అలవాటవుతుంది. సత్యాన్ని మనకుగా మనం గ్రహించగలుగుతాం. ఏది చదివినా, ఏది విన్నా, అందులోని సత్యాన్ని మాత్రమే గ్రహించి, అసత్యాన్ని వదలివేసే విచక్షణ కలుగుతుంది. హంస పాలను నీటినుండి వేరు చేసినట్లు, మనమూ విషయాలలోని సత్యాన్ని మాత్రమే స్వీకరించగలుగుతాం. మూడవది, మనలో వున్నదని మనం తెలుసుకొని గ్రహించని 'ఆత్మ'శక్తి పెరుగుతుంది. దానివల్ల ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం కలుగుతాయి. తద్వారా ఆత్మ ఉనికిని గ్రహించి, ఆత్మలోకంలో జీవించగలుగుతాం. అదే మానవజీవితానికి పరమలక్ష్యం, గమ్యం కావాలి."

అంత చెప్పిన తర్వాత యోగంపట్ల ఆసక్తి కలగకుండా ఎలా వుంటుంది? ఎవరికి మాత్రం - మూర్ఖుడైతే తప్ప ఇంక ఎదురుప్రశ్నలు వేయడు? శంకించడు. నేను సిద్ధం.

"ఉపదేశం యిస్తారా?"

"ఉపదేశం అన్నది పాతపద్ధతి. ఇక్కడ పాతపద్ధతులు, అలవాట్లు, సంప్రదాయాలు, ఆచారాలు ఏవీ ఉండవు. బ్రాండ్ న్యూ. ఈ యోగపద్ధతే న్యూ డైరెక్ట్‌లైన్. ఈ లైనులో ఉపదేశాలు లేవు. డైరెక్టుగా వెతుక్కోవటమే పద్ధతి. ఒక్క మాస్టరుగారికి తప్ప ఉపదేశార్హత ఏ మీడియంకు లేదు. సాంప్రదాయపద్ధతిన ఇక్కడ గురుసేవ చేయనవసరం లేదు. పాదపూజలుండవు. అందరూ సమానమే. అందరూ మాస్టర్‌గారి శిష్యులే. అందరికందరూ మిత్రులు. ఆత్మబంధువులు. ఆత్మీయులు. అసలు ఇక్కడ 'మంత్రం' అనేది చెప్పరు. ప్రేయర్ అంటాం. 'యోగం' చేస్తున్నామన్న మాట అనం. ప్రేయర్ చేసుకుంటాం. సంప్రదాయంలో గురువు శిష్యులు వుంటారు. ఉపదేశం వుంటుంది. ఇది కామన్‌వెల్త్. ఈ సంపదకు అందరూ సమానార్హులే. ఎవరికి వారే డెవలప్ కావాలి! నీవు ఎంత చేసుకుంటే అంత ఫలితం వుంటుంది. ఏ గురువు తన శక్తిని శిష్యునికి ధారపోయకూడదు. మార్గం చూపించాలి. సాధకుడు తానుగా డెవలప్ కావడానికి సహకరించాలి. అది ఏ సీనియర్ సాధకుడైనా చేయవచ్చు. పది సంవత్సరాలు సిన్సియర్‌గా యోగసాధన చేసినవారు ఇతరులను గైడ్ చేయవచ్చు."

ఏమిటో అంతా అయోమయం, గందరగోళం అనిపించింది. తాడులేకుండా బొంగరం తిప్పాలిట! ఎలా ఆరంభించాలి? ఏది పద్ధతి?

"అబ్బాయ్ నీవు ఆలోచించడం పూర్తిగా మానెయ్. నీకసలు బుర్ర లేదనుకో. ఆ బుర్రలో ఆలోచనలు లేవనుకో. బి యాస్ ఇన్నోసెంట్ చైల్డ్."

"సాయంత్రం రా... నాతో ప్రేయర్ చేసుకో."

డాక్టర్‌గారితో చర్చించి, వాదించి నెగ్గలేం. ఆయన మొండితనం అలాంటిది. ఆయన చెప్పేది అర్థం కాకపోయినా తలాడించక తప్పదు ఎంతటివారికైనా. అది బాలసుందరరావుగారి ప్రత్యేకత. ఆయన ఆహ్వానం మాస్టర్ 'ఆదేశం'గా భావించాను. అంతకు మునుపు పది సంవత్సరాలుగా ఆయన తెలుసు. కాని ఎన్నడూ ఈ విషయం ప్రస్తావనకు రాలేదు. ఆ అవసరం కలగలేదు. దేనికైనా సమయం రావాలి కదా!. ఆరు తర్వాత వెడితే 'డాగీ ప్రేయర్‌లో వున్నారు. కూర్చోండి' అని వారి అమ్మాయి జలంధర చెప్పేది. ఆ ప్రేయర్ ఏమిటి అని ఎన్నడూ అడిగింది లేదు, ఆలోచించిందీ లేదు.

యోగం ఆరంభించడానికి ముందు గురువుగారు కొన్ని షరతులు పెట్టారు. "ఇకపైన పూజలు, వ్రతాలు గట్రా మానుకోవాలి." అప్పటికి నాకు నిత్యం వేంకటేశ్వర సుప్రభాతం, లలితాసహస్రనామ పారాయణం అలవాటు. వాటిని మానడం ఎలా? అపచారం కాదా?

"అపచారం లేదు, ఆవకాయ లేదు, మానెయ్" అన్నారు. అది శాసనం... "పూజలు, అవీ చేసేవారు యోగానికి పనికిరారు. రెండూ కలిపిచేస్తే ప్రాణం మీదికి వస్తుంది. నేను యోగం చేస్తూ ఎవరో బోడిసలహా యిచ్చాడని గణపతి ఉపాసన చేశాను. ఫలితం నాకు కాలుచెయ్యి పడిపోయింది. 'పక్షవాతం' వచ్చింది. లెంపలు వేసుకుని గణపతికి వీడ్కోలు చెప్పి, మాస్టరుగారికి క్షమాపణ చెప్పుకున్న తర్వాత కాస్త నడవ గలుగుతున్నాను. చేయి, నాలుక కాస్త స్వాధీనంలోకి వచ్చాయి. నేను చేసిన పిచ్చి పని లాంటిది నీవు చేయకూడదు. 'అహం'కారం వదలిపెడితే, ఆధ్యాత్మికంగా ఎలాంటి అనర్థాలు రావు, గుర్తుంచుకో" అన్నారు.

అడుగడుగునా అగ్నిపరీక్షలు, అవరోధాలు, ఆంక్షలు. ఈ యోగం సజావుగా సాగేనా?

నాలో నేనే తర్జనభర్జన చేసుకున్నాను. నేను యోగానికి అర్హుడినా? యోగం అంటే ఆసనాలు వేయడం, ప్రాణాయామం చేయడం అని తెలుసు. ఉపదేశం పొంది, గురువు అడుగుజాడలలో నడవడం, నియమనిష్టలతో, యమ నియమాలతో తీవ్రంగా

సాధన చేయడం అనీ తెలుసు. ఈయన పద్ధతి విచిత్రంగా, విడ్డూరంగా వుంది. 'సెల్ఫ్' అనే మాటకు అర్థం ఇదా! ఇది సాధ్యమా? మనిషి స్వయంకృషితో సాధన సాగించగలడా? ప్రయోజనం పొందగలడా! గమ్యంచేరగలడా?మనస్సు కకావికలం కాసాగింది? దీనికి పరిష్కారం!!... ఎక్కడ మునిగి ఎక్కడ తేలతానో తెలియదు! నిశ్చయించుకున్నాను.

ఆ రోజు నవంబరు 7. నా పుట్టినరోజు.

ఎప్పుడూ పుట్టినరోజులు జరుపుకున్నది లేదు. ఆరోజుల్లో ఆ వేడుకలు లేవు. ఇంగ్లీషువారి సంస్కృతి ప్రవేశించి ఇప్పుడు ప్రతివారు పుట్టినరోజులు, పెళ్లిరోజులు జరుపుకుంటున్నారు. అప్పట్లో చాలామందికి వయస్సే సరిగా తెలియదు. పుట్టినరోజులు ఏవో కొండగుర్తులు. నలభై సంవత్సరాలకు ఓ మంచి పనిచేస్తున్నాను.

ఆ సాయంత్రం ఏ ఆర్భాటం లేకుండా వెళ్లాను. ఆయన ఏవీ తెమ్మని చెప్పలేదు. మాస్టరుగారి ఫోటోముందు కూర్చోవడం కూడా లేదు. దీపారాధన లేదు, అగరువత్తులు వెలిగించడం లేదు. డాక్టరుగారి ప్రేయర్ గది చాలా చిన్నది. ఆయన పడుకునే చెక్కమంచం. పక్కన రెండు అడుగుల జాగా. తాను మంచం మీదనే కూర్చుని ప్రేయర్ చేసేవారు. నేను నేలపై కూర్చున్నాను. చాప కూడా లేదు.

"మాస్టర్‌గారి రూపం ఒకసారి మనసులోకి తెచ్చుకో. ఆ ఫోటో క్రింద రాసింది మూడుసార్లు లోపల అనుకో! కళ్లు మూసుకుని కూర్చో. లోపల ఏం జరుగుతున్నదీ గమనిస్తూ వుండు" అన్నారు. అలాగే చేశాను. నాకేమీ అనిపించలేదు. ఏవో ఆలోచనలు పిచ్చిగా వస్తుండేవి. ఆయనతో చెబితే తిడతారని భయం. నాలుగురోజులు బలవంతంగా వెళ్లినట్లు అనిపించింది. అయితే ఆరు అయ్యేసరికి అక్కడికి, ప్రేయర్‌కు పోవాలి అని లోపల వత్తిడి. నాలుగు రోజులలో నాలో ఒక మార్పు కనిపించింది. నాకు గాస్ట్రిక్ అల్సర్ వుండేది. విపరీతంగా బాధపడేవాడిని. ఒళ్లంతా చెమటలు పట్టేవి. కళ్లు తిరిగి పడిపోయేంత నీరసం. డాక్టరుగారు లో బి.పి. అని దానికి మందులు లేవని తేల్చి చెప్పారు. యోగంలో చేరిన రోజు నుండి నాలోని 'అల్సర్' మాయమైంది. తర్వాత ఎన్నడూ నాకు ఆ జబ్బు వుండేదన్న స్పృహ పోయింది.

సుప్రభాతం, లలితా సహస్రనామ పఠనాలు ఆగిపోయాయి అప్రయత్నంగానే. ఇంట్లో వున్న దేవుళ్ల పటాలు సెలవుతీసుకున్నాయి. నైరాశ్యంలోంచి ఒక ఆశ చివురించింది. ఆత్మ మొగ్గ తొడిగింది. గుడులు, గోపురాలు, దైవదర్శనాలపై మోజు తీరిపోయింది. రోజూ డాక్టరుగారింటికి సాయంత్రం ప్రేయర్‌కు వెళ్లడం తప్పనిసరి. ఈ లోపల మమ్మల్ని

పరామర్శించడానికి మా పెద్దమ్మ వచ్చింది. ఇంట్లో మాస్టర్‌గారి ఫోటో తెచ్చి పెట్టుకున్నాను. అది ఏమిటో, ఎవరో, ఎందుకో శ్రీమతికీ చెప్పలేదు. మా పెద్దమ్మగారు ఆ ఫోటో చూచి అన్నారు "కృష్ణా! మాస్టరుగారి యోగం చేస్తున్నావా?"

"చేయాలని ప్రయత్నం. నీకు తెలుసా దీని గురించి?"

"ఒంగోలు మాస్టరుగారి దగ్గర చేరాను, చాలాకాలంక్రితం. అప్పుడు వినుకొండలో వుండేవాళ్లం. పిడుగురాళ్లకు వెళ్లేదాన్ని."

"ఇప్పుడు చేయటం లేదా?"

"మానేశాను భయంవేసి. ఒకసారి బావి వద్ద నీరు తోడుతుండగా, సప్తర్షులు కనిపించారు. దాంతో భయం వేసి మానేశాను."

ఆమె నాకు సలహా యిచ్చారు, "చాలా గొప్పయోగం మాస్టరుగారిది! బావుంట^^ది చేయండి. మధ్యలో మానుకోవద్దు. పూర్తి అంకితభావంతో సాధన చేస్తే, గృహస్తులకు దీనిని మించిన యోగం లేదు. అన్ని ఫలితాలు కలుగుతాయి" అని యామినీదేవికీ సలహా యిచ్చింది. "నీవుకూడా చెయ్యి అమ్మాయ్. బావుంటుంది. దిగులు విచారం వుండవు. ఆరోగ్యం బాగా వుంటుంది. ఈ యోగం చేసేవారికి ఎలాంటి రోగాలు, రొష్టులు రావు. ఎవరూ మీకు అవకారం చేయలేరు. మాస్టరుగారు తన యోగసాధకుల్ని వేయికళ్లతో కనిపెట్టి రక్షిస్తుంటారు. అన్ని అవసరాలు తీరుస్తుంటారు. అసలు 'ఇది నాకు లేదు' అనే భావనే రాదు. జీవితం అన్నివిధాలా సుఖంగా, తృప్తిగా సాగుతుంది."

డాక్టరుగారికి నాడీజ్యోతిషంపై నమ్మకం. నటరాజశర్మను పిలిపించి నా జాతకం చెప్పించారు. అందులో నా గతం గురించి జరిగింది జరిగినట్లు వచ్చింది. యోగంలో ప్రవేశమూ చెప్పారు. డాక్టరుగారు, నేను కలిసి తూర్పు సముద్రతీర మహానగరంలో యోగవ్యాప్తి చేస్తామని వచ్చింది. అంటే నా వల్ల కొంత యోగావర్క్ జరుగుతుంది. అంటే నేను యోగానికి అర్హుడిని. అది తెలుసుకుని కాని ఆయన నన్ను యోగంలోకి అనుమతించలేదు. ఎన్నడో మహర్షులు రాసిపెట్టిన నాడీగ్రంథాలలో మన జాతకాలు రావడం ఆశ్చర్యం. పేర్లతో సహా వస్తాయి. నాకంటే నా శ్రీమతి యోగంలో పూర్ణత్వం పొందుతుందని వచ్చింది. దాంతో ఆయన మరో ఆదివారం నాడు యామినీదేవి జాతకం నాడీలో చదివించారు. ఆమెగారి జాతకం, యోగం, ధర్మకాండ చదువుతుంటే ఆయన ఆనందానికి అవధి లేకుండా పోయింది. అందులో అనేకానేక యోగ రహస్యాలు చెప్పబడ్డాయి. - భయం, దుఃఖం, శోకం లాంటి ఉత్పాతాలు కలిగి, వాటి కారణంగా

ఆమె యోగంలో ప్రవేశిస్తుందని, పూర్వజన్మకర్మఫలంగా కొంతకాలం రోగపీడిత అవుతుందని, ఒక బిడ్డ మరణం దుఃఖహేతువై, యోగ ప్రవేశానికి మార్గం ఏర్పడుతుందని వచ్చింది. ఉత్తమగృహిణి అని, బిడ్డలు కీర్తివంతులవుతారని, భర్త మహాయోగి అవుతాడని, తాను దుఃఖ సాగరంలో మునిగి వుండగా ఎవరో రక్షిస్తారని, గురుకటాక్షం లభిస్తుందని చెప్పాడు. తాను నిరాడంబరంగా, సామాన్యగృహిణిగా వుంటూ మహాగురువు అనుగ్రహానికి పాత్రురాలవుతుంది. ఆమెకు సాధనలోనే సృష్టి రహస్యం అవగతమవుతుంది. మూడు ఫలితాలూ ఒకేసారి అనుభవానికి వస్తుంటాయి. బాహ్యవిజ్ఞానం, అంతర్జ్ఞానం, సృష్టిరహస్యం విదితమవుతాయి. విశ్వవిజ్ఞానం యావత్తూ ఆమెచేసే యోగంలో నిక్షిప్తమై వుంది. సాధనలో ప్రకృతిరహస్యాలు, గ్రహాలరహస్యాలు తెలియడమేకాక మహాశక్తులు, సిద్ధులు యోగసాధనతో ఆమెకు వశమవుతాయి. దీనిని సాంఖ్యదర్శనం అంటారు. యుగయుగాలుగా మహర్షులు, మహాయోగులు ఎందరో సాధనచేసి తరించిన యోగం ఇది. దీనిని మాస్టర్ సి.వి.వి. అనే కారణజన్ముడు భృక్తరహిత తారక రాజయోగం అని నామకరణం చేశారు.

ఈ జాతకురాలు జన్మించేవరకు ఈ యోగం పరమ నిగూఢంగా, రహస్యంగా వుంది. కృణువులో విశ్వశక్తి దాగి వున్నది. అమృతపానంతో ఎవరైనా మృత్యుంజయులు కావచ్చు. ఈయోగం అమృతయోగం. ఎవరైనా అమృతతుల్యులు కావచ్చు. మృత్యుంజయులు కావచ్చు. యోగసాధన మనిషికి ఆయుర్వృద్ధినిస్తుంది. శరీరం రోగరహితమై, కాయకల్ప చికిత్స జరుగుతుంది. శరీరం బంగారు రంగుగా మారుతుంది. బాధ అనే మాటను మరచిపోవచ్చు. స్థూల, సూక్ష్మ, ప్రాణ శరీరాలలో యోగక్రియ ఒకేసారి జరుగుతుంటుంది. జీవులు స్థూల శరీరాన్ని వదిలే సమయం వరకు రోగబాధలు, ఈతిబాధలు వుండవు. సాధకునికి మందులతో పనిబడదు. ఏ జబ్బునైనా యోగశక్తితో నయం చేసుకోవచ్చు. సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సంపూర్ణ జ్ఞానం కలుగుతుంది. యోగంలో అభివృద్ధి నిత్యం అనుభూతమవుతుంటుంది. ఈ జాతకురాలు చూపుతో, స్పర్శతో, సంకల్పంతో యోగచికిత్సలు చేయగలదు. వరాలు అనుగ్రహించగలదు. ఈ మహాయోగాన్ని దక్షిణదేశంలో కావేరీ తీరంలో ఒక పుణ్యక్షేత్ర నగరంలో, కణుడు, కపిలుడు, యవనాచార్యులు, బోధాయనుడు, అగస్త్యమహర్షి మొదలుగా గల మహాత్ముల అంశతో జన్మించిన ఒక మహాయోగి ఈ శతాబ్దంలో మానవాళిని అనుగ్రహించారు.

నా శ్రీమతి నాడీజ్యోతిషంలో నా యోగప్రస్తావన జరిగింది. నేను యోగంలో చాలా అభివృద్ధి సాధిస్తానని వుంది. ఆమెకు గురుపాద దర్శనం అవుతుందని, గురువు

అనుగ్రహం సర్వవేళల లభిస్తుందని, పుణ్యవతి అని ఏవేవో చెప్పారు. డాక్టరుగారు తనంత తానుగా నన్ను ప్రోత్సహించకపోతే దయచూపకపోతే నాకు యోగం గురించి తెలుసుకునే అవకాశం వుండేది కాదు. మాస్టరుగారు తనయోగంలోకి సాధకుల్ని చిత్రంగా రప్పిస్తుంటారు. ఎవరు అర్హులో మనకు తెలియదు. ఆ సమయం వచ్చినపుడు మహాగురువు పిలుపు అందుతుంది. ఎవరి ద్వారానో యోగంలో ప్రవేశం లభిస్తుంది. తర్వాత సాధకుని అభివృద్ధిని మాస్టరుగారే చూసుకుంటారు.

నేను పిరికివాడిని. జీవితంలో అనేక ఓటములు చవిచూసినవాడిని. దేనిని నమ్మను. దేనిపైన పూర్తి విశ్వాసం ఏర్పడదు. కారణం జీవితంలో అనుకున్నవి ఏవీ సాధించలేకపోవడమే. రోజూ సాయంత్రం యోగాకు వెళుతున్నా మనస్సు నిశ్చలంకావడం లేదు. ప్రేయరు కుదరడం లేదు. పిచ్చిపిచ్చి ఆలోచనలు. విజయ అని ఆరుద్ర అన్నగారు నాకు మిత్రులు. వారికి ఒక నాడీ జ్యోతిష్కుడు తెలుసు. అతనిపేరు కుమారగురు. అతను చెప్పే నాడి గణేశ్‌నాడి. ఒక ఆదివారం విజయవాళ్ల ఇంట్లో నా నాడీ చదివించారు వారు. నాకు సాముద్రికం తెలుసు కొంత. జ్యోతిషంలో ప్రవేశం వుంది. అందులో తీయగానే నా జాతక చక్రం, గ్రహస్థితులు, జన్మదశాశేషం ఖచ్చితంగా వచ్చాయి. అందులో నా పేరు, పెన్‌నేమ్ 'శార్వరి' అని వచ్చాయి. పేర్లు రావడం, మా పెద్దవాళ్ల గురించి, వారి వృత్తుల గురించి చెప్పడం ఆశ్చర్యం వేసింది. ప్రస్తుతానికి వచ్చి మా పాప చనిపోవడం, ప్రమాదం గురించి చెప్పాడు. చనిపోయిన పాపకు నాకు యోగసంబంధం వుందట. గత అయిదు జన్మల వృత్తాంతం వివరించాడు. అన్ని జన్మలలోనూ ఒక గురువు శిష్యరికం చేస్తుండేవాడినట. క్రితం జన్మలోనే యోగసమాప్తి కావలసింది. కాని ఎందువల్లనో కాస్త గురుద్రోహం జరిగిందట. ఆ గురువు కోపించి, ఆ పరిపూర్ణత సిద్ధించలేదు. ఈ జన్మలో అదే గురువు నాకు 'పాప'గా జన్మించి ఒక మహత్తర యోగమార్గంలో ప్రవేశించడానికి వీలుకల్పించాడు. పూర్వం అయిదుజన్మలలో నాకు గురువైన వ్యక్తి ఈజన్మలో 'పాప'గా జన్మించాడు. నేను పూర్వజన్మలో కేరళలో ఒక మహామాంత్రికుడనని, కాశ్మీరంలో యోగం చేశానని, ఏవేవో చెప్పాడు. ఆ యా జన్మల యోగం, మంత్ర, తంత్రశక్తులు ఇప్పటికీ నాలో వున్నాయని, అవసరమైనప్పుడు వాటిని వినియోగించుకోగలనని చెప్పాడు. ఈ జన్మలో యోగం సాధన చేసి నేను చేయబోయే సత్కార్యాలు అన్నీ వివరించాడు. నాడీకారుని మాటల్లో చెబుతాను – 'ఈ జాతకుడు సింహలగ్న జాతకుడు. సానపట్టిన వజ్రం. చిన్నతనం నుండి వైరాగ్యభావన అధికం. ఈ యోగంలో వేయిమందికి ఉపదేశం చేస్తాడు. గురుపూజలు జరిపిస్తారు శిష్యులు. గురువుగా గొప్ప కీర్తి సంపాదిస్తాడు. వీరి

ఇల్లు ఒక యోగాలయం, ఒక తపోవనం. అనేకమంది నిత్యం తపస్సు చేసుకోడానికి వస్తుంటారు. అది ఒక ఋష్యాశ్రమంలా భాసిస్తుంది. యోగసమావేశాలు, ఏడాదికోమారు గురుపూజ జరుగుతుంది. జాతకునికి పంచభూతాలు వశమై వుంటాయి. ఆత్మయోగిగా సాధన చేస్తాడు. గంటలు, రోజులు సమాధిలో ఉండగలడు. ఇతని యోగశక్తికి దైవబలం తోడవుతుంది. కృష్ణాజినంపైన ధ్యానం చేస్తాడు. ధనం, కీర్తి, ప్రతిష్టలు పుష్కలంగా, అయాచితంగా లభిస్తాయి. సహస్రశిష్యపరివేష్టితుడైన మహాగురువు అవుతాడు.

పూర్వజన్మగురించి నాడీకారునివాక్యం: పూర్వజన్మలో ఇతనొక మహామంత్రవేత్త. పదహారవ ఏటనే గురూపదేశం పొంది, ఒక్క ఏడాది కాలంలో సిద్ధులు సంపాదించి పద్ధెనిమిదవ ఏట గురువుపైనే ప్రయోగించాడు. అహంకారంతో, తపోబలంతో, దర్పంతో గురుద్రోహానికి తలపడ్డాడు. గురుద్రోహం వల్ల ఆ సిద్ధులు ఫలించకుండా గురువు కట్టడి చేశాడు. అయినా స్వతంత్రించి, వ్యాఘ్రాజినంపై కూర్చుని ఘోర తపస్సు చేశాడు. 'సిద్ధబ్రహ్మయోగి'గా ప్రసిద్ధిపొందాడు. భద్రకాళి, ఆంజనేయ, కుట్టిశాతాన్, మధురై వీరన్‌లను ఉపాసన చేసి, వారి శక్తుల్ని కైవసం చేసుకున్నాడు. ఎప్పుడూ కళ్లు ఎర్రగా, జ్యోతుల్లా వుండేవి. గుబురుమీసాలతో భయం గొలిపేవాడు. తన మంత్ర శక్తితో అనేకమంది కన్యలను వశపరచుకున్నాడు. తాంత్రికవిద్యలలో దిట్ట. ఇతనిని చూచి జనం పారిపోయేవారు. సంకల్పసిద్ధుడు. సంకల్పమాత్రంచేత ఎక్కడికైనా వెళ్లగలిగేవాడు. 500 సంవత్సరాలకు పూర్వంచేసిన గురుద్రోహం వల్ల, అయిదుజన్మలు ఎత్తవలసి వచ్చింది. ఆ యా జన్మలలో అనేక సత్కార్యాలు చేశాడు. దేవాలయాలు, సత్రాలు నిర్మించాడు. క్రితం జన్మలో ఒక శివాలయంలో ఘోరతపస్సు చేసి, ఈ జన్మకు వచ్చాడు. ఇతనిది తపోశరీరం. ఆ జన్మలో 40 సంవత్సరాల వయస్సు వరకు అకృత్యాలు చేసి, తర్వాత సామాన్య జీవనం సాగించాడు. ఈ జన్మలో 40 సంవత్సరాల వరకు సామాన్యజీవనం సాగిస్తాడు. తన పూర్వజన్మల తపస్సు తెలియదు. 40 వ ఏట యోగం లభిస్తుంది. పూర్వజన్మల కర్మఫలాన్ని 40 సంవత్సరాలు అనుభవించాడు. గత అయిదుజన్మల దోషం పూర్తిగా నశింపు అయింది. ఇప్పుడు ఇతనిది పూర్ణసత్యయోగం. సాధనారంభం నుండి యోగఫలాలు అందుకోగలడు. పరమగురువు దర్శనం సాధన సమయంలో కలుగుతుంది. సమస్త దేవగణం సంకల్పమాత్రంచేత ఈతనికి ప్రత్యక్షమై సంభాషిస్తారు. ఇతని యోగఫలం మూడువంతులు ప్రజాసంక్షేమానికి, ఒక్కవంతు మాత్రం తన సొంతానికి ఉపయోగిస్తుంది. పరోపకారం, ప్రజాసేవ, జనహితం ఎక్కువ. స్వార్థచింతన, స్వప్రయోజనం తక్కువ. సంసార బాధ్యతలు తీరిన తర్వాత ఒక్క ఏడాది కాలంలో మహాసిద్ధిని పొందగలడు. మహాయోగిగా కీర్తించబడతాడు.

ఈతనికి 36 వ ఏటనే వైరాగ్యం ఏర్పడ్డది. సంసార త్యాగం చేసి బుద్ధుని వలె అరణ్యాలకు వెళ్లి సత్యాన్వేషణ చేయాలని ఆలోచించాడు. అది పూర్వ జన్మ వాసనాఫలం. పూర్వజన్మలలో సంవత్సరాల తరబడి సమాధిలోనే వుండేవాడు. వేలమంది భక్తులు వచ్చి, దర్శనం చేసుకుని వెడుతుండేవారు. ఆ యోగఫలమే, ఒక యోగబాలగా ఈ జన్మలో కూతురుగా జన్మించింది. ఆమె 'భాను' తేజస్విని. సూర్యకాంతి వంటి దేహం ఆమెది. ఆమె తపస్సంపన్నురాలైన బాలిక, కన్యక. ఆ పాప జన్మించేవరకు ఈ జాతకునికి యోగార్హత కలగలేదు.

ఒక్కొక్క జాతకునికి కర్మచేస్తే తప్ప యోగం అబ్బదు. అదృష్టం వరించదు. ఇతనికి పుత్రకారకుడైన గురువు కర్మస్థానంలో వున్నాడు. ఒకరికి కర్మచేయాలి. అది ఈ రూపేణ జరిగింది. పూర్వజన్మలో ఈతని గురువే తన కర్తవ్యం నిర్వహించడం కోసం, తన శిష్యుని సంపూర్ణయోగిగా చేయడంకోసం, ఉద్ధరించడం కోసం ఇప్పుడు బిడ్డగా జన్మించి, తన పనిపూర్తిచేసుకుని వెళ్లిపోయాడు. తానే యోగకారకుడైనాడు. ఆ జన్మలో మంత్ర, తంత్ర విద్యలన్నీ నేర్చాడు. ఒక్క 'తారకం' నేర్పలేదు. ఇప్పుడు 'తారకరాజయోగం'లో ప్రవేశింపచేశాడు. ఈ గురువు పూర్వజన్మలో పెద్ద మలయాళమాంత్రికుడు.

ఈ జాతకుని గురుద్రోహచర్యవల్ల, గురువు దిగులుపడి మరణించాడు. ఇప్పుడు అలాంటి దిగులు శిష్యునికి కలిగించి, ఉద్ధరించాడు. ఆ పాప జీవించి వుంటే ఇతని యోగశక్తి పరమాద్భుతంగా ఉండేది. కాని పాప తాను మోక్షం సిద్ధింపచేసుకుని, కన్న తల్లిదండ్రులకు గురువై... 'గురుదేవత' అయింది. జాతకుడు కరస్పర్శతో ఎలాంటి రోగాలనైనా నయం చేయగలడు. మృత్యుముఖంలో వున్నవారిని సైతం జీవింప చేయగలడు. సూక్ష్మ శరీరంతో వెళ్లి శిష్యులకు దర్శనం యివ్వగలడు. పరామర్శించగలడు. వారి వారి అవసరాలు తీర్చి, ఉద్ధరించగలడు. సూక్ష్మశరీరిగా అన్ని లోకాలు సంచరించి వస్తుంటాడు. లోకకల్యాణం కోసం వర్షాలు కురిపిస్తాడు. అగ్నుల్ని శమింపచేస్తాడు. తుపానుల్ని, ప్రళయాల్ని సైతం నిరోధించగలడు. జాతకుని కుటుంబంలోని వారంతా యోగం చేస్తారు. ఇతని ఇల్లే ఒకయోగాలయం అవుతుంది. ఇతనికి ఉపదేశం చేసిన గురువు మాస్టరులో లీనమైనాడు. ఈతని యోగశక్తివల్ల ఇతని గురువుకు జన్మ రాహిత్యం కలిగింది. ఈ జాతకుడు అమృతుడు, మృత్యుంజయుడు, శాశ్వతుడు.

ఈ నాడీజ్యోతిషాలు ఎంత తీయగా వుంటాయో, అంత చేదుగానూ వుంటాయి. జరిగినవన్నీ నిజాలనిపిస్తాయి. భవిష్యత్తు రంగుల్లో కనిపిస్తుంది. కాని వారు చెప్పినట్లు జరగడం లేదు ... ముఖ్యంగా ఉద్యోగం, ధనం విషయాల్లో. ధన, రాజ్య భావాలు

బెడిసికొడతాయి. ధర్మకాండ బావుంటుంది. యోగం, పుణ్యపాపాలు చెప్పే ద్వాదశభావం బాగున్నట్లు అనిపిస్తుంది. అయితే పూర్వజన్మల గురించి ఎంత చెప్పినా సంతోషిస్తాం తప్ప దాఖలాలు ఉండవు. నిదర్శనాలు కన్పించవు. అలాగే వచ్చే జన్మల గురించి చెప్పింది వినడానికి, బంగారు కలల్లో తేలిపోవడానికి పనికివస్తుంది. పై జన్మల గురించి, ఈ జన్మలో తెలుసుకుని ప్రయోజనం లేదు. నాడీజ్యోతిష్కుని వద్దకు వెళ్లేవరకు మనకు గతంలో జరిగినవి చూచినట్లే చెబుతారు. భవిష్యత్తు గురించి చెప్పేవి చాలావరకు నిజం కావడం లేదు. చాలామందికి 'నాడీ' - అగస్త్య, గణేశ, కుమార, వశిష్ఠ, భృగు నాడీలు - నేను చదివించి, పొందిన అనుభవం ఇది. కనుక పై ఫలితాలు ఎంతవరకు నిజాలు కాగలవో నాకు తెలియదు. నేను యోగంలోకి రావడం మాత్రం జరిగింది. పూర్వజన్మలలో యోగం చేశానో, తపస్సు చేశానో, లేక గురుద్రోహం చేశానో నాకేం ఎరుక లేదు.. ఇది 1969, 70 ప్రాంతాలలో చదివించాను. 28 సంవత్సరాలలో చెప్పినవి కొన్ని జరిగాయి, కొన్ని జరుగుతున్నాయి. అన్నీ కావని కొట్టివేయడానికి లేదు. పూర్తిగా నమ్మి అలాగే జరుగుతుంది అనడానికి లేదు. మన కృషి ప్రధానం.

మొత్తంమీద డాక్టరుగారు నాకు గురువైనారు. నా కన్న నా శ్రీమతిపై ఆయనకు అభిమానం ఎక్కువైంది. ఆ నాడీ చదివించిన తర్వాత ఆయన మా ఇంటికి వచ్చి, ఆమెను పరామర్శించి, నమస్కరించి మరీ వెళ్లారు. ఆ క్షణంలో ఆయన కళ్లు చెమ్మగిల్లడం నేను మరచిపోలేను. "అమ్మా" అని ఆప్యాయంగా, తన కన్నతల్లిని పిలిచినట్లు పిలిచారామెను. ఆ పిలుపే ఆమె పట్ల తర్వాతికాలంలో సార్థకమైంది. యోగసాధకులు ఎవరు వచ్చినా ఆమెను 'అమ్మా' అనే సంబోధించడం జరిగింది. ఆమెకు మాస్టరుగారి అనుగ్రహం వుంది. ఆమెకు పరంజ్యోతి దర్శనం అవుతుందని, సహస్రారమధ్యంలో పరమాత్మదర్శనం అవుతుందని నాడీవాక్యం. ఆమె జన్మతః యోగిని. నేను కొంత పాపిని. ఏదైనా గురువుగారి అభిమానం పొందగలిగాం. మాస్టర్‌గారి యోగ సాధనకు గురువే మార్గం.

యోగంలో నమ్మకం కుదిరి, చాలామంది దాని దాపులకు రారుకానీ, వచ్చి, సాధనచేసిన వారందరికీ మంచి ఫలితాలు, మంచి మంచి అనుభవాలు కలుగుతాయి. ఫలితం ఇంతో అంతో పొందని వారంటూ లేరు. కొందరు తాత్కాలిక ప్రయోజనాలు ఆశించి, యోగసాధన ప్రారంభించి, లాభం పొందగానే మానివేస్తుంటారు. అలాంటివారిని మార్చలేం. కానీ యోగాన్ని అంటిపెట్టుకుని, నిత్యం సాధన చేస్తున్నవారు, ఏ ఫలితాలు ఆశించకుండా చేసేవారు మాత్రం, యోగాన్ని వదలలేరు. వారు పొందే ఆత్మానందం

ఇతరత్రా లభించదని తెలుసు. బాధల్లో వున్నవారికి, కష్టాలలో చిక్కుకున్నవారికి, సమస్యలతో సతమతమయ్యేవారికి సాయపడాలన్న స్పందన సాధకునికి కలుగుతుంది. వీలైనంతమందికి తమ యోగశక్తితో సాయం చేయాలనిపిస్తుంది. అది సహజం. అవి కోరికలు కావు. కోరికలు ఉండకూడదని లేదు. కోరికలకు పరిమితి ఉండాలి. తనకోసం, స్వార్థంతో చేస్తే కోరికలవుతాయి. అవే ఇతరుల శ్రేయస్సుకోసం చేస్తే ఆదర్శాలవుతుంటాయి. ప్రతి కోరికకు బొమ్మ, బొరుసు వుంటాయి. ఒకటి మంచి అయి రెండవది చెడు కాదు. దేనికైనా పరిమితి అవసరం. సంయమనం అవసరం. కోరినా యోగం అబ్బదు. పూర్వజన్మ సుకృతం వుండాలి. ప్రాప్తం వుండాలి. ఈ యోగంలో సంప్రదాయ పద్ధతులు, కఠిన నియమాలు, ఆచారాలు లేవు కనుక జనాకర్షణ లేదు. పూజలు, ఉపవాసాలు, నైవేద్యాలు, పిచ్చినమ్మకాలు ఉండవు కనుక సామాన్యజనం పట్టించుకోరు. అయినవారు, బంధువులు, మిత్రులు సైతం దూరంగా తప్పుకుంటారు అర్థంగాక.

నేను యోగంలో చేరేనాటికి యోగం గురించి చదివి తెలుసుకున్నది చాలా వున్నది కానీ, అది ప్రాక్టికల్‌గా పనికిరాలేదు. చాలామంది పుస్తకాలు చదివి, పెద్దల ఉపన్యాసాలు విని తమకు అంతా తెలుసుననుకుంటారు. కానీ, వారికి తెలిసింది వారు తెలుసుకున్నది, ప్రాక్టికల్‌గా సాధనకు ఏమీ పనికిరాదు. ఆ విషయం యోగంలో చేరిన మొదటిరోజునే గ్రహించాను. ఆ చదివి తెలుసుకున్నది పూర్తిగా మరచిపోతే తప్ప యోగంలో ఒక్క అడుగైనా ముందుకు వేయలేమని రెండవరోజునే ఆకళింపుకు వచ్చింది. యోగం అంటే ఏమిటి? ఎలా చేయాలి? ఎవరూ చెప్పరు, చెప్పలేరు. డాక్టరుగారూ నాకు చెప్పలేదు. ఆయన ప్రేరణ కలిగించారు. కళ్లు మూసుకోవడం నేర్పారు. అదే నా యోగం. అంతే... అలా రెండునెలలు కళ్లు మూసుకునే వున్నాను. అడిగే ధైర్యం లేదు. అడిగితే 'నోరుమూసుకో' అనేవారు. అసలు మాస్టరుగారికి నమస్కారం చేసి కళ్లు మూసుకోవాలా? కళ్లు మూసుకున్న తర్వాత చేతులు కలిపి నమస్కరించాలా? కళ్లు మూసుకుని ఏం చేయాలి? కనీసం ఒక మంత్రం లేదు, జపం లేదు. రుద్రాక్షమాల లేదు! మాస్టరుగారి ఫోటో సైతం యివ్వలేదు. 'కేవలం మాస్టరుగారి రూపాన్ని మనసులోకి తెచ్చుకుని కూర్చో' అన్నారు. ఏమిటో అంతా పజిల్, అదొక అగ్నిపరీక్ష.

నాతోపాటు నా శ్రీమతి యామినీదేవి యోగానికి సిద్ధమైంది. ఆమెకు నేనే ప్రార్థన చెప్పాను. ఇద్దరం జనవరి 1, 1970న తీవ్రసాధన ప్రారంభించాం. భార్యాభర్తలు కలిసి చేస్తే యోగం మంచి ఫలితాలనిస్తుందని డాక్టరుగారు చెప్పారు. ఈలోగా పొట్టిప్రసాద్ అనే సినిమా హాస్యనటుడు, నాటకాల రిహార్సల్స్‌కు డాక్టరుగారింటికి వస్తుండేవారు.

అతను శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి 'ప్రజ్ఞాప్రభాకరం' అనే పుస్తకం తెచ్చిపెట్టాడు. పొట్టిప్రసాద్ అక్కగారినే మాస్టర్ ఎం.ఎన్.గారి అబ్బాయి దానుగారు చేసుకున్నది. అది యోగ బాంధవ్యం. ఆ పుస్తకం కొంతభాగం ఎలుకలు తిన్నది. సాక్షి రంగారావు కూడా రోజూ మాతోపాటు యోగం చేస్తుండేవాడు. నేను మాస్టరుగారి గురించి చదివిన మొదటిపుస్తకం ప్రజ్ఞాప్రభాకరం. మనిషి కష్టాలు తట్టుకోలేనపుడే భగవంతుని జ్ఞాపకం చేసుకుంటాడు. ఆత్మశాంతి ఏదో కావాలన్న తపన కలిగినప్పుడు యోగంలాంటివి సాధన చేస్తుంటాడు.

నా యోగారంభం

నేను అనేదాన్ని అన్వేషిస్తూపోతే 'అహం' నశిస్తుంది అంటారు భగవాన్ రమణమహర్షి. సృష్టికే మూలమైనదాన్ని 'ఆరిజిన్' తెలుసుకుంటే అన్నీ తెలిసినట్లే నంటారు మాస్టరుగారు. 'ఆరిజిన్ నంబరు ఒకటి' పరమాత్మ అనుకుందాం. సృష్టిని నడిపించే దేవుళ్లు గ్రహాలు వగైరా వగైరా 'ఆరిజిన్ నంబరు 1' అనవచ్చు. వీటి శక్తులన్నీ తనలో దాచుకున్న మాస్టరు 'ఆరిజిన్ నంబరు 2.' 'నేను' నశించి 'ఆత్మ' మాత్రమే మిగలాలి. అంటే శరరస్పృహ నశించి ఆత్మస్పృహ మాత్రమే మిగలాలి. ఆత్మ శాశ్వతం, శరీరం అశాశ్వతం అంటారు. క్షణంలో శరీరస్పృహ పోతుంది. ఆత్మస్పృహ శాశ్వతంగా వుంటుంది కనుక, ఇది అశాశ్వతం, అది శాశ్వతం అన్నారు. 'నాది', నేను' అనేవి భౌతికపరిధిలోనివి మాత్రమే. మనం నా 'ఆత్మ' అనడం తప్పు. ఆత్మ మనల్ని 'తన శరీరం' అనుకోవాలి. అహాన్ని తొలగిస్తే 'ఆత్మ' దర్శనమవుతుంది. అతీంద్రియ ప్రజ్ఞతో, తురీయస్థితిలో పొందగలవి ఆధ్యాత్మిక అనుభవాలు... ప్రజ్ఞ, జ్ఞానం, సత్యం వాటికి చెందినవే.

ఎవరికైనా యోగప్రాప్తికి సుకృతం వుండాలి. ముందరి జీవితం ప్రాతిపదిక అవుతుంది, భూమిక అవుతుంది. ఎవరు ఒక్కరోజులో వైరాగ్యం పొంది సర్వసంగ పరిత్యాగులుకారు. అలా కావడానికి ఏదో బలమైన సంఘటన కారణం అవుతుంది. కారణంగా కనిపిస్తుంది. కాని దానికి పూర్వభూమిక వుంటుంది. పూర్వసంస్కారం, పుణ్యం, తపస్సు తోడవుతాయి. బుద్ధుడైన గౌతముడు అనేక శాస్త్రాలు చదివినవాడే. సకలకళాప్రపూర్ణుడే. ప్రాచీన గ్రంథాలు చదివినవాడు, సుఖభోగాలు పుష్కలంగా అనుభవించాడు. రాజభోగాలకు మించిన భోగాలు లోకంలో ఏముంటాయి? అలాంటి సుఖభోగికి వైరాగ్యం కలిగింది. విరక్తితోకాక, నూతనమార్గం అన్వేషించి, కొత్తబాటన పయనించి సత్యాన్ని తానుగా తెలుసుకోవాలన్న తపన కలిగింది. స్వతంత్రంగా సాధన

చేశాడు. మంత్ర తంత్రాలతో సాధన చేసినా, తపస్సు చేసినా ఆయనకు సత్యదర్శనం కలగలేదు. చివరకు శరీరంపైన మమకారం వదలి, ఆత్మను వదలి, 'మోక్షం, సత్యం' అనే కోరికల్ని సైతం విస్మరించి, నిర్లిప్తంగా శూన్యంలోకి పయనించాడు. అప్పుడు సత్యం అవగతమైంది. అందుకే బుద్ధునిది శూన్యవాదం అన్నారు. ఆ శూన్యస్థితికి చేరుకోలేని ఆస్తికులకు, విగ్రహారాధకులకు, మడులు ఆచారాలు పట్టుకు కూర్చున్నవారికి ఆ పద్ధతి నచ్చలేదు. బుద్ధునికి కలిగిన ప్రేరణ వంటిది ప్రతిసాధకునకు కలగాలి. అది ఒకరిని అనుకరిస్తే రాదు. ఎవరిదైనా స్వతంత్ర మార్గం కావాలి. ఎవరి సాధన, అన్వేషణ వారిది కావాలి. మాస్టరుగారు ఈ మార్గంలో ఎవరికి వారు స్వతంత్రంగా ఎదగడానికి అవకాశం కల్పించారు. అదే నాకు నచ్చిన అంశం.

గత శతాబ్దంలో జన్మించిన మహాత్ములు రామకృష్ణ పరమహంస, అరవింద యోగి, షిరిడీసాయి లాంటి వారిని మరచిపోలేం. వారు ఆధ్యాత్మిక వికాసానికి ఎంతగానో కృషి చేశారు. తద్వారా సామాజిక పరిణామం వేగవంతమైంది. దివ్యజ్ఞాన సమాజం స్థాపించినవారంతా పాశ్చాత్యులే అయినా, కుల మతాలకు అతీతమైన దివ్యసమాజ వికాసానికి కృషి చేశారు. ఈ శతాబ్దంలోని మానసిక వికాసానికి, ఆధ్యాత్మిక దృష్టికి వారి తపస్సు ప్రేరణ కలిగించింది. స్పందన కలిగించింది. మాస్టరుగారు దివ్యజ్ఞాన సమాజం నీడన పెరిగి, స్వతంత్ర యోగావిష్కరణ చేసి, మహాయోగి అయినారు. ఎవరెప్పుడు ఏ కొత్తసిద్ధాంతాన్ని ప్రతిపాదించినా పాతపద్ధతుల్ని కాదనడమే జరుగుతుంది. సంప్రదాయాన్ని ధిక్కరించి నిలవకపోతే కొత్తది రాదు. మహాత్ములందరూ ఆత్మద్వారా సత్యాన్ని అన్వేషించిన వారే. కొత్త సత్యాన్ని దర్శించి వాటిని ప్రజోపయోగంగా మలచినవారే. ప్రవక్తలు, మహా గురువులు అవుతారు. పాతపద్ధతుల్ని అనుసరించేవారు ఋషులు, గురువులుగా మిగిలిపోతారు.

మహాత్ముల జీవితాలు ఎప్పుడూ మార్గదర్శకాలే. ఒక మహాత్ముని బాటలో మరొకరు నడవరు. ఎవరికి వారు స్వతంత్రులే. ఎవరి అన్వేషణ, సాధన వారిది. గురువు నామమాత్రంగా వుంటాడు. మార్గం చూపిస్తాడు. నడవ వలసింది సాధకుడు. నడిచేది తన కాళ్లతోనే. మరొకరి కాళ్లతో నడవాలని ప్రయత్నించే వారంతా గమ్యం చేరరు. స్వతంత్రంగా సాధనచేస్తూ, సత్యాన్ని దర్శించాలనే తపనగల వారందరికి, ఎందరో మహాత్ములు పరమగురువులు ఆత్మ భూమిక నుండి సహాయపడుతుంటారు. మనం నమ్మినివారిని మనకు తెలిసినవారిని మనం గుర్తిస్తుంటాం. కానీ మనల్ని, మన అభివృద్ధిని గుర్తించి, పరోక్షంగా సాయపడే మహాత్ములు ఎందరో వున్నారు. వారంతా మాస్టర్లు. పరమ గురువులు, ఆత్మస్వరూపులు.

ఎందరో మహాత్ముల ప్రభావం మనపైన వుంటుంది. ఎన్నో జన్మల సంస్కారం మనల్ని మంచి మార్గాన నడిపిస్తుంది. ఏడు ఆవరణలు దాటిన తర్వాతనే అసలు దేవాలయం. ఏడు ప్రాకారాలూ దాటవలసిందే. గర్భగుడిలోకి వెళ్లితేనే మూలవిరాట్ దర్శనం. అదీ... కటికచీకటిలో, అక్కడ మూలవిరాట్‌ని దర్శించాలంటే ఒక దీపాన్ని వెలిగించుకోవాలి. జ్యోతి ప్రజ్వలించనిదే మూలవిరాట్ దర్శనం కాదు. ఏడుప్రాకారాలు దాటడం, గర్భాలయంలో ప్రవేశించడం, జ్యోతిని వెలిగించడం క్రమంగా జరిగే పనులు, జరగవలసిన పనులు. ఈ ఏడు ప్రాకారాలు దాటడం వంటిదే మనం అనేకమంది మహాత్ముల ప్రభావాలకు లోనుకావడం, అనేక మంది గురువులసేవ చేయడం. చివరకు మూలవిరాట్ వంటి పరమాత్మప్రతినిధి అయిన ఒక మాస్టరు లేదా ఒక పరమగురువు అనుగ్రహం పొందగలం. ఎన్నో జన్మలుగా ఎంతో సాధన చేస్తే తప్ప మహాత్ముల సంపర్కం లభించదు. నాకు అలాంటి అవకాశం ఈ జన్మలోనే లభించింది.

నలభైయవ ఏట జీవితం మలుపు తిరుగుతుంది. మాస్టరుగారు 40 వ ఏట యోగావిష్కరణ చేశారు. అరవిందులు 40వ ఏటనే పాండిచేరి వెళ్లి యోగి అయినారు. నేను 40 వ ఏట ఈ యోగంలోకి వచ్చాను. ఆధ్యాత్మిక రంగంవేపు అడుగువేయడానికి అది సరైన వయసు. జీవితాన్ని కొంతమేరకు అనుభవించి వుంటాం. ఉడుకురక్తంలోని వేడి తగ్గుతుంది. ఆలోచనల తీవ్రత తగ్గుతుంది. భగవంతుని ఉనికి మనకు బొసట అవుతుంది. ప్రతి మనిషి ఎదలో ఎప్పుడో ఒక ఆధ్యాత్మిక బీజం పడి నాటుకుంటుంది. అది మొలకెత్తడానికి టైం పడుతుంది. మనం గమనించం ఆ బీజం ఎప్పుడు పడ్డదో. అది మొలకెత్తి మొక్క అయినప్పుడు గుర్తిస్తాం. రమణ భగవాన్ అంటారు 'అజ్ఞానం తొలగిపోతే ఆత్మదర్శనం' అవుతుందని. నేను అనుకుంటాను యోగసాధన చేస్తే అజ్ఞానం తొలగిపోతుందని.

ఆధ్యాత్మిక రంగంలో అవరోధాలు చాలా ఎక్కువ. అనుమానాలూ చాలా ఎక్కువగానే వుంటాయి. చీకటి తెరలూ ఎక్కువే. మనం ఎటు పయనించినా వెలుగు కనిపిస్తుంది. అయితే చీకటి తెరల్ని తొలగించుకోవలసింది మనమే. అవే మాయతెరలు. మనస్సుకు కమ్మిన పొరలు. మన చుట్టు వెలుగు ఉన్నట్లే అనిపిస్తుంది. కాని మనస్సు చీకటిలోనే వుంటుంది. మార్గం వుంటుంది. కనిపించదు. వెలుగులేనిది మార్గం ఎలా తెలుస్తుంది. రవంత వెలుగైనా కావాలి. ఒంటరితనం, అజ్ఞానం, పిరికితనం వల్ల కనపిస్తున్న మార్గాన్ని గుర్తించం. దానికి అభిముఖంగా పయనిస్తుంటాం. కాస్త ధైర్యంగా ఒక్క అడుగు ముందుకువేస్తే చీకటి తొలగిపోతుంది. ఎక్కవలసిన మెట్టు కాలికి

తగులుతుంది. ఆ పని చేయం. నిరాశానిస్పృహలు అడుగు ముందుకు వేయనీయవు. ఊపిరాడదు. ఉత్సాహం ఉండదు. ప్రోత్సాహం లభించదు. పైగా, అడుగడుగున అనుమానాలు, అవరోధాలు. వాటిని ఎదిరించే శక్తి వుండదు. పరిస్థితులను ఎదిరించే ధైర్యం, శక్తి బహుకొద్దిమందికే ఉంటుంది. నిరుత్సాహంతో నిలిచిపోయేవారు, వెనుతిరిగి పలాయనం చేసేవారే ఎక్కువమంది. ఈ అనంతపథంలో పయనించే వేయిమందిలో ఒక్కరు మాత్రమే కడవరకు పోగలుగుతారు. ఎవరైనా స్వతంత్రంగా సాధించాలి. అదే ప్రగతి. ఇతరులపై ఆధారపడకూడదు. వెనుతిరిగి చూడకూడదు. ప్రక్కవారిని పట్టించుకోకూడదు. ఇది పోటీ కాదు. గెలుపు ఓటములు లేవు. గమ్యం చేరిన ప్రతివ్యక్తి గెలిచినట్లే, విజయం సాధించినట్లే. ఇతరుల అనుభవాలను ఆధారం చేసుకునేవారు, వారి జ్ఞానం తమదని భ్రమపడేవారు గమ్యం చేరలేరు. అలాంటివారికి ఎదుగుదల కనిపించదు.

జ్ఞానం అలవడినా లేకపోయినా మనిషి బుద్ధిజీవి. మనిషికి మాత్రమే బుద్ధివుంది. జ్ఞానం పొందే అర్హత వుంది. బుద్ధివికాసం కలిగినప్పుడు జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం అవతలి అంచుకు చూడగలిగితే ప్రజ్ఞానం. అదే ఆత్మజ్ఞానం.

నేను యోగంలో ఎందుకు చేరానని గానీ, చేరి ఏమి సాధించానని గానీ ఆలోచించలేదు. 'ఎప్పుడు చేరావు' అని ఎవరైనా అడిగితే ఎన్నో జన్మలక్రితమే చేరానని చెప్పాలనిపిస్తుంది. మనం సాధించింది ఎంత అని చూడకూడదు. అభివృద్ధి వుందా లేదా అన్నదే ప్రశ్న! యోగం, తపస్సు అనేవి సాధనఫలాలు. అవి ఒక్కజన్మలో రావు. ఒక్కజన్మలో పూర్తికావు. కనీసం ఏడుజన్మలు పూర్ణసాధన చేస్తే తప్ప ఎవరికీ యోగం పూర్ణం కాదు. సిద్ధి కాదు. ఈ జన్మలో మన ప్రక్కవారి కన్న కాస్త ముందుగా నడుస్తున్నామంటే పూర్వజన్మలో కొంత యోగం చేసివుంటాం. ఏడు జన్మల అనుబంధం అది. ఇది ఆత్మసంబంధం. ఈ జన్మలోనే యోగం ప్రారంభించిన వారికి అనుభవాలు చప్పున కలగకపోవచ్చు. అంతమాత్రాన వారు యోగానికి పనికిరారని, యోగంలో అభివృద్ధి సాధించడం లేదని అనుమానించ రాదు. అలాంటివారికి సిద్ధులు, మహత్తులు లభించవు. అయినా నష్టం లేదు. దిగులుపడ నవసరం లేదు. ఎవరైనా ఒక్కొక్క మెట్టు ఎక్కి పైకి పోవడం మంచిది. హైజంప్, లాంగ్‌జంప్‌ల వల్ల ప్రమాదం. యోగాభివృద్ధి నెమ్మదిగా జరగడం మంచిది. యాభై సంవత్సరాలుగా యోగసాధన చేస్తున్నవారికి కలగని అనుభవాలు అయిదునెలల సాధనలో కొందరికి కలగవచ్చు. అది వారి అదృష్టమని, అసూయపడరాదు. పూర్వజన్మలలో చేసిన సాధన ఈ జన్మలకు బదిలీఅవుతుంది. ఒకరు అసూయపడి ఏం

లాభం? అసూయ చెందితే తనకున్నది తరిగిపోతుంది. యోగసాధనలో అభివృద్ధికి అసలైన ఆటంకాలు. అసూయ, అహంకారం స్వార్థం.

మా గురువుగారిని నేను ఎన్నడూ ఏదీ కోరలేదు. కారణం ఆయన 'తన'ని గురువు అంటే తిట్టేవాడు. నేను'శిష్యుడిని' అనుకోవడం యిష్టం వుండేది కాదు. యోగంలో సాధకులంతా మిత్రులేనన్న సిద్ధాంతం ఆయనది. ఆయన 'యోగమిత్రులు' అనే నాటకం రాసి ప్రదర్శింపచేశారు. ప్రభవీక్లీలోనూ సీరియల్‌గా వేసిన జ్ఞాపకం. యోగంలో నేను చేరింది కోరికలు తీరడానికి కాదు. వరాలు అడగడానికి కాదు. మనశ్శాంతి కోసం. ఆరోగ్యం కోసం. డబ్బుపైన, పదవులపైన నాకు మోజులేదు, కాంక్ష లేదు. ఏదో జీవితం గడిస్తే చాలు. డబ్బు విషయంలో జి.బి.ఎస్. నాకు ఆదర్శం. ఆయన డాక్టరు అయివుండి ఏ పెషెంట్‌ను డబ్బు అడిగేవాడు కాదు. ఎవరైనా ఇవ్వదలచుకుంటే అక్కడొక హుండీలాంటిది వుండేది - దాంట్లో వేసి పోయేవారు. ఆయన నర్సు నెలకొక సారి దాన్ని తీసి జీతంకింద తీసుకునేది.

డబ్బు డిమాండ్ చేయకపోయినా ఆయనకు బాగానే గడిచేది. డబ్బుకు ఇబ్బందిపడినా బయటకు చెప్పేవారు కాదు. మహా నిరాడంబరంగా జీవించేవారు. నిగర్వి. తాను యోగం చేస్తున్న విషయం సన్నిహితులకు, మిత్రులకు సైతం చెప్పేవారు కాదు. బంధువులకు అసలు తెలియనిచ్చే పని లేదు. ఎవరి దగ్గర యోగం గురించి మాట్లాడే వారు కాదు. యోగం చేస్తున్నాం కనుక మన కోరికలన్నీ తీరాలని మాస్టరుగారు మన సాధన మెచ్చి, వరాలు యివ్వాలని ఎవరైనా భావిస్తే తప్పు. యోగం చేయడం వరాలకోసం, కోరికలు తీరడం కోసం కాదు. అసలు లాభనష్టాల ఆలోచనే పనికిరాదు. ప్రయోజనం ఆశించకూడదు. భౌతిక ప్రపంచానికి సంబంధించినవి ఏవీ కోరకూడదు.

ప్రపంచానికి డబ్బుతో లింక్ వుంది. డబ్బు లేనిది దినం గడవదు. కోరకపోయినా డబ్బు అవసరమైన మేరకు సమకూరుతుంది. ఇది సత్యం. జి.బి.ఎస్. గారికి నాటకాల పిచ్చి. ఒకప్పుడు ఆయన సినిమా రచయిత. అందుకే సినిమావారికి ఆయన నేస్తం. నేను యోగంలో చేరడం ఆయన యోగమిత్రులు నాటకం రాయడం ఒకేసారి జరిగింది. ఆ నాటకంలో భారీ డైలాగులుండేవి. దానిని ప్రదర్శించాలని ఆయన కోరిక. పాండీ బజారులో ఆయన ఇంటిపక్క ఖాళీజాగాలో ఒక ఓపెన్ థియేటర్ కట్టించాడు. రిహార్సల్స్ మొదలుపెట్టారు. ఆయనగారి అల్లుడు హీరో చంద్రమోహన్. ఆయనా, సాక్షిరంగారావు ఆ నాటకం బాధ్యత తీసుకున్నారు. కాకరాల, పొట్టిప్రసాద్, మమత, ఎవరెవరో నటించారు. ఆ స్టేజీమీదనే ఆయన కళాపోషణ. నెలకో కార్యక్రమం. బాలమురళీ,

చిట్టిబాబుల సంగీతకచేరీలు జరిపించారు. నాకు ఆ నాటకం వల్ల నటీనటులతో పరిచయాలు ఏర్పడ్డాయి. బి.ఎన్.రెడ్డి, కమలాకర కామేశ్వరరావు, పాలగుమ్మి పద్మరాజు, దాసరి నారాయణరావు, గుమ్మడి, జమున, సూర్యకాంతం, సావిత్రి లాంటి వారందరితో పరిచయాలు ఏర్పడ్డాయి.

నాకూ నాటకాల పిచ్చి వుంది. తెనాలిలో వుండగా నాటకాలు డైరెక్టు చేయడం, నటించడం జరిగింది. అప్పుడే 'నిజానిజాలు'నాటకం రాశాను. ఇప్పుడు గురువుగారిచ్చిన స్ఫూర్తితో 'దైవనిర్ణయం' రాశాను. వి.ఆర్ జయంతి దానికి పెట్టుబడి. విజయచంద్, సాక్షిరంగారావు, కాకరాల, పొట్టప్రసాద్, వీరభద్రరావు, పొట్టిలక్ష్మి, మమత, విజయలక్ష్మి అందులో నటించారు. చంద్రమోహన్ డైరెక్టరు. అప్పుడప్పుడు దాసరి నారాయణరావు వచ్చి సలహా లిస్తుండేవారు. వాణీమహల్‌లో ప్రదర్శించాం. ఆ తర్వాత 'కలగానికల' అని మరోనాటకం రాశాను. అలాగా నెమ్మదిగా సినిమా రచయితను కావాలనీ నా ఆశ.

నాటకాలు కారణంగా డాక్టరుగారికి బాగా దగ్గరైనాను. ఆయన సొంత కొడుకులా చూచుకునేవారు. ఆయన కూతురు జలంధర కూడా 'అన్నయ్యగారూ' అనే పిలిచేది. అప్పటి వరకు సినిమాలకు కథలు, సంభాషణలు రాయాలని వుండేది... కానీ నేను పనికి రానని తేలింది. విజయనిర్మల, కాంచన, పి.పుల్లయ్యగార్లకు రాసినా పేరు బయటకు రాలేదు. 'ఘోస్ట్' రచయితగా వుండడం నాకిష్టంలేదు. సొంతంగా ఒక సినిమా తీయాలనే ఆలోచన వచ్చింది. పోతులూరి వీరబ్రహ్మంగారి కథ, స్క్రిప్టు రాసుకున్నాను. కమలాకర కామేశ్వరరావును డైరెక్టరుగా పెట్టుకున్నాం. కృష్ణంరాజు, శారద, చంద్రమోహన్ నటవర్గంలో వున్నారు. కానీ ఎన్.టి. రామారావు ఆ సబ్జక్టు తాను తీస్తున్నానని, నటీనటుల్ని కట్టడి చేశాడు. దాంతో నా సినిమా ప్రయత్నం ఆగిపోయింది.

యోగంలో తొలిపాఠం

యోగం గురించి మా గురువుగారు పెద్దగా చెప్పింది లేదు. 'చెప్పేందు కేముంది' అనేవారు. దేనికైనా ఒక పద్ధతి వుంటుంది. సిద్ధాంతం వుంటుంది టెక్నిక్ వుంటుంది. ఇందులో అవేమీ లేవు. ఉండే వుంటాయి. అవి మనకు ముందుగా తెలియవు. డాక్టరుగారు అనేవారు 'బి ప్రాక్టికల్'. అసలు మాస్టరుగారే తన యోగాల యాన్ని ఒక ప్రయోగశాలగా అభివర్ణించేవారు. అది ఒక లాబొరేటరీ. అక్కడ చేయవలసింది, చేస్తున్నదీ ప్రయోగాలు. ఫలితాలు ముందుగా చెప్పలేం. ఎవరికి వారుగా ప్రయోగం చేసి ఫలితం తెలుసుకోవలసి వుంటుంది. 'ప్రాక్టికల్' అనే మాటకు రెండు ముఖాలు, ఒకటి ఆచరణ, రెండు అనుభవం. ఆచరణ అంటే సాధన. స్వీయానుభవంతో తెలుసుకునేదే సత్యం. అది ఎవరిది వారికే. అది నేను నేర్చుకున్న మొదటి పాఠం. మిగిలిన యోగాలకు దీనికి తేడా టెక్నిక్‌లో. ఇక్కడ మాస్టరు నుండి ఒక శక్తి సాధకునిలో ప్రవేశిస్తుంది. అదే ఇనీసియేషన్. దానికి మంత్రాలతో పనిలేదు. మన కృషితో నిమిత్తం లేదు. మాస్టరుగారి అనుగ్రహం ఎవరిపైన ప్రసరిస్తే వారిలోకి మాస్టర్ యోగశక్తి అణుమాత్రంగా ప్రవేశిస్తుంది. ఆ శక్తిని దినదినాభివృద్ధి చేసుకోవడానికి నిత్యంసాధన చేస్తుండాలి. ఒక చిన్న మొక్కను నాటుకున్నాం. అది నిమిషాలలో మహావృక్షమై కాయలు కాయదు. ఆ మొక్కను బ్రతికించుకోవాలి. రోజూ నీళ్లుపోయాలి. బలమైన ఎరువులు వేయాలి. ప్రకృతి వైపరీత్యాల నుండి దానిని కాపాడుకోవాలి. అది పెరిగేవరకు వేచి వుండాలి. అప్పుడు ఫలాలనిస్తుంది. యోగమూ అంతే. సాధనలో లోపం వుంటే అభివృద్ధి వుండదు. రావలసిన ఫలితం రాదు. ఇది చిన్న మొక్క. మహావృక్షంగా పెంచుకోవలసింది మనం, మన సాధనతో.

యోగాన్ని గురించిన విషయాలు, విశేషాలు, అనుభవాలుసైతం ఎవరూ చెప్పేవారు కాదు. అసలు యోగం చేసేవారు కూడా దీనిని గురించి మాట్లాడకపోవడం

విచిత్రం. సాధారణంగా ఎవరైనా తను చేసే దాన్ని గురించి ఘనంగా చెబుతారు. పదిమందికి చెప్పాలని తహతహలాడతారు. ఈ యోగం చేసేవారు అందుకు భిన్నం. అడిగినా చెప్పరు. "అనుభవాల గురించి అడిగితే చెప్పకూడదు. అలా ఇతరులకు చెబితే అనుభవాలు రావు, ఆగిపోతాయి" అనేవారు. ఏమిటో అంతా విచిత్రం! విడ్డూరం అనిపిస్తుంది. పోనీ, సూఫీయోగుల్లాగా రహస్యప్రదేశాల్లో, రహస్యంగా చేస్తారా అంటే అది లేదు. ఎక్కడైనా కూర్చుని చేసుకోగలరు. కూర్చోవడం, కళ్లు మూసుకోవడం, ఓ గంట తర్వాత కళ్లు తెరవడం కనిపిస్తుంది. ఆ గంటకాలం ఏం చేస్తారు? చెప్పరు. గట్టిగా అడిగితే 'ఏమీ చేయం' అంటారు. ఏమీ చేయకపోవడమేనా యోగం అంటే. ఏమీ చేయకపోతే, లోపల ఏ ఆనందాన్ని అనుభవించకపోతే గంటసేపు ఎలా కూర్చోగలుగు తున్నారనిపిస్తుంది. అదే రహస్యం. దాని మర్మం తెలుసుకుంటే యోగం అర్థమైనట్లే.

చాలా సందర్భాలలో నన్ను గైడ్ చేస్తోంది ఎవరో తెలియదు. ఏదో ప్రేరణ కలుగుతుంది. ఏదో చేస్తాను . ఆ చేసింది తప్పని, ఒప్పని నాకు తెలుస్తుంది. అంతే. అంతఃప్రేరణ ఏదో వుంటుంది. లోపల ఎవరో పలుకుతున్నారు ... పలికిస్తున్నారు. నాచే ఏదో చేయిస్తున్నారు. ఎప్పుడైతే అలాంటి అంతరంగ తరంగాలు తట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తాయో, సత్యాసత్యాలను విశ్లేషించగలుగుతామో అప్పుడు బయట ప్రపంచంలో ఎవరి అవసరమూ కలగదు. మనల్ని మనమే గైడ్ చేసుకుంటాం. అంతరంగ ప్రేరణతో ముందుకు సాగుతాం. మాస్టర్ యోగంలో తొలినాళ్లలో నేను పొందిన అనుభూతులు అలాంటివే.

1970 ప్రారంభంలో తెనాలి నుండి అనసూయ అని ఒకామె వచ్చింది. ఆమె మునిసిపల్ కౌన్సిలర్. మా ఇంటి దగ్గర ఇల్లు. చిన్నతనం నుండి తెలుసు. అన్నయ్యగారూ అని పిలుస్తుంది. మేం యోగం చేస్తుండటం గమనించి తనూ చేస్తానన్నది. ఉపదేశం యిమ్మని అడిగింది. అదేమిటో నాకు తెలియదు. కావాలంటే ప్రేయర్‌లో కూర్చో అని చెప్పాను. మాతోపాటు కూర్చుంది. తల బరువెక్కి తట్టుకోలేకపోయింది. భయపడ్డది. అలా తలబరువైపోతుందని మాకు తెలియదు. భయం కలుగుతుందని తెలియదు. మాకు ఎప్పుడూ యోగంకానీ, యోగానుభవాలుగానీ భయం కలిగించలేదు. ఆ రోజు రాత్రి నాకు నిద్రపట్టలేదు. విపరీతంగా తలపోటు, కన్నుపోటు. చిత్రం ఏమంటే ఆమెకు సహజంగా తలపోటు వస్తుందిట. కళ్లుమంటలు. ఆమె బాధలు నాలోకి బదిలీ అయ్యాయి. ఆ తర్వాత ఆమెకు తలపోటు, కళ్లపోటు తగ్గిపోయాయిట. నేను రెండురోజులు బాధపడవలసి వచ్చింది. ప్రేయర్‌లో 'చికిత్స' జరిగిపోతుందని ఆనాడే గ్రహించాను. నేను

ట్రీట్‌మెంటు ఇవ్వలేదు. అయినా ఆమె జబ్బు తాలూకు బాధ నాలోకి ట్రాన్స్‌ఫర్ అయింది. ఆమెకు తగ్గిపోయింది. మర్నాడు ఉదయం ప్రేయరు రెండుగంటలుపైగా సాగింది. శరీరస్పృహ కోల్పోయాను. శరీరంలో ఏవేవో ప్రకంపనలు కలిగాయి. శరీరం చెమట్లుపట్టాయి. అప్పుడు అనిపించింది. కొత్తవారిని మాతో ప్రేయర్‌కు అనుమతించ రాదని. అనవసరంగా వారి రోగాల బాధ మనం అనుభవించవలసి వస్తుంది. డాక్టరుగారికి చెబితే అన్నారు "నీవు అలాంటి ప్రయోగాలు చేయకు, ప్రభాకరశాస్త్రిగారు అలాగే ఇతరుల జబ్బులు తనలోకి తీసుకుని, ట్రీట్‌మెంట్ యిచ్చేవారు. మనం అలాంటి ఘనకార్యాలు చేయకూడదు. సాధన చేసుకో చాలు. మాస్టరుగారు ట్రీట్‌మెంట్స్‌కు శక్తి అనుగ్రహించినప్పుడు చూద్దాం."

ఒకరోజు ప్రేయరులో మాస్టరుగారు కనిపించి ఒకపుస్తకం యిచ్చారు. అందులో ఏమీలేదు. పుస్తకం రాయమని మాస్టరువాణి వినిపించింది. మాస్టరుగారు కనిపించగానే నాకు స్పృహ పోయేది. కొన్నిగంటలు అచేతనంగా ఉండేవాడిని. తర్వాత తలపోటు, ఒళ్లునొప్పులు రెండుమూడురోజు లుండేవి. యాస్ట్రల్ శరీరాలతో సంబంధం ఏర్పడితే మన భౌతిక శరీరాలు తట్టుకోలేవు. యాస్ట్రల్ అంటే భూతమే కదా! దయ్యం పట్టినట్లు వుంటుంది. దయ్యాలు భూతశరీరులు, దేవతలు మానసశరీరులు, మహాత్ములు ఆత్మశరీరులు, మాస్టర్లుగారు కనిపించకముందు ఒకసారి నా శరీరం నుండి ఒక రూపం వేరై నా ఎదురుగా నిల్చుంది. అది నా రూపమే. నన్ను నేను వేరే వ్యక్తిగా చూడగలిగాను. ఆ తర్వాత దూరంగా మాస్టరుగారు కన్పించారు. నేను దగ్గరగా వెళ్లాను. వారికి ఎదురుగా నమస్కరిస్తూ కూర్చున్నాను. నా సూక్ష్మశరీరం పెరిగి పెరిగి, ఆకాశం వరకు వ్యాపించింది. నేను క్రమంగా మాస్టరుగారిలో లీనమైనాను. ఆ అనుభవం గొప్పది, అపూర్వమైంది. డాక్టర్‌గారికి చెప్పాను. ఆయనకు కళ్లు చెమ్మగిల్లాయి. ఆనందంతో నోటమాట రాలేదు. "అదృష్టవంతుడివి శార్వరీ" అని కౌగిలించుకున్నారు. ఆ రోజునే డిస్కవరి ఆఫ్ మాస్టర్ యోగ రాయడం ప్రారంభించాను. రాయమని ఆజ్ఞాపించింది మాస్టరుగారు, ఆయనే నాచేత రాయిస్తారన్న ధీమా!

ప్రజ్ఞాప్రభాకరం తర్వాత ఎస్. నారాయణయ్యర్ గారి 'న్యూయోగ' అనే చిన్నపుస్తకం లభించింది. ఆ రెండు పుస్తకాలే నాకు ఆలంబనలు. అప్పటికి ఎం.ఎన్.గారి గురించి వినలేదు.ఆంధ్రలో ఎవరు యోగం చేస్తారో నాకు తెలియదు. డాక్టర్‌గారింటికి పి.ఎస్.ఆర్.శర్మ, ఆర్.ఎం.ఎస్.ఉద్యోగి వస్తుండేవారు. ఆయన యోగంచేస్తారని డాక్టరుగారు చెప్పారు తప్ప ఆయన ఏనాడూ మాతో కూర్చుని ప్రేయర్ చేసింది లేదు.

యోగం అంటేనే డిసిప్లిన్. ప్రత్యేకించి నియమాలు, నిబంధనలు అనవసరం. మా గురువుగారు నాకు పెట్టిన షరతులేం లేవు. నేను ప్యూర్ వెజిటేరియన్, మందు అలవాటు లేదు. సిగరెట్లు కాల్చేవాడిని. యోగంలోకి రాకపూర్వం ఆయనముందు సిగరెట్లు కాల్చేవాడిని. తర్వాత మానివేశాను. అంటే ఆయనముందు కాల్చడం మానివేశాను. ఉదయం, సాయంత్రం ఖచ్చితంగా ఆరుగంటలకు ప్రేయర్ అలవాటైంది. మరీ జబ్బు పడితేనో, ప్రయాణాల్లో వుంటేనో తప్ప టైం మార్చలేదు. రోజూ తెల్లవారుఝామున నిద్రలేవడం వల్ల బద్ధకం వదిలింది. ప్రేయర్ వల్ల మనశ్శాంతి ఏర్పడ్డది. జీవితంలో పెద్ద ఒడుదుడుకులు లేవు. అది చిత్రమైన మార్పు. ఆఫీసులో అప్పటివరకు ఉన్న వ్యతిరేకత పోయింది. ఎవరూ నాగురించి నెగెటివ్‌గా ఆలోచించరు. అపకారం చేయాలనుకోవడం లేదు. ప్రతివారు నాతో స్నేహం వాంఛిస్తున్నారు. అంటే యోగంవల్ల మనలో ఒక ఆకర్షణ ఏర్పడుతుంది. ప్రేమించకపోయినా ద్వేషించడం జరగదు. ద్వేషం, అసూయ లేనిచోట ప్రేమను పండించవచ్చు.

యోగం మూడు నాలుగునెలలు ప్రశాంతంగా సాగింది. ఒకరోజు ప్రేయర్ ప్రారంభించిన పది నిమిషాలలో అదేపనిగా ఆవలింతలు రాసాగాయి. కంట్రోల్ చేయడానికి వీలుకాని అరుపులు. తర్వాత శరీరంలో ప్రకంపనలు. కాళ్లు,చేతులు వంకర తిరిగిపోవడం, రకరకాల ముద్రలు, విన్యాసాలు, నమస్కార ముద్రలు రాసాగాయి. మానసికంగా, శారీరకంగా నిస్పత్తువ, వెన్నులోంచి నాగుపాము లేచినట్లు, శరీరం నాగస్వరానికి నాట్యం చేసే నాగుపాము వలె నాట్యం చేయసాగింది. అదొక నటనాలయం. శరీరం ముందుకు, వెనుకకు వంగిపోయింది. తర్వాత నాకు స్పృహ లేదు. నాలోకి మాస్టరుగారు వచ్చి ప్రవేశించిన అనుభూతి. నా రూపం మాస్టరుగారిలో కలిసిపోయింది. మాస్టరుగారి రూపం నాలో కలిసిపోయింది. నేను లేను. నేను, నేను కాదు. ఉన్నది మాస్టర్‌గారొక్కరే నాలో సంపూర్ణంగా మాస్టర్‌ప్రజ్ఞ నిండిపోయింది. ఇదేమిటి నేను 'మాస్టర్'గా మారిపోవడం! నేను ఏమైనట్లు? నా రూపం ఏమైంది? అంతటా మాస్టర్ విశ్వరూపమే దర్శనమవుతోంది. ఇంతకాలం మాస్టరుగారి ఫోటోరూపం సైతం జ్ఞాపకం ఉండేదికాదు. ఇప్పుడీ హిరణ్యరూపానికి అర్థమేమిటి?

డాక్టరుగారికి చెప్పాను. ఆయనకు అర్థం కాలేదు. 'అడయార్ వెళదాంపద' అన్నారు. అక్కడ మాస్టర్ గారి మీడియం టి.ఎస్.శంకరయ్యర్ గారున్నారుట. ఆయన మాస్టర్‌గారి డైరెక్టు శిష్యుడు. 50 సంవత్సరాలుగా యోగం చేస్తున్నవారు. నా అనుభవాలకు అర్థం ఆయన చెప్పగలరని ఆశించాం. ఆయన ఎగాదిగా చూచి 'గోఎహెడ్' అన్నారు.

మాస్టరుగారు మద్రాసుకు వచ్చినప్పుడు ఈయనగారు వెంటబడి తిరిగేవారుట. ఆయన నాకు మాస్టరుగారి జీవితం గురించి, యోగ విశేషాలు అనేకం చెప్పారు. నేను మద్రాసులో ఉన్నంతకాలం శ్రీశంకరయ్యర్‌తో అనుబంధం వుంది. నేనంటే చాలా ప్రేమగా వుండేవారు. నా అనుభవాలు చెప్పగా విని "ఆ రోజుల్లో మాకే ఇలాంటి అనుభవాలు రాలేదు, నీవు అదృష్టవంతుడివి. మాస్టర్‌గారి దివ్యరూపం దర్శనమైంది. ఆయన నీకు పెద్దబాధ్యత అప్పగిస్తారని నాకనిపిస్తోంది" అన్నారు. అది కొంత ప్రోత్సాహం. "నీ మొహం, అవేం పిచ్చి అనుభవాలు" అనలేదు. నాకొచ్చే అనుభవాలు ఎవరికీ చెప్పవద్దని సలహా యిచ్చారు. "మాస్టరుగారి నుండి ఏ సందేశం వినిపించినా, ఎనలైజ్ చేసుకుని ముందుకు సాగిపో, మాస్టరే నీకు గైడెన్స్" అన్నారు.

అప్పటినుండి రోజుకో కొత్త అనుభవం. ఎన్నని రికార్డు చేయను! వైబ్రేషన్స్ కలగని రోజులేదు. చెబుతుంటే ఆశ్చర్యంగా వినడం తప్ప విశ్లేషించేవారు లేరు. ఒకరోజు హృదయం నుండి ఏవో శబ్దాలు బయలుదేరి శరీరం అంతా వ్యాపించి, ఊపివేశాయి. శబ్దం శక్తిగా మారసాగింది. ఈ యోగంలోని విశేషమే అది. శబ్దం స్పందించి శక్తి కావడం. కనీసం ముప్పావుగంటసేపు యోగావర్కు సాగేది. ఆపుదామన్నా ఆగేది కాదు. అలాగ అనాహత కేంద్రం నుండి శబ్దాలు వెలువడడం చాలాసార్లు జరిగింది. మొదటిసారి భయం. తర్వాత అలవాటు. ఒకసారి నా సూక్ష్మశరీరం భౌతికశరీరం నుండి వేరై నా ఎదురుగా నిలబడింది. చచ్చిపోయినాననే అనిపించింది. సూక్ష్మశరీరం వెంట మనస్సు పరుగుతీసింది. అది ఏవేవో లోకాల్లో తిరిగేది. గతంలోకి, భవిష్యత్తులోకి వెళ్లి వచ్చేది. నాకేం తెలుసు. అంతా అయోమయం. తిరిగి అది భౌతికశరీరంలోకి వస్తే బ్రతికినట్లు. దానిని వెనక్కు తీసుకురావడం ఎలాగో తెలియదు. సూక్ష్మశరీరం మహాకాంతివంతంగా, పరుగులు తీసేది. క్షణంలో ఎంత దూరమైనా పయనించగలిగేది. నాలుగైదుసార్లు అలా సూక్ష్మశరీరం వేరై నన్ను కంగారుపెట్టింది. ఒకసారి హిమాలయాలకు వెళ్లి ఎందరో మహర్షుల్ని దర్శించాను. నా గత జన్మలు అయిదు వరకు తెలుసుకున్నాను. అలా హిమాలయాలకు వెళ్లినపుడు నా సూక్ష్మశరీరం ఒక మహామునిని కలిసింది. ఆయనను టెస్టు చేసి, యోగం ఉపదేశించింది. అతను గతజన్మలో ఒక యువతి మోసంవల్ల వైరాగ్యంచెంది హిమాలయాలకు పారిపోయి వచ్చాడు. విదేహంతో తపస్సు చేస్తున్నాడు. ఇప్పుడు మాస్టరుగారు కరుణించి అతన్నికి యోగంలోకి అనుమతించారు. నా ద్వారా మాస్టరుగారే ఉపదేశం చేసినట్లు తెలియవచ్చింది. ఆయన యలమంచిలి ప్రాంతం వాడనిపించింది. ఏమిటో చేరిన కొత్తలోనే విచిత్రమైన అనుభవాలు!

నలభైరోజులపాటు రోజూ హృదయస్థానంలో వర్కింగు తెలుస్తూ వుంది. పూర్తి అచేతన స్థితి. స్పృహ వుండదు. లోపల కుండలినీ వర్కు ఉక్కిరిబిక్కిరి చేసేది. శరీరం పామువలె మెలికలు తిరిగి, శ్వాస బుసలుకొట్టేది. నాలో ఇడ, పింగళ సంచారం తెలుస్తుండేది. సర్పెంట్ పవర్ అన్నది అనుభవానికి వచ్చింది. శరీరం ఎప్పుడూ వేడిగా కాలిపోతుండేది. 104 డిగ్రీల టెంపరేచర్. రోజు కార్యక్రమాలకు అవరోధంకాని హైఫీవర్. కళ్లు మూసుకుంటే చాలు శరీరంలో కరెంట్‌ప్రవాహం. కాంతి ప్రసారాలు. అప్పటికి యోగం రుచి తెలిసింది.

మనం ఎన్నోపుస్తకాలు చదువుతాం. ఎందరో మహాత్ముల్ని దర్శిస్తాం. ఎన్నో దేవాలయాలు చూచి తీర్థయాత్రలు చేస్తాం. ఎంతో ఆర్తిగా, జిజ్ఞాసగా అన్వేషిస్తుంటాం. ఒకగైడ్ కావాలి, మార్గదర్శి కావాలి. అన్ని ప్రయత్నాలు ఫలించి, పక్వానికి వచ్చినప్పుడుగానీ ఒక గురువు లభించడు. ఆ గురువు చూపిన మార్గంలో ఆయన మీద పూర్ణ విశ్వాసంతో సాధన సాగించాలి. గురువు శక్తి సామర్థ్యాలను శంకించే వాడెన్నటికీ ప్రగతి సాధించలేడు. నా జీవనయాత్రలో ఎన్నో దేవాలయాలు దర్శించాను. విజయవాడ, తిరుమల, కంచి, శ్రీశైలం, వారణాశి, చిదంబరం... అలాగే ఎందరో మహాత్ముల్ని, గురువుల్ని సందర్శించాను. చివరకు నాకు లభించిన మార్గం ఇది. నాకు నచ్చిన పద్ధతి యిది. ఒక మార్గంలోకి వచ్చాక మిగిలిన వాటిపైకి మనసు పోగూడదు. ఒక గురువును ఆశ్రయించిన తర్వాత ఎంత గొప్పవారైనా ఇతర గురువులపై మోజుకూడదు. ముఖ్యం. యోగమార్గంలో పయనించి, సాధన చేసేవారు దేవాలయాలు దర్శించనవసరం లేదు. దేవుళ్లను దేవతల్ని కొలవనవసరం లేదు. మంత్రాలు, తంత్రాలు, పూజలు వ్రతాలు అన్నీ బంద్ చేయక తప్పదు.

ఎల్లకాలం ఒక గురువుపై ఆధారపడ నవసరం లేదు. గురువు కావాలి. గురువు సహాయం అవసరమే. మనం స్వంతకాళ్లపై నడవగలగాలి. గురుకృపవల్ల శిష్యునికి శక్తి సమకూడుతుంది. ఆత్మవిశ్వాసం కలగాలి. శక్తి గురువునుండి భారీగా శిష్యునిలోకి బదిలీ కాదు. సాధనవల్ల మాత్రమే దాన్ని గుర్తించగలం. ఆత్మవిశ్వాసం ఏర్పడినప్పుడే గురుశక్తి అభివృద్ధి చెందుతుంది. అదే సాధకుని యోగశక్తి. మనకు గురువు అనుగ్రహం వుంటే చాలు అన్నీ సమకూరుతాయి అనుకుంటాం. మన విశ్వాసమే అనుగ్రహంగా మారుతుంది. అది గురువుకు తెలియనవసరం లేదు. సమర్పణ లేనిదే తొలిమెట్టు ఎక్కలేం. యోగం చేస్తూవుంటే మనలోకి శక్తి వస్తుంది. అది గురువు నుండి వస్తుందో, మాస్టరుగారి నుండి వస్తుందో మనకు తెలియదు. వస్తుంది. రావడం మాత్రం ఖాయం. దాన్ని నిలుపుకోవడం మనవంతు. నిరంతర యోగసాధన ఒక్కటే దాన్ని నిలుపుకునే సాధనం. అలా ఏర్పడిన

చైతన్యమే మనం సంపాదించుకునే యోగశక్తి. ఒకసారి ఆ దివ్యశక్తిని మనం ప్రేమించి మన గుండె తలుపులు తెరిస్తే, అది మనలో ప్రవేశిస్తుంది ... తిష్ట వేస్తుంది.

మనిషిని కట్టుబానిసను చేసేవి సంప్రదాయం, ఆచారం, దురదృష్టం, కర్మ - ఈ నాలుగు మనకృషిపైన మనకే నమ్మకం లేకుండా చేస్తాయి. ఆత్మవిశ్వాసాన్ని సడలిస్తాయి. మంచికీ, చెడుకీ భగవంతుని అడ్డంపెట్టుకుని, కర్మతో అదృష్టంతో ముడిపెడతాం. ఈ దుర్భరస్థితి మన దేశంలో మరీ ఎక్కువ. అందుకే చాలా దేశాల కన్నా మనం చాలాచాలా వెనుకబడి వున్నాం. విద్యతోపాటు వివేకం పెరగాలి. అది జరగటం లేదు. మానసిక వికాసం కలగాలి, అదీ కలగడం లేదు. మూఢవిశ్వాసాలకు, సంప్రదాయాలకు, ఆచారాలకు బానిసలం అయివున్నంతకాలం మనం పెరగం, ముందుకు పోలేం. మతం ఉచ్చులో, కులాల విషపుకోరల్లో చిక్కి, ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై, చస్తూ జీవచ్ఛవాల్లాగా బ్రతుకుతాం.

అందరం ఆశిస్తాం, బ్రతుకంతా హాయిగా, సాఫీగా సాగాలని. అందుకు దేవుళ్లకు లంచాలిస్తాం, స్తోత్రాలు చేస్తాం, పొగుడుతాం. మనకొచ్చే అక్రమ సంపాదనలో వాటాలిస్తాం. మనం ఆశించిన ప్రయోజనాలు కలగకపోతే పొగిడిన దేవుళ్లనే వదలిపెడతాం. మరో కొత్త దేవుడిని వెతుక్కుంటాం. దేవుళ్ల అసమర్థతల్ని సైతం మనమే నిర్ణయిస్తాం మతాల వారీ దేవుళ్లే కాదు, కులాల వారీగా దేవుళ్లు, గోత్రఋషులు ఏర్పడ్డారు మనకోసం. మనం చేసే వెధవపనులు, వేసే వేషాలు దేవుళ్లకు తెలీదా! అందుకే మన జోలికి రారు. మన దుష్టకార్యాలను ప్రోత్సహించరు. అనుకుంటాంగానీ మన మంచిచెడ్డలు లాభనష్టాలు పట్టించుకోవాల్సిన పని ఆ దేవుళ్లకేముంది? మన కోర్కెలు తీరితే దేవుళ్లకు పెళ్లిళ్లు చేయిస్తాం. విశ్వకళ్యాణం ఏదో మనవల్లే జరిగిపోయినట్లు మురిసిపోతాం. ఇంతచేసినా, మనకు అనుకూలంగా మంచి జరగకపోతే 'కర్మ' అని మొహం చాటు చేసుకుంటాం.

మా గురువుగారు ఇలా మరీ కుండ బ్రద్దలుకొట్టినట్లు చెప్పేవారు. వారు చెప్పినవన్నీ సత్యాలే. ఆయన మాటలు తలకెక్కినకొద్దీ నాకు మిగతావాటిపైన ఆసక్తిపోయింది. వితండవాదం కాకపోయినా సమాధానం కటువుగా, తిక్కగా చెప్పడం అలవాటైంది. 'తిక్క' అనిపించవచ్చు గానీ అవి పచ్చినిజాలు. నిజాన్ని నిర్భయంగా చెప్పడం యోగసాధకునికి అవసరం. ఇంకా యింకా చదివి తెలుసుకోవాలనే ఆరాటం తగ్గింది. చదివి తెసుకునే దానికన్న, చదవకుండా హృదయంతో తెలుసుకోవడం మంచిది అనిపించింది. పుస్తకాలు చదవడం తగ్గింది. ఇప్పుడు కావలసింది ఆత్మ, బుద్ధి. యోగదృష్టితో సత్యాన్ని అందుకోవడం.

యోగానికి సంబంధించిన పుస్తకాలు ఇంగ్లీషులో లభ్యమైనన్ని చదివాను. హిందూ, బౌద్ధ, ఇస్లాం, జొరాష్ట్రియన్, ఎపిక్యూరస్ మతగ్రంథాలు, టిబెట్, నేపాల్ దేశాలలో గుప్తంగా వున్న గ్రంథాలు చదివే అవకాశం కలిగింది. అరవిందులు, రామకృష్ణ, రమణమహర్షి, సాయి, కృష్ణమూర్తి, థియోసఫీ గ్రంథాలు చదివాను. నాకు చివరకు నచ్చింది మాస్టర్‌యోగం. మిగిలినవి తక్కువనీ, నచ్చలేదనీ కాదు. నా తత్వానికి ఇది సరిపోయింది. నాకున్న కొద్దిపాటి సంస్కారం ఈ మార్గంలో ఇమిడింది. యోగసాధన ప్రారంభించినప్పటి నుండి నా సందేహాలు తీరిపోసాగాయి. మాయమబ్బులు ప్రిదిలి పోసాగాయి. మనస్సు నిర్మలం అయిందని చెప్పను కానీ శంకా నివృత్తమైంది. సత్యరోచిస్సులతో మాయచీకట్లు మాయమైనాయి. ప్రపంచం ఎందరో మహాత్ముల్ని ప్రభవించింది. అందరినీ అనుసరించలేం. 'మహాత్మ' అనేపదానికి అర్హులైన వారంతా సమానులే. సమకాలీనులు కాకపోవచ్చు. ఆత్మలోకాలలో అందరూ సహచరులే. ఏ ఒక్కరిని మనం ఆదర్శంగా తీసుకుని వారిని అనుసరించినా, వారి మార్గాన్ని అనుకరించినా మిగిలిన అందరూ ఆశీర్వదిస్తారు. మనతో సహకరిస్తారు.

తొలివాళ్లలో ఎవరికైనా యోగసాధనకు అవరోధాలు,ఆటంకాలు సహజంగా ఏర్పడుతుంటాయి. అవి పరీక్షలు. మనం నమ్మినదానిని జనం నమ్మనివ్వరు. మన పాటికి మనం ఏధో చేసుకుంటున్నామని ఊరుకోరు. విమర్శిస్తారు. అవీ ఇవీ చెప్పి భయపెడతారు. స్నేహంగా వున్నవారే అకారణంగా దూరమవుతారు. ఇదేం యోగం? ప్రాణాయామం లేదు, ఆసనాలు వేయడం లేదు, అని ఈసడించేవారు ఎక్కువైనారు. మనిషినైజం అది. మనం యోగంచేసి ఏదో కానిపని చేస్తున్నట్లు! భ్రష్టమైపోయినట్లు విమర్శ. వారికి నచ్చని యోగం మనం చేసుకుంటే వారికి కష్టాలు, పాపాలు వస్తాయని బెంగ. "కలడు కలండనెడివాడు కలడో లేడో" అన్న సందేహం దేవుళ్ల విషయంలో సహజం. ఉన్నారో లేదో ఎవరు నిరూపిస్తారు! ఉన్నారనుకునేవారికి, నమ్మినవారికి నమ్మినవిధంగా కనిపిస్తారు. లేరనుకున్నవారి జోలికి దేవుళ్లు రారు. మన నమ్మకం, విశ్వాసం బట్టి దేవుళ్ల ఉనికి, మనికి వుంటుంది. మనం అవసరమై పిలిస్తే తప్ప వారు జోక్యం చేసుకోరు.ఈ నమ్మకాల సందర్భంగా నాకొక సంఘటన జ్ఞాపకం వస్తోంది. 1970 - 71 ప్రాంతంలో మద్రాసుకు ఒకబాబా వచ్చాడు. సినిమావాళ్లకు బాబాలంటే వెర్రివ్యామోహం. వెంటనే పొగవుతారు. ఆ బాబా టి.నగర్ పక్కన ఒక కాలనీలో బస చేశాడు. ఓ పత్రిక ఎడిటర్ ఆ బాబా దగ్గర చేరి, కాస్త డబ్బు దండుకుని పత్రికల్లో వార్త వేయిస్తానన్నాడు. ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాడు. ఉన్న చిన్నాపెద్ద, పది పత్రికల వారిని వచ్చి

బ్రతిమిలాడారు. అయిదు గంటలకు ఇంటర్వ్యూ. నేనుముందే చెప్పాను. ఆరుగంటలకు ముందే నేను వెళ్లిపోతాను ఉండలేను అని. ఏ పరిస్థితిలోను గురువుగారింట ప్రేయర్ మిస్ ఆవడం నాకిష్టం లేదు. సరే అన్నారు. నాలుగున్నరకు నేను వెళ్లాను. వర్షం భారీగా పట్టుకుంది. ఎవరూ జనం రావడం లేదు. ఆ బాబాకు నన్ను పరిచయం చేశారు. అతను కుర్రవాడు. ముప్ఫయి ఏళ్ల లేవు. బషీర్‌బాబా అనుకుంటాను పేరు. ఆయన గదిలో రకరకాల ఫొటోలు, పటాలు వున్నాయి. 'నాకు ఆరుగంటలకు ప్రేయర్.. నాప్రేయర్ అయ్యేవరకు ఎవరినీ లోపలకు రానివ్వకండి 'అని బాబాతో చెప్పాను. ఆయన నాతోనే కూర్చుని నన్ను గమనించసాగాడు. అప్పట్లో మూవ్‌మెంట్స్, వైబ్రేషన్స్ చాలా ఎక్కువగా వచ్చేవి. మెలికలు తిరిగిపోయేవాడిని. ఎడుగంటలకు నా ప్రేయర్ పూర్తయింది. అతను నా కాళ్లమీదపడి నమస్కరించి "స్వామీ మీరు అసామాన్యులు,పెద్దయోగులు. నన్ను మీ శిష్యునిగా చేసుకోండి" అని అర్థించాడు.

"నాకు శిష్యులేమిటి? నేను గురువునుకాను బాబా. కొత్తగా యోగంలో చేరినవాడిని."

నా గురించి, యోగం గురించి వివరంగా చెప్పాను.

"ఇన్ని పటాలు పెట్టుకున్నారు. వీటితో మీరు జనాల్ని ఆకర్షించి, మోసం చేస్తున్నారు" అన్నాను.

ఆ బాబా కన్నీళ్లు పెట్టుకున్నాడు.

"ఏ చెయ్యను గురూజీ, అమ్మ, ముగ్గురు చెల్లెళ్లను పోషించాలి. చెల్లెళ్ల పెళ్లిళ్లు చేయాలి. మరో సంపాదన లేదు. చదువు తక్కువ. ఇలా 'బాబా' వేషం వేసి సంపాదించడం సులభం."

"మీ మతంలోనే ఇలాంటివి చేయవచ్చు గదా."

"మా మతంలో ఈవెధవపనులు చేస్తే చంపేస్తారు. మీ హిందువుల్ని సులభంగా మోసం చేయవచ్చు. డబ్బు సంపాదించవచ్చు."

నాకు అతని మోసం చూస్తే అసహ్యం వేసింది.

"మీరు నన్ను క్షమించి, ఆశీర్వదించండి" అని పాదాలపై బడి ఏడ్వసాగాడు.

అలాంటి మోసపు బాబాలను ఆశీర్వదించకూడదు.

ఆ బాబాకు తర్వాత చాలామంది భక్తులు చేరారు. ఏవేవో మహత్తులు ప్రచారంలోకి వచ్చాయి. తను అమెరికా వెళ్లి దండిగా డబ్బు సంపాదించి తెచ్చుకున్నాడు. అమెరికాలో ఇండియన్ బాబాలకు, స్వామీజీలకు, భగవాన్లకు డిమాండ్ ఎక్కువ. ఇక్కడ

వెళ్లినవారు కాషాయాలు ధరించి అక్కడ హిందూత్వం ప్రచారం చేసి, 'యోగం' పేరు చెప్పి కోట్లు సంపాదిస్తుంటారు. ఈయన అదేపని చేశాడు. ఇండియా తిరిగి రాగానే చనిపోయాడని తెలిసింది.

అలాంటి వారిని చూస్తే అసహ్యం వేస్తుంది. జుగుప్స కలుగుతుంది. యోగానికి ఆధ్యాత్మిక జీవనానికి పట్టిన చీడపురుగులు అనిపిస్తుంది. అన్ని దేవుళ్లపటాలు పెట్టుకుని మోసం చేయడం తప్పు. జనం బలహీనతల్ని వీరు స్వప్రయోజనాలకు వాడుకుంటారు. పవిత్రంగా వున్నవారని ఆశ్రయించడం అవసరం. మనిషికి కొంతైనా మానసిక శాంతి లభిస్తుంది. కాని రంగులుమార్చి, మోసం చేసి ఇతర మతాలవారిని, ఇతర మార్గాల వారిని ఆకర్షించడం నాకు మనస్కరించదు. డబ్బుకోసం, కీర్తికోసం యోగాన్ని ఆధ్యాత్మికతను బలిపెట్టడం ద్రోహం. మనదేశంలో ఇలా గారడీలు చేసి, మహత్తుల పేరున గారడీలు చేసి భగవాన్లుగా చలామణీ అవుతున్నారు. ఎవడికి వాడు తానే అవతారపురుషుడినంటాడు. జనం వెర్రిగా వెంటపడతారు. కొన్ని సంవత్సరాలకు రంగు మాసిపోతుంది. నిజరూపాలు వికృతంగా బయటపడతాయి. మగవారే కాదు. ఇప్పుడు కొందరు అమ్మాజీలు, మాతాజీలు ఇలా ఆధ్యాత్మిక వ్యభిచార కేంద్రాలు నెలకొల్పుతున్నారు.

నా ఫీలింగ్సును బట్టి నా నిర్ణయాలు.

ఒకరి ప్రోద్బలంతో నేను నిర్ణయాలు మార్చుకోను. 'గాడ్‌మెన్' అనే మాటను నలభై సంవత్సరాలక్రితం విన్నాను. గాడ్‌మెన్‌గా ప్రచారం పొందుతున్నవారి గురించి చదివాను, తెలుసుకున్నాను. భగవాన్ పదం నాకు విచిత్రం అనిపిస్తుంది. మహర్షి, ఋషి, ముని అనే పదాలకు విశిష్టమైన అర్థాలున్నాయి. ఈ 'గాడ్‌మన్' అనే సంకరపదం ఎలా వచ్చింది. రమణమహర్షి అంటే కలిగే స్పందన, అనుభూతి రమణభగవాన్ అన్నప్పుడు కలగదు. భగవాన్ అంటే భగవంతుని ప్రతినిధి అనా? అవతారమనా? భగవంతుని దర్శించాలనుకున్నంత మాత్రాన భగవాన్ ఎలా అవుతారు! రమణ మహర్షి, అరవిందయోగి, రామకృష్ణ పరమహంసల చిత్రపటాలు చూస్తే ఏదో హృదయస్పందన కలుగుతుంది. మనస్సు శీతలమై, సేదతీరినట్లు అనిపిస్తుంది. అలా కలగనప్పుడు వారు భగవానులమని చెప్పినా తృప్తి కలగదు.

నా ఫీలింగ్సు నావి. ఒకరిని నిందించను. కానీ కొందరిని చూస్తే, వారి ఫొటోలు చూస్తే ఎవర్షన్ కలుగుతుంది. కడుపులో దేవినట్లవుతుంది. ఎవరి భక్తులు వారికుంటారు! నాకు మోడరన్ స్వాముల ఫొటోలుచూస్తే, ఎలాంటి స్పందన కలగదు. స్వామి వివేకానంద

ఫొటో చూచినా, నాకు రామకృష్ణ పరమహంస ఫొటో చూచినప్పుడు కలిగే అనుభూతి కలగదు. మాస్టరుగారి ఫొటో చూచినప్పుడు చూపు తిప్పుకోలేకపోయాను. ఆయన ఫొటోలోంచి సజీవమూర్తివలె నా గుండెలోకి చూస్తున్నట్లు అనిపిస్తుంది. శరీరం జలదరించింది. అదే, ఆ స్పందనే నన్ను మాస్టర్‌యోగంలోకి లాగిందేమో! నన్ను నేను మరచిపోవడం నిమిషాలలో జరుగుతుంది. కళ్లు మూసుకుని, మాస్టర్ రూపాన్ని భావించగానే మగత ఆవహిస్తుంది. ఏదో శూన్యంలోకి వెళ్లిపోతాను. ఆ పారవశ్యం చాలు నాకు. ఆపైన ఏమీ కోరను!

యోగంలో ఏదో సాధించాలని గానీ, ఒక గురువును కావాలని, మాస్టరును అనిపించుకోవాలని నాకెన్నడూ లేదు. యోగంతో మరేదో లబ్ధి పొందాలని తలచలేదు. అసలు నా బడుగుజీవితం మలుపు తిరిగి ఆధ్యాత్మికం దిశగా పయనించడమే మహద్భాగ్యం. సీదాసాదాగా యోగంలో చేరాను. ఏదీ కోరకపోయినా, జీవనం సాఫీగానే సాగుతోంది. చాలు. నాకు ఏవి అవసరమో మాస్టరుగారే నిర్ణయిస్తారు, ప్రసాదిస్తారు. అది నా నమ్మకం. అర్హత, యోగ్యత లేనిది అర్థించినా, దేబిరించినా యివ్వరు. అర్హతలు పెంచుకోవడం సాధకుని కర్తవ్యం. మన లక్ష్యం యోగసాధన. యోగం ఏమిస్తుందని, ఏమి లాభమని ఎప్పుడూ ఆలోచించకూడదు. అలాగ నేను ఆలోచించను.

ఇల్లు మార్చవలసి వచ్చింది. ఉద్యోగం చేసినంతకాలం ఊళ్లుమారడం, ఇళ్లు మారడం తప్పదు. యోగంలోకి రావడమే జీవితంలో పెద్దమార్పు. కొత్త ఇంటికి మారాక 'డిస్కవరీ ఆఫ్ మాస్టర్‌యోగ' రాయటం మొదలెట్టాను. తెలుగులో కాకుండా ఇంగ్లీషులో ఎందుకు రాయాలనిపించిందో చెప్పలేను. నాకు ఇంగ్లీషు పరిజ్ఞానం బహుస్వల్పం. చిన్నచిన్న వ్యాసాలు రాసే అలవాటుంది గానీ ఏకంగా ఒక పుస్తకమే రాయబూనడం సాహసం. అది మాస్టరుగారి సంకల్పం కావచ్చు. ఉద్యోగం చేస్తున్నది మద్రాసులో. తెలుగు ప్రాంతం వదలిపెట్టి పది సంవత్సరాలవుతోంది. పరిచయాలు, రాకపోకలు తగ్గిపోయాయి. ఎప్పుడైనా తల్లిదండ్రులను చూడడానికి తెనాలి వెళ్లడమే. అసలు నాకు మాబంధువులు ఎక్కడెక్కడున్నారో తెలియదు. అజ్ఞాతవాసం లాంటి ప్రవాసజీవితం అది. ప్రాణం యిచ్చే స్నేహితులు నాకు అసలు లేరనే చెప్పాలి.

నా జాతకం ఎలాంటిదోకాని నేనంటే అసూయపడేవారు, నన్ను ఇష్టపడనివారు కొందరుంటారు. పైకి అందరూ ఆత్మీయంగా, మంచిగా ఉన్నట్లు నటిస్తుంటారు. చాటుమాటుగా అపకారం తలపెడుతుంటారు. మూడుగ్రహాలకు పాపార్గళ దోషం పట్టింది. రెండు గ్రహాలు ఉచ్ఛ. కొన్ని శుభగ్రహాలకు నీచగ్రహదృష్టి వుంది. కనుక

మొదటినుండి ఎదురుదెబ్బలు తినక తప్పడం లేదు. కాలేజీ జీవితంలోనూ, జర్నలిజం లోనూ అదే పరిస్థితి. అనవసరంగా నన్ను ద్వేషించేవారు. అవమానపరిచేవారు తారసపడు తుంటారు. అయితే నన్ను ప్రేమించేవారు, నా స్నేహాన్ని అభిలషించేవారు ఎక్కువ మందే వున్నారు. కడకు యోగంలోనూ ఈ పోటీ తప్పలేదు. కొందరు అనవసరంగా ద్వేషిస్తే, మరికొందరు వెతుక్కుంటూ వచ్చి నాతో మైత్రిని పెంచుకున్నారు. ఏమిటో అంతావిచిత్రం, విధివిలాసం.

పి.ఎస్.ఆర్. శర్మగారికి నేను యోగం చేయడం ఇష్టం లేదు. ఆయనది ఒంగోలు మాస్టరుగారి పద్ధతి. నాది కుంభకోణం మాస్టరుగారి పద్ధతి. నేను డాక్టరుగారి గదిలో ప్రేయర్‌లో కూర్చుంటే శర్మగారు బయట స్టేజీపైన ఒంటరిగా కూర్చునేవారు. నా పక్కన కూర్చుంటే మైలపడతానని, యోగభ్రష్టం అవుతుందని ఆయన అనుమానం. ఆయన వల్ల ఒక మేలు జరిగింది. విజయవాడ యోగమిత్రులకు నా గురించి చెప్పింది ఆయనే. ఒకరోజు డాక్టరుగారింట్లో కబుర్లు చెబుతుండగా ఒక సన్నటి వ్యక్తి వచ్చి, డాక్టరుగారికి నమస్కారం చేశాడు. బహుశా ఆయనకు తెలిసినవాడై వుంటాడనుకున్నాను.

"శార్వరి ఎవరు?" అని డాక్టరుగారిని ప్రశ్నించాడు.

డాక్టరుగారు ఎదురుగా వున్న నన్ను పరిచయం చేశారు.

ఆయన నాతో కరచాలనం చేస్తూ 'నాపేరు దాసు' అని పరిచయం చేసుకున్నాడు. నా మిత్రుడు, నటుడు పొట్టి ప్రసాద్‌కి ఆయన బావగారు. ఆ రోజు నుండి దాసుగారికి, నాకు స్నేహం విడదీయరాని ఆత్మీయతాబంధం అయింది. దాసుగారి పేరు మధుసూదనరావు. ఒంగోలు మాస్టరుగారు మైనంపాటి నరసింహంపంతులుగారి కుమారుడు. ఉండేది విజయవాడ. పరిచయం అయిన రోజునే ఇద్దరం చాలాసేపు సంభాషించుకున్నాం. ఆయన చివరకు అన్నమాటలు "శర్మ నిన్ను అపార్థం చేసుకున్నాడు శార్వరీ! అతని మాటలు సీరియస్‌గా తీసుకోకు."

ఆయనకు ఉద్యోగం సద్యోగం లేదు. ఆస్తిపాస్తులు ఉన్నాయి. విజయవాడలో వుంటూ యోగమిత్రుల యోగక్షేమాలు విచారిస్తుంటారు. ఎం.ఎన్.గారి శిష్యబృందం అంతా వీరిని గురువుగారి అబ్బాయిగా గౌరవిస్తారు. గుంటూరు, విజయవాడ, పిడుగురాళ్లలో జరిగే యోగసమావేశాలలో ఎం.ఎన్.గారి ప్రతినిధిగా పెత్తనం చేస్తుంటారు. మంచి స్నేహితుడు నావరకు.

యోగంపైన నా తొలిరచన

యోగంపైన తొలిరచన ఇంగ్లీషులోనే.
అప్పటిదాకా ఏవో చిన్న చిన్న వ్యాసాలు, యోగగ్రంథాలపై సమీక్షలు చాలా రాశాను గానీ, ఆథెంటిక్‌గా యోగంపైన ఒక పుస్తకమూ రాయలేదు. అలాంటి పుస్తకం ఒకటి నేను రాయగలనని ఎన్నడూ అనుకోలేదు. దానికి చాలా పరిశ్రమ కావాలి, పరిశోధన చేయాలి. విషయసేకరణ జరగాలి. ఇవి ఒక రచయితగా నాకున్న అనుభవాలు. ది డిస్కవరీ ఆఫ్ మాస్టర్‌యోగా రచనకు నాకు స్ఫూర్తినిచ్చింది యోగసాధన. సాధనే నాకు ప్రేరణ. ఏదో అంతఃస్పందన నన్ను ముందుకురికించింది. మాస్టరుగారి సందేశం అందుకుని చాలాకాలమైంది. కానీ ధైర్యం చాలలేదు. కొంతకాలం ఆలోచన, కొంతకాలం ప్లానింగ్ ... ఏం రాయాలి, ఎలా రాయాలి, ఎక్కడ మొదలుపెట్టాలి? అన్నది రచయిత కృత్యాదవస్థ మాస్టరుయోగం గురించిన పుస్తకాలు లేవు. సమాచారం అందదు. అక్కడక్కడ కొందరు సాధకులు, మాస్టరుగారి శిష్యులు ఉన్నా నోరు విప్పి చెప్పరు. గురువుగారి అనుమతి, ప్రోత్సాహం నాకు ఊపిరి. పగలు ఆఫీసులో పని తప్పదు. రాత్రి పదిగంటల తర్వాత కూర్చునేవాడిని. పన్నెండు, ఒంటిగంటవరకు కుస్తీపట్లు. ఇంగ్లీషులో రాయడం కదా, స్పెల్లింగ్స్, గ్రామరు జాగ్రత్తగా గమనించాలి. మాస్టర్‌గారి యోగం గురించి రాస్తూ, మిగిలిన యోగాల గురించి స్పృశించదలచాను. మిగతావాటి గురించి చెప్పకుండా ఈ యోగం గొప్పది అంటే, నేను చేస్తున్నాను కనుక గొప్పదని పొగిడినట్లు విమర్శలు వస్తాయి. నాలో జర్నలిస్టు ప్రతిక్షణం హెచ్చరిస్తుంటాడు ఏది రాయాలన్నా. నిద్రపోతున్నా, మేల్కొనివున్నా, ఏ పనిచేస్తున్నా ఒక పుస్తకం రాయడం ప్రారంభించిన నాటి నుండి అవే ఆలోచనలు ఊపిరిసలపనీయవు. ఇలాంటి గ్రంథాలు రాస్తున్నంతకాలం నిగ్రహం వుండాలి. సంయమనం పాటించాలి. వీలైనంతవరకు బ్రహ్మచర్యం పాటించాలి. మనిషి నైజం, ప్రవర్తన అన్నింటిలోనూ మార్పు వస్తుంది. వచ్చితీరాలి, తప్పదు.

అప్పుడే డాక్టర్ జి.బి.ఎస్. 'నూతనప్రవిభాగం' రాయడం ప్రారంభించారు. అది మాస్టర్‌గారి ప్రియశిష్యుడు ప్రొఫెసర్ పోతరాజు నరసింహం పంతులుగారి 'న్యూడిస్పెన్సేషన్' వ్యాసానికి తెనుగు. డాక్టర్‌గారికి పెరాలిసిస్ వచ్చి, కాలు చేయి పనిచేయడం లేదు. కనీసం ప్రిస్క్రిప్షన్ కూడా రాయరు. అలాంటిది యోగ పుస్తకం సంకల్పించగానే చేయి పనిచేయసాగింది. చక్కగా తనే స్వయంగా రాయసాగారు. అప్పుడప్పుడు నాకు డిక్టేషన్ యిస్తుండేవారు మాస్టర్ గారిని గురించి యోగం గురించి మాట్లాడేటప్పుడు ఆయనకు మాటలు స్పష్టంగా వచ్చేవి. అసలు ఆయనకు పెరాలిసిస్ అనే అనుమానం ఎవరికీ వచ్చేది కాదు. ఇతర సమయాలలో మళ్లీ తడబాటే. అలాంటిది మాస్టరు అనుగ్రహం. నేను ఆ పుస్తకం మాస్టర్ కరుణతోనే ప్రారంభించాను. లేకుంటే మాస్టర్‌గారియోగంపై నేను రాయడం ఏమిటి? ఆయనే నాచేత రాయించారు.

ఆ పుస్తకం రాస్తున్నకాలంలో ఎందరో మహర్షుల్ని మహాత్ముల్ని దర్శించుకున్నాను. కొందరు యోగసమయంలో కొందరు స్వప్నంలో దర్శనం యిచ్చారు. రామకృష్ణ పరమహంస, షిరిడీసాయి, జీసస్, అరవిందయోగి, రమణమహర్షి, మాస్టరుగారు ఇంకా ఎవరెవరో నేను గుర్తించలేని మహర్షులు కన్పించి నా సందేహాలు నివృత్తి చేసేవారు. అలా పుస్తకం పూర్తయ్యేవరకు సాగింది. పుస్తకాన్ని తప్పులు సరిచేసుకుంటూ రెండవప్రతి తయారుచేశాను. అప్పటికి డాక్టరుగారి పుస్తకం పూర్తయింది. మాస్టర్ యోగాజర్నల్ పత్రికకు డిక్లరేషన్ వచ్చింది. డాక్టర్‌గారు చదివి ఓ.కే చేశాక ప్రెస్‌కిచ్చాం. పుస్తకం ముందు బయటకొచ్చింది. తర్వాత పత్రిక ప్రారంభించాం. రెండింటికీ పెట్టుబడి నాదే. పత్రిక ఎడిటర్‌గా డాక్టర్ బాలసుందరరావుగారి పేరుపెట్టాను. పెద్దవారు, నాకు గురువు ఆయన. నిర్వహణ బాధ్యత అంతా నాదే! లాభనష్టాలతో, కష్టసుఖాలతో ఆయనకు నిమిత్తంలేదు. మూడుసంచికలు వచ్చింది పత్రిక. తర్వాత మూతపడింది.

'యోగ జర్నల్' మొదటి సంచిక వేయి కాపీలు వేసి, అందరికీ ఉచితంగా పంచిపెట్టాం. మా ఆశయం ఒకటే. మాస్టర్‌యోగ గురించి జనానికి తెలియచెప్పాలి. కొంతకాలంగా అజ్ఞాతంలో వున్న యోగాన్ని వెలుగులోకి తేవాలి. అందుకు పత్రిక ఇంగ్లీషులో వుంటే మంచిది. నా 'డిస్కవరీ ఆఫ్ మాస్టర్ యోగా' కూడా ప్రచురణ జరిగింది. మద్రాసులో వున్న యోగసాధకులందర్నీ పరిశోధించి ఒక సమావేశం జరిపాం. పత్రికవల్ల అంతా నష్టమే వచ్చింది. అయితే పత్రిక చదివినవారు ఓ వందమంది వరకు ఉత్తరాలు రాశారు యోగంలో చేరతామని. వారందరికీ సమాధానం రాస్తూ ప్రేయర్ ఎలా చేసుకోవాలో చెప్పేవారం. అన్ని ఉత్తరాలకు జవాబులు నేనేరాసినా సంతకం డాక్టరుగారిది వుండేది.

కొత్తపెళ్లికొడుకు సంబరం లాంటిది యోగసాధకునిది.ఎప్పుడెప్పుడు చీకటిపడుతుందా అని ఎదురుచూచినట్లే ఎప్పుడు సాయంత్రం అవుతుందా, ఎప్పుడు తెల్లవారుతుందా, ప్రేయర్ చేసుకోవచ్చునని సాధకుని మనస్సు తొందరపడుతుంది. నావరకు తపన అలా వుండేది. ఆరుగంటలకు ప్రేయర్ చేసుకకపోతే పిచ్చిపట్టినట్లు అయ్యేది. మరచిపోవడం అనేది లేనే లేదు. యోగం కారణంగా ఫస్ట్‌షో సినిమాలు బంద్ అయ్యాయి. యోగంలో చేరాక సినిమా ప్రివ్యూలకు, స్టూడియోలకు వెళ్లడం మానివేశాను. థియేటర్‌లో సినిమా చూడాలన్నా మ్యాటినీ, లేదా రాత్రి రెండవ ఆట. అలాగా జీవితం ఒక క్రమశిక్షణకు లోనైంది. క్రమశిక్షణ పాటించే వారికి క్రమవికాసం కలిగి తీరుతుంది. యోగం ప్రారంభించిన అయిదారునెలలకు నాకొకసారి తీవ్రంగా జ్వరం వచ్చింది. నాలుగురోజులు మంచం పట్టాను. డాక్టరుగారు ట్రీట్‌మెంట్ యిచ్చినా తగ్గలేదు. నాల్గవరోజు రాత్రి ఒక చిత్రం జరిగింది. నా శరీరం యావత్తూ విద్యుత్ ప్రవహించినట్లయింది. గుండె వద్ద, భుజాల మధ్య, భృకుటి వద్ద దీపాలు వెలిగాయి. శరీరంలోని నరాలు రీసెట్ చేసినట్లయింది. ఏవో కొత్తకనెక్షన్స్ కొత్తలింకులు ఏర్పడ్డాయి. నాలుగైదుగంటలపాటు యోగా ఆపరేషన్ జరిగింది. తెలతెలవారుతుండగా శరీరానికి చెమట్లు పట్టి, జ్వరం తగ్గింది. ఉదయానికి నార్మల్ కొచ్చింది. ఆరోజు నుండి నాలో యోగక్రియ తీవ్రం కాజొచ్చింది. నేను సంపూర్ణంగా యోగానికి అంకితమైనాను.

'ది డిస్కవరి ఆఫ్ మాస్టర్‌యోగ'

అచ్చవగానే మొదటికాపీ మాస్టరుగారి శిష్యుడైన టి.ఎస్. శంకరయ్యర్‌గారికివ్వాలని ఆశ. డాక్టరుగారు, నేను కలసి అడయారు వెళ్లాం శంకరయ్యర్‌గారింటికి. అప్పటికి ఆయనతో నా పరిచయం అంతంత మాత్రమే. ఆయనకు పాదాభివందనం చేసి, పుస్తకం చేతికిచ్చాను ... మీ బ్లెస్సింగ్స్ కావాలన్న రిక్వెస్టుతో. ఆయన పుస్తకంపేరు చూడగానే నిప్పులో ఉప్పు వేసినట్లు చిటచిటలాడారు. ఇంగ్లీషులో, అరవంలో తనకు వచ్చిన తిట్లన్నీ తిట్టాడు. నాకు ఏడుపొచ్చింది.ఎరక్కపోయి వచ్చి ఇరుక్కుపోయాను.

"అసలు నువ్వెవరు పుస్తకం రాయడానికి? మాస్టర్‌యోగంపై రాసే అర్హత నీకేది? నువ్వసలు మాస్టర్ని చూచావా? ఆ యోగం నీకేం తెలుసని? 55 సంవత్సరాలుగా యోగంలో తలమునకలైన నేనే రాయలేదు. మహామహావాళ్లు మీడియమ్స్, వారెవరూ రాయలేదు. అసలు మాస్టర్‌గారే ఎవరినీ రాయవద్దన్నారు నీకు తెలుసా?" ప్రశ్నించారు.

"అర్హతలేని వాళ్లని రాయవద్దని వుంటారు" చల్లగా అంటించాను.

"నీకు అర్హత వుందా! మాకు లేదా?"

"ఆ విషయం పుస్తకం చదివినవారు నిర్ణయించాలి. చదవకుండా నిర్ణయాలు చేయడం, జర్నలిస్టుగా నేనొప్పుకోను."

ఒక అర్ధగంటతర్వాత చల్లబడ్డాడు. "సరే, నేను చదువుతాను. నాకు నచ్చకపోతే."

"పుస్తకం రిలీజ్ చెయ్యను. వెయ్యి కాపీలు డిస్కార్డ్ చేస్తాను. మాస్టరుగారికి గాని, మాస్టర్ యోగానికి గాని అప్రతిష్ట కలిగేపని చేయను. ప్రామిస్."

వచ్చేశాం!

పెద్దాయన. అసలే ప్రిజుడిస్‌తో వున్నాడు. అందునా అరవ్వాడు, తెలుగువాళ్లంటే పడదు. తిక్కమనిషని తెలుసు. చాదస్తం ఎక్కువ... కానీ మాస్టర్‌గారి డైరెక్ట్ మీడియం. మాస్టర్‌గారిని చూచినవాడు. ఆయన దగ్గర కూర్చుని యోగంలో ఓనమాలు నేర్చినవాడు. ఈయనగారి తీర్పుతో నేను యోగం కొనసాగించడమో, విరమించడమో జరుగుతుంది. రోజుకో యుగంలాగ గడిచింది. పుస్తకం చదవడానికి వారంరోజులైనా పడుతుంది. మళ్లీ ఆదివారం నాటికి నా పుస్తకం భవిష్యత్తు, నా యోగం భవిష్యత్తు తేలుతుంది. కాని నాల్గవనాడే మా ఆఫీసుకు ఫోన్ వచ్చింది.

"సాయంత్రం ఆఫీసు నుండి సరాసరి అడయార్ రా.."

ఫోన్ కట్. సస్పెన్స్. సాయంత్రం వరకు, ఆయన శపించడానికి పిలిచాడా? వరం ఇవ్వడానికి రమ్మన్నాడా! టెన్షన్. పెందలకడనే పర్మిషన్ తీసుకుని బస్సెక్కాను. "డోంట్ బ్రింగ్ దట్ డాక్టర్" అనీ చెప్పాడు. టి.ఎస్.కు డాక్టరు గారంటే పెద్దగా గౌరవం లేదు ఎంచేతనో మరి. అయ్యర్ గారింట్లోకి అడుగుపెడుతుండగా కాళ్లు వణికాయి. చెమట్లు పోశాయి. నన్ను చూడగానే "వాంగో, వాంగో" అని పడక కుర్చీలోంచి లేచి, ఎదురువచ్చి కౌగిలించుకున్నాడు. "హమ్మయ్య" రిజల్ట్ తెలిసిపోయింది.

"కంగ్రాచ్యులేషన్స్ మై బాయ్" అన్నాడు. ఏం బాయో, ఏం పాడో, నాలుగు రోజులు నాకు నిద్రపట్టకుండా చేశాడు మహానుభావుడు.

"చాలాబావుంది శర్మా, ట్రెమండస్."

ఆయనకు పాదాభివందనం చేశాను. పక్కనే ఆయనపాదాల వద్దకూర్చున్నాను. బలవంతంగా లేపి తన ప్రక్కన సోఫాలో కూర్చునే వరకు వదల్లేదు.

"యోగానికి నీ అవసరం చాలావుంది శర్మా, మాస్టర్‌గారు నిన్ను సెలెక్టు చేశారు. మాస్టర్ యోగం బహుళ వ్యాప్తం అయ్యే టైం దగ్గరపడ్డది. అందుకే, అందుకేనయ్యా డైరెక్టు మీడియంలు మేం ఎవ్వరం చేయలేని పని నీవు చేశావు. ఉహు. మాస్టర్‌గారే నీ చేత చేయించుకున్నారు." అన్నారు అభినందనగా.

ఆయన ప్రేమగా స్వీటు తినిపించాడు. భార్యను, కొడుకును, కోడల్ని పరిచయం చేశాడు. "ఈ శర్మ మన పెద్దబ్బాయి. అవర్ ఎల్డర్ సన్" అని చెప్పి ముచ్చటపడ్డాడు.

తను పాతిక పుస్తకాలు తీసుకుని మీడియమ్స్ అందరికీ పంపాడు. బెంగుళూరులో రఘునాథ అయ్యర్ అని డైరెక్ట్ మీడియం వున్నారు. ఆయన 'హిందూ'పత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేశారు. ఆయనకు ఒక పుస్తకం పంపారు.

ఆయన సిగ్నల్ ఇవ్వగానే ఇండియాలో వున్న అన్ని దినపత్రికలకు రివ్యూకోసం పంపాను. రివ్యూలకే నూరు పుస్తకాలు ఖర్చయినాయి. కానీ అవసరం. పబ్లిసిటీ కావాలి. పుస్తకం ఒకటి వచ్చినట్లు జనానికి తెలియాలి. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, బెంగాలీ, ఇంగ్లీషు దినపత్రికలలో చాలా మంచి సమీక్షలు వచ్చాయి. ఏ తండ్రికైనా కొడుకుపుట్టినప్పటి సంతోషం కంటే ఆ కొడుకు ప్రయోజకుడైనప్పుడు ఎక్కువ సంతోషం కలుగుతుంది. ఒక రచయితకూ అంతే పుస్తకం రాసినప్పటి సంతోషం వేరు. అది అచ్చయి, పది పత్రికల్లో మంచి సమీక్షలు వచ్చినపుడు, విద్యావంతుల అభినందనలు అందుకున్నప్పుడు, ఆ రచయితకు నిజమైన తృప్తి కలుగుతుంది.

'దినమణి' పత్రికలో రివ్యూ అచ్చయిన రోజున దినమణి న్యూస్ ఎడిటర్ రామనాథం నా దగ్గరకు వచ్చాడు "శర్మా, ఆ పుస్తకం రాసింది నువ్వేనా?" అని అడిగాడు.

అవునన్నాను. "వండర్‌ఫుల్. అయితే నీవు మాస్టర్ యోగం చేస్తావన్న మాట. ఎప్పుడూ చెప్పలేదేం."

ఎందుకు చెప్పాలి! నేను మాసెక్షన్‌లోనే ఎవరికీ తెలియనివ్వలేదు.

రామనాథంకి మాస్టరుగారు తెలుసునట. కుంభకోణంలో మాస్టర్‌గారివీధిలోనే వీరిల్లు. మాస్టరుగారి పెద్దబ్బాయి వెంకట్రావు, ఈ రామనాథం క్లాసుమేట్స్. కలిసి కుంభకోణంలో చదువుకున్నారు.

చాలా చాలా విషయాలు అడిగి తెలుసుకున్నాను. సాధారణంగా చాలామందికి తెలియని విషయాలు మిత్రుడు రామనాథం నాకు చెప్పారు. "మాస్టర్‌గారి జీవితకథ" రాయడానికి రామనాథన్ ప్రేరణ. ఆయనచెప్పిన మాస్టర్ కుటుంబ విషయాలు నా పుస్తకంలో రాశాను.

ఆ పుస్తకం ఒక 'తరంగం' లాగా పనిచేసింది. ఇంగ్లీషు దినపత్రికలన్నీ రివ్యూ చేశాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూస్తాన్ టైమ్స్, ది హిందూ లాంటి పెద్ద పత్రికలలో ఎం.పి. పండిట్ లాంటి పెద్దలు సమీక్షించారు. ఈ సమీక్షల వల్ల మాస్టర్ యోగం పట్ల ఆసక్తి కలిగింది. ఇంతకాలంగా అజ్ఞాతంగా వుండి జనం మరిచిపోయిన యోగం ఒక్కసారి

సంచలనం కలిగించింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీ ప్రొఫెసర్ శ్రీ పి. నరసింహంగారు ఆ రోజుల్లో ఇంగ్లీషులో చాలా వ్యాసాలు రాశారుట. ఎన్. నారాయణయ్యర్, టి.ఎస్. రామానుజం కొన్ని పుస్తకాలు రాశారు. 20 వ శతాబ్దపు ఉత్తరార్థంలో వెలుగుల్లోకి వచ్చిన పుస్తకం నాది. మాస్టర్ యోగాన్ని మళ్లీ వెలుగులోకి తెచ్చిన పుస్తకం "డిస్కవరీ ఆఫ్ మాస్టర్ యోగ."

అనుభవాలు

ఒక అనుభవం కలిగించే తృప్తి, ఆత్మవిశ్వాసం ఎన్ని పుస్తకాలు చదివినా కలగదు. అడుగడుగునా నాఅనుభవాలే నన్ను ముందుకు నడిపించాయి. నేను చేస్తున్న యోగసాధనపై నమ్మకం పెరిగేటట్లు చేశాయి. దేనినైనా ఆమోదించడానికి తిరస్కరించడానికి నా అనుభవాలే నాకు గీటురాళ్లు. నా పుస్తకం 'డిస్కవరీ ఆఫ్ మాస్టర్ యోగా' వెలువడినప్పుడు నెల్లూరు నుండి ఒక ఇంజనీరు తెప్పించుకుని చదివాడు. ఆయన రాత్రిపూట పుస్తకం చదువుతుంటే కళ్లు బరువెక్కాయి. అలాగే పక్కనపెట్టి నిద్రపోయాడు. తెల్లవారేసరికి కళ్లు లావుగా వాచిపోయాయి. మంట, నీరుకారడం. జాండిస్ వచ్చిందేమోనని భయపడ్డాడు. ఆఫీసుకు సెలవుచీటి పంపి, మళ్లీ చదవనారంభించాడు. కొన్ని పేజీలు చదివేసరికి కళ్ల మంటలు తగ్గాయి. చల్లగా అనిపించింది. అద్దంలో చూచుకుంటే ఎరుపు కనిపించలేదు. మధ్యాహ్నానికి వాపు తగ్గింది. యోగంపై నమ్మకం కలిగింది. మాస్టరుగారికి నమస్కారం చేసుకుని పుస్తకం మరికొంత చదివేసరికి కళ్ల కలక తగ్గిపోయింది.

ఆయన మర్నాడు నాకు ఉత్తరం రాశాడు. నాకూ ఆశ్చర్యం వేసింది. పుస్తకం చదివినంత మాత్రాన అలా జరుగుతుందా!

మాస్టరుగారు అలాంటి అద్భుతాలు ఎన్నో చేశారని విన్నాను. షిరిడీసాయి జీవితంలోనూ ఇలాంటి విచిత్ర అద్భుత సంఘటనలు విన్నాం. కానీ ఒక పుస్తకం ఎంత శక్తివంతంగా పనిచేసింది!! ఆ పుస్తకం రాస్తున్నప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. కానీ వాటిని రికార్డు చేసుకోలేదు. నా వ్యక్తిగతంగా కలిగిన అనుభవాలకు అంత విలువ ఇవ్వను. నా ధ్యాన సమయంలో నేను దర్శించిన మహాత్ములంతా సూక్ష్మశరీర ధారులేనన్న నిశ్చయానికి వచ్చాను. మాస్టర్‌గారిని దర్శించడం యదార్థమే. అది వారి సూక్ష్మశరీరమే.

మూగపిల్లవాని నోటమాట

యోగమహత్తుల్ని గురించి వర్ణించే సందర్భంలో 'మూకం కరోతి వాచాలం' ఉదాహరణగా చెప్పేవారు. చాలామంది మహాత్ములు మూగవారికి మాటలు ప్రసాదించిన సందర్భాలు మనకు తెలుసు. అలాగే నిరక్షరకుక్షి మహాకవి కావడం సరస్వతీదేవి వరంగానో, మరోదేవత ప్రసాదంగానో చెబుతారు. అనాది కాలంనుండి ప్రవక్తలు, మహాత్ములు ప్రజాశ్రేయస్సు కోసం, అభాగ్యుల కన్నీరు తుడవడంకోసం, తమ శక్తిని ఉపయోగించేవారు. జీసస్, బుద్ధుడు, సాయి, బ్రహ్మంగారు, వేమన లాంటి మహాత్ముల జీవితచరిత్రల నిండా అలాంటి సంఘటనలు కన్పిస్తాయి. అవి చేయడం వల్ల వారు గొప్పవారు కాలేదు. వారి యోగశక్తితో, కరుణతో, ప్రేమతో ఆ పనులు చేశారు. యోగశక్తిని, తపశ్శక్తిని ఎంతైనా సంపాదించవచ్చు. అది తమ వరకే ఉపయోగించుకున్న వారు లోకం దృష్టికి వారు స్వర్గానికి వెళితే వెళ్లి వుండవచ్చు. వారిది పచ్చి స్వార్థం . ఇతరుల కన్నీరు తుడవ కలిగిన వారు, మరో మనిషిని కష్టంలో ఆదుకున్నవారు పదుగురి మెప్పు పొందగలుగుతారు. మహాయోగులు, ఋషులు తాము చేసేవి మహత్తులని చెప్పరు. అవి వారి శక్తికి సహజం. సామాన్యుల దృష్టికి అద్భుతాలు. అంటే మన శక్తిని వీలుగలిగినప్పుడు ప్రజాహితంకోసం వెచ్చించాలి. మాస్టరుగారు చాలా అద్భుతాలు చేసేవారు. వాటిని వారు యోగసిద్ధులని చెప్పలేదు. యోగసాధన చేసే ప్రతివ్యక్తికి లభించే మానసిక శక్తులన్నారు. వాటికి ప్రచారం అవసరం లేదు. ప్రచారం ఇవ్వకూడదు.

1972 లోనే నా యోగం ప్రజాహితం కావడం మొదలైంది. అది మాస్టర్ సంకల్పమే అయి వుండాలి. నేనుగా ఎవరికీ యోగం చేస్తున్నట్లు చెప్పేవాడిని కాను. నాకోసం, నా తృప్తి కోసం చేసుకునేవాడిని. నమ్మినదాన్ని పూర్తిగా విశ్వసించడం నాకిష్టం. అందుకే ఇంట్లో దేవతాపూజలు, బయట దైవదర్శనాలు బంద్ చేశాను.

నేను ఊహించని ఒక సంఘటన గొప్ప మలుపు తిప్పింది. మద్రాసు మౌంట్‌రోడ్డులో మా ఆఫీసు రోడ్డు అవలివైపున ఆర్ట్సు కాలేజీ, దానిప్రక్క మేడపైన ఇండియా బుక్‌హౌస్. దాని యజమాని హీరా, సింధీవాడు. ఆయనకు హిగ్గిన్‌బాదమ్స్ మేనేజరుకు వ్యాపారమైత్రి. నా డిస్కవరి ఆఫ్ మాస్టర్ యోగా పుస్తకం చదివిన హిగ్గిన్ బాదమ్స్ మేనేజరు, హీరాతో చెప్పాడు ఈ యోగం గురించి. ఆయన ఆఫీసుకు కబురు పంపాడు. నన్ను ఒకసారి కలుసుకోవాలని, అపాయింట్‌మెంట్ యివ్వమని. నేను అపాయింట్‌మెంట్ ఇచ్చేంత గొప్పవాడిని కాదు. మధ్యాహ్నం నేనే బుక్‌షాపుకు వెళ్లాను లంచ్ అవర్లో. వారికి వచ్చే ఫారిన్‌బుక్స్ మాకు రివ్యూలకు పంపిస్తుంటారు. నేను లోగడ చాలాసార్లు ఆ షాపుకు వెళ్లి పుస్తకాలు కొన్నాను.

హీరాకు ఒక్కగానొక్క కొడుకు. అయిదేళ్లవాడు. మాటలురావు. అతనికి ట్రీట్‌మెంట్ యిమ్మని అడిగాడు. నాకేం తెలియదు. మా గురువుగారిని అడిగి చెబుతా నన్నాను. డాక్టరుగారికి చెప్పాను. ట్రీట్ చేయమని అర్థించాను. "నాకు ట్రీట్‌మెంట్స్. ఇనీసియేషన్ ఏమీ తెలియవు శర్మా, నీ యిష్టం నీకు ధైర్యం వుంటే చేయి." అన్నారు.

"మీరు పర్మిషన్ యిస్తే......" నసిగాను.

"నేనెవర్ని పర్మిషన్ ఇవ్వడానికి. నీవెవడివి ట్రీట్‌మెంట్ చేయడానికి. వెళ్లి ప్రేయర్ చేయి. అసలు ట్రీట్‌మెంట్ మాస్టరుగారే చేస్తారు. మన ప్రమేయం నామమాత్రమే. ఒకటి జ్ఞాపకంపెట్టుకో. ఎప్పుడు ఎవరికి ట్రీట్‌మెంట్ చేయాలన్న సంకల్పం కలిగినా హృదయ పూర్వకంగా మాస్టరుగారిని ధ్యానించి విన్నవించుకో. ఆ తర్వాత పని ఆయనే చేస్తారు. ఫలితం అనుకూలం కాకపోతే నిరాశపడకు. నీ శక్తి పోయిందని క్రుంగిపోవద్దు. మాస్టరుగారి అనుగ్రహం అందలేదనుకో."

హీరా వాళ్ల యింటికి నన్ను తీసుకువెళ్లాడు. బాబు బాగున్నాడు. అందంగా బొద్దుగా యాక్టివ్‌గా వున్నాడు. 'అయ్యో' అనిపించింది. 'మాట' రాదు. మాస్టరుగారి ఫోటో ఒకటి యిచ్చి ఆ ఫోటోకు తలాన్చి కూర్చోమని చెప్పి, నేను ప్రేయర్ చేశాను. ఆ కుర్రవాడు మైకంలోకి వెళ్లిపోయాడు. అలా 40 రోజులు ఆ పిల్లవాడిని చేయించమని చెప్పాను. మాట వస్తుందో రాదో నాకు తెలియదు. 40 రోజుల తర్వాత షాపుకు వెళ్లాను, హీరా ఫోన్ చేస్తే... ఆ కుర్రవాడు 'అంకుల్' అంటూ వచ్చి ప్రేమగా ఒడిలో కూర్చున్నాడు. అబ్బాయి వసపిట్టలా వాగుతున్నాడు. మంచి మంచి స్వీట్సు యిచ్చి కారులో ఇంటివరకు వచ్చి దిగబెట్టి వెళ్లాడు.

\+ + +

మా ఇంటి కాంపౌండులో పెంచలయ్య అనే అతను వుండేవారు. చాలాకాలంగా మేం ఏ ఇంట్లో వుంటే ఆ ఇంటికి దగ్గరగా తనూ ఉండడం జరిగేది. యామినీదేవికి అతని భార్య పార్వతమ్మ అంటే యిష్టం. ఒకసారి ఆమెకు గుండెనొప్పి వచ్చింది. నేనేదో రాసుకుంటున్నాను రాత్రిపూట. యామినీదేవి వచ్చి పెంచలయ్య భార్యకు గుండెనొప్పి వచ్చింది, శ్వాస పీల్చడం కష్టంగా వుంది, ఆస్పత్రికి తీసుకువెళ్లేలోగా ఒకసారి వచ్చి విభూతి పెట్టమన్నది. తను రికమెండ్ చేస్తే కాదనే ప్రశ్నే లేదు. మరీ తన హృదయం స్పందిస్తే తప్ప తను జోక్యం పెట్టుకోదు. రికమెండ్ చెయ్యదు. అప్పటికీ ఇప్పటికీ ఆమె స్వభావం అంతే. ఇప్పుడు మరీ, వచ్చేవారు అమ్మగారితో చెప్పుకుని, తర్వాత నా దగ్గరకు వస్తారు. అది వారికొక తృప్తి. అమ్మగారు చెబితే గురువుగారు కాదనరని ఒక నమ్మకం.

సరేనని రాయటం ఆపి, వెళ్లి విభూతి పెట్టి వచ్చాను. ఓ రెండుగంటలు నా రాతపని సాగింది. పడుకోబోయేముందు దొడ్లోకి వెళ్లి చూచాను, ఆమెకు ఎలా వుందోనని. భోజనాలు చేసి అంతా కబుర్లు చెప్పుకుంటున్నారు.

తర్వాత పెంచలయ్య ప్రోత్సాహంతోనే అతని భార్య రోజూ ప్రేయర్‌కు వచ్చేది. కొద్దిరోజుల్లోనే అతను వచ్చి యోగంలో చేరాడు. అతని నాడీజ్యోతిషంలో యోగం గురించి, నా గురించి స్పష్టంగా వచ్చింది. నా పేరుతో సహా వివరాలు చెప్పారు అందులో. అలా చేరిన పెంచలయ్య చివరివరకు యోగం చేస్తూనే వున్నాడు.

\+ + +

మేం గొయ్యా తోపులో వుండగా రోజూ ప్రేయర్స్ బాగా సాగేవి. పెంచలయ్య, పార్వతమ్మ, సర్వేపల్లి శంకరయ్యగారనే పెద్దాయన, శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రిగారి శిష్యుడు, రోజూ సాయంత్రం ప్రేయర్‌కి వచ్చేవారు. ఆ వీధిలోనే ఒక నర్సు వుండేది. ఆమెకు పది పన్నెండేళ్ల కూతురుంది. ఆ పిల్ల మూగ. అయిదేళ్ల వయస్సు వచ్చేవరకు ఆ పాప బాగానే మాట్లాడేదిట. తర్వాత సడెన్‌గా మాటపోయింది. మూగ అయింది. పెంచలయ్య ఆ పిల్లను తీసుకువచ్చాడు, ట్రీట్‌మెంట్ చేయాలని. అందరం కూర్చుని, మధ్యలో ఆ పాపను కూర్చోబెట్టి ప్రేయర్ చేశాం. సాయంత్రం ప్రేయరు నేను డాక్టరుగారింట్లో చేసుకునేవాడిని. ఇంటివద్ద ప్రేయరు యామినీదేవితో వచ్చినవారు చేసుకునేవారు. వసంతకుమార్, పెంచలయ్య, శంకరయ్య, యామినీదేవి, పార్వతమ్మ... వీరు అయిదుగురు ఆ పాపకు ట్రీట్ చేసేవారు. పదవరోజు వీరు ప్రేయర్‌లో వుండగా, ఆ పాపకు మాటలు వచ్చాయి.

పాప కన్నతల్లి ఆనందానికి అవధిలేదు. ఎందరో డాక్టర్లకు చూపించింది. ఎవరూ చికిత్స చేయలేకపోయారు. వైద్యానికి అలవికాని జబ్బులకు యోగం ద్వారా మాస్టరుగారి అనుగ్రహం వుంటే చికిత్స జరుగుతుందనేది స్పష్టంగా తెలిసింది. యోగచికిత్సలో మనం చేసేది పెద్దగా ఉండదు. మాస్టరుగారికి విన్నవించుకోవడమే. వచ్చేవారు పూర్తిగా 'శరణు' అంటే మాస్టర్ దయ కలుగుతుంది.

\+ + +

ఇండియా బుక్‌హవుస్ హీరా బంధువుల అమ్మాయికి ట్రీట్‌మెంట్ చేయవలసి వచ్చింది. 20 సంవత్సరాలుంటాయి. చాలా అందగత్తె. సింధీలు కదా! గదిలో పెట్టి బోల్టు వేస్తారు. బయటకొస్తే పిచ్చిగా ప్రవర్తిస్తుంది, కరుస్తుంది. నన్ను తీసుకువెళ్లారు. గది తలుపు తెరిచారు. ఆ పిల్ల కిటికీలో కూర్చుని బయటకు చూస్తోంది. నేను లోపలకు

వెళ్లగానే తలుపులు వేశారు. నాకు భయం వేసింది ... పిచ్చిపిల్ల గదిలోకి తోసి బయట గడియపెట్టినందుకు. నన్నెక్కడ పీకుతుందోనని నా భయం. నన్ను చూచి నవ్వింది.

గుండె దిటవు చేసుకుని "గుడ్‌మార్నింగ్ బేబీ" అన్నా.

"మాణింగ్, వెల్‌కం" అన్నది కిటికీ లోంచి దిగివస్తూ.

"హౌ ఆర్యూ"

"ఫైన్" వచ్చి షేక్‌హాండ్ యిచ్చింది.

"ఐ లవ్‌యూ" అన్నాను. లోగడ ఎవరినీ ప్రేమించిన పాపాన పోలేదు నేను. ఆ మాట కొత్తగా 'రింగ్' అయింది.

"ఐ టు లవ్ యూ" అన్నది చక్కని ఇంగ్లీషులో. ఇద్దరం చాలాసేపు కబుర్లు చెప్పుకున్నాం. ఆ పిల్ల చక్కగా నవ్వుతూ కబుర్లు చెప్పింది.

జరిగింది ఏమిటంటే ఆ పిల్ల ఓ అబ్బాయిని ప్రేమించింది. పెద్దలకు అది యిష్టం లేదు. పిచ్చి నటిస్తోంది. ఆ కుర్రవాడితో పెళ్లిజరిగేలా చూస్తానని హామీ యిచ్చాను. తను మామూలుగా వుంటానని ప్రామిస్ చేసింది.

ఇద్దరం బయటకొచ్చాం. తనే వెళ్లి స్నాక్స్, టీ తెచ్చింది.

పెద్దవాళ్లతో మాట్లాడాను. ఒప్పుకున్నారు. ఇలాంటి కౌన్సిలింగ్ యోగంలో భాగం అవుతుందా?! వాళ్లు అనుకున్నారు నేనేదో మంత్రం వేసి, ఆ పిల్లను బాగు చేశానని. ... ప్రేమతో సమస్యల్ని పరిష్కరించవచ్చు.

\+ + +

ఒకసారి దాసుగారు విజయవాడ నుండి మద్రాసు వచ్చారు ... ఎవరికో ట్రీట్‌మెంటు ఇవ్వడం కోసం. ఆయన తన బావమరది ఇంట్లో దిగుతారు. దాసుగారు నా దగ్గరకు వచ్చారు. ఎప్పుడు మద్రాసు వచ్చినా మా ఇంటికి వచ్చేవారు. "సాయంత్రం ఒకచోట ట్రీట్‌మెంటు చేయాలి. వెళదాం రా" అని వెంటపెట్టుకు బయల్దేరారు. మా ఇద్దరికీ కాఫీలు, సిగరెట్లు అలవాటు. దాపరికం లేదు, మొహమాటం లేదు. ఒకాయన పోలీసు సూపరింటెండెంటు, కోయంబత్తూరు నుండి వచ్చాడుట. ఆయన భార్యకు గుండెజబ్బు. దాసుగారికి తమిళం రాదు. నాకు స్వల్పంగా పరిచయం.

"శార్వరీ ! నువ్వు ట్రీట్‌మెంటు చేస్తున్నావు ఇవాళ" అన్నాడు.

"నేను చేయడం ఏమిటి! నాకేం తెలీదు" అన్నాను.

"నాకు తెలుసులే. నీవు ట్రీట్‌మెంట్స్ బాగాచేస్తావని విజయవాడ ప్రాంతంలో తెలిసిపోయింది. దాచిపెట్టకు. నీ ట్రీట్‌మెంటు ఇవాళ నేను చూడాలి. అందుకే నిన్ను తీసుకువచ్చాను" అన్నాడు.

"మాస్టర్ నీదే భారం! దాసుగారు నాకు పరీక్ష పెడుతున్నారు" అని లోపల మాస్టర్‌గారిని స్మరించి ఉపక్రమించాను. పేషెంట్‌ను పడుకోమని చెప్పి, కాస్త విభూది నొసటన పెట్టి, ప్రేయర్ చేశాను. నిమిషాలలో నాకు యాస్ట్రల్ అనుభూతి కలిగింది. ఆమె యాస్ట్రల్ శరీరమూ నాకు కనిపించింది. బ్రీతింగ్ ఎక్కువైంది. వైబ్రేషన్స్ వచ్చాయి. నా చేతులు పైకిలేచి, పేషెంటు శరీరంపైన అటు ఇటు తిరగసాగాయి. చివరకు నా చూపుడువేలు పోయి ఆమె నుదుటిని తాకింది...కొంతసేపటికి కళ్లు విప్పాను. అరగంట తర్వాతగానీ ఆమెగారికి స్పృహ రాలేదు. చిత్రంగా ఆమెకు గుండెజబ్బు తగ్గిపోయింది.

ఆమెకు తగ్గిపోయిందన్న వార్తవిని దాసుగారన్నారు.

"ట్రీట్‌మెంట్ తెలియదన్నావు. ఆమెకు పూర్తిగా తగ్గిపోయింది గదా."

"నేనేమీ చేయలేదు."

"అదే ట్రీట్‌మెంట్ రహస్యం" అన్నారు.

"అంతసేపు ట్రాన్స్‌లో వున్నాను. ఏం జరిగిందో నాకు తెలియదు"

"నీవు ట్రాన్స్‌లోకి వెళ్లగలిగావు. అదిచాలు. మిగతాపని ట్రాన్స్‌బాడీస్ చేసుకుపోతాయి. ముందుచేసిన సంకల్పమే తర్వాత ట్రీట్‌మెంట్‌గా మారుతుంది."

నేను చేసిన ట్రీట్‌మెంటు విషయం టి.నగర్‌లో వార్తలా వ్యాపించింది. ఎవరో వెళ్లి డాక్టర్‌గారికి చెప్పారు. ఆయన తలవాచేలా చీవాట్లుపెట్టారు.

"ట్రీట్‌మెంట్ చేస్తే శక్తిపోతుంది. నీవు సంపాదించిన యోగశక్తి అంతా ఖర్చయిపోతుంది. నీకేం మిగలదు. పైగా ఆ పేషెంట్ జబ్బులు, బాధలు నీకు తగులు కుంటాయి."

"పేషెంట్ జబ్బులు డాక్టర్లకు అంటుకునేట్లయితే మీ డాక్టర్లంతా.."

"షటప్. అది వేరు, ఇది వేరు. ఇది యోగా ట్రీట్‌మెంట్. దీనికి చాలా ఎనర్జీకావాలి. ప్రభాకరశాస్త్రిగారు ఎంతమందికో చికిత్స చేసేవారు. వారి బాధలు తాను స్వీకరించి, తాను అస్వస్థులై వారికి స్వస్థత కలిగించేవారు. అంత ఔదార్యం, ప్రేమ, కరుణ మనలో వున్నాయా! లేవు గదా! వారి రోగాలు మనకు ట్రాన్స్‌ఫర్ చేయమని మాస్టరుగారిని అడగగలవా!"

"అడగను డాక్టరుగారూ. వారి బాధ, జబ్బు నాలోకి బదిలీ చేసుకోకుండానే ట్రీట్‌మెంట్ చేయవచ్చు" అన్నాను. యోగా ట్రీట్‌మెంట్స్ పైనున్న అపోహల్ని తొలగించాలని, సైంటిఫిక్‌గా మార్చాలని ఆనాడే నిశ్చయించుకున్నాను.

మా వీధికి అవతల వీధిలో పెంచలయ్య స్నేహితుడు ఒకరుండేవారు. పేరు రోశయ్య., బియ్యం వ్యాపారి, అతని కూతురుకు దయ్యం పట్టింది. మంచానికి అతుక్కుపోయివుంది. ఆ పిల్లకు పెళ్లయింది కూడా. పెంచలయ్య వచ్చిఅడిగాడు ... ఆ పిల్లకు ట్రీట్ చేయమని. నేను భూతవైద్యుడిని కాను. దయ్యాలంటే తెలుసు. చిన్నప్పటి నుండి మా నాయనగారు దయ్యాల్ని వదలించడం చూచినవాడిని. అయినా దయ్యం అంటే, భూతం అంటే ఎవరికైనా భయం కలుగుతుంది. నాకు చాతకాదని చెప్పినా పెంచలయ్య వినలేదు. అతనికి నాపై గొప్ప నమ్మకం. "మీరు ఒక్కసారి వచ్చి చూడండి చాలు. దయ్యం గియ్యం పారిపోతుంది" అన్నాడు.

వెళ్లి చూచాను. కేసు ప్రమాదకరంగా వుంది. ఆ పిల్ల చూపులే వికారంగా, భయోత్పాతం కలిగించేవిగా వున్నాయి. వెళ్లాక ఏమైనా చేద్దామన్న సంకల్పం కలిగింది. విభూతి తీసుకుని ప్రేయర్ చేసి ఆమె వంటిపైన, మంచంపైన చల్లాను. నుదుట పెట్టాలంటే నాకే భయం వేసింది. తీర్థం మంత్రించి యిచ్చాను. మంత్రంలో క్షుద్రశక్తుల నిమంత్రణ ఉంటుందేమో మరి? సాయంత్రానికి ఆమె జ్వరం నార్మల్‌కు వచ్చింది. మర్నాటికి లేచి కూర్చున్నది. రెండు మూడుసార్లు ప్రార్థన.చేసి విభూతి యివ్వగానే ఆమె నార్మల్‌గా లేచి తిరగగలిగింది. మాస్టర్‌గారి యోగం సర్వకిల్బిష హారిణి, సర్వరోగ నివారిణి. ఇది అమృతయోగం అనిపించింది. ఏ రుగ్మతలకైనా అమృతం ఎలా పనిచేస్తుందో ఇదీ అంతే. అమృతతుల్యయోగం అని నాడీకారులు వర్ణించారు. కానీ సాధకుని అనుభవంలోకి వచ్చినప్పుడే దాని విలువ. ఈ యోగంలో అనేక కోర్సులు ఉన్నాయని విన్నాను. అవి ఎక్కడ దొరుకుతాయో తెలియదు. బాగా సాధన చేసి సిద్ధిపొందినవారు అనుగ్రహిస్తే తప్ప ప్రయోజనం ఉండదు. ఏ శక్తులు, సిద్ధులైనా పరంపరాగతాలే!!

\+ + +

కోర్సులు ఏవో తెలుసుకోవాలని, సాధన చేయాలని నాకు అనిపించింది. బాల సుందరరావుగారితో చెబితే "మనకు అవసరం లేదులే. ప్రేయర్ ఒక్కటి చాలు" అన్నారు.

డాక్టరుగారు కుంభకోణంలో ఎస్.ఆర్.బి.వి.గారి శిష్యులు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అడుగుజాడలలో నడిచేవారు. శ్రీ వేటూరివారు కోర్సులు అవసరం లేదని చెప్పేవారుట. జనరల్ ప్రేయర్ ఒక్కటే చాలని వారిమతం. బాల సుందరరావుగారికి కోర్సులుచేస్తే ఏమవుతామోనన్న భయం వుండేది. అడయారు శంకరయ్యర్ గారు కూడా, "ఆ కోర్సులు, రెగ్యులేషన్స్ మీ అందరికోసం కాదు. మా వంటి డైరెక్టు మీడియమ్స్ కోసం. మేం అన్నీ చేసి, వాటి ఫలితాన్ని మీకు అందిస్తున్నాం. మీరు చేయనవసరంలేదు" అని

స్పష్టంగా చెప్పేవారు. వాళ్లు చేశారు గదా. మనం చేస్తే తప్పేమిటని నా వాదన. వాళ్లు కడుపునిండా తిన్నారు. మనకు కడుపు ఎలా నిండుతుంది. మనము తింటే కదా, మనకు తృప్తి. బాలసుందరరావుగారు, శంకరయ్యర్‌గారు వాదించి, వాదించి చివరకు "నీ నీ యిష్టం చేస్తే చేసుకో పో" అన్నారు. ఎవరు చెబుతారు? ఎవరి దగ్గర వున్నాయి కోర్సులు?

ఆఫీసుకు వెళ్లాను. ఒకాయన వచ్చారు. ఆయన జి.కృష్ణగారికి మిత్రులు. కృష్ణగారు డెయిలీన్యూస్ ఎడిటర్ అప్పుడు. నేను వీక్లీలో వుండేవాడిని. ఆయన నాగురించి, విచారించి శార్వరిని చూడటానికి వచ్చాను. పరిచయం చెయ్యి అని అడిగాడు. ఆయన మా సెక్షన్‌కు వచ్చాడు. నేను ప్రెస్‌లోకి వెళ్లి వున్నాను. ఆర్టిస్టు ముద్దా పార్వతీశం నా వద్దకు పరుగెత్తుకు వచ్చి "మాస్టరుగారు మీకోసం వచ్చారు మీ సీటుదగ్గర వున్నారు" అన్నాడు.

'మాస్టరుగారు రావడం ఏమిటి పార్వతీశం' అన్నాను. అతనికి నా యోగం గురిచి తెలుసు. బాలసుందరరావుగారికీ అతను తెలుసు. వాళ్ల నాన్నగారుచందమామలో ఎడిటర్.

"మాస్టరుగారు నువ్వూ, నేనూ పుట్టకముందే పోయారు. ఎవరిని చూచి ఎవరనుకున్నావో!" అన్నాను.

"కాదు మాస్టరుగారే.." అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసి నాసీటు దగ్గరకు వెళ్లాను. నా కళ్లు నన్ను మోసం చేశాయి. నా టేబుల్ దగ్గర మాస్టర్‌గారే నిలబడి వున్నారు. పట్టుధోవతి లుంగీగా కట్టుకున్నారు. అవే మీసాలు. అదే బట్టతల... అయినా మాస్టరుగారు అయివుండరు. "మీరు?" అని ప్రశ్నించి కూర్చోమన్నాను.

"నీవు శార్వరి... అవునా! నాపేరు నారాయణరావు. గుంటూరు. అడ్వొకేట్‌ని. నీ కోసమే వచ్చాను."

కాస్సేపు యోగ విషయాలు మాట్లాడుకున్నాం. "సాయంత్రం వచ్చి కలుస్తాను ఎక్కడ వుంటారో చెప్పండి" అన్నాను.

చెప్పాడు. సాయంత్రం వారు బసచేసిన ఇంటికి వెళ్లి కలిశాను. యోగా గురించి బాగా తెలిసిన వ్యక్తి. లాయర్‌గా ప్రాక్టీసు వద్దనుకుని మానివేశాడు. యోగమే జీవితం. అంతలా యోగానికి అంకితమై పోయిన వ్యక్తి.

దాసుగారు నాగురించి చెప్పాడట. నారాయణరావుగారే ప్రిలిమినరీ కోర్సులు రాసి పంపారు. ఎలా చేయాలో చెప్పారు. అలా కోర్సులు చేయడం ఆరంభించాను.

ఉత్తినే ప్రేయర్ చేయడానికి, కోర్సులు చేయడానికి ఎంతో తేడా వుంది. కోర్సులు చేస్తే ఎంతో శక్తి, ఉత్సాహం, పూర్ణత్వం లభించిన అనుభూతి కలుగుతుంది.

.దిడుగు నారాయణరావుగారితో స్నేహం అలా చివరివరకు సాగింది. నన్ను ఆత్మీయుడుగా భావించారు. గుంటూరు , విజయవాడ ప్రాంతంలోని యోగసాధకులకు నా గురించి విస్తృతంగా ప్రచారం చేసింది వారే. నన్ను వారి సమావేశాలకు ప్రత్యేకంగా ఆహ్వానించి సముచిత స్థానం యిచ్చారు. పెద్దపీట వేశారు.

\+ + +

ఏవైనా నిదర్శనాలు కనిపిస్తే తప్ప ప్రజలకు నమ్మకం కలగదు. మహత్తులు ప్రదర్శిస్తే తప్ప మహాత్ముల్ని గుర్తించరు. భగవంతుని ఉనికిని, భగవచ్ఛక్తిని లోకానికి ఎరుకపరచడానికే మహాత్ములు అప్పుడప్పుడు అపూర్వసంఘటనలు కల్పిస్తుంటారు. నిదర్శనాలు చూపిస్తారు. అద్భుతాలు సృష్టిస్తారు. మాస్టరుగారు ఒక్కోవ్యక్తికి ఒక్కోప్రత్యేకపని అప్పగిస్తారనిపిస్తుంది. నా యోగకార్యానికి నేను నిర్వహించవలసిన పనేదో నాకు నిర్దేశించారు. అన్ని పనులు ఒక్కరే చేయలేరు. ఒక వ్యక్తి చేస్తున్న పనిలో మరొకరు జోక్యం చేసుకోనవసరంవుండదు. కార్యనిర్వహణలో మన ప్రతిభ ప్రధానం కాదు. మన అర్హత. నీకు ఏ పని చేయడానికి సమర్థత, నేర్పరితనం వుంటుందో, ఉత్సాహం వుంటుందో ఆ పని అప్పగించడం వల్ల మేలు జరుగుతుంది.

\+ + +

ఒంగోలు ప్రాంతంలో ఉప్పుగుండూరులో రోశయ్యగుప్త అని ఒకాయన వున్నారు. ఆయన మాస్టర్ ఎం.ఎన్.గారి శిష్యుడు. నా పుస్తకం చదివి, నేను చేస్తున్న యోగకార్యం గురించి విని నన్ను చూడాలని, కలుసుకోవాలని ఉవ్విళ్లూరి ఒకపరి మద్రాసు వచ్చాడు. అది నవంబరు నెల, మద్రాసులో వర్షాలు దండిగా కురుస్తున్నాయి. సాయంత్రం పూట వచ్చి, ఆ ప్రాంతంలో తిరిగి తిరిగి ఇల్లు దొరక్క వెళ్లిపోయాడు. మర్నాడు ఉదయం తన అల్లుడిని తీసుకుని బయలు దేరాడు. వర్షం జోరుగా వుంది. బయటకు మనిషి రావడం లేదు. నేను కిరాణాషాపుకు పనిబడి వచ్చాను. తిరిగి ఇంటికి వెడుతుండగా, ఇద్దరు వ్యక్తులు నా వెనకగా వచ్చి పలకరించారు. వారిని ఎప్పుడూ చూచిన జ్ఞాపకం లేదు. "నమస్కారం శార్వరిగారూ" అని పలకరించడంతో వారికి నేను తెలుసునేమో అనుకున్నాను.

"నాపేరు రోశయ్యగుప్త. ఈ అబ్బాయి నా అల్లుడు" పరిచయం చేసుకున్నారు.-

"వర్షంలో వచ్చారు! ఇబ్బందిపడి వుంటారు."

ఇంటికి చేరాక చెప్పారు "నిన్న సాయంత్రం వచ్చి తిరిగి తిరిగి వెళ్లిపోయాం. మళ్లీ ఇప్పుడు వచ్చాం. ఇల్లు దొరకలేదు. విసుగుపుట్టి వెళ్లిపోదామని నిర్ధారించుకుని మాస్టరుగారికి నమస్కారం చేసుకున్నాను. అంతలో ఒక వృద్ధుడు. మా ప్రక్కన నిలబడి, "అదిగో, ఆ వెళ్లేదే శార్వరి. వెళ్లి కలవండి" అని చెప్పారు. ఇటు మీ వైపు చూచి మళ్లీ అటు తిరిగేలోగా ఆయన అంతర్ధానం అయినాడు.

"ఆయనే మాస్టరుగారు. వృద్ధునిరూపంలో మీకు కనిపించారు. అదృష్టవంతులు" అన్నాను.

"ఇన్నేళ్లుగా యోగం చేస్తున్నాను. ఎప్పుడూ కన్పించలేదు. మీకోసం వెతుకుతుంటే మాస్టరుగారు కనిపించారు" అన్నాడు.

" అదే విచిత్రం. నాకోసం వచ్చినవారికి మాస్టరుగారు దర్శనమిస్తారు. మాస్టరుకోసం వెదికేవారికి నేను తటస్థపడతాను. విచిత్రంగా వుంది కదూ".

\+ + +

మద్రాసులో నాకో మిత్రు డుండేవాడు. ఇప్పటికీ వున్నాడు. అతనిపేరు మంథా గోపాలకృష్ణ. ఎం.ఏ. చదివి ఎక్కిరాల వేదవ్యాసకు పి.ఎ.గా పనిచేశాడు. ఉద్యోగం పోయింది. నాటకాలు, సినిమాలు- వేషాలు వేసేవాడు. ఇప్పుడు అతను హోమియో డాక్టరు, స్ట్రీట్ డాక్టరుగా ప్రసిద్ధుడైనాడు. మద్రాసులో గొప్పవారికి వైద్యంచేస్తాడు. రిక్షావాళ్లకు, ముష్టివాళ్లకు చేస్తాడు. కార్లలో వచ్చినా, కాలినడకన వచ్చినా అతను మాత్రం పానగల్ పార్కుపక్క పుట్‌పాత్‌పైనే కనిపిస్తాడు. అతనికీ నాకూ స్నేహం. థియోసఫిస్టు. పిచ్చిగా చదివాడు. ఒకసారి హిందూలో బుద్ధపూర్ణిమ రోజున, హిమాలయాల్లో ఒక లోయలో బౌద్ధభిక్షువులకు బుద్ధజ్యోతి దర్శనం అవుతుందని చదివాం. హిమాలయాలకు, ఆలోయకు వెళ్లకుండా, ధ్యానంలో, సూక్ష్మశరీరాలతో జ్యోతిని దర్శించాలని అనుకున్నాం. పౌర్ణమినాడు ఇద్దరం రాత్రి పన్నెండు గంటలకు ధ్యానంలో కూర్చున్నాం. ఇద్దరికీ తెలుసు... యాస్ట్రల్ బాడీని ఫిజికల్ శరీరం నుండి ఎలా వేరుపరచాలో. అయితే అలా వేరైన సూక్ష్మశరీరం, నిర్ణీతసమయంలో తిరిగితే రావాలి. అలా రాకుండా దానిపాటికి అది వెళ్లిపోతే ఇక్కడున్న శరీరం శవమైపోతుంది. ఒక సన్ననిదారంలాంటి వెలుగుదారం సూక్ష్మ శరీరానికి, స్థూల శరీరానికి 'లింక్'గా వుంటుంది. పై లోకాలలో సంచారం పూర్తికాగానే సంకల్పిస్తే చాలు అది తిరిగివస్తుందని సూత్రం. ఇద్దరం మూడుగంటలకు పైగా ధ్యానంలో ఒళ్లుమరచి కూర్చుండిపోయాం.. సంకల్పం చేయడానికి 'బుద్ధి' పనిచేస్తేగద! భౌతిక శరీరాన్ని వదలి సూక్ష్మశరీరం పైకిపోగానే 'బుద్ధి' నశించింది. చచ్చాం. తిరిగిరావడం

జరగదు. చచ్చిపోయినామనే అనుకున్నాం. తెలతెలవారుతుండగా నాకు చైతన్యం కలిగింది. కళ్లు తెరిచాను. అతని పరిస్థితి నాలాగే ఉండి వుండాలి. భౌతికంగా 'టచ్' యిస్తే సూక్ష్మశరీరం వచ్చి చేరుతుందని నాకు తెలుసు. అతన్ని నెమ్మదిగా సహస్రారంలో 'టచ్' చేసి పిలిచాను. లేచాడు. బ్రతుకు జీవుడా అనుకున్నాం. సూక్ష్మ శరీరంతో రోదసిలో పయనించడం అనుభవంలోకి వచ్చింది.

ఈ అనుభవాలు మా గురువుగారికి గానీ శంకరయ్యర్‌కి గానీ చెప్పేవాడిని కాను. ఇద్దరికీ కోపమే. చిటపటలాడేవారు. అయితే నా పుస్తకం డిస్కవరీ వచ్చాక శంకర అయ్యర్‌గారితో సాన్నిహిత్యం ఎక్కువైంది. ఆయన వద్దనున్న ప్లానెటరీ కోర్సులు అచ్చు పుస్తకాలు చూచాను. తర్వాత నాకే యిస్తానని ప్రామిస్ చేశాడు. నేను ఇనీసియేషన్ చేయడానికి, ట్రీట్‌మెంట్స్‌చేయడానికి అనుమతించారాయన."మాస్టర్‌గారి తరఫున నీకు అనుమతి యిస్తున్నాను" అన్నారు. అది నా అదృష్టం. మాస్టరుగారు మంచి శిష్యులలో త్వమేవాహంగా వుంటారు. మద్రాసులో ఉండగా పరిచయాలు పెంచుకోడానికి హస్తసాముద్రికం బాగా పనికొచ్చింది. శంకరయ్యర్‌గారి అబ్బాయి చిన్నఉద్యోగం చేస్తుండేవాడు. ఆయనకు కొడుకు బెంగ. వాడు బాగుపడాలి. పైకి రావాలి. వాడు రాడు. తండ్రిని డబ్బిమ్మని వేధించేవాడు. ఆయన కోడలు మంచి అమ్మాయి. నా చేత ఆమె చేయి చూపించాడు. కొడుకు చేయి చూపించాడు. వెంటనే అతన్ని ఉద్యోగం మాని సొంత బిజినెస్ పెట్టమని చెప్పాను. చెప్పిన మాట విని, వెంటనే రిజైన్ చేశాడు. చిన్న ఇండస్ట్రీ పెట్టాడు. నా కళ్లముందే లక్షలు గడించాడు. ఆ తండ్రికి అది తృప్తి. కొడుకు ప్రయోజకుడైనాడు.

శంకరయ్యర్‌గారికి 'ఈగో' ఎక్కువ. తాను యోగంలో పండిపోయానని అనుకునేవాడు. తన దగ్గరగా ఎవరినీ ప్రేయర్‌కి కూర్చోనివ్వడు. తనలోంచి వచ్చే కరెంట్‌కు షాక్ కొట్టి పడిపోతారని భయపెట్టేవాడు. నిజమో కాదో నాకు తెలియదు గానీ, ఎవరూ ఆయన దగ్గరగా కూర్చునేవారు కాదు. ఆ విషయం తెలిసి ఒకసారి నేను ఆయన ప్రక్కనే కూర్చున్నాను. నన్ను భయపెట్టాడు. నేను మొండివాడిని. అక్కడే కూర్చున్నాను. నా ప్రేయర్ గంటసేపు సాగింది. పడిపోలేదు. ఆయనగారే కూర్చోలేక, పదినిమిషాలకు లేచి వెళ్లిపోయాడు.

\+ + +

విజయవాడ నుండి కవులూరి సీతారామయ్యగారు, మన్నవ హనుమంతరావు, గూడూరు నమశ్శివాయ, దాసు ఇలా ఎవరు కుంభకోణం వెళ్లి వస్తూ, మద్రాసులో దిగినా

శంకరయ్యర్‌ను, బాలసుందరరావుగారినీ, నన్నూ కలుసుకునేవారు. నేను కుర్రవాడిని గనుక, తమ వెంట పెట్టుకు తిప్పేవారు. ఇటు ఆంధ్రప్రాంతపు యోగసాధకులకు మద్రాసువారికి మధ్య నేను వారధిలా పనిచేశాను. నేను అందరితో ఇష్టంగా వుండేవాడిని. వారికీ నేనంటే ఇష్టం. ఒకసారి విజయవాడలో దాసు గారింట కొత్త రామకోటయ్యగారి పరిచయం కలిగింది అప్పట్లో.

వెలుగు వెనక చీకటి, మంచిమాటున చెడు పొంచి వుంటాయి. గురజాలలో యోగసమావేశాలు జరుగుతున్నాయి. రమ్మని నారాయణరావుగారి నుండి ఆహ్వానం వచ్చింది. అప్పటివరకు యోగసమావేశాలు ఎలా వుంటాయో, ఎలా జరుగుతాయో నాకు తెలియదు. ఉత్సాహంకొద్దీ ఒకవారం సెలవుపెట్టి బయలుదేరాను. గురజాల ప్రాంతం ఎప్పుడూ వెళ్లలేదు. తెనాలి వరకు రైలు, గుంటూరు నుండి మాచర్ల రైలు. రాత్రి ఏడుగంటలకు గురజాల చేరాను. కొత్తఊరు. ఓ మైలు నడిచి నారాయణరావు గారి సోదరుడు చంద్రశేఖరరావుగారింటికి చేరుకున్నాను. నాకు తెలిసినవారు లేరు. యోగ సంబంధీకులు ఎవరూ రాలేదు. తెల్లవారితే సమావేశం. రాత్రికి హోటల్ భోజనం. వరండా నిద్ర. యోగ సమావేశానికి వచ్చిన వ్యక్తి అనే ఆదరణ లేదు. చాలా నిరాశ కలిగింది. మర్నాడు ఒక్కొక్కరే రాసాగారు. అంతా చుట్టుపక్కలవారే. దూరం నుండి వచ్చింది నేనే. ఊళ్లో లాడ్జీలు లేవు. ఫేనెల. పిడుగురాళ్ల ఎండలు చెప్పనవసరం లేదు. నిప్పులు చెరిగే ఎండలు.

ప్రేయర్స్‌కు నరసారావుపేట జొన్నలగడ్డ కృష్ణమూర్తి ఆధ్వర్యులు. ఆయన రాలేదు. కాసేపు దాసు, మరికాసేపు సీతారామయ్యగారు కోర్సులు చేయించారు. పి.ఎస్.ఆర్ శర్మ, కొత్త రామకోటయ్యగారు చాలా మంది వచ్చారు. ఒక వందమంది పైగా వచ్చారు. నారాయణరావు గుంటూరునుండి ఎవరో విశ్వనాథ శాస్త్రిని వెంటపెట్టుకు వచ్చారు. ఆయనకు దివ్యదృష్టి వుందిట. మధ్యాహ్నం భోజనాల సమయంలో ఒక ప్రహసనం జరిగింది. బ్రాహ్మలంతా స్నానాలు చేసి, మడికట్టుకుని లోపలగదిలోకి రండని ఆహ్వానించారు. శూద్రులకు బయట వరండాలో వడ్డిస్తారుట. నాకు తల తీసినట్లయింది. యోగంలోకి వచ్చినా వీరికి బ్రాహ్మలు, శూద్రులు అన్న తేడా ఏమిటి? బ్రాహ్మలు కాని వారంతా శూద్రులా? నేను హోటల్‌కెళ్లి భోజనం చేసివస్తానని నారాయణరావు గారికి చెప్పాను. కడపనుండి ఒక ముస్లిం, హైదరాబాదు నుండి ఒక క్రిస్టియన్ వచ్చారు. వారు నాకోసం వచ్చారు పాపం.

ఓ అరగంటసేపు లోపల చర్చలు జరిగాయి. దాసుగారు వచ్చి, "అదేం లేదు

శార్వరిగారూ. ఇక్కడ అలవాటు ఇది. మీరు మాతోపాటు లోపలే కూర్చోవచ్చు...రామకోటయ్య వరండాలో కూర్చుంటాడు" అన్నాడు.

"రామకోటయ్యగారు మనందరికంటే పెద్దవారు, యోగంలో సీనియర్. వారిని బయట కూర్చోమనడం అవమానించడమే అవుతుంది. మీరు భోజనాలు మడిగా కానివ్వండి. మేం హోటల్‌కు వెళ్లి తింటాం" అని మొండికెత్తాను.

ఎంతోకాలంగా వస్తున్న మడి, ఆచారం ఆరోజుతో పోయాయి. "లేదు. సమావేశాలలో సమారాధన దృష్టి వుండాలి. పంక్తి భోజనాలు మంచిది. అందరం కలిసే కూర్చుందాం" అని నిష్ణయించారు. ఎంత నిర్ణయించినా వారిమనస్సులో 'మైల' కలిసింది. మా మనసుల్లో బాధ మిగిలింది. అవమానం బయటపడకుండా నిగ్రహించుకున్నాం.

సాయంత్రం ప్రేయర్‌వేళకు నరసరావుపేట నుండి జొన్నలగడ్డ కృష్ణమూర్తి వచ్చారు. ఆయన కోర్సులు చాలా క్రమశిక్షణతో చేయించారు. చాలా అనుభవం వుంది. మంచి డిసిప్లిన్ వుంది. ప్రార్థనకు కూర్చోబోతుండగా, ఊళ్లోని భక్తులు కొందరు వచ్చారు. ప్లీడరుగారింట వేడుక. యోగం అంటే ఆసక్తి. అందరం జనరల్ ప్రేయర్ చేస్తుండగా ఆ వచ్చిన వారిలో ఒకనికి పూనకం వచ్చింది. అతను 'రాం, రాం' అంటూ కుప్పిగంతులు వేయసాగాడు. అతను ఆ ఊరిలో గొప్ప రామభక్తుడట. ఒంటినిండా నామాలున్నాయి. ఆయన్నగారిని ఉపశమింప చేయడానికి నారాయణరావు, దాసు ప్రయత్నించారు. ఊహు, వారివల్ల కాలేదు. అతను హనుమంతుని వలె చేతులుమోడ్చి, 'రాం, రాం' అంటూ నృత్యం చేయసాగాడు. వీరి మాట అతని చెవినిపడడం లేదు. రామకోటయ్యగారు ప్రయత్నించారు. ఇంక కోర్సులు చేసినట్లేనని కృష్ణమూర్తిగారు నిరాశగా కూర్చున్నారు.

పెద్దలంతా నాదగ్గరకు వచ్చి "శార్వరీ! నువ్వు ప్రయత్నించు" అన్నారు.

"నేనేమీ చేయను. నేను ఒక అతిథిగా వచ్చాను. మీరు చేసుకోండి" అన్నాను. నాకు లోపల అవమానం మంట రేపుతోంది. గుంటూరు నుండి వచ్చిన మహాత్ముని వల్ల కాలేదు. చివరకు అందరి అభ్యర్థనపై నేను పూనుకున్నాను.

రామభక్తుడు మాస్టరుగారి ఫోటోముందు బైఠాయించి రామభజన చేస్తూనే వున్నాడు. నేను మాస్టర్‌గారికి నమస్కారం చేసుకుని ఆయనెదురుగా నిలబడి, భుజంమీద తట్టాను - "హనుమా లే" అన్నాను. మూడుసార్లు పిలిచాను. అతను లక్ష్యపెట్టలేదు. "హనుమా, నీ రాముణ్ణే వచ్చాను లేవయ్యా. నీ భక్తికి మెచ్చాను కళ్లు విప్పు" అన్నాను. అతను కళ్లు విప్పి నా వేపు చూచాడు.

"రామా, రామా, నన్ను కరుణించావా రామా? ఈ భక్తుడిని కనికరించావా

స్వామీ" అంటూ నా పాదాలపై పడ్డాడు. "హనుమా నీ ఎదురుగా వున్న ఫోటో చూడు. అందులో నీ రాముడున్నాడు. కనిపిస్తున్నాడా లేదా! త్రేతాయుగంలోని నీ రాముడే ఇప్పుడు మాస్టరుగారు. చెప్పు. 'మాస్టరు సి.వి.వి. నమస్కారం' అని చెప్పు" అన్నాను. అలా మాస్టర్‌గారికి నమస్కారం చేయగానే అతని ఉద్రేకం తగ్గింది. నార్మల్ అయ్యాడు. మాతో కలిసి ప్రేయర్ చేసుకుని వెళ్లిపోయాడు. అందరికళ్లు నామీదే. వారందరిలో నాకో ప్రత్యేకత ఏర్పడ్డది.

వారంరోజులు సమావేశాలు అన్నారు గానీ, మర్నాటికే కొందరికి రక్తవిరోచనాలు. వచ్చి వెళ్లిపోయారు. కొందరికి జ్వరాలు వచ్చి జారుకున్నారు. మూడవరోజుకు 30 మంది మిగిలాం. మూడవరోజు రాత్రి, దిడుగు నారాయణరావు గారు ఒళ్లు మంటలెత్తి పరుగులు తీశారు. ఎన్ని బిందెల నీళ్లుపోసినా తగ్గలేదు. అర్ధరాత్రి బస్సెక్కి గుంటూరు వెళ్లిపోయారు.

మర్నాడు ఉదయం ప్రార్థనతో సమావేశాలు చాలించారు. డాక్టర్ కందేపు సుబ్రహ్మణ్యంగారితో అప్పుడు పరిచయం కలిగింది. ఆయన మాస్టర్ ఎం.బి.ఎస్. గారికి స్నేహితుడు. పిడుగురాళ్లలో డాక్టరుగా ప్రసిద్ధుడు. ఆయన పిడుగురాళ్ల వచ్చి వెళ్లమని కోరారు. అంతకుముందు వారిని చూడకపోయినా వారిగురించి నాకు తెలుసు. నా గురించి వారికీ తెలుసు. మంచి వ్యక్తి. సహృదయులు. తర్వాత కాలంలో వారు నరసరావుపేటలో వారి కుమారుడు అచ్చయ్యగారింట ఉన్నప్పుడు చాలాసార్లు కలిసి, ప్రేయర్ చేసుకోవడం జరిగింది.

గురుజాలలోని అనుభవానికి భిన్నమైన అనుభవం అవమానం పిడుగురాళ్లలో కలిగింది. దాసుగారు, నేను కలిసివెళ్లాం పిడుగురాళ్లకు. అక్కడి ఆశ్రమం, ఎంబిఎస్‌గారిల్లు పక్కపక్కనే. నాగరాజు ఆధ్వర్యంలో నడుస్తోంది. అక్కడి యోగాశ్రమంలో మధ్యాహ్నం ప్రేయర్ చేసుకున్నాం. మాస్టరుగారి పాదుకలున్నాయి అక్కడ! ఏ మాస్టర్‌గారివో? భోజనాల సమయంలో మళ్లీ వివక్ష. గురుజాల వచ్చిన యోగమిత్రులు పిడుగురాళ్ల ఆశ్రమం చూద్దామని వచ్చారు. వారిలో బ్రాహ్మల్ని మాత్రం భోజనానికి లేపారు. మిగిలినవారికి కడగా, తర్వాత వడ్డిస్తారుట. నాకు మండిపోయింది. వీరివల్ల యోగం విస్తరించదు, నశిస్తుంది. జీవితంలో ఈ పిడుగురాళ్ల సెంటర్‌కు రాకూడదని, ఈ జనంతో కలవకూడదని నిర్ణయించుకున్నాను. డాక్టర్ సుబ్రహ్మణ్యంగారు వచ్చి, తమ ఇంటికి తీసుకువెళ్లారు. వారికి ఆ పూట అతిథిగా వున్నాను. ఆ సాయంత్రం పి.ఎస్.ఆర్. శర్మ, నేను కలిసి తాడేపల్లి వెళ్లాం. ఆ రోజు రాత్రి వారి గెస్టుని. మర్నాడు ఉదయం విజయవాడ వెళ్లి

దాసుగారిని, సీతారామయ్యగారిని కలిసి, సాయంత్రానికి తెనాలికి వెళ్లిపోయాను. తెనాలి స్వగ్రామం. అమ్మానాన్న అక్కడే వున్నారు. చాలామంది కాలేజీమిత్రులున్న ఊరు.

\+ + +

యోగంలో చేరాక మద్రాసులో జీవితం ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగానే సాగింది. పెద్దగా కోరికలు లేవు. సినిమాలకు స్వస్తి పలికాను. అధికంగా సంపాదించాలన్న ఆశ లేదు. జీతం కుటుంబానికి చాలేది కాదు. మొత్తం 350 రూపాయలు వచ్చేవి. పిల్లల చదువులు, ఖర్చులు ఎక్కువైనాయి. ఏదో మాస్టగుగారే మార్గం చూపిస్తారన్న ఒక పెద్ద నమ్మకం. కష్టాలు, కన్నీళ్లు లేకపోయినా, జీవితంలో బాధ్యతలు, బరువులు వుంటాయి కదా! రెండు సినిమాపత్రికలకు రచన చేసిపెట్టేవాడిని. నాలుగైదు వందల వరకు వచ్చేది. మాస్టరుగారి పుస్తకం 'ది డిస్కవరీ ఆఫ్ మాస్టర్‌యోగా'తో స్వంత పబ్లికేషన్ మొదలైంది. పుస్తకాలు వేయడం వల్ల పెద్దగా లాభాలు రావుగానీ కాలక్షేపం అవుతుంది. కాలం గడిచి, అమ్మకాలు బావుంటే లాభం వుంటుంది. మాస్టరుగారి పుస్తకం బాగా అమ్ముడుపోయింది. దానికితోడు నా 'హస్తసాముద్రిక సర్వస్వమ్' అప్పుడే అచ్చువేశాను. చిన్న చిన్న పార్టులు మూడు. ఒకే వాల్యూమ్‌గా వేయడానికి పెట్టుబడి లేక. కృష్ణావతారం పుస్తకం కూడా అప్పుడే వేశాను. అలా పుస్తక ప్రచురణ నాకు సైడ్‌బిజినెస్ అయింది. మొత్తంమీద సంపాదన ఇంటి ఖర్చులకు సరిపోయేది.

అప్పుడే ఒక విచిత్రం జరిగింది. మాస్టర్‌యోగ పుస్తకం చదివి తెనాలి ప్రాంతం నుండి ఒకతను ఉత్తరం రాశాడు. తాను ఆ పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేయదలచినట్లు. నేను తెలుగువాడినని అతనికి తెలియదు! ఒప్పుకునేవాడిని కాదు కాని, అతని దైన్యస్థితి తెలిసి సరేనన్నాను. అతను ఇంజనీరింగ్ విద్యార్థి. బి.ఇ. రెండవ సంవత్సరంలో జబ్బున పడ్డాడు. వెన్నుపూస క్రిందిభాగంలో ఆపరేషన్ చేశారు. మంచంలోంచి లేవలేడు. లేచి కూర్చోలేడు పాపం! రెండు సంవత్సరాలు అలా మంచంపట్టి వున్నాడు. మాస్టర్‌యోగ పుస్తకం చదవ నారంభించిన రోజునే అతనికి కొత్త ఉత్సాహం కలిగింది. కాస్త లేచి కూర్చోగలిగాడు. పుస్తకం ఓ వారం రోజుల్లో చదవడం పూర్తి చేశాడు. ఆ వారంరోజుల్లో అతను లేచి కాస్త ఇంట్లో తిరిగే శక్తి వచ్చింది. తన పనులు తాను చేసుకుంటూ సాటివారితో కబుర్లు చెప్పకోగలిగాడు. ఆ స్థితిలో నాకు ఉత్తరం రాశాడు. తనకు అనువాదం చేయగలశక్తి లేకపోయినా, చేయాలనే ప్రేరణ కలిగిందని ఆ ప్రేరణ మాస్టర్‌గారినుండే వచ్చిందని రాశాడు. సరే నన్నాను. అయితే ఒక్కొక్క అధ్యాయం తెలుగు అనువాదం నాకు పంపాలని, నా అనుమతి లేకుండా దానిని ప్రచురించ వీలులేదని కండిషన్ పెట్టాను.

అతను అనువాదం మొదలెట్టాడు. పేజీ, రెండుపేజీలు రాసేవాడు. పుస్తకం రాయడం మొదలైన రోజు నుండి అతని ఆరోగ్యం మెరుగుకాజొచ్చింది. రెండునెలల్లో రాయడం పూర్తి చేశాడు. పూర్తి ఆరోగ్యం చేకూరింది. రెండు సంవత్సరాలుగా మంచానికి అతుక్కుపోయిన మనిషి, లేచి ఊళ్లకు వెడుతున్నాడు. మద్రాసు వచ్చి నన్ను కలిశాడు. ఆ పుస్తకం అచ్చువేద్దామని కోరాడు. నేను చెప్పాను, "నీ అనువాదం ఏమీ బాగా లేదు. నేను తెలుగువాడినని నీకు తెలియక ప్రయత్నించావు. తీరిక చేసుకుని నేనే రాసిపెడతాను. నీ పేరున అచ్చువేస్తాలే." 'మాస్టర్ యోగదర్శిని' ధనాభావం వల్ల మొదట రెండు పార్టులుగా అచ్చువేశాను. బాగాపోయింది. ఎప్పడో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి 'ప్రజ్ఞాప్రభాకరం' తప్ప మాస్టర్ యోగ సంబంధమైన పుస్తకం తెలుగులో రాలేదు. కొత్త రామకోటయ్యగారి 'భ్రూక్తరహిత తారక రాజయోగం' వచ్చిందని విన్నాను. కాని ఎక్కడా కాపీలు దొరకలేదు.

అప్పట్లో శ్రీ ఎక్కిరాల కృష్ణమాచారిగారు మద్రాసు వచ్చారు. శ్రీ వేదవ్యాస నాకు తెలుసు. వారు మద్రాసులో వుంటుండేవారు. మాస్టరుగారి యోగమే చేస్తుండేవారు. మా యోగజర్నల్‌కూ ఓ వ్యాసం రాసి పెట్టారు. అప్పుడప్పుడు మా ఆఫీసుకు వచ్చేవారు... పిలకా గణపతి శాస్త్రిగారి కోసం. గణపతిశాస్త్రిగారు నా సహోద్యోగి. పక్కపక్క సీట్లు మావి. వేదవ్యాసగారికి ఆయన మద్రాసులో ప్రియశిష్యుడు, ఏకైకశిష్యుడు కూడా. గణపతి శాస్త్రిగారు అరవిందుని యోగంలోని వారు. వేదవ్యాసకు దగ్గరైనాడు. వేదవ్యాసను విమర్శించేవాడు. ఆయన వచ్చి పిలిస్తే కాదనకుండా వెళ్లేవాడు. వేదవ్యాస కృష్ణమాచారి గారి తమ్ముడు.

ఇ.కె.గారి మద్రాసు సభను నిర్వహించే బాధ్యత ముదిగొండ లింగమూర్తిగారు తీసుకున్నారు. ఆయన మా గురువుగారికి దగ్గరవాడే. ఈయన అల్లుడు చంద్రమోహన్‌కు దగ్గరబంధువు. లింగమూర్తి వచ్చి ఇలా మాస్టర్ ఇ.కె. వస్తున్నారు, మీరు రావాలని డాక్టరుగారిని అడిగారు. డాక్టరుగారు మండిపడ్డారు. 'మాస్టర్ ఇ.కె.' అనడం ఆయనకేం నచ్చలేదు. ఒక్క సి.వి.వి.గారిని తప్ప ఈ యోగంలో ఎవరినీ మాస్టర్ అనడం ఆయనకు నచ్చదు. తన గురువు సర్వవినే ఆయన అనడు. మాస్టరు ఇ.కె.గారి శిష్యుడు ఒకరు ఆఫీసుకు వచ్చి నన్ను ఆహ్వానించి వెళ్లాడు. ఇష్టం లేకపోయినా, జర్నలిస్టుగా వెళ్లదలిచాను. డాక్టరుగారు, నేను కలిసే వెళ్లాం. టి.నగర్‌లోనే శంకరమఠంలో మీటింగ్. ఓ నలభై, యాభైమంది వచ్చారు. మేం కాస్త ఆలస్యంగా వెళ్లాం. అప్పటికి వారి ఉపన్యాసం ముగింపుకు వస్తోంది. ప్రక్కన మాస్టరుగారి ఫోటో వుంది. మేం ఇద్దరం దూరంగా వారికి కనిపించకుండా కూర్చున్నాం.

ఉపన్యాసం ముగిసిన తర్వాత ఒక్కొక్కరే ఇ.కె.గారికి పాదాభివందనం చేయసాగారు. ఆయన శిష్యులు, లింగమూర్తి వచ్చినవారిని 'వెళ్ళి మాస్టరుగారికి పాదాభివందనం చేయండి" అని బలవంతం చేశారు. డాక్టరుగారికి బి.పి. పెరిగిపోయింది. 'ఎవరి కెవరూ గురువు కాదు, యోగంలో అందరు సాధకులు మాస్టరుగారికి సమానులే' అది డాక్టరుగారి నమ్మకం. లింగమూర్తి వచ్చి 'రండి, మాస్టర్‌గారికి నమస్కారం చేసి ఆశీస్సులు తీసుకోండి' అన్నాడు. డాక్టరుగారు కన్నెర్రచేసి "షటప్ అండ్ గెటవుట్" అని అరిచారు. ఆ అరుపు విని ఇ.కె. మా దగ్గరకు వచ్చారు. లింగమూర్తిగారే మమ్మల్ని పరిచయం చేశారు. ఎక్కువ మాట్లాడింది లేదు. మేం వచ్చేశాం.

\+ + +

యోగం నీకు ఏం నేర్పింది అని ఎవరైనా ప్రశ్నిస్తే 'అనుభవం' నేర్పింది అంటాను.

'అనుభవం' అంటే ఏదో అనుభవించడం కాదు. సుఖపడడం మాత్రం కాదు. కష్టపడడం మాత్రమే కాదు. కష్టాలు, సుఖాలు అందరం అనుభవిస్తున్నాం. వాటి ఫలితం మన జీవితం మీద ఎంతవరకు పడుతుంది. అవి మన భవిష్యత్తును ఎంతమేర ప్రభావితం చేస్తున్నాయి. మన అభివృద్ధికి ఎంత దోహదం చేస్తున్నాయి. అలా చేయగలిగిన వాటిని 'అనుభవం' అంటాను నేను. అంటే మనకు జీవితం నేర్పే పాఠం 'అనుభవం.' మన జీవితబాటలో, సొంతంగా సేకరించిన మౌళికవిలువలు అనుభవాలంటే. అలా మన జీవితాల్లో మైలురాళ్లుగా నిలిచి, మార్గదర్శకంగా మారిన సంఘటనల తాలూకు గుర్తులు అనుభవాలు. అలాంటి అనుభవాల ఆసరాతో నేను నా జీవితాన్ని ముందుకు సాగిస్తున్నాను. మలుపులు తిప్పుకుంటున్నాను.

అసలు భృక్తం అంటే ఏమిటి? భృక్త రహితం ఏమిటి? తారక రాజయోగ రహస్యం ఏమిటి? ఒక్కొక్కరు ఒక్కోరకంగా వివరణ యిచ్చేవారు. ఆ వివరణ నాకు నచ్చేది కాదు. నా 'అనుభవం' యోగసాధన ఫలం.

సృష్టి జరిగింది. అందరం అంగీకరిస్తాం. సృష్టిలో ఒక దశ పూర్తయి మరో దశ ప్రారంభమవుతుంది. దానిని పరిణామక్రమం అందాం. మొదటి దశల సృష్టి ఎలా జరిగిందీ భృక్తంగా అంటే రహస్యంగా వుండిపోయింది. మాస్టరుగారు యోగం ఆవిష్కరించే వరకు ఆ రహస్యాలు పూర్తిగా తెలియలేదు. సృష్టిరహస్యాలు భృక్తంగా వుండిపోయాయి. ఆ తర్వాతనే సృష్టిరహస్య భేదనం జరిగింది. అంటే భృక్తరహితం కాసాగాయి. సృష్టి పూర్వపు స్థితి, తర్వాతి స్థితి తెలుస్తోంది. ఆ రహస్యం తనంత తాను విచ్చుకుంది. సృష్టి

మొదటిదశ కన్న సృష్టి ముందరి దశ చాలా ఉన్నతమైనది, శక్తివంతమైంది, ప్రాణపూర్ణమైనది. తొలి దశకన్న పూర్వదశకు వెళితే తొలి, మలి దశల రహస్యాలు తెలుస్తాయి సులభంగా. అలా తెలుసుకోవడమే ఈ యోగలక్ష్యం. అంటే పరిణామంలో చివరిదశ నుండి సృష్టి పూర్వస్థితికి, నిరాకార, నిర్గుణ, నిర్వికార స్థితికి వెళ్లడం. అది పూర్తిగా అవగాహన కావాలంటే, దానిని స్పృశించి గ్రహించాలి - టచ్. దానినే రీ-స్పెక్ట్ అంటాం. దానిని ఆశిస్తాం.

ఆశ అంటే జరిగింది కాదు. కనిపించేదీ కాదు కదా! ఖచ్చితంగా ఉన్నదో లేదో తెలియనిదాన్ని ఉన్నదని, తెలుసుకోవాలనీ ఆశించడం. అవకాశం ఉండవచ్చు, ఉండక పోవచ్చు. అంచనాలకు అందినప్పుడు తెలుస్తుందనే ఆశ కలుగుతుంది. ఒక సంఘటన జరిగిన తర్వాత దానిపై ఆశ అనవసరం. భవిష్యత్తులో ఎప్పుడో సంభవించ వీలున్న దానిని 'ఆశ'తో ముడిపెట్టి ఆశిస్తాం. అది జరగవచ్చు. అలా జరగటానికి 'అవకాశం' ఏర్పడాలి.

ఉత్తినే ఎవరైనా ఆశిస్తారు! ఆశ నెరవేరడానికి శక్తి తోడు కావాలి. దానిని ఎనర్జిటిక్ వేవ్స్ అనవచ్చు. మనం యోగం చేస్తున్నప్పుడు మాస్టరుగారి పేరును, లేదా ఒక కోర్కును మననం చేస్తాం. అలా మననం చేస్తున్నప్పుడు ఒక శక్తి లేదా ప్రాణ తరంగాలు మనలో జొరబడి పనిచేయడం ప్రారంభిస్తాయి. అంటే సాధకునిలో యోగక్రియ జరుగుతుంది. ఆ శక్తి తరంగాలు తనలో ప్రవేశించడం, క్రియ జరపడం సాధకునికి తెలియవచ్చు, తెలియకపోవచ్చు. రెండింటికీ అవకాశం వుంది. సాధకునికి తెలిసి జరిగినా, తెలియక జరిగినా, లోపల యోగక్రియ ఆగదు. ఆ తర్వాత తనలో ఏదో జరుగుతోందని, తనలో ఏదో మార్పు వస్తోందని అనిపిస్తుంది. అలా డైరెక్టుగా తనలో యోగక్రియను కొందరు గమనిస్తుంటారు. కొందరు ఫలితాన్ని బట్టి, మార్పును బట్టి యోగక్రియను ఆమోదిస్తారు. అది ముందుగా తెలుసుకోగలిగిన సాధకుడు పూర్ణత్వం దిశగా ఆలోచిస్తాడు, పయనిస్తాడు. అతనికి లక్ష్యం గమ్యం ఏర్పడుతుంది. అలా యోగశక్తి ఏమాత్రం మనలో ప్రవేశించి నిలవరించినా ఆశ చివురిస్తుంది. ఆశ ఇనుమడిస్తుంది. బయట పరిస్థితుల వల్ల అనుభవం అందుబాటులోకి వస్తుంది. అనుభూతిని మిగుల్చుతుంది. ప్రతికూల బాహ్యావాతావరణం నిస్పృహను కలిగించవచ్చు. పూర్తి నిరాశ ఆవరించినపుడు, కొత్త ఆశ చివురిస్తుంది. చెట్టు ఆకులన్నీ రాలిపోయినప్పుడే కొత్తచివుళ్లు వేస్తుంది. నైరాశ్యంనుండి ప్రతిసాధకుడు తప్పక బయటపడతాడు. అలా బయటపడడం మరో మెట్టు యోగంలో పైకి పోవడం. కొత్తశక్తిని సంపాదించడం. ఒక

నిరాశ వెనుకనే రెండింతలు ఆశ కనిపిస్తుంది. అలాంటి కొత్త ఆశ, స్ఫూర్తి బాహ్య పరిస్థితులను ఎదుర్కొని జయించే శక్తినిస్తుంది. అదే యోగసాధనలో ప్రాణధార మనకు చేసే మహోపకారం. వాటినే ఎనర్జిటిక్ హోప్స్ అంటాం. అది అనంతం.

+ + +

మద్రాసులో వున్నకాలంలో ఒక మిత్రుడు పి.వి. రమణ సినిమాపనిమీద మద్రాసు వచ్చాడు. అతనికి వరంగల్‌లో ఉద్యోగం. నాటకాలు రాయడం, వేయించడం, నటించడం హాబీ. సినిమా తీయాలని ఒక ప్రొడ్యూసర్‌ను తీసుకువచ్చాడు. అతని మిత్రుడు రాజా శివానంద్ అని మద్రాసులో సినిమా పరిశ్రమలో వున్నాడు. పాండీ బజారులో కలిశారు. నేను గుర్తించలేదు. ఎప్పుడో తెనాలి కాలేజీలో తను విద్యార్థి అట. 'గురువుగారూ' అంటాడు. భక్తి నేనంటే. అతని భార్య అదే కాలేజీ విద్యార్థిని. ఇద్దరూ ప్రేమించిపెళ్లాడారు. ముగ్గురుపిల్లలు. ఆమె టీచర్‌గా చేసింది. ఇప్పుడామెకు గుండె బలహీనత. ఆస్మా అని జ్ఞాపకం. జంపనిలో తల్లిదండ్రుల ఇంట, పిల్లలతో వుంటోంది. ఇతను ఒంటరివాడు. నన్ను ట్రీట్‌మెంట్ చేయమని కోరాడు. నేను హోమియోమిత్రుడు గోపాలకృష్ణ కలిసి తెనాలి వెళ్లాం. స్టేషనులో స్వాగతం చెప్పాడు. అతనిమిత్రుడు సుబ్బారావు అని ఒక డాక్టరు స్టేషనుకు వచ్చారు. మాటల సందర్భంలో అతనికి యోగంపైన, మహత్తులపైన నమ్మకంలేదని వ్యక్తం ఛేశాడు. నమ్మకం లేని వాడైతే నా కోసం రావలసిన పనిలేదు. ఏదైనా ఒక అద్భుతం జరిగితే తాను నమ్ముతానని, యోగంలో చేరతానని అన్నాడు. అతను యోగంలో చేరకపోతే కొంప మునిగేది లేదు. అలాగ అనుమానించేవారు అసలు యోగానికి పనికిరారని నా నమ్మకం. ఒక విశ్వాసంతో ముక్కుమూసుకుని నీళ్లలో దూకాలి మునగదలచిన వాడు. యోగం అంటే మీనమేషాలు లెక్కిస్తూ, లాభనష్టాలు, ప్రయోజనాలు బేరీజు వేస్తూ ఆలోచించేవారు యోగం చేయలేరు. ప్రతిరోజు ఎంత లాభం అనుకుంటే ఎలా! ఆ సుబ్బారావు మాట మనస్సులో నాటుకున్నా నేను పట్టించుకోలేదు. నలుగురం బస్సెక్కి జంపని వెళ్లాం. రమణ భార్య, పిల్లలు అంతా సంతోషించారు. మాస్టరుగారు వచ్చారని ఆ అమ్మాయి సంతోషించింది.

మే, జూన్ ప్రాంతం ఎండలు మండిస్తున్నాయి. బస్సులో వెళ్లాలంటేనే తాపం. ఎండలు సెగలు కక్కుతున్నాయి. ఆ రోజు సాయంత్రం ట్రీట్‌మెంట్. పెద్దలోగిలి ఇల్లు. నేను రమణ భార్య లోపల గదిలో వున్నాం. ప్రార్థన కోసం అందరూ తలొకచోట చేరారు. గోపాలకృష్ణ యోగం చేయడు. వరండాలో మంచంమీదకూర్చున్నాడు. ప్రేయర్ ప్రారంభమైన అరగంటకు, ఉరుములు మెరుపులతో కుంభపోత వర్షం. ఒకగంటలో ఊరు వాడ

జలాశ్రయాలైనాయి. విపరీతంగా చలిపుట్టుకు వచ్చింది. పొలాలు జలమయమైనాయి. ఆ నెలలో వర్షాలు రావడం ఎన్నడూ జరగదు.

"ఏమండీ సుబ్బారావుగారూ, యోగం వల్ల వర్షాలు కురుస్తాయా! మంత్రాలకు చింతకాయలు రాలతాయా అన్నారు కదా! ఇప్పుడేమంటారు. మంత్రంతో ఆ అమ్మాయి జబ్బు తగ్గిపోయింది. చూడండి. ఎప్పుడూ మీకు తెలియనంత మాత్రాన అజ్ఞానంతో విమర్శించకండి" అన్నాను.

తిరిగి వచ్చేటప్పుడు అతను తెనాలిలో వాళ్ల ఇంటికి ఆహ్వానించాడు. రానని నిష్కర్షగా చెప్పాను. 'నీవు యోగానికి అర్హుడివి కావు' అని మొహంమీదనే అన్నాను. అలాంటి శంకాచూడుల్ని యోగంలో చేర్చడం నాకు ఇష్టం వుండదు. ప్రేమతో యోగి కావాలి. సాధన చేయాలి. యోగం వల్ల, సాధన వల్ల పుట్టేది అమృతం. ఇది క్షీరసాగర మథనం వంటిది. నాటికీ నేటికీ యోగార్హుల్ని నిర్ణయించడంలో పరీక్షలు కఠినంగానే వుంటాయి. నిబంధనలు గట్టిగానే వుంటాయి. ఎంత ఆత్మీయులకైనా, స్నేహితులకైనా, బంధువులకైనా కన్సెషన్స్ ఉండవు. అందుకేనేమో మా దగ్గర బంధువులు, మిత్రులు మాయోగంలోకి ఎక్కువగా రాలేకపోయారు. చండామార్కుని వలె వుండక తప్పదు. మినహాయింపులు యిస్తే యోగానికి అన్యాయం చేసినట్లవుతుంది.

+ + +

తెనాలిలో ఒక వివాహానికి వెళ్లవలసి వచ్చింది ఒకసారి. పెళ్లికి, యోగానికి సంబంధం ఏమిటనవచ్చు. ఉంది. నేను మద్రాసులో వుంటున్న కారణంగా ఆంధ్రలో బంధువుల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు సాధారణంగా హాజరవడం పడేదికాదు. ఆ పెళ్లికి ఎందుకో వెళ్లాలనిపించింది. ఆ పెళ్లికుమార్తె తండ్రికి నా యోగం అంటే చిన్నచూపు. చాలసార్లు హేళన చేశారు."ఏమిటోయ్ నువ్వు యోగం చేస్తున్నావట. అలా కూర్చుని ఏం చేస్తావేమిటి ?" ఆయన వ్యంగ్యభాషణంతో నాకు అరికాలిలో ముల్లు గుచ్చుకునేది? సమయంకోసం ఎదురుచూస్తున్నాను. పెళ్లి ఇంటికి పోకుండా సరాసరి మా ఇంటికి వెళ్లాను. అమ్మ నాన్న అక్కడే వున్నారప్పుడు. నేను వెళ్లేసరికి మా పిన్ని, చెల్లెళ్లు ఇంటనే వున్నారు. నారాకకు ఎంతో సంతోషించారు. "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నారు.

"ఏమిటి అంతా దిగులుగా ఉన్నారు" నా ప్రశ్న.

"నువ్వు వస్తావో రావో నని ఎదురుచూస్తున్నాం. ఈ పెళ్లి ఆగిపోతుందని భయంగా బెంగగా వుంది" అన్నారు.

"ఎవరింట పెళ్లికో మీరు బెంగపడడం ఎందుకు?"

అసలు సంగతి చెప్పారు. ఆ పెళ్లికూతురు ఎవరినో ప్రేమించిందట. కులాంతరం అతనితో లేచిపోవాలని ప్రయత్నించింది. తల్లిదండ్రులు బలవంతంగా వేరే అయిన సంబంధం నిశ్చయించారు. అడిగినంత కట్నం యిస్తున్నారు. పైగా ఆ అమ్మాయి ఒకసారి బ్రోతల్ యాక్ట్ క్రింద అరెస్ట్ అయింది. ఒక లాడ్జిలో పట్టుకుని పోలీసులు లాక్కుపోయి, బ్రోతల్ కేసు పెట్టారు. ఆ విషయాలు తెలియనివ్వకుండా పెళ్లివారికి ఎక్కువ కట్నం ఎరచూపి పెళ్లి చేస్తున్నారు. ఆ పిల్లకు తన పాతప్రియుడిపైనే మనసు. అవకాశం దొరికితే పారిపోవాలని ఎత్తు వేసి ఏడుస్తోందట.

నేను వచ్చానని కబురందగానే పెళ్లికూతురు తండ్రి పరుగున వచ్చి చేతులు పట్టుకుని కన్నీరు పెట్టుకున్నాడు. "ఇంతకాలం గౌరవంగా బ్రతికాను శార్వరీ! ఈ పిల్ల అప్రాచ్యపు పని వల్ల సగం చచ్చిపోయాను. వీధిలో తల ఎత్తుకు తిరగలేక పోతున్నాను. రిటైర్ అయినాను కనుక సరిపోయింది, లేకుంటే పదిమందిలో అవమానం భరించలేక నేనే ప్రాణత్యాగం చేసుకోవలసి వచ్చేది."

లాంఛనంగా ఆయన్ని ఓదార్చాను. "ఫరవాలేదు లెండి ... నా చేతనైన సాయం చేస్తాను." అన్నాను.

"అలా కాదు శార్వరీ! నీ యోగశక్తిని ఉపయోగించి, నాబిడ్డ పెళ్లి ఆగకుండా చేయాలి. ఇవి చేతులు కాదు. కాళ్లు అనుకో" బ్రతిమిలాడాడు.

ఆపిల్ల ప్రేమించిన కుర్రాడి పేరు, అడ్రసు తెలుసుకున్నాను. మర్నాడు ఉదయం వాళ్ల ఇంటివరకు వెళ్లాను. పెళ్లి జరిగే ప్రదేశం చుట్టూ నాలుగు వీధులు ప్రదక్షిణం చేసి వచ్చాను.

ఒక డాబాపైన షామియానా వేసి, పెళ్లి జరిపిస్తున్నారు. డాబాపైకి వెళ్లడానికి ఒక వైపే మెట్లున్నాయి.

"నేను పెళ్లి జరిగేచోటుకి రాను. మీరు మీ పని కానివ్వండి. నేను బయటనే వుంటాను" అని, వీధిలో వేసిన షామియానాలో కుర్చీలో కూర్చుని స్థానికంగా వున్న నా స్నేహితులు వస్తే, వారితో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాను పెళ్లితతంగం అంతా పూర్తి అయ్యేవరకు.

ఆ రాత్రికే పెళ్లికూతుర్ని అత్తవారింటికి పంపివేశారు. దుష్యంతుడు శకుంతలను అత్తవారింటికి పంపిన దృశ్యం జ్ఞాపకం వచ్చింది. ఇక్కడ పెళ్లికూతురి మాజీప్రియుడు వచ్చి అల్లరిచేయనందుకు ఆ పిల్ల తండ్రి పొందిన ఆనందం...

\+ \+ \+

పాతనీరు పోయి కొత్తనీరు వచ్చింది. తెనాలిపట్టణంలో మాతరం రచయితలు, కవులు ఇప్పుడు లేరు. నేనక్కడ ఉద్యోగం చేసిన కాలంలో జి.వి.కృష్ణారావు, హితశ్రీ, తాళ్లూరి నాగేశ్వరరావు, పి.వి.సుబ్బారావు, బైరాగి, దుర్గానంద్, శారద, భరద్వాజ, అమరశ్రీ, కవిరావు లాంటి కవులు, రచయితలు ఉండేవారు. ఇప్పుడు పాతవారిలో హితశ్రీ ఒక్కరే మిగిలారు. డా॥ కె.వి.కృష్ణకుమారి, డా॥ పోతుకూచి వెంకటేశ్వర్లు, డా॥ కొత్త రవీంద్రబాబు, డా॥ దక్షిణామూర్తి, సౌజన్య, వడ్లమన్నాటి కుటుంబరావు, ప్రసాదార్కె వంటి యువతరం రచయితలు ప్రసిద్ధులవుతున్నారు. అప్పట్లో నేను 'మహిళ' పత్రికకు వర్కింగ్ ఎడిటర్. మా మిత్రుడు జి. మునిరత్నం నాయుడు, ఆఫీసు తిరుపతిలో పెట్టి, ప్రింటింగ్ ఎడిటింగ్ బాధ్యతలు మద్రాసులో నాకు అప్పగించారు. 'మహిళ'కు ప్రశ్నలు జవాబులు రాయడానికి డా॥ కృష్ణకుమారిని ఒప్పించాను. సౌజన్య ఇంట్లో రచయితల సభ జరిపి నాకు చిన్న సన్మానం చేశారు. సభలకు, సమావేశాలకు నేను ఎప్పుడూ దూరం. దండలు వేయించుకోవడం, శాలువాలు కప్పించుకోవడం, పొగడ్తలు నాకు గిట్టవు. అప్పటికీ, ఇప్పటికీ వేదికలు ఎక్కడం, ఉపన్యాసాలు ఇవ్వడం నాకు మనస్కరించదు. మరీ తప్పనిసరి అయితే అంగీకరిస్తాను.

మా నాయనగారి అనారోగ్యం కారణంగా అప్పుడప్పుడు తెనాలి వెళ్లవలసి వచ్చేది. గవర్నమెంటు ఆస్పత్రిలో నాయనకు అల్సర్ ఆపరేషన్ చేశారు. నేను మద్రాసు నుండి వచ్చాను. అర్ధరాత్రి పన్నెండయింది తెనాలి చేరేసరికి. సౌజన్య, వడ్లమన్నాటి కుటుంబరావు స్టేషన్‌లో ఎదురుచూస్తున్నారు. అందరం కలిసి ఆస్పత్రికి వెళ్లాం. జనరల్ వార్డులో నాన్నగారిని చూచాను. రాత్రి డ్యూటీలో కృష్ణకుమారి ఉన్నారు. కుటుంబరావు వెళ్లి, ఆమెను నిద్రలేపాడు. ఆమె భయపడిపోయింది. 'నాన్నగారికి ప్రమాదమేమోనని...' ఆమె మరొక విచిత్రం జరిగినట్లు చెప్పారు. నైట్‌డ్యూటీ రౌండ్స్‌కు ఆమె రారు. తన గదిలో పడుకుని నిద్రపోతారట. ఎందువల్లనంటే నాన్నగారున్న వార్డులో ఆమెకు ఏవో శబ్దాలు వినిపించేవట. ఆకాశంలో ఎవరో నడిచివస్తున్నట్లు కనిపించి భయపడేదిట.

మర్నాడు ఉదయం మళ్లీ ఆస్పత్రికి వెళ్లాను. నాన్నగారికి ఆరోజు గడవటం కష్టమని డాక్టర్ పోతుకూచి వెంకటేశ్వర్లు చెప్పారు. ఆయనే మెడికల్ ఆఫీసరు. బంధువులు వచ్చి చూచి పోతున్నారు. నాన్నగారి బెడ్‌ప్రక్కన 'నీలకంఠం' అని మరో పేషెంట్ వున్నాడు. ఈయన లాగానే ఆయనకూ ఆపరేషన్ జరిగింది. ఆయన కోలుకున్నాడు. మర్నాడు ఆయన్ని డిశ్చార్జి చేస్తారుట. ఆయన మా నాన్నగారి స్నేహితుడే. చిన్నతనంలో మా ఇంటి దగ్గరనే వారిల్లు. నేను గుర్తించలేదు ఆయనను. ఆరోజు సాయంత్రం ఇంటి దగ్గర

ప్రేయర్ చేసుకున్నాను. నాకేమీ 'చెడు' అనిపించలేదు. నాన్నగారి ఆరోగ్యం బాగవుతుందన్న ఫీలింగ్ వచ్చింది. మన చేతుల్లో ఏముంది, భగవంతుడు ఎలా చేస్తాడో! మనకు అయినవారు, ఆత్మీయులు కదాని మాస్టరుగారిని అర్థిస్తాం. ప్రతివారు ఎప్పుడో పోకతప్పదు. తల్లిదండ్రులైనంత మాత్రాన శాశ్వతంగా ఉండగలరా! నేను మాత్రం ఉంటానా? కనుక కాలంతో మృత్యువును స్వాగతించాలి ... కాలం తీరిన వారిని యోగశక్తి రక్షించలేదు.

ఆ ఒక్క రాత్రి ... డాక్టర్లు నాన్నగారికి పెట్టిన గడువు. ఆస్పత్రికి వెళ్లి రాత్రి పన్నెండు గంటల వరకు ఉన్నాను. ఆయన మంచంమీదనే కూర్చుని ప్రేయర్ చేశాను. మిత్రులతో తిరిగి వచ్చాను. ఉదయం ఎప్పుడు దుర్వార్త వస్తుందోననే భయం, ఆతృత. ఏదీ రాలేదు. ఉదయం ప్రేయర్ చేసుకొని మళ్లీ మిత్రులతో కలిసి ఆస్పత్రికి వెళ్లాను. నాన్నగారు లేచి కూర్చుని బ్రెడ్ తింటున్నారు. సంతోషంగా వున్నారు. వెళ్లి పలకరించాం.

"ఈపూట డిశ్చార్జి కావలసిన నీలకంఠం తెల్లవారుఝామున చనిపోయాడు నాయనా" అన్నారు నాన్నగారు. ఆయన నన్ను సాధారణంగా 'నాయనా' అనే పిలిచేవారు. 'కృష్ణా' అని పిలవడం అరుదు.

'అలాగా' అన్నాను. ప్రక్క మంచం ఖాళీ . అయింది. వచ్చిన మృత్యువు ఆయన్ని తీసుకుపోయిందా? ఏమో! నాన్నగారికి ఇంకా కొంతకాలం జీవించే యోగం వుంది, అంతే!

నాన్నగారు మహాకాళీ ఉపాసకులు. ఆయనను కాళీమాత కనిపెట్టుకుని ఉండేది. కృష్ణకుమారి అమ్మ కాలిగజ్జెల సవ్వడి వినే భయపడ్డది. వార్డులో అమ్మవారే తిరుగుతుండేది. ఆమె నాన్నగారికి చెప్పారు ...

"ఆ విషయం అబ్బాయికి చెప్పండి, డాక్టరుగారూ. అమ్మ మీ జోలికి రాకుండా తనైతేనే ఆపగలడు. మిగతా ఎవరి వద్దకు వెళ్లినా మీకు లాభం లేదు. అమ్మను ప్రసన్నం చేసుకోవాలి తప్ప భయపడకూడదు."

నాన్నగారిని డిశ్చార్జి చేసిన రోజునే ఆస్పత్రిలో గజ్జెల సవ్వడులు, అమ్మ స్పందనలు ఆగిపోయాయి.

నాన్నగారిని డిశ్చార్జి చేశారు. ఇంటికి తీసుకువెళ్లాం. మా ఇంట్లో ఒక పెద్ద పోర్షను అద్దె కిచ్చి, చిన్న పోర్షనులో అమ్మానాన్న ఉండేవారు. అద్దె డబ్బులే వాళ్లకు ఆధారం. నేను వారికి చేస్తున్న ఆర్థిక సహాయం లేదు. ఎప్పుడైనా అక్కడకు వెళ్లినపుడు ఒక వంద, రెండు వందలు ఇవ్వడం తప్ప, నెలనెల ఇంత అని పంపే శక్తి నాకు లేదు. మద్రాసులో సంసారం. నలుగురు పిల్లల్ని చదివించుకోవాలి. మనం కన్నవారిని ఎంతగా

ప్రేమగా చూస్తామో, మనల్ని కన్నవారినీ అంత ప్రేమగా చూడాలి. కానీ చూడం. పరిస్థితులు కారణం. తల్లిదండ్రులు బిడ్డల ప్రేమాభిమానాల్ని ఆశిస్తారు గానీ, వారి ఒప్పును కాదు. ఏర్పైనంతవరకు తన బిడ్డల ముందు చేయిచాచరాదని, అర్థించరాదని ఆశిస్తారు. కానీ మన పరిస్థితులు ప్రతికూలమైనపుడు అర్థించక తప్పదు. దేబిరించక తప్పదు. అమ్మ నాన్నలను చివరి దశలో ఆదుకోలేకపోవడం మహాపాపం. అలాంటి పాపం నేను చేశాను. కొంత కారణం నా అశక్తత. వారి స్వాభిమానం కొంత.

మా ఇంటి గుమ్మంపైన ఒక పెద్ద కాళికాదేవి పటం వుంటుంది. చాలాకాలం మానాన్నగారు పూజించిన మహాశక్తి. ఇదివరకు అది వారి పూజామందిరంలో ఉండేది. ఆయన కొక తంబుర, చిరతలు ఉండేవి. పూజలు నిలిపి వేశాక, ఆ పటం గుమ్మంపైన పెట్టారు. దాన్ని చూచి పిల్లలు దడుచుకునేవారు. ఆ రోజున నాన్నగారి మంచం ప్రక్కన చాప మీద కూర్చుని ప్రేయర్ చేశాను. ధ్యానం రెండు గంటలు పైగా సాగింది. చాలా వర్కింగ్ వచ్చింది. అచేతన స్థితిలో లేచివెళ్లి ఆ మహాకాళికాదేవి పటాన్ని క్రిందికి లాగాను. నాన్నగారికి చెప్పాను -

"ఇంక కాళీమాత పూజ చేయకండి. ఆమెకు మీపైన ప్రేమ ఎక్కువై, మీ చుట్టూ తిరుగుతోంది. ఆమె మీ ప్రక్కన ఉండగా మృత్యువు రాదు. కానీ శరీరం శుష్కించిపోయి, ఇలా రోగాలతో బాధపడాలి. ఇలా బాధలు పడుతూ జీవచ్ఛవంలాగా బ్రతుకుతారో, అమ్మను వదలి, హాయిగా మృత్యువును ఆహ్వానించి జన్మరాహిత్యస్థితిని పొందుతారో మీ ఇష్టం. నిర్ణయం మీది."

"నాకు మళ్లీ జన్మ వుంటుందా! పరమాత్మలో కలిసిపోతానా?" అని అడిగారు.

"మీరు నన్ను కన్నతండ్రి. మీకు పునర్జన్మ లేకుండా మాస్టరుదగ్గరకు పంపగలను. నా యోగం మీ వంటి వారికి సత్యలోక ప్రాప్తి కలిగించి తీరుతుంది. నాపై నమ్మకం వుంచండి" అన్నాను.

తనకు మాస్టర్‌యోగంలో ఉపదేశం చేయమని కోరారు.

"నాకు కన్నతండ్రి మీరు. మీకు నేను ఉపదేశం చేయకూడదు. రోజూ మాస్టర్ గారికి నమస్కరించుకుని, వారిని స్మరించండి చాలు. ధ్యానం చేసుకోండి. మిగత పని నేను చేస్తాను."

జన్మ నిచ్చిన తల్లిదండ్రుల ఋణం ఆ విధంగా తీర్చుకున్నాను. తర్వాత మా అమ్మగారు ఈ యోగంలో సాధన చేసేవారు. నేను ఉపదేశం చేయకపోయినా సంకల్పంతో వారికి యోగారూఢం సిద్ధించింది. పున్నామ నరకం నుండి రక్షించేవాడు పుత్రుడు అంటారు. మన యోగంతో మన తల్లిదండ్రులకు జన్మరాహిత్యం సిద్ధింపచేయవచ్చు.

తర్వాత నాన్నగారు ఈయోగం చేసుకోసాగారు. ఆరోగ్యం చాలావరకు చక్కబడ్డది. ఆయన ఎంతో తపస్సు చేసినవారు కనుక, మాస్టర్ మార్గంలో అవలీలగా యోగశిఖరాల్ని అందుకోగలిగారు. కన్నకొడుకుగా వారికి నేను చేసింది, చేయగలిగింది సామాన్యంగా అందరూ చేయగలిగింది కాదు!

మా గురువుగారు బాలసుందరరావుగారింట పరిచయమైన పెద్దలలో ప్రముఖ దర్శకుడు బి.ఎన్.రెడ్డి ఒకరు. ఆయన సినిమాలు తీయడం మానివేశారు అప్పటికే. రోజూ ఒక గంటసేపైనా నాతో గడిపేవారు. ఇద్దరం కలిసి విజయ, వాహినీస్టూడియోలకు వెళ్లి సినిమాలు చూచేవారం. ఆయనకు ఈ యోగం చేయాలని వుండేది. కాని డాక్టరు గారిని అడగడం యిష్టం లేదు. నైతికజీవితం కలవారే గురుస్థానానికి అర్హులని ఆయన అభిప్రాయం. ఆయనకు నా జీవనపద్ధతి నచ్చినట్లుంది. నన్ను అడిగారు యోగంలో ఉపదేశం చేయమని. నేను వెళ్లి డాక్టరుగారికి చెప్పాను, బి.ఎన్. లాంటి వ్యక్తికి నేను ఉపదేశం చేయటం ఏమిటి? అని.

'నీవే అర్హుడివి. చెయ్. ఇది మాస్టరుగారి సంకల్పం.' అని ప్రోత్సహించారు. ఆయన సాంప్రదాయంగా ఉపదేశం పొందారు. మా గురువుగారు ఎగతాళి చేశాడు. 'బి.ఎన్.నిన్ను గురువును చేశాడు. ఆయన గొప్ప సినిమాలు తీయడమే కాదు. ఒక గొప్ప గురువును సృష్టించాడు.'

డాక్టరుగారి వ్యంగ్యం ఒక్కోసారి బాధపెట్టేది. గురువులకు శిష్యులు దూరం అవుతుంటారు. స్వతంత్రంగా అభివృద్ధి చెందే శిష్యులు గురువులకు దూరంగా వుండాలి. అడుగులకు మడుగులొత్తి, పాదసేవలు చేయనవసరం లేదు. మా గురువుగారు అలాగే కోప్పడి, కసిరికొట్టి, విమర్శించి నన్ను దూరంగా వుంచేవారు. అడుగడుగునా నా అభివృద్ధిని గమనిస్తుండేవారు. ఒక్కటి నిజం. ఆయనకు అసూయలేదు. శిష్యులు పైకి ఎదిగితే అసూయపడి బాధపెట్టే గురువులు చాలా మంది వున్నారు. గురువు శిష్యునికి ఆత్మబంధువు కావాలి తప్ప అభివృద్ధికి ప్రతిబంధకం కాకూడదు. ఏడాదికి ఒకటి రెండు పర్యాయాలు ఏ శిష్యుడైనా గురువును దర్శిస్తే చాలు. ఈ యోగంలో సమావేశాల రహస్యం అదే.

డాక్టరుగారికి కాన్సర్ వచ్చింది. బొంబాయివెళ్లి పరీక్ష చేయించుకుని వచ్చారు. ఆరునెలలకంటే బ్రతకడని చెప్పారు. చివరి రోజుల్లో చాలా బాధపడ్డారు. వినాయకచవితి రోజున ఆయనపోయారు. అల్లుడు చంద్రమోహన్ అంత్యక్రియలు జరిపారు.వందలాది మంది అభిమానులు, సినిమాలవారు, నాటకాలవారు వచ్చారు. నేనూ రుద్రభూమికి

వెళ్లాను. తండ్రి తర్వాత గురువు తండ్రి అంతటివాడు. గురువుతో కర్మబంధం తెగిపోయింది. నేను యోగంలో ఒంటరిగా మిగిలాను.

మద్రాసులో యోగజీవితం ఏడు సంవత్సరాలు సాగింది. ఉద్యోగరీత్యా మద్రాసు వదలివెళ్లే అవసరం కలగదనుకున్నాను. మాస్టరుగారు హైదరాబాదుకు మార్పించారు. మద్రాసులో వుండి సాధించేది లేదు. అయితే పిల్లలు చదువుకుంటున్నారు. వసంతకుమార్ ఎం.ఏ. చేస్తున్నాడు. శ్యాం సుందర్ పి.యు.సి., రమణ ఎస్.ఎస్.ఎల్.సి., అమ్మాయి పద్మప్రియ తొమ్మిది పూర్తయింది. పిల్లల పెళ్లిళ్ల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ అయితే బావుంటుందని ఉండేది. విజయవాడలో మా ఆఫీసు వుంది. ఇప్పుడు హైదరాబాదులో ప్రభ డెయిలీ, ఎక్స్‌ప్రెస్, ప్రభ వీక్లీ పెట్టి ట్రాన్స్‌ఫర్ చేశారు. బదిలీని కాదనడానికి కారణాలు కనిపించలేదు. అంతకుముందు హైదరాబాదు రెండు మూడుసార్లు వెళ్లినా పెద్దగా పరిచయం లేదు. ఇప్పుడు ఉద్యోగరీత్యా వెళ్లడం. అక్కడే సంసారం పెట్టాలి. పదహారు సంవత్సరాలుగా మద్రాసు సంస్కృతికి అలవాటు పడ్డాం. మద్రాసుతో అనుబంధం వున్న వారెవరూ మద్రాసు వదలి వెళ్లడానికి ఇష్టపడరు. తెలుగువారి సాంస్కృతిక రాజధాని అప్పటికి మద్రాసే!!

మదరాసు స్మృతులు

జీవితంలోని మలుపుల్ని మనం గుర్తుపెట్టుకోం గానీ, అన్నింటికీ విలువ, ప్రయోజనం వుంటుంది.

ఎన్నో ఊళ్లు తిరుగుతాం. ఎందరెందరితోనో పరిచయాలు కలుగుతాయి. ఒక్కసారైనా సింహావలోకనం చేసుకోం. ఏదో ముందుకుపోతున్నాం అనుకుని తృప్తిపడి పోతాం. కాని భవిష్యత్తులోకి వేసే ప్రతి అడుగుకు గతం గట్టి పునాది అవుతుంది. భవిష్యత్తుకు సంబంధించిన తొలి వెలుగులు గతంలోనే వుంటాయి.

పది సంవత్సరాల వయస్సు వరకు ఉన్నది పల్లెసీమలో. తర్వాత 18సంవత్సరాలు తెనాలి. ఆ తర్వాత విజయవాడ, ఛిత్తూరు, బెంగుళూరు. మద్రాసులో దాదాపు 18 సంవత్సరాలు గడిపాను. చేదునిజాల్ని చూచాను. చేదు అనుభవాలు రుచిచూచాను. జీవితంలో ఎత్తుపల్లాల అనుభవాలు పొందాను. దాదాపు నగం జీవితం గడిచిపోయింది. సూర్యుడు పడమర వైపుకు వాలుతున్నాడు. మనిషికి బాధ్యతలు పెరిగేది ఈ వయస్సులోనే. గృహస్థుగా మోయవలసిన బరువులు మోపెడయ్యేది అప్పుడే. ఖర్చులు పెరిగేది, బాధ్యతలు పెరిగేది అప్పుడే. అప్పటికి నా సంపాదన నెలకు 400 రూపాయలు.

మద్రాసు జీవితంలో మరచిపోలేని వ్యక్తులు గురువుగారు బాలసుందర రావుగారు, మహర్షి టి.ఎస్. శంకరయ్యర్. ఇద్దరూ నాకు గురు సమానులే, పూజ్యులే. నా జీవితపు ఉత్తరార్ధానికి దివిటీలు వెలిగించిన వారు. వారు చూపిన వెలుగుబాటల్లో నేటికీ పయనిస్తున్నాను. యోగంలో నాకు ప్రవేశం కలగకుండా వుంటే నా జీవితం ఎంత అంధకారబంధురం అయ్యేదో అనిపిస్తుంది.

ఎవరు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఈ ప్రపంచం వదలిపోయినా వారి జ్ఞాపకాలు మనలో మిగిలి వుంటాయో, ఎవరి సంస్మరణ మనలో ఉత్తేజాన్ని కలిగించి మనకు మార్గదర్శకంగా వుంటుందో వారు శాశ్వతులుగా వున్నట్లే. వారి ఆత్మలు

లేదా వారి ఆత్మ శరీరాలు స్ఫూర్తినిస్తుంటాయి...అలాంటివారే మహాత్ములు. లోకంలో మనం భర్తకు భార్య, భార్యకు భర్త తోడు నీడ అంటాం. నిజమే. భౌతికజీవనం వరకు, భౌతిక ప్రపంచం వరకు భార్యాభర్తలు ఒకరికొకరు తోడు నీడలు కాని ఆత్మకు తోడు ఎవరు?! పరలోకంలోకి మనవెంట నీడలా వచ్చేది ఎవరు... గురువు!!! లేదా ఆత్మ! ఆత్మను గురించి తెలియచెప్పేవాడు, మనంగా ఆత్మను గుర్తించేట్లు చేసేవాడు గురువు కనుక గురువు ఆత్మతో సమానమే. ఆత్మే గురువే కావడం మరో పరిణామం. మన వెతుకులాటలో గురువు 'ఆత్మ' స్థానాన్ని భర్తీ చేస్తాడు. అందువల్లనే గురుశిష్యబంధం భార్యాభర్తల అనుబంధం కన్న గొప్పది, విలువైనది.

డాక్టరుగారు పోయాక అప్పుడప్పుడు అడయారు వెళ్లేవాడిని. శంకరయ్యర్ తనింటి ఆవరణలో ఒక చిన్న పర్ణశాల ఏర్పరచి అందులో ప్రేయర్స్ నిర్వహించసాగారు. ఆయన భార్యపోయింది. వెళ్లినప్పుడల్లా యోగ విషయాలు, మాస్టర్‌గారి విషయాలు చెప్పేవారు. ఆయనకు యోగమే ప్రాణం. అరవై సంవత్సరాలకు పైగా యోగసాధన చేసినవారు.

"మిస్టర్ శర్మా, ఎప్పటికైనా యోగం నీ వల్ల విస్తరిస్తుంది. నా అంతరాత్మ చెబుతోంది. ఇది సత్యం. మనది సత్యయోగం. సత్యయోగం చేసేవారి హృదయం అబద్ధం చెప్పదు. అసత్యం పలికించదు. నీ వల్ల యోగవికాసం కలుగుతుంది. నీకు నా ఆశీస్సులు. ట్రీట్‌మెంట్స్ చెయ్" అని ఆదేశించారు.

కుమారి శోభానాయుడు 'అరంగేట్రం'. ప్రభలో సమీక్ష రాశాను. వెంపటి చినసత్యం వచ్చి తమ అకాడమీకి రమ్మని ఆహ్వానించారు. శోభానాయుడిని పరిచయం చేస్తూ మరో వ్యాసం రాశాను. మంజుభార్గవి, కొత్తపల్లి పద్మ, బాల, సత్యంగారి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీలో నృత్యరత్నాలు. అందరితో పరిచయం అయింది. శ్రీరాం భుజంగరాయశర్మగారు యక్షగాన రచయిత. వారు నాకు బంధువు కావడం వల్ల సత్యం గారితో పరిచయం స్నేహంగా మారింది. ఆ పరిచయంతో మా అమ్మాయి పద్మప్రియకు నాట్యం నేర్పించాలనుకున్నాను. మా అమ్మాయికీ కోపం ఎక్కువే. కుదరలేదు. పద్మ బదులు మా అబ్బాయి వెంకటరమణ నాట్యం నేర్చాడు. 'మాస్టర్ రమణ'గా అచిర కాలంలోనే గురువుల స్థాయికి ఎదిగి, వందలాది ప్రదర్శనలిచ్చాడు. మద్రాసు జీవితం ఓ కాక్‌టైల్‌పార్టీ.

అప్పుడు మా ఇల్లు ఒక యోగాలయం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో మాస్టర్‌గారి విగ్రహం చేయించి ఒక సెంటర్ ప్రారంభించాం. నేను, పెంచలయ్య, ఎం.ఎన్. ఆర్.కె.

ప్రసాద్ అనే అతను. అతనితో ఒక ప్రెస్ ప్రారంభించి, మోసపోయి, నష్టపోయాను. అన్నీ వైఫల్యాలే. విజయాలు కనుచూపు మేరలో లేవు.

ఒకరోజు ఉదయం ప్రేయరు చేసుకుంటుండగా ఎవరో లోపలకువచ్చినట్టు తోచింది. ప్రేయర్ గది తలుపులు గడియ వేసే అలవాటు లేదు. ఎవరైనా ఆలస్యంగా వచ్చినా ఇబ్బంది కలగకుండా ప్రేయరు గదితలుపులు తీసే వుంటాయి. ఆ వచ్చినాయన నా పక్కన కూర్చున్నాడు. వెంటనే త్రేన్పులు, పిల్లికూతలు ఆరంభం. నేలమీద చేతులతో, కాళ్లతో టపటప కొడుతున్న శబ్దాలు. అలాంటి అనుభవం ఎన్నడూ ఎరగను. నాకు ప్రేయర్ కుదరలేదు. ప్రేయరు ప్రశాంతంగా చేసుకోవడం నా అలవాటు. కళ్లు విప్పాను. ఎవరో కొత్తవ్యక్తి. ఎప్పుడూ చూచిన జ్ఞాపకం లేదు. లేచాక పరిచయం చేసుకున్నాడు. ఆయన పేరు తిమ్మావఝల కోదండరామయ్య, మధురై విశ్వవిద్యాలయం ప్రొఫెసరు. పూజ్యశ్రీ వేటూరి వారి శిష్యుడు.

"సంతోషం. ప్రేయరులో అరుపులు, త్రేన్పులు ఏమిటి? ఎంతకాలంగా వస్తున్నాయి" అని అడిగాను.

"అలా ఆరవాలికదండీ! అలా అరిస్తేనే మనలోవున్న దోషాలు ఆవిరైపోతాయి'

"అలా అని ఎవరు చెప్పారు?"

"మా గురువర్యులు ప్రభాకరశాస్త్రిగారు"

"అలా వస్తే ఏమవుతుంది?"

"ఆరోగ్యం చక్కబడుతుంది"

అప్పటికి నాకు వేటూరివారి శిష్యులతో పరిచయం లేదు. ఎం.ఎస్‌గారి శిష్యవర్గంలో ఇలాంటి వర్కింగ్ లేదు.

"రోజూ వస్తాయా?"

"రోజూ నేను ప్రేయర్ చేయను. భయపడిపోతానని ఇంట్లోవాళ్లు భయపడతారు. ఎవరైనా తోడుగా ఉంటేనే ప్రేయర్ చేస్తాను. ఇలా మీలాంటివారి దగ్గర చేస్తాను. ఇవాళ ప్రేయర్ చాలా తృప్తిగా వుంది. మరో ఆరునెలల వరకు ఈ ఎనర్జీ సరిపోతుంది" అని తృప్తిపడ్డాడు.

ఇదేం యోగంరా భగవంతుడా! ఎప్పుడో చేయడం ఏమిటి? భయం ఏమిటి! ఈ వికారం ఏమిటి?

"అయ్యా కోదండరామయ్యగారూ! మీలో ఏదో నెగెటివ్‌వర్కు సాగుతున్నదని నా అనుమానం. అరుపులు, కేకలు, త్రేన్పులు, కాళ్లు చేతులు కొట్టుకోకుండా యోగం కుదిరితే ఎంతో తృప్తిగా వుంటుంది కదా"

"అవును, అదెలా సాధ్యం. మా గురువుగారు లేరు గదా"

"మీగురువుగారు లేకపోయినా నేనున్నాను. నాపై నమ్మకం ఉంటే, ఈరోజు సాయంత్రం, రేపు ఉదయం రండి" అన్నాను.

సాయంత్రం వచ్చాడు. మా యోగమిత్రులు వచ్చారు. ఆయన్ని నాపక్కన కూర్చోమన్నాను. కొంచెంసేపటికి త్రేన్పులు వచ్చాయి. వెంటనే నా చేయి లేచి, అతని తలపైన బ్రహ్మస్థానంలో నొక్కిపట్టింది. త్రేన్పులు ఆగిపోయాయి. మహాప్రశాంతంగా ధ్యానం కుదిరింది.

"అయ్యా గురువుగారూ! నలభై ఏళ్లుగా యోగం చేస్తున్నాను. నిజానికి ఈరోజే తృప్తిగా, ధ్యానంలో సమాధిస్థితికి వెళ్లాను. పరమపదసుఖానుభూతిని పొందగలిగాను" అన్నాడు. అప్పటి నుండి ఉదయం సాయంత్రాలు ఆయన యోగం చేసుకోసాగారు. మద్రాసులో నేను ఉన్నంత కాలం అప్పుడప్పుడు వచ్చేవారు.

\+ + +

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి చివరిశిష్యుడు అనదగిన వ్యక్తి సర్వేపల్లి శంకరయ్య. అప్పట్లో తిరుపతిలో రాములవారి దేవాలయం ప్రక్కన, శాస్త్రిగారింటి దగ్గరగా వుండేవారుట. ఈయన నగర సంకీర్తనం లాంటి భక్తి ముదిరిన పనులు చేసేవారు. శాస్త్రిగారు ఈయన భక్తికి భయపడి యోగంలో చేర్చి, పురప్రజలకు నిద్రాభంగం లేకుండా చేశారు. ఆయన మద్రాసులో మా వీధిలోనే వుండేవారు.

"పోతరాజు నరసింహం గారింటికి వెడదాం రా" అన్నాడు ఒకసారి.

"పి.ఎన్.గారు లేరు. ఆయన భార్య సత్యమ్మ వుంది. వారి ఇల్లు వుంది. ఆమె డైరెక్టు మీడియం కదా"

ఇద్దరం వెళ్లాం. పెంపుడు కూతురు, అల్లుడితో వుంటుంది ఆమె. 90 సంవత్సరాల వయస్సు ఆమెకి. మమ్మల్ని పరిచయం చేసుకున్నాం.

"యోగం చేస్తే కష్టాలు వస్తాయి. మానెయ్యండి" అన్నది.

"మీరు మానుకున్నారా! అనుక్షణం మాస్టరుగారి నామస్మరణ చేస్తారని విన్నాను" అన్నాను నేను.

"అది నాకర్మ. యోగంలో చేరి ఏం అనుభవించాను. పుట్టిన బిడ్డపోయింది. చేసుకున్న మొగుడు పోయాడు. నేను మిగిలాను. యోగం మిగిలింది."

మనిషి తనకు వచ్చిన లాభాన్ని, అనుభవించిన సుఖాల్ని మరచిపోయి కష్టనష్టాల్ని మాత్రమే జ్ఞాపకం పెట్టుకుంటాడు. ఆ చేదుజ్ఞాపకాలే మనిషిని బాధిస్తాయి.

అతలాకుతలం చేస్తాయి. యోగం చేయని వారంతా సుఖపడుతున్నారా! వారికి కష్టాలు రావా?"

"నువ్వేమైన మాస్టరువా! అంత ఖండితంగా చెబుతున్నావు. మాస్టరునిన్ను పంపాడా?" అన్నది.

శంకరయ్యగారు కల్పించుకుని అన్నారు "అవును ... మాస్టరు శార్వరి. మాస్టరుగారు స్వయంగా పంపిన వ్యక్తి."

ఆమె నావైపు నిశితంగాచూచి, "మాస్టర్‌వా, అయితే నీకూ ఒకనమస్కారం" అన్నది.

సత్తెమ్మ ఏం చెప్పారని కాదు. ఆమె కుంభకోణంలో మాస్టర్‌గారితో వున్న వ్యక్తి. పి.ఎన్. గారి సతీమణి. యోగంలో ఏం సాధించిందన్న ప్రశ్న లేదు. సాధించడం సాధించక పోవడం, సాధకుని చేతిలో వుండదు. ఎంత అర్హత, యోగ్యత వుంటుందో అంతే లభిస్తుంది. మన ప్రమాణాలతో యోగఫలాన్ని కొలవకూడదు. ఆ లెక్కన టి.ఎస్. శంకరయ్యర్‌గారు ఏం సాధించారు? మా గురువుగారు ఏం సాధించారు? కీర్తి, ప్రచారం, డబ్బు, శిష్యు ఌ... వీటినిబట్టిగదా జనం ఒక వ్యక్తిని,-అతని ఔన్నత్యాన్ని అంచనా వేస్తారు. ఈ యోగంలో ఆ గొడవల్లేవు. ఎవరూ ప్రచారం చేసుకోరు. పి.ఎన్.గారిని చూడకపోయినా, ఆయన మా గురువుగారికి బాగా ఆత్మీయుడైన వ్యక్తి. మాస్టరుగారు అనేకసార్లు ఆ ఇంట సమావేశాలు, ప్రార్థనలు చేయించారు. కనుక ఆ ఇంట్లో ఒకసారి ప్రేయర్ చేసుకుందాం అనిపించింది. మహాత్ములు నడిచిన ప్రదేశాలు, తపస్సు చేసిన ప్రదేశాలు పుణ్యభూములే.

హైదరాబాదు 1977 - '82

1977 **జీవితాన్ని మరోకమలుపు తిప్పింది.**

మద్రాసుకు 'గుడ్‌బై' చెప్పక తప్పలేదు. ఉగాది రోజునే హైదరాబాదు బయలుదేరాను. పిల్లలకు రిజల్ట్స్ వచ్చాక, టి.సి.లు తీసుకున్నాక రావాలని నిర్ణయం. కేంద్రంలో కాంగ్రెసు ఓడిపోయింది. ఆ రోజునే ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ ఓడిపోయారు. గోయెంకా మొరార్జీకి మిత్రుడు. ఇందిరాగాంధీకి వ్యతిరేకి. కేంద్రంలో జనతా ప్రభుత్వం ఏర్పడనుంది. హైదరాబాదులో గోయెంకా పత్రికలు నిలబడడం ఖాయం. హైదరాబాదులో నాకు తెలిసినవారు రావూరి భరద్వాజ, యూనివర్సిటీలో రీసర్చి చేస్తున్న పి.వి.రమణ, మా తోడల్లుడు సుగుణభూషణ రావు.

నాంపల్లి స్టేషనులో భయంభయంగా అడుగుపెట్టాం. మద్రాసు తమిళులకు తెలుగు సరిగా రాదు. ఇక్కడి హిందీ. ఉర్దూలు వారి పాలిట గ్రీక్, లాటిన్ భాషలే. ఇక్కడ ఎవరూ తెలుగు మాట్లాడరనీ, అంతా ఉర్దూమయం అని మా అభిప్రాయం. మద్రాసులో తెలుగువారు అక్కడక్కడ వున్నా అంతా అరవమేళం, తమిళమోత. స్టేషను బయటకు వచ్చి టాక్సీలు బేరం చేశాం. మద్రాసులో టాక్సీలు చౌక. మీటర్ ఉంటుంది. అడగకుండా, బేరం చేయకుండానే ఎక్కికూర్చుని అడ్రసు చెబితే తీసుకుపోతారు. ఇక్కడ మీటర్ టాక్సీలు లేవు. రెండు టాక్సీల్లో బయటపడ్డాం. వాళ్లకి దోమలగూడా అంటే తెలియలేదు. మొత్తానికి ఆఫీసుకు చేరుకున్నాం. ఒక వాచ్‌మన్, టైం కీపర్ తప్ప అక్కడ ఎవరూ లేరు. మద్రాసు నుండి వచ్చినవాళ్లం పదిమంది. వీక్లీకి ముగ్గురం. వీక్లీ వర్కర్సు కొందరు వచ్చాం. డెయిలీస్టాఫ్ విజయవాడనుండి వస్తారుట. హిమాయత్‌నగర్‌లో ఎక్స్‌ప్రెస్, ప్రభ రిపోర్టర్ల ఆఫీసు మా లాడ్జి. భోజనం ఎం.ఎల్.ఎ.క్యాంటీన్‌లో. 'ఈనాడు' నుండి పొత్తూరు వెంకటేశ్వరరావుగారు డెయిలీ ఇన్‌చార్జిగా వచ్చి చేరారు. విజయవాడ నుండి ఇద్దరు సబ్స్ వచ్చారు. పొత్తూరు వెంకటేశ్వరరావుగారిని చూడగానే గౌరవం కలిగింది. పెద్దమనిషి తరహా. ఆ ధోవతి, లాల్చీ కట్టినతీరు, గుంటూరు జిల్లాది.

ఒకరోజు సాయంత్రం మా తోడల్లుడు సుగుణభూషణరావు వచ్చి వారింటికి తీసుకువెళ్లాడు. సీతాఫల్‌మండిలో వారుండేవారు. ఒక్కపూట అతిథ్యం యిచ్చారు. సిటిలో అయినవారిని ఒక్కపూట పిలిచి భోజనంపెట్టడమే గొప్ప మర్యాద అని తెలిసింది. నేను వచ్చే ముందే పి.వి.రమణకు ఉత్తరం రాశాను. తను ఉస్మానియాలో రీసర్చి చేస్తున్నాడు. నేనంటే ప్రేమాభిమానాలున్న పాతవిద్యార్థి. తను రాలేదు. ఒకపూట నేనే ఆటో చేసుకుని యూనివర్సిటీకి వెళ్లాను. హాస్టల్‌లో అతను దొరకలేదు. బహుశా జంపని అత్తవారింటికి వెళ్లి వుంటాడు. మరొకరోజు రేడియోస్టేషనుకు వెళ్లాను రావూరి భరద్వాజను కలవాలని. ఆయనకు హార్ట్‌అటాక్ వచ్చి ఉస్మానియా ఆస్పత్రిలో చేరినట్లు వార్త. ఆ సాయంత్రమే అతనిని చూడడానికి వెళ్లాను. బావున్నాడు. నేను హైదరాబాదు వచ్చినందుకు ఎంతో సంతోషించాడు. అక్కడే డా॥వి.వి.ఎల్.నరసింహారావుని చూచాను. తను మాచెర్ల కాలేజీ ప్రిన్సిపాలుగా పనిచేస్తున్నాడు. హైదరాబాదులో నాకు తెలిసినవారు వీరు ముగ్గురు కాక మరొకరున్నారు. తాళ్లూరి నాగేశ్వరరావు. తెలుగు అకాడమీలో డిప్యూటి డైరెక్టరు. తెనాలిలో స్నేహం. అతనిని కలిశాను. గాంధీనగర్‌లో ఆతనికి సొంత ఇల్లుంది. ఇంటికి తిసుకువెళ్లాడు. అతను నాకు మంచిస్నేహితుడు.

ఉస్మానియా హాస్టల్‌కువెళ్లి వచ్చిన మర్నాడే మిత్రుడు రమణ, తన మిత్రుడు ఇందుర్తి ప్రభాకర్‌ను వెంటబెట్టుకునివచ్చి కలిశాడు. హైదరాబాదుల్లో నాకు కలవదగినవారు ఈ అయిదుగురే అప్పుడు. విద్వాన్‌విశ్వం, బి.సి.కామరాజు వచ్చారు మద్రాసునుండి. డెయిలీసెటప్ ఆలస్యం అయినా, మా వీక్లీ పని వెంటనే ప్రారంభించాం. మేం వచ్చామని తెలిసి డి. రామలింగం వచ్చి కలిశాడు. అతను మద్రాసులో ఫిలిం సెన్సార్ ఆఫీసరుగా వుండేవాడు. రచయిత, విమర్శకుడు, సమీక్షకుడు. ఎం.ఎల్.ఎ. హాస్టల్‌కు భోజనానికి వెళ్లినప్పుడు మావూరి పెద్దలు, ఎం.ఎల్.ఎ. నన్నపనేని వెంకట్రావు, యడ్లపాటి వెంకట్రావు, కె.రోశయ్య, వీరు ఎం.ఎల్.సి. కలిసి కబుర్లు చెప్పుకునేవారం.

పి.వి.రమణ ఒకరోజు నన్ను 'ఈనాడు' ఆఫీసుకు తీసుకువెళ్లాడు. అక్కడ మేనేజరు తన మిత్రుడు చలసాని ప్రసాద్‌ను పరిచయం చేశాడు. రామోజీరావుగారిని కలిశాను. నన్ను ఈనాడులో వచ్చి చేరమని మద్రాసులో ఉన్నప్పటి నుండి రాయబారాలు సాగుతున్నాయి. నన్ను చూడగానే రామోజీరావుగారు "చేరుతున్నారా?" అని అడిగారు. "మీరు కోరినంత జీతం యిస్తాం, వచ్చిచేరండి" అన్నారు. అక్కడ రామవరపు వేణుగోపాలరావు పిలిచి చెప్పాడు. "ఇక్కడ చేరకండి. ఇక్కడ మీలాంటివారు పని చెయ్యలేరు. ప్రతిమనిషిపై ఇద్దరు సి.ఐ.డి. లుంటారు." ఆలోచనలో పడ్డాను.

మద్రాసులో మాకు బంధువు కె.వి.ఆర్.చారి జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పని చేస్తుండేవారు. వారికి హైదరాబాద్ ట్రాన్‌సఫర్ అయింది ఏడాది క్రితమే. ఎక్కడ వున్నదీ తెలియదు. మద్రాసు నుండిఉత్తరం వచ్చింది, వారు గాంధీనగర్ లోనే వుంటారని, ప్రస్తుతం ఇల్లు ఖాళీగా వుందని, తాళపుచెవి సీతాఫల్‌మండీలో వుందని. వెళ్లి తాళాలు తెచ్చి, ఆ ఇంట్లోకి మారాను. ఆ దగ్గరగా వున్నారు మిత్రుడు తాళ్లూరి నాగేశ్వరరావు. ఆఫీసుకు రెండుకిలోమీటర్ల దూరం. అయితే చార్మినార్ చౌరస్తా నుండి బస్సులో పోవలసి వుంది. డైరెక్టు రోడ్డు లేదు. ఆఫీసువర్కర్లు ఆ ప్రాంతంలో ఎస్.ఆర్.టి. కాలనీలో చిన్న చిన్న ఇళ్లు తీసుకుంటున్నారు. నేనూ ఆ ప్రాంతంలో ఇల్లు దొరికితే బావుండుననుకున్నాను. కొద్దిరోజుల్లోనే దాని పక్కవీధిలోనే ఒక ఇల్లు దొరికింది. తాళ్లూరు నాగేశ్వరరావుగారింటికి రెండవ ఇల్లు. మా ఇంటి ఎదురుగా మల్లాది వెంకటకృష్ణమూర్తి రూం. ఆయన కథలు చాలా ప్రభలో వేశాను. గాంధీనగర్‌ను అప్పుడు న్యూబాకారం అనే వారు. అశోకనగరం నుండి అప్పుడు టాంక్‌బండ్‌కు రోడ్డు లేదు. అన్నీ పొలాలు, రామకృష్ణామఠం, ఇందిరాపార్కు ఏర్పడలేదు. లోయర్‌టాంక్‌బండ్ కింద ఓ ఆశ్రమం వుండేది అడ్డుగా. మేం ఓ సందులో నుండి ఫిజికల్‌ట్రెయినింగ్ కాలేజీ గ్రౌండ్స్ దాటి ఆఫీసుకు వెళ్లేవాళ్లం. చీకటి పడ్డాక అటు వెళ్లేది లేదు. అంతా పాముల మయం. లిబర్టీ దగ్గర బస్సు ఎక్కి, చిక్కడపల్లి క్రాస్‌రోడ్సు దగ్గర దిగి దిగువకు నడిచివచ్చేవాళ్లం.

ఇల్లు దొరికింది. కుటుంబం వస్తుంది. రాగానే ఖర్చులు. విచిత్రంగా ఒక కేసు వచ్చింది. నేను యోగం చేస్తున్నానని తెలిసిన మిత్రుడు శ్రీమన్నవ హనుమంతరావుగారు చిక్కడపల్లిలో ఉంటుండేవాడు. ఒక స్టేట్‌బ్యాంక్ మేనేజరును నా దగ్గరకు పంపారు. అతను బ్యాంకు డబ్బు కొన్ని లక్షలు కాజేశాడని అభియోగం. ఉద్యోగం నుండి సస్పెండు చేశారు. అరెస్టవుతాడని భయం. అజ్ఞాతవాసం చేస్తున్నాడు. అతను వచ్చి, రెండు వేలు యిచ్చి, ఎలాగైనా తనకు సహాయం చేయమని అర్థించాడు. అతను నిజంగా దోషి అయితే, మాస్టరుగారు సాయం చేయరు. నేను యోగంలో అర్థించీ ప్రయోజనం ఉండదు. పైగా డబ్బు తీసుకోవడం! ఇది లంచమా! ప్రతిఫలమా? నేనుగా అడిగింది లేదు. తనంత తానుగా యిచ్చాడు. మన్నవ హనుమంతరావుగారిని కలిసి చెప్పాను.ఇలా జరిగింది. అతను డబ్బిచ్చాడు తీసుకోవచ్చా! తీసుకుంటే మాస్టరుగారికి కోపం వస్తుందేమో! "కోపం లేదు, తాపం లేదు, తీసుకో, ఊరికినే చేస్తే వాళ్లకి నమ్మకం కుదరదు. తర్వాత కృతజ్ఞత వుంచరు. సద్వినియోగం చేస్తున్నప్పుడు మాస్టరుగారికి కోపం రాదు. డబ్బు తీసుకోవడం పాపం కాదు, నేరం కాదు. డబ్బు యిస్తే తప్పు చేయను అంటే తప్పు."

ఆయన సలహా నచ్చింది. యోగం ద్వారా చేసిన సహాయానికి అది తొలిప్రతిఫలం. పైగా నాకు అవసరం వుంది. అవసరం మేరకు డబ్బు తీసుకోవడం తప్పు కాదు అని అంతరాత్మ ఊరడింపు. అతను ఒకటి రెండు లక్షలు బ్యాంకులో జమ చేశాడు నా సలహాపైన. పైవాళ్లు వచ్చి, చెక్‌చేసి పట్టుకునేలోగా అకౌంట్స్ అడ్జెస్టు చేయగలిగాడు. సస్పెన్షన్ కాల పరిమితి తీరగానే డ్యూటీలో చేరాడు. అలాగా నా అవసరం తీరింది. నా గురించి హైదరాబాదులో యోగపరంగా చెప్పుకోసాగారు. శార్వరి కేవలం ఆంధ్రప్రభలో సబ్ ఎడిటర్ కాదు. యోగి. యోగశక్తితో ఎలాంటి జబ్బులైనా నయం చేస్తాడని పి.వి.రమణ ప్రచారం చేయసాగాడు. తను సీన్సియర్‌గా చెబుతాడు.

పి.వి.రమణ, ఇందుర్తి ప్రభాకర్ జంటగా తిరిగేవారు. ప్రభాకర్‌కు యోగంపట్ల ఆసక్తి కలిగింది. అతను జర్నలిస్టు. సురవరం ప్రతాపరెడ్డి రచనలపై పరిశోధన చేసి డాక్టరేట్ అయినాడు. ఎల్.ఎల్.బి. చదివాడు. రాజకీయాలపట్ల ఆసక్తి. ఎన్నికల్లో నామినేషన్లు వేసి విత్‌డ్రా అవుతుండేవాడు. చెన్నారెడ్డి అభిమాని. పి.వి. నరసింహారావుకు బంధువు. చదువు, పరపతి ఉన్నా ఏమీ చేసేవాడు కాదు. రికామీగా తిరుగుతుండేవాడు. బ్రహ్మచారి. అతను శ్రావణపౌర్ణమి, బుద్ధపూర్ణిమ నాడు యోగంలో చేరాడు. ఉపదేశం తీసుకున్నాడు. పౌర్ణమి ఉపదేశాలకు మంచిది.

మద్రాసునుండి కుటుంబం వచ్చింది. అద్దెకు తీసుకున్న ఇంట్లో సామానుపెట్టాం ... మంచిరోజు చూచి పాలు పొంగించి చేరాలని. ఒకరోజు రాత్రి బాగా ముసురుపట్టింది. కుండపోతవర్షం. మేం తీసుకున్న ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు వుండేవి. మాది మెయిన్‌పోర్షన్. తెల్లవారిఉదయం ప్రేయర్ చేసుకుంటూ వుండగా, ఒకామె ఆదుర్దాగా వచ్చి "మీ ఇంట్లో దొంగలు పడ్డారు. తాళం పగులగొట్టి తెరచి వుంది. సామాను చిందర వందరగా పడి వున్నాయి, రండి" అని పిలిచింది. యామినీదేవి, పిల్లలు హడావుడిగా పరిగెత్తారు. నేను ప్రేయర్ మధ్యలో లేవలేకపోయాను. దొంగలు పడినా, ఇల్లు తగులబడుతున్నా ప్రేయర్ మధ్యలో లేవడం నా వల్ల కాదు. ప్రేయర్ అయిన తర్వాత వెళ్లాను. చిందరవందరగా వుంది ఇల్లు. ముఖ్యంగా బంగారం, నగలు, పట్టుచీరలు అవీ వున్న పెట్టె పోయిందని శ్రీమతి బాధగా చెప్పింది. పిల్లల పాంట్లు, షర్టులు బజారున పడి వున్నాయి. నిజానికి పోయినవి పెద్దగా లేవు. దొంగలు డబ్బుకోసం, బంగారం కోసం వెదికి వుంటారు. అవి కనిపించ లేదు. క్రితంరోజు రాత్రి పదిగంటలకు, అందరూ నిద్రపోతుండగా, నేను వెళ్లి ఆ పెట్టె తెచ్చిన సంగతి శ్రీమతికి తెలీదు. చెప్పాను. 'హమ్మయ్య' అనుకుంది. ఏమాత్రం బంగారం అయినా పాతికవేలు. మా బ్రతుక్కి పాతికవేలు సంపాదించడం

మాటలు కాదు. ఒక అట్టపెట్టెలో మాస్టరుగారి పుస్తకాలున్నాయి. వాటిని తీస్తూ దొంగలు పారిపోయారు. మా ఇంట్లోల దొంగలు పడినరోజు, జూలై 7, 1977. చిత్రమైన సంఘటన. ఆ రోజునే కొత్త ఇంటికి మారాం. జర్నలిస్టు వేజ్ బోర్డు పుణ్యమా అని నాకు జీతం పెరిగింది. నెలకు వేయి రూపాయలు దాటింది.

\+ + +

ఆఫీసుకు దగ్గరగా ఇల్లు దొరికిందన్న తృప్తి. మరీ అంత దగ్గర కాదు. రెండు కిలోమీటర్ల దూరం. అయినా నడిచివెళ్లే వీలుంది. నాకుకాస్త సాముద్రికంలో పరిచయం వుంది కాని జ్యోతిషంతో పరిచయం లేదు. వాస్తు అసలు తెలియదు. అప్పట్లో ఎవరూ వాస్తు గురించి పట్టించుకునే వారు కారు. నేను అద్దెకు దిగిన ఇంటికి వాస్తుదోషం ఏమైనా వుందేమో మరి. చేరకముందే దొంగలు పడ్డారు. యోగం చేస్తున్నాం మాస్టరుగారిని నమ్ముకున్నాం ... ఇంక జ్యోతిషం, గ్రహాలు మనల్ని ఇబ్బంది పెట్టవని మొండినమ్మకం మాది. దేవుళ్లను, గ్రహాలను యోగం అదుపు చేస్తుందన్న విశ్వాసం, ఆత్మబలం ముందు గ్రహబలహీనతలు వీగిపోతాయి. ఆ ఇంటికి వచ్చాక మిశ్రమ ఫలితాలు కలిగాయి. ఆఫీసులో ఎప్పుడూ సుఖం లేదు. పైవారి ఒత్తిళ్లు తప్పవు. జర్నలిజంలో పత్రికలలో ఆనాడు కులాభిమానం హెచ్చుగా కనిపించేది. ఆంధ్రపత్రికలో బ్రాహ్మలకు తప్ప మిగిలినవారికి అవకాశం వుండేది కాదు. ప్రభలో అన్ని కులాలవారు వుండేవారు గానీ, నార్లగారు వదలిన తర్వాత ఇక్కడా బ్రాహ్మణాభిమానం ఎక్కువైంది. పాతవారిని తీసివేయలేక చిత్రహింసలు పెట్టేవారు.

వాటిని గురించి నేను అంతగా పట్టించుకునేవాడిని కాను. ప్రొప్రయిటర్ల అభిమానం వుంది. ఇంతో అంతో పేరున్న రచయిత పత్రికలో సబ్‌ఎడిటర్‌గా వుండడం రచయితలకు మంచి చేస్తుంది. రచనల మంచి చెడు నిర్ణయించడం రచయితలైన ఎడిటర్లకు సులభం. సాటి రచయితల అభిమానం పొంద వీలుండేది. దినపత్రికల మాట ఎలావున్నా, కథలూ నవలలతో నడిచే వారపత్రికలకు కాస్త సాహిత్య వాసన కలవారు, రచయితలు, కవులు సంపాదక వర్గంలో ఉండడం అవసరం. ఆంధ్రప్రభ. ఆంధ్రపత్రిక వీక్లీలు ఆ ఆనవాయితీని పాటిస్తూ వచ్చాయి. వీక్లీ సర్క్యులేషన్ పెరిగినంతకాలం యాజమాన్యం సిబ్బందిని ఇబ్బంది పెట్టదు. అందుకే ప్రభలో ఉద్యోగం కంచుకోటలో కొలువులాంటిది.

పెద్దబ్బాయి వసంతకుమార్ మద్రాసులో ఎం.ఎ. రెండవ సంవత్సరం చదువుతున్నాడు. రెండవ అబ్బాయి శ్యాంసుందర్ సర్దార్ పటేల్ కాలేజీలో బి.కాంలో

చేశాడు తనకు చార్టర్డ్ అకౌంటెన్సీ చేయాలని కోరిక. మూడవ అబ్బాయి వెంకటరమణ పాస్ చేయాలన్న సంకల్పంతో ఒక సంవత్సరం చదువు నష్టపడి, చైతన్యకాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో బై.పి.సి.లో చేరాడు. అమ్మాయి పద్మప్రియ కేశవ మెమోరియల్‌లో పదవతరగతిలో చేరింది. అది 77లో మా ఇంటి పరిస్థితి. రమణ స్కూలులో శ్రీ వెంపటి చినసత్యంవద్ద కూచిపూడి డాన్సు నేర్చుకున్నాడు ఒక సంవత్సరం. చదువు వచ్చాక డాన్సు మానవలసి వస్తుందని బెంగపడ్డాడు. సత్యంగారు కూచిపూడి నృత్య అకాడమీ బ్రాంచి హైదరాబాదులో స్థాపించారు. కుమారి శోభానాయుడు దానికి ప్రిన్సిపాల్. రమణ శోభానాయుడు దగ్గర చేరాడు.

కొత్త ఊరు పాత ఉద్యోగం. చాలని జీతం. పై సంపాదనకు అవకాశం లేదు. ఎన్నో తంటాలు పడాలి. ఇంటి ఖర్చులు పెరిగాయి. పిల్లలు కాలేజీ చదువులు, ఫీజులు, పుస్తకాలు, పైఅవసరాలు. రావూరి భరద్వాజకోసం రేడియో స్టేషన్‌కు వెళ్లితే శర్మగారు, బాలకృష్ణ, పాలగుమ్మి విశ్వనాథం, ఇంకా ఎవరెవరో పరిచయమైనారు. రేడియో ప్రోగ్రామ్సు రాసాగాయి. 'ఎ' గ్రేడు రచయితగా గుర్తింపు వచ్చింది. ప్రతి సంవత్సరం 'రిపబ్లిక్‌డే' సందర్భంగా జాతీయకవి సమ్మేళనాలకు నాకూ అవకాశం దొరికింది. రేడియోవారి ప్రత్యేక కవిసమ్మేళనాలలో నేనూ ఉండేవాడిని. పి.వి. రమణ ద్వారా 'ఈనాడు' వారికి, రామోజీరావుగారికి పరిచయమైంది. చలసాని ప్రసాదరావు ఆదివారం సంచిక చూచేవారు. దానికి, విపుల, చతుర మాసపత్రికలకు రెగ్యులర్‌గా రాయసాగాను. జస్ట్ డబ్బుకోసం. నా కథలు, నవలలు, 'వింతలు - విడ్డూరాలు' కన్నడ పత్రికల వారు అనువాదం చేసుకుని డబ్బులిచ్చేవారు. హిందీ పత్రికలలో నాకథలు వచ్చాయి. అలాగ మొత్తం మీద బండిసాగింది.

కొత్త ఇంటికి వచ్చాక మంచే జరిగిందో చెడే జరిగిందో చెప్పలేను. రెండూ జరిగాయి. ఒక సంవత్సరం తిరిగింది. వసంతకుమార్ ఎం.ఏ. పూర్తిచేసుకుని వచ్చాడు. చైతన్య కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. జీతం తక్కువే. తనకు రీసర్చి చేయాలని కోరిక. ఉప్పులూరి నారాయణరావుగారు గుంటూరునుండి వచ్చినపుడు కలుస్తుండేవారు. విజయవాడ నుండి దాసుగారు, సీతారామయ్యగారు వచ్చేవారు. యోగపరంగా పెద్దల పరిచయం, సత్సంగం. అదొక మానసికతృప్తి. స్థానికంగా మన్నవ హనుమంతరావుగారు సుపరిచితులు. బంధువుల రాకపోకలు పెరిగాయి. మద్రాసులో వుండగా అయినవారి కోసం, బంధువులకోసం వాచిపోయినట్టుండేది. ఇక్కడ వద్దన్నా బంధువుల రాకపోకలు ఎక్కువ. ఊళ్లో చాలామంది బంధువులున్నారు. అందరితో పరిచయం అయింది.

మద్రాసుతో సంబంధం తెగిపోయింది. హైదరాబాదు రావడం యోగ మిత్రులకు ఆనందంగా వుంది. ఎప్పుడూ ఎవరో ఒకరు రావడం తృప్తి. నా మాస్టర్ యోగదర్శిని, డిస్కవరీ ఆఫ్ మాస్టర్ యోగా పుస్తకాలు యోగాసర్కిల్‌లో మంచి స్ఫూర్తిని కలిగించాయి. చాలామంది ఉత్తరాలు రాయసాగారు. యోగం గురించి తెలుసుకోవాలని వచ్చేవారు. నిజానికి యోగం గురించి చెప్పే శక్తి నాకు లేదు. మిత్రులు నారాయణరావుగారు, సీతారామయ్యగారు, దాసుగారు ఆ బరువు నా తలపైకెత్తారు. నేను సాదాసీదా సాధకుణ్ని. రాయడం చేతవును కాబట్టి ఏదో ఒక పుస్తకం రాశాను. అది కొందరికైనా స్ఫూర్తినిస్తోంది. ప్రజల ఆసక్తిని నిలవరించడం నాచేతుల్లో లేనిపని. అలా పరిస్థితుల్ని బట్టి, నన్ను నేనుగా యోగానికి అంకితం చేసుకోవలసి వచ్చింది.

యోగంలో చేరినప్పటి నుండి నాకో అలవాటు. మాస్టర్‌గారి జన్మదిన సందర్భంగా, పత్రికలలో మాస్టరు గురించి, యోగం గురించి వ్యాసాలు రాసేవాడిని. హైదరాబాదు వచ్చాక ఇండియన్ ఎక్స్‌ప్రెస్, క్రానికల్, తెలుగు దినపత్రిక లన్నింటిలో మాస్టరుగారి ఫొటోతో వ్యాసాలు ప్రచురించడం వల్ల జనానికి యోగం గురించి ఆసక్తి పెరగసాగింది. లోగడ యోగం గురించి రాయకూడదని, ప్రచారం పనికిరాదని చెప్పేవారు. నాకు రాయాలనిపించి అలా రాయసాగేను. విమర్శలు ఏనాడు లక్ష్యపెట్టలేదు. తిట్టినవారిని, అవమానించినవారిని క్షమించి వదలిపెట్టాను. యోగం ద్వారా ఏదో సాధించాలని, లబ్ధి పొందాలని, కీర్తి గడించాలని నాకు ఎన్నడూలేదు. యోగం ద్వారా ఆరోగ్యం పొందాను. మనశ్శాంతి లభిస్తోంది. ఆ ఫలితాలు ఇతరులూ పొందాలన్నదే ఏకైకవాంఛ. స్వర్గం, మోక్షం పట్ల కలలు కనలేదు.

అప్పుడొకసారి సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడింది. దాంతో విలయం సంభవిస్తుందని, ప్రళయం వస్తుందని భయపడ్డారు. స్వాములు, మఠాధిపతులు రకరకాలుగా ప్రచారం చేసుకున్నారు. తాము తప్ప మిగిలిన ప్రజలంతా చచ్చిపోతారని, తాము మాత్రమే ప్రళయజలంపై తేలి, మరో యుగం ఏర్పరుస్తామని, తామే పవిత్రులమని అన్నారు. అయితే యోగశక్తితో అలాంటి ప్రమాదాలను దాటవచ్చునని నా అభిప్రాయం. అంతకుముందు వచ్చిన అష్టగ్రహ కూటమి సందర్భంగాను అలాగే ప్రచారం జరిగింది. మద్రాసు వదలి చాలామంది వెళ్లిపోయారు. కొందరైతే తిరువణ్ణామలై వెళ్లి కొండెక్కి కూర్చున్నారు, సముద్రం పొంగితే కొండపైన ప్రాణాలు నిలుపుకోవచ్చునని. మాస్టర్‌యోగం ప్రారంభమైనప్పుడే గ్రహాలను కట్టడి చేయడం జరిగింది. మరో ప్రళయం రాదని మాస్టరుగారు చెప్పారు.. వచ్చేది ప్రళయం కాదు, పరిణామం. పరిణామం కాలానుగతికం.

యోగంతో, సూక్ష్మశరీరంతో రోదసి లోకి వెళ్లి రావచ్చు. నా యోగం, నా సాధన లోకానికి ఉపకరిస్తుందని, మేలు చేస్తుందని నా నమ్మకం. మానవ శ్రేయస్సును కాంక్షించని తపస్సు నిరర్థకం. తన సుఖం కోసం, తన మోక్షం కోసం తపస్సు చేసేవారు ఎవరైనా మోక్షాన్ని పొందారో లేదో తెలియదు. తెలియనిదాని కోసం మానవతను విస్మరించడం తప్పు.

సూర్య, చంద్ర గ్రహణాలు ఖగోళంలో గ్రహచలనం వల్ల ఏర్పడేవి కనుక వాటివల్ల ప్రళయాలు రావు. ముందుగానే ఫలానారోజు ఇన్ని గంటల ఇన్ని నిమిషాలకు సంభవిస్తాయని లెక్కలు వేసి చెప్పగలుగుతున్నాం. మంచి, చెడులు ఏవికానీ అనుభవించవలసిందే అందరం. చిన్నవైనా, పెద్దవైనా ఎవరరికి వారు అనుభవించాలి. యోగఫలితాలు, అనుభవాలు ఎవరికి వారుగా తెలుసుకోవలసిందే. యోగసాధన నాకు మొండితనం నేర్పింది. సత్యాన్ని నేరుగా గ్రహించడం నేర్పింది.

ప్రళయం వచ్చినా పత్రికలవారికి సెలవు దొరకదు. ఆరోజు సంపూర్ణ సూర్య గ్రహణం. ఏదో ప్రమాదం ముంచుకు వస్తున్నట్టు యావత్ ప్రపంచం ఊపిరి బిగబట్టి చూస్తోంది. మాకు వార్తల ఆరాటం. నాకు గ్రహణ సమయంలో యోగసాధన చేయాలని పట్టుదల. ఒంటి గంటకు ఇంటికి చేరాను. ఉదయం భోజనం చేయలేదు. ఆదరాబాదరాగా తలనిండా నీళ్లు కుమ్మరించుకుని, తడిబట్టలతోనే ధ్యానానికి కూర్చుండిపోయాను. తలుపులు, కిటికీలు బిగించారు. క్రమంగా వీధుల్లో జనసంచారం తగ్గింది. కోడికూతలు వినిపించసాగాయి. సూర్యుని వేడి తగ్గింది. వెన్నెల కాస్తున్న అనుభూతి. చలి. టెంపరేచర్ పడిపోయింది. కటిక చీకటి. నక్షత్రాలు పైన. పట్టపగలు నక్షత్రాలు కనిపించడం, ఇంట్లో సైతం దీపాలు వెలగడం, నేను కళ్లు విప్పలేదు. సమాధిస్థితికి వెళ్లిపోయాను. సూక్ష్మశరీరం రోదసిలోకి వెళ్లిపోయింది. గ్రహాలు, నక్షత్రాలు దాటిపోయింది. ఖగోళాన్ని దర్శించింది. సృష్టిరహస్యం తెలుస్తోంది. సాయంత్రం అయిదున్నర వరకు అదే యోగస్థితి.

లోగడ అనేకసార్లు సూక్ష్మశరీరం వేరై శూన్యంలో పయనించిన అనుభవం వుంది. కనుక భయం వేయలేదు. అయినా చైతన్యం తప్పలేదు. బయట వాస్తవప్రపంచం గమనింపులోనే వుంది. అప్పుడప్పుడు మాటలు, శబ్దాలు చెవిని పడుతున్నాయి. కళ్లు తెరవలేనిస్థితి. మరుక్షణంలో ఆత్మ పై లోకాలకు వెళుతోంది. గ్రహణం వీడిన తర్వాతగానీ నాకు స్పృహ రాలేదు. ఆ నాలుగైదు గంటలు ఎన్నో యోగముద్రలు, భంగిమలు వచ్చాయి. ఒక దశలో తలుపులు తెరచుకుని బజారులోకి వెళ్లానుట. నేను యోగస్థితిలో గమనించిన విషయాలు, ఎక్స్‌ప్రెస్ మిత్రులకు చెబితే నమ్మలేదు. మర్నాడు అమెరికన్

సైంటిస్టులు అవే విషయాలు వెల్లడిచేస్తే ఆశ్చర్యపడ్డారు. యోగదృష్టి శాస్త్రీయ దృష్టి అవుతుంది. శాస్త్రకారునిది యోగదృష్టే. విజ్ఞానం సరిహద్దు దాటితే జ్ఞానం అవుతుంది. యోగంలో నేను అందుకోగలవి సత్యాలు అని నిర్ధారణ చేసుకున్నాను ఆనాడే.

ఉద్యోగం చేస్తున్నా శ్రద్ధపోయింది. భార్యాబిడ్డల పోషణ కోసం సంపాదన కావాలి.ఉద్యోగం చేయాలి. మాస్టర్ వాణి లోపల నుండి వినిపిస్తోంది - నన్ను పూర్తిగా యోగానికి అంకితం కమ్మని. అది పరమగురువుల ఆదేశం. జరిగి తీరుతుంది. కొన్ని నెలలు సందిగ్ధం. ఉద్యోగం మానటమా? మాని ఏం చేయాలి! బాధ్యతలు తీరలేదే, ఎలా? యోగసాధన రోజురోజుకు తీవ్రం కాసాగింది. మనస్సు మరో పనిమీదికి పోదు. పిచ్చిపట్టినట్లు చికాకు, ఏమీ రాయబుద్ధి కాదు. కథలు, నవలలు,రేడియోకి నాటికలు, ప్రసంగాలు ఏవైనా రాసే అవకాశం వుంది. రాసే శక్తి వుంది. కాని రాయబుద్ధి కాదు. ఇతర పత్రికలకు రాయడం మానివేశాను. ఎలా అయితే అలా అవుతుంది. ఏదో మార్గం మాస్టరుగారే చూపిస్తారు. అదొక నమ్మకం. అని ఊరకే కూర్చోలేం కదా! స్వార్థం లేదు. స్వప్రయోజనాకాంక్ష లేదు. పని చేయడం ఫలితం ఆశించకపోవడం! అంతే. లక్ష్యసాధనలో ఎన్ని కష్టాలు వచ్చినా, బాధలు కలిగినా యోగసాధకుడు సిద్ధం.కావాలి. కరగనిదే బంగారం శుద్ధి కాదు. సుత్తిదెబ్బలు తగలనిదే బంగారం ఒక ఆకృతి దాల్చదు. మనిషీ అంతే, యోగసాధకుడూ అంతే. కష్టాలు, బాధలు అనే దెబ్బలు భరించాలి. యోగసాధన అప్పుడు, ఒక సుందరరూపాన్ని సంతరించుకుంటుంది. శుద్ధబంగారం ముద్దమందారంలా వుంటే అలంకరణకు పనికిరాదు.

ఆఫీసులో నా యోగం గురించి అందరికీ తెలియదు. ఎడిటర్స్ విద్వాన్ విశ్వం, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎ.బి.కె. ప్రసాద్ గార్లకు నాపట్ల గౌరవానికి యోగం ఒక కారణం. యోగం చేస్తున్న వ్యక్తి ప్రమాదకారి కాడు, అబద్ధాలు చెప్పడు. ఇతరులకు హాని చేయడు. తనపని తను చూసుకుపోతాడు. ఎవరికీ శత్రువు కాలేడు. ఎవరిపట్ల శత్రుత్వం వహించలేడు. ఈ గుణాలు చాలు ఏ ఉద్యోగికైనా భద్రత కలిగించడానికి. విద్వాన్ విశ్వం వేటూరి ప్రభాకరశాస్త్రిగారి విద్యార్థిగా వున్నప్పుడు ఈయోగం చేసి భయపడి మానివేశారుట. పొత్తూరి వేంకటేశ్వరరావుగారు జిల్లెల్లమూడి అమ్మ భక్తుడు. సహజంగా సంప్రదాయాన్ని గౌరవించే వ్యక్తి. ఎ.బి.కె. ప్యూర్ కమ్యూనిస్టు అనడం కన్నా రాడికలిస్టు అంటే బావుంటుంది. దేవుళ్లు, నమ్మకాలు బొత్తిగా లేనివాడు. అయినా నా యోగశక్తిని రుచి చూచినవాడు.

ఆయన డెయిలీ ఎడిటర్. నేను వీక్లీలో వున్నాను. ఇంకా డెయిలీకి మారలేదు. నన్ను డెయిలీకి మార్చాలని ఎ.బి.కె. ప్రయత్నం. ఆయనకు ఒంటి కణత నొప్పి, కళ్లు

పీకుతాయి. ఒకప్పుడు ఆ జబ్బు నాకూ వుండేది. యమబాధ. యోగంలోకి వచ్చాక తగ్గింది నాకు. ఒకనాడు ఎడిటోరియల్ రాయడానికి తలపట్టుకు కూర్చున్నాడు. నన్ను పిలిచాడు. తన గదిలోకి వెళ్లాను. ఓ సిగరెట్ అడిగి తీసుకున్నాడు. ఏమిటి బాధ అంటే చెప్పాడు. నేను రెండు కప్పులు టీ తెప్పించి, ఆయన కొకటి యిచ్చి, నేనొకటి తీసుకున్నాను. "టీ త్రాగండి, తలనొప్పి తగ్గిపోతుంది" అన్నాను.

'టీ' పేరుతో నేనేదో చేశానని ఆయన నమ్మాడు. రెండునిమిషాలలో తలనొప్పి మాయమైంది. 'సంపాదకీయం రాసుకోండి' అనిచెప్పి నేను బయటకు వచ్చాను. సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లి 'నొప్పి ఎలా వుంది' అని పరామర్శిస్తే, 'నొప్పి ఏమిటి, ఎవరికి?'అని ఎదురుప్రశ్న వేశాడు. తన నొప్పి సంగతి మరచిపోయాడు.

నాకు తెలియకుండానే నా యోగం ఇతరుల పట్ల ప్రేమగా మారసాగింది. అన్ని వందల మంది పనిచేసే ఆఫీసులో అందరూ నన్ను ప్రేమగా, అభిమానంగా పలకరించేవారు. వారి పట్ల నా ప్రవర్తన అలాగే వుండేది. మేనేజరు నుండి వాచ్‌మెన్‌వరకు అందరూ అభిమానంగా, గౌరవంగా వుండేవారు. వర్కర్ల సమస్యలు నేను పరిష్కరించాలి. యూనియన్ వుంది. యూనియన్ పెద్దలకు నా సలహా, సహకారం కావాలి. రెండు యూనియన్లను సమాధాన పరచేది నేను, నా ఒక్క వోటుతో యూనియన్ బలాబలాలు తేలిన సందర్భాలున్నాయి. కనుక రెండు యూనియన్ల పెద్దలు నా మాటను, సలహాలు గౌరవించేవారు. 350 మంది వర్కర్లకు అధికారం లేని నాయకుడిని నేను. మంచితనం, ప్రేమ నన్ను నడిపించాయి. హృదయాన్ని జయించడానికి 'ప్రేమ' ఒక్కటే ఉపాయం. ఏ సమ్మె జరిగినా నాకు మినహాయింపు. లోపలకు వెళ్లి నన్ను అడ్డుకునేవారు కాదు. నాది ఎగ్జిక్యూటివ్ హోదా.

అదీ ఆఫీసు వాతావరణం. ఇంటికి వస్తే యోగం. దాదాపు సాహిత్యరచన మూలపడింది. ఎప్పుడో చదివి, చదివి, అర్థంకాక వదలిన అరవిందుని 'సావిత్రి' మరల చదవాలనిపించింది. చదివాను. అనువాదం చేస్తే!... ఒకరోజు ప్రేయర్‌లో 'సావిత్రి'ని రాయమని మాస్టరు, అరవిందులు ఆదేశించినట్లయింది. అనువదించడం కాదు, రాయడమే. 'సావిత్రి' ఆధారంగా 'సావిత్రి' రాయాలి. పునస్సృష్టి జరగాలి. నేను అర్థం చేసుకున్నది మాత్రమే నా పాఠకులకు చెప్పగలను. రోజూ ప్రేయర్ చేసుకుని 'సావిత్రి' ముందుపెట్టుకుని కలం తీసుకునేవాడిని. మొదటి పంక్తి రాయడానికి వారం రోజులు పట్టింది. అయినా పట్టు విడవ దలచలేదు. మనస్సులో మరొక ఆలోచన చొరబడడం లేదు.

పెద్దబ్బాయి వసంతకుమార్ ఎం.ఏ. పూర్తి చేసుకుని వచ్చి చైతన్య కళాశాలలో లెక్చరర్‌గా చేరాడు. అదే కాలేజీలో ఇంటర్ సీనియర్‌లో రమణ, జూనియర్‌లో పద్మప్రియ చదువుతున్నారు. శ్యాం సుందర్ పటేల్ కళాశాలలో బి.కాం. చైతన్య కాలేజీ ప్రిన్సిపాల్ సుందరరామయ్య తెనాలి కాలేజీలో నాస్టూడెంట్. అందుకని పిల్లల అడ్మిషన్లకు కష్టపడవలసి రాలేదు.

యోగం ఏదో మనశ్శాంతి నిస్తోంది అనుకున్నాను. ముందు అలాగే అనిపించింది. కాని కొంతదూరం వెళ్లాకగాని తెలియలేదు. ఆపైన ముందుబాట లేదని, అది దుర్గమారణ్యం అని. ప్రతిసాధకునికి కొంతదూరమే ఒక మార్గం వుంటుంది. ఆ తర్వాత రోడ్డు ఆగిపోతుంది. ప్రయాణం ఆగదు, ఆగకూడదు. అక్కడ ఆగిపోయేవారే ఎక్కువ. ఆపైన మహారణ్యంలో ప్రవేశించడానికి సాహసం కావాలి. సాహసమే ఊపిరి కావాలి. అక్కడ ప్రాణాయామం చేస్తూ, ఆసనాలు వేసుకుని కూర్చుంటే కుదరదు. ప్రతిక్షణం అప్రమత్తంగా వుండాలి. కన్ను మూయడానికి లేదు. విశ్రమించడానికి వీలులేదు. ఎక్కడకు పోతున్నామో తెలియదు. ఎంత దూరం పోవాలో తెలియదు. లోపలకు చొచ్చుకు పోవడం ఒక్కటే. తీగలు, చెట్లు, పొదలు, పాములు, క్రూరమృగాలు... వీటిని ఛేదించుకుంటూ, దాటుకుంటూ, తప్పించుకుంటూ పోవాలి. ధైర్యం కావాలి. నా ప్రయాణం అలా సాగింది. అప్పటివరకు ఒక గురువు, మాస్టరు కరుణ వుంటే చాలునని నిర్భయంగా వున్నాను. అవి మాత్రం చాలవు. ముందుకు సాగవలసింది మనమే. గౌతమ బుద్ధునికి అవరోధాలు తప్పలేదు. అగ్ని పరీక్షలుతప్పలేదు. నాకూ తప్పలేదు. ఎవరికైనా తప్పవు. పరీక్షలో నెగ్గనివాడు కృతార్థుడు కాడు. విజయం సాధించాలంటే అన్ని పరీక్షలు నెగ్గాలి. అగ్ని పరీక్షల నెదుర్కోవాలి. తప్పదు.

అప్పుడే మా కుటుంబం చాలా అలజడులకు లోనైంది. కారణం తెలియదు. ప్రకృతి వైపరీత్యాలు కొన్ని, గ్రహాల ఆగ్రహావేశాలు కొన్ని, అప్పట్లో తెలంగాణాలో బాణామతి ప్రయోగాలు వినిపిస్తుండేవి. చార్మినార్ క్రాస్‌రోడ్డు వద్ద లక్ష్మీ గణపతి ఆలయంలో అర్ధరాత్రి పూట రాళ్లు పడేవి. ఎవరు విసిరేది తెలిసేది కాదు. జనం భయకంపితులైనారు. రాత్రి తెల్లవార్లు పోలీసులు కాపలా వుండేవారు. చుట్టుపట్ల మేడలపైన పహరా వున్నారు. అయినా ఎవరో విసిరి వేసినట్లు రాళ్లు పడేవి. భక్తులు ఆ గుడికి వెళ్లడం బంద్ చేశారు. జనం గుండెల్లో భయం. రైళ్లు పరిగెత్తేవి. రెండు వారాలపాటు అలా జరిగింది. ఒకరోజు మధ్యాహ్నం వేళ మా ఇంట్లోకి ఒక రాయి రివ్వున వచ్చి పడ్డది. మండు వేసవి కాలం. బయటకు వెళ్లి చూస్తే నాలుగు రోడ్లలో మనిషి

జాడలేదు. అది బాణామతి ప్రయోగమని ఇరుగుపొరుగువారు భయపెట్టారు. మాస్టరుగారి యోగంలో వున్న మనకి అలాంటి భయం ఉండకూడదని, ఎలాంటి ఇబ్బందులు రావని ఒక పిచ్చి నమ్మకం. నేను ధైర్యం చేసి, ఆ రాయి తీసి, పొట్లం కట్టి, రోడ్డు మీదికి విసిరివేశాను ... చిత్రంగా ఆ రాయి రోడ్డుమీద పడకముందే మాయమైంది. ఆరోజు నుండి లక్ష్మీ గణపతి ఆలయంలో రాళ్లు పడడం ఆగిపోయింది.

అప్పుడే మా ఇంట ఒక విచిత్ర సంఘటన జరిగింది. రాత్రిపూట ఏవేవో శబ్దాలు వినిపిస్తున్నాయని పక్కపోర్షన్ల వాళ్లు వచ్చి చెప్పసాగారు. ఎవరో నడుస్తున్నట్లు అనిపించేది. దయ్యాలా? భూతాలా? ఏమో మరి! ప్రేయర్‌కు కూర్చోగానే మా పిల్లలు వసంతకుమార్, రమణ పైకి ఏవో క్షుద్రశక్తులు వచ్చి ఆవహించేవి. ఆ శక్తులు వారిని ఆవహించినప్పుడు వారికి ఎంతో బలం వచ్చేది. దెబ్బలాటలు, పోటాపోటీలు జరిగేవి.

రమణ అయితే కాలేజీనుండి వస్తూనే పూనకం వచ్చిన వాడిలా ఊగిపోతూ, కళ్లు ఎర్రగా చేసుకుని వచ్చి పడేవాడు. నా చేయిపట్టి బరబరా మంచం మీదికి లాక్కుపోయి 'నీ మాస్టర్ శక్తివంతుడో, నేను శక్తివంతుడనో తేల్చుకుందాం రా' అని పిడికిలి బిగించి, దానిని విప్పమనేవాడు. కోపోద్రేకంతో నా వైపు చూచి ఫీంకరించేవాడు. ఎవరినీ దగ్గరకు రానిచ్చేవాడు కాదు. నాకు ఆ గుప్పిట విడిపించడం అసాధ్యం అనిపించేది. అంత బలం ఎలా వచ్చేదో! రెండు మూడు గంటలకుగానీ ఆ ఉద్రేకం తగ్గేది కాదు. అలాగే వసంతకుమార్ పైకి ఏవో శక్తులు వచ్చేవి. అతని జుత్తులో వేలుపెడితే, స్టీలు తీగలతో జల్లెడ పేనినట్లు వేలుదూరేది కాదు. ఏవో క్షుద్రశక్తులనే భ్రమలో అతని జుత్తు పట్టుకునేవాడిని. ఆ తర్వాత అతని జుత్తు రాలిపోయి బట్టతల అయింది. ఈ గొడవలకు మా రెండవ అబ్బాయి శ్యాంసుందర్, అమ్మాయి పద్మప్రియ దూరంగా వుండేవారు. శ్యాంకు భయం. అమ్మాయికి భయం లేదు కాని నిమ్మకు నీరెత్తినట్లు వుండేది. అమ్మా నాన్న అంటే అపరిమితమైన ప్రేమ, గౌరవం పద్మప్రియకు.

ఇందుర్తి ప్రభాకర్, పి.వి. రమణ ప్రేయర్‌కు వస్తుండేవారు. ప్రభాకర్‌కు యోగావర్కింగ్ బావుండేది. ట్రాన్స్‌లోకి వెళ్లిపోయి ఏవేవో చెప్పేవాడు. మాస్టరు గారి ఫోటో వద్ద నిలబడి ధ్యానించేవాడు. ఆ ఫోటో తీసి, ఇల్లంతా తిప్పేవాడు. గమ్మత్తుగా వుండేవి. అతని వర్కింగ్సు. వెరీ సిన్సియర్.

"గురూజీ, ఏవో శక్తులు మీకు పరీక్షలు పెడుతున్నాయి. వాటిని ఎదుర్కోవాలి" అన్నాడు ఒకరోజున.

"క్షుద్రశక్తులా?" అని అడిగాను.

"కాదు. ఏవో గ్రహశక్తులు. కొన్ని దివ్యశక్తులు. కొందరు ఋషులు,యోగులు మీకు పరీక్ష పెడుతున్నారు. ఈ పరీక్షలో మీరు నెగ్గాలి."

"ఎలా!"

"ఒక పదిహేను రోజులపాటు మనం అర్ధరాత్రి మెరిడియన్ ప్రేయర్ చేయాలి. అప్పుడుగాని ఆ క్షుద్రశక్తులు వదలిపోవు."

"రాత్రి పన్నెండు గంటలకు చేయగలమా?"

"చేద్దాం. తప్పదు. రోజూ నేను, రమణ వస్తాం. రెండువారాలు చేద్దాం. అలా చేయమని మాస్టర్‌గారి ఆదేశం" అన్నాడు ప్రభాకర్.

"అలాగే చేదాం"

రోజూ వారిద్దరూ రాత్రిపూట వచ్చేవారు. ఏవేవో కబుర్లు చెప్పుకుని, నిద్ర ముంచుకు రాగానే పడుకునేవాళ్లం. ఎవరికి ముందు మెలకువ వస్తే వారు మిగిలిన వారిని నిద్రలేపాలి. చిత్రంగా పన్నెండుకు అయిదు నిమిషాలుందనగా ఎవరికి వారు ఉలిక్కిపడి నిద్రలేచి, ప్రేయర్‌కు కూర్చుండిపోయేవారు. అరగంట నుండి గంటవరకు సాధన సాగేది. అలా పదిహేను రోజులు అర్ధరాత్రి ప్రార్థనలు జరిగాయి. చివరి రోజున ప్రభాకర్ ఏవేవో శాంతులు చేశాడు. మాస్టరుగారి ఫోటో చేతుల్లోకి తీసుకుని ఇల్లంతా తిప్పాడు. అతనికి అలా అనిపించింది, చేశాడు. నో కామెంట్.

ముగ్గురు నలుగురు ప్రతికూలంగా పనిచేస్తున్నారు. వారు నలుగురూ సజీవులే, గొప్ప పేరున్నవారు, స్వామీజీలుగా చలామణీ అవుతున్నారు. వారికి నాపైన కోపం దేనికి? ఈ యోగంలోని వారు ఎవరి జోలికి పోరు! ప్రభాకర్ అన్నాడు ... 'వారు ఈయోగాన్ని సంపూర్ణం కాకుండా తమ క్షుద్రశక్తుల్ని ప్రయోగిస్తున్నారు. ఇది సత్యయోగం. వారి ప్రాచుర్యానికి ఈ యోగం అడ్డు వస్తున్నదని భయం. యోగంలో ఎవరు ముందుకు పోతుంటే వారికి ఆ శక్తులు ఆటంకాలు. ఈ క్షుద్రశక్తులు వదలిపోయిన తర్వాత శ్రీమతిపైకి ఒక దేవత వచ్చింది. మేం ఘర్షణ పడ్డాం. ఆరోజు సాయంత్రం ప్రేయర్‌లో ఆ దేవత ఒక మహాశక్తిగా వచ్చి, ఆమెలో ప్రవేశించింది. నేను ఆమె ఎదురుగా కూర్చుని, పరమ వినమ్రంగా ఒక గంటపైగా ధ్యానించాను. మర్నాటికి ప్రతికూల పవనాలు తగ్గిపోయాయి. అంతా ప్రశాంతమైంది.

అది యాదృచ్ఛికం కావచ్చు. విధి లిఖితం కావచ్చు. మా నాన్నగారుచనిపోయారు. అప్పుడప్పుడు తెనాలి వెళ్లిచూచి వచ్చేవాడిని తప్ప, ఆయన నా వద్దకు వచ్చి ఉన్నది లేదు. చాలా కాలంగా అనారోగ్యం వెంటాడుతోంది. ఆయనకు ట్రీట్‌మెంట్ యిచ్చే డాక్టరు

పోతుకూచి వెంకటేశ్వర్లుగారు నాకు మిత్రుడు. "మీరేం గాభరా పడకండి, ఆయన కోమాలో నాలుగైదు రోజులుంటారు. అప్పుడు ఫోన్ చేస్తాను. వద్దురు గాని" అన్నారు. ఆయన ఊహించినట్లు నాన్నగారు కోమాలోకి పోలేదు. ఆయనకు సహాయంగా మా బావగారు యల్లమందాచారి, చెల్లెలు అపర్ణ ఇంట్లోనే వుండేవారు. ఒకరోజు రాత్రి ఆయన పోయినట్లు ఆఫీసుకు ఫోన్ వచ్చింది. ఒక వర్కరు వచ్చి ఆ వార్త మా మేనమామగారికి అందించారు. ఆయన అప్పుడు తన కొడుకు దగ్గరకు వచ్చారు. వెంటనే నేను, యామినీదేవి, మేనమామ చివరి బస్సుకు బయలుదేరాం. స్వయాన అక్కగారి భర్త చనిపోతే తాను రానని పేచీపెట్టారు మేనమామ. 'ఖర్చులు నేనే పెట్టుకుని తీసుకుపోతాను. తెలిసీ మీరురాకపోతే ఊరిలో బావుండదు. నలుగురూ మీకు, నాకు వైరం అనుకుంటా' రని బ్రతిమిలాడి బయలుదేర తీశాను. బస్సు దిగాక మా ఇంటికి రాకుండా, తనవారింటికి వెళ్లిపోయాడు.'తర్వాత నెమ్మదిగా వస్తాను, ఈ లోపు కార్యక్రమం సాగించండి' అని సలహా! శుభకార్యాలకు రాకపోయినా, అశుభ కార్యాలకు రావడం తప్పనిసరి. అదొక సంప్రదాయం!

. నాన్నగారు పోయారన్న దిగులు లేదు. ప్రతివారు ఎప్పుడో ఒకప్పుడు పోక తప్పదు. నాకు కంట తడిరాదు. నేను ఏడ్వకపోవడం బంధువులకు అబ్బురమనిపించింది. నా శ్రీమతికి ఒక పట్టాన ఏడుపురాదు. మా పాప 'భాను' పోయినప్పుడు మా ఇద్దరి కన్నీరంతా ఖర్చయిపోయింది. ఇంక ఎవరికోసం కన్నీరు మిగలలేదేమో! తన తల్లిదండ్రులు పోయినప్పుడు ఆమె లోపల కుమిలిపోయింది గానీ, పైకి ఏడ్వలేదు. ఇప్పుడు మా నాన్నగారు పోయినప్పుడు లాంఛన విషాదమే కనిపించింది. జననమరణాల రహస్యం తెలిసిన ఆత్మలు కన్నీటిని విడుదల కానీయవు. 'జాతస్య మరణం ధృవం'.

మేం ఇంటికి వెళ్లేసరికి ఊళ్లో నా మిత్రులంతా ఎదురుచూస్తున్నారు. నాచిన్న చెల్లెలు పార్వతి రాలేదు. మా పినతల్లి గారి అబ్బాయి బాలకృష్ణ, బాబాయి శివరామకృష్ణ పూనుకున్నారు. రవీంద్రప్రసాద్ మనుషుల్ని ఏర్పాటు చేసి, రుద్రభూమి ఏర్పాట్లు చేశాడు. ఆ రోజు శ్రీరామనవమి. తెనాలిలో శ్రీరామనవమి అంటే బ్రహ్మోత్సవాలను మరపిస్తాయి. 'మేళం' ఏర్పాటు చేయమని మా అమ్మగారి ఆర్డరు. మేళగాళ్లు దొరకలేదు. ప్రతిపందిరికి ఒక మేళం ఎప్పుడో బుక్ అయింది. అయినా సీతారాముల కళ్యాణం ముందు మా నాన్నగారి 'మరణమృదంగం' ముఖ్యం కాదు. నాయనగారు పోయినందుకు కాదు మేళం పెట్టనందుకు మా అమ్మగారు శోకించసాగింది. మేనమామ వచ్చి మందలించాక శోకం తగ్గించింది.

మేం వచ్చిన అరగంటలో మా చిన్నబ్బాయి రమణ వచ్చాడు హైదరాబాదు నుండి. మేం బయలుదేరే వేళకు తను ఇంటికి రాలేదు. తనకు కాలేజీ అయినాక డాన్సు కాలేజీకి వెళ్లేవాడు. ప్రొద్దుపోయి ఇంటికి వస్తాడు. "తాతయ్య చనిపోతే వెళ్లవద్దా" అని అన్నలపైన కోపపడి, తాను బస్సుకు బయలుదేరి హుటాహుటిన వచ్చాడు.

సాంప్రదాయంగా శవపూజ అయింది. నా స్నేహితులు, నాన్నగారి అభిమానులు ఒకవందమంది వరకు వచ్చారు. రథం భుజాలపైకి ఎత్తుకోబోతుండగా "శార్వరీ" అని ఓ పెద్దపిలుపు వినిపించింది. ఆగాను. అలా పిలిచే వారెవరు? మా అమ్మ 'కృష్ణా' అనే పిలుస్తుంది. బంధువులు 'పెద్దోడా' అనేవారు. మిత్రులు శర్మగారు, శార్వరిగారు అంటారు. మేనమామ కృష్ణా అనో పెద్దకృష్ణుడనో అంటారు. చుట్టూ పరికించాను. లోపలకు వెళ్లాను. వంటగది పక్కగది తలుపులు దగ్గరగా మూసి వున్నాయి. తలుపులు తెరిచాను... మా 'రమణ' పద్మాసనంలో కూర్చుని, మంచి సమాధిస్థితిలో వున్నాడు. అతనిలో 'మాస్టరుగారి గాంభీర్యం కనిపించింది. నమస్కరించి, ఎదురుగా కూర్చున్నాను. ప్రార్థనచేసి, తనని యోగస్థితి నుండి లేపాలని నా ప్రయత్నం. తనే, నా తలపైన తన చేయివుంచాడు. వీపుపై నిమిరాడు. అయిదు నిమిషాల తర్వాత లేచి వచ్చాను. తను చేతనలోనే వున్నాడు. ఫరవాలేదు. ఆ పిలుపు' మాస్టరుగారిది. అప్పటి అతనిలోని దీప్తి, వర్చస్సు మాస్టరుగారివి. ఆ సంఘటన తెనాలిలో కథలుగా చెప్పుకున్నారు.

శవయాత్ర ప్రారంభమైంది. ఆరంభంలో యాభై మంది వున్నారు. రెండు ఇళ్ల అవతల సందు మలుపు తిరిగే సరికి, మా ముందు 'సీతారామకళ్యాణం' చేయించేవారు మేళతాళాలతో పట్టుబట్టలతో బయలుదేరారు. అలా ఒక్కొక్క రోడ్డు మలుపు తిరుగుతుంటే ఒక్కో మేళం మా ముందు నడిచింది. మూడు కిలోమీటర్ల దూరం, అలా మా ముందు భజంత్రీలు నడిచారు. దారిపొడవునా, అభిమానులు రెండువందల వరకు వచ్చి చేరుతూనే వున్నారు. ఆయన చేసుకున్న పుణ్యం అది. మద్రాసులో మా పాప 'భాను' పోయినప్పుడు, గురువుగారు బాలసుందరరావుగారు పోయినపుడు అలాంటి దృశ్యాలు చూచాను. భాను ఆగస్టు 15న, బాలసుందరరావుగారు వినాయక చవితి రోజున, నాన్నగారు శ్రీరామనవమి రోజున పోయారు. మూడూ పుణ్యదినాలే. ఆగస్టు 15 అరవింద యోగి జయంతి. కర్మాంతరాల చివరిరోజున అలాగే జరిగింది. మేం మాట్లాడుకున్న పురోహితుడు రాలేదు. ఎవరో వచ్చారు. శాంతిసమయంలో సప్తర్షుల వలె ఏడుగురు ఉద్దండ వేదపండితులు రెండు గంటలపాటు వేదపఠనం చేశారు. నాన్నగారు ఎంత సామాన్యంగా జీవించినా ఆయన చేసిన తపస్సు ఫలించింది. మరణంతో మహాత్ములు అవుతారు కొందరు. నాన్నగారు అజ్ఞాతంగా జీవించిన జ్ఞాని. మహర్షి.

బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో మా సహోద్యోగి వి.డి.యస్. ప్రసాదరావు నా జాతకం చూచి "శార్వరీ, నీది కర్మసన్యాస యోగం. పితృకర్మ చేస్తే తప్ప జీవితంలో వెలుగు కనిపించదు. అప్పటి వరకు ఒకవిధంగా చీకటి జీవితమే. ఎంత ప్రతిభ కనబరచినా, ఎంత కష్టపడినా తగిన గుర్తింపు ప్రతిఫలం లభించదు" అన్నారు. నా చిన్నతనంలో మా తాతగారు అంటుండేవారు 'నీవు ఎప్పటికైనా సన్యాసివి అవుతావు. నీకు పెళ్లి, సంసారం అవసరం లేదు కృష్ణా' అని. మా అమ్మగారు సైతం అదే పాట పాడేది. నేను సన్యాసిని అవడం, అవకపోవడంపై వీరికింత శ్రద్ధ ఎందుకో! సంసారం వదలి సన్యసించడం ఆ కాలంలో గొప్పత్యాగం. గొప్ప ఆధ్యాత్మికత! సన్యాసం స్వీకరిస్తే చాలు, స్వర్గం అరచేతికి అందివచ్చినట్లే. ప్రసాదరావుగారు చెప్పినదాంట్లో ఒక తిరకాసు వుంది. కర్మసన్యాసయోగం అంటే కర్మ చేశాక సన్యసించడమా! కర్మనే సన్యసించడమా! పితృకర్మ చేసి[illegible]ర్వాత అదృష్టం కలిసి వస్తుందన్నారు. అది ఏ రూపంలో వుంటుంది. అదృష్టం [illegible]నుక కంటికి కనిపించదు.

మా పెద్దమ్మగారు ప్రేమగా 'పిచ్చిసన్నాసి' అంటుండేది. అప్పట్లో అది ముద్దు అని [illegible]ురిసిపోయాను. అదే నిజమైతే! వారంతా జోస్యం చెప్పినట్లు సన్యాసిని కాలేదు. కాషాయం కట్టలేదు. సంసారాన్ని త్యజించనూ లేదు. యోగంలో చేరాను. ఏ సన్యాసికైనా 'యోగం' అంతిమలక్ష్యం అని అప్పుడు తెలీదు. పైపై వేషాలు ఎన్ని వేసినా, వేయకపోయినా జీవితంలో చివరి మజిలీ ధ్యానం - తపస్సు - యోగం. ఈ మూడు మూడు మెట్లు. పూర్వ ఋషులు ఎవరూ సన్యసించినవారు కారు. హాయిగా, భార్యాబిడ్డలతో అరణ్యాలలో ఆశ్రమాలు నిర్మించుకుని తపస్సు చేసేవారు. సన్యాసం అనేది బౌద్ధం తర్వాత, బౌద్ధాన్ని దెబ్బతీయడానికి తయారైన ప్రక్రియ. బౌద్ధ శ్రమణులకు పోటీగా హైందవంలో సన్యాసం ఆవిర్భవించింది. గృహస్తుగా వుంటూనే తపస్సు చేసుకోవచ్చు. ఆధ్యాత్మిక వికాసానికి భార్యాబిడ్డలు అవరోధం కాదు.

నాయనగారు పరమపదించిన తరువాత నా జీవితం మలుపు తిరిగింది. తెనాలిలో ఉన్న ఇల్లు అమ్మకానికి పెట్టాం. అది ఒక్కటే పిత్రార్జితం. అదీ మా అమ్మగారి పేర వుంది. ఆమె దానిని అమ్మడానికి, ఆ ఊరు వదలి రావడానికి మతరాము అంగీకరించలేదు ... పేచీ పెట్టింది. నిరాహార దీక్ష ప్రారంభించింది. చెల్లెళ్ల ఆమెకు వత్తాసు పలికారు. ఆ ఇల్లు నాకు కలసి రాలేదు. ఎప్పుడూ దరిద్రమే. ఆ ఇంట్లో ఎవరూ సుఖపడ్డది లేదు. నేను తిరిగి ఆ ఊరు వెళ్లి ఆ ఇంట్లో వుండేది లేదు. ఆ ఇల్లు అమ్మితే 'శని' విరగడ అవుతుందని అమ్మకు నచ్చచెప్పాం.

రిజిస్ట్రేషన్ రేపు అనగా మా అమ్మ పంచాయితీ పెట్టింది. అమ్మగా వచ్చే డబ్బులో తనకు, కూతుళ్లకు కొంత యివ్వాలన్న కండిషన్. ఒప్పుకున్నాను. అక్కడ కె. రవీంద్రప్రసాద్ అని ఓ మిత్రుడున్నాడు. అతనిది వెండినగలషాపు. నా దైన్యస్థితి చూచి, తనకు తెలిసిన ఒక జ్యోతిష్కుని పిలిపించాడు. అతని పేరు తెలియదు, షిర్డీసాయి భక్తుడు. బాగా చెబుతాడని పేరుంది. ఆయన మొక్కుబడిగా చేయి చూచి, తర్వాత మొహం చూచి, చెప్పడం మొదలెట్టాడు.

"ఈ డబ్బు తీసుకుపోయి మీరు ఇల్లు కొనాలనుకు[illegible]టున్నారు. ఇల్లు కాదు కదా, కనీసం స్థలం కూడా కొనలేరు. ఆ డబ్బుతో ప్రెస్ పెడతారు. మీ సొంత సంపాదన అందులో కొంత చేర్చుతారు. ఆ ప్రెస్ నడుస్తుందిగానీ, మీరు అనుభవించరు. పిత్రార్జితం మీకు దక్కదు. ఈ డబ్బు మొత్తం ప్రెస్ పేర వ్యయం అవుతుంది. మీరు పెట్టే సొంత డబ్బూ పోతుంది. పిత్రార్జితం మీరు ఒక్కరూపాయి అనుభవించలేరు."

నాకు తల తిరిగింది. నాకూ కాస్తసాముద్రికం వచ్చుగాని ఇలా చెప్పడం రాదు. అది 'షిర్డీబాబా' అంతర్వాణి. ఆయన చెప్పినట్లు మర్నాడు రిజిస్ట్రేషన్ అయింది. ఇరవై వేల వరకు అక్కడ ఖర్చయింది. నలభైవేలు నా చేతికొచ్చింది. సెలవుపెట్టి ఒక నెలరోజులు తెగ తిరిగాను ... చిన్నఇల్లుగానీ, స్థలంగానీ కొనాలని. కుదరలేదు. మా పెద్దబ్బాయి కాలేజీఉద్యోగం మాని స్వంతప్రెస్ పెట్టాలని ప్లాన్ వేశాడు. ఆ డబ్బు అందుకోసం ఖర్చయింది. మరో ఇరవైవేలు నా సంపాదన పెట్టుబడి పెట్టాను. అది చిన్న ప్రెస్. నా మాటకు, నా డబ్బుకు విలువలేదని అప్పుడే గ్రహించాను. అదీ సన్యాసం. ఎంత సంపాదించినా విలువ లేదు. సానుభూతి లేదు. కొందరి జీవితాలు అంతేనేమో! రాత్రింబవళ్లు గొడ్డులా చాకిరీ చేసి, సంపాదించినా కనీస సుఖాలకు నోచుకోరు.

నా జాతకం మారదు. కష్టపడడం వరకే నా వంతు. ఎవరినీ యాచించకపోయినా పేదవాడంటే సమాజం చిన్నచూపు చూస్తుంది. 'జర్నలిజం' అందరికీ అర్థమయ్యే ఉద్యోగంకాదు. చుట్టుపక్కలవారు గౌరవం చూపని ఉద్యోగం నాది.

యోగం దిశగా ...

గ్రహాలు మనిషి జీవితాన్ని నిర్దేశిస్తాయి...శాసిస్తాయి. యోగం గ్రహాల్ని నిర్దేశిస్తుంది, శాసిస్తుంది. ఇది ఒక అపూర్వ, విచిత్రపరిణామం. యోగంలోచేరిన ప్రతి వ్యక్తి, గ్రహాల్ని అదుపు చేయలేడు. మదుపు చేయలేడు. యోగం పూర్ణ ఫలితాల నెస్తునప్పుడు మాత్రమే గ్రహాలు తమ ప్రభావాల్ని మనిషికి అనుకూలంగా మార్చుకుంటాయి. గ్రహస్పందన మన హృదయస్పందనతో మమేకం అవుతుంది. 1980 నుండీ నా బ్రతుకులో కొత్త రాగాలు వినిపించసాగాయి. నా ప్రయత్నం, కృషి ఎంతమాత్రం కాదని నాకు తెలుసు. అంతా మాస్టర్ గైడెన్స్. నేను సంపూర్ణంగా యోగానికి, మాస్టర్‌గారికి సమర్పణ చేసుకోగలిగాను అది ఒక్కటే నాకు తెలిసింది. నా వల్ల యోగానికి ఏదో జరిగిందని చెప్పే సాహసం నాకు లేదు. కాని యోగం వల్ల నా బ్రతుకు బాట కొత్త మలుపులు తిరగసాగింది. అది పూర్వపుణ్యమో, యోగఫలమో చెప్పలేను.

మద్రాసులో శ్రీ శంకరయ్యర్‌తో సంబంధం పోయింది. బాల సుందరరావుగారు పోనే పోయారు. ఇద్దరికీ దూరమైన నేను ఒంటరివాడి ననుకుంటున్న తరుణంలో నా శిష్యులు అనేవారు, నన్ను అమితంగా ప్రేమించేవారు నాకు దొరికారు. శ్రీ దిడుగు నారాయణరావు, దాసు ఆత్మీయులైనారు. వీరిద్దరు హైదరాబాదు ఎప్పుడు వచ్చినా నన్ను చూడకుండా పోయేవారు కారు. నారాయణ రావుగారు నివురుకప్పిన నిప్పు. యోగ విజ్ఞానం నరనరాన జీర్ణించుకున్నవాడు. పూర్ణయోగి. గుంటూరులో, పిడుగురాళ్లలో యోగ సమావేశాలు నిర్వహిస్తుండేవారు. శ్రీ కవులూరి సీతారామయ్యగారు సత్యయోగి, 80 సంవత్సరాల వయస్సు, ఆయనను చూస్తే, ఒక్కసారి పాదాభివందనం చేస్తే ఎవరికైనా యోగస్ఫూర్తి కలుగుతుంది. మనశ్శాంతి లభిస్తుంది.

ఈ త్రిమూర్తులు నాకు యోగమార్గదర్శకులుగా నిలిచారు. "నీ వెనుక మేము వున్నాం. ముందుకు నడువు" అని వెన్నుతట్టి నడిపించిన మహర్షి సత్తములు. ఒకసారి

మిత్రులు నారాయణరావుగారు ఒక మీసాల ఆసామిని వెంటబెట్టుకుని వచ్చారు మా ఇంటికి. చిన్న ఇల్లు, అంతటి పెద్దవారు ఆ చిన్న ఇంట్లో ఇమడరు. ఆరుబయట కుర్చీలు వేసుకున్నాం. "వీరే శార్వరిగారు. నమస్కారం చేసుకో..." అన్నారు నారాయణ రావుగారు. ఆయన నా వైపు చూచి మీసాలు మెలిపెట్టి, గమ్మున కూర్చున్నారు. నమస్కారం చేయలేదు.

"నేను చిన్నవాడిని, మీసాలు లేనివాడిని. వీరెవరో నాకు తెలియదు గానీ వీరి మీసాలు నాకు నచ్చాయి. వీరి మీసాలకు నా నమస్కారం" అన్నాను.

ఆయన పకపక నవ్వి, కుర్చీలోంచి లేచి, నన్ను లేచి నిలబడమని, గట్టిగా కౌగలించుకుని "వండ్రఫుల్. ఏమో అనుకున్నా. గట్టివాడే"అన్నాడు.

"ఏం గట్టి... నాఎముకలు కాస్త లూజ్ అయ్యాయి మీ ఘాటుప్రేమకు" అన్నాను.

"జర్నలిస్టు కదా! మా సీతారాం జర్నలిస్టే గాని వాడిలో సెన్స్ ఆఫ్ హ్యూమర్ బొత్తిగా లేదు. శార్వరి రచయిత, పొయెట్ కదా. ఆ మాత్రంసెన్స్ ఆఫ్ హ్యూమర్ వుండాలి" అని అభినందించారు.

ఆయన డి.ఎస్.రావు. బొంబాయిలో రైల్వే ఇంజనీరు. రిటైర్ అయి హైదరాబాదు వచ్చారు. సీతాఫల్‌మండిలో ఒక పెద్ద ఇల్లుంది. బొంబాయిలో సెటిల్ కావడమా, హైదరాబాద్‌లోనా అని ఆలోచిస్తున్నారు. నాతో పరిచయం అయిన తర్వాత హైదరాబాదుకు మకాం మార్చారు.

"నేను హైదరాబాద్ ఎన్నుకోడానికి కారణం నీవే. రిటైర్డ్‌లైఫ్ యోగంలో గడప దలచాను. నారాయణరావు నిన్ను పరిచయం చేశాడు" అన్నారు.

కొన్నాళ్లు బొంబాయిలో ఉండి వస్తుండేవాడు. అక్కడ ఆస్తులున్నాయి. అద్దెలు వస్తాయి. హైదరాబాదు వచ్చినప్పుడు వచ్చి కలిసేవాడు. టోటల్‌గా యోగానికి అంకితమైన వ్యక్తి. ఆయన కొడుకు ఇరాన్‌లో ఉంటాడు. కూతురు పెళ్లయి బొంబాయిలో వుంటోంది. మరొక కొడుకు ఉన్నాడుగానీ అడ్రసు తెలియదు. భార్య, బొంబాయిలోనే వుంటుంది. ఈయనతో వుండేది కాదు. ఇక్కడ ఇద్దరు తమ్ముళ్లు. వారి సంసారాలు వారివి. తల్లి వుండేవారు. ఆ తల్లిగారు మాస్టర్ ఎం.ఎన్‌గారి శిష్యురాలు. మా ఇద్దరిమైత్రి బలమైంది.

\+ + +

ఒకమారు దాసుగారు అశోకనగర్‌లో ఒకసమావేశం ఏర్పాటు చేసి, హైదరాబాదులో వున్న యోగసాధకుల్ని పిలిచారు. కవులూరి సీతారామయ్యగారు ఏవేవో

కోర్సులు చేయించారు. డి.ఎస్.రావు, నేను కలిసివెళ్లాం. కొన్నిరోజులు అలా కోర్సులు చేయించారు. డి.ఎస్. రావుగారు చొక్కా విప్పి, వెల్లకిలా పడుకుని గురకపెట్టేవారు. కాని చేస్తున్న కోర్సుల గురించి తెలుస్తూనే వుండేది. నిద్రలేపి "ఏమిటి గురక పెడుతూ నిద్ర... కోర్సు చేయిస్తుంటే" అని ప్రశ్నిస్తే... " ఈ నేమ్ గదా చివరగా చేయించింది" అని ఆ నేమ్ చెప్పేవాడు. అంత గురకనిద్రలో వున్నా, ఆయన కోర్సు వినేవాడు. వర్కింగు ఉండేది. అదొక చిత్రమైన అనుభవం. పైగా కోర్సులు చేయిస్తున్నప్పుడు కూర్చునే ఓపికలేనివారు పడుకోవచ్చని చెప్పారు. అయితే నిద్ర పోకూడదు. ఒక్కొక్కసారి కోర్సులు గంటలకొద్దీ సాగేవి. అప్పుడు చేయించే వ్యక్తి తప్ప, సాధకులంతా పడుకునే వుండేవారు. తొలినాళ్లలో మాస్టరుగారు కొత్తసాధకుల్ని 'శవాసనం'లో పడుకుని సాధన చేయమనేవారుట. మద్రాసులో శంకరయ్యర్ ఇంటివద్ద ప్రేయర్‌కు వచ్చేవారు ఓతుండు తెచ్చుకుని పరచి బెర్త్ రిజర్వు చేసుకునేవారు.

ఒకమారు దిడుగు నారాయణ రావుగారు నన్ను తీసుకుని బ్యాంకు కాలనీలో ఒక ఇంటికి వెళ్లారు. అక్కడ శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ పంతులుగారిని పరిచయం చేశారు. ఆయనకు ఎనభై వయస్సు. వారిది తెనాలి. పెద్ద లాయరు. సన్నగా, రివటలా వున్నా ఆరోగ్యంగా వున్నారు. వారు ఎం.ఎస్.గారి ప్రియశిష్యులు. మదర్ వెంకమ్మగారికి తెనాలిలో తమ ఇంట అనేకమార్లు అతిథ్యం యిచ్చినవారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారి మిత్రుడు. ఆయనకు పాదాభివందనం చేశాను.

"అయ్యా! తమరు తెనాలి వాస్తవ్యులు. నేనూ తెనాలివాడినే" అని పరిచయం చేసుకున్నాను.

నేను హైస్కూలులో చదివేరోజుల్లో వారిని చూచాను.

ఆయన నన్ను ఆశీర్వదించారు. ఆయన రోజూ ముప్పయి నలభై మందికి విందు చేసేవారు. ఆస్తి అంతా హరించుకుపోయింది. కొడుకులు దూరమైనారు. చిన్న కొడుకు ఇంట హైదరాబాదులో వుంటున్నారు. ఆ చిన్న కొడుకు తెనాలి కాలేజీలో నా స్టూడెంటు. వారు యోగం గురించి అద్భుతంగా చెప్పేవారు. ఇంగ్లీషులో బాగా చదివిన వారు. గొప్పవక్త. బార్ ఎట్ లా. ఆయన చెప్పే విషయాలు ఏవీ జ్ఞాపకం వుండేవి కావు. వాటి సారం మాత్రం హృదయంలో పదిలంగా మిగిలేది. గొప్ప ప్రసంగాలు జ్ఞాపకం ఉండవు. వాటి సారాంశం అనుభూతిగా మిగులుతుంది. ఒక స్పందన కలిగిస్తుంది. వారి మాటలు నాలో బీజాలుగా నాటుకునేవి. ఎప్పుడో అవి మొలకెత్తి మహావృక్షాలవుతాయి. ఆయన రోజూ కాకపోయినా, ప్రతి ఆదివారం మా ఇంటికి ప్రేయర్‌కు వచ్చేవారు.

గంటసేపు సమాధిలో వుండేవారు. వారు చెప్పిన మాటలు అప్పటికి అర్థంకాక, మరచి పోయినా తర్వాత అవి నాలో భావాలను మొలకెత్తించి, వాక్యాలుగా, రచనలుగా పరిణామం చెందాయి.

\+ + +

మాస్టరు జన్మదిన సందర్భంగా, నాలుగు వ్యాసాలురాసి, మాస్టరుగారి ఫొటోలతో నాలుగు పత్రికలలో ప్రచురించేవాడిని. మా అబ్బాయి 'మాస్టర్ రమణ' పేరుతో ఒక డెయిలీలో వచ్చిన వ్యాసం చదివి మెదక్‌జిల్లా నుండి ఒక పెద్దాయన వచ్చాడు. ఆయన వెంట ఒకరిని తోడుగా తెచ్చుకున్నాడు. అడ్రసు సంపాదించి పొద్దున్నే ఇంటికి వచ్చాడు. రమణగారు కావాలన్నాడు. అప్పుడు రమణ కాలేజీకి వెళ్లే హడావిడిలో వున్నాడు. వాకిట్లోకి వెళ్లగానే ఆయన 'రమణ' కాళ్లపైన పడి సాష్టాంగ నమస్కారం చేశాడు. రమణ 'నేనుకాదు నాన్నగారితో మాట్లాడండి' అంటూ వెళ్లిపోయాడు.

ఆయనకు డెబ్బయి ఏళ్లుంటాయి. ఏవో జపతపాలు ఆచరించాడు. కొంతకాలం ధ్యానం చేశాడుట. ఎక్కడో ఉపదేశం తీసుకున్నాడు. కాని తృప్తి లేదు. సాధనలో ఏం సాధించిందీ తెలియదు.

"మీకేం కావాలి చెప్పండి" అని అడిగాను.

"నాకు బ్రహ్మాన్ని చూపగలరా?"

"బ్రహ్మం అంటే మీరు అనుకునేది ఏమిటి? బ్రహ్మం ఒక రూపంలో, ఆకారంలో వుండదు. అది నిర్గుణం. అనుభూతితో మాత్రమే బ్రహ్మానందస్థితి కలుగుతుంది. మీరు ఏదైనా ఒకరూపంలో ధ్యానించివుంటే చెప్పండి. ఆ రూపంలో మీకు సాక్షాత్కరించేటట్లు చేస్తాను. లేదంటారా... బ్రహ్మాన్ని నిర్గుణ, నిరాకార, నిశ్చలనస్థితిగా అనుభవించేటట్లు చేస్తాను. మీకు ఏది కావాలి?"

"మీ ఇష్టం. జీవితకాలం యావత్తూ అన్వేషణలోనే గడిచింది. ఎన్నో సాధనలు చేశాను. ఏమీ లభించలేదు. ఈ వయస్సులో నాకేది అవసరమో దాన్ని అనుగ్రహించండి చాలు" అని చేతులు ముకుళించాడు. భగవంతుడు ఏ రూపంలో మనం అన్వేషిస్తే ఆరాధిస్తే, ఆ రూపంలోనే దర్శనమిస్తాడు. అలా కోరనివారికి నిర్గుణత్వం బ్రహ్మానందానుభూతిగా మిగులుతుంది.

ఆఫీసు సమస్యలతో నేను సీరియస్‌గా వుండేవాడిని. ఎవరితో చనువుగా మాట్లాడను. టెన్షన్ ఎక్కువ. యోగం గురించి తెలుసుకోవాలని వచ్చేవారితోనూ సీరియస్‌గానే వుంటాను. అందువల్ల ఎవరూ నాదగ్గర అతిగా మాట్లాడరు. ఆయన రెడీ

అయినాడు. పాదప్రక్షాళనం చేసుకువచ్చి, నా పాదాలకు నమస్కరించి కూర్చున్నాడు. కళ్లు మూసుకోమని చెప్పి నుదుట విభూతి పెట్టాను. నిమిషంలో ఆయన బాహ్యస్మృతి కోల్పోయాడు. గొప్ప సమాధి స్థితి అది. బాగా సాధన చేశాడు. ఒక గంటసేపు అలా నిశ్చలంగా వున్నాడు. ఈలోగా నేను భోజనం చేసి ఆఫీసుకు రెడీ అయినాను. గంటతర్వాత ఆయన్ని లేపాను.

విప్పలేక, విప్పలేక, కళ్లు విప్పాడు. కాళ్లపైన పడి భోరున ఏడ్చాడు. అది పరాకాష్టకు చేరిన ఆనందం."గురుదేవా! నా జన్మ ధన్యమైంది. ఇంతకాలానికి ఒక సద్గురువు దర్శనం అయింది. ఇన్ని సంవత్సరాలుగా ఎందరినో సేవించాను. ఎన్నో చేశాను. ఈ అనుభూతి కలగలేదు. ఈరోజు బ్రహ్మానందానుభూతితో తలమునకలైనాను.ఈ జన్మకిది చాలు మహాత్మా."

ఉపదేశం చేయమని అర్థించాడు. "మీకు వేరే ఉపదేశం అవసరం లేదు. రోజూ ఉదయం సాయంత్రం మాస్టర్‌గారిని స్మరించి ధ్యానం చేసుకోండి. అదే ఉపదేశం... మీకు అవసరమైనంత వరకు మాస్టర్ కరుణ లభిస్తుంది. అదనంగా కోరినా దొరకదు. మీకు ప్రాప్తం ఉండబట్టి నావద్దకు రాగలిగారు. అదీ మాస్టర్ గారి సంకల్పమే. మాస్టరుగారు తమ యోగానికి అర్హులైనవారిని తామే ఎన్నిక చేస్తారు. వారి యోగసాధనకు నావంటివారు కేవలం సహాయకులు మాత్రమే. అందరికీ పరమగురువు మాస్టరుగారే" అని చెప్పి పంపాను.

\+ \+ \+

ఒకరోజు ఒకాయన వచ్చారు. నా వయస్సే వుంటుంది. ఎప్పుడూ చూచిన జ్ఞాపకం లేదు. పరిచయమూ లేదు. కాని అతను ఎంతోకాలంగా మా మధ్య స్నేహం వున్నట్లు చనువుగా మాట్లాడసాగాడు. మద్రాసులో ఉండగా ఎవరైనా తెలుగువారు వచ్చినా, బెరుకుగా మాట్లాడేవారు. అక్కడి తెలుగువారిని దత్తత్తపోయినవారిలాగా, ప్రవాసుల్లాగా చూచేవారు. యోగమిత్రులు మద్రాసులో తక్కువ. కుంభకోణంవెళ్లి వచ్చే యోగసాధకులు వచ్చి పలకరించినా, అది లాంఛనం. హైదరాబాదు వచ్చాక, యోగాభిమానులు అప్పుడప్పుడు రాసాగారు. అప్పటికి నాకు సన్నిహితులైన యోగమిత్రులు అందరూ నా కన్న సీనియర్లు.

'నా పేరు ఘంటప్ప. ఆదోని' ఆ పరిచయమే చెబుతోంది యోగసాధకుడని. రచయితలు ఇంటికి వస్తుంటారు. వారి ధోరణి వేరు. వారిని చూడగానే పోల్చుకోగలను. రచయిత్రులు అనేకమంది వచ్చేవారు. వారి సిగ్గులు, వయ్యారాలు ఇట్టే పట్టిస్తాయి.

"మీరు యోగం చేస్తారా? ఎంతకాలం నుండి చేస్తున్నారు? ఎవరివద్ద ఇనీసియేషన్ తీసుకున్నారు?"

అవి నేను సాధారణంగా యోగసాధకులను అడిగే ప్రశ్నలు. ఆ మూడు ప్రశ్నలకు సమాధానం యిస్తే, వారిని అంచనా వేసుకోగలను.

"నేను రొట్టె బసప్ప దగ్గర చేరాను. మా ప్రాంతంలో చాలామందికి యోగాన్ని ఆయనే పరిచయం చేస్తుంటారు."

"ఏమిటి చెప్పండి? నావల్ల ఏం కావాలి? నేను చేయగల సహాయం ఏదైనా చేస్తాను."

"నా బిడ్డకు పెళ్లయింది"

"వెల్. మంచిదే కదా!"

"వరంగల్ యిచ్చాం. అల్లుడు మంచివాడే"

"మరి ఇంకేమిటి సమస్య?"

"బిడ్డ యోగం చేస్తుంది. బాగాచేస్తుంది. అత్తారింట్లో బిడ్డ మాస్టరుగారి ఫోటో వద్ద నిలబడి, అలాగే ఏడుస్తుంది. మగతగా పడి వుంటుంది. ఇంటిపని చేయదు. మొగుడితో సంసారం చేయదు. వాళ్లు అమ్మాయిని తీసుకుపొమ్మని టెలిగ్రాం యిచ్చారు. అల్లుడు వేరే పెళ్లి చేసుకుంటాడట" అని చెప్పి వలవల ఏడ్చాడు.

పాపం! కన్నతండ్రిబాధ! ఆడపిల్లను అత్తవారు వదిలేస్తామంటే బాధగా వుండదా?

"ఏం చేస్తున్నారు"

"మీరే రక్షించాలి. నా బిడ్డ సంసారం నిలబెట్టండి" అని కాళ్లు పట్టుకున్నాడు.

"నేను మాత్రం ఏంచేయగలను? అంత పెద్దపనులు చేసే శక్తి నాకు లేదు"

"మీకా శక్తి వుంది గురువుగారూ! ప్రేయర్ చేస్తుంటే, మాస్టరుగారు మీదగ్గరకు వెళ్లమని సూచించారు. మీరు అమ్మాయి సంసారాన్ని రక్షించగలరు."

మాస్టరుగారు నన్ను సూచించడం ఏమిటి? ముందరి కాళ్లకు బంధాలు వేయడం కాదు కదా! సరే. ఏమైనా కన్నతండ్రిగా నా హృదయం కలుక్కుమన్నది. ఆ రోజు ప్రేయర్‌లో మాస్టరుగారిని ప్రార్థించి విభూతి యిచ్చాను, వెళ్లి అమ్మాయికి పెట్టమని.

ఘంటప్ప సంతోషంగా వరంగల్ వెళ్లాడు. అమ్మాయి అదే స్థితిలో వుంది. విభూతి పెట్టాడు. నిమిషంలో అమ్మాయి మామూలు మనిషైంది. ఇంటిపనులు చేసింది. భర్తను ఆదరించింది. నాలుగురోజులు అల్లుడింట వుండి, అంతా చక్కబడ్డాక ఘంటప్ప తిరిగి వచ్చాడు. తర్వాత ఆ అమ్మాయి ఎలాంటి చేష్టలు చేయలేదు. హాయిగా సంసారం

చేసుకుంటోంది. తదాది ఘంటప్ప నాకుమంచి యోగమిత్రుడైనాడు. అతనిని ఎప్పుడూ నా శిష్యుడిగా భావించలేదు.

\+ + +

ఒక్కొక్క సంఘటన అలా మనిషిని మలుపు తిప్పుతుంది. మనిషి బ్రతుకుబాటను మార్చుతుంది. యోగం చేసుకోవడమే తప్ప, దానిని ఏదో ప్రచారం చేయాలన్న రంధి నాకు వుండేది కాదు. చేతిలో పని కనుక ఎప్పుడైనా పత్రికలకు ఓ చిన్నవ్యాసం రాయడం జరిగేది. నాపుస్తకం ఒక్కటే డిస్కవరీ ఆఫ్ మాస్టర్‌యోగ, దాని తెలుగువర్షన్ మాస్టర్ యోగదర్శని. హైదరాబాదు వచ్చాక మరలా అచ్చువేయవలసి వచ్చింది. తిరిగి రాసి అచ్చువేశాను .ఆ పుస్తకానికి తోడుగా 'యోగాశ్రమ లేఖలు' అనే పుస్తకం ఒకటి యోగంలో కొత్తగా ఆసక్తి కలవారికోసం ఉత్తరాల ద్వారా యోగం గురించి ప్రాథమిక పరిజ్ఞానం కలిగించడానికి ప్రయత్నించాను. ఆ రెండు పుస్తకాలు పాఠకులలో ఉత్సాహం కలిగించసాగాయి. అలా మాస్టరుయోగంపై పుస్తకాలు రాయడం 'మహాపాపం' అన్నవారున్నారు. మాస్టరుగారు తన గురించి, తన యోగం గురించీ పత్రికలలో రాయవద్దని శాసించారుట ఎప్పుడో. ఇప్పటికీ అదే పట్టుకుని నన్ను భయపెట్టారు కొందరు.

నా పుస్తకాలు చదివి, నన్ను కలుసుకోవాలని వచ్చిన వ్యక్తి బి. కొండాచార్య. బళ్లారి నివాసి. వారిది పూర్వం గూడూరు. వారి అమ్మాయిని గూడూరు యిచ్చారు. రైల్లో ఎవరో నా గురించి చర్చిస్తుండగా విని, అడ్రసు తీసుకుని హైదరాబాదు వచ్చారు. ఆయన ఆకారం చూస్తే నాకు భయం వేసింది. మనిషి మంచివాడు. సాత్వికుడే. కానీ ఆయన కళ్లు ఎర్రగా భయంకరంగా వున్నాయి. మనిషి చాలా సీరియస్, ముక్కోపి అనిపించారు కాని కాదు పాపం. చాలా దిగులుగా నిరాశగా దైన్యంగా వున్నాడు. పరిచయాలు అయ్యాక తన గురించి చెప్పుకున్నాడు. భార్యపోయింది, ముగ్గురు ఆడపిల్లలు, ఒక అబ్బాయి. ఆర్థికంగా చాలాచాలా కష్టాలలో ఉన్నాడు. కోర్టు గొడవలు. యోగంలో ఏదైనా మార్గం చూపించమని కోరాడు. బళ్లారి రమ్మని ఆహ్వానించాడు. ఆయన అప్పటికే యోగంలో ఉన్నాడు.

\+ + +

బళ్లారిలో కొండాచారి గారిల్లు ఒక దేవాలయం. వారి తండ్రిగారు శ్రీవిద్యోపాసకులు. వీరు తండ్రిగారి వారసత్వం పొంది శ్రీఉపాసన చేస్తున్నారు. నాకు తెలిసినంతలో శ్రీఉపాసన, బాల ఉపాసన చేయడం చాలా కష్టం. అసలు ఇళ్లలో శ్రీచక్రం పెట్టుకుంటేనే ఇబ్బంది. దానిని మడి ఆచారాలతో, నియమనిష్టలతో ఆరాధించాలి.

జపించాలి. ఉపవాసాలు ఎక్కువ. మా నాన్నగారు చాలాకాలంగా శ్రీ ఉపాసన, బాల ఉపాసన చేశారు. వాటివల్ల ఆయన ప్రాపంచికంగా పొందిన లబ్ధిలేదు. ఎప్పుడూ ఇంట దరిద్రమే. ఆయన అనుభవించిన దారిద్ర్యంలో మేమూ పాలుపంచుకున్నాం. దరిద్రం అనుభవిస్తామని, కష్టాలు వస్తాయని తెలిసీ ఆ ఉపాసన చేశారు. పాపం! కొండాచారిగారి స్థితి అలాగే వుంది. ఇరవై సంవత్సరాలుగా చేస్తున్న ఘోర తపస్సు. వారి తండ్రిగారు పోయారు. భార్య పోయింది. ఆర్థికచిక్కులు. ఇంట్లో పసుపుకుంకుమలు రాసులు పెరిగాయి. ఆ పూజామందిరం కర్పూరవాసనలతో మగ్గిపోయివుంది.

ఆ ఉపాసనలు కట్టిపెట్టమని సలహా చెప్పాను. సలహాలు చెప్పడం ఎవరికైనా సులువే. ఆచరించడమే కష్టం. ఆయనకు మనసొప్పలేదు అనడం కన్న ధైర్యం చాలలేదు అనవచ్చు. తటపటాయించాడు. "మీ పరిస్థితి బాగుపడాలంటే అవి బంద్ చేయక తప్పదు" అని నా సలహా. నా మాటపైన యోగం పైన వారికి పూర్ణవిశ్వాసం. ఉపాయం చెప్పాను. అపాయం లేదని హామీ యిచ్చాను. ధైర్యంగా ఆ పనిచేస్తే మాస్టరుగారి అండ, ఆశీస్సు లభిస్తుందని భరోసా యిచ్చాను. దగ్గరుండి అవన్నీ ఒక గోతంలో కట్టించి, తుంగభద్రలో కలపమన్నాను. శ్రీ చక్రాన్నితీసుకువెళ్లి, ఒక అమ్మవారి దేవాలయంలోగాని, శివాలయంలోగానీ, దేవీసన్నిధిలో వదలి నమస్కరించి 'క్షమాపణ' కోరుకొమ్మని చెప్పాను. నా మాటపై గౌరవంతో ఆయన ఆ పని చేశారు. ఆ గదినే శుభ్రపరచి, వెల్లవేసి, మాస్టర్‌గారి ప్రేయర్‌కి ఉపయోగించమని చెప్పి ముందుగా నేనే ఆ గదిలో ప్రేయర్ చేశాను. క్రమంగా ఆయన పరిస్థితి మెరుగైంది. పిల్లలకు నాచేత ట్రీట్‌మెంట్ యిప్పించాడు. వాళ్లు బాగున్నారు. అంతకుముందు తండ్రిని చూస్తే పిల్లలు భయపడేవారు. కొట్టేవాడట. నేను వెళ్లి ఈ మార్పులు చేసిన తర్వాత ఆయన సాత్వికుడైనాడు. పిల్లల్ని ప్రేమించసాగాడు. తల్లిలేని పిల్లలు వారు. తర్వాత పిల్లలంతా బాగాచదివి ప్రయోజకులైనారు. ఉద్యోగాలు వచ్చాయి. వివాహాలైనాయి.

ఆ ఊతంతో కొండాచారిగారు బళ్లారిలో యోగసమావేశాలు జరిపి నన్ను ఆహ్వానించారు. కొంతకాలం తర్వాత నాకు తరచు రావడం సాధ్యంకాదని చెప్పి వారి చేతనే అక్కడ యోగకేంద్రం పెట్టించాను. వారి ఇల్లే ఒక రాజయోగాశ్రమం. ఇప్పుడు మద్రాసు నుండి కుంజుఅయ్యర్ వచ్చి యోగసమావేశాల నిర్వహణలో సహకరిస్తారు. కర్నాటకలో ముఖ్యంగా బళ్లారి, గుల్బర్గా, రాయచూర్, టి.పి.డామ్ ఏరియాలలో మాస్టర్‌యోగాన్ని బాగా విస్తరింప చేస్తున్నవారు కొండాచారి. కన్నడంలో కొన్ని పుస్తకాలు ప్రచురించారు.. నాడీజ్యోతిషంలో తానొక గురువునని చెప్పారని, ఆ కారణంగా తనకొక

యోగకేంద్రం నెలకొల్పుకుని మాస్టర్‌గారి యోగాన్ని శక్తివంచన లేకుండా ప్రచారం చేస్తున్నారు.

\+ + +

హైదరాబాదులో ఆంధ్రప్రభలో ఉద్యోగపర్వం 1977 నుండి 88 వరకు. పన్నెండు సంవత్సరాలలో ఎత్తుపల్లాలున్నాయి. విషాదాలు, వినోదాలున్నాయి. ఆశలు, నిరాశలు ఉన్నాయి. అసలు నా జాతకంలోనే అవన్నీ పుష్కలంగా వున్నాయంటారు దైవజ్ఞులు. ప్రధానంగా చెప్పవలసింది, ఆలోచించవలసింది లగ్నాధిపతి అయిన రవి, తృతీయంలో నీచపడడం, గురుదృష్టిని పొందడం నీచభంగరాజయోగం. కనుక నీచులతో కలిసి పనిచేయడం తప్పదు. నీచప్రవృత్తిగలవారితో మైత్రి కొనసాగించకపోయినా కలవక తప్పదు. ప్రభ వీక్లీకి మొదటి నుండి ఎడిటర్ విద్వాన్‌విశ్వం. నన్ను అభిమానించి ఉద్యోగం యిప్పించిందీ ఆయనే. ఎడిటర్ నార్లగారికీ నేనంటే అభిమానం . వారిద్దరి ఆప్యాయత కారణంగా నేను జర్నలిస్టునైనాను.

జర్నలిజం కాస్తంత నేర్చుకున్నాను. 30సంవత్సరాల జర్నలిజం పరిధిలో నేను పనిచేసింది ఒక్కప్రభలోనే. అన్ని సంవత్సరాలు ఒకేపత్రికలో పనిచేసిన జర్నలిస్టులు అరుదుగా వుంటారు. అసలు జర్నలిస్టులకు కాలు నిలవదు. ఒక్కచోట కుదురుగా వుండరు. ఈ పత్రిక కాదని, మరొక పత్రికకు పరుగులు తీస్తుంటారు. యాజమాన్యంవారు ఒక వ్యక్తిని ఎక్కువ కాలం వుంచుకోరు. ఏవో కారణాలు చూపి ఉద్యోగం నుండి తొలగించి కొత్తవారికి అవకాశం యిస్తుంటారు. అది వారికి లాభం. కొత్తవారు చిన్నజీతాలకు వస్తారు. అణగిమణిగి పనిచేస్తారు. పాతవారికి కొమ్ములొస్తాయి. అసలు రచయితలకు కవులకు నాలుగు రచనలు అచ్చయేసరికి కొమ్ములొస్తాయి. అలాంటిది పదేళ్లపాటు పత్రికల్లో పనిచేసినవారికి కొమ్ములు రావడం ఆశ్చర్యం కాదు. ప్రతిజర్నలిస్టు తనకు అన్ని విషయాలు తెలుసుననే భ్రమలో వుంటాడు. అలా అనుకోకపోతే ఎవరూ జర్నలిస్టుగా రాణించరు.

1959లో మద్రాసులో ప్రభలో సబ్‌గా చేరాను. 1988లో అసిస్టెంటుఎడిటర్‌గా మ్యాగజైన్ ఎడిటర్‌గా రిటైర్ అయ్యాను. డెయిలీ ఎడిటర్ పేరునే వీక్లీ ఎడిటర్‌గా వాడే అలవాటు. పనిచేస్తోంది విద్వాన్‌విశ్వం అయినా, నార్లగారిపేరు, నీలంరాజు వేంకట శేషయ్యగారి పేరు ఎడిటర్‌గా వుండేది. పత్రికలలో పేరుకు ఎడిటర్ ఉన్నా పెత్తనం యజమానులదే. వారి కోపతాపాలకు గురైతే నిమిషంలో ఉద్యోగం పోతుంది. విశ్వంగారు వీక్లీకి ఎడిటర్ అయినారు. కొంతకాలం పెత్తనం చేసిన బి.సి.కామరాజు మళ్లీ వచ్చి

ప్రభలో కాలుపెట్టాడు. అతనిది ఐరన్‌లెగ్. మంచిగా కనిపిస్తాడు కాని మహాజిత్తులమారి. ఎత్తులు వేయడంలో శకుని. జర్నలిజంలో ప్రతిపత్రికలోనూ ఒక శకుని వుంటాడు. ఎడిటర్లు దుర్యోధనులు. పెత్తనం శకునిది. 'తూలికాభూషణ్' అనే ఈయన ఎప్పుడో కథలు రాశాడుట. తాను గొప్ప కథకుడినని అనుకుంటాడు. తను రాసే రచనలు గొప్పవి కాదనుకుంటే ఎవరూ ఏమీ రాయరు. రాయలేరు. రచయితకు అహంకారం అవసరం. అహంకారం ముందుపుట్టి తర్వాత రచయిత పుడతాడు. రచయితలే కాదు, కళాకారులంతా అంతేనేమో! మింగడానికి మెతుకులేకపోయినా మేకపోతు గాంభీర్యంప్రదర్శిస్తూ పోజులు కొడతారు. కామరాజుకు మొదటినుండి నేనంటేపడదు. ఒకసారి ఇంక్రిమెంటు రాకుండా చేశాడు. రెండుసార్లు ట్రాన్స్‌ఫర్ చేయించి పుణ్యం కట్టుకున్నాడు. ఆ బదిలీల వల్ల నాకు మేలే జరిగింది.

పత్రికా ప్రపంచంలో అవినీతిని ప్రవేశపెట్టిన ఘనత ఆయనది. అంతకుముందు ఎడిటర్లు లంచం తీసుకోవడం ఎరగం. ఇతని దరిద్రం అవినీతికి రాచబాట వేసింది. రచయితల దగ్గర రచయిత్రుల దగ్గర డబ్బుతీసుకుని కథలు, నవలలు అచ్చువేసేవాడు. పరమ చెత్తకథలు, నవలలు ప్రచురించడంవల్ల ప్రభకు అపకీర్తి రాసాగింది. అసలు అప్పట్లో వుండేవే రెండు వీక్లీలు. తర్వాత ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి వారపత్రికలు వచ్చాయి. దాని సంపాదకులు కామారాజు పద్ధతినే అనుసరించారు. దానదీనా తెలుగు వారపత్రికలలో డబ్బు లిచ్చి కథలు, నవలలు వేయించుకునే చెత్త, దుష్ట సంప్రదాయం వచ్చింది. దానిని ఎదిరించినందుకు నాకు శిక్ష. వీక్లీనుండి నన్ను తరిమివేయాలన్న కామరాజు ఆలోచన నెరవేరకముందే ఆయనే రిజైన్ చేసి వెళ్లిపోయాడు. కామరాజు సూక్తులు వంటపట్టించుకున్న పొత్తూరి వెంకటేశ్వరరావు అకారణంగా నాపై అలక వహించారు. సమయానికి ఆయన వీక్లీ ఎడిటర్ కావడం. డెయిలీకి ఎ.బి.కె.ప్రసాద్ రావడం జరిగింది. ఎ.బి.కె. నాకు చిరకాల మిత్రుడు. ఎక్స్‌ప్రెస్ రిపోర్టర్లుగా వుండే నీలంరాజు మురళీధర్, సుందరం, జి.కృష్ణ నాకు మిత్రులు. పొత్తూరివారు ఏమైనా చేస్తే ఎక్స్‌ప్రెస్ రిపోర్టరుగా తీసుకుంటామని హామీ యిచ్చారు. అప్పుడప్పుడు ఎక్స్‌ప్రెస్‌కు రాస్తుండేవాడిని. కొందరు నీచుల మధ్య తప్పనిసరి ఉద్యోగం. ఎ.బి.కె.ప్రసాద్‌గారు పట్టుబట్టి నన్ను తన డెయిలీకి వేయించుకున్నారు. కానీ ఆయన దాసరినారాయణరావు పెట్టిన ఉదయం ఎడిటర్‌గా వెళ్లిపోవడంతో నా కష్టాలు పునరావృతమైనాయి. కొన్నిపరిస్థితుల వల్ల పొత్తూరి వెంకటేశ్వర రావు డెయిలీ ఎడిటర్ అయ్యారు. వీక్లీకి తానే ఎడిటర్. వారికి అసిస్టెంటు నేను. డెయిలీలో కొన్ని శీర్షికలు నిర్వహించే బాధ్యత నాది. 'మహిళాప్రభ'

'బాలప్రభ' 'చిత్రప్రభ' 'ఆదివారం సారస్వతానుబంధం' ఎనిమిది పేజీలకు నేను ఎడిటర్. తర్వాత నాలుగుపేజీల చిత్రప్రభ నిర్వహణ బాధ్యత నాకే యిచ్చారు. పి.ఎస్.ఆర్.ఆంజనేయులుగారిని, అజంతాగారిని నాకు సహాయకులుగా నియమించారు. 'అజంతా' అంటే నాకు గౌరవం. ఆయన చాలాకాలం విజయవాడ ఎడిషన్‌కు న్యూస్ ఎడిటర్. విజయనగరం ఎడిషన్‌కు రెసిడెంట్ ఎడిటర్. అలాంటి సీనియర్‌ని తీసుకువచ్చి నాకు అసిస్టెంటుగా వేసి అవమానించారు. ఆ అవమానంతో ఆయన రిజైన్ చేసి వెళ్లిపోతాడని యాజమాన్యం పథకం. ఆదివారం అనుబంధం నేను పూర్తిగా అజంతా హస్తగతం చేసి 'చిత్రప్రభ' నేను చేసేవాడిని. గోయెంకా సంస్థలో సీనియర్స్‌కు గౌరవం ఉండదు. సముచితస్థానమూ ఉండదు. ఎలాగో అవమానం చేసి, రిజైన్ చేసి వెళ్లి పోయేట్లు చూస్తారు. అదొక టెక్నిక్.

ప్రభ వీక్లీ, డెయిలీ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. కారణం ఎడిటర్ చాదస్తం. రచనల్లో పసలేకపోయినా, ఎడిటర్ రికమెండేషన్. పత్రికలు రాణించడానికి ఒకప్పుడు ఎడిటర్ల నిజయితీ కారణం అయితే విజయవాడ, హైదరాబాదు పత్రికలకు కేంద్రాలు అయిన తర్వాత పత్రికల పతనానికి, ఎడిటర్ల అవినీతి చర్యలు కారణం అయ్యాయి. అవినీతి అంటే లంచాలు తీసుకోవడమే కాదు. ఆశ్రితపక్షపాతం, అయోగ్య రచనలు ప్రచురించడం, వైదికధర్మ పునరుద్ధరణకు, దేవాలయాల ప్రాచుర్యానికి పత్రికలు గొడుగు పట్టడం కారణాలయ్యాయి. ఎడిటర్లు రాజకీయపార్టీలకు, నాయకులకు తమ అభిమానాన్ని తాకట్టుపెట్టడం, అమ్ముడుపోవడం మరొక పెద్ద కారణం. స్వర్ణయుగం నుండి పతనం చెందిన పత్రికలు. పత్రికల్లో ఉద్యోగం అంటే అసహ్యం వేసింది. అఫ్‌కోర్స్ అప్పటికే రిటైర్‌మెంట్ దగ్గరపడింది.

నాబాట వెలుగుబాట

ఆఫీసు పని ఆఫీసు వరకే పరిమితం. ఇంటికి మోసుకొచ్చే ప్రసక్తి లేదు. సాయంత్రం అయిదు అవగానే బయలుదేరి ఇంటికి చేరడం, ఆరుగంటలకు ప్రేయర్. ఒక సినిమా లేదు, షికారు లేదు, సాంస్కృతిక కార్యక్రమం లేదు. ఎంత చాకిరి చేసినా ఉద్యోగంలో మెప్పులేదు. వచ్చే ప్రమోషన్స్ లేవు. జీతం పెరగదు. అదనపు చాకిరీ ఎందుకు చేయాలి. పైవారి అసూయ అడుగడుగునా అవరోధం. ఎలా ఉద్యోగం పీకించివేయాలా అని ఎడిటర్ ప్రయత్నం. రెండు మూడుసార్లు రిజైన్ చేశాను. అసలు జర్నలిస్టు ఉద్యోగమే అసిధారావ్రతం. రేపటికి ఉద్యోగం వుంటుందన్న గ్యారంటీ ఎవరికీ వుండదు. సీనియర్స్‌కు, కీలక పదవుల్లో ఉన్నవారికి ఆ బాధ, ప్రమాదం మరీ ఎక్కువ. సబ్-ఎడిటర్‌గా ఉన్నంతకాలం ఫరవాలేదు. ఎవరిని పెద్దగా పట్టించుకోరు. పనిచేసినా చేయకపోయినా సాగిపోతుంది. నా పరిస్థితి ద్విముఖం. నన్ను తొలగించడం అసాధ్యమని ఎడిటర్‌కు తెలుసు. అయినా తన యత్నం మానడు. ఇతరత్రా పనిలో కసి తీర్చుకుంటాడు. ప్రభలో ఎడిటర్ అనే వాడి ఉద్యోగాయుర్దాయం గట్టిగా ఉండదు. పది సంవత్సరాల పాటు ఎడిటర్‌గా ఎవరూ ఉండరు. ఉండనీయరు. అయినా వారి పొగరు, పెత్తనం అనూహ్యం. వీలైనంతలో తనవారిని ఇరికించ ప్రయత్నిస్తారు. పాతవారికి ఎలాగో ఎసరు పెట్టాలనీ చూస్తారు. ఒక్కొక్కరు రెండూ సాధిస్తారు. ఒక్కొక్కరు ఏ ఒక్కటీ సాధించకపోగా, తన కుళ్లు బుద్ధికి ప్రతిఫలంగా తనే రాజీనామా చేసి పోవలసివస్తుంది. ఇది 'ప్రభ'లో అద్వితీయమైన దుష్టసంప్రదాయం.

ఆఫీసులో అస్థిరత వల్ల నా జీవితం యోగంవైపు ఎక్కువ మొగ్గు చూపింది. ప్రతికూల పరిస్థితి, అభద్రత కారణం. ఉద్యోగం ఏ క్షణంలోనైనా పోతుందని తెలిసిన తర్వాత భయంపోయింది. పోతే పోయింది. ఈ పత్రిక కాకపోతే మరొక పత్రిక. ఇరవై సంవత్సరాల అనుభవం ఉన్నవాడిని. ఏ పత్రికవారైనా ఆదరిస్తారు. రచయితగా కొంత

పేరుంది. గొప్ప కవిని, గొప్ప రచయితను కాకపోవచ్చు. కలంజీవిగా గుర్తింపు ఉంది. ఏవో పుస్తకాలు రాసి, ప్రచురించి, బిజినెస్ చేసుకోగలను. హస్తసాముద్రికం ఒకటి ఉండనే ఉంది. రోజూ పదిమందికి జ్యోతిషం చెప్పినా గడుస్తుంది. ప్రభలో యిచ్చే జీతం కన్నా ఎక్కువే సంపాదించవచ్చు. అదొక భరోసా... అదొక ధీమా.. అదొక ఆత్మతృప్తి.

అప్పుడే ఒక సంఘటన జరిగింది. 'అమ్మ'గా ప్రసిద్ధురాలైన జిల్లెల్లమూడి అమ్మ- రాజరాజేశ్వరీదేవి అపరావతారంగా భక్తులచే కొలువబడుతున్న అమ్మకు 'హార్టటాక్' హైదరాబాదు వచ్చింది చికిత్సకోసం. ఆమెను గురించి, మద్రాసులో ఉండగా తెలుసు. అమ్మపై డాక్యుమెంటరీ తీసినప్పుడు పత్రికల్లో ప్రచారానికని వచ్చిన కొండముది రామకృష్ణతో నాకు పరిచయం ఉంది. ఇప్పుడు అమ్మకు గుండెజబ్బు రోజూ చాలాసార్లు వచ్చి ప్రమాదం సూచిస్తోంది. నాకు తెలియదు ఇందుర్తి ప్రభాకర్ అమ్మభక్తుడని. ఒకరోజున ప్రేయర్‌కు వచ్చి విషయం చెప్పాడు. "జిల్లెల్లమూడి అమ్మ తీవ్ర అనారోగ్యంతో ఉన్నది. అమ్మకు ట్రీట్‌మెంట్ ఇమ్మని మాస్టరుగారు మీతో చెప్పమన్నారు" అన్నాడు.

"మాస్టరుగారు నీకు ఎప్పుడు కనిపించారు. ఎలా కనిపించారు?" అని అడిగాను.

"ఉదయం ప్రేయర్‌లో అలా అనిపించింది."

"అనిపించడం కనిపించడం కాదు. అనిపించడం ఆర్డరు కాదు. మాస్టరుగారు నాతోనే చెప్పవచ్చు గదా! నాకూ అనిపించేటట్లు చేయవచ్చు. మాస్టరుగారు నన్ను ట్రీట్‌మెంట్ చేయమని ఎందుకు అడుగుతారు? తానే చేస్తారు! అయినా జిల్లెల్లమూడి అమ్మ సాక్షాత్తు రాజరాజేశ్వరి అవతారం అంటారు గదా! అలాంటి కారణజన్మురాలికి, అవతారమూర్తికి నావంటి సామాన్యుడు ట్రీట్‌మెంట్ చేయడం, చేయ ప్రయత్నించడం ప్రపంచ వింతల్లో మరో వింత అవుతుంది" అన్నాను.

"అలా కొట్టిపారేయవద్దు గురూజీ... మాస్టరుగారి సంకల్పం లేనిది నాలో ఆ భావన కలగదు, ఆ స్పందన ఏర్పడదు కదా!"

"అయితే ప్రభాకర్ మీరే వెళ్లి చేసిరండి. నాకంత సాహసం లేదు."

ప్రభాకర్ పట్టు విడవలేదు. అతని ప్రేరణకు కారణం నాకు బోధపడలేదు. నేను కాస్త మెత్తబడ్డాను అనడం కంటే ప్రభాకర్ విజయం పొందాడని చెప్పాలి. అయితే ఎలా? ఏం చేయడం? ఎలా చేయడం? నేను అమ్మను ఎన్నడూ చూడలేదు. తనూ చూడలేదట. ప్రయత్నిస్తానని వెళ్లాడు.

ఆమె పంజగుట్ట జర్నలిస్టు కాలనీలో ఉంది. ఇద్దరం ఆటో చేసుకుని వెళ్లాం. అంతవరకు బాగానే వుంది. జనం కొండవీటి చాంతాడంత పొడవుగా బారులు తీరి

వున్నారు. ఓ నలభై కార్లు ఆగివున్నాయి. ఆమె విశ్రాంతి తీసుకుంటున్న ఇల్లు భక్తులతో కిటకిట లాడుతోంది. ఎవరినీ లోపలకు అనుమతించడం లేదు. అయినా భక్తులకు ఆశ. ఒక్కసారి దర్శనం చేసుకోవాలని అసలే జబ్బుతో వున్నది. ఏమవుతుందో! గంటల కొలది జనం ఎండలో నిరీక్షిస్తున్నారు. అంతమందిని కాదని మాకు ప్రవేశం ఎలా లభిస్తుంది?

ప్రభాకర్‌తో అన్నాను "లోపల కొండముది రామకృష్ణ ఉంటారు. ఆయనను కలుసుకో. వీలు కలగవచ్చు"

ఆ జనసమ్మర్దాన్ని చీల్చుకుని ప్రభాకర్ లోపలికి వెళ్లి, నా విషయం ఆయన చెవిలో చెప్పాడు. ఆయన వెంటనే లేచి, లోపల గదిలో పడుకుని వున్న అమ్మకు చెప్పారు. అమ్మ అంగీకారం తెలిపింది. బయటకువచ్చి నన్ను తీసుకు వెళ్లారు. ముగ్గురం అమ్మగదికి వెళ్లాం. దూరం నుండి నమస్కరించి ప్రేయర్‌కు కూర్చున్నాం. నాపద్ధతి ప్రకారం 45 నిమిషాలు ప్రార్థన సాగింది. ట్రీట్‌మెంటు వైబ్రేషన్స్ బాగా వచ్చాయి. ఫలితం నేను చెప్పలేదు. సెలవు తీసుకుని వచ్చేశాం ... మిరకిల్. ఆరోజే ఆమెకు పూర్వస్థితి చేకూరింది. మర్నాటికి మామూలైంది. నాల్గవరోజున జిల్లెల్లమూడి వెళ్లిపోయింది.

ఆ సంఘటన మా ఎడిటర్‌గారిపై చాలా ప్రభావం చూపింది. ఆయన 'అమ్మ' భక్తుడు. అప్పుడప్పుడు జిల్లెల్లమూడి వెళ్లి అమ్మ చేతి గోరుముద్దలు తిని వస్తుంటాడు. అలా వెళ్లినప్పుడల్లా అమ్మ నా గురించి అడిగేది "నాయన శార్వరి బావున్నాడా" అని. అదీ ఆమె ఆప్యాయత. అమ్మకు నాపట్ల అంతటి ప్రేమాదరాలు ఉన్నందున ఈయనగారు నాపట్ల ప్రేమ, అభిమానం పెంచుకోసాగారు. నాయోగం పట్ల ఆఫీసులో చాలామందికి సద్భావన ఏర్పడింది. అసలు ఇలా యోగం, సాధన అనేవారు ఉద్యోగాలు చేయలేరు. దానికి, దీనికి పొసగదు. ఉద్యోగ నిర్వహణకు అవసరమైన అడ్డమైన పనులు, అవినీతిపనులు వీరు చేయలేరు. అవినీతిగా ప్రవర్తించనివాడు ఇతరులను మోసం చేయనివాడు ఈనాడు అసమర్థుడు. బ్రతకడం చేతకానివాడు. నాపైనా ఆ ముద్ర పడ్డది. అయినా నా బ్రతుకు నాది.

అంతకు మునుపు ఒకసారి మా ఎడిటర్ పొత్తూరివారు వారింటికి నన్ను పిలిచారు. "జిల్లెల్లమూడి అమ్మ వస్తున్నారు. బహుకొద్దిమందిని మాత్రం పిలుస్తున్నాను. మీరూ రండి". నేను యోగం చేస్తానని వారికి తెలుసు. ఎవరినీ ద్వేషించను. నావల్ల ప్రమాదం వుండదు. నాకు ఏ స్వాముల్ని, అమ్మల్ని దర్శించడం యిష్టం వుండదు. ఒక మార్గంలో వున్నవారు అలా అందరినీ దర్శించకూడదు. మనస్సు వికలమవుతుంది. అవతలి వ్యక్తి తక్కువని కాదు. అనవసరం ఉండదు. ఏ మార్గాన్ని అనుసరించేవారైనా,

తన మార్గానికే కట్టుబడి ఉండాలి. తన దైవాన్ని మాత్రమే ఆరాధించాలి. అలా ఉండడం నాకిష్టం. సరే! పెద్దవాడు, ఎడిటర్, ప్రేమగా పిలిచారు కదా అని వెళ్లాను. అక్కడ ఎడిటర్ దంపతులు అమ్మకు పాదపూజ చేశారు. పద్ధతి బావుంది. అవసరం కూడా నేమో అనిపించింది. తర్వాత వరుసగా అమ్మ పాదాలకు నమస్కరించారు. పక్కన వున్న రామకృష్ణ అందిస్తుండగా అమ్మప్రసాదం భక్తులకు యిచ్చారు. నాకు ఇష్టంలేదు అలా పాదాభివందనం చేయడం. మా యోగంలో అది నిషేధం అవునోకాదో తెలీదుకాని ఎవరూ అనుసరించరు. గురు సంప్రదాయానికే మేము వ్యతిరేకం. మాస్టర్‌గారిని తప్ప ఇతరుల్ని గురువుగానైనా ఆమోదించలేము. అలాంటిది మరొకరికి పాదాభివందనం చేయడం సాధ్యం కానిపని. నేను తటపటాయిస్తుండగా పాత్తూరివారు పిలిచారు "శార్వరిగారూ, అమ్మ ఆశీస్సులు తీసుకోరూ!"అని. "నేను నమస్కరించను" అన్నాను. అమ్మ నావైపు తీక్షణంగా చూచా.ు. లేచి వెళ్లి మామూలుగా నమస్కరించాను. ప్రసాదం ఇవ్వబోగా "అలవాటు,లేమ" అని తప్పుకున్నాను.

నాకు అనిపించింది ఆరోజే 'అమ్మ' కంటిలో నేనొక నలుసునైనానని. నన్ను మరచిపోపని. తర్వాత ఆమెకు యోగా ట్రీట్‌మెంట్ రెండవసంఘటన.

అప్పుడే ప్రభాకర్ అడిగారు అమ్మ ఎంతకాలం జీవిస్తుందని. 'మూడు సంవత్సరాల, రెండు నెలల, ఒక రోజు...' ఠక్కున మాట వచ్చింది నోటివెంట. అంతే జరిగింది. నామాట ఆనోట ఆ నోట అమ్మ చెవిని పడ్డది. ఆమెకు నాపైన ఇష్టం మరీ ఎక్కువైంది.

\+ \+ \+

అప్పుడే అమ్మ షష్టిపూర్తి ఉత్సవాలు జరిగాయి.'త్యాగరాయగానసభ' సెక్రటరీ పరబ్రహ్మమూర్తి అమ్మ భక్తుడు. మా పి.వి.రమణకు, ఇందుర్తి ప్రభాకర్‌కు మిత్రుడు. ఆ సందర్భంగా త్యాగరాయ గానసభలో మూడురోజుల కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఉదయం, సాయంత్రం ప్రసంగాలు. ఒకసావనీర్ ప్రచురించారు. సావనీర్‌లో నా అనుభవం రాశాను. అమ్మకోరికపై ఒకరోజు నా ఉపన్యాసం ఏర్పాటు చేశారు. రెండవరోజు ఉదయం వక్తలు. శ్రీ దివాకర్ల వెంకటావధాని, లక్ష్మణ యతీంద్రులు, నేను, మరికొందరు... నేను ఒక గంటపైగా యోగవిద్యపై ప్రసంగించాను. యోగశక్తితో ట్రీట్‌మెంట్స్ చేసే పద్ధతిని సైంటిఫిక్‌గా చెప్పాను. నా ప్రసంగం అయిన తర్వాత దివాకర్ల వెంకటావధానిగారు గట్టిగా నన్ను కౌగలించుకుని ఆనందబాష్పాలు రాల్చి "శార్వరిగారూ! వయస్సులో మీరు నాకంటే చాలా పిన్న కనుక పాదాభివందనం చేయలేకపోతున్నాను. మీకు నా ఆశీస్సులు.

మీరు కారణజన్ములు" అన్నారు. లక్ష్మణ యతీంద్రులు మా పూర్వాశ్రమ పరిచయాలు స్మరించి ఆలింగనం చేసుకుని "శార్వరీ మీరు నా మిత్రులు కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు సజలనయనాలతో.

అమ్మతో నాకు ఆత్మానుసంధానం కలిగిన అనుభూతి. నేను ఎవరికీ భక్తుడిని కాను. వల్లమాలిన భక్తి, ఇష్టం ఎవరిపైనా లేవు. ఎవరిపైనా అయిష్టత లేదు. సత్యసాయి, జిల్లెల్ల మూడి అమ్మ మనకాలంలో ఆధ్యాత్మికరంగంలో ప్రాచుర్యం పొందినవారు. వారిపట్ల గౌరవం వుంది. అని వారి దర్శనానికి వెళ్లింది లేదు. అమ్మను రెండు పర్యాయాలు చూచాను. చూపులు కలిశాయి. ఆత్మలు స్పందించాయి. అనురాగం జాలువారింది. కరుణ పొటమరించింది. అనుభూతి ఆత్మీయతగామారి అనుబంధంగా కాక, ఆత్మానుసంధానం జరిగింది. శక్తి ఎవరినుండి ఎవరిలోకి ప్రవహించినా ప్రయోజనమే. అమ్మప్రేమను పొందాను. అమ్మప్రేమ మనిషికి జీవం పోస్తుంది. జిల్లెల్లమూడి అమ్మ నాకు స్ఫూర్తినిచ్చింది. ఆమె ప్రేమ నాలోనూ ప్రేమబీజాలు నాటింది. అంతవరకూ పాషాణంగా వుండిన నా హృదయం కాస్త మెత్తబడసాగింది. సాధుత్వం నాలో చోటు చేసుకోసాగింది.

హిమాయత్‌నగర్‌లో రామానుజాచారి ఇంట్లో అమ్మపూజ పెట్టారు. పెద్దరికం పరబ్రహ్మమూర్తిది, మా ప్రభాకర్‌ది. నన్ను ఆహ్వానించారు. ప్రభాకర్ వెంట వుండి తీసుకువెళ్లాడు. అలా వెళ్లడం నాకు ఇష్టం లేదు. అయినా తప్పలేదు. అమ్మ నిలువెత్తు ఫోటో రంగులు దిద్ది అలంకరించారు. దీపాలు వెలిగించారు. భజన చేశారు. హారతి యిచ్చారు. జనం చాలామంది వచ్చారు. సాయంత్రం ఆరుగంటలైంది. నా యోగ నియమం అక్కడి పెద్దలకు తెలుసు. అందరూ భోజనాలకు వెళ్లారు. నేను, ప్రభాకర్ ప్రేయర్‌కు కూర్చున్నాం. ఇద్దరికీ స్పందన కలిగింది. తీవ్రంగా వైబ్రేషన్స్ వచ్చాయి. నా ప్రేయర్ గంటసేపు సాగింది. చైతన్యంతో ఊగి, తూగి పోయాను. కళ్లు విప్పలేదు. అలాగే లేచి అమ్మ ఫోటో ముందర అంగన్యాస, కరన్యాస ఆరాధన చేశానుట. గోడవార నిలబడే ధ్యానంలో వుండిపోయాను. ఒక దివ్యమాత అనుగ్రహం కలిగింది. మహాశక్తి నన్ను ఆవహించి నాలోకి ప్రవహించింది. గంటసేపు ఆ సమాధిస్థితి కొనసాగింది. కళ్లు విప్పిన తర్వాత కూడా ఒక గంటసేపు నేను కదలలేని స్థితి. అమ్మలో దివ్యశక్తి ఉంది. అది మహాశక్తి. ఆ శక్తి మొత్తం నాలోకి ప్రవహించింది. ఆ తర్వాత అమ్మ జీవించి ఉన్నది రెండు సంవత్సరాలే. అప్పుడప్పుడు ఆమె పరామర్శ, ఆశీస్సుగా నాకు అందుతూనే ఉండేది.

సావిత్రి రచన

'సావిత్రి' అంటే గాయత్రి...

సత్యసంపూతమైన గాయత్రియే సావిత్రి. నా 'సావిత్రి' రచనకు ఒక కారణం, ఒక ప్రేరణ ఉంగి మద్రాసులోవున్న కాలంలో యోగా పుస్తకాలు విపరీతంగా చదవడం అలవాటు. అరవిందయోగి రచనలు కూలంకషంగా అధ్యయనం చేశాను. అందులో కొరుకుడు పడనిది, అర్థం కానిది ... సావిత్రి. ఎక్స్‌ప్రెస్ లైబ్రరీలో సావిత్రి రెండు ప్రతులుండేవి. ఒకటి ఎప్పుడూ నా దగ్గరే ఉండేది. ఎన్నిసార్లు చదివేనో చెప్పలేను. 'డివైన్‌లైఫ్' చదివాక సావిత్రి అర్థం కాసాగింది. అది వచనం, ఇది పద్యం. అర్థం కాకపోయినా సావిత్రిని చదువుతుంటే అదో తృప్తి. ఆత్మశాంతి... ఏవో లోకాలలో విహరించి వస్తున్న భావన. సాహిత్యపరంగా అర్థం కాలేదు గానీ చదివినంత మేరకు అనుభూతి మిగిల్చింది. అదే సావిత్రి రచనలో అరవిందయోగి లక్ష్యమా? కాదు. ఇంకా ఏదో ఉంది. అందులోనే ఉంది కిటుకు. 'లెజండ్ అండ్ ది సింబల్' అన్నారు. రేఖామాత్రంగా కథ తెలుస్తుంది. 'సింబల్' అరవిందులు ఆశించింది.

ఒక రోజున నా చేతిలోని 'సావిత్రి'ని చూచి డాక్టరు బాలసుందరరావుగారు తనకిమ్మని తీసుకున్నారు. చదివారు. అర్థం కాలేదు అయినా వదలలేదు. ఏదో ఆకర్షణ. ఒక కొత్తపుస్తకం తెప్పించుకున్నారు. నాలుగైదు నెలలు ప్రయత్నించారు. ఆ పుస్తకం నాకు యిచ్చి, 'ఇందులో ఏదో విశేషం వుంది శార్వరీ! ఎప్పటికైనా దీనిని నీవే తెనిగించాలి. ఈ పని మరొకరి వల్ల కాదు. యోగం చేసేవాడికి తప్ప సావిత్రి అర్థం కాదయ్యా! అరవిందుని స్థాయిలోని యోగి తప్ప దానిని అనువదించలేడని నా అభిప్రాయం. నీవే ఎప్పటికైనా సావిత్రిని తెలుగులో యోగపరంగా రాయగలవని నాఅంతరాత్మ చెబుతోంది' అని ఆ పుస్తకం నాకిచ్చారు. అదే గురువు ఆజ్ఞ, ఆశయం. వారికి నా పట్ల ప్రేమ, వాత్సల్యం మెండు. అప్పటికి అది నాకూ అర్థం కాలేదు. పుస్తకాన్ని భద్రంగా దాచిపెట్టుకున్నాను..

హైదరాబాద్ వచ్చాక యోగసంబంధమైన కార్యక్రమా లేవీ లేవు. మా గురువుగారు పోవడంతో మద్రాసులోనే బంద్ అయ్యాయి. దగ్గిర మిత్రులు నలుగురు ప్రేయర్ చేసుకోవడం. అంతే. హైదరాబాదులో అసలు యోగం చేసే వారుంటారని అనుకోలేదు. ఇక్కడి సంస్కృతి వేరు, జీవనవిధానం వేరు. అక్కడ అరవగోల, ఇక్కడ ఉర్దూగోల. అందుకే చాలారోజులు కిమ్మనకుండా ఉండిపోయాను. మద్రాసులో బిజీబిజీగా వుండేవాడిని. ఇక్కడ పనిలేకుండా కూర్చోవడం ఒక 'శాపం' అయింది. దానికి తోడు కుటుంబ పరిస్థితులు, ఆఫీసులో అలజడులు. డి. నారాయణరావు, డి. నరసింహారావు తప్ప ఎప్పుడో వచ్చి పలకరించే యోగమిత్రులూ లేరు. శిష్యులు లేరు. కొత్తగా రాసిన పుస్తకాలు లేవు.

సావిత్రి బయటకు తీశాను. వ్యాపకాలు లేవు. ఒత్తిడులు లేవు. ఈసారి సావిత్రి అర్థం కాసాగింది. హుషారుగా చదివాను. బ్రహ్మాండంగా వుంది. ప్రతివాక్యం అరటిపండు ఒలిచిపెట్టినట్లు అర్థం కాసాగింది. అరవిందుని ఫొటో ఒకటి సంపాదించి, ధ్యానించాను. ఆయన నుండి ఆశీస్సు లభించినట్లయింది. గురువుగారిని స్మరించి కాగితం, కలం తీసుకుని 'మాస్టర్ నమస్కారం'తో ప్రారంభించాను. మొదటి వాక్యం రాయడానికి వారంరోజులు పట్టింది. కావ్యారంభం కదా! నేను కవినికాదు అయినా కవిత్వం రాయాలి. సావిత్రి ఆఫీసులో మిత్రులు జి.కృష్ణ లాంటి వారికి చూపాను. విద్వాన్‌విశ్వంగారు, తిరుమల రామచంద్ర ఇలా ఎందరికో చూపించాను. మూలవాక్యం ఇది, నా అనువాదం ఇది. ఎవరూ బాగాలేదని అనలేదు. బ్రహ్మాండం అనలేదు. మూలం అర్థం అయితే గద! నా తెలుగు వాక్యానికి విలువ కట్టడానికి. చివరకు 'ఇంగ్లీషువాక్యం అర్థం ఎలావున్నా నీవు రాసింది చాలా బాగుంది' అన్నారు. ఇంక ఎవరికీ చూపించకూడదనుకున్నాను.

రోజుకు నాలుగైదు లైన్లు కన్న సాగేది కాదు. వేయిపేజీల మహాగ్రంథం, ఎప్పటికి పూర్తయేను? అసలు పూర్తవుతుందా? అనుమానమే. కాకపోతే నష్టం ఏమిటి? ఏం లేదు. ఎవరికోసం రాయడం? నా కోసం! నా తృప్తికోసం! రాయకపోతే నిద్రపట్టదు. కనుక రాయడం సాగించాను. ఒక్కొక్క పదానికి ఎన్ని అర్థాలు. నిఘంటువులు దగ్గర పెట్టుకున్నాను. అన్ని పదాలు కలిపితే అర్థం రావాలి. అర్థం కావాలి! తల తోక కనిపించని భావం ఏదో మదిలో కదలాడేది. ఆ భావాన్ని పట్టుకుని క్రిందకి దిగివచ్చి దాన్ని తెలుగు అక్షరాలలో బంధించడం అలవాటైంది.

ఎప్పుడో చదివిన లాటిన్ అక్కరకు వచ్చింది. ఎం.ఎ. చదివే రోజుల్లో లాటిన్ అవసరమైంది. ఇప్పుడు సావిత్రిని రాయడానికి లాటిన్ అవసరమైంది. లాటిన్ భాషతో

ఏ మాత్రం పరిచయం లేకపోతే సావిత్రి అర్థం కాదు. అరవిందుని హృదయానికి దగ్గరగా పోలేము. ఒక అధ్యాయం వ్రాయడానికి ఆరునెలలు పట్టింది. చదివితే పరమ భయంకరంగా వుంది. ఏం రాశానో, ఎందుకు రాశానో నాకే అర్థం కాలేదు. రాసిందంతా చించి అవతల పారవేసి, మళ్లీ మొదలుపెట్టాను. ఈసారి భాష జటిలంగానే సాగింది. అర్థం అయీ అవనట్లు ... స్పష్టత లేకపోయినా రేఖామాత్రంగా ఒక చిత్రణ, మనోయవనికపై ఒక మెరుపు, ... ఓ వెలుగు ... ఫరవాలేదనిపించి తృప్తిపడ్డాను. మరో ఆరునెలల కాలం పట్టింది. ఇలాంటి రచనలకు మనస్సు, పాండిత్యం ప్రధానం కాదు. హృదయం, ఆర్ద్రత. హృదయం స్పందించాలి. అనుభూతి కలగాలి. అంటే అస్పష్టంగా రసతృష్ణను తీర్చడం. మొత్తానికి నా సావిత్రిలో ఏదో మర్మం, ఏదో అంతర్లీనంగా మెదిలే భావం ఉందని అనిపించింది. అరవిందులే అన్నారు 'ఇది భవిష్యత్ కవిత' అని. ఎవరికీ అర్థం కాకపోయినా ఫరవాలేదు. రాసిన నాకు తృప్తి కలిగితే చాలు. అలా రాయగా రాయగా తృప్తిపెరిగింది. కొన్ని రచనలు మనస్సుకు తృప్తి కలిగిస్తాయి. కొన్ని మాత్రమే హృదయానికి తృప్తి కలిగించ గలుగుతాయి. సావిత్రి రాసింది నాకోసం, నా తృప్తికోసం. అచ్చుకావాలని, ఇతరులు మెచ్చుకోవాలని రాయలేదు. అందుకే తృప్తిగా సాగింది రచన. ఫలాపేక్ష లేదు కదా! పుస్తకం అచ్చుకావాలన్న దృష్టీ లేదు. పాఠకులు లేని రచన సావిత్రి. పాఠకుల్ని తానే తయారు చేసుకున్న మహాకావ్యం సావిత్రి.

రచయితకు రాయడం ఎంత ముఖ్యమో రాసింది అచ్చుకావడం అంతే ముఖ్యం. ఒకపత్రికలో అచ్చుకావడం వేరు. పుస్తకంగా రావడంలో ఎక్కువ సంతృప్తి వుంటుంది. అచ్చుకానప్పుడు రాయాలనిపించదు. రాసి ప్రయోజనం కనిపించదు. ఇప్పటికి నావి 50 పుస్తకాలు అచ్చయాయి. ఇప్పుడు ప్రతి రచనకీ ఒక ప్రయోజనం వుంటుంది. ఉబుసుపోకకు రచన చేయబుద్ధి కావడం లేదు. సావిత్రిని ప్రారంభించిన నాడే కథలు, నవలలు రాయడం మానివేశాను. ఉద్యోగ ధర్మంగా పత్రికలో చిల్లరమల్లర రచనలు చేయక తప్పదు. పుస్తకం అచ్చుపడకపోతే రచయితకు ఆత్మహత్య చేసుకున్నట్లు. అవమానంగా భావిస్తాడు ... ఓ పెద్ద నాయకుడు గెలిచీ, మంత్రిపదవి దక్కించుకోలేక పోయినట్లు.

సావిత్రి మొదటి భాగం రచన పూర్తయింది. అచ్చువేసే శక్తిలేదు. రెండువేలు కావాలి! సాహిత్యఅకాడమీ రచయితలకు ఆర్థికసహాయం చేస్తుందని ఎవరో సలహా యివ్వగా అప్లికేషన్ జతచేసి, స్క్రిప్టు పంపాను. సాహిత్యఅకాడమీ పెద్దలు ఎవరూ నాకు పరిచయం వున్నవారు కారు. డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు అధ్యక్షులు, దేవులపల్లి రామానుజరావు కార్యదర్శి. ఇద్దరిదీ చెరి ఒక రకమైన చాదస్తం.

ఆరునెలలు గడిచింది. కొందరి పుస్తకాలకు ఆర్థికసహాయం అందింది. నా పుస్తకానికి రాలేదు. మరో ఆరునెలలు గడిచింది. మళ్లీ లిస్టులోకి రాలేదు. తర్వాత లిస్టులో పేరు వచ్చింది. శాంక్షన్ చేసేది బెజవాడ గోపాలరెడ్డి. బుచ్చిరెడ్డిపాలెం వెళ్లి ఆయన దర్శనం చేసుకుంటే పని అవుతుందని అకాడమీ గుమాస్తా చెప్పాడు. ఛస్తే ఆ పని చేయను. నా వల్ల కాదు. ఆయన మాట పెళుసు. విశ్వనాథ సత్యనారాయణగారి వలె ఎత్తిపొడుపు లెక్కువ.

ఎవరినీ కాకా పట్టడం నాకు చేత కాదు. అలా చేయగలిగితే నాకు చాలా అవార్డులు వచ్చేవి. కళాప్రపూర్ణ, డాక్టరేట్ ఎప్పుడో సంపాదించుకునేవాడిని. వంగి వంగి దణ్ణాలు పెట్టడం, నంగినంగి మాటలు, నక్కవినయాలు నాకు చేతకాదు. సాహిత్యఅకాడమీ సాయం అందని ద్రాక్ష అని నిర్ధారించుకున్నాను. దర్శనం చేసుకుని, కాకాపడితే తప్ప గోపాలరెడ్డి ప్రసన్నులు కారు. ఆ పని నేను చేయను గాక చేయను. తర్వాత నాలుగు రోజులలోనే డబ్బు శాంక్షన్ చేసినట్లు కాగితం వచ్చింది.

'సావిత్రి' మొదటిభాగం 'మహోదయం' అభిప్రాయం కోసం ముందుగా డా॥సి.నారాయణరెడ్డి గారికి పంపారుట. వారు ఆరునెలలు గడిచాక స్క్రిప్టు పంపారు గానీ అభిప్రాయం రాయలేదు. తర్వాత మరొకరికి పంపితే, ఆయన ఆరునెలలు వుంచుకుని తనకు అర్థం కాలేదని పంపాడు. మూడవసారి ఉస్మానియా ఇంగ్లీషు ప్రొఫెసర్ అడపా రామకృష్ణారావుగారికి పంపారు. అది ఆంగ్ల 'సావిత్రి' కి అనువాదం కదా! వారైతే తులనాత్మకంగా పరిశీలించగలరని అకాడమీ అభిప్రాయపడ్డది. వారు రెండు వారాలలోనే తన అభిప్రాయం పంపారు. చాలా గొప్ప విలువైన పుస్తకం. వీలైనంత ఎక్కువ మొత్తం గ్రాంటు చేయవలసిందిగా సిఫార్సు చేశారుట. సాధారణంగా ఒక్కొక్క పుస్తకానికి వేయి రూపాయలు సహాయంగా యిస్తారు. మహోదయానికి రెండువేలు ఇచ్చారు. ఆలస్యం అయినా మంచి పనే జరిగింది. మా అబ్బాయి వసంతకుమార్ పిహెచ్.డి. సీటు కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయానికి డా॥ రామరాజు, డా॥సినారెలను కలుసుకోవడానికి వెళ్లినప్పుడు అడపా రామకృష్ణారావు నన్ను చూచి గుర్తించి పలకరించి, ఈ సంగతి చెప్పారు. రామకృష్ణారావు గుంటూరు ఎ.సి.కాలేజీలో మాకు లెక్చరర్.

సావిత్రి మొదటిభాగం 'మహోదయం' ఆవిష్కరణ అశోక్‌నగర్ సిటి గ్రంథాలయంలో జరిగింది. డా॥ సి. నారాయణరెడ్డిగారు ఆవిష్కరించారు. వారన్నారు, "నా 'విశ్వంభర'కు పోటీ నీ 'సావిత్రి' అని. నేనన్నాను, 'నేను ఏ అవార్డులు కోరను. ఇది ఒక మహాయజ్ఞం రెడ్డిగారూ." వారు రాస్తున్న 'విశ్వంభర' జ్ఞానపీఠ్ అవార్డు తెచ్చిపెడుతుందని

మా అందరికీ తెలుసు. సి.నా.రె. వేదిక నుండి అన్నారు "సావిత్రి మంచి చెడులను విశ్లేషించే తూనికరాళ్లు నావద్ద లేవు. అరవిందుని 'సావిత్రి' చాలాసార్లు ప్రయత్నించాను. అర్థం కాలేదు. ఇప్పుడు శార్వరి 'సావిత్రి' ద్వారా అరవిందుని దర్శిస్తున్నాను. శార్వరి సావిత్రిని చూస్తే నాకు అసూయగా వుంది, గర్వంగానూ వుంది. శార్వరి మనవాడు, తెలుగుకవి అయినందుకు మనం గర్వించాలి."

వారి అభిభాషణ నాకు కొత్త ఊపిరులు అందించింది. మిగిలిన భాగాలు నిరాశతో నిలిపివేయక రాత కొనసాగించమని భుజం తట్టారు. శ్రీ రెడ్డిగారు పూలమాల వేసి సత్కరించ ప్రయత్నించగా వినయంగా తిరస్కరించి 'రెడ్డిగారూ, మొత్తం పన్నెండు భాగాలు పూర్తిచేయగలిగితే చివరిభాగం ఆవిష్కరణ మీ చేతుల మీదుగానే జరిపిస్తాను. అప్పుడు మీరు పూలమాలతో అభినందించవచ్చు. అప్పటివరకు మాలలు, శాలువలు వద్దు." అన్నాను.

సావిత్రి రచన ఒక మహాసాహిత్య యజ్ఞం. పవిత్రంగా రాయవలసి వచ్చింది .ప్రతిరోజు యోగం చేసిన తర్వాతనే రచనకు ఉపక్రమించేవాడిని. అదొక తపస్సు. యోగసాధకుడు మాత్రమే సావిత్రిని అర్థం చేసుకోగలడు అంటారు పెద్దలు. సాధనలో కొన్ని మెట్లు అయినా ఎక్కి అరవింద భూమికలకు చేరుకుంటే తప్ప సావిత్రి రచన సాధ్యపడదు. నేను ఆ భూమికలు చేరానో లేదోగానీ రచనాకాలంలో ఆ మహాయోగి నా అంతఃకరణలో నా వెంటే ఉండి, నా కలం నడిపించారు. అంతకాలం నా గురుదేవులు మాస్టరు సి.వి.వి. నన్ను అనుగ్రహిస్తూ వచ్చారు.

మహోదయంపై పత్రికలలో సమీక్షలు బాగా వచ్చాయి. చదివిన పెద్దలు ఆశీర్వదించారు. అభినందించారు. శ్రీశరభాచార్య అనే గణితావధాని, డి.ఇ.ఓ. 'ఆంధ్ర అరవింద' అని ప్రశంసించి సంస్కృత శ్లోకాలు అయిదు రాసి ఆశీఃపురస్కారంగా అందించారు. అరవిందాశ్రమంవారు పుస్తకాలు 200 వరకు తెప్పించుకున్నారు. కొందరి ప్రోద్బలంతో ఆచార్య తిరుమల ఆంధ్రభూమిలో మారుపేరుతో ఘోరంగా విమర్శించాడు. తర్వాత తెలిసింది అది రాసింది ఆయనని. కనిపించినపుడు 'థాంక్స్' చెప్పాను. అయితే ఒకమేలు చేసింది ఆ కువిమర్శ. నన్ను నేను అద్దంలో చూచుకున్నట్లు, ఆ విమర్శలో నా లోపాలు గుర్తించి 'మహోదయం' మొత్తం అతి సరళ భాషలో తిప్పి రాశాను. అప్పటికే మొదటిముద్రణ ప్రతులు చెల్లిపోయాయి. మొదటివర్షన్‌లోని ఒక్కపాదంకూడా రెండవవర్షన్‌లో లేదు. చాలా తేలిక భాషలో, అతి సామాన్యపాఠకునికి అర్థం అయ్యేరీతిలో రాశాను. అప్పటికి రెండు, మూడు భాగాలు అన్వేషణ, స్పందన పూర్తిచేయడం వల్ల బాగా

చేయితిరిగింది. 'సావిత్రి' రచనలో అరవింద నుడికారం పట్టుబడ్డది. ఆ మహాయోగి ఆంగ్లంలో ఉపయోగించిన ఛందస్సునే శ్రమించి, తెలుగు నుడికారంలోకి పట్టుకు రాగలిగాను. కనుక పట్టు దొరికింది.

నా యోగానికి సావిత్రి రచన ఒక మలుపు. 70లో ప్రారంభించిన యోగసాధన 77లో హైదరాబాదు వచ్చేవరకు ఒకఅధ్యాయం. 78 నుండి 85 వరకు ఏడు సంవత్సరాలు సాగిన సావిత్రి రచన ఒక పూర్ణయోగ ప్రస్థానం. నా సత్యయోగానికి పూర్ణయోగం తోడైంది. బహుశా అరవిందులు, మాస్టరుగారు సమకాలికులు కావడం కారణం కావచ్చు. పాండిచేరికి కుంభకోణం దూరంకాదు. పూర్ణయోగానికి సత్యయోగం భిన్నం కాదు. రెంటికి చాలా పోలికలున్నాయి అనిపించింది.

లోగడ ఎన్నో పుస్తకాలు రాసినవాడిని. కథలు, నవలలు, నాటకాలు,కవితలు, నృత్యనాటకాలు ఎన్నో రాశాను. యాభై పుస్తకాలు అచ్చయినాయి. 'సావిత్రి' తెచ్చి పెట్టిన పేరు మిగిలిన పుస్తకాలను మరుగున పడవేసింది. శార్వరి సావిత్రి రచయితగా మిగిలాడు. అదొక మహాయజ్ఞం. శ్రీరాం భుజంగరాయశర్మ, డా॥ బెజవాడ గోపాలరెడ్డి, డా॥ అరిపిరాల విశ్వం, శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ, డా॥ వి.వి.ఎల్. నరసింహారావు, డా॥ ఎం. శివరామకృష్ణ, డా॥ వాసిలి వసంతకుమార్ వంటి సాహితీపరులు ముందుమాటలు రాశారు. సావిత్రిలోని మేలి సొబగుల్ని ఎత్తిచూపారు. ఆవిష్కరణ సభలలో ప్రసంగించినవారు చాలామంది ఉన్నారు. కన్నడ సాహితీవేత్త డా॥ నడకర్ణి, డా॥ తూమాటి దొణప్ప, జ్ఞానపీఠ్ గ్రహీత డా॥సి.నారాయణ రెడ్డి, డా॥ ముదిగొండ శివప్రసాద్, శ్రీ ఆచార్య తిరుమల, శ్రీజ్వాలాముఖి, డా॥ రావూరి భరద్వాజ ... ఎందరో ప్రసిద్ధ కవులు, రచయితలు అభినందన సుమాలు విరజల్లారు. శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు పారవశ్యంతో నా సావిత్రిని 'ఆంధ్రమహాసావిత్రి' అని నూరు పేజీల పరిశోధన వ్యాసం రచించి 'భారతి'కి తిలకం దిద్దారు. వ్యాస, వాల్మీక మహర్షుల పక్కన ఆంధ్రమహాసావిత్రి కర్త శార్వరిని, ఉన్నతాసనంపైన ఉపవిష్టుని చేశారు.

తెలుగులో శార్వరి 'సావిత్రి' మూలరచన అన్నంత సుమధురంగా, సముజ్వలంగా సాగిన ప్రబంధం అని ఆచార్య బిరుదరాజు రామరాజు, దివాకర్ల వెంకటావధానివంటి పుంభావ సరస్వతులు కొనియాడారు. సావిత్రి దివ్యప్రబంధాన్ని తెలుగువారికి అందించే అవకాశం కలగడం నా అదృష్టం. నన్ను ఆధ్యాత్మిక శిఖరాల నుండి ఆశీర్వదించి నడిపించిన మాస్టర్‌గారికి, అరవిందయోగికి ఆత్మనమస్కృతులు.

"మహాయాత్ర"కు సన్నాహం

చిన్నచిన్న అబద్ధాలు చెప్పకుండా వుండలేం. ఈనాటి ప్రపంచంలో నిత్యవ్యవహారాలలో సత్యసంధతకు బొత్తిగా అవకాశం లేదు. మరి, యోగం చేసేవారు అబద్ధాలాడవచ్చునా! అందునా సత్యయోగవిష్ణులు... ఆఫీసుల్లో, ఉద్యోగాలలో, వ్యాపారాలలో నిత్యం, అడుగడుగునా ఏదో ఒక అబద్ధం అవసరానికో, సమయానికో, ఆడకతప్పదు. లేకపోతే కొంపలు మునిగిపోతాయి. కష్టాలు. నష్టాలు వస్తాయి. సత్యం మాత్రమే పలుకుతాను. అసత్యం పలకను అని శపథం చేస్తే మహాత్ములు, అవతారపురుషులు సైతం ఓడిపోక తప్పదు. అయితే ఆపద్ధర్మంగా ఆడే అబద్ధం వేరు. అసత్యం వేరు. అబద్ధం మన జీవనబద్ధతకి, నిబద్ధతకి సంబంధించిన వ్యవహారం. అసత్యం ధర్మానికి, హృదయానికి సంబంధించింది. ఒక చిన్న తప్పుచేయడం, ఒక చిన్న అబద్ధం ఆడడం సహజమే కావచ్చు కానీ వాటి పర్యవసానం చిత్రంగా ఉంటుంది.

నేనొకసారి అలాంటి చిత్రమైన అనుభవం పొందాను. అప్పటినుండి అబద్ధం అంటే భయం పట్టుకుంది. మా అబ్బాయి వసంతకుమార్ ఎం.ఏ. అయిన తర్వాత ఒక సంవత్సరం లెక్చరర్‌గా చేశాడు. రెండవ సంవత్సరం అది మాని ప్రెస్ పెట్టాలనుకున్నాడు. ఉద్యోగం చేయడం ఇష్టంలేక కాదు ... అవకాశం లేక. ప్రెస్ అయితే స్వేచ్ఛగా బ్రతకవచ్చునని. మా నాన్నగారు పోవడం, తెనాలిలో ఇల్లు అమ్మడం, ఆ డబ్బుతో కనీసం ఒక జాగాకూడా సంపాదించుకోలేకపోవడం జరిగింది. నా జాతకంలో పిత్రార్జితం అనుభవించే యోగం లేదు. నలభై వేలతో ఒక చిన్న ప్రెస్ కొన్నాం. ఒక ట్రెడిల్, కొన్ని కేసులు, టైపు, ఓ కటింగ్ మెషీన్. అరవైవేలతో చిన్న యూనిట్ తయారైంది. మా సొంత పుస్తకాలతో ప్రెస్ ప్రారంభించాం.

తనకి పిహెచ్.డి. చేయాలనే కోరిక కలిగింది. తెలుగు ఎం.ఏ. చేసి ఫస్ట్‌క్లాసులో పాసైన ప్రతివ్యక్తి పిహెచ్.డి. కోసం ప్రయత్నిస్తాడు. ఉత్త ఎం.ఏ.తో ఉద్యోగం రావడంకష్టం.

తను మద్రాసులో ఎం.ఏ. చేశాడు. ఉస్మానియా రూల్స్ ప్రకారం తాను నాన్‌లోకల్. ఎం.ఫిల్.కు అప్లికేషన్ పెట్టాడు. అప్పటికి నాకు యూనివర్సిటీ పెద్దలతో పరిచయం లేదు. ఎడిటర్ విద్వాన్‌విశ్వంగారి చెవిన వేశాను. ఆయన ప్రొఫెసర్ రామరాజు గారికో, నారాయణరెడ్డి గారికో చెప్పారు. వారికి సాహిత్య అకాడమీ చుట్టరికాలు ఎక్కువ. ఎం.ఫిల్., పిహెచ్.డి. ఇంటర్వ్యూలు రేపు అనగా మా అబ్బాయికి తీవ్రంగా జ్వరం వచ్చింది. అప్పటికి నాలుగు రోజులుగా జ్వరం, కదలలేని పరిస్థితి. అశోక్‌నగర్‌లోని రామచంద్రన్ అనే డాక్టరువద్దకు తీసుకువెళ్లాను. అతని హస్తవాసి చాలా మంచిది.ఈ ఊరు వచ్చినప్పటినుండి ఆయనే మా డాక్టరు. రెండు రూపాయల కంటే ఫీజు ఎక్కువ తీసుకోడు. మందులకు రెండుమూడు రూపాయలు చార్జీ చేస్తాడు. నావంటి పేదలకు ఆయన ఇష్టుడు. ఆయన దగ్గరకు తీసుకువెళ్లి అర్థించాను "డాక్టరుగారూ రేపు అబ్బాయికి పిహెచ్.డి. ఇంటర్వ్యూ ఉంది. ఎలాగైనా ఇంటర్వ్యూకు వెళ్లాలి. ఎలాగైనా జ్వరం తగ్గించండి. లేకపోతే ఒక సంవత్సరం చదువుపోతుంది."

ఆయన ఒక ఇంజక్షన్ ఇచ్చి పంపాడు. సాయంత్రానికి జ్వరం తగ్గింది. అది వేరే సంగతి. ఆస్పత్రి వదలి బయటకు వచ్చి రిక్షా ఎక్కగానే వసంత అడిగాడు "పిహెచ్.డి. ఇంటర్వ్యూ అన్నారేమిటి? నేను అప్లైచేసింది ఎం.ఫిల్.కి కదా. నా ఇంటర్వ్యూ ఎం.ఫిల్‌కి. మరచిపోయారా?"

"కరెక్ట్.' డాక్టరుగారి దగ్గర నేను అబద్ధం చెప్పాను!"

మర్నాడు ఇంటర్వ్యూకి వెళ్లాడు. కొన్ని సాంకేతికమైన కారణాల వల్ల వసంతకు ఎం.ఫిల్.లో సీటు ఇవ్వలేదు. కాని సరాసరి పిహెచ్.డి.కి సీటు వచ్చింది. శ్రీరామరాజుగారికి, శ్రీ నారాయణ రెడ్డిగారికి కృతజ్ఞతలు చెప్పి వచ్చాను.

ఇక్కడ నేను అబద్ధం చెప్పినట్లా? కాదు, సత్యమే పలికినట్లు! అంతర్వాణి సత్యం పలికించింది. అప్పటినుండి నాకు భయం ఏ మాట చెప్పాలన్నా. పొరపాటున నోటివెంట ఒకమాట వస్తే అది నిజమైపోతుంది! అబ్బ ఎంత కష్టం నిజం చెప్పడం! పొరపాటున కూడా చెడు ఆలోచించను. చెడు చెప్పను. గాంధీగారి మూడు కోతుల కథ లోనిరెండు కోతులు నాలో ప్రవేశించాయి.'చెడుకనకు' అని కళ్లుమూసుకుని నడవలేం కదా! కనుక మూడవకోతి ఎదుటివారిలో గంతులు వేస్తూనే ఉంది.

\+ + +

ఒకనాడు ఆఫీసులో ఉండగా సెక్రటేరియట్ నుండి ఫోన్ వచ్చింది. ఎడిటర్ గారి గదిలో ఫోన్ ఉంటుంది. ఆయన వచ్చి 'భాట్టం శ్రీరామమూర్తి ఫోన్ చేస్తున్నాడు' అని చెప్పాడు.

"నాకా?"అని ఆశ్చర్యపోయాను. వారు మినిస్టర్. సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ముఖ్యమంత్రి అంజయ్యగారి హయాంలో. నాకు వారితో వ్యక్తిగతమైన పరిచయం లేదు. ఫోన్ తీసుకుని 'నమస్కారం' చెప్పాను.

"మిమ్మల్ని కలవాలి. ఎప్పుడురమ్మంటారు" అని అడిగారు.

"మీరు రావడం ఎందుకు?నేనే మీవద్దకు వస్తాను.ఇప్పుడు రమ్మంటారా?"

"వద్దు. సాయంత్రం మీ ఇంటికి వస్తున్నాను" అని ఫోన్ పెట్టేశారు.

మా ఇల్లు ఆయనకు ఎలా తెలుసు? ఏం పని?

ఒక మంత్రిగారు రాదగిన ఇల్లు కాదు మాది. చిన్న ఇల్లు. ఆయన మందీమార్బలంతో వస్తే, నిలబడడానికి చోటు చాలదు. మా ఇంట్లో ఉన్నవి రెండే కుర్చీలు, ఒక టేబిల్. నేను రాసుకునేందుకు, ఎవరైనా వస్తే కూర్చునేందుకు ఒక కుర్చీ. సాయంత్రం ఆయనకోసం మరో రెండు కుర్చీలు పక్కఇళ్ల నుండి తెప్పించాను. యామినీదేవికి కాఫీ ఫలహారాలు సిద్ధం చేయమని చెప్పాను. ఆయన వచ్చే పని తెలియదు. అయినా మినిస్టర్ కదా! సాయంత్రం ఆరుగంటలకు రెండుకార్లు వచ్చి గుమ్మం ముందు ఆగాయి. ఎదురువెళ్లి స్వాగతం పలికాను. ఆయన వెంట జె.వి.సోమ యాజులు, పి.ఎస్.ఆర్. అప్పారావు వచ్చారు. వారిద్దరు సెక్రటరీలు. లాంఛనంగా లోపలకి వచ్చి, మళ్లీ వెళ్లిపోయి కారువద్ద నిలబడ్డారు ... మినిస్టర్‌గారికి ఏకాంతం కల్పించి.

"కుచేలుని ఇంటికి శ్రీకృష్ణుడు వచ్చాడు" అన్నాను.

ఆయన నిరాడంబరంగా, తృప్తిగా నవ్వారు.

"మీ పుస్తకాలు చదివాను. యోగంలో చేరాలని కోరిక. నాకు ఇనీసియేషన్ ఇవ్వండి"

"మీకు యోగం చేసే వ్యవధి వుండదేమో! బిజీ కదా?"

"ఫరవాలేదు. వెసులుబాటు చేసుకుంటాను."

"అయితే రండి. లోపల కూర్చుందాం."

లోపలి గదిలో నాతోపాటు ప్రేయర్‌లో కూర్చోబెట్టుకున్నాను. వసంతకుమార్, వెంకటరమణ, యామినీదేవి, నేను... శ్రీరామమూర్తిగారు ప్రేయర్ చేశాం. ఆయన ఒక గంటసేపు కూర్చోగలిగారు ప్రశాంతంగా.

అలా నా యోగంలో హైదరాబాదులో చేరిన రెండవవ్యక్తి భాట్యం శ్రీరామమూర్తిగారు.

"రోజూ రాలేను. వీలైనప్పుడు వస్తుంటాను. ఇంట్లో చేసుకుంటాను" అని చెప్పారు. ప్రార్థన రాసి యిచ్చాను.

మరొకసారి శ్రీ రామమూర్తిగారు తన శ్రీమతిని తీసుకువచ్చారు. ఆమె పేరు సతీదేవి. కాస్త స్థూలకాయురాలు. నేలపైన కూర్చోవడం కష్టం. కుర్చీలో కూర్చునేది. ప్రేయర్ కుర్చీపైన కూర్చుని చేయడం నాకిష్టం వుండదు. ఎవరైనా సరే, చాపపైన కూర్చోవలసిందే. లేకపోతే వైబ్రేషన్స్ తట్టుకోలేరు. ఆమెకు కాళ్లు మడత పడవట. కాళ్లుచాపుకుని కూర్చుంటే ఏం బావుంటుంది.

"నేను చూచుకుంటాను. గోడవారగా కూర్చోండి" అని ప్రేయర్‌కుకూర్చోబెట్టాను. రెండు నిమిషాలలో ఆమె చాలా ఫ్రీగా సుఖాసనంలోకి వెళ్లిపోయి గంటసేపు ధ్యానం చేసుకోగలిగింది. ఆ తర్వాత ఆమెకు కాళ్లుపట్టటం లేదు. ఎప్పుడు వచ్చినా హాయిగా, ఫ్రీగా అందరిలా నేలపైనే కూర్చునేది. ఆయనా అంతే! మంత్రిననే అభిజాత్యం లేదు. లావుగా వున్నా, తర్వాత చిన్నపిల్లలా చలాకీగా మారింది.

ఒకసారి ఆయన వెంట విశాఖజిల్లా శాసనసభ్యులు నలుగురు వచ్చారు. వారు పక్కన వుండగా ఈయనకు చాపపై కూర్చోవడం నామోషీ అనిపించింది.

"నేను ఇక్కడ కుర్చీలో కూర్చుని ప్రేయర్ చేసుకుంటాను. మీరు లోపల గదిలో చేసుకోండి" అన్నారు.

"మీ ఇష్టం అలాగే"

ఎవరి ఇష్టాన్ని కాదని నేను రూల్స్ పెట్టను. నియమాలు, నిబంధనలు ఉంటాయి. పాటించడం వారివారి యిష్టం, అనుకూలం. ఈ నిబంధనలు పాటించకపోతే యోగం చేయకూడదు అనను. నిబంధనలు డిసిప్లిన్ కోసం మనం పెట్టుకున్నవి.

ఆయన ముందరి గదిలో కుర్చీలోనే కూర్చున్నారు. మేం లోపలి గదిలో కూర్చున్నాం. కొంతసేపటికి ఎవరో నేలపైన పడ్డట్టు 'ధన్' మని శబ్దం వచ్చింది. ప్రేయర్‌లో మునిగిన తర్వాత ప్రళయం వచ్చినా లేవను. బ్రహ్మరాక్షసి వచ్చి మీదపడినా చలించేది లేదు. ఆ పడ్డది మంత్రిగారు. బయట గదిలో కూర్చున్న పెద్దమనిషి 'ధన్' మని కిందపడి, పాకుతూ, దేకుతూ లోపలి గదిలోకి వచ్చి మా వెనక కూర్చుండిపోయాడు.

ప్రేయర్ అయిన తర్వాత అడిగాను.

"ఇక్కడికి ఎప్పుడు వచ్చారు?"

"ఏమో తెలీదు. నేను బయట కూర్చున్నా."

క్రిందపడటం, దొర్లుకుంటూ రావడం ఆయనకు తెలీకుండానే జరిగిపోయింది. ఆ తర్వాత ఎన్నడూ కుర్చీలో కూర్చుని ప్రేయర్ చేసుకుంటానని అనలేదు.

ఆయన మంత్రిగా వున్నంత కాలం ప్రేయర్‌కు వచ్చేవాడు. తర్వాత కాంగ్రెస్‌ను వదలి తెలుగుదేశంలో చేరాడు. పార్లమెంటుకు ఎన్నికైనాడు. అప్పుడు ఎం.పి. హోదాలో వస్తుండేవాడు.

ఒకసారి ఆయనకు జబ్బలు పట్టేసి చేతులు పైకి లేచేవి కావు. ఎందరు డాక్టర్లు చూచినా, ఎన్ని వైద్యాలు చేసినా తగ్గలేదు. పదిరోజులపాటు యోగా ట్రీట్‌మెంట్‌కు వచ్చారు. రాత్రి ఎనిమిది తొమ్మిది గంటల ప్రాంతంలో వచ్చేవారు. లాల్చీ తొడుక్కునేందుకు లేదు. ఉత్తరీయం పైన కప్పుకుని వచ్చేవాడు. తొమ్మిదిరోజుల ట్రీట్‌మెంట్‌తో రోగం కుదిరింది. అప్పుడు మినిస్టర్స్ కాలనీలో వుండేవారు. ఒకటి రెండు సార్లు నన్ను తీసుకువెళ్లారు. వారి వల్లనే న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో చాలామంది మంత్రులతో, శాసనసభ్యులతో పరిచయం,స్నేహం ఏర్పడ్డది. హైదరాబాదులో నా యోగకార్యక్రమం అలా మొదలైంది.

+ + +

నేను చేస్తున్న యోగం గురించి ప్రచారం చేసుకోను. ఎవరికీ చెప్పను. వారంతట వారు తెలుసుకుని వస్తే, అడిగితే నాలుగు మాటలు చెబుతాను. మరీ వెంటపడితే తప్ప యోగంలో చేర్చుకోను. ట్రీట్‌మెంట్స్ అంతే. ఇంక డాక్టర్లవల్ల నయంకాని కేసులు అయితేనే యోగ చికిత్సకు అంగీకరిస్తాను. డాక్టర్ల వల్ల మందులవల్ల తగ్గే జబ్బులకు యోగచికిత్స చేయడం నాకు ఇష్టం వుండదు. తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం వస్తే డాక్టరు వద్దకు వెళ్లి వైద్యం చేయించుకొమ్మని సలహా యిస్తాను. వైద్యానికి లొంగని జబ్బులైతేనే యోగం...

మా ఇంటి ఎదురుగా డాక్టర్ రంగాచారిగారు వున్నారు. అప్పుడప్పుడు పలకరించేవారు. ఆయన భార్య రేడియోలో పాడుతుంది. ఆమె జై సంతోషిమా భక్తురాలు. ఆమె వ్రతం చేస్తూ పేరంటానికి పిలిచి దక్షిణ రవికలగుడ్డ యివ్వగా నా శ్రీమతి తీసుకోలేదు. మేం యోగం చేసుకుంటాం ... ఇలాంటివి తీసుకోకూడదని తిరస్క రించింది. రంగాచారి డాక్టరైనా అరవిందయోగి భక్తుడు. ఆయన ఆచార్య రజనీష్ అభిమాని. నేను తొలిసారిగా రజనీష్ పుస్తకాలు ఆయన వద్దనే తీసుకుని చదివాను. అప్పట్లో నాకు ఎలాంటి అభిమానం కలగలేదు. రజనీష్ అంటే ఒక అయిష్టత, ద్వేషం ఏర్పడ్డది. భాట్టంగారు మా ఇంటికి రావడం రంగాచారి గారు గమనించారు. వీడేదో కాస్త గట్టివాడే అయివుండాలి, లేకపోతే మినిస్టర్‌గారు తరచుగా ఇంటికి రావడం ఏమిటి అని నా పరిచయం పెంచుకున్నారు. ఆయన భార్య రాకపోకలు సాగించింది. అప్పుడప్పుడు

ఇంట్లోకివచ్చి యోగవిషయాలు, వేదాంత విషయాలు మాట్లాడేవాడు. నేను 'సావిత్రి' రాస్తుండడం వల్ల ఆయన నాకు మరింత సన్నిహితం కాగలిగాడు.

ఆయనకు ఒక కూతురు వున్నది. చాలామంది ఆడపిల్లలు తర్వాత కలిగారు. అప్పట్లో సన్నగా, తీగలా, నాగుపాములా వుండేది. ఆ పిల్లకు నాగదోషం వుంది. రాత్రిళ్లు మెలికలు తిరుగుతూ నేలపైన పాకుతూ మంచాల సందున దూరి తలుపు వెనక నక్కినక్కి పడుకునేది. నిద్రపోయేది కాదు. పాముకళ్లతో భయంగా చూస్తుండేది. ఆ పిల్లకళ్లు చూస్తే పెద్దవాళ్లే దడుచుకునేవారు. సరిగా అన్నం తినేది కాదు. తాను డాక్టరు అయ్యీ ఆ పిల్లకు వైద్యం చేయలేక పోయాడు. పాపం! అది జబ్బు కాదు కదా! యోగంతో నన్ను ట్రీట్‌మెంట్ ఇమ్మని అర్థించాడు. ఎదురింటివాడు. డాక్టరు. మంచివాడు. కాదని ఎలా అనగలను? పదిరోజులపాటు రోజూ ఉదయం, సాయంత్రం ఆరుగంటలకు తీసుకురమ్మని చెప్పాను. తొమ్మిదిరోజుల ట్రీట్‌మెంట్‌తో ఆపిల్లకు బాగైంది. మామూలు ఆ వయసు పిల్లలా మారిపోయింది. ఆయనకు నా యోగం చేయాలని కోరిక. కాని నేను పెట్టిన కండిషన్స్‌కు భయపడ్డాడు. అతను నాన్-వెజ్. అది మానలేక యోగానికి గుడ్‌బై చెప్పాడు. అభిమానం వుంది. యోగం పట్ల గౌరవం వుంది. మరి నాన్ వెజిటేరియన్ అయివుండి అరవిందునియోగం ఎలా చేస్తున్నాడో అర్థం కాలేదు. చాలామందికి యోగం చేయాలని ఉన్నా వెజిటేరియన్స్‌గా మారడం యిష్టంలేక యోగం జోలికి రావడం లేదని నాకు తెలుసు. యోగంలో చేరిన తర్వాత 'తినుడు' పై మనస్సు మళ్లి యోగం' మాని వేస్తారుగానీ నోరు కట్టుకోరు. మధువు, మాంసం ఏ యోగానికైనా పనికిరావు. విదేశాలలో యోగం చేసేవారుసైతం తాగుడు, మాంసాహారం మానివేయగలుగుతున్నారు. మనదేశంలో అగ్రవర్ణాలని విర్రవీగేవారు ఈ అలవాట్లు మానుకోలేకపోతున్నారు.

తన కుమార్తెకు ట్రీట్‌మెంట్ చేయించుకున్న ఘంటప్ప ఆదోనిలో, కర్నూలులో బాగా ప్రచారం చేశాడు. మద్రాసులో నా వద్ద ఇనీసియేషన్ తీసుకున్న రంగనాథరావు తన సోదరుడు కృష్ణమాచారికి యోగం గురించి చెప్పి ఒకసారి మద్రాసు వచ్చాడు. ఆ కృష్ణమాచారి కర్నూలులో పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా వుండి యోగాసెంటర్ ప్రారంభించాడు. ఆదోనిలో ఘంటప్ప ద్వారా చాలామంది యోగంలో చేరారు. వారిలో రఘునాథ్ అనే అతనికి బాగా వైబ్రేషన్స్ వచ్చేవి. అతనికి మాస్టర్‌గారు కనిపిస్తారని చెప్పేవాడు. అతనిలో మాస్టరు ప్రవేశించాడని అతనే మాస్టరు అని ప్రచారం సాగింది. ఆ అబ్బాయిని నా వద్దకు తీసుకుని వచ్చారు. ఆ కుర్రవాడు ట్రాన్స్‌లోకి వెళ్లిపోయి మాస్టరుగారితో మాట్లాడతాడని ఏవో సందేశాలు ఇస్తాడని చెప్పారు. ఆ అబ్బాయిని ఒక గురువును, మాస్టరును చేయాలని అతని తల్లి కోరిక.

నా దగ్గరకు వచ్చారు. ఆమె సినిమాల్లో హీరో తల్లి మేకప్‌తో వుంది. మంచి కంచిపట్టుచీర కట్టింది. సాయంత్రం అందరం ప్రేయర్‌కు కూర్చున్నాం. ఆమె, ఆమెగారి కొడుకు ముందు వరసలో మాస్టర్‌గారి ఫోటోకు దగ్గరగా కూర్చున్నారు. నేను దూరంగా, చివరగా కూర్చోవలసి వచ్చింది. మేము మామూలుగా ప్రేయర్ చేసుకున్నాం. రఘునాథ్‌కి ఆశించిన వైబ్రేషన్స్ ఏవీ రాలేదు. ట్రాన్స్‌లోకి వెళ్లలేదు. సందేశాలు యివ్వలేదు. అతనికి చెమట్లు పోశాయి. తల్లీ కొడుకులు బిక్కమొహాలు వేసి సిగ్గుతో వెళ్లిపోయారు.

మాస్టరుగారి అనుగ్రహం చేజారిపోయిందని వాపోయారు. మాస్టరుగారి అనుగ్రహం చేజారిపోవడానికి మనలో పెంచుకున్న అహంకారమే కారణమని వారు గ్రహించలేదు. ఇప్పటికీ అహంకారంతోనే సాధకులు మాస్టరుగారి అనుగ్రహాన్ని పోగొట్టుకొంటున్నారు. మాస్టరుగారికి ఒకరు ఎక్కువ కాదు ... తక్కువ కాదు. ఎవరు చక్కగా సాధన చేస్తే వారే మాస్టరు యోగానికి దగ్గరవుతారు. మాస్టరుగారి యోగశక్తిని పొందగలుగుతారు. అహంకారం పెంచుకున్నవారు దూరమై, యోగ భ్రష్టులవుతారు. మరొకమారు వచ్చినప్పుడు ఘంటప్ప చెప్పాడు. ఆ అబ్బాయి యోగం మానివేశాడని, వాళ్లకి వైష్ణవం ఎక్కువట. శ్రీకృష్ణుడు, గీత, భాగవతం ఇవీ వారి ఆరాధ్యాలు. మాస్టరు యోగాన్ని ఆసరాగా చేసుకుని వైష్ణవ ప్రచారం చేశారట. గోదాదేవి కథలు చదవడం, పాశురాలు పాడడం, శ్రీకృష్ణలీలలు ఇవి వారికి ఇష్టం. మాస్టరుయోగం చేస్తున్నట్లు జనానికి నమ్మచూపి వారికి కృష్ణలీలామృతాన్ని దోసిళ్లతో పంచిపెట్టేవారు. యోగానికి మతానికి సంబంధం లేదు. యోగాన్ని అడ్డుపెట్టుకుని మత ప్రచారం చేయడం ఆత్మద్రోహమే అవుతుంది.

ఘంటప్ప నిజాయితీగా యోగం చేశాడు. అతనంటే మిగిలినవారికి పడదు. వారిలాగా తప్పటడుగులు వేయడు. తప్పుడు పనులు చేయడు. ప్రచారం అభిలషించడు. అతను యోగంతో మాస్టరుగారి 'అనుగ్రహం' బాగా పొందగలిగాడు. నిజాయితీగా యోగం చేసేవారికి ప్రచారం అక్కరలేదు.

అలా అప్రయత్నంగా యోగసాధకులు నన్ను వెతుక్కుంటూ రాసాగారు. కోరి మరీ ట్రీట్‌మెంట్స్ చేయించుకునేవారు. నాకు ట్రీట్‌మెంట్స్ చేయడం రాదు. టెక్నిక్ తెలియదు. యోగానికి సంబంధించి చాలా చాలా కోర్సులు వున్నాయని వినడమే తప్ప చూచింది లేదు. దిడుగు నారాయణరావుగారి దయవల్ల ప్రిపరేటరీ కోర్సులు ఆరు మాత్రం సాధన చేశాను. మిగత కోర్సులు నాకు దొరకలేదు.

అప్పట్లో ఒక పెద్ద రాష్ట్రప్రభుత్వోద్యోగి నా వద్దకు వచ్చాడు. ఆయన పేరు మరిచిపోయాను. ఆయనకు ఉబ్బసం. రోగం ముదిరింది. హోమియో వాడుతున్నాడు.

గుణం లేదు. యోగం ద్వారా ట్రీట్‌మెంట్ కోరాడు. చేశాను. కొంతవరకు తగ్గింది. పూర్తిగా తగ్గిపోతుందన్న నమ్మకం ఆయనకు, నాకు కలిగింది. ఆయనకు జ్యోతిషం వచ్చునట. నా పుట్టినతేదీ అడిగాడు. జాతకచక్రం యిచ్చాను. తాను మరల గుణించి, చక్రం వేసి తెచ్చాడు. చాలా స్టడీ చేశాడు. బిందువర్గు కూడా వేశాడు. యోగంలో నా స్థానం నిర్ణయించాలని ఆయన ప్రయత్నం. కాని ఆయన చూపు శనిపైన పడ్డదో శనిదృష్టి ఆయనపైన పడ్డదోగాని నేను 52 సంవత్సరాలు మించి బ్రతకనని, అయిదవ ఇంట శని ధనుస్సులో వున్నాడట. శని ధనురాశిలో బిందువులు శూన్యం. బలం లేదట. కనుక శనికి ధనుస్సులోకి వచ్చీ రాగానే నాకు మారకం తప్పదట. ఆయనకు నేను యోగంతో రోగం నయం చేసినందుకు ప్రతిఫలంగా నాకు మారకం భయం పెట్టాడు. లోగడ కూడా కొందరు ఇలాగే చెప్పారు. ఆ వయస్సులో మారకం కాకపోతే సంసారం వదిలి సన్యాసుల్లో కలిసిపోతానని ఉపశమన వాక్యాలు చెప్పిన వారున్నారు. ఈయన ఏకంగా ప్రాణానికి ముప్పు తెచ్చిపెట్టాడు.

చిక్కడపల్లిలో క్రాస్‌రోడ్స్ వద్ద నా మిత్రుడు వున్నాడు ... వి.వి.రావుగారు. ఆంధ్రభూమిలో సబ్ ఎడిటర్. మంచి జ్యోతిష్కుడు. ఆయనకు జాతకం చూపించాను. ఆఫీసర్ చెప్పిన ఫలాలు చెప్పి మరణం తప్పదా అని అడిగాను. "మీకు సాముద్రికం తెలుసుగదా. చేయి చూచి చెప్పండి" అన్నాడు. "రేఖలలో అలాంటి దోషం లేదు. పైగా అదే వయస్సులో జీవితరేఖ నుండి ఒక ఊర్ధ్వరేఖ బయలుదేరి శనిస్థానం వైపు పోతున్నది. అది మంచి మలుపు. దానివల్ల కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయితప్ప మారకం జరగదు." అన్నాను.

"కరెక్ట్! మీరు యోగం చేస్తారు కదా! మీ పైన గ్రహాల ప్రభావం ఉండదు. మామూలు జాతకులకైతే అతను చెప్పిన దోషం, మారకం ఉంటుంది. కాని మీకు వుండదు. యోగబలం ఉన్నవారిని, గ్రహ బలహీనతలు ఏమీ చేయవు. మీరెప్పుడూ జాతకఫలాలను నమ్మకండి. వాటి ప్రకారం జీవితం నడవదు. ఇది నా అనుభవం. ఉపాసకులకు, యోగులకు గ్రహదోషాలు అంటవు." అని ధైర్యం చెప్పాడు.

చావంటే నాకు భయం లేదు. ఎప్పుడో ఒకరోజున చావవలసిందే! యోగాన్ని నమ్ముకున్నాను. యోగం చేసేవారికి ఆయుష్షు పెరుగుతుందని పెద్దలు చెప్పారు. కనీసం పదిసంవత్సరాల ఆయుర్దాయం అదనంగా మాస్టరుగారు గ్రాంట్ చేస్తారని నమ్మకం. ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. అంతా మాస్టర్‌గారి దయ. పిల్లలింకా ప్రయోజకులు కాలేదు. చదువులే పూర్తి కాలేదు. అమ్మాయి పెళ్లి చేయాలి. అందరికన్న

చిన్నది అమ్మాయి. కనుక ముందు వసంతకుమార్ పెళ్లి చేయాలని సంకల్పించాం. అప్పటికి తనకింకా ఉపనయనం కాలేదు. ఉపనయనం కాకపోతే తండ్రికి కర్మచేసే అర్హత వుండదు. యోగంలో వున్నా ఆలోచనలు సంప్రదాయక పొరల్ని దాటడం లేదు. యోగికి కర్మ అవసరం లేదు. కాని నేను ఇంకా ఒక యోగిని అయినానా! కానప్పుడు యథావిధిగా కర్మాంతరాలు నిర్వహిస్తారు కదా. నేను వద్దని వారించినా సమాజం మిన్నకుండదు. క్షమించదు.

పెళ్లి అనుకోగానే ముందు ఇల్లు మారవలసి వచ్చింది. అంతవరకు వుంటున్న ఇల్లు చిన్నది. రెండు గదులు, ఒక కిచన్, ఒక సెపరేట్ బెడ్‌రూమ్ ఉన్న ఇల్లు కావాలి. బ్యాంక్ కాలనీలో అట్లాంటి ఇల్లు దొరికింది. వెంటనే మారిపోయాం. ఇల్లుమారగానే ప్రెస్ ప్రారంభోత్సవం. మద్రాసు నుండి వచ్చినబంధువు అడవికొలను నాగేశ్వరరావుగారు వారి పెద్దమ్మాయి మణి^^కూరిని వసంతకు ఇవ్వచూడడం, అందరికీ అంగీకారం కావడం చకచకా జరిగాయి. ప్రెస్‌పెట్టిన కొద్దిరోజుల్లో పెళ్లి జరిగింది. ఒకపక్క పిహెచ్.డి పరిశోధన, ఇటు ప్రెస్ నిర్వహణ.

పరిస్థితులు మన చెప్పు చేతల్లో వుండవు. కష్టాలు ఎదురైతే తప్ప భగవంతుడు జ్ఞాపకం రాడు. నేను భగవంతుని ప్రక్కకుపెట్టి చాలా సంవత్సరాలైంది. యోగం, మాస్టరుగారు ఇవే సర్వస్వం. యోగశక్తి నన్ను ఆదుకోవాలి. లేకుంటే మాస్టరుగారు ఆదుకోవాలి. దేవుని వేడుకోవడం అన్నది లేదు. దేవాలయాలకు వెళ్లేది లేదు. ఇంతకన్నా చెడేది లేదు. మృత్యురేఖపై నిలిచినవాడిని. భయందేనికి? ప్రెస్ నడుస్తోంది. వసంత తన బాధ్యతపై నడుపుతున్నాడు. పైకి తీసుకువస్తాడన్న నమ్మకం ఏర్పడ్డది. మా సోదరుడు డాక్టర్ వి.వి.ఎల్. నరసింహారావు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీకి డైరెక్టర్‌గా వచ్చాడు. వారి ప్రింటింగ్ పనులన్నీ వసంతకుమార్ సంపాదించాడు. యూనివర్సిటీ పరిచయాల వల్ల మరికొన్ని అచ్చుపనులు, సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ పుస్తకాలు వచ్చాయి. ప్రెస్‌లో ప్రింటింగ్ మెషిన్ కొనక తప్పలేదు. వర్కర్ల సంఖ్య పెరిగింది. ప్రెస్ పనుల్లో పడి వసంత పరిశోధన పని నిర్లక్ష్యం చేశాడు. అది మనస్సులో కలుక్కుమనిపించినా భరించక తప్పలేదు. పిహెచ్.డి వస్తే కాలేజీ లెక్చరర్ అవుతాడని, జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతుందని ఆశ.

నేను ప్రెస్ పెట్టడం ఆఫీసులో పెద్దలకు కంటగింపు అయింది. ఒకడు బాగుపడుతుంటే ఏడ్చేవాళ్లు ఎక్కువ. ఎడిటర్ మహాశయులు నన్ను బెంగుళూరుకో, విజయనగరానికో బదిలీ చేయించాలని ప్రయత్నించారు. అయిదారు వందల జీతం

పెంపుతో రెసిడెంట్ ఎడిటర్ హోదాతో విజయనగరంలో పెట్టే కొత్తఎడిషన్‌కి పొమ్మన్నారు. ఎక్కడికీ వెళ్లడం నాకిష్టం లేదు. కారణం ఎక్కడికి పోయినా రెండు చోట్ల సంసారాలవుతాయి. పిల్లల చదువులకు సంపాదన చాలదు. యోగం వేళకు చేసుకోవడం కుదరదు. ప్రమోషన్ సున్నితంగా తిరస్కరించాను. రిటెన్‌గా ఇమ్మన్నారు. నా తర్వాతి వారికి ప్రమోషన్ కావాలిట. ఇచ్చాను. నా జూనియర్స్ అయిదారుగురికి ప్రమోషన్స్, పదవులు వచ్చాయి. జీతం పెరిగింది. నాకు అసూయ లేదు. దిగులు లేదు. వీక్లీ నుండి డెయిలీకి మారాను. ఎ.బి.కె.ప్రసాద్‌గారి సాయం మరువలేనిది.

మొదటి నుండీ జర్నలిజంలో నాకు గాడ్‌ఫాదర్‌గా వున్న విద్వాన్ విశ్వంగారు రిటైర్ అయినారు. పొత్తూరు వెంకటేశ్వరరావుగారు వీక్లీ ఎడిటర్ అయినారు. వీక్లీలో మొదటి నుండీ వున్న నన్ను నా అనుభవాన్ని విస్మరించి ఆయనకు ఎడిటర్ పదవి కట్టబెట్టారు. అదీ రాజకీయం. జర్నలిజంలో రాజకీయం నడపగల మహామేధావి పొత్తూరివారు. మిగతా విషయాల్లో మంచివాడుగా పెద్దమనిషిగా అందరినీ నమ్మించగలడు. స్వలాభంకోసం, స్వప్రయోజనాలకోసం భయంకరమైన రాజకీయ నాటకం ఆడగలడు. అందరూ ఆయన్ని రాజకీయ చాణుక్యుడు అనేవారు. ఎదురుగా అనలేరు కదా! చాటుగా విమర్శించుకోవడం సబార్డినేట్స్ స్వభావం. ఆయన కావాలని తెచ్చుకున్న వ్యక్తులే ఆయన్ని ఆయన మనస్తత్వాన్ని చాటుగా దుయ్యబట్టేవారు.

మార్పులు చకచకా చోటు చేసుకోసాగాయి. శనిగారు కలిగించవలసిన 'మారకం' తప్పిపోయినట్లుంది. నాకు మరణయోగం వుందని చెప్పిన జ్యోతిష్కుడు పాపం ఆరునెలలు తిరగకుండానే చనిపోయాడు. తన జాతకమే తెలుసుకోలేనివాడు ఇతరులకు చెప్పకూడదు. వసంతకుమార్ పరిశోధనకు గైడ్‌గా వున్న డాక్టర్ వేటూరి ఆనందమూర్తి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి కుమారుడు. యోగంలో వున్న తనకు యోగం చేస్తున్న ఆచార్యుడే గైడ్ కావడం మాస్టర్‌గారి సంకల్పం. డాక్టర్ ఆనందమూర్తిగారు మారిషస్‌లో కొన్ని సంవత్సరాలు వుండి వచ్చారు. ప్రభాకరశాస్త్రిగారి రచనలు ముద్రించ పూనుకున్నారు. మణిమంజరి అనే పత్రికను ప్రారంభించారు. అవి అన్నీ మా మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్‌కే వచ్చాయి.

నా వరకు యోగానికి ఉపయోగపడితే చాలుననే సంకల్పం నాది. ఏం చేయగలను? నాకున్న అర్హతలేమిటి! 'మాస్టర్ యోగదర్శని' ఒక్కటి రాయగలిగాను. నాకున్న అవధిలో మాస్టరుగారు ఏది చేయిస్తే అది చేయడానికి నేనుసిద్ధం. భగవంతుడు యిచ్చిన ఆయుర్దాయం అయిపోయింది. అదనంగా బ్రతుకుతున్నది మాస్టరుగారు

గ్రాంట్ చేసిన అదనపు ఆయుష్షు. దీనిని వారి యోగకార్యానికి వెచ్చించడం ధర్మం. ఆ నిర్ణయం నాలో బలంగా పాదుకున్నది. ఆఫీసులో పనిపైన శ్రద్ధ పరిమితం. మాటపడకుండా ఉండడం వరకే. చేయవలసిన పని సక్రమంగా చేయడం వరకే. ఉద్యోగం తీసివేసినాసరే సిద్ధంగానే వున్నాను. నిండా మునిగినవానికి చలి భయం వుండదు.

బళ్లారి నుండి బి.కొండాచారిగారి ఆహ్వానం. ఆగస్టు 4 మాస్టరుగారి జన్మదినోత్సవానికి రమ్మని పిలుపు. నా ఆధ్వర్యంలో ప్రార్థనలు జరుగుతాయట. నేను పెద్దనా!? విచిత్రం!! మిత్రులు డి.ఎస్.రావుగారితో చెప్పాను. తాను వస్తున్నానని, బయలు దేరమని చెప్పాడు.

"మాస్టరుగారి ప్లాన్ మనకు అర్థం కాదు. యూ గెట్ రెడి" అన్నారు. అప్పటికి డి. నరసింహారావుగారికి నాకూ మైత్రి బాగా గట్టిపడ్డది. ఆయన నాకు గైడ్ అన్నిటా. ఇద్దరం బయలుదేరాం వస్తున్నట్లు కొండాచారిగారికి టెలిగ్రాం యిచ్చాను. అటు వెళ్లడం అదే మొదటిసారి. ఇద్దరం వెంకటాద్రిలో బయలుదేరాం. గుంతకల్ వెళ్లేవరకు భయంకర మైన తుఫాను. వర్షం. రైలు దిగటమే కష్టమైంది. వెయిటింగ్ రూమ్‌లో ఖాళీ లేదు. రావుగారికి చలిజ్వరం పట్టుకుంది. పాపం! పెద్దాయన. వర్షంలో వణికిపోతున్నాడు. ఫస్ట్ క్లాస్ రైల్వే పాస్ ఆయనది. ఏం ప్రయోజనం. స్టేషన్ మాస్టర్ లేడు. ఒంటిగంటకు గుంతకల్‌లో దిగాం. నాలుగు గంటలకు విజయనగర్ రైలు. ఒక కాఫీ, టీ ఏం లేవు. బ్రిడ్జి క్రింద తలదాచుకున్నాం. ఆస్పత్రికి వెళ్లాలన్నా వర్షం. ఆయనకు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని నాభయం. ఏమని ఓదార్చను. మాస్టరుగారిని ప్రార్థిస్తూ, వర్షంలో తడిసిపోతూ కూర్చున్నాం. మూడు గంటల ప్రాంతాన వర్షం జోరుతగ్గింది. బళ్లారి వైపు వెళ్లేరైలు ప్లాట్‌ఫాం పైకి వచ్చింది. దాంట్లో ఎక్కి రావుగారిని పడుకోబెట్టి నాపెట్టెలో ఉన్న ధోవతులు కప్పాను. ఆయనకు బాగా నిద్రపట్టింది. నాలుగుగంటలకు రైలు బయలుదేరే సమయానికి ఆయన కళ్లు తెరిచి సిగరెట్ వెలిగించాడు. కాఫీ తెప్పించి ఇచ్చాను.

"ఇంకా రేణిగుంటలోనే వున్నామా?" అని జోక్ చేశాడు. అయన కనిపిస్తే మృత్యువుతోనూ జోక్ వేయగలడు. నాకు ఆ రాత్రి నిద్రలేదు. ఒంటిగంట వరకు మా కబుర్లు. గుంతకల్ స్టేషన్‌లో డి.ఎస్. రావుగారి అనారోగ్యం, వర్షం. ఇంకా కునకడానికి అవకాశం ఏదీ? అయిదు గంటలకు రైలు బళ్లారి స్టేషన్ చేరింది. బ్రతుకుజీవుడా అని బయటపడ్డాం.

అసలు డ్రామా అప్పుడు మొదలైంది. 1982, ఆగస్టు 4వ తేదీ. తెల్లవారుఝాము అయిదుగంటలు. ఇద్దరం ప్లాట్‌ఫాంపైన దిగి అటు ఇటు చూశాం. ఎవరూ రాలేదు.

కొండాచారి గారికి టెలిగ్రాం యిచ్చాను. ఎందుకు రాలేదూ! రైల్వే టీ స్టాల్‌లో వేడివేడి టీ తాగి సిగరెట్స్ కొని బయలుదేరి నడుస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఎదురైనారు. అప్పటికి రైలు దిగినవారంతా వెళ్లిపోయారు. మేం ఇద్దరమే ప్లాట్‌ఫాంపైన మిగిలాం. వారు మావద్దకువచ్చి "హైదరాబాద్ నుండి వచ్చింది తమరేనా" అని అడిగారు.

"అవును" అన్నాం.

వారి చేతిలో వున్న పూలదండలు హడావుడిగా డి.ఎస్.రావుగారి మెడలో వేసి, నమస్కారంచేసి, "క్షమించాలి. రావడం కాస్త ఆలస్యమైంది. ఒకసారి వచ్చి వెళ్లాం. రైలు లేటన్నారు. అయిదింటికి గాని రాదన్నారు. ఇంటికి వెళ్లాం. రైలు కూత విని హడావుడిగా బయలుదేరి వచ్చాం. క్షమించాలి."

అలాగ క్షమాపణలు చెపుతున్నాడు. అసలు వీరు వచ్చింది మాకోసమేనా అని అనుమానం వచ్చింది. మాకోసమే వస్తే పూలమాలలు ఎందుకు తెస్తారు? అంతలో దూరంనుండి కొండాచారిగారు, సూర్యనారాయణగారు పరుగున రావడం గమనించాను. "కొండాచారిగారు వస్తున్నారు" అన్నాను డి.ఎస్.తో.

"దట్సాల్ రైట్" అన్నారు.

"దట్సాల్ రైట్ సరే, వీరు ఎవరికోసమో తెచ్చిన దండలు మీకు వేశారు."

"అయితే తిరిగి యిచ్చేద్దాం" అని ఆయన మెడలో దండలు తీసి వారికి యిచ్చివేశాడు. వారు కొండాచారిగారి మనుషులే. మా కోసమే వచ్చారు.

"సారీ మావాళ్లకు మీరు తెలియదు. వారిని మీరనుకున్నారు. క్షమించండి" అన్నాడు కొండాచారి.

"కుడి ఎడమైతే పొరపాటు లేదులెండి. వీరు డి.ఎస్.రావుగారు. సీనియర్ సాధకులు. మీ పూలమాలలకు వారే అర్హులు" అని ఓదార్చాను. రావుగారిని వదిలి నేను గౌరవం పొందటం తప్పు. మాస్టరుగారి సంకల్పం అది. స్టేషనుకు దగ్గరే సూర్యనారాయణ గారిల్లు. మున్సిపల్ ఆఫీసు ఎదర. అందరం కబుర్లు చెప్పుకుంటూ నడిచివెళ్లాం. అప్పటికే ప్రేయర్‌కు హాల్ అలంకరించారు. పదిమంది వచ్చి వున్నారు. కాఫీలు, స్నానాలు పూర్తి చేసుకున్నాం. ఆరుగంటలయ్యేసరికి యాభై అరవైమంది వరకు వచ్చారు ప్రేయర్‌కు. బావుంది. మంచి గ్యాదరింగ్. మాస్టరుగారి, మదర్‌గారి ఫోటోలు పెద్దవి చక్కగా అలంకరించారు. ఎదురుగా ప్రార్థన చేసే సాధకులకోసం చాపలు, కార్పెట్లు వేశారు. పక్కగా రెండు ప్రత్యేకస్థానాలు వుంచారు. బహుశా అవి మాకోసమే ననుకొని నేను ఆ స్థలంలో కూర్చున్నాను. రావుగారు అందరితో కలిసి కూర్చున్నారు. సూర్యనారాయణ వారి భార్య వచ్చి నాకు నమస్కరించారు. నేను ప్రేయర్ చెప్పాను. ప్రార్థన అయిన తర్వాత

అందరూ వచ్చి నాకు నమస్కరించసాగారు. అది విచిత్రమైన అనుభవం. అందరూ కలిసి నాకు గురుస్థానం కల్పించారు. లోగడ యోగసమావేశాలకు హాజరైనా ఒక సామాన్యసాధకుని వలె హాజరైనాను. ఇక్కడ బళ్లారిలో నాస్థానం మారింది. అయాచితంగా అప్రయత్నంగా గురుస్థానంలోకి బదిలీ అయినాను. ఆ రోజు ప్రతిఒక్కరు 'గురువుగారూ' అని పిలుస్తుంటే నాకేదో కొత్తలోకంలో ఉన్న అనుభూతి కలిగింది. నేను ఈ స్థానానికి అర్హుడినా కాదా అనిపించలేదు. ఒక గురువు వలెనే ప్రవర్తించవలసివచ్చింది. అది అసహజం అనిపించలేదు. మాస్టరుగారి సంకల్పం అనుకున్నాను.

బళ్లారిలో యోగకేంద్రం నిర్వహిస్తున్న సూర్యనారాయణ ఆయన భార్య గొప్ప భక్తులు. యోగానికి సంపూర్ణంగా అంకితమైనవారు. ఆయన మాస్టరు జన్మదినోత్సవం జరపాలని, నన్ను ఆహ్వానించాలని అనుకున్నారు. మాస్టరుగారు కన్పించి తాను జయంతి నాటికి వస్తున్నట్లు చెప్పారుట. ఆగస్టు 4న మాస్టరుగారు వస్తారని వారి విశ్వాసం. మాస్టరుగారి సందేశం అబద్ధం కావడానికి వీల్లేదు. అందువల్ల ప్రేయర్ హాల్లో ఒక పక్కన పట్టు తివాచీ పరిచి వుంచారు మాస్టరుగారి కోసం. ఎవరూ కూర్చోకపోయినా అది మాస్టరుగారికి కేటాయించిన స్థానం. ఈ విషయం తెలియక సరాసరి వెళ్లి అది నాకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారని భావించి నేను అక్కడ కూర్చుండిపోయాను. ఆయన అనుకున్నారట ... నా రూపంలో మాస్టరుగారు వచ్చారని. అందరూ అలాగే భావించి వచ్చి నమస్కారాలు చేశారు. ఆ విధంగా నేను ఊహించని రీతిలో గురుస్థానం పొందడం జరిగింది.

డి.ఎన్.రావుగారిని అడిగాను, "ఏమిటి మహాశయా! ఇలా చేశారు? నేను గురువును కావడం ఏమిటి? పెద్దలు ఎందరో ఉన్నారు కదా!"

"అది మాస్టర్ ప్లాన్, కాదనడానికి మనం ఎవర?. వచ్చిన అవకాశాన్ని మాస్టరు ప్రసాదంగా తలదాల్చడమే మనం చేయవలసింది."

సూర్యనారాయణ, ఆయనభార్య నాకు గురుపూజ చేసి నూతన వస్త్రాలు బహూకరించారు. ఆ రాత్రికి తిరుపతి బయలుదేరుతుండగా కన్నీటితో వీడ్కోలు చెప్పారు. మళ్లీ బళ్లారి వస్తానని మాట తీసుకున్నారు. ఒక్కరోజు బళ్లారిలో నూరుమంది సాధకులతో గడిపాం. నాకంటే సీనియర్స్, వయస్సులో పెద్దవారూ ఉన్నారు. వారందరికీ నేనంటే అభిమానం ఏర్పడ్డది. చిన్నవారంతా 'గురువు'గా కొత్తపదవిని కట్టబెట్టారు.

\+ \+ \+

బళ్లారి నుండి శ్రీ నరసింహారావు, నేను బస్సులో తిరుపతి వెళ్లాం. మర్నాడు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి జయంతి. ఏ.వి. శ్రీనివాసాచారిగారు ప్రతీ ఆగస్టులో మాస్టరుగారి

జన్మదినోత్సవం, రెండ్రోజుల అవతల శ్రీ ప్రభాకరశాస్త్రిగారి జయంతి ఉత్సవాలు జరుపుతారు. డి.ఎన్.గారికి ఆహ్వానం వచ్చింది. నేను వారికి తెలీదు. ఎప్పుడూ కలుసుకోలేదు. బస్సు లేటైంది. రైల్వే రిటైరింగ్ రూమ్‌లో దిగి స్నానం చేసుకుని ఆయనగారిని విశ్రాంతి తీసుకోమని చెప్పి నేను మా షడ్డకుడు శ్రీ గాయత్రీప్రసాద్ గారింటికి వెళ్లాను. ఊళ్లోకి వచ్చి దగ్గరి బంధువులను చూడకపోతే బాగుండదు కదా! తిరుపతి నాకు కొత్త కాదు. చిత్తూరులో వున్న కాలంలో తరుచుగా వచ్చేవాడిని.

సాయంత్రం ప్రేయర్‌కు వెళ్లాం. రామాలయం ప్రక్కన శ్రీనివాసాచారిగారి ఇల్లు. మేం వెళ్లేసరికి హాల్‌నిండా జనం క్రిక్కిరిసి ఉన్నారు. వరండాలో. గదుల్లో జనం ఉన్నారు. రావుగారిని చూడగానే ఆచారిగారు నమస్కారంచేసి. సాదరంగా ఆహ్వానించారు. నన్ను పరిచయం చేయగానే మహదానందం చెందారు. "ఇద్దరు మహాత్ములు వచ్చారు. చాలా బాగుంది" అనిపొంగిపోయారు. ఆచారిగారు అల్ప సంతోషి అనిపించింది. అక్కడ చేరిన అంతమంది సాధకుల్ని చూస్తే ఆయన గట్టివాడే అనుకున్నాను. అంతమందిని సమావేశ పరచడం మాటలు కాదు. యోగసమావేశాలలో ఆకర్షణ వుండదు. గ్లామర్ వుండదు. ప్రార్థన చేసుకోవడం. తర్వాత కాస్త సత్సంగం. అంతే...

ప్రేయర్ ప్రారంభం కాగానే చాలామంది త్రేన్చడం వినిపించింది. 'ఆవ్,ఆవ్' నలువైపులనుండీ ఒకే డిస్టబెన్స్. నాకు ప్రేయర్ కుదరలేదు. రావుగారు ఇబ్బందిగా ఫీలై కళ్లు విప్పారు. ఆచారిగారు మా పరిస్థితి గమనించి కళ్లు తెరిచారు. "ఏమిటి ఆచారిగారూ ఆ అరుపులు, కూతలు. అవి ఆగవా?" అని అడిగాను.

"అలావస్తాయి, రావాలి. అలా వస్తే ఆరోగ్యం చక్కబడుతుంది."

"రోజూ ఇలాగే వస్తుంటే ఎప్పటికీ ఆరోగ్యాలు చక్కబడినట్లు కాదుకదా. మొదట్లో వస్తే అర్థం వుంది. ఇంక వీరి ఆరోగ్యాలు ఎప్పటికీ చక్కబడవా?"

ఆయన సమాధానం చెప్పలేకపోయారు.

"శార్వరీ! వీళ్లకు ఆ అరుపులు, పిల్లికూతలు రాకుండా చెయ్. ఏం ఆచారిగారూ చేయమంటారా" అన్నారు డి.ఎన్.గారు.

"మీ ఇష్టం, చేయగలిగితే చేయండి. నాకూ మంచిదే కదా! అందరం ప్రశాంతంగా ప్రేయర్ చేసుకోవచ్చు" అని పర్మిషన్ యిచ్చారు.

నేను నాలుగువైపులా దృష్టి సారించి అందరిలోకి చూచి ట్రీట్‌మెంట్ చేశాను. అయిదు నిమిషాల్లో హాలంతా నిశ్శబ్దం ఆవహించింది. తర్వాత ప్రేయర్ గంటసేపు మహాప్రశాంతంగా జరిగింది.

'ఎప్పుడూ జరగనంత హాయిగా, తృప్తిగా ప్రేయర్ సాగింది ఇవ్వాళ' అని అందరూ సంతోషించారు.

ఆచారిగారికి కోర్సులు చేయడం ఇష్టంవుండదు. వారు చేయించరు. ప్రేయర్ ఒక్కటే చాలునంటారు. నేను, రావుగారు కోర్సులు అవసరం అనే స్కూల్‌కి చెందినవారం.

"శార్వరీ! ఏమైనా కోర్సులు చేద్దామా" అన్నారు రావుగారు అన్యాపదేశంగా, ఒప్పుకోండి ఆచారిగారూ అన్నట్లు అటు చూస్తూ. ఆయన అంగీకరించారు. మేం కోర్సు చేయించాం. డి.ఎన్.గారికి చిన్నచిన్న కోర్సులు కంఠతః వచ్చును. ఆయనే చెప్పారు. తర్వాత ఆచారిగారు నన్ను మాట్లాడమని కోరారు. నాకు ఉపన్యాసాలు అలవాటు లేదు. అయినా అది ప్లాట్‌ఫారం కాదు. యోగసమావేశం. ప్రార్థనాస్థలి. అందరూ మనవారే. నన్ను వినాలని ఉత్సాహంగా ఆసక్తిగా వున్నారు. ఆచారిగారు మైక్ సిద్ధం చేశారు. టేపు సిద్ధంగానే వుంది. నేను గంటసేపు ఉపన్యసించాను. యోగంపైన, నేను అంతసేపు, అంతబాగా ఉపన్యసించగలనని అనుకోలేదు. నాకూ ఆశ్చర్యం వేసింది. అందరూ అభినందించారు. శ్రీనివాసాచారిగారు చాలా సంతోషించారు. మేం స్టేషన్‌కు వెళ్లిపోయాం. మా వెనుకే ఓ సాధకునితో ప్రసాదం, లడ్లు, విభూతి పంపారు. ఆ రాత్రికే మేం విజయవాడకు బయలుదేరాం.

అదొక చిత్రమైన యాత్ర... నా యోగ ప్రస్థానంలో పెద్ద మలుపు. ఒకేసారి మూడు కేంద్రాలను దర్శించడం. బళ్లారి, తిరుపతి, విజయవాడ. శ్రీకవులూరి సీతారామయ్యగారు ఆగస్టు 4న మాస్టర్ జన్మదిన ప్రార్థనలు, తర్వాత వారి గురుదేవులు మాస్టర్ ఎం.ఎన్.గారి జయంతి ఉత్సవాలు కలిసి నాలుగైదురోజులు చేయిస్తారు. మాస్టర్ ఎం.ఎన్.గారి జయంతిఉత్సవాలకు మేం విజయవాడకు చేరుకున్నాం. ఉదయం ప్రార్థన సమయానికే సత్యనారాయణపురంలోని సీతారామయ్యగారి ఇంటికి చేరాం. వారు మాకు పూజ్యులు, గురుసమానులు. వారికి పాదాభివందనం చేయకుండా వుండలేను. వారు వారించినా ఆ విషయంలో మొండితనం నాది. నన్ను కన్నకొడుకుల కంటే ప్రేమగా చూచేవారు.

శ్రీ సీతారామయ్యగారు ప్రతిసంవత్సరం ఆగస్టులో యోగసమావేశాలు జరుపుతారు. గుంటూరునుండి దిడుగు నారాయణరావు వచ్చారు. స్థానికంగా దాసుగారు. పి.ఎస్. ఆర్. శర్మగారు, గూడూరి నమశ్శివాయ, సత్యనారాయణగారు, ఆదోనినుండి ఘంటప్ప, వినుకొండ నుండి కె.ఎల్.రెడ్డి, పిడుగురాళ్ల కేంద్రానికి చెందిన సాధకులు యాభైమంది వచ్చారు. ఆ రోజు దిడుగు నారాయణరావుగారు ఎం.టి.ఎ. కోర్సు చేయించారు. ఆ కోర్సు చేయడానికి కనీసం మూడు గంటలు వ్యవధి కావాలి. నెమ్మదిగా

చేయిస్తే అయిదారుగంటలు పడుతుంది. సాధకుని అంతఃశుద్ధిని బట్టి తన్మయత వుంటుంది. రోదసిలో ప్రయాణం సాగుతుంది. నక్షత్రలోకాలు గ్రహలోకాలు దాటి నిర్వాణ, పరనిర్వణ, మహాపరనిర్వాణ లెవెల్స్‌కు చేరటం జరుగుతుంది. చివరన ఎం.టి.ఎ. భూమిక వస్తుంది. యాభై అరవై మందిచే చేయించారు నారాయణరావుగారు. చివరివరకూ ముందు వెనకగా ప్రయాణం సాగించింది సీతారామయ్యగారు, శార్వరి మాత్రమే నని దిడుగు నారాయ రావుగారు సర్టిఫికెట్ యిచ్చారు. ఆరోజు సాయంత్రం ఎం.ఎన్.గారి జీవితచరిత్ర ఆవిష్కరణ జరిగింది. పూజ్యులు వేటూరి చంద్రశేఖర శాస్త్రిగారు, దిడుగు నారాయణరావుగారు, నేను ప్రసంగించాం. అలా వారం రోజుల వ్యవధిలో మూడు యోగకేంద్రాలు దర్శించి మూడుచోట్ల యోగసమావేశాలలో ప్రార్థనలలో పాల్గొనడం మరుపురాని అనుభవం. మరువలేని అనుభూతి. అప్పుడే నా 'జీవనయోగం' తొలిమలుపు తిరిగింది. 'నా యోగజీవనం' ఆనందనందనమైంది. చిత్రంగా ఒకదాని వెంట ఒకటిగా సంఘటనలు చోటు చేసుకున్నాయి. అదీ మాస్టర్‌గారి సంకల్పమేకాక మరొకటి కాదు. ఒకాయన ప్రేయర్‌కు వచ్చారు. వారు విజయవాడ సత్యనారాయణపురంలో ఉంటారు. సీతారామయ్య గారింట ప్రార్థనల్లో నన్ను చూశారుట. ఆ రోజు నా ఉపన్యాసం విన్నారుట. హైద్రాబాదులో వారి అమ్మాయిగారింటికి వచ్చి మా ఇంటికి ప్రేయర్‌కు వచ్చారు.

"మాస్టర్ గారి ఫోటో పక్కన మదర్ ఫోటో కూడా వుంచండి, మంచిది" అని సలహా యిచ్చారు.

ఇన్నాళ్లుగా యోగం చేస్తున్నా నాకు ఆ ఆలోచనే క లగలేదు. మా గురువుగారి దగ్గర మదర్ ఫోటో ఉండేది కాదు.

"అవును, అమ్మగారి ఫోటో కూడా కావాలి" అని నా శ్రీమతి సమర్థించింది.

"మాస్టరుగారి యోగానికి మీడియమ్స్ అందరూ ఒక ఎత్తు. మదర్ ఒక్కరూ ఒక ఎత్తు. అసలు మాస్టరుగారికి ఎం.టి.ఎ. నుండి సందేశాలు మదర్ ద్వారానే అందేవి. మదర్ ఒక్కరే ట్రాన్స్ మీడియం. మిగిలిన వారు ఉత్త మీడియములు. అమ్మగారు ట్రాన్స్‌లోకి వెళ్లి యోగరహస్యాలు చెప్పేవారు. చాలా కోర్సులు డిక్టేట్ చేసింది మదర్‌గారే" అని చెప్పారు సత్యనారాయణగారు. వారు విజయవాడ వెళ్లిన తర్వాత మదర్ ఫోటో పంపారు. మదర్‌ఫోటో నా చేతికి వచ్చి మాస్టర్‌గారి ఫోటో పక్కన మదర్ ఫోటో పెట్టి ప్రార్థన చేయడం ప్రారంభించడమే మా ఇల్లు ఒక యోగాలయంగా మారడానికి నాంది.

ఆ వెంటనే సీతారామయ్యగారు హైద్రాబాద్ రావడం, వారి కుమారుని ఇంట కొన్నిరోజులు ఉండటం జరిగింది. అప్పుడే దాసుగారు హైద్రాబాద్ వచ్చారు. దాసుగారి అన్నగారు మైనంపాటి అప్పారావుగారి పిల్లలు చిక్కడపల్లిలో వున్నారు. అశోక్‌నగర్‌లోనూ

ఎవరో బంధువులు ఉన్నారు. అశోక్‌నగర్‌లో ప్రార్థనలు ఏర్పాటు చేశారు దాసుగారు. నేను, డి.ఎస్.రావు గారు వెళ్లాం. మూడు నాలుగురోజులు ఏవో కోర్సులు చేయించారు. అవేమిటో నాకు తెలియదు. సాధనలో పాల్గొనడం, అనుభూతి చెందడం వరకే నాకు తెలుసు. అవి ఏం కోర్సులు అని సీతారామయ్యగారిని నేను అడగలేదు.

సీతాఫల్‌మండిలో ఒకసారి డి.ఎస్.రావుగారు సమావేశం ఏర్పాటు చేశారు. తన ఇంటిలో యోగకేంద్రం నడపాలని రావుగారి కోరిక. అయిదారుగురిని చేర్చగలిగారు. కాని వారెవరూ యోగాన్ని తీవ్రంగా తీసుకోలేదు. ఏదో కాలక్షేపానికి, ఉబుసుపోక కబుర్లకీ వచ్చేవారు. ఒకరోజు సీతారామయ్యగారిని పిలిచి ప్రేయర్స్ చేయించారు. నేనూ వెళ్లాను. కోర్సులు చేయించారు. అదే ఆఖరు.

మొత్తంమీద సీతారామయ్యగారిరాక శ్రీ దిడుగు నారాయణరావు, మైనంపాటి మధుసూదనరావు రావడం, డి.ఎస్.రావు, నేను స్థానికంగా వుండడం, మన్నవ హనుమంతరావు, వేదాంతం లక్ష్మీనారాయణగారు ఇక్కడ వుండడం, పచ్చలతాడిపర్రు కరణం, పున్నయ్యగారి కూతురు, అల్లుడు, మాకు దగ్గరగా ఉండడం - వీరందరూ చిక్కడపల్లి, గాంధీనగర్‌లలో దగ్గర దగ్గరగా ఉండటంతో పదిమంది యోగసాధకులు కలుసుకునే అవకాశం కలిగింది. వీరంతా బాగా సీనియర్స్. అందరిలోకి జూనియర్‌ని నేను.

డి.ఎస్.రావుగారి ప్రోత్సాహంతో సీతారామయ్యగారు మా ఇంట్లో కొన్నిరోజుల పాటు ప్రేయర్స్ చేయించటానికి అంగీకరించారు. ఆదివారాలు తప్ప నాకు తీరిక వుండదు. రోజూ సెలవు పెట్టడానికి అనువైన ఉద్యోగం కాదు. పత్రికావ్యాసంగం. ప్రతి ఆదివారం మూడుగంటలకే సమావేశమయ్యేవాళ్లం. మా ఇంట్లో పాతికమందివరకు ప్రార్థన చేసుకునే వీలుంది. అలా కొన్ని వారాలలో సీతారామయ్యగారు చాలా కోర్సులు చేయించారు. వర్కింగ్‌బావుంది. యోగంలో ప్రేయర్స్ చేసినప్పుడు, చేయించినప్పుడు యోగక్రియను గమనిస్తారు. వర్కింగ్ బాగాలేకపోతే, కోర్సుచేయించి ప్రయోజనం ఉండదు. మా ఇంటకోర్సులు చేయించినపుడు మంచి వర్కింగ్ వచ్చిందట!

"శార్వరీ! మీ ఇంట్లో యోగా సెంటర్ నడుపు. వర్కింగ్ చాలా బావుంది" అన్నారు కవులూరి సీతారామయ్యగారు.

"నేనా? సెంటర్ నడపడమా! నావల్ల కాదు స్వామీ. నా కంత శక్తి లేదు" అన్నాను.

డి.ఎస్. రావుగారు కల్పించుకుని "సీతారామయ్య గారి మాట నీకు ఆశీస్సు. కాదనకు. పెద్దాయన చెప్పారంటే ఏదో ప్రయోజనం ఉండు ఉంటుంది. అది మాస్టర్ ఆజ్ఞగా పాటించు" అన్నారు.

నిమిషాలలో మాటల్లో యోగాసెంటర్ రూపుదిద్దుకుంది. డి.ఎస్.రావు నాకు తోడుగా వుండి నిర్వహించడానికి అంగీకరించారు. సీతారామయ్య గారు తన వద్ద వున్న కోర్సుల పుస్తకం నా చేతిలో పెట్టారు. "అన్నీ కాపీ చేసుకుని ఇవ్వు. ఇకపైన నువ్వు కోర్సులు చేయించాలి" అన్నారు. ప్రెస్ వుంది కనుక ఒక పత్రిక నడపమని సలహా ఇచ్చారు.

పది సంవత్సరాల క్రితమే మద్రాసు నుండి యోగాజర్నల్ ఇంగ్లీషులో నడిపాను. ముచ్చటగా మూడు సంచికలు వేయగలిగాను. ఆ చిన్న ప్రయత్నంలోనే చాలా నష్టపోయాను. తర్వాత యోగాజర్నల్ పి.ఎస్.ఆర్.శర్మగారు తన పేర రాయించుకుని తెచ్చుకున్నారు. డి.నారాయణరావుగారి సంపాదకత్వంలో తెలుగులో నడిపారు. మూడు నెలల కొక మారు పత్రిక ప్రచురించినా చాలునని అనుకున్నాం.

ప్రెస్ వున్నా పత్రిక నడపడానికి పెట్టుబడి కావాలి. పత్రికకు పెట్టుబడి పెట్టే శక్తి నాకు లేదు. యోగాసెంటర్ ప్రారంభించవచ్చు. ఒక చిన్నబోర్డు రాయించి పెడితేచాలు. తెలిసిన వారు వస్తుంటారు. ప్రస్తుతానికి ప్రతి ఆదివారం సామూహిక ప్రార్థనలు జరపాలని నిశ్చయించుకున్నాం. మా డి. ఎస్. రావుగారు అంటే డే అండ్ నైట్ రావుగారు. ఎవరినీ నిద్రపోనివ్వరు పని అయ్యేవరకు.

చి॥ వసంతకుమార్‌కు పత్రిక నడపాలనే కోరిక వుంది. చేతిలో ప్రెస్ వుందన్న ధీమా. ప్రెస్ ఉన్నంత మాత్రాన పత్రిక నడపలేం. డబ్బు ఒక్కటే చాలదు. యోగ విషయంగా వ్యాసాలు రాసే వారెంతమంది ఉన్నారు! ఆధ్యాత్మిక పత్రిక అమ్మకాలు జరగవు. ఉచితంగా యిచ్చినా చదవరు. కమర్షియల్‌గా నడపలేకపోతే కొంతకాలం వచ్చి ఆగిపోతుంది. వసంతకుమార్‌కు సైదోడు డి.ఎస్.రావు. ఆయనకు ఉత్సాహం నూరుశాతం కన్నా ఎక్కువే. కాని ఆచరణకు అనుభవం ఏది? మొత్తంమీద యోగదర్శని ప్రారంభించాం. అన్ని మార్గాల రచనలు ప్రచురించడం మంచిదే. సమదర్శిత్వం వుంటుంది. కాని ఏ ఒక్క శాఖకు పూర్తిన్యాయం చేయలేం. అయినా పత్రిక నడిపేది మన యోగం కోసం. ఇతరాలు వేసి ప్రయోజనం లేదు కనుక మాస్టర్‌యోగానికే పరిమితం చేయాలనుకున్నాం! ఏం రాయాలి? మాస్టర్‌యోగం గురించి తెలిసింది తక్కువ. ఉన్న పుస్తకాలు వేళ్లమీద లెక్కించవచ్చు. వాటిని అనువదించడం మహాకష్టం. తెలుగులో సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రాయాలి. పండితులకు పత్రిక అవసరంలేదు. మొత్తంమీద 1983 ఉగాదినాటికి యోగదర్శని అచ్చయింది. లోగడ మద్రాసులో నెలవంక, చిత్రప్రగతి పత్రికలు నడిపిన చిరు అనుభవం వసంత్‌ది. ఏజంట్లు అందరికి పత్రిక గురించి రాశాం. తల కొక పది, అయిదుకాపీలు చొప్పున పంపాం. కొండకు వెంట్రుకను కట్టి కొండను కదిలించాలని

ప్రయత్నం ఈ చిన్న పత్రిక. మహాపర్వతం లాంటి మాస్టర్‌యోగం కదులుతుందా! తెలియదు. సంకల్పం మంచిది. ఒక్క సంకల్ప బలంతో కొండను కదిలించగల యోగశక్తి, ధీశక్తి, ఆత్మబలం మాకు ఉన్నాయనిపించలేదు.

ఏజంట్లు కొంతమంది డబ్బు పంపారు. కొందరు స్వాహా చేశారు. అది చిన్న పత్రికల విషయంలో ఏజంట్ల ఉదారవైఖరి! పాఠకులలో స్పందన కనిపించింది. రెండు మూడు వేలు ఖర్చయ్యేది. పత్రిక వెల అయిదురూపాయలు. కొన్ని అమ్ముడు పోయినా మళ్లీ పత్రిక వేయవచ్చు. యోగదర్శిని చదివినవారు చాలా మంది ఉత్తరాలు రాశారు యోగంలో చేరతామని. వేయిమంది పాఠకులలో పాతిక, యాభైమందిలో స్పందన కలిగినా గొప్పవిషయమే. ఉబ్బితబ్బిబ్బులైనాం. మా డి.ఎన్.రావుగారైతే మహదానంద పడిపోయారు.

"ఏమైనా సరే. ఈ ఊపులో యోగాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలి" అని పట్టుబట్టారు. 1983 ఉగాది తర్వాత మేకాల్ అంటే మాస్టర్‌గారి కాలంలో మే సమావేశాలు అనేవారు - అంటే మాస్టరుగారు యోగం ప్రారంభించిన దినాలు- అప్పటికి యోగకేంద్రం ప్రారంభించాలన్న సంకల్పం కలిగింది. ఈ కేంద్రానికి డి.ఎన్.రావు, నేను, శ్రీమతి యామినీదేవి, వసంతకుమార్ సూత్రధారులం, నిర్వాహకులం ... ఫలితాలు మంచివైనా, చెడ్డవైనా అనుభవించడానికి మేము సిద్ధపడి ఉన్నాం. యోగా సెంటర్‌గా కాక యోగా స్కూలుగా నడపాలని డి.ఎన్.గారి ప్రతిపాదన. దిడ్డుగు నారాయణరావు, దాసుగారు, సీతారామయ్యగారు మాకు సలహాదారులు, ప్రోత్సాహకులు. వారికీ సంతోషంగా వుంది. మాస్టర్ ఎం.ఎన్.గారి నిర్యాణం తర్వాత అజ్ఞాతంగా ఉన్న యోగం వెలుగు చూడబోతున్నందుకు. ఆ మహత్కార్యం నిర్వహించే బాధ్యత వారు మా పైన పెట్టినా తలకెత్తుకున్న ధైర్యం మాది.

మోపు తలకెత్తినప్పుడు తేలిక అనే అనిపిస్తుంది. ఎత్తినవారు చేయి ఆసరా వదలగానే, నడకసాగిస్తాం. అప్పుడు మోపు బరువు పెరుగుతుంది. కాళ్లు తడబడతాయి. మోయలేక ఆయాసం వస్తుంది. మా పని అంతే అయింది. సరదాగా పత్రిక ప్రారంభించాం గానీ అటు ఆఫీసుపని చూసుకుంటూ ఈ పత్రికకు రచన సాగించడం శ్రమ అయింది. పైగా యోగంలో చేరతామని ఉత్తరాలు రాసేవారి సంఖ్య పెరుగుతోంది. మెంబర్‌షిప్ రుసుము మూడు నెలలకు 25రూపాయలుగా నిర్ణయించాం. ఈ బ్యాక్‌గ్రౌండ్ వర్కు అంతా డి.ఎన్. రావుగారిదే. పేరు మాది. నా అంతట నేను యోగం చేసుకోవచ్చు. కాని పదిమందికి తెలియాలి. మనం పొందిన ఆనందం ఇతరులు పొందగలగాలి. లేకపోతే

మన స్వామీజీలు ఇంత పబ్లిసిటీ కోరరు. మనంగా ఏమీ కొత్తది చెప్పలేకపోవచ్చు. కొన్ని మంచి విషయాలు ఆర్తులకు, కోరినవారికి తెలియచేయాలి.

'యోగా టీచ్' అన్న మాటకు రెండు అర్థాలు. 'టీచ్' అంటే పాఠం చెప్పడమేకాదు. తెలియచెప్పడం. యూనివర్సిటీలు రెగ్యులర్ కోర్సులతో పాటు కరస్పాండెన్సు కోర్సులు నడుపుతాయి. ఇక్కడ యోగాస్కూలులో రెగ్యులర్ ప్రేయర్స్ ఉండాలి. కరస్పాండెన్సు కోర్సువుండాలి. అది మా ప్రయత్నం. అది మంచిదో కాదో మాకు తెలియదు. మేం అలా చేయదలచుకున్నాం. మాస్టరుగారి అనుమతి ఆశీస్సులున్నాయా లేదా అంటే, సక్రమంగా నడిస్తే మాస్టర్‌గారి అనుమతి లభించినట్లు కాకుంటే మూసివేస్తాం. అంతేగదా! కొంతమంది పాతసాధకులు విమర్శించారు ... మాస్టరుగారి యోగం అజ్ఞాతంగా ఉండవలె, ఇలా పత్రికల ద్వారా, పుస్తకాల ద్వారా ప్రచారం చేస్తే పవిత్రత పోతుంది అని. పవిత్రత ఏమిటి? ప్రచారంతో పవిత్రత ఎలాపోతుంది? విమర్శించేవారు కాలు అడ్డం వేసే వారు పెరిగినకొద్దీ, మాలో పట్టుదల పెరిగింది. విశాఖపట్నం నుండి మాస్టర్ ఇ.కె. గారి 'నావాణి' పత్రిక వస్తోంది. దానినిండా జ్యోతిషం, హోమియోపతి, పురాణకథలు, హరికథలు వుంటాయి. మాస్టర్‌గారి ఫోటో వేస్తారు తప్ప, మాస్టర్‌గారియోగం గురించి అతి తక్కువ రాస్తారు. ఆపత్రికపై లేని విమర్శ మా పత్రికపైన ఎందుకు రావాలి. అందరి అభిప్రాయాలు ఖన్నిస్తూ పోతే ఎవరూ ముందుకు పోలేరు. ముందుకుపోయేవాడిని వెనక్కులాగేవారే ఎక్కువ. ధైర్యసాహసాలున్నవానికి పిరికిమందు పోసేవారే ఎక్కువ.

'మాస్టర్‌యోగదర్శని' పుస్తకాన్ని పునర్ముద్రించాము. 'యోగాశ్రమలేఖలు' అనే మరొక పుస్తకం ప్రచురించాం. ఈ రెండు పుస్తకాలు, యోగదర్శని త్రైమాసిక పత్రిక, మాస్టర్ యోగాస్కూలు అండదండలు. 1983 మే29న హైదరాబాదులో మా యోగాస్కూలు మొదటి సమావేశం నిర్వహించింది. ఒక వేగుచుక్క దర్శనమిచ్చింది. ప్రక్కన నా 'సావిత్రి' రచన కొనసాగుతోంది. అప్పటికి మహోదయం, అన్వేషణ, స్పందన - మొదటి మూడు భాగాలు వెలువడ్డాయి. మిగిలిన భాగాల రచన సాగుతోంది. అరవిందయోగి పూర్ణయోగానికి మాస్టర్ సి.వి.వి. గారి సత్యయోగానికి మధ్య ఒక వారధి ఏర్పడింది. ఏ పేరున పిలిచినా, ఏ పేరు పెట్టినా ఆత్మయోగం ఒక్కటే ...

అది చైతన్యధార!
అది జీవనాడి!
అది ప్రాణప్రదాత!

మాస్టర్ యోగాశ్రమం

పరిచయం

మాస్టర్ సి.వి.వి.గారి మహత్తర యోగం 90 సంవత్సరాల క్రితమే ఆంధ్రదేశానికి పరిచయమైంది. ఇప్పుడు కొత్తగా పరిచయం చేయనవసరం లేదు. అయితే మాస్టరుగారి యోగం విస్తృతంగా ప్రచారం కాకపోవడానికి, ప్రాచుర్యం పొందక పోవడానికి గల కారణాలను పరిశీలించాలి. మొదటి కారణం మాస్టరుగారు తమ యోగానికి ఎవరి ప్రచారం అవసరం లేదన్నారు. సమయం వచ్చినప్పుడు యోగప్రచారం దానంతట అదే జరుగుతుందని అన్నారు.

మాస్టరుగారు స్వయంగా తమ యోగసిద్ధాంతంపైన పుస్తకాలు రాయలేదు. యోగసాధన చేయించడమే ప్రధానాశయంగా భావించారు. వారు ఎక్కడా యోగోపన్యాసాలు యివ్వలేదు. ఇది నూతన యోగమని, మిగిలిన యోగపద్ధతులకు, దీనికి పోలికలు లేవని, పొత్తు కలవదని ఖండితంగా చెప్పారు. దాంతో సనాతనులు, సాంప్రదాయకులు దీని దగ్గరకు రాలేదు. ఈ యోగంలో ప్రార్థనలు, కోర్సులు అన్నీ ఇంగ్లీషులో ఉన్నందున ఇంగ్లీషు బాగా చదువుకున్నవారే యోగంలో చేరగలిగారు. మంత్రాలు సంస్కృతంలోనే ఉండాలనుకునేవారు దూరమైనారు. ఆచారాలు, సంప్రదాయాలు, పూజలు, మంత్రాలు, దేవాలయ దర్శనాలు, మొక్కుబడులు, హారతులు, నైవేద్యాలు, ఉపవాసాలు బొత్తిగా అవసరం లేదనడం వల్ల చాలామంది ఇదేమి యోగం అనుకున్నారు.

యోగానికి ఆసనాలు, ప్రాణాయామం అవసరమని నమ్మేవారు ఇందులో వాటి అవసరం లేదనడం వల్ల మనస్సు నొచ్చుకున్నారు. ఇందులో మడి, దడి, ఆచారాలు, లేకపోవడం వల్ల మరికొందరికి నచ్చలేదు. అన్ని కులాలవారికి, మతాలవారికి ప్రవేశం కల్పించడం వల్ల, స్త్రీలను సైతం యోగంలో చేర్చుకోవడం వల్ల కొందరు బాధ పడ్డారు. తమకు ఆధిక్యత లేని కారణంగా మరి కొందరు జారుకున్నారు.

యోగం చేసేవారు ఉపవాసాలుండకూడదని, ఉపాహారం, కాఫీల వంటివి సేవించిన తర్వాతనే యోగసాధన చేయాలన్న నియమం చాలా మంది ఆచారవంతులకు నచ్చలేదు. యోగానికి బ్రహ్మచర్యం, సన్యాసం, వైరాగ్యం అవసరం లేదని, గృహస్తులుగా ఉన్నవారే ఎక్కువ యోగ్యులని అనడం మరి కొందరిని దూరం చేసింది. యోగం వల్ల మోక్షం, స్వర్గం లాంటివి కోరరాదని, ఈ జన్మలోనే ముక్తి లభిస్తుందని, కొత్త లక్ష్యాలు గుర్తించడం వల్ల స్వర్గాల కోసం, స్వర్గ సుఖాల కోసం తపస్సు చేసే సంప్రదాయం కలవారికి ఇది మింగుడు పడలేదు. యోగం చేసేవారు దైవ పూజలు, కైంకర్యాలు, అర్చనలు, అర్పణలు చేయరాదని గట్టి షరతు విధించడం వల్ల, కుల, మతాచారాలలో కూరుకుపోయిన వారు వాటిని వదులుకోలేక పోయారు. 'మాస్టరుగారిది మా కులమే కనుక మేమే యోగార్హులం' అని సొంత పీఠాలెక్కిన వారి వల్ల యోగం వైపు చాలామంది ఆకర్షితులుకాలేదు.

ఇన్ని కారణాల వల్ల మాస్టరుగారి యోగానికి ఆదరణ కరువైంది. సర్దుకుపోవడం, రాయితీలు ఈ యోగంలో లేవు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. రకరకాల యోగాలు వెలుగులోకి వచ్చాయి. కులాధిక్యత, మతాధిక్యత పోయింది. కొత్తను ఆహ్వానించడం, అభిమానించడం విద్యావంతులు నేర్చుకున్నారు. హేతువాద దృక్పథం అలవడింది.

మాస్టర్‌గారి యోగం ఒక్కటే మహోన్నతమైనదని, అన్నింటికంటే గొప్పదని మేం అనడం లేదు. మీరే ఆ మాట అంటారు. మిగిలిన వాటితో దీనిని పోల్చకూడదు. ఇక్కడ యోగా వర్కింగ్ అనూహ్యంగా, అపూర్వంగా ఉంటుంది. అన్ని యోగ ఫలితాలు సత్వరం సాధకునికి ఉపకరిస్తుంటాయి. ఫలితాలు కళ్లముందు కనిపిస్తాయి. చచ్చిపోయిన తర్వాత వచ్చే మోక్షం ఈ యోగానికి లక్ష్యం కాదు. ఈ జీవితంలోనే సుఖాలు, ఆనందాలు అనుభవిస్తూ జీవన్ముక్తి సాధించాలి.

గత 30 సంవత్సరాలుగా మాస్టర్ యోగ విస్తరణ బహుముఖీనంగా సాగుతోంది. కారణం మాస్టర్‌గారు నిర్ణయించిన 60 ఏండ్ల గడువుతో యోగం పరిపూర్ణం అయింది. ఇప్పుడు మాస్టర్‌గారి సత్యయోగం వేగంగా విస్తరించడమే కాక, మాస్టర్ నామ స్మరణ మాత్రంచే అద్భుత ఫలితాలు కలుగుతున్నాయి.

'ప్రణుత నిజ జవాన్ స్వాత్మతుల్యాన్ కరోతి' అన్నది ఋషి వాక్యం. యోగ హృదయంతో తనకు నమస్కరించిన వారిని తనంతటి వారుగా తీర్చిదిద్దుతారని మాస్టర్ పరంగా చెబుతారు. ఇలాంటి హామీ పూర్వ కాలం నుండి నేటి వరకు ఎవరూ ఇవ్వలేదు. ఒక్క పరబ్రహ్మకే ఇది సాధ్యం. సంపూర్ణ సమర్పణతో, అంకిత భావంతో యోగం చేసిన ప్రతివ్యక్తి పూర్ణంగా యోగ ఫలితాలు పొందగలుగుతున్నాడు.

యోగసాధకులకు మాస్టరుగారిచ్చిన హామీలు :

1. సర్వ సమర్పణ చేసుకుని ఉభయ సంధ్యలలో యోగం చేసేవారికి ఈతిబాధలుండవు. దారిద్ర్యం ఉండదు. అనవరత ప్రాణశక్తి పుష్కలంగా సరఫరా చేయబడుతుంది.

2. రోగబాధలు, వృద్ధ్యాప్యపు బాధలు ఉండవు. యోగక్రియ ఒకేసారి స్థూల, సూక్ష్మ, ప్రాణ శరీరాలలో జరుగుతుంది. కనుక శరీరం శుష్కించదు, క్షీణించదు. రోగాలను తనలో ప్రవేశించనీయదు. మృత్యుభయం ఉండదు. అమృతసిద్ధికి ఇది సూటిమార్గం.

3. జాగ్రత్ స్వప్న సుషుప్తులలో ఎలాంటి మాంద్యం, నైరాశ్యం ఉండవు. అనునిత్యం అనవరతం, ఉత్సాహం ఉరకలు వేస్తుంది. చైతన్యం పొంగులు వారుతుంది.

4. యోగశక్తితో మహాప్రాణధారను అందుకుంటూ ఎలాంటి జబ్బులనైనా నయం చేయవచ్చు. అపమృత్యువాత పడిన వారికి సైతం ప్రాణదానం చేయవచ్చు.

5. మనిషిని ఆవరించిన మాయపొరలు, భ్రమలు వదలి పోతాయి. అనుక్షణం 'సత్యం' అనుభూతమవుతుంది. అవసరమైన శక్తులు, సిద్ధులు లభిస్తాయి.

6. పీస్, ప్లెంటి, పర్ఫెక్షన్, పర్మనెన్సీ సూత్రం అమలు జరిగి సర్వత్రా స్వతంత్ర అవగాహన ఏర్పడుతుంది.

సాధన నియమాలు

1. తొలినాళ్లలో 21-55 సంవత్సరాల మధ్య వయస్సు వారిని అనుమతించేవారు. అప్పుడు యోగం ప్రయోగదశలో ఉండేది. ఇప్పుడు యోగం పర్ఫెక్షన్ పొందిన కారణంగా అన్ని వయస్సుల వారిని సాధనకు అనుమతించడం జరుగుతున్నది.

2. కుల, మతాల పట్టింపులు యోగంలో అసలు లేవు. సాధకులు ఎవరూ 'కుల' ప్రస్తావన చేయకూడదు. అందరూ ఒక కుటుంబంలోని వారి వలె మసలు కోవాలి.

3. విధిగా శాఖాహార నియమం పాటించాలి. మత్తు పానీయాలు పూర్తిగా నిషిద్ధం.

4. బ్రహ్మచారులు, సన్యాసులు యోగానికి అర్హులు కారన్న నియమం ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు ఆ నియమం లేదు. అవివాహితులైనా సంసారం పట్ల ద్వేషం, విముఖత్వం లేనివారు చక్కగా యోగం చేసుకోవచ్చు.

5. సంప్రదాయబద్ధంగా ఉపనయనం చేసుకునేవారు చేసుకోవచ్చు. జంధ్యాలు తీసివేయనవసరం లేదు. కొత్తగా వేసుకోనవసరం లేదు. యధావిధిగా క్రతువులు, కర్మకాండలు జరుపుకోవచ్చు. వాటిపైన ఆంక్షలు లేవు.

6. ఇతరత్రా పూజలు, వ్రతాలు, విగ్రహారాధనలు, పుణ్యక్షేత్ర దర్శనాలు పనికి రావు. సాధకులకు వాటి అవసరం లేదు. కనుక క్రమంగా వాటికి దూరం కావడం మంచిది. అలా పూర్తిగా దూరమైనప్పుడే యోగంలో అభివృద్ధి కనిపిస్తుంది.

7. కోర్టు వ్యవహారాలు, రాజకీయాలు పనికి రావు. సత్యసంధత అవసరం. పవిత్ర జీవనం ముఖ్యం.

8. వీలైనంత వరకు ప్రశాంతంగా జీవించడం అలవాటు చేసుకోవాలి. అనవసర విషయాలలో ఆసక్తి పనికి రాదు.

9. ఆడ, మగ సాధకులందరూ సోదరభావంతో మెలగాలి. యోగమిత్రుల వలె స్వచ్ఛంగా జీవించాలి.

సాధన

1. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 6 గంటలకు ఖచ్చితంగా యోగం ప్రారంభించి, అరగంట నుండి ఒక గంట వరకు సాధన కొనసాగించాలి.

2. నిరాహారంగా, ఖాళీ కడుపుతో యోగం చేయకూడదు. ఉపాహారం, కాఫీ, పాలు ఏమైనా తప్పక తీసుకోవాలి. స్నానం చేసి, మంచి బట్టలు వేసుకుని యోగం ప్రారంభించాలి.

3. మాస్టరుగారి ఫోటో ముందు పద్మాసనంలోగానీ, సుఖాసనంలోగాని కూర్చుని కళ్లు మూసుకుని ముమ్మారు 'నిర్దిష్ట' ఉపదేశం స్మరించిన తర్వాత, లోచూపుతో శరీరంలో ఏం జరుగుతున్నది గమనిస్తూ ఉండాలి. తన శరీరాన్ని, పరిసరాలను మరచి తానొక 'రుషి' నన్న భావనతో శూన్యంలో చొరబడాలి. ఇతర ఆలోచనలు లోపలకు ప్రవేశించకుండా జాగ్రత్త పడాలి.

4. శరీరంలో ఎలాంటి స్పందనలు, ప్రకంపనలు కలిగినా భయపడి, సాధన ఆపకూడదు. ఆ స్పందనలు యోగ క్రియలని గుర్తించాలి.

5. సాధన పూర్తి కావడం అంటే యోగక్రియ ఆగే వరకు ప్రయత్నించినా కళ్లు తెరవడం జరగదు. సాధన పూర్తయే సమయానికి రెండు చేతులు అప్రయత్నంగా పైకి లేచి నమస్కార ముద్ర వస్తుంది. అది ఆ పూటకు యోగక్రియ పూర్తి అయినట్లు గుర్తు.

మాస్టర్ యోగాశ్రమంలో రోజూ సాయంత్రం ఆరు గంటలకు సాధన జరుగుతుంది. ఆసక్తి కలవారు ఎవరైనా రావచ్చు. ఉపదేశం తీసుకుని సభ్యులైన వారు మాత్రమే కోర్సులు చేయడానికి అర్హులు. ఇక్కడ అన్ని రకాల జబ్బులకు యోగం ద్వారా చికిత్స జరుగుతుంది. కనీసం పది సంవత్సరాలు యోగసాధన చేస్తామని హామీ ఇచ్చిన వారికి మాత్రమే ఉపదేశం ఇవ్వబడుతుంది. అన్ని కోర్సులు నియమంగా పూర్తి చేసి, 35 సంవత్సరాలు యోగసాధన చేసిన వారు జీవన్ముక్తులవుతారు.



మా ప్రచురణలు

శ్రీ శార్వరి రచనలు

Masters and the Art of Meditation

A unique work on Yoga and Meditation. An indepth study of yoga right from its inception development through the centuries, upto date. Various schools, methods and technics are discussed. A wide appreciation of 20th century Yogis like, Master C.V.V., Madam Blavatsky, Sri Aurobindo, Ramana Maharshi, Rama Krishna Paramahansa, Shirdi Sai, Yogananda, Rama chandraji, J. Krishna Murthy and Rajneesh 'OSHO'

Price Rs. 100/-

మాస్టర్స్ యోగదర్శిని

1975లో తొలిసారి ప్రచురించబడి ఇంగ్లీషులో, తెలుగులో అనేక పునర్ముద్రణలు పొంది అనేక వేల మందికి యోగస్ఫూర్తి కలిగించిన రచన. అన్ని ప్రాచీన, అధునాతన యోగాలకు దర్పణం. పరిష్కరించబడిన ఈ పుస్తకంలో 20వ శతాబ్దంలో లబ్ధ ప్రతిష్టులైన మహర్షులు, మహాయోగులు, మాస్టర్ సి.వి.వి., బ్లవట్స్కీ, శ్రీఅరవిందులు, రమణ మహర్షి, రామకృష్ణ పరమహంస, షిరిడీ సాయి, పరమహంస యోగానంద, రామచంద్రజీ, జిడ్డు కృష్ణమూర్తి, రజనీష్‌ల ఫోటోలు, వారి యోగ సమీక్షలు అదనంగా చేర్చబడ్డాయి

(వెల : 100/-)

యోగాశ్రమలేఖలు

లేఖా సాహిత్యంలో సరికొత్త ప్రయోగం. యోగం, తత్వం, ఆత్మ, తపస్సు, పరమాత్మ లాంటి విషయాలు, జిజ్ఞాస కలవారికి సులభంగా అర్థమయ్యేరీతిలో, సుభగ సుందరంగా రచించిన మహా రచన. ఎన్ని సార్లు చదివినా మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే మిస్టిక్ రచన. చదివిన ప్రతిసారి, కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. జ్ఞాన మందిరానికి కొత్త వాకిళ్లు తెరుచుకుంటాయి. కొత్త వెలుగు కిరణాలు ప్రసరిస్తాయి.

(వెల : 60/-)

గీతాపరమార్థం

పవిత్ర గ్రంథంగా న్యాయస్థానాలలో ప్రమాణాలకు ఉపయోగించే భగవద్గీత ప్రామాణికత ఎంత? అది అనేక లోపాల పుట్ట. అసలు వ్యాస మహర్షి రాసినవి 84శ్లోకాలు. మిగిలినవన్నీ ఎవరో స్వార్థపరులు రాసి, అందులో చొప్పించారు. అసలు అర్జునుడు అడిగిన ప్రశ్నలకు కృష్ణుడు యిచ్చిన సమాధానాలకు పొంతన లేదు. అంతా పేలవమైన చర్చ. గీతలోని లొసుగులు ఎత్తి చూపే పరిశోధన.

(వెల : 60/-)

మాస్టర్ సి.వి.వి. జీవితకథ

భృక్త రహిత తారక రాజయోగ ప్రవక్త, పరబ్రహ్మాంశ సంభవులు మాస్టర్ సి.వి.వి. గారి జీవితకథ. పాతిక సంవత్సరాల పరిశోధన. చరిత్రలోకి చొచ్చుకుపోయిన అన్వేషణ. అధునాతన నవలా శిల్పం. మాస్టర్ సి.వి.వి. గారి గురించి గుప్తంగా వున్న అనేక జీవిత రహస్యాలను భృక్త రహితం చేసిన గొప్ప పుస్తకం. ఈ పుస్తకం చదువుతుంటే, పాఠకుని ఆత్మ పరమాత్మతో పయనిస్తున్న అనుభూతి, ఆనందం కలుగుతుంది. ఎలాంటి యోగ జిజ్ఞాసులైనా మరొక మెట్టు పైకి పోవడం జరుగుతుంది. మూడు సంవత్సరాలలో నాలుగుసార్లు పునర్ముద్రణ జరిగింది.

(వెల : 60/-)

మహాచైతన్యం

ప్రార్థన, ధ్యానం, తపస్సు, యోగం అనే మాటల అర్థం ఏమిటి! వాటి నిర్వచనం ఏది? అవి సాధకుని భిన్న దశలు, భిన్న ఆవరణలు. సాధకుడు శూన్యంలో చొరబడినపుడు ఆయా మార్గాలు ఏకం అయి, మహాచైతన్యం అనుభూతికి వస్తుంది. మహాచైతన్యం యోగ పరమావధి. అది విస్ఫోటన క్రియ. ప్రతివ్యక్తి ధ్యానంతో, యోగంతో చైతన్యం పొందవచ్చు. మహాచైతన్యం పైనుండి సంతత ధారగా సాధకునిలోకి ఉరకలెత్తి రావాలి. ఎలా? శ్రీ శార్వరి యోగసాధనలో మైలురాళ్లు, మహాచైతన్యం, కుండలిని, శక్తిపాతం, సమాధి.

(వెల : 60/-)

మృత్యువు తర్వాతి జీవితం

పుస్తకం చిన్నది, విషయం పెద్దది. మృత్యువంటే మరణం కాదు. అమరత్వానికి సింహద్వారం. మరొక గొప్ప, సుందర, సురుచిర, ఆనందమయ లోకంలోకి ఆహ్వానం. మృత్యువు తర్వాత మరో గొప్ప జీవితం అనుభవించపోతున్నాం అని తెలుసుకోవడమే మృత్యుంజయత్వం. అలాంటి మృత్యుంజయ తత్వానికి అద్దం పట్టి, మనిషికి మృత్యుభయాన్ని వదిలించే పుస్తకం. పదిసార్లు చదివిన వారున్నారు. పదిమార్లు కొత్త అనుభవాలు పొందగలుగుతారు.

(వెల : 30/-)

కుండలిని

యోగసాధనకు అధారం మూలాధారం. అనుభూతికి తొలిమెట్టు కుండలిని చైతన్యం. కుండలినికి స్పందన కలగగానే అనుభవాలు ఆరంభమవుతాయి. శరీరం దివ్యత్వంతో నిండిపోతుంది. పూర్వం ఋషులు ఈ కుండలినీ అనుభవంకోసం కనీసం 12 సంవత్సరాలు ఘోర తపస్సు చేసేవారు. వందల, వేల సంవత్సరాలు తపస్సు చేసినట్లు చెప్పే కథలు ఉన్నాయి. ఈ పుస్తకం చదువుతుండగానే ఎవరికైనా కుండలినీ చైతన్య స్పందన అనుభవంలోకి వస్తుంది. సచ్చిదానందానుభూతిని చవి చూడవచ్చు. ఎవరైనా స్వయంగా యోగసాధనకు ఉపక్రమించవచ్చు. ప్రతిఏటా పునర్ముద్రణ జరుపుకుంటున్న పుస్తకం.

(వెల : 60/-)

శక్తిపాతం

యోగానికి, తపస్సుకు ప్రధానగమ్యం శక్తిపాతం. అది దైవిక శక్తి కావచ్చు, ఆత్మశక్తి కావచ్చు. నేడు యోగసాధన వల్ల ప్రతివ్యక్తికి ఆత్మ జాగృతమై, చైతన్యవంతమై, కుండలినీ స్పర్శతో 'శక్తి'ని అందుకోవడం సు..ాధ్యమవుతున్నది. సాధకుడు నిర్భయంగా, రవంత సాధనతో మహాశక్తుల్ని అందుకోగలుగుతున్నాడు. ప్రతివ్యక్తి ఎలా శక్తిపాతాన్ని అనుభవించవచ్చునో తెలిపే అపూర్వగ్రంథం.

(వెల : 60/-)

సమాధి

యోగాశ్రమలేఖలు, మహాచైతన్యం, కుండలిని, శక్తిపాతం వరుసలో తర్వాత చదవ వలసిన పుస్తకం 'సమాధి'. ఈ అయిదు పుస్తకాలు 'యోగపంచకం'. ఎంత కొత్త సాధకులైనాఒక్కొక్కమెట్టు పైకి చేరుతూ, కొత్త అనుభవాలు, క్రొంగొత్త అనుభూతులు పొందగలుగుతారు. సమాధిలోకి వెళ్లి భంగపడిన వారు, 'సమాధి' అంటే భయపడేవారు, ఈ పుస్తకం చదివి, భయాలు వదలి సచ్చిదానందం అనుభవిస్తారు. చైతన్య సమాధిలో పూర్ణ యోగఫలాలను పొందగలుగుతారు.

(వెల : 60/-)

ఆంధ్ర మహాసావిత్రి

శ్రీఅరవింద యోగి 45 సంవత్సరాల తపస్సుతో రంగరించి రచించిన అమరకృతి 'సావిత్రికి శార్వరిగారి సరళ వచన రచన. అతిక్లిష్టమైన యోగ, తత్వ విషయాలు సావిత్రి ద్వారాశ్రీఅరవిందులు వినిపించగా, 30 సంవత్సరాల యోగసాధనానుభవంతో శార్వరి 'ఆంధ్రమహాసావిత్రి'ని సంపూర్ణ యోగానుభూతితో, మరొక అమృత కావ్యం చేశారు.

(మూడు భాగాలు : సెట్టు రూ. 300/-)

సత్యసంహిత

కాలం మనకు తెలియకుండా అనేక విషయాలను తన కడుపులో దాచుకుంది. చరిత్ర సైతం ఆ రహస్యాలను బయట పెట్టలేకపోయింది. రాజులు పరరాజులపై దండెత్తి యుద్ధాలు చేసినట్లే, మతాలు ఇతర మతాలపై దండెత్తి సర్వనాశనం చేశాయి. ఇది చరిత్ర దాచిన సత్యం. మనదేశంలో ఎన్నో మతాలు పుట్టుకొచ్చాయి. ఎన్నో నశించి, నామరూపాలు లేకుండా పోయాయి. ఈనాడు మనం అనుభవిస్తున్నది సంకరం. అనేక మతాల, తత్వాల అవశేషం. ఇది వేదసాహితి, ఉపనిషత్సాహితి, దర్శన సాహితి, చార్వాకం, బౌద్ధం, జైనం, తర్వాత బాదరాయనుడు, శంకరుడు, రామానుజుడు, మధ్వాచార్య, వల్లభాచార్య. వారి సిద్ధాంతాల, రాద్ధాంతాల సమీక్షణం.

(వెల : 60/-)

హస్త సాముద్రిక సర్వస్వం

మనిషి తన అదృష్టాన్ని జాతక చక్రాలలో వెతుక్కున్నట్లే అరచేతి రేఖల్లో వెతకవచ్చు. చేతిలోనూ నవగ్రహాల బలాబలాలున్నాయి. మంచి, చెడులున్నాయి. ప్రపంచంలో అగ్రశ్రేణి సాముద్రిక గ్రంథాలలో ఒకటిగా పరిగణించబడిన పుస్తకం. అమెరికాలో ఆస్ట్రో అసోసియేషన్ ప్రామాణిక సాముద్రిక గ్రంథంగా గుర్తించిన ఏకైక భారతీయ సాముద్రిక గ్రంథం. నేటి కాలానికి సరిపోయేట్లు టి.వి., ఎలెక్ట్రానిక్, కంప్యూటర్, విజ్ఞానం సైతం జతచేయబడ్డది. 200 పైగా లేఖా చిత్రాలున్నాయి. ఇది చదివిన ప్రతి ఒక్కరూ సాముద్రికవేత్త కావచ్చు. దైవజ్ఞ రత్నాలుగా రాణించవచ్చు.

(వెల : 100/-)

ఆత్మయోగి సత్యకథ

ఇది శ్రీశార్వరి జీవితకథలో మొదటి భాగం. ఎవరైనా స్వంత కథలు రాసుకోవచ్చు. కొందరే ఆత్మకథలు రాసుకోగలరు. ఆత్మకథలు సాధారణంగా స్వీయగాధలవుతాయి. ఆత్మ సంస్కారంతో యోగసాధనతో ఆత్మ దర్శనం పొందినవారు ఇతరుల ఆత్మల్ని ప్రబుద్ధం చేయగలరు. అలాంటి వారి స్వీయ 'ఆత్మానుభవాల' కథనం 'ఆత్మ' కథ అవుతుంది. ఒకచిన్న పల్లెలో నిరుపేద కుటుంబంలో జన్మించి కాలానికి ఎదురీది, ఆటుపోట్లకు తలవంచి, రచయితగా, కవిగా, పత్రికా సంపాదకునిగా, సినిమా రచయితగా జీవితంలో ఎన్నో మలుపులు తిరిగి, కడకు మాస్టర్ సి.వి.వి. యోగమార్గంలో స్థిరపడి, వేలమంది జిజ్ఞాసులకు, సాధకులకు మార్గదర్శిగా ఉంటున్న 'శార్వరి' జీవితంలోని తొలిభాగం 'ఆత్మయోగి సత్యకథ'. ఇది మహాయాత్రలో తొలి ప్రస్థానం. రెండవ ముద్రణ.

(వెల : 100/-)

మాస్టర్ యోగాశ్రమం, ప్లాట్ నెం. 90, 'యోగాలయ', ఇందిరానగర్,
తిరుమలగిరి, సికింద్రాబాదు-500 015, ఫోన్ నెం. 7790094.



అరవై వసంతాల శ్రీ శార్వరి, శ్రీమతి యామినీదేవి.

